


శ్రీ

# అక్షరార్చన

తల్లీ! నిన్ను దలంచి పుస్తకము చేతంబూనితిన్ నీవునా
యుల్లంబందున నిల్చి జృంభణముగా నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదు వాక్కునన్ సంప్రీతిన్ జగన్మోహినీ
పుల్లాబ్జాక్షి! సరస్వతీ! భగవతీ! పూర్ణేందు బింబాననా!



డాక్టర్ లంకా శివరామప్రసాద్

# అక్షరార్చన

(ఆంధ్రజ్యోతి దినపత్రిక శుక్రవారం 'నివేదన'లో
ధారావాహికంగా ప్రచురింపబడిన వ్యాసమంజరి)

"అక్షరంబు వలయు కుక్షిజీవనులకు
అక్షరంబు జిహ్వ కిక్షురసము
అక్షరంబు తన్ను రక్షించు గావున
అక్షరంబు లోక రక్షితంబు"

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# Akshararchana

by

**Dr. Lanka Siva Rama Prasad**

June 2013

All rights reserved

Copyright @ 2013

by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar (Dist.) A.P.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL
Andhra Pradesh - 506 002, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Copies available at :

**All the branches of Vishalandhra**

Price : ₹ **250** **$ 5**

Cover Design & Post Script

**Sanat Ghosh & Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal.
Ph : 0870-2426364

***This book is presented to...***



అమ్మల గన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ చాల బె
ద్దమ్మ సురారులమ్మ కడుపారడి బుచ్చిన యమ్మ దన్నులో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గమా
యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వ కవిత్వపటు సంపదల్

# ప్రస్తావన

శుక్రవారం 1, అక్టోబరు 2004 నాడు ఆంధ్రజ్యోతి 'నివేదన'లో సృష్టిక్రమం–మహాద్భుతం అన్న శీర్షికతో ప్రారంభమైన వ్యాసరచన అందరి మన్ననలతో దాదాపు రెండేళ్లపాటు వేదవేదాంగాలను, ప్రాక్పశ్చిమ తత్త్వ దృక్పథాలను విశ్లేషిస్తూ, ఆధునిక శాస్త్రజ్ఞానంతో అనుసంధానిస్తూ, వంద వ్యాసాలకు పైగా కొనసాగింది. ఆ వ్యాస పరంపరలోని ప్రముఖ వ్యాసాలు ఈ పుస్తకంలో అక్షరార్చన–1గా వెలువడ్తున్నాయి.

అంపశయ్య నవీన్, కోవెల సుప్రసన్నాచార్య, పొట్టపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, వి.ఆర్. విద్యార్థి, జితేందర్‌రావు, నెల్లుట్ల రమాదేవి తదితర కవిమిత్రులతో కలిసి డాక్టర్ లంకా శివరామప్రసాద్ – సృజనలోకం – Writer's Corner ను 2004లో స్థాపించగా, రామా చంద్రమౌళి ముఖ్య సంపాదకుడిగా 'కవితా వార్షిక' 2004 నుంచి 2009 వరకు వెలువడింది. ఆ కవితా వార్షికలలోని కవిత్వ నేపథ్యం, అదనంగా మరో రెండు వ్యాసాలు, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన మరో రెండు వ్యాసాలతో కలిపి పది వ్యాసాలుగా అక్షరార్చన–2 లో ఇదే పుస్తకంలో వెలువరిస్తునాము.

వీణాపాణి, జ్ఞానానందమయీ వాణి, వాక్కుకు రాణి అయిన సరస్వతీ దేవికి అక్షరార్చనగా సమర్పించబడుతున్న పుష్పాలుగా ఈ వ్యాసాలు అందరి మన్ననలను అందుకుంటాయని సృజనలోకం మనసారా భావిస్తున్నది.

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయసూచిక

## అక్షరార్చన-1


1. సృష్టి క్రమం మహాద్భుతం .............................. 1
2. అనంతం... అద్భుతం... కాలరహస్యం .............................. 5
3. మహాద్భుతం... సృష్టి విన్యాసం .............................. 9
4. విశేషాల సమాహారం – పరిణామక్రమం .............................. 13
5. మానవ జన్మరహస్యం .............................. 16
6. అమ్మలగన్నయమ్మ .............................. 20
7. స్త్రీ, పురుషుల జననం – సృష్టి లీలా వినోదం .............................. 22
8. సూర్యాయ నమః .............................. 25
9. మనసు నిర్మలం – చంద్ర దర్శనం .............................. 28
10. మానవ శక్తికి అతీతం – జలప్రళయం .............................. 31
11. అన్నం పరబ్రహ్మ స్వరూపం .............................. 34
12. మృత్యురహస్యం... ఆత్మజ్ఞానం .............................. 38
13. మరణంపై విజయం కోసం అమృతాన్వేషణ .............................. 41
14. కాలాయనమః .............................. 44
15. ఉద్వేగాల వ్యక్తీకరణ మార్గం – వాక్కు .............................. 48
16. లోకానికి శ్రీరామరక్ష – అక్షరం .............................. 52
17. రూపాలు ఎన్ని ఉన్నా దేవుడు ఒక్కడే .............................. 56
18. ఈజిప్టు దేవతలు – ఒసిరిస్ గాథ .............................. 60
19. అసురో–బాబిలోనియన్ దేవతలు – గిల్గామేష్ కథ .............................. 64
20. సుమేరియన్ నాగరికత – తొలి వృత్తుల సంఘర్షణ .............................. 67
21. దేవతల రూపాలలో విశ్వసారూప్యం .............................. 70
22. దేవుడూ, దయ్యాలూ – అంతా ఒక భ్రమ .............................. 73
23. మనిషే... దైవం! .............................. 76
24. దైవాన్ని చూపించు! .............................. 79
25. భూమి నాదియన్న భూమి ఫక్కున నవ్వు! .............................. 82
26. ఆయుష్షు నూరేళ్లేనా? .............................. 84

27. అనాది విశ్వాసం – పరలోక యాత్ర ............................ 87
28. జగత్పాలకా నమో... నమః ...................................... 90
29. సంభవామి .......................................................... 93
30. ధరిత్రి... వేదాల సంరక్షణ పర్వం “మత్స్యావతారం”............. 97
31. శ్రీహరి మహిమా సమ్మోహనం “కూర్మావతారం”............... 100
32. విశ్వంభరోద్ధరణ యజ్ఞం “వరాహావతారం” ..................... 104
33. దుష్ట శిక్షణ – శిష్టరక్షణ ఘట్టం “నృసింహావతారం” ........... 107
34. విశ్వరూప విన్యాసం “వామనావతారం”......................... 111
35. క్షత్రియ సంహార యజ్ఞం “పరశురామం” ...................... 114
36. ఆదర్శచరితం “రామావతారం” ................................ 117
37. నవరస భరితం “శ్రీకృష్ణావతారం”............................... 121
38. నిర్వాణ బోధకుడు “బుద్ధ భగవానుడు” ......................... 126
39. కలియుగ రక్షణే పరమార్థం “కల్కి అవతారం” ................. 129
40. కలడో... లేడో! ................................................... 132
41. ‘తత్త్వశాస్త్రం’ సత్యాన్వేషణలో తొలిమెట్టు ......................... 135
42. మానవాళికి మార్గనిర్దేశం చేసిన నవీన దార్శనికులు............ 138
43. అద్భుతాలకు మూలం... ప్రశ్న.................................. 142
44. జ్ఞాన శిఖరారోహణం ............................................. 144
45. తత్త్వశాస్త్రసారం – జ్ఞానమే సర్వస్వం ............................ 148
46. ఉపనిషదమృతం – సత్యదర్శనం.................................. 151
47. జీవితాన్ని సార్థకం చేసే ఉపనిషత్ విజ్ఞానం..................... 153
48. ఉపనిషత్ మూలం – ఆత్మజ్ఞాన మార్గం......................... 155
49. తత్వశాస్త్రం... జ్ఞాననేత్రం ........................................ 158
50. అనంత మథనం “సత్యాన్వేషణ” ................................. 162
51. బ్రహ్మాండ రహస్యం ............................................. 164
52. బృహదారణ్యకోపనిషత్ – అసతోమా సద్గమయ................ 167
53. ఛాందోగ్యోపనిషత్‌లో చిత్రకథ – ఏది విద్య... ఏది అవిద్య? .. 171
54. ప్రతి జీవితం ఓ మహావృక్షం .................................... 174
55. దైవం నుంచి సైతాను దాకా ‘సర్పబంధం’ ...................... 177

56. అనుబంధాల చిహ్నం అంగుళీయకం........................... 180
57. మనసుదోచే... మన్మథబాణం ..................................... 183
58. సాలీడు జీవనదారం - కాలచక్రం.............................. 186
59. జీవ పరిణామ రాట్నం - బ్రహ్మచక్రం.......................... 189
60. ధనవ్యామోహం నిష్ఫలం ........................................ 192
61. సత్యమే... శివం ................................................... 194
62. గర్వం... వినాశ ద్వారం ............................................ 196
63. జ్ఞానామృతం - సద్గురు సాంగత్యం............................ 198
64. మృత్యోర్మా అమృతం... .......................................... 200
65. సృష్టి రహస్యాల 'దర్శనం' ....................................... 202
66. జ్ఞాన, మోక్షదాయని... ఓంకారం ............................... 206
67. మానవాళికి మంచిదారి చూపే ప్రవక్తలు ....................... 209
68. ఆత్మ పరమాత్మల పరమార్థం - ప్రశ్నోపనిషత్................. 211
69. ధర్మసాధనలు - యక్షప్రశ్నలు.................................... 213
70. పరమశాంతి ........................................................ 218


## అక్షరార్చన-2

1. కవిత్వ నేపథ్యం-1 .................................................. 223
2. కవిత్వ నేపథ్యం-2 .................................................. 224
3. కవిత్వ నేపథ్యం-3 .................................................. 227
4. కవిత్వ నేపథ్యం-4 .................................................. 232
5. కవిత్వ నేపథ్యం-5 .................................................. 236
6. కవిత్వ నేపథ్యం-6 .................................................. 242
7. కవిత్వ నేపథ్యం-7 .................................................. 246
8. కవిత్వ నేపథ్యం-8 .................................................. 251
9. ఆర్యుల కలల్లో కనిపించి వొణికించి... .......................... 256
10. కవిత్వం రాయాల్సిందేనా? ....................................... 262

# అక్షరార్చన - I



సరస్వతి! నమస్తుభ్యం వరదే కామరూపిణి
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా
జ్ఞానానందమయీ వాణీ జితైశ్వర్యాధికారిణీ
కచ్ఛపీ నిక్వణత్ పాణీ స్వేచ్ఛాంబర విహారిణీ



ఆంధ్రజ్యోతి

మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వేమూరి రాధాకృష్ణ గారికి,
ఎడిటర్ డాక్టర్ కె. శ్రీనివాస్ గారికి, సబ్ ఎడిటర్ శ్రీ టి. కుమార్ గారికి,
చిత్రకారులు శ్రీయుత చిదంబరం, రాజశేఖర్, అక్బర్, పినిశెట్టి గార్లకు
కృతజ్ఞతలు.

# 1. సృష్టి క్రమం మహాద్భుతం

**కాల రథమ్ము మీదనే జగత్పతి నిత్యము స్వారి చేయునో**
**కాల రథమ్ము చక్రముల ఘట్టన పుట్టుచురాలుచుండు కెం**
**ధూలి కణమ్ములే అగునో తోచెడి ఈ సకల ప్రజాళియున్**
**కాల రహస్యమున్ తెలియగల్గుటే పుట్టుకకున్ ఫలమ్మొకో!**

– బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

జీవితం బుద్బుద ప్రాయం... క్షణభంగురం. కాలం అనంతం, నిశ్చలం. విశ్వం... స్థల కాల సమాహారం. విశ్వంలో జీవ నిర్జీవులు కదిలి... కలిసి కనుమరుగైపోతూ కాలం కదిలిపోతున్న మాయను భ్రమను కలిగిస్తాయి. ఎప్పుడు మహావిస్ఫోటనం జరిగిందో, ఎలా విశ్వం ప్రారంభమైందో ఎవరికీ తెలీదు. ఉన్నవన్నీ అంచనాలే! కొందరు ఆ మహా విస్ఫోటనాన్ని బిగ్‌బాంగ్ అన్నారు. అదే ప్రణవనాదం అన్నారు మరికొందరు ఆ శబ్ద తరంగాలు (1–500 మెగాహెర్ట్జ్) ఇప్పటికీ విశ్వం నలువేపులా 'బి–ఫ్లాట్'లో వినపడుతున్నాయని 1965లో బ్యాక్‌గ్రౌండ్ రేడియేషన్ వల్ల కనుగొన్నారు.

ఆదిమబీజం (ఎల్మ్) సింగ్యులారిటీ స్థితిలో ఉన్నప్పుడు దానిలో న్యూట్రినో, యాంటీ న్యూట్రినోలు జనన మరణాల్లా జంటగా ఉన్నాయంటారు. కృష్ణబిలంలా (బ్లాక్ హోల్) తనలోకి చుట్టుపక్కల ఉన్న పదార్థాల్ని పీల్చేసుకున్న ఆదిమబీజానికి ఏ విద్యుత్ స్పర్శ తగిలిందో తెలీదు. మహావిస్ఫోటనం జరిగి కొత్త సృష్టి ప్రారంభమైంది. విశ్వాలు కూడా రెండు రకాలుగా (ఒకటి మగ– ఆడమ్, రెండు స్త్రీ– ఈవ్;) లేదా చైనీస్ ఇన్–యాంగ్‌లా ఉన్నాయని కొందరి అభిప్రాయం. అణుశకలాలకు, అణువులకు న్యూట్రినో, ఏంటిన్యూట్రినో, ఎలక్ట్రాన్, పాజిట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్‌లని ఆ పేర్లు మనం పెట్టుకున్నవే. వాటికి ఆ పేర్లున్నట్లు, కొన్ని ప్రత్యేక ధర్మాలు ఉన్నట్లు వాటికి తెలీదు. అవి కలుస్తూనే ఉంటాయి. విడిపోతూనే ఉంటాయి. అనేక కోట్ల (పదివేల కోట్ల కెల్విన్) ఉష్ణోగ్రతను జనింపచేస్తూ అణు శకలాలు అణువులై, మూలకాలై మెండలీఫ్ పట్టికను నింపుతుంటాయి. కానీ ఎప్పుడు ఎందుకు సుమారు వంద మూలకాల దగ్గరే ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్‌ల కలయిక ఆగిపోయిందో ఎవరికీ తెలియదు.

## జీవపదార్థం ఎలా ఏర్పడింది ?

కొన్నిచోట్ల హైడ్రోజన్ హీలియంగా మారే థర్మో న్యూక్లియర్ రియాక్షన్‌లు

జరుగుతూ నక్షత్రాలు వెలుగుతూనే ఉంటాయి. వాటిలో ఒకటి సూర్యుడై సౌర కుటుంబం ఏర్పడింది. ఆ కుటుంబంలోని ఒక గ్రహంలో నిర్జీవ మూలకాలు జీవత్వాన్ని పొంది రకరకాల జీవులుగా పరిణామం చెందాయి. అయితే హైడ్రోజన్, ఆక్సిజన్‌తో ఎలా కలిసిందో, వాటి కలయిక వల్ల ఏర్పడిన నీరు... నిర్జీవిని జీవిగా ఎలా మార్చిందో ఎవరికీ తెలీదు. కానీ దైవకణం (హెడాన్) ఉనికికోసం పరిశోధనలు సాగుతూనే ఉన్నాయి. మహా విస్ఫోటన సమయంలో ఏర్పడిన రేడియోధార్మికత ధూళి మేఘాలు, నక్షత్రాలుగా, క్వాజార్లుగా, నీహారికలుగా, పాలపుంతలుగా, నిరంతరం ఏర్పడ్తూ నశిస్తూ, తిరిగి ఏర్పడుతూ సాగిపోతున్నాయని 'రెడ్‌షిఫ్ట్' (దూరంగా పోతున్న నక్షత్రాలు గెలాక్సీలు వెలువరించే కాంతిమార్పు) వల్ల కనుగొన్నారు. మండుతున్న సూర్యగోళం నుంచి సుమారు 4.6 బిలియన్ సంవత్సరాల క్రితం విడివడిన ఒకశాతం ద్రవ్యరాశి నవగ్రహాలై, వాటిలో భూమి మధ్యస్తంగా ఉండి నీటిని నిలుపుకుంది. అందువల్ల క్రమేపీ తగ్గిన ఉష్ణోగ్రతతో నిర్జీవ పదార్థాలతో నిండిన ఆదిమ జీవరసం (ప్రైమోర్డియల్ సూప్)లో మెరుపుల వల్ల, సూర్యకాంతి వల్ల, భూగర్భపు రేడియో ధార్మికత వల్ల ప్రతికృతి చేసుకోగలిగిన జీవపదార్థమేర్పడింది.

మొదట్లో నూటికి నూరుశాతం నీరున్న కర్దమ జెల్లీ వంటి జీవ పదార్థాలు, వాటి నుంచి ఆక్సిజన్ లేకున్నా జీవించగల కేంద్రకం లేని ఏక కణ జీవులు ఉద్భవించాయి. తర్వాత బ్లూ ఆల్గేలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా తమకు కావాల్సిన ఆహార పదార్థాలను తయారు చేసుకుని ఆక్సిజన్‌ను వాతావరణంలోకి పంపించాయి. ఆక్సిజన్ ఉన్న వాతావరణంలో కేంద్రకం ఉన్న ఏక కణ జీవులూ, బహుకణ జీవులూ ఏర్పడేప్పటికి కాలరథం 4.5 బిలియన్ (4500 మిలియన్లు) సంవత్సరాల నుంచి 570 మిలియన్ సంవత్సరాలకు చేరుకుంది. నీరుకు మూడు స్థితులున్నట్లే వీటిపై ఆధారపడిన జీవుల్లో సర్వోత్కృష్ట జన్మముగా భావించిన మానవునికి మూడు స్తరాలు, జాగ్రత్ స్వప్న సుషుప్తావస్థలై అనుభవంలోకి వచ్చాయి. జీవ నిర్జీవ పదార్థాలకు, విశ్వానికీ కూడా సృష్టి, స్థితి లయలే చక్ర రూపాన పరిభ్రమించడంతో విశ్వసృష్టి నిరంతరాయంగా కొనసాగుతున్నది.

## 50 మిలియన్ ఏళ్ళ క్రితం ఏర్పడిన హిమాలయం

500–220 మిలియన్ సంవత్సరాల మధ్యకాలంలో భూమంతా హిరణ్యాక్షుని చేత చాపగా చుట్టిన ఏక ఖండంగా ఉండింది. నీరంతా ఏక సముద్రంగా ఉన్నా ఇప్పటి ఆల్ప్స్ పర్వతాల దగ్గరలో శ్వేత వరాహ దంష్ట్రధాటికి ఏర్పడిన చీలికలా టెథిస్ అనే చీలిక ఏర్పడి భూమి లారేసియా, గోండ్వానాల్యాండ్ (మనం పెట్టిన

పేర్లే) అనే రెండు ఖండాలైంది. అలా మొదలైన ఖండాంతర చలనంలో అన్ని భూఖండాలు అన్ని దిక్కులకు మరలినా ఒకే ఒక భూఖండం ఉత్తరంగా కదిలి ఆసియా ఖండాన్ని ఢీకొనగా అత్యున్నతమైన హిమాలయ పర్వతాలు యాభై మిలియన్ సంవత్సరాల క్రితం ఉద్భవించాయి. ఆ అద్భుత భూఖండమే ద్వీప కల్పమై మూడు వైపులా సముద్రాలతో, ఒకవైపు పెట్టని కోట వంటి హిమాలయ పర్వతాలతో విరాజిల్లుతున్నది.

## వైవస్వత మన్వంతరం

భూవాతావరణంలో అకస్మాత్తుగా సంభవించిన మార్పుల వల్ల ఇప్పటికి ఆరుసార్లు సామూహిక జీవ అంతర్ధానం సంభవించి, పాత జీవరాశి నశించి అప్పటి ఆటుపోట్లను తట్టుకోగలిగిన కొత్త జీవులు ఎప్పటికప్పుడు పరిణామం చెందుతూ వచ్చాయి. అరవై ఐదు మిలియన్ సంవత్సరాల క్రితం ఉల్కాపాతం వల్ల మహాకాయులైన డైనోసార్లు నశించి క్షీరదాల యుగం ప్రారంభమైంది. వేద సంప్రదాయం అనుసరించి ఆరు మన్వంతరాలు గడిచి ఏడవ మన్వంతరం (170 మిలియన్ సంవత్సరాల క్రితం) వైవస్వత (యముని) పాలన ప్రారంభమైంది. అంటే నియమిత జీవిత కాలం (ఆయుర్దాయం) గల జీవుల సృష్టికి నాంది ఏర్పడింది.

నవీన శాస్త్రజ్ఞానం, మహావిస్ఫోటనం 15-6 బిలియన్ సంవత్సరాల మధ్య జరిగి ఉండవచ్చని ఊహిస్తుంటే వేద సంప్రదాయం ప్రకారం ఇప్పుడు నడుస్తున్నది బ్రహ్మ ద్వితీయ పరార్థమైన శ్వేతవరాహ కల్పంలో (బ్రహ్మకు 51వ సంవత్సరం) ఏడవ మన్వంతరం, 28వ మహాయుగపు కలియుగంలో 5115 సంవత్సరాలు గడిచాయి. (2013 క్రీ.శ.) ఓంకారోత్పత్తి జరిగి 629,29,49,115 (6.29 బిలియన్ సంవత్సరాలు) సంవత్సరాలుగా, జీవ సృష్టి, వేదోత్పత్తి 197,29,49,115 సంవత్సరాల క్రితం జరిగిందని స్పష్టంగా చెప్పడం సనాతనులు ప్రతిరోజూ పఠించే మహాసంకల్పంలో గమనించవచ్చు.

**'శ్రీ మహావిష్ణో రాజ్ఞయా ప్రవర్తమానస్య అద్యబ్రాహ్మణః**
**ద్వితీయ పరార్థే, శ్వేత వరాహ కల్పే**
**వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే...'**

అంటూ సంకల్పం చెబుతారు. నవీన శాస్త్ర జ్ఞానం, వేదవిజ్ఞానం ఇలా ఏకీభవించడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కాల రహస్యాన్ని ఇంత కచ్చితంగా చెప్పడమే కాకుండా కాలాన్ని, కాలుడు, మహాకాలుడు అనే పేర్లతో లయకారుడైన ఆది దేవుణ్ణి కొలిచే సంప్రదాయం కూడా ఈ దేశ సంప్రదాయంలోనే ఉండడం మహాద్భుతమనిపిస్తుంది.

## కాలం కథ

| | | |
|---|---|---|
| 12 సంవత్సరాలు | = | 1 పుష్కరం |
| 4,32,000 సంవత్సరాలు | = | కలియుగం |
| 8,64,000 సంవత్సరాలు | = | ద్వాపరయుగం |
| 12,96,000 సంవత్సరాలు | = | త్రేతాయుగం |
| 17,28,000 సంవత్సరాలు | = | కృతయుగం |
| 43,20,000 సంవత్సరాలు | = | మహాయుగం |
| 71 మహాయుగాలు | = | 1 మన్వంతరం |
| 14 మన్వంతరాలు | = | 1 కల్పకం |
| 360 × 864 కోట్ల సంవత్సరాలు | = | 1 బ్రహ్మ సం. |
| 100 బ్రహ్మ సంవత్సరాలు | = | బ్రహ్మకాలము (ముక్తికాలము) |
| బ్రహ్మ మొదటి 50 సంవత్సరాలు | = | పద్మకల్పం (పూర్వపరార్ధం) |
| తరువాత 50 సంవత్సరాలు | = | శ్వేతవరాహకల్పం (ద్వితీయ పరార్ధం) |
| 360 × 100 × 864 కోట్ల సంవత్సరాలు | = | ముక్తికాలము |
| ప్రస్తుత బ్రహ్మ వయస్సు | = | 155,521,972,949,115 సంవత్సరాలు |
| శ్రీకృష్ణ పరమాత్మ నిర్యాణం చెందినది | - | 17వ తేది ఫిబ్రవరి 3102 B.C. నాడు, ఆ రోజునుంచే (18-2-3102 B.C.) కలియుగం ప్రారంభమైనది. |

✧✧✧✧✧

# 2. అనంతం... అద్భుతం... కాలరహస్యం

(కాలగమనం అనంతం. ఓ క్షణం విశ్రాంతి లేకుండా కాలచక్రం నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. సంవత్సరాలు, ఋతువులు, నెలలు, రోజులు ఇవన్నీ మనం ఏర్పరుచుకున్నవే కాని కాలానికి ఇవేమీ పట్టవు. నిరంతరాయంగా సాగిపోతూనే ఉంటుంది. వైజ్ఞానికంగా ఎంత ప్రగతిని సాధించినా కాలాన్ని వెనక్కి మళ్లించడం, ముందుకు పంపడం మాత్రం అసాధ్యం. ఎంత తోడినా అంతుచిక్కని కాలమహిమను గురించి...)

'కాలం కాళ్యా భువనఫలకే క్రీడతి ప్రాణిశారైః' లోకమనే పలక మీద కాలుడు, కాళి అనే ఇద్దరు జూదరులు 'రేయి పగలు' అనే రెండు పాచికల్ని దొర్లిస్తూ ఆడుతున్నారు. ప్రాణుల సంయోగ వియోగాలకు, వృద్ధి క్షయాలకు కాలమే కర్త అని భర్తృహరి సుభాషితం. భర్తృహరి వైరాగ్యశతకంలో కాలమహిమను గురించి వర్ణిస్తాడు. 'కాలమంటే నాకు తెలుసు కాని, వివరించమంటే మాత్రం నావల్ల కాదు' అన్నాడు సెయింట్ ఆగస్టీన్ పదిహేను వందల సంవత్సరాల క్రితం చెప్పిన మాట ఇప్పటికీ సత్యమే.

కాలాన్ని రెండు ముఖ్యవిషయాలతో పేర్కొనవచ్చు. 1. వ్యవధి (ఇంటర్వెల్) – రెండు ఘటనల మధ్య సమయం. 2. శకారంభం (ఎపోక్) – కాలచక్రంలో ఒక ముఖ్య సంఘటన ఆరంభం. అందుకే విశ్వం స్థలకాలాల సమాహారం అన్నాడు ఐన్‌స్టీన్.

## కాలచక్ర భ్రమణం

పన్నెండు ఆకులుగల కాలచక్రం గగనంలో తిరుగుతున్నది. ఆ చక్రం మీద 720 మిథునాలున్నాయని ఋగ్వేదంలో వర్ణించారు. మహాభారతం ఆదిపర్వంలో కుండలాలను దొంగిలించిన తక్షకుడిని వెంటాడుతూ, ఉదంకుడు నాగలోకానికి వెళ్లినప్పుడు పగలు, రేయి అనే నలుపు తెలుపు దారాలు పేనుతున్న ధాత, విధాతలనే ఇద్దరు స్త్రీలు పన్నెండు ఆకులున్న చరఖా చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు పిల్లలు (సంవత్సరాలు, ఋతువులు) రూపంలోని కాలచక్రాన్ని సందర్శించి అచ్చెరువొందుతాడు. ఇబిస్‌కొంగ తల కలిగిన 'తోత్' ఈజిప్షియన్ల కాలదేవత. మొట్టమొదటి క్యాలెండర్‌ను రోజుకు గుండె లక్షసార్లు కొట్టుకుంటుందన్న విషయాన్ని కనుక్కున్నది తోత్ దేవుడే. వ్యవసాయ దేవత, జ్యూస్ తండ్రి క్రోనాస్ గ్రీకుల కాలాధిపతి.

పవిత్రాత్మ 'పాన్‌గు' విశ్వనిర్మాణం చేస్తూ అస్తమించినప్పుడు అతని శిరస్సు నుంచి పర్వతాలు, మాంసం నుంచి నేల, రక్తం నుంచి నదులు, ఊపిరి నుంచి

వాయువు, శరీరంపై తిరుగుతున్న క్రిముల నుంచి మానవులు, జీవజాతులు పుట్టారని చైనీయులు విశ్వసిస్తారు. విశ్వసృష్టికి 18000 సంవత్సరాలు పట్టిందని వారి నమ్మకం.

## సంప్రదాయం... శాస్త్రవిజ్ఞానం

వేదసంప్రదాయం ప్రకారం ఇది బ్రహ్మ పూర్వార్ధమైన శ్వేతవరాహ కల్పంలో (బ్రహ్మకు 51వ సంవత్సరం, ఏడవ మన్వంతరం (వైవస్వత) 28వ మహాయుగపు కలియుగంలో 5115 సంవత్సరం నడుస్తోంది. ఓంకారోత్పత్తి జరిగి 6292949115 (6.29 బిలియన్ సంవత్సరాలు కాగా, జీవసృష్టి, వేదోత్పత్తి సంభవించి 1972949115 సంవత్సరాలయ్యిందని సనాతనులు ప్రతినిత్యం పఠించే మహా సంకల్పంలో గమనించవచ్చు. నవీన శాస్త్రజ్ఞానం ప్రకారం బ్రహ్మాండ విస్ఫోటనం 10-15 బిలియన్ సంవత్సరాలపుడు, (మన పాలపుంతకు పది బిలియన్ సంవత్సరాలు). సూర్యకుటుంబం, భూమి, చంద్రుడు నాలుగున్నర బిలియన్ సంవత్సరాలప్పుడు సూక్ష్మ జీవోత్పత్తి రెండున్నర బిలియన్ సంవత్సరాలు, కంటికి కనిపించే జీవులు 286 మిలియన్ సంవత్సరాల క్రితం, డినోసార్లు అరవై అయిదు మిలియన్ సంవత్సరాలప్పుడు అదృశ్యమైతే, క్షీరదాల యుగం ఇరవై మిలియన్ సంవత్సరాల క్రితం ఉధృతమై, 1.7 మిలియన్ సంవత్సరాలకు పూర్వం మానవుని ఆవిర్భావం జరిగిందని శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. క్రీస్తుపూర్వం 150000-5000 సంవత్సరాలు రాతియుగంగా, 5000-3000 రాగియుగం, 3000-1400 ఇత్తడియుగం, 1400-500 ఇనుప యుగంగా, క్రీస్తుశకం 1850-1950 పారిశ్రామిక యుగం, 1950 నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, బయో ఇంజనీరింగ్, ట్రాన్స్‌జెనిక్ క్లోనింగ్ యుగాలుగా కాలం అనేక రూపాల్ని సంతరించుకున్నదిప్పుడు.

ఫ్రెంచి భౌతిక శాస్త్రవేత్త హెన్రి బెఖురెల్ యాదృచ్ఛికంగా కనుగొన్న యురేనియం విచ్ఛిత్తి (డికే) ఆ తరువాత రూథర్‌ఫర్డ్ (1907 ఇంగ్లీషు శాస్త్రవేత్త) - యురేనియం లాంటి రేడియో ధార్మికత కలిగిన పదార్థాలు - ఒక క్రమ పద్ధతిలో నశిస్తాయని కనుగొని పరమాణు గడియార నిర్మాణపు ఆలోచనకు పునాది వేశాడు. ఉదాహరణకు ఒక కిలోగ్రాము పదార్థం దాని అర్ధజీవిత కాలంలో అరకిలో గ్రాము పదార్ధంగా మారుతుందన్నమాట. (యురేనియం - 238 హాఫ్‌లైఫ్ = 4.5 బిలియన్ సంవత్సరాలు, పొటాసియం- 40 = 1.3 బిలియన్ సంవత్సరాలు, రుబిడియం- 87 = 47 బిలియన్ సంవత్సరాలు, కార్బన్- 14 = 5710 సంవత్సరాలు. వీటినిబట్టే మనం ఈనాడు భూమి, ప్రాచీనకాలపు శిలాజాల చరిత్రల కాలాన్ని అంచనా వేయగలుగుతున్నాం.

## ప్రకృతి స్పందన

సమస్త జీవులకూ జీవ గడియారం ఉంటుందని, ఆ బయోలాజికల్ క్లాక్ ఆధారంగానే నిర్ణీత సమయంలో జననం, పెరుగుదల, ప్రత్యుత్పత్తి, మరణం సంభవిస్తాయని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. స్వీడిష్ ప్రకృతి శాస్త్రవేత్త కార్లాస్ లిన్నేయస్ పూలు పూచే సమయాన్ని బట్టి పూల గడియారాన్ని (ఫ్లోరాస్ క్లాక్) తయారుచేశాడు. ఫాషన్ ఫ్లవర్ పన్నెండు గంటలకు, బంతిపూలు ఉదయం ఏడుగంటలకు వికసిస్తే, తెల్లతామర సాయంకాలం అయిదు గంటలకు, స్కార్లెట్ పింపెర్నెల్ మధ్యాహ్నం రెండు గంటలకు ముడుచుకోవడం గమనించవచ్చు. సూర్యచంద్రుల, నక్షత్రాల వెలుగు నీడల వల్ల ఈ బయోరిథమ్స్ ఏర్పడుతున్నాయని, వీటిని అనుసరించే పక్షుల వలస, జీవజాతుల ప్రత్యుత్పత్తి చక్రాలుంటాయని భావన. మానవునిలో నిద్రాచక్రం, ఉష్ణోగ్రత, హృదయ స్పందన, కణ విభజన, ప్రత్యుత్పత్తి వీటన్నింటికీ నియమిత కాల చక్రాలున్నాయి.

## ఖగోళ విశ్లేషణ

భూమి తనచుట్టూ తాను తిరగడానికి గం. 23–56–4.09 సెకన్లు చంద్రుడు భూమి చుట్టూ తిరగడానికి 27 రోజుల – 7 గంటల – 49 నిమిషాల 11.47 సెకన్లు పడుతుంది. భూమి సూర్యుడి చుట్టూ ప్రదక్షిణం చేయడానికి 365 రోజుల అయిదు గంటలు పడుతుంది. గ్రహణాలు ఒకే ప్రదేశంలో తిరిగి ఏర్పడటాన్ని 233 చంద్రమాసాలు (18 సంవత్సరాల 11 1/3 రోజులు) లేదా సారొనిక్ సైకిల్ అంటారు. డాగ్‌స్టార్ (సోథిక్) సిరియస్ నక్షత్రం ఒకే ప్రదేశంలో ఉదయించడానికి 1461 సంవత్సరాలు పడుతుంది. దీనిని సోథిక్ సైకిల్ అంటారు. ఫీనిక్స్ పక్షి జీవితకాలం 1461 సంవత్సరాలని పూర్వీకుల నమ్మకం. సూర్యుడు భూమధ్య రేఖను దాటే రెండు స్థలాలు ఒకే విధంగా (విషువత్ చలనాలు) రావడానికి 25827 సంవత్సరాలు పడ్తుందని హిందూ సిద్ధాంతులే మొదట కనుగొన్నారు.

## కవిత్వ కాలం

కాలాన్ని భూత, వర్తమాన, భవిష్యత్ శకలాలుగా విభజించి మనల్ని మనం అంచనా వేసుకుంటాం. ఊహాలోకాల్లో, కాలయంత్రాల్లో, కలల్లో భూత భవిష్యత్ వర్తమానాల్లోకి ప్రయాణిస్తూ మనస్సు చేసే మాయాజాలంలో మైమరచిపోతుంటాం. ఒక్క క్షణకాలం ఆగిపోతే బావుణ్ణు అని అనేకసార్లు అనిపిస్తుంది కదూ, పసిపాప జననం, అనుకోని ఓ మరణం, తెలిసి తెలియక చేసిన తప్పుల్ని సరిదిద్దుకునే ప్రయత్నం, ఒక చిన్నముద్దు అనంతకాలాన్ని క్షణంసేపు ఆపేసినట్లు, కాలం అలాగే నిలిచిపోతే!

'కాలమా, వెనక్కు మళ్లు. ఈ రాత్రికి నన్ను మళ్ళీ పసిపాపగా మార్చు" అని వేడుకుంటుంది ఎలిజెబెత్ అలెన్. 'ఏవీ ఆ గడిచిపోయిన క్షణాలు? బాల్యం, యౌవనం, వృద్ధాప్యం అన్నీ గతించిన కాలశకలాలు. గడియారపు కుప్పెలో ఇసుకంతా జారిపోయింది. కాలమే నాకు కానరాక మాయమయ్యింది' అంటాడు జాన్ క్విన్సీ ఏడమ్స్.

కాలమెక్కడికీ కదిలిపోదు. మనమే పోతాం. కాలం అక్కడే స్థిరంగా ఉంటుంది – ఇది ఆస్టిన్ డాబ్సన్ అభిప్రాయం. కాలమనేది అనంత ప్రవాహం. నిజం కన్నీళ్లతో ప్రవహిస్తూ సంవత్సరాలనే సముద్రంలో కలిసిపోతుంటుంది అంటాడు టేలర్ బి. ఎఫ్. 'భగవానుడు కాలచక్రాన్ని తిప్పుతూనే ఉంటాడు. కాలం, ప్రపంచం అలా కదిలిపోతూనే ఉంటాయి. ఈ ప్రేమలన్నీ మంచుతునకల్లా కరిగిపోతుంటాయి. ఆశ అల్లంత దూరాన మినుకు మినుకుమంటూ ఉంటుంది' అంటాడు ఈట్స్ మహాకవి.

**బాలకుడై క్షణంబు, యువభావయుతుండయి కొంతకాలము**
**ద్వేల దరిద్రుడై క్షణము, విత్త సమన్వితుడై క్షణంబు జీ**
**ర్ణాలస గాత్రుడై నటుని యట్ల నటించి తుదిన్ నరుండు యా**
**మ్యాలయ నామమైన తెరయందు జొరంబడు సత్వరంబుగన్**

అని తెలిసి కూడా మానవుడు కాలరహస్యాన్ని కనుక్కోడానికి చేస్తున్న కృషి, ఈ కాలాన్ని ప్రపంచాన్ని సృష్టించింది మానవుని మనసేనన్న విషయాన్ని గుర్తుచేస్తూ ఉంటుంది. కాలంక్రీడః గచ్ఛతీ ఆయుః'. కాలం దాని మానాన అది సాగిపోతూనే ఉంటుంది.

✧✧✧✧✧

# 3. మహాద్భుతం... సృష్టి విన్యాసం

(ఈ సృష్టి ఎలా మొదలైంది? గ్రహాలు, భూమి ఎలా ఉద్భవించాయి? భూమిపై జీవ జలం పుట్టుక ఎలా మొదలైంది అనే ప్రశ్నలు ఆసక్తికరం. మహాద్భుతమైన ఈ సృష్టిని ఆ పరమాత్మే సృజించాడని భాగవతం చెబుతుంది. అయితే ఆధునికులు సృష్టిక్రమాన్ని సశాస్త్రీయంగా నిరూపించేందుకు ఎంతో శ్రమించారు. ఆశ్చర్యకరమైన సత్యాలను వెల్లడించారు. మహాద్భుతమైన సృష్టి క్రమం విశేషాలు...)

**"ఎవ్వని నాభి యందెల్ల లోకాంగ సంస్థాన కారణ పంకజంబువొడమె?**
**అందుదయించి సర్వావయవ స్ఫూర్తి తనరారునట్టి పితామహుండు**
**కడగి ఎవ్వని అనుగ్రహమున నిఖిల భూతముల సృజించె?"**

అని పరీక్షిత్తు మహారాజు ఈ ప్రపంచం ఎలా ఉద్భవించిందో తెలుసుకోవాలనే కుతూహలంతో శుకయోగిని అడుగుతాడు. శుకుడు గతంలో సర్వేశ్వరుడు బ్రహ్మకు తెలిపిన లోకసృష్టి క్రమాన్ని పరీక్షిత్తు మహారాజుకు వివరించాడు.

**"మహదహంకార పంచతన్మాత్ర గగన**
**పవన శిఖితోయ భూ భూత పంచకేంద్రియ**
**ప్రపంచంబు భగవంతునందు గనుట సర్గము**
**బ్రహ్మ భూరితర చరాచర భూత సృష్టి చేయుట విసర్గము"** అని విశదీకరించినాడు.

**"యదిదం సకలం జగత్ దృశ్యతే**
**తత్ పరమేశ్వరేణైవ సమ్యగ్ రచయిత్వ**
**సంరక్ష్య ప్రళయావసరే వియోజ్యచ వినాశ్యతే**
**పునఃపునరేవ మేవ సదాక్రియ త్రయితి"**

పరమేశ్వరుడే ఈ సంపూర్ణ విశ్వమును తన సంకల్పముచే సృష్టించును. రక్షించును. ప్రళయకాలమున నాశనమొనర్చును. ఈ సృష్టి, స్థితి, లయ చక్రము ఎల్లప్పుడు నడచుచునే ఉంటుంది అని పై శ్లోకానికి అర్థం.

## ఏది విరాట్‌రూపం?

విశ్వసృష్టి కూడా ఒక బ్రహ్మాండం నుంచి మొదలయ్యిందనేది శాస్త్రజ్ఞుల అభిప్రాయం. సౌరకుటుంబాలూ, నక్షత్రాలూ, గెలాక్సీలూ, క్వాజార్లూ, నెబులాలూ, నక్షత్ర వీధులూ కలిసిన ఆ సర్వ వ్యాప్తమైన రూపమే విరాట్ స్వరూపమా?

గాలి దుమ్మూ, ధూళితో నిండిన మేఘంలోని ప్రతి అణువూ బొంగరంలా తిరుగుతూ, ఒక దానికి ఒకటి దగ్గరవుతూ, చిక్కబడుతూ, పరస్పరాకర్షణ బలాలతో పరిభ్రమిస్తున్నప్పుడు జనించిన వేడిమిలో...మధ్యభాగం చిక్కబడి, మండుతున్న గోళంగా ప్రజ్వరిల్లగా, ఆ సూర్యగోళానికి దగ్గర్లోని బరువైన మేఘాలు భూమిలాంటి దగ్గరి గ్రహాలుగా, తేలికపాటి మేఘాలు దూరపు గ్రహాలుగా ఏర్పడి సౌరకుటుంబం రూపొందింది.

## చల్లారిన అగ్నిగుండం

4700 మిలియన్ సంవత్సరాలప్పుడు 4000 డిగ్రీల సెల్సియస్ నుంచి భూమి ఉష్ణోగ్రత 1500 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గి వాయువులు ద్రవ పదార్థాలుగా, క్రమేపీ ఘనాలుగా గట్టిపడడంతో లోన 700 డిగ్రీల సెల్సియస్ కేంద్రకంలో భూమిపై పెంకు 6 మైళ్ల మందంగా ఉన్నది. ఆ భూభాగం చుట్టూరా వలయంలా ఉన్న వాయువులు క్రమేపీ చల్లబడి ద్రవపు చుక్కలు ఏర్పడసాగాయి. అరవై వేల ఏళ్లపాటు ధారాపాతంగా కురిసిన ఆ వాన భూమి ఉష్ణోగ్రతను 20–30 సెంటీగ్రేడ్లకు తగ్గించింది. 3000 మిలియన్ (300కోట్లు) సంవత్సరాల క్రితం వర్షాలు తగ్గినా, వాతావరణంలోని కార్బన్‌డై ఆక్సైడ్, నీటి ఆవిరి, మీథేన్, అమ్మోనియా వాయువులు, సూర్యుని నుంచి నిరంతరాయంగా వెలువడుతున్న అల్ట్రావయొలెట్ కిరణాలు, భూమి లోపలి పొర నుంచి అగ్నిపర్వతాల్లోంచి వెలువడుతున్న లావా, జీవం ఏర్పడ్డానికి ప్రతిబంధకాలైనాయి. క్రమేపీ భూ ఉష్ణోగ్రత తగ్గనారంభించింది.

## జీవ ప్రక్రియకు శ్రీకారం

మెరుపుల నుంచి విద్యుత్ వాతావరణంలోని వేడివాయువులను ఎమినో ఆమ్లములు, ఫార్మిక్ ఏసిడ్, యూరియా వంటి ప్రాథమిక పదార్థాలుగా మార్చగా, వాటి నుంచి క్రమేపి "ఆదిమరసం" (ప్రైమార్డియల్ సూప్) ఏర్పడింది. దాని నుంచి జీవమున్న ఏకకణ జీవులు, వాటి నుంచి ఆల్గే, బాక్టీరియా క్రమేపీ మొక్కలు, జంతువులు పరిణామం చెందాయి.

సూర్యుని అల్ట్రావయొలెట్ కిరణాల ధాటి నుంచి రక్షించుకునే దశలో క్లోరోఫిల్ ఉన్న ఆల్గేమొక్కలు, కిరణజన్య సంయోగ క్రియ (ఫోటోసింథసిస్) ద్వారా కార్బన్ డై ఆక్సైడ్, నీరు నుంచి షుగర్ తయారు చేసుకుని ఆక్సిజన్‌ను వాతావరణంలోకి పంపించసాగాయి. అలా మొక్కల నుంచి విడుదలయ్యే ప్రాణవాయువు (ఆక్సిజన్) మిగతా జంతువులకు జీవనాధారం అవడమే కాకుండా, వాతావరణం పై పొరల్లో "ఓజోన్" పొరగా మారి భూ జీవజాలానికి రక్షణ కవచమైంది.

1500 మిలియన్ సంవత్సరాలప్పుడు మొదలైన ఈ ప్రక్రియ అనేక కాంప్లెక్స్ జీవాల వృద్ధికి తోడ్పడింది. 450 మిలియన్ సంవత్సరాలప్పుడు సముద్రపు మొక్కలు, నేలపై వేళ్లూనసాగాయి. 350 మిలియన్ ఏళ్లనాటికి నీటిలో నేలపై నివసించగల ఉభయచరాలు (ఏంఫిబియన్స్), 325 మిలియన్ సంవత్సరాలకల్లా బల్లులు (రెప్టైల్స్), కీటకాలు (ఇన్‌సెక్ట్స్), 150 మిలియన్ సంవత్సరాలకల్లా ఆకాశం నిండా ఎగురుతున్న 'టెరోడాక్టైల్స్' (వాటి రెక్కలు కొన్ని అంగుళాల నుండి 25 అడుగుల విస్తీర్ణం ఉండేవి) పుట్టాయి. నేలపై రాక్షస బల్లులు వీరవిహారం చేశాయి. వంద మిలియన్ సంవత్సరాలు ఈ భూమిని ఏలిన రాక్షస బల్లులు ఉల్కాపాతంతో నశించాయంటారు.

## నవీన మానవుని జననం

ఒకప్పుడు ఈ భూమి అంతా 'పాన్‌జియా' అనే ఏక ఖండంగా ఉండేది. అది లారేసియా, గోండ్వానా లాండ్ అనే రెండు ముక్కలుగా, తరువాత ఖండాలుగా చీలి ప్రస్తుత స్థితికి చేరుకున్నది. భారత ఉపఖండం ఆఫ్రికా నుంచి విడివడి ఆసియా ఖండాన్ని ఢీకొన్నప్పుడు హిమాలయ పర్వతాలు ఉద్భవించాయి. ఈ ఖండాంతర చలనం సంవత్సరానికి అర అంగుళం అనుకుంటే కోటి సంవత్సరాలలో ఎనభై మైళ్లు మాత్రమే ఉంటుందన్నమాట. ఈ కదలికలే భూకంపాలకు కారణాలు.

రాక్షస బల్లులు నశించాక పక్షులు, క్షీరదాలు-పాలిచ్చే జంతువులు జనించాయి. తొలి మానవరూపం రామఫిథికస్ 14 మిలియన్ సంవత్సరాల క్రితం పరిణామం చెందగా ఆస్ట్రోలో పిథికస్ (5 మిలియన్‌లు), హోమో ఎరక్టస్ (5 లక్షలు), హోమో సెపియన్స్ (రెండున్నర లక్షల సంవత్సరాలప్పుడు) జనించారు. తెలివిగల హోమోసెపియన్స్ నుంచి యూరప్ అంతా తిరుగాడిన నియాండెర్తల్స్ తెగ ఆఖరి మంచుయుగం కాలంలో అంతర్ధానం కాగా నవీన మానవుడు హోమోసెపియన్స్ రాజ్యం 35000 సంవత్సరాలప్పుడు మొదలై ఇప్పటికీ కొనసాగుతోంది.

## మాటలు నేర్చిన మనిషి

హోమోఎరక్టస్ (నిటారుగా నిలబడ్డవాడు) రెండు లక్షల సంవత్సరాల క్రితం ఆసియా, యూరప్, ఆఫ్రికాలలో తిరుగాడినట్లు నిదర్శనాలున్నాయి. అతని మెదడు పరిమాణం 1000 సి.సి. దగ్గర ఈనాటి మానవుడికున్నంత ఉండేది. ఏనుగులు, రైనోసారస్, గుర్రం, బైసన్, వాటర్‌బఫెలో, ఒంటె, అడవిపంది, గొర్రె, జింకలు వీటన్నిటిని చంపి తినేవాడు. చురుకుతనం, తెలివితేటలు పెరిగాయి. పనిముట్లను ఆయుధాలుగా వాడాడు. హోమోఎరక్టస్‌కు మాట్లాడడం తెలుసునని శాస్త్రజ్ఞులంటారు. కోతులకు స్వరపేటిక ఉన్నా మెదడులో మాటల కేంద్రం (స్పీచ్ సెంటర్) లేదు. దవడ కింద ఉండే స్వరపేటిక మెడ మధ్యలోకి రావడం వల్ల, ఎక్కువ ధ్వనుల్ని

పలకడానికి మానవులకు వీలు కుదిరిందంటారు. వేటలో తెగువ, చురుకు, నైపుణ్యం చూపడం మగవాళ్లకు అలవాటైంది. ఇంటిపట్టునే ఉండి వ్యవసాయం, పశుపోషణ, పిల్లలభారం ఆడవాళ్లపై పడిందని కొందరి అభిప్రాయం. ఈ పరిణామదశ చాలా లక్షల సంవత్సరాల నుంచి ఉండవచ్చు.

## జీవ సామ్రాజ్యానికి రారాజు

అయిదు లక్షల సంవత్సరాల క్రితం నిప్పుని వినియోగించడం, వండు కోవడం తెలుసుకున్నాక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఆఫ్రికా నుంచి ప్రారంభమైన మానవ పరిణామ దశ మంచుయుగం ఆటుపోట్లతో పదివేల సంవత్సరాల నాటికి చేరుకున్నది. భూ మండలాన్ని ఈనాడు క్షీరదాలలో (Mammals) అతిశక్తివంతమైన మానవజాతి శాసిస్తున్నది. 1. వేడి రక్తం, 2. అభివృద్ధి చెందిన పలువరుస, 3. గుడ్లకు బదులు తమను పోలిన చిన్నపిల్లలకు జన్మనివ్వడం, 4. తెలివితేటలు. అదే మానవుణ్ణి జీవ సామ్రాజ్యానికి రారాజును చేసింది. పెరిగిన మెదడు పరిమాణం (1500సిసి), చూపు, దృశ్యాలను అన్వయించుకునే శక్తి, జ్ఞాపకశక్తి, చేతులు, బొటనవేలు అభివృద్ధి చెందడం, రెండు కాళ్లపై నిలబడగలగడం, మెదడు ఎప్పటికీ నేర్చుకునే స్థాయిలో ఉండడం మానవునికి పరిణామ దశలో ఎంతో ఉపయోగపడింది.

## స్ఫింక్స్ మరణం... రాజైన ఎడిపస్

థెబెస్ నగరానికి వెళ్లే దారిలో మానవ శిరస్సూ, సింహం శరీరం, గంఢభేరుండ రెక్కలు ఉన్న 'స్ఫింక్స్' దారినపోయే వాళ్లను ఒక ప్రశ్న అడిగి సమాధానం ఇవ్వని వాళ్లను చంపి తినేసేది. అందుకే ఈ నగరానికి వెళ్లడానికి ప్రతివాళ్లూ జంకేవారు. ఒకరోజు 'ఇడిపస్' రాకుమారుడు ఆ దారిలో వెడుతుంటే స్ఫింక్స్ అతన్ని అటకాయించి అడిగింది– "ఉదయాన్నే నాలుగు కాళ్లతో, మధ్యాహ్నం రెండు కాళ్లతో, సాయంకాలం మూడు కాళ్లతో నడిచే జంతువు ఏది?" ఇడిపస్ ఆలోచించి– నీ ప్రశ్నకు సమాధానం 'మానవుడు' అని చెప్పగానే 'స్ఫింక్స్' సముద్రంలో పడి మరణించింది. ఇడిపస్ థెబెస్ నగరానికి రాజయ్యాడు.

✧✧✧✧✧

# 4. విశేషాల సమాహారం - పరిణామక్రమం

(వేల సంవత్సరాల క్రితం ఆటవికునిగా... ఒంటరి జీవనం చేసిన మానవుడు క్రమంగా సహజీవనం నేర్చుకున్నాడు. జ్ఞానం అంకురించింది. మాట నేర్చాడు. తొలుత వేటే ప్రధాన జీవనాధారం, ఆపైన వ్యవసాయం ప్రారంభించాడు. ఒక తరం నుంచి మరో తరానికి విజ్ఞానం ప్రసరించింది. వసుధైక కుటుంబానికి నాంది జరిగింది. పలు విశేషాలు నిండిన మానవజాతి పరిణామక్రమం...)

**"అసురాణాం హ్యేషో పనిత్ ప్రేతస్య శరీరం భిక్షయా వసనే**
**నాలంకారేణేతి సంస్కుర్వన్త్యే తేన హ్యయంలోకం జేష్యన్తోమన్యంతే"**

- ఛాందోగ్య ఉపనిషత్ - 8-8-5

దేవతల పక్షమున ఇంద్రుడు, రాక్షసుల తరపున విరోచనుడు ఆత్మ రహస్యాన్ని తెలుసుకొనే సంకల్పంతో ప్రజాపతి బ్రహ్మదేవుని కోసం 32 సంవత్సరాలు తపస్సు చేశారు. ప్రజాపతి వారికి ప్రత్యక్షమై, ఆత్మ గురించి తెలుసుకోవాలంటే పాత్రలోని నీటిలో మీ ప్రతిబింబాన్ని చూసుకోమని చెప్పారు. ప్రతిబింబమే ఆత్మగా గ్రహించిన విరోచనుడు ఆత్మ అంటే ఛాయ మాత్రమే. దానిని పూజిస్తే ఇహపర సుఖాలు కలుగుతాయని రాక్షసులకు బోధించాడు. అందుకనే అసురులు చచ్చినవారిని అన్నము, వస్త్రము, ఇతర అలంకారములతో పూజిస్తారు. ఇంద్రుడికి మాత్రం ప్రజాపతి సమాధానం సంతృప్తినివ్వలేదు. మరల మరల ప్రజాపతి వద్దకు వెళ్లాడు. మననము చేయాలి అనే జ్ఞానము కలిగినదే ఆత్మ అని గ్రహించాడు. ప్రత్యగాత్మ శరీరం నుంచి వెడలి పరంజ్యోతిలో లీనమై ప్రకాశిస్తుందని తెలుసుకున్నాడు. ఛాందోగ్య ఉపనిషత్తులోని ఈ కథ రాక్షసులు దేహాన్ని, దేవతలు ఆత్మను పరమాత్మ రూపాలుగా గ్రహించారని తెలుపుతున్నది.

## పూర్వ మానవుని కథ

డెబ్భై వేల ఏళ్ల క్రితం జర్మనీ ప్రాంతంలోని నియాండెర్త్ లోయలో నివసించిన పూర్వ మానవుని శాస్త్రజ్ఞులు 'నియాండెర్తల్ మాన్' అంటున్నారు. అతడు క్రిమియా, ఉజ్బెకిస్తాన్, జావా, చైనాలలో సంచరించాడు. ఫ్లింట్ రాతి కత్తులు, ఈటె మొనలు, గొడ్డళ్లతో జంతువులను వేటాడాడు. పైకి కఠినంగా, రాక్షసుడిలా కన్పించినా మెత్తని మనసు కలవాడు. చనిపోయిన తన సంబంధీకులను ఒక పద్ధతిలో గోయితీసి పాతిపెట్టి, పూలు, పరికరాలు పక్కనే ఉంచాడు. తన చేత చిక్కి, మరణించిన శత్రువుల దేహ భాగాల్ని ఆహారంగా కూడ వాడి, వాళ్ల శక్తియుక్తుల్ని పొందవచ్చుననుకుని ఉంటాడు. ఇటలీ, యుగోస్లేవియాలో దొరికిన మానవ కపాలాలన్నీ ఆ విధంగా ధ్వంసం చేయబడి ఉన్నాయి.

## సామూహిక జీవనం

ముప్పై వేల ఏళ్ల క్రితం మానవజాతిలో మరో శాఖ హోమోసెపియన్స్ అభివృద్ధి చెందే దశలోనే నియాండెర్తల్స్ అదృశ్యమవడం ప్రారంభమయ్యింది. క్రొమాగ్నాన్ (బిగ్‌హోల్) మాన్ అవశేషాలు ఫ్రాన్స్‌లోని ఒక పెద్ద గుహలో లభించాయి. 30000 – 20000 ఏళ్ల మధ్య కాలంలో మానవులలో ముఖ్యమైన నాలుగు తెగలు వృద్ధి చెందనారంభించాయి. 1. కాకసాయిడ్ – యూరోపియన్లు, ఇండియన్లు, 2. మంగోలాయిడ్లు – ఆసియన్లు, అమెరికన్ ఇండియన్లు, 3. నీగ్రోయిడ్లు – ఆఫ్రికన్లు, 4. ఆస్ట్రలాయిడ్లు – ఆస్ట్రేలియా ఆదిమ ప్రజలు. ముప్పై వేల ఏళ్ల క్రితం నుంచి హోమోసెపియన్స్ సెపియన్స్ ఒక్కరే మానవజాతిగా నాలుగు తెగలుగా ప్రపంచమంతా వ్యాపించారు. ఆఖరి మంచుయుగం పదివేల ఏళ్ల క్రితం అంతరించే సరికి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నాలుగు తెగల మానవుడు ప్రత్యేక రీతుల్లో పరిణామం చెందాడు.

అతి పదునైన రాతి కత్తులు, ఈటెల్ని వేగంగా విసరడానికి ఎముకతో పనిముట్లని, సూదుల్ని తయారు చేసుకున్నారు. చర్మంతో బట్టల్ని కుట్టడం, మట్టి గుంటలపైన మామత్ ఎముకలతో, చర్మంతో గూడారాల్ని వేసుకుని సామూహిక జీవనం ప్రారంభించాడు. చనిపోయినవారికి చర్మపు దుస్తులు, ఎముకలు, గవ్వలతో చేసిన అలంకరణలు, ఎర్రరంగు పొడితో మంత్రించినట్లు చేసి మట్టి గోతుల్లో పూడ్చి పైన పెద్దపెద్ద రాళ్లను ఉంచేవారు.

## ఆహారాన్వేషణ

జంతువుల్ని భయపెట్టి కొండ కొమ్ములపై నుంచి క్రింది లోయల్లోకి దూకేట్టు చేసి ఆహారాన్ని తేలికగా సంపాదించడం మొదలెట్టాడు. గుహల్లోని గోడలపై జంతువుల బొమ్మలు చిత్రీకరణ, రాతితో (వీనస్ ఆఫ్ విల్లెన్ డార్ఫ్), దంతంతో (వీనస్ ఆఫ్ లాసెక్) చేసిన విగ్రహాలు ఆనాటి ప్రజల ఆచార వ్యవహారాల్ని తెలియజేస్తున్నాయి. ఫ్రాన్స్‌లోని లాస్ కాక్స్, స్పెయిన్‌లోని అల్టామీరా గుహల్లోని కుడ్య వర్ణ చిత్రాలు ఆనాటి చిత్రకారుల పరిణితిని చూపించి, మనల్ని అబ్బురపరుస్తాయి. ఈ బొమ్మలు కళ కొరకు కాక, అలా గీయడం వలన మరింత ఆహారం లభిస్తున్నదన్న నమ్మకంతో చిత్రీకరించి ఉంటారని శాస్త్రజ్ఞులు విశ్వసిస్తున్నారు. తెలివితేటలు, సామూహికంగా వేటాడ్డం, ఎక్కడ... ఎప్పుడు వేట విజయవంతమవుతుందోనన్న అవగాహన, సంభాషణ, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం, జంతువుల అలవాట్లపై జ్ఞానం, ఇవి ఒక తరం నుంచి మరొక తరం మానవులకు అందసాగాయి.

## నేతలు రూపొందిన క్రమం

వారానికి పదిహేను గంటల పని, బోలెడంత తీరిక, సామాన్యమైన పనిముట్లు, ఖాళీ సమయమంతా నిద్రపోవడం, ఆడుకోవడం, తిండి గురించి

ఆలోచించడం. దాంట్లోకి మంత్ర తంత్రాలు వచ్చి చేరాయి. చంపిన జంతువుల చర్మాన్ని తగిలించుకుని నృత్యాలు చేయడం, వేటకు వెళ్లే ముందు, వచ్చిన తరువాత కేరింతలే. ముప్ఫై, నలభై మంది ఉన్న కుటుంబాలు, నాయకులు, సంబంధ బాంధవ్యాలు మొదలైనాయి. పదిలో ఒక్కడు నలభై ఏళ్లు బతికితే ఎక్కువ. ఎవరైతే ప్రకృతిని పరిశీలించి మొక్కలు, జంతువులను తమ అవసరాలకు, బాధల నివారణకు ఉపయోగపడే వాటిగా గుర్తించారో వాళ్లు తెగలో ముఖ్యులయ్యారు. గాయాలు, పళ్లనొప్పులు, వ్యాధులు కలవరం కలిగించే అంశాలు. వాటిని తగ్గించేవాడు ఆరాధనీయుడు.

## వేట నుంచి వ్యవసాయం దాకా

పదిహేను వేల ఏళ్ల క్రితం మంచు కరగడం మొదలైంది. క్రీస్తుపూర్వం 8000 సంవత్సరాల నాటికి ఉత్తర, మధ్య యూరప్‌లు మంచు తీవ్రత నుంచి విముక్తిని పొందాయి. మొక్కలు చెట్లై, అరణ్యాలుగా విస్తరించసాగాయి. మంచు కరిగి సముద్ర మట్టం పెరిగింది. భూ స్వరూపంలో మార్పు వచ్చింది. ప్రాచీన కాలపు సముద్ర తీరాలు మునిగిపోయాయి. నదులు కొన్ని ప్రవాహపు దిశను మార్చుకున్నాయి. కొన్ని అంతర్ధానమైనాయి. మామత్ లాంటి భారీ జంతువులు అదృశ్యమయ్యాయి. వేట పద్ధతులలో మార్పులు వచ్చాయి. చేపల్ని, నీటి పక్షుల్ని వేటాడ్డానికి క్రీస్తుపూర్వం 7500–6200 నాటికి కొయ్య దుంగని తొలిచి దోనెను పడవగా వాడడం మొదలయ్యింది. గాలాలు, బాణాలు, ఈటెలు పనిముట్లుగా కాగా కుక్క మొదటి పెంపుడు జంతువై వేటకు తోడ్పడింది. యుగోస్లేవియాలోని డాన్యూబ్ నదీ తీరంలో క్రీస్తుపూర్వం 5000 సంవత్సరాలకు ముందే ఉన్న వెపెన్ స్కీవీర్ అనే ప్రదేశంలో 59 ఇళ్లు, ఇంటి మధ్యలో చేప, కప్ప రూపంలో ఉన్న విగ్రహాలు లభ్యమయ్యాయి. ఇజ్రాయిల్ ప్రాంతంలో 'నాటుఫియన్స్' అని పిలవబడ్డ ప్రజలు తమ నాయకుడైన 'ఐనాన్'ను మరణానంతరం హెర్మాన్ కొండ వేపు కూర్చుని చూస్తున్నట్లు ఉంచి సమాధి చేశారు. వీళ్లే ఆహారం కోసం అడివి గడ్డిని పెంచడం ప్రారంభించారు. వ్యవసాయం మొదలైంది.

## అంతా ఓ తల్లిబిడ్డలే

లక్షా యాభై వేల సంవత్సరాల క్రితం కొన్ని వేల సంఖ్యలో జనాభా మాత్రమే ఉన్న హోమోసెపియన్స్ సెపియన్స్ ఆఫ్రికా నుంచి విస్తరించసాగారు. మైటోకాండ్రియల్ డి.యన్.ఏ. స్త్రీ జాతి నుంచి బిడ్డలకు, 'వై' క్రోమోజోమ్ మగవారి నుంచి కొడుకులకు తరతరాలుగా అందివస్తూనే ఉంది. అప్పుడప్పుడూ సంభవించే మ్యుటేషన్లు మానవ జాతిని పరిణామ దిశవేపు నడిపిస్తున్నాయి. మానవజాతి అంతా ఒక తల్లి బిడ్డలేనని నిరూపణ అవుతూ వసుధైక కుటుంబాన్ని తలపింపచేస్తున్నది.

✧✧✧✧✧

# 5. మానవ జన్మరహస్యం

(మానవ జన్మకు మూలం ఏమిటనే అంశంపై ఎన్నో కథలున్నాయి. ఒక్కో దేశంలో ఒక్కో నమ్మకం. జన్మ రహస్య శోధనలో మానవుడు ఎన్నో ఊహలకు చక్కని రూపం ఇచ్చాడు. పరమేశ్వరుని ప్రసాదమే ఈ మానవ జన్మ అని చాలామంది విశ్వసిస్తారు. వివిధ దేశాల్లో మానవజన్మ రహస్యాల గురించి ప్రచారంలో ఉన్న ఆసక్తికరమైన అంశాలు...)

'అన్ని జన్మలలోకెల్లా సర్వోత్కృష్టమైనది మానవ జన్మ' అని మన నమ్మకం. పరమేశ్వరుడే ఈ సంపూర్ణ విశ్వాన్ని సృష్టించి, రక్షించి ప్రళయకాలంలో నాశన మొనరిస్తాడని అన్ని మతాల వారూ నమ్ముతారు.

## ఆది సృష్టిక్రమం

సృష్టి ఆ పరమేశ్వరుని సంకల్పము వలన జరిగింది. ఈశ్వరుని నిశ్చయము నుండి కాలము, స్వభావము, కర్మముల నుండి వరుసగా గుణము, పరిణామము, జన్మము కలిసి అహంకారము లేదా 'నేను' అనే జీవ తత్త్వము ఏర్పడింది. దానిలోని తామసతత్త్వము నుంచి ద్రవ్యము, దాని నుండి శబ్ద లక్షణంతో ఆకాశం, శబ్ద స్పర్శనముల వాయువు, శబ్ద స్పర్శ రూపములతో అగ్ని (తేజస్సు), శబ్దస్పర్శ రూప రసములతో జలం, శబ్ద స్పర్శ రూప రస గంధ సమన్వితమై భూమి ఏర్పడ్డాయి. రాజసాహంకారము నుంచి క్రియానుకూలమైన దశేంద్రియాలు బుద్ధి, ప్రాణం ఏర్పడ్డాయి. సత్త్వ అహంకారం నుంచి జ్ఞానం, దిశ దేవతలైన దిక్కులు, వాయువు, సూర్యుడు, ప్రచేతస్సు, వహ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, మిత్రుడు, ప్రజాపతి జన్మించారు. ఇది ప్రాకృత సర్గము.

## జన్మ... పునర్జన్మ

బ్రహ్మాండం చేతనా చేతన అవస్థలో ఉన్నప్పుడు పరమాత్మ దానిలో ప్రవేశించగా లోకసృష్టి, శుక్రార్తవముల సంయోగమైన అండములో జీవాత్మ ప్రవేశించగా జీవసృష్టి జరుగుతుంది. జలమునందున్న నిర్జీవ పదార్థములు ప్రకాశవంతుడైన ఈశ్వరుని కాంతికిరణాలచే జీవాన్ని పొంది తమ తమ ఆయుః పరిమాణమున్నంత కాలం జీవించి ప్రకృతిలో లీనమై ప్రాథమిక దశను చేరుకుంటాయి. మరలా సృష్టి సామాగ్రిలో భాగమై కొత్త రూపాన్ని పొందడమే పునర్జన్మ.

మొక్కలు, 28 రకాల భూ, ఆకాశ, జల చరాలున్న తిర్యక్‌సర్గము, మనుష్యులు (దుఃఖము నందుండి సుఖము కోరుకునేవారు) కలిసి వైకృత సర్గము. ప్రాకృత,

వైకృత సర్గములు కలిసినది మానవ సర్గము. దేవ సర్గము 1. విబుధ, 2. పితృ, 3. సుర, 4. గంధర్వ, అప్సరస, 5. యక్షరాక్షస, 6. భూతప్రేత పిశాచాలు, 7. సిద్ధ, చారణ, విద్యాధరులు, 8. కిన్నెర కింపురుషులు, 9. సనత్కుమారాది కౌమార సర్గముతో కూడి యున్నదని ప్రాచీనుల నమ్మకం.

**'కారణాను విధాయిత్వాత్ కార్యాణాం తత్స్వభావతా**
**నానా యోన్యాకృతిః సత్వో ధత్తేతో ద్రాత లోహ్వత్'**

జీవాత్మ ఒకటే అయినా వేర్వేరు జీవ గర్భములందు చేరినప్పుడు కారణ భేదం వల్ల వేర్వేరుగా ప్రవర్తించునని అష్టాంగ హృదయము నందు వాగ్భటుడు వివరించాడు.

## వివిధ దేశాల విశ్వాసాలు

మానవ జననం గురించి ఇతర దేశాల ప్రజలు ఏమనుకుంటారో చూద్దాం. ఆఫ్రికాలోని ర్వాండా తెగ స్త్రీలు తమ మంచాల పక్కనే కాసిన్ని మంచినీరుండేట్లు జాగ్రత్తపడతారు. ఎందుకంటే రాత్రిళ్లు దేవుడు పిండాల్ని తయారుచేసి గర్భసంచిలో ఉంచేప్పుడు నీరు అవసరంగనక. సూడాన్‌లోని 'డింకా' ప్రజలు మనం కుండలు, ఆట బొమ్మలు చేసినట్లే దేవుడు మనుషుల్ని తయారు చేస్తాడని నమ్ముతారు. ఆసియాలో కొన్నిచోట్ల ప్రజల విశ్వాసం ఏమిటంటే దేవుడు మొదటి మానవుణ్ణి మట్టితో తయారు చేసి కపాల రంధ్రం ద్వారా జీవాత్మను ప్రవేశపెట్టాడని. ఐతరేయ ఉపనిషత్తులో దీనినే 'విదృతి' అని వివరించారు.

## మట్టినుంచి మానవుడు

మట్టినుంచి తయారు చేసిన బొమ్మలోకి ప్రాణాన్ని ఊదడం అనే ప్రక్రియ హీబ్రూల విశ్వాసంలోనూ, బైబిల్ పాత, కొత్త నిబంధనలలోనూ కనిపిస్తుంది. హీబ్రూల విశ్వాసం ప్రకారం దేవుడు మొదట ఆదాం (ఏడం), లిలిత్‌లను సృజించాడని. అయితే లిలిత్ (స్త్రీ) ఆదాంకు విధేయురాలిగా ఉండడానికి ఇష్టపడక ఎర్ర సముద్రం వేపు వెళ్లిపోయిందని, ముగ్గురు దేవదూతలను పంపినా తిరిగి రానందువల్ల, దేవుడు ఆదాం పక్కటెముక నుంచి అవ్వ (ఈవ్)ను తయారు చేసాడని నమ్ముతారు. క్రైస్తవులు, దేవుడు మానవుణ్ణి తన రూపంలోనే తయారు చేసాడని విశ్వసిస్తారు. ఉత్తర అమెరికాలోని 'హోపి' ఇండియన్లు సాలీడు దేవత మట్టి నుంచి మనిషిని తయారు చేసిందని నమ్ముతారు. పశ్చిమ ఆఫ్రికాలోని కొన్ని తెగలు జీవ వృక్షం నుంచి మనుషులు పుట్టారని నమ్మితే అజాండే (ఆఫ్రికా) తెగవారు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు,

మనుషులు, రాత్రి, చల్లదనం ఇవన్నీ ఒక పడవలో ఉంచి మూసివేయగా, సూర్యుడి వేడిమికి పైకప్పు కరిగిపోగా అన్నీ బయటపడ్డాయని విశ్వసిస్తారు.

## పండోరా బాక్స్

సముద్రంలో కొట్టుకు వచ్చిన రెండు చెక్కల నుంచి ఒడిన్ దేవుడు స్త్రీ, పురుషుల్ని తయారుచేసాడని వైకింగుల నమ్మకం. ప్రొమిథియాస్ మట్టి నుంచి ఫెనాన్ అనే మొదటి మానవుణ్ణి తయారు చేస్తే అతనిని శిక్షించడానికి 'జ్యూస్' ఆది దేవత, విశ్వకర్మ హెఫాస్టియాస్ సాయంతో 'పండోరా' అనే అందాలరాశి (మొదటి మానవ స్త్రీ)ని మట్టినుంచి తయారుచేసి, మూత తెరవవద్దని ఓ కలశాన్ని (పండోరా బాక్స్) ఇస్తే ఆమె కుతుహలాన్ని అణుచుకోలేక మూత తీయగానే వ్యాధులు, మృత్యువు భూమిపైకి వచ్చాయని, వెంటనే మూత మూయడం వలన 'పండోరా బాక్స్'లో మిగిలివున్న 'ఆశ'తోనే మానవులు తమ జీవితాల్ని కొనసాగిస్తారని గ్రీకులు నమ్ముతారు.

## జలప్రళయం - దైవానుగ్రహం

జల ప్రళయం తరువాత మానవజాతి అంతా నశించిపోయినా దైవానుగ్రహంతో నోవా (హీబ్రూ, క్రిస్టియన్, ముస్లిం) ఉత్నాపిష్టం (అసురో బాబిలోనియన్లు) సత్యవ్రతుడు (హిందువుల మనువు), యావో పిల్లలు (చైనా) డ్యూకాలియాన్ (ప్రొమోథియాస్ పుత్రుడు-గ్రీకు ఇతిహాసాలు) పడవ (ఆర్క్)లో, సొరకాయ బుర్ర (గౌర్డ్)లో బతికి బయటపడి మానవజాతిని మరల అభివృద్ధి చెందించారని ప్రాచీన గ్రంథాలు చెబుతున్నాయి. డ్యుకాలియాన్ తన భార్య పైర్రాతో కలిసి, జల ప్రళయం తగ్గిన తరువాత, దేవుని ఆజ్ఞ మేరకు వెనక్కు తిరిగి చూడకుండా తమ భుజంపై నుండి రాళ్లను నీళ్లలోకి విసుర్తూ పోతున్నప్పుడు డ్యుకాలియాన్ విసిరిన రాళ్లు మగవాళ్లుగా, పైర్రా విసిరిన రాళ్లు ఆడవాళ్లుగా మారాయట!

## దేవతల క్రీడావినోద ఫలం

ప్లాటో కథనం ప్రకారం దేవతల క్రీడా వినోదంలో భాగంగా ఒక వింత జీవిని రెండు తలలు, నాలుగు కాళ్లు, నాలుగు చేతులు, రెండు రకాల జననాంగాలతో సృష్టించగా, అమిత బలశాలియైన ఆ జీవి అందర్నీ చికాకు పెట్టిందనీ, అప్పుడు జ్యూస్ దేవుడు ఆగ్రహంతో ఆ జీవిని రెండుగా చీల్చి వేరుచేసి ఆడ, మగ మనుషులుగా తయారు చేసాడని, అందుచేతనే తనకు సరైన అర్థభాగం కొరకు మానవ ఆడ, మగా ఇలా తాపత్రయపడతారని, దొరకగానే ఒకటైపోతారని అంటారు.

## మంచి తల – మంచి జీవితం

ఆఫ్రికాలో యోరుబా తెగలోని వారు భూమి మీద ఉందామనుకున్న ప్రతి ఆత్మకు ఒక తల అవసరం అని నమ్ముతారు. వాళ్ల స్వర్గంలో 'అజాలా' అనే విశ్వకర్మ ఇంట్లో రకరకాల తలలు చీకటి గదిలో గోడలకు తగిలించి ఉంటాయి. భూలోకం వెళ్లి స్వేచ్ఛగా బతుకుదామనుకున్న వాళ్లు అక్కడ్నించి ఒక తల తీసుకుని ప్రయాణం చేయాలి. అయితే 'అజాలా'కు అప్పుల గొడవ. ఒక పట్టాన దొరకడు, తొందరలో ఉన్నవాళ్లు అతగాణ్ణి అడక్కుండానే ఏదో ఒక 'తల' తీసుకుని భూ మార్గం పడతారు. దారిలో గాలివానలకు, పిడుగులకి తల ఖరాబైతే భూమ్మీదకు వచ్చాక సంపాదించిందంతా 'తల' రిపేర్లకే ఖర్చయిపోతుంది. కనుక ఓపికతో విశ్వకర్మను ప్రసన్నం చేసుకుని మంచి 'తల'తో భూమ్మీదకు వస్తే సుఖ సంతోషాలకు కొదవ ఉండదట. జన్మ యాదృచ్ఛికం కాక ఎవరితలను వాళ్లే ఎన్నిక చేసుకోవడం ఈ తెగ సిద్ధాంతం ప్రత్యేకత. మానవ జన్మకు ఇన్ని రూపాల్ని ఊహించిన మానవులకు మన జోహార్లు అందించకుండా ఉండలేం గదా!

✧✧✧✧✧

# 6. అమ్మలగన్నయమ్మ

(వేల సంవత్సరాలుగా ప్రతి ఒక్కరి ఆరాధ్యదైవం అమ్మలగన్న అమ్మ... ముగురమ్మల మూలపుటమ్మ... ఆ మహాదేవి. ఒక్కో దేశంలో ఒక్కో రీతిగా ఆమె పూజలందుకుంటున్నది. సంతానానికి, సిరిసంపదలకు, శృంగారానికి... సృష్టిలోని సమస్త విషయాలకు అధిదేవి ఆమె. ఆలయంలో దుర్గగా పూజలందుకున్నా, పల్లెలో చెరువుగట్టున, రావిచెట్టు కింద గ్రామదేవతగా కైమోడ్పులందుకున్నా ఆమెకు ఆమే సాటి. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లే ఆ మహాదేవి గురించి...)

**"మహనీయ గుణాస్పదయై మహిలో నాదేవి జననము మన్నింపంగా**
**బహునామ నివాసంబుల బహునామములం జరించె భద్రాత్మికయై"**

ఆ మహాదేవతా స్వరూపం జనులందరికీ సుపరిచితం. సంతానలక్ష్మిగా, అష్టలక్ష్ములుగా ఆమె ఆరాధ్యదైవమైనది. "అమ్మల గన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలా పెద్దమ్మ సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ" – ఆమె. 25 వేల ఏళ్ల క్రితమే అంటే రాతియుగపు కాలంలోనే పూజలందుకున్న తొలి దేవత. ఫ్రాన్స్ నుంచి సైబీరియా వరకు పూజలందుకున్న మహాదేవత ప్రతిమామూర్తులు అరవైకి పైగా లభ్యమయ్యాయి. శృంగారదేవతగా కొన్నిచోట్ల, సంతానదేవతగా మరికొన్ని సందర్భాల్లో, పాడిపంటలనిచ్చే తల్లిగా ఆమె పూజలనందుకొన్నది. తొలి గ్రామాలుగా చరిత్రకెక్కిన టర్కిలోని సటాలహుయెక్, 'ఇండస్ వాలీ'లోని 'మొహెంజదారో'లలోని విగ్రహాలు 20 వేల ఏళ్లక్రితం నాటివి. తొలి నాగరికతలో మహాదేవతకు ఉన్న ప్రాముఖ్యం ఎనలేనిది.

## అంతటా అమ్మే

ఏండియన్ ప్రజలు భూమిని అమ్మతల్లిగా కొలిచేవారు. 'పచమామా' తల్లి అన్ని జీవులకు మాతృకగా, పుట్టిన ప్రతి జీవి ఆమె ఒడిలో పెరిగి, చివరకు ఆమెలోనే కలిసిపోతుందనే వారు భావించేవారు. వ్యవసాయం ప్రారంభమై పదివేల ఏళ్లయిందని పురాతత్వవేత్తలు చెబుతున్నారు. రాతియుగం నాటి అమ్మతల్లి ఇక్కడ ధాన్యలక్ష్మిగా రూపుదాల్చింది. రుతువులలో వచ్చే మార్పు దేవతల రూపాల్లో మార్పును తెచ్చింది. సుమేరియన్లకు ఆమె 'ఇన్నాన్నా', బాబిలోనియన్లకు ఇస్తార్; ఫ్రిజియన్లకు అనటోలియా సైబలి; సిరియా, లెబనాన్‌లలో ఎస్ర్తాతె; గ్రీకులకు ఆర్టెమిస్, ఎఫ్రొడైట్, డిమిటర్; రోమన్లకు గైయా, సిరిస్, టెల్లస్. అందరికీ ఆమె మహాశక్తిరూపిణి. అమ్మతల్లి. క్రమేపి ఆమె ఆధునిక మతాల్లో ప్రత్యేక ఆరాధనామూర్తిగా మారింది. చైనీయులకు ఆమె గ్వాన్‌ఇన్. కరుణామయి. త్యాగశీలి.

## సరిజోడు దేవుడు

పితృస్వామ్యం వచ్చేసరికి ఆమెకు సరిజోడు దేవుడు వచ్చాడు. ఇనానాకు దుముజ్, సైబిలికి ఏటిస్, ఎఫ్రొడైట్‌కు ఎడొనిస్, ఐసిస్‌కు ఒసిరిన్. ఈ ఆదిదంపతుల కలయిక సంతానానికి, సౌభాగ్యానికి ప్రతీక అయింది. రుక్మిణీదేవి గౌరీదేవికి మొక్కి ఇలా ప్రార్థిస్తుంది.

> **"నమ్మితి నామనంబున సనాతనులైన యుమామహేశులన్**
> **మిమ్ము పురాణ దంపతుల మేలు భజింతు గదమ్మ మేటి పె**
> **ద్దమ్మ దయాంబు రాశివి గదమ్మ హరిం బతి జేయు మమ్మనిన్**
> **నమ్మినవారి కెన్నడును నాశము లేదు గదమ్మ ఈశ్వరీ..."**

దీని భావం దేశప్రజలకు యుగయుగాల పరంపరాగమమే!

క్రమేపి ఆరాధనా భావంలో శృంగారపు వైపరీత్యం ఎక్కువై విశృంఖలతా ధోరణులు రాసాగాయి. సైబిలీ పూజారులు ఉత్సవాల్లో రక్తం చిమ్మేలా కొట్టుకోవడం, అంగ విచ్ఛేదనలూ, బలులూ దేవతా ప్రీత్యర్థం నిర్వహించేవారు. అనటోలియన్ అమ్మతల్లి 'మా' అక్కడా ఇటువంటి పూజలూ, బలులూ ఉండేవి.

## గ్రామీణుల గుండెచప్పుడు

కాలక్రమేణా త్రిమూర్తులూ వారి సతులూ పురాణాల్లో పూజల్లో ప్రముఖ స్థానానందుకొన్న పల్లెటూళ్లల్లో గ్రామీణులచే కొలువబడే దేవతలు అమ్మతల్లి ప్రతిరూపాలే. చెట్ల కింద, చెరువు గట్ల దగ్గర, చిన్నచిన్న గుట్టల దగ్గర, ఊరి పొలిమేరల్లో మైసమ్మ, పోచమ్మ, గంగాణమ్మ, బతుకమ్మ ఇత్యాది దేవతల పేర్లతో మన దేశాన అమ్మతల్లి పదివేల ఏళ్లుగా ప్రాచుర్యంలోనే ఉన్నది. గ్రామీణుల గుండె చప్పుడు ఆ దేవత. పేదల పాలిట పాలవెల్లి, మహిళల స్వప్నాల కల్పవల్లి ఆ అమ్మతల్లి.

✧✧✧✧✧

# 7. స్త్రీ, పురుషుల జననం సృష్టి లీలా వినోదం

తద్ధేదం తర్హ్య వ్యాకృత మాసీత్ తన్నామ రూపాభ్యామేవ వ్యాక్రియా తాసౌ నామాయ మిదగ్ం రూపం ఇతి... ఈ సమస్త సృష్టి మొదట అవ్యక్తంగా ఉండేది. ఇది నామరూపముల వలన వ్యక్తం అవుతున్నది. కత్తి ఒరలో ఉన్నపుడు కనపడనట్లు విశ్వంభరమూర్తి అయిన ఆ పరమాత్మ జగద్వస్తువులన్నింటిలో తాను కనపడకనే నిండి ఉన్నాడని బృహదారణ్యకోపనిషత్‌లోని ఈ శ్లోకానికి అర్థం. ప్రజాపతి ఒంటరిగా ఉన్నపుడు తృప్తి చెందక తనను తాను సతి, పతి అనే రెండు భాగాలుగా చేసుకున్నాడు. అందుకే మనిషి చీల్చిన వెదురుబొంగును (అర్థబృగలం యివ) పోలి ఉన్నాడని యాజ్ఞవల్క్య ఋషి చెప్పాడు. పురుషుని అర్థభాగం స్త్రీ వల్ల సంపూర్ణం అవుతుంది. అలాంటి స్త్రీ, పురుషులు ఇరువురి వలన మనుషులు, ఇతర జంతువులు పిపీలికాది పర్యంతం సృజించబడింది. ఈ విషయాన్ని ప్లేటో ఇలా వివరించాడు.

## స్త్రీ, పురుషుల సృజన

దేవతలు ఒకరోజున వినోదం కోసం ఒక విచిత్ర రూపాన్ని సృష్టించారు. ఆ రూపానికి నాలుగు కాళ్లు, నాలుగు చేతులు, రెండు తలలు, రెండు విధాల జననాంగాలు ఉండేలా మిథునరూపంగా జన్మ ఇచ్చారు. పుట్టిన వెంటనే అతడు రెండు కాళ్లతో విశ్రాంతి తీసుకుంటూ, రెండింటితో ఎవరికీ అందకుండా పరుగెత్త సాగాడు. బంతిలా దొర్లుకుంటూ, అడ్డువచ్చిన వారిని నాలుగు చేతులతో ఆయుధాలు తీసుకొని కొట్టసాగాడు. తనకున్న మిథున లక్షణాలతో తనకు తానే స్త్రీగా, పురుషునిగా ఉండి తనలాంటి వారిని సృజించడానికి ప్రయత్నించాడు. దీంతో దేవతలు భయపడ్డారు. పదునైన ఆయుధంతో ఆ వింత వ్యక్తిని రెండుగా చీల్చి, స్త్రీ, పురుషునిగా విడదీశారట. అందుకే మనిషి తనకు సరియైన అర్థభాగం లభించగానే వెంటనే ఆమెను చేరతాడని ప్లాటో వివరణ.

## ఒక్కో నాగరికతలో ఒక్కో విశ్వాసం

దేవతల కష్టాల తట్టను (లేబర్ బాస్కెట్... శ్రమ సంచులు) మోయడానికి మానవులు సృష్టించబడ్డారని సుమేరియన్లు నమ్మేవారు. చైనీయుల దేవత 'న్యూగ్వా' ఒంటరిగా ఉండి భయపడింది. ఆమెకు మనిషి తల, పాము శరీరం ఉండేవి. నీటిలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ, ఆమె గరికపోచతో తడి మట్టిని విదిలించినపుడు ఆ మట్టి నుంచి మనుషులు పుట్టారంటారు. ఏథెన్స్ వాసుల నమ్మకమేమంటే హెఫెస్టాస్

(అగ్నిదేవత) ఏథెనె దేవతను బలాత్కరించబోయినపుడు వీర్యం భూమిపై పడగా, దాని నుంచి ఎరిక్థోనియస్ అనే సర్పరూపుడు జన్మించాడని, అతని నుంచి మానవ జాతి అభివృద్ధి చెందిందని అనుకునేవారు. థెబెస్ నగర కథనం ప్రకారం కాడ్మియస్ అనే రాజు ఒక మహాసర్పాన్ని చంపి దాని పళ్లని, కోరల్ని నేలపై నాటాడట. వాటి నుంచి జన్మించిన యోధులు ఒకరినొకరు చంపుకోగా అయిదుగురే మిగిలారని, వారిని స్పార్టాయి (విత్తగా మొలచిన వీరులు) అని పిలిచేవారు. వారి నుంచే థెబెన్స్ రాజ కుటుంబాలు వృద్ధి చెందాయంటారు.

## 'పండోరా' పెట్టె తెచ్చిన తంటా

గ్రీకులకు పెలాస్గస్ మొదటి మానవుడు. అతడు పెలొపొనిస్ ప్రాంతపు ఆర్కడియా నేల నుంచి పుట్టాడని అతని వంశస్థులను పెలాస్జియన్లని పిలిచేవారు. ఇంకో ప్రసిద్ధికెక్కిన కథనం ప్రకారం ప్రొమెథియస్ అనే టైటాన్ తనవాళ్లు అధిదేవుడైన జ్యూస్ చేతిలో పరాజయం పొందడాన్ని సహించలేక, ఫెనాన్ అనే తొలి మానవుణ్ణి సృష్టించాడు. మానవులు వృద్ధి చెందడం గమనించిన జ్యూస్ కోపించి అగ్ని, వెలుతురు మానవులకు అందకుండా నిషేధిస్తే, ప్రొమెథియస్ మెంతిపూల మధ్య అగ్నిని దాచి మానవులకు ఇచ్చాడు. జ్యూస్ దేవుడు కోపంతో, హెఫాస్టిస్ అగ్నిదేవుడిచే 'పండోరా' అనే మానవ స్త్రీని సృష్టించి, ఆమెకు ఒక పెట్టెను ఇచ్చి, మూత తెరవద్దని ఆజ్ఞాపించి భూలోకానికి పంపారు. భూలోకానికి అప్పుడు ప్రొమెథియస్ సోదరుడు ఎపిమెథియస్ రాజు. అతడు పండోరాను ఆహ్వానించి ఆశ్రయమిచ్చాడు. కుతూహలాన్ని ఆపుకోలేక పండోరా ఆ పెట్టె మూత తెరవగా పెట్టెలోని చెడుపనులు, వ్యాధులు, మృత్యువు బయటకు వచ్చాయి. విషయం గమనించిన ఆమె వెంటనే పెట్టెమూతను మూసివేసిందట. పెట్టెలో నుంచి వెలికి వచ్చిన మృత్యువు, వ్యాధులు, చెడు పనులు మానవులను పీడించగా. పెట్టెలోపల ఉన్న 'ఆశ'తో మానవులు జీవిస్తారని గ్రీకుల నమ్మకం. ఉత్తర అమెరికాలోని పానీ తెగవాళ్ల నమ్మకమేమిటంటే తిరవా దేవుని ఆజ్ఞ ప్రకారం చంద్రుడు, సూర్యుడి కలయికతో మొదటి మగవాడు జన్మించాడట. ఉదయ నక్షత్రం, సాయంకాల నక్షత్రం కలవగా మొదటి స్త్రీ జన్మించిందట. వాళ్ళ నుంచి మానవ జాతి అభివృద్ధి చెందిందని వారి విశ్వాసం.

## ఆకాశం నుంచి నేలకు

'మాయా' ప్రజలు, మొదటితరం మానవులు మట్టి నుంచి సృష్టించబడినా వాళ్లకు మనసు లేదు కనుక నశించారని, రెండవతరం చెక్క నుంచి పుట్టినా, ఆత్మలేదు కనుక వరదల్లో కొట్టుకుపోయారని, ప్రస్తుత తరం తెల్ల, పచ్చ మొక్కజొన్నల నుంచి దైవానుగ్రహం వల్ల సృష్టించబడినారని నమ్ముతారు. మెక్సికోలోని 'ఇంకా' ప్రజల

దేవుడు 'విరకోచా'. మొదటితరంలో అంధకారంలో త్రికే మహాకాయుల్ని రాతి నుంచి తయారు చేయగా వాళ్లు దేవుని మాట వినకపోవడంతో తిరిగి రాళ్లుగా మార్చేశారట. రెండోసారి మట్టి నుంచి మనుషుల్ని తయారు చేసి, వివిధ రకాల ఆచారాల్ని, భాషల్ని, పాటల్ని ఇచ్చి ప్రపంచమంతటా వెదజల్లాడట. కొలంబియా ప్రాంతపు చిచ్చా తెగవాళ్లు మట్టి నుంచి తొలి మగవాళ్లని, రెల్లు గడ్డి నుంచి ఆడవారిని సూర్యచంద్రులు తయారు చేశారని నమ్ముతారు. చోకో తెగవారు మొదటి తరం మనుషులు నరమాంసం తినడం వల్ల దేవుడు వారిని నిర్మూలించాడని, రెండవతరం వారిని జంతువులుగా, మూడవతరం వారిని మనుషులుగా మట్టి నుంచి తయారుచేశారని నమ్ముతారు. ఒరినోకో, టోబా తెగవారు మనుషులు తొలుత ఆకాశంలో సంచరించే వారని, ఒకసారి నేలపై దిగిన తర్వాత ఇక్కడే ఉండిపోవలసి వచ్చిందని విశ్వసిస్తారు.

## జ్ఞానమే మూలశక్తి

ఆఫ్రికాలోని బంబరా తెగవారు ఈ ప్రపంచమంతా శూన్యం నుంచి ఆవిర్భవించిందని, దాని నుంచి గ్లాగ్లాజో అనే జ్ఞానం పుట్టిందని, అదే మూలశక్తి అని భావిస్తారు. దీనిలో స్త్రీ పురుషశక్తులు మిథునంలాగా ఉంటాయి. పెంబా, ఫారో అనే దివ్యాత్మలు ప్రకృతిని, జీవజాతిని సృష్టిస్తాయని విశ్వసిస్తారు. టాంజానియా, కీన్యాలలో భూమ్యాకాశాల మధ్య ఉన్న పెద్ద తాడు సాయంతో మానవుడు నేలపైకి దిగి వచ్చాడని నమ్మకం. దక్షిణాఫ్రికాలోని జులూస్ తెగవారు తమ మొదటి రాకుమారుడు దేవుని పుత్రుడని, దేవుని తిరస్కారంతో ఆకాశంలోని రంధ్రం ద్వారా బొడ్డుతాడుతో నేలపైకి దిగివచ్చాడని నమ్ముతారు. ఒక నెల గడిచిన తర్వాత జాలిగొన్న దేవుడు రాకుమారుడికి తోడుగా రాకుమార్తెను పంపి ఆకాశరంధ్రాన్ని పూడ్చే ముందు బొడ్డుతాడు తీసేసాడని విశ్వసిస్తారు.

పరిశుద్ధ గ్రంథం బైబిల్‌లోని ఆదికాండం అందరకు తెలిసిందే. "ఆరవరోజున దేవుడు మానవుని సృష్టించి సమస్త జీవజాలముపై ఆధిపత్యము నొసంగెను". ఇవీ మానవ జన్మ గురించి ఆనాటి ప్రజలలో ఉన్న కొన్ని నమ్మకాలు.

**విజానన్నేవ సత్యం వదతి**
**విజ్ఞానన్త్వేవ విజిజ్ఞాసి త తవ్యమితి...**

సత్యాన్ని దర్శించిన వాడు మాత్రమే సత్యాన్ని మాట్లాడగలడు. అందుకే విజ్ఞానాన్ని కోరుకోవాలి అంటుంది ఛాందోగ్యోపనిషత్.

✧✧✧✧✧

# 8. సూర్యాయ నమః

(జగతికి మార్గదర్శకుడు సూర్యభగవానుడు. ప్రాణికోటికి జీవాధారమై, అందరి కైమోడ్పులు అందుకుంటున్న సూర్యభగవానుడి గురించి పలు ఉపనిషత్‌లలో విశేషమైన ప్రశస్తి ఉంది. సూర్యచంద్రులను పూజించాలని, అద్భుతమైన తేజంతో జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలంటున్న ఉపనిషత్‌లలోని సూర్య, వాయు, అగ్నుల గురించి...)

**పూషన్నే కర్షేయషు సూర్య ప్రాజాపత్య**
**వ్యూహ రశ్మీన్ సమూహ తేజః**
**యత్తే రూపం కల్యాణతమం తత్తే పశ్యామి**
**యోసా వసౌ పురుషః సోహమ అస్మి**

– ఈశావాస్య. 16

ఓ సూర్యదేవా! ప్రపంచాన్ని పోషించేవాడా! న్యాయ నిర్ణేతా! ప్రజాపతి కుమారుడా! నీ కాంతి వలయాల్ని తొలగించు. సత్య స్వరూపమైన నిన్ను దర్శించు కుంటాను. నేను కూడా నీ అంతటి వాడినే.

**వాయురనిల మమృత మథేదం భస్మాంతగ్ శరీరమ్**
**ఓం క్రతోస్మర కృతగ్‌స్మర క్రతోస్మర కృతగ్ స్మర**

ఈ శరీరంలో ఉన్న ప్రాణవాయువు సర్వాత్మక ప్రాణంతో లీనం అగుగాక! ఓ మనసా! గుర్తు తెచ్చుకో. నీవు ఇదివరకు చేసిన కర్మలను గుర్తు చేసుకో.

**అగ్నేనయ సుఫథరాయే అస్మాన్**
**విశ్వాని దేవవయునాని విద్వాన్**
**యుయోధ్య స్మజ్జుహూరాణమేనో**
**భూయిష్టాంతే నమ ఉక్తిం విధేయ**

'ఓ అగ్నిదేవా! అన్నీ తెలిసినవాడవు. మమ్మల్ని సన్మార్గంలో నడిపించు. మా చెడు ఆలోచనలను భస్మం చేయి. మేం నీకు మళ్లీ మళ్లీ నమస్కరిస్తున్నాం.' ఈ ప్రార్థనతో ఈశావాస్య ఉపనిషత్తు సమాప్తమవుతుంది.

### మనిషికి తోడు అగ్ని

ఆత్మ–మనసు–ప్రాణం ఇవి సూక్ష్మ ప్రపంచంలోనివి. సూర్యుడు, అగ్ని, వాయువులు స్థూల ప్రపంచానికి సంబంధించినవి. కనబడని మహాబంధాలు వాటిని కలుపుతూ ఉంటాయి. చరాచర జగత్తంతా 'సూపర్ స్ట్రింగ్స్'తో కలపబడి ఉందని

నవీన శాస్త్రవిజ్ఞానం కూడా ఇప్పుడు విశ్వసిస్తోంది. ఎనభైవేల సంవత్సరాల క్రితమే మానవుడికి తోడుగా, రక్షణగా, మంచుయుగాల కత్తుల అంచుల నుంచి కాపాడే దైవంగా సూర్యబింబం భావించబడింది. అగ్నిని సంరక్షించుకోవడం ఆర్య లక్షణమైంది.

**అగ్నిమీళే పురోహితం**
**యజ్ఞస్య దేవ మృత్విజమ్**
**హోతారం రత్నధాతమమ్**

–ఋగ్వేదం 1.1.1

కలియుగంలోని సంవత్సరాలలాగే ఋగ్వేదంలోని అక్షరాల సంఖ్య 4,32,000. ఋక్కులు 10,580, శబ్దాలు 1,53,826. తొలిశబ్దమే అగ్ని. 'సూర్యో ఆత్మా జగతౌ చక్షుషశ్చ' అన్నట్లు సూర్యుడే ఆత్మ. అతడు ఈ జగత్తుకు కన్ను.

**స ఏష వైశ్వానరో విశ్వరూపః**
**ప్రాణోగ్ని రుదయతే తదేత దృచాభ్యుక్తమ్**

– ప్రశ్న 7

ప్రజాపతి తపస్సు చేసి ప్రాణం, అగ్ని, భుజించే తత్త్వం గల సూర్యుని, అన్నం అయిన చంద్రుని జంటగా సృష్టించాడు. వైశ్వానరుడు ప్రాణము, అగ్ని అయిన సూర్యునిగా ప్రతిదినం ఉదయిస్తున్నాడు.

## ప్రాణాగ్నిని జ్వలింపచేసే...

**అసలుడు, భాస్కరుడు, సుధాంశుడు నధ్వర సంప్రవర్తకుల్**
**వినుము నరేంద్ర ఈ క్రతువు విష్ణుమయంబు**

– మహాభారతం, కర్ణపర్వం

అగ్ని, సూర్యుడు, చంద్రుడు యజ్ఞాన్ని నడుపుతున్నారు. ఈ యజ్ఞం విష్ణుమయం. ప్రతి జీవిలో బయోలాజికల్ క్లాక్ (జీవ గడియారం) ఉంటుంది. దానిని నియంత్రించేది సూర్య, చంద్ర శక్తులేనని ఈరోజు సైన్సు నమ్ముతోంది. ప్రాణాగ్నిని ప్రజ్వలించేసేది, నడిపేది ఆ శక్తులే. 'చంద్రమా మనసో జాతః' – మనసు నుంచి పుట్టేవాడు చంద్రుడు. అతడు సృష్టికి కారకుడై అగ్నికి అన్నం అవుతున్నాడు. కాబట్టి సృష్టికి కారణమైన చంద్రుని శక్తి జీవుల దైనందిన కార్యక్రమాలను నిర్దేశిస్తోంది. ప్రత్యుత్పత్తి కాలం, నెలసరి, మానసిక ప్రవృత్తులు చంద్రుని వృద్ధి క్షీణతలపై ఆధారపడి ఉండడం మనకు తెలిసిందే. వాయువు జీవులలో పంచప్రాణాలుగా ఉండి, సూర్య చంద్రుల శక్తులచే నియంత్రించబడుతూ, అగ్నిచేత జ్వలింపబడి జీవన యజ్ఞాన్ని నిర్వహిస్తూ ఉంటుంది.

## అనాదిగా ఆరాధన

ఈశావాస్య ఉపనిషత్తు చంద్రస్వరూపమైన **మనస్సు**, దానికంటే వేగమైనది అంతు దొరకనిది అయిన సూర్యుని రూపమైన **ఆత్మ**, మనస్సుకు, ఆత్మకు ఆధారమైన శరీరాన్ని నిలబెట్టుకునే **ప్రాణాన్ని** (వాయువు), ప్రాణాన్ని జ్వలింపచేసే **అగ్ని** స్వరూపాన్ని దేవతలుగా భావించి అద్భుతమైన శ్లోకాలతో స్తుతించింది.

**ఉత్తిష్ఠత మాస్వప్త అగ్నిమిచ్ఛధ్వం భారతాః**
**రాజ్ఞః సోమస్య తప్తాసః సూర్యేణ సయుజోపసః**

–అరుణోపనిషత్

భారతీయులారా, లేవండి. మేల్కొనండి. అగ్నిని ఉపాసించండి. చంద్రుణ్ణి పూజించండి. సూర్యకాంతితో జీవించండి అని ఈ శ్లోకం చెబుతుంటే, ఈశావాస్య మిదం సర్వం – ఈ జగత్తంతా ఈశ్వరమాయే అని గ్రహించి ద్వేషాదులను విడనాడండి అని ఈశావాస్య ఉపనిషత్తు బోధిస్తోంది.

✧✧✧✧✧

# 9. మనసు నిర్మలం - చంద్ర దర్శనం

(చుక్కల్లో చందమామపై లెక్కలేనన్ని కథలున్నాయి. చందమామను పూజించే వాళ్ళు కొందరైతే, ప్రేమించేవారు కొందరు. పౌర్ణమికి, అమావాస్యకి మధ్య రూపాలు మారే చంద్రుని చుట్టూ అపోహలు, నమ్మలేని నిజాలు ప్రచారంలో ఉన్నాయి. శాస్త్రజ్ఞుల అనుభవాలు వేరొకలా ఉన్నాయి. పురాణకాలం నుంచి నేటిదాకా చందమామ కథ...)

'తారల మధ్యనుంచి వెన్నెలకాంతులు వెదజల్లుతూ గోశాలలో మదించిన వృషభంలా చంద్రుడు ఆకాశాన ఉదయించాడు' అంటూ ఆదికవి వాల్మీకి సుందరకాండలో చంద్రోదయ వర్ణన అనితర సాధ్యంగా చేశాడు. లోకాలను సంతోష పరిచేవాడు, తెల్లని వెన్నెలల అమృతం కురిపించి ఆహ్లాదపరిచేవాడు చంద్రుడు.

## వెన్నెల పేరేమిటి?

చంద్రుడు షోడశ కళాప్రపూర్ణుడుగా ప్రకాశించే నిండు పున్నమికి 'రాక' అని పేరు. చతుర్దశితో కూడిన పౌర్ణమి పేరు అనుమతి (ఒక కళ తక్కువ) చంద్రుడు చిన్నరేఖగా ఒక కళతో కనబడినప్పుడు ఆ అమావాస్యకు 'సినీవాలి' అని పేరు. 'సా దృష్టేందుః సినీవాలీ, సా నష్టేందు కలాకుహూః' అని అమరకోశం చెబుతుంది. చంద్రకళ కానరాని అమావాస్య 'కుహువు'. చంద్రుడు సూర్యుడిని చేరవచ్చే తిథి అమావాస్య. చనిపోయినవారి ఆత్మలు చంద్రుని చేరతాయని కొందరి నమ్మకం.

3476 కిలోమీటర్ల వ్యాసంతో చంద్రుడు భూమిచుట్టూ తిరుగుతూ, సూర్యుడి నుంచి పరావర్తితమైన కాంతితో వెలుగుతున్నాడు. తన చుట్టూ తాను తిరిగే వేగం, భూమిచుట్టూ తిరిగే ప్రదక్షిణ వేగం సుమారుగా ఒకటే కావడం వల్ల భూమికి ఎప్పుడు చందమామ తన ఒకవైపు ముఖమే చూపిస్తున్నాడు. భూమినుంచి విడిపోయిన శకలమే చంద్రుడు అని చెప్పుకుంటారు. ఆ ప్రాంతమే నీటితో నిండిన పసిఫిక్ (ప్రశాంత) మహాసముద్రం అని శాస్త్రజ్ఞుల భావన. మండే - మూన్‌డే (సోమవారం), మెన్సస్ (నెలసరి), మంత్ (నెల) - ఇవన్నీ మూన్ ధాతువు నుంచి వచ్చిన పదాలే. జీవజాతుల బయలాజికల్ సైకిల్స్ అని పిలిచే జీవగడియారాలు సూర్యచంద్రులపై ఆధారపడి ఉన్నాయి. సముద్రపు ఆటుపోట్లు, జీవరాశుల సంతానోత్పత్తి, మానసిక పరిస్థితుల్లో మార్పుల్ని సూర్యచంద్రులు ప్రభావితం చేస్తారు.

## ప్రపంచదేశాల్లో చంద్రుడు

ఈజిప్షియన్లు ఆరాధించే 'తోత్' క్యాలెండర్‌కు, కళలకు సైన్స్‌కు అధిపతి చంద్రుడు. ఇతడు బబూన్‌తలతో, తలపై నెలవంకతో (మన శివుడిలా) ఉంటాడు.

ఇతడే 'హెర్మెస్'గా గ్రీకు, ఇస్లాం, యూరోపియన్ మార్మిక శాస్త్రాలలో ప్రసిద్ధికెక్కాడు. జపనీయుల 'టుక్సి–యోమి', మెసపటోమియన్ల 'సిన్' దేవుడు, ఇన్యూట్ (ఉత్తర అమెరికా) తెగల 'ఇగాలుక్', హిందువుల చంద్రుడు మగరూపంలో ఉంటే, చైనీయుల ఛాంగ్–ఓ, గ్రీకుల ఆర్టెమిస్, రోమనుల ల్యూనా, డయానా; మధ్య అమెరికాలోని అజెక్ట్‌ల కొయోల్ గ్జాక్యు స్త్రీరూపంలో ఉన్న చందమామలు. 'ధవళ శీతాగ్నులు కురిపించే అందాల సుందరి' అంటాడు షెల్లీ.

అత్యంత సుందరమైన దేవకన్య, అపోలో (సూర్యుడు) కవల సోదరిగా చంద్రగ్రహం ఆర్టెమిస్‌గా ప్రసిద్ధికెక్కింది. ఈమె మూడు స్వరూపాలున్న దేవత. ఆర్టెమిస్ నెలవంక, సెలెనె పౌర్ణమి, హెకాటె అమావాస్య. చంద్రుని వృద్ధిక్షీణతలను అనుసరించి వీళ్లను ముగ్గురు దేవతలుగా, మూడు అదృష్టాలుగా, ముగ్గురు మంత్రగత్తెలుగా జీవన్మరణాల చక్ర ప్రతీకలుగా వర్ణించారు. 'ఇది చంద్రుని తప్పే. ఆమె భూమికి దగ్గరకు వచ్చిందా, మనుషులకు మతిస్థిమితం తప్పిందే'... అంటాడు ఒథెల్లోలో షేక్స్పియర్.

## గత అనుభవాలు

సముద్రంలో అలలు ఎగిసి పడ్తున్నప్పుడే (హైటైడ్స్) ఎక్కువ జననాలు కావడం, ముఖ్యంగా పౌర్ణమి తర్వాత ఉదయం నాలుగు అయిదు గంటల ప్రాంతంలో జరగడం శాస్త్రజ్ఞులను ఆశ్చర్యపరిచింది. అందుకే కొన్నిచోట్ల చంద్రుణ్ణి మహా మంత్రసాని – ది గ్రేట్ మిడ్‌వైఫ్– అని పిలుస్తారు. పౌర్ణమి సమయాల్లో ఎక్కువ రక్తస్రావం కావడం, శస్త్రచికిత్సల్లో కూడా ఒక్కోసారి రక్తస్రావాన్ని అదుపు చేయలేక పోవడం గమనించిన డాక్టర్ ఆండ్రూస్ ఇలా వ్యాఖ్యానించాడు. "నేను ఇకముందు శస్త్రచికిత్సలు అమావాస్య రాత్రిళ్లలో చేసి, పౌర్ణమి రోజుల్లో హాయిగా రొమాంటిక్ జీవితం గడుపుతాను"

మతి చాంచల్యానికి చందమామకు (మూన్ అండ్ మ్యాడ్‌నెస్) ఉన్న సంబంధంపై ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఇంగ్లండ్ న్యాయస్థానాల్లో ల్యూనాటిక్స్‌కు (ల్యూనా–చంద్రుడు) శిక్షలో కొంత విడుపు ఇచ్చేవారు. పౌర్ణమి సమయంలో పిచ్చాసుపత్రి సిబ్బంది వేయికళ్లతో తమ రోగుల్ని పర్యవేక్షించవలసి వుంటుంది. లియొనార్డ్ రావిట్జ్ అనే న్యూరాలజిస్ట్ మానసిక రోగుల్లో బ్రెయిన్‌లోని విద్యుత్ ప్రకంపనలు పౌర్ణమి రోజుల్లో ఎక్కువ అని ధ్రువీకరించాడు. ప్రఖ్యాత జ్యోతిష్కురాలు లిండా గోల్డ్‌మాన్ 'స్టార్ సైన్స్'లో ఉటంకించిన విషయం ప్రకారం వైద్యశాస్త్ర పితామహుడు హిపోక్రేటస్ శస్త్రచికిత్స చేసే సర్జన్లను ఈ విధంగా

హెచ్చరించాడు. 'Touch not with iron that part of the body ruled by the sign the moon is transitting' – చంద్రుడు ఒక్కొక్క రాశిలో సుమారు రెండున్నర రోజులు ఉంటాడు. మన శరీరంలోని ఒక్కొక్క భాగాన్ని ఒక్కొక్క రాశి పరిపాలిస్తుంది. ఉదాహరణకు మేషం (ఏరీస్) తలభాగాన్ని, సింహం (లియో) హృదయాన్ని; పంచాంగాన్ని బట్టి చంద్రుడు ఇప్పుడు సంచరిస్తున్న రాశి, పరిపాలించే భాగంపై చేసే శస్త్రచికిత్స ప్రమాదకరమైందని, అనుకోని విపత్తులు రావచ్చునీ అంచనా వేయవచ్చు.

ఏది ఏమైనా ప్రేమికులకు ప్రమోదాన్ని, సమస్త జనులకు ఆహ్లాదాన్ని, జీవకోటికి ఆనందాన్ని ప్రసాదించే చందమామ 'పుష్ణామి చౌషధీ స్సర్వాః సోమో భూత్వా రసాత్మకః' అన్నట్లుగా ఓషధులకు, వనస్పతులకు అధిదేవతగా జగత్తుకు తిండిపెట్టి పోషించువాడై తారామండలంలో తిరుగాడుతూ లోకాలను వెలుగుతున్న కర్పూరంలా శీతల కాంతిమయం చేస్తున్నాడు.

✧✧✧✧✧

# 10. మానవ శక్తికి అతీతం – జలప్రళయం

బైరన్ అన్నట్టు మానవుని ప్రతాపమంతా భూమిని కలుషితం చెయ్యడానికే తోడ్పడింది. ఆతని ఆధిపత్యం ఎంత చెలరేగినా చెలియకట్ట చెంత చిన్నబోక తప్పదు. సముద్ర తీర ప్రాంత జనులు సాగరాన్నెంతగా ప్రేమిస్తారో, అంతగానూ భయపడతారు... ద్వేషిస్తారు. ఆ ప్రేమ ద్వేషాల ద్వైధీభావం సామాన్య జనుల నుంచి మహాకవుల దాకా ప్రవహించగా ఎన్నో గాయాలు గేయాలై, ఎన్నెన్నో సంఘటనలు కథలై కావ్యాలై ఇతిహాసాలయ్యాయి...

**సముద్రోబ్ధి రకూపారః పారావార స్సరిత్మతిః**
**ఉదన్వానుదధిస్సిన్ధు రస్వాన్ సాగరోర్ణవః**
**రత్నాకరో జలనిధి ర్యా దఃపతి రపాంపతిః**

...అని సముద్రానికి మొత్తం పదిహేను పేర్లున్నాయని అమరకోశం చెబుతోంది.

సమ్యగునక్తి చంద్రోదయాదితి సముద్రః ఉదీక్లేదనే – చంద్రోదయం వలన మిక్కిలి వృద్ధి చెందునది సముద్రం. సుమంతాన్ముదం రాతీతి వా సముద్రః – అంతటా సంతోషమునిచ్చునది సముద్రం. మరి అటువంటి సముద్రానికి మనమీద ఎందుకు కోపం వచ్చిందో తెలీదు కానీ, 'సునామీ మానవా!' అంటూ సునామీని పంపింది. ఆ అలల తాకిడికి తీరప్రాంతాలు అల్లకల్లోలమై లక్షమందికి పైగా ప్రజ మృత్యుగహ్వారాన్ని చేరుకుంది. ప్రకృతి విశ్వరూపం ముందు మానవుని అల్పత్వం మరోసారి తేటతెల్లమైంది. ఎడారుల్ని నందనోద్యానవనాలుగా మార్చగలిగాడు, ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కగలిగాడు, కీకారణ్యాల్ని, విశ్వాంతరాళంలోని రహస్యాల్ని ఛేదించగలుగుతున్నాడు. అయినా సముద్రపు తీరుతెన్నుల్ని అంచనా వేయడంలో మానవుడు ఇప్పటికీ అశక్తుడే.

## అంకురార్పణ

నాలుగువేల ఏళ్లక్రితం రాసిన ప్రపంచపు ఇతిహాసం 'గిల్గామేష్' కావ్యం ఆనాటి జలప్రళయాన్ని అద్భుతంగా వర్ణిస్తుంది. ఈ జలప్రళయం ప్రపంచంలోని అన్ని ఇతిహాసాలలోనూ వర్ణించినట్లు ఒకేచోట వున్న మానవజాతి ప్రపంచమంతా విస్తరించడానికి కారణమయ్యిందేమో. సుమేరియన్లకు జియాసుద్రుడు, అస్సుర్ బాబిలోనియన్లకు ఉత్నాపిష్టం, గ్రీకులకు ప్రొమెథియస్ పుత్రుడు ద్యుకాలియాన్, హిందువులకు ద్రవిడరాజైన సత్యవ్రతుడు, అమెరికా ఆండియన్లకు మాంకో కపాక్, దక్షిణ చైనా ప్రజలకు యవో నరుడు, హిబ్రూ, క్రైస్తవ, మహమ్మదీయులకు నోవా

వీళ్లంతా జలప్రళయంలో బతికి బట్టకట్టి మరల మానవజాతిని వృద్ధి చేసినవాళ్లు. మధ్య అమెరికాలోని 'అజ్టెక్' ప్రజలు, దిక్పాలకులకు నలుగురి మధ్య జరిగే నిరంతర ఘర్షణలలో మొదటిసారి జగత్ ప్రళయం చిరుతపులుల వల్లనూ (జాగ్వార్లు), రెండవది పెను తుఫాన్లతోనూ, మూడోసారి అగ్నివల్లనూ, నాలుగోసారి వరదలతో జలప్రళయ మొచ్చి నాశనమైంది భూప్రపంచం. ఈసారి భూకంపాలతో దడదడలాడుతుందని వాళ్ల విశ్వాసం.

## దేవతలకే తప్పలేదా?

క్రీ.పూ. 800 ప్రాంతం వాడైన హోమర్ (గ్రీకు) రాసిన 'ఒడిస్సీ' అనే మహా కావ్యంలో 'పొజిడాన్' దేవత సృష్టించిన పెనుతుపాన్‌లో చిక్కుకున్న ఒడిసెస్, కాలిప్సో, ఎథెనా, ల్యూకోథియా దేవతల సాయంతో చావుతప్పి కన్నులొట్టపోయి బతికి బయటపడతాడు. గ్రీకు దేవతలంతా అంతే. స్వర్గంలో తీరిగ్గా కూచుని వాళ్లలో వాళ్లు గొడవలు పడుతూ, తమ తమ విద్యా, శక్తి ప్రదర్శనలకు మానవుల్ని బలిపశువుల్ని చేస్తుంటారు. వీళ్లకు తోడు సముద్రపు అగాధాల్లో సంచరించే రాక్షసజంతువులు, తిమింగలాలు, సముద్ర సర్పాలు గాడ్జిల్లాలై మానవజాతిని ఇక్కట్లపాలు చేస్తుంటాయి.

## సృష్టికి మూలం

పరిశుద్ధ గ్రంథం బైబిల్‌లో 'సృష్టి' గురించి ఇలా చెప్పబడింది. తొలుత భగవానుడు స్వర్గాన్ని, భూమిని సృజించాడు. భూమికి అప్పుడు ఓ రూపం అంటూ ఏమీ లేదు. అంతా చీకటి. పరమాత్మ నీటిపై కదులుతూ ఉంది. భగవానుడు ఆజ్ఞాపించాడు. వెలుగు రానీ అని. అంతా వెలుగే అక్కడ. ఆయన సంతోషించాడు. చీకటి నుంచి వెలుగును విడదీసి వెలుగును పగలు, చీకటిని రాత్రిగా సంబోధించాడు. అది మొదటిరోజు.

ఈ జలాల మధ్య గగనమండలం ఏర్పడుగాక అన్నాడు. అంతరిక్షం ఏర్పడింది. దానిని స్వర్గంగా పిలిచాడు భగవానుడు. ఇది రెండవరోజు.

ఇప్పుడు ఈ జలాలన్నీ ఏకంకానీ, పొడినేల ఏర్పడనీ అన్నాడు. ఆ పొడినేలను భూమిగా, జలాల్ని సముద్రంగా నామకరణం చేశాడు. ఆ విధంగా ఆరురోజులు సృష్టి జరిగింది. ఏడవరోజు విశ్రాంతి దినం. భగవానుడు తృప్తి చెందాడు. తరువాత ఆదాంను సృష్టించి, అతని సంతతి చేస్తున్న అరాచకాలకు విసిగి, 'నోవా'తో ఇలా అన్నాడు. ఇప్పుడు ఈ భూమి అవినీతి, హింస, పాపాలతో నిండిపోయింది. నేను దీన్ని నాశనం చేస్తాను. నీవు ఒక పడవను (నోవాస్ ఆర్క్) తయారుచేసుకో!

## వైవస్వత మనువు

ఇలాంటి విషయమే మనకు భాగవతంలో కనిపిస్తుంది. సమస్త ఓషధ బీజరాశులను సత్యవ్రతుడు అనే ద్రవిడ రాజు సంరక్షణలో వుంచి రక్షించడానికి శ్రీహరి మీనరూపుడై నావను పంపిస్తాడు. ఆ సత్యవ్రతుడే ఈ మహాకల్పంలో వైవస్వత మనువుగా జన్మించినట్లు వివరించారు.

ఈ మధ్య వార్తలలో ప్రసిద్ధికెక్కిన కంచి–కావేరికి ఓ శాపం వుంది. ఏ సంవత్సరమైతే ఇంద్రుడి పండుగ చేయడం మర్చిపోతారో ఆనాడు జలప్రళయమొచ్చి కావేరి పట్టణం మునిగిపోతుందని. నాగరాణితో విహారంలో చోళమహారాజు ఇంద్రుడి పండుగ మర్చిపోయినప్పుడు 'మణిమేఖల' అనే సముద్ర దేవత ఇంద్రుడి ఆజ్ఞతో సముద్రంలో తుపానును సృష్టిస్తుంది. ఆ సంఘటన కావ్యమై ప్రఖ్యాతి గాంచింది.

మహాకవి షేక్స్పియర్ టెంపెస్ట్ నాటకంలో – ప్రాస్పెరో తన మంత్రశక్తులతో తుపానును సృష్టించి శత్రువుని జయించడం ఓ అద్భుతఘట్టం. బియో ఉల్ఫ్, సముద్ర రాక్షసి గ్రెండెల్‌తో చేసే పోరాటం క్రైస్తవులు అనాగరికులతో చేస్తున్న యుద్ధానికి ప్రతీకగా కనిపిస్తుంది. అలాగే హెర్మెన్ మెలెవిలే ప్రపంచ ప్రసిద్ధ రచన 'మోబి డిక్'లో కెప్టెన్ అహబ్, మహాశ్వేత తిమింగలంతో తలపడడం మానవుడి బాహ్య అంతర్యుద్ధాలకు ప్రతీకగా చరిత్రలో మిగిలిపోయింది. జోసెఫ్ కాన్రాడ్ రాసిన 'నౌకాభినిష్క్రమణం' మానవ సమాజంలో ఉండాల్సిన సహాయ సహకారాల్ని, ముఖ్యంగా కష్టాలలో, ప్రకృతి భీభత్సాలలో ఒకరికొకరు తోడై ఉండాల్సిన అవసరాన్ని తెలుపుతుంది.

*పాలనురగల తలలు అలలై, కడలిరాయుడు కదలిరాగా*
*వేల పడగల పరుగు పడవలు, తలలు దించి తల్లడిల్లగ*
*శాస్త్రజ్ఞానం శస్త్రధైర్యం, ఒక్కక్షణమున మొక్కవోవగ*
*పిక్కటిల్లిన సునామి కేకకు, బిక్కచచ్చెను బక్కమనుజుడు!*

ఏ అల ఎక్కడ తగుల్తుందో ఏ కల ఎప్పుడు ఎలా చెదురుతుందో ఎవరికీ తెలీదు. కాలం దాని మానాన అది కదిలిపోతూనే వుంటుంది. అప్పటివరకు ప్రళయభీకరంగా గర్జించిన సముద్రం మాత్రం ప్రశాంతంగా నిద్దరపోతున్న పసిపాపలా ఉంటుంది.

✧✧✧✧✧

# 11. అన్నం పరబ్రహ్మ స్వరూపం

మనిషి పుట్టుకకు, జీవనానికి, లయకు మూలం అన్నం. అందుకే దానిని పరబ్రహ్మ స్వరూపంగా ఉపనిషత్తులు పేర్కొన్నాయి. మానవ నాగరికత మూలాల్లోకి వెళితే వేల సంవత్సరాల నుంచే వ్యవసాయం మొదలైంది. జిజ్ఞాసువులు పరిశీలనా దృష్టితో వ్యవసాయం, ఎరువులు, పనిముట్లు కనిపెట్టారు. వాటిని ఉపయోగించి నాగరికత పరిఢవిల్లేందుకు తోడ్పడ్డారు మన పూర్వులు.

**"వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన**
**బహు శాఖః అనంతాశ్చ, బుద్ధయో వ్యవసాయనామ్"**

– భగవద్గీత 2–41

అర్జునా! సాధన చేసిన వారి బుద్ధి ఎల్లప్పుడూ ఒక్క రీతిగానే ఉంటుంది. ఏ విధమైన సాధన, శిక్షణ లేని వారి బుద్ధి అనంత రూపాలుగా, స్థిరత్వం లేకుండా ఉంటుంది. అని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పాడు. శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన ఈ వ్యవసాయం కర్మ క్షేత్రానికి సంబంధించినది. అయితే 12,000 సంవత్సరాల క్రితం ప్రజలకు ఆహార సంపాదనే సాధన. వేట, పళ్లూ ఫలాల్ని ఏరుకోవడం మీదనే ధ్యాస. క్రీస్తుపూర్వం 10000 – 5000 సంవత్సరాల మధ్యకాలంలో ఇప్పటి గ్రీకు దేశం నుంచి ఇరాన్ వరకు, జోర్డాన్ నుంచి క్రిమియా వరకు ఉన్న ప్రాంతాల్లో కొత్త విప్లవం వచ్చింది. జంతువుల్ని మచ్చిక చేసుకోవడం, గోధుమ, బార్లీ వంటి మొక్కల్ని పెంచడం అనుభవంలోకి వచ్చింది.

## టర్కీలో తొలిసారి వ్యవసాయం

అప్పటికీ, ఇప్పటికీ విశ్వాస పాత్రంగా ఉండే కుక్క క్రీ.పూ. (10,000 సంవత్సరాలప్పుడు), మేక (10,000), పశువులు (5,500), గొర్రెలు (5000), పందులు, గుర్రం, గాడిద (3000), పిల్లి, కోళ్లు (2000), బాతులు (1500) పెంపుడు జంతువులై వ్యవసాయానికి, వేటసాయానికి, ఆహారానికి, విహారానికి, దుస్తులకు నివాస గృహాలకు తోడ్పడసాగాయి.

తొలి వ్యవసాయపు జాడలు సముద్ర తీరాల్లో ముఖ్యంగా మధ్య ఆసియాలోని (టర్కీ) ప్రాంతాల్లో కనిపించాయి. జంతువుల వేటపై ఆధారపడక, సముద్రపు చేపల్ని ఆహారంగా సునాయాసంగా సంపాదించుకునే వీలున్న క్రమంలో మొదట స్థిర నివాసాలు ఏర్పరచుకున్నారు. తమ పశువులు ఇష్టపడి తింటున్న గడ్డి మొక్కల గింజల్ని రుచి చూసిన మానవుడు వాటిని ఆహార యోగ్యాలుగా భావించి ఉంటాడు. క్రీస్తు

పూర్వం 6700 నాటికే సటాల్ హుయుక్ – అనే తొలి గ్రామం శిథిలాల్లో గోధుమ, బార్లీ, బఠాణి, చిక్కుళ్ల లాంటి 14 రకాల పంటల అవశేషాలు లభించాయి. క్రీస్తు పూర్వం మూడు వేల ఏళ్ల క్రితం కనుగొన్న నాగలి, బావుల్లోంచి నీళ్లు తోడడానికి వాడే 'షాడఫ్' యంత్రం వ్యవసాయానికి ఎంతో ఉపకరించాయి.

## పొలం దున్నిన రాజులు

రాజులు కూడా పొలం దున్నేవారు. సీత దొరికింది జనకుడికి నాగటి చాలులోనే కదా! అందుకే ఆమెకు సీత అనే పేరు వచ్చిందంటారు. చెత్తా చెదారం కుళ్లిన ప్రాంతాల్లో మొక్కలు ఏపుగా పెరగడాన్ని గమనించిన జిజ్ఞాసులు ఎరువును ఉపయోగించడం వాడుకలోకి తెచ్చారు. కొత్త పంటల్ని కనుగొనడం, ఇతోధికంగా పండించడం మొదలైంది. ఎంత వాననీరూ సరిపోకపోయే సరికి కాలువలు, చెరువులు తవ్వడం ప్రారంభమయ్యింది. కొత్తకొత్త పనిముట్లు, గొడ్డళ్లు, నాగళ్లు, కొడవళ్లు, బుట్టలు, కుండలు, తిరగళ్లు కనిపెట్టారు. ధాన్యం నుంచి పిండి చేయడం తెలిశాక పిండి కొద్దీ రొట్టెలు, రకరకాల రుచులూ దినదినాభివృద్ధి చెందసాగాయి. జంతువుల్లో, మొక్కల్లో చీడపీడలను తట్టుకునే సామర్థ్యమున్న వాటిని ఎన్నుకోవడం మొదలైంది.

## నాడూ వారి ప్రధాన ఆహారం

మెక్సికో, పెరూ, మధ్య అమెరికాల్లో మొక్కజొన్న ప్రధాన పంట. పత్తి, మిర్చి, మిరియాలు, సూర్యకాంతి (సన్‌ఫ్లవర్), పుచ్చకాయలు, గుమ్మడికాయలు ఇతర పంటలు. థాయ్‌లాండ్‌లో క్రీస్తుపూర్వం 6000 నాటికి దుంపలు, పళ్లు, చిక్కుళ్లు, దోసకాయలు, పొట్ల, బీరకాయలు, ఆహార పంటలు కాగా ఇండియాలో క్రీస్తుపూర్వం 2000 నాటికి వరి ప్రధాన పంట. చైనాలో వరి, రాగులు ముఖ్యపంటలు. క్రీస్తు పూర్వం నాలుగువేల సంవత్సరాల నాటికే వ్యవసాయం మధ్యధరా ప్రాంతాన్ని దాటి ఆసియా యూరప్‌లలో విస్తరించింది. వ్యవసాయం, పశుపోషణ, స్థిర నివాసం, ఆరోగ్య పరిస్థితుల్ని మెరుగుపరచగా ప్రపంచపు తొలి జనాభా విస్ఫోటనం జరిగి, కొత్త ప్రదేశాలను వెదుక్కుంటూ ప్రజల సంచార జీవనం ప్రారంభమైంది.

## నాగరికతకు నాంది

తొలి నాగరికతా ఊయల అని పిలువబడిన నైలు నదీ ప్రాంతం, యూఫ్రటీస్, టైగ్రీస్ నదుల మధ్య మెసపటోమియా ప్రాంతం, సింధూనదీ లోయ, చైనాలో పచ్చనదీ పరివాహక ప్రాంతంలో నాగరికత వెల్లివిరిసి పట్టణాలకు శంకుస్థాపన మొదలైంది. క్రీస్తుపూర్వం 6000 సంవత్సరాల నాటికి ఇరాన్, టర్కీ ప్రాంతాల్లోని ప్రజలకు రాగి, సీసంల వాడకం తెలుసు. సటాల్ హుయుక్ గ్రామ శిథిలాల్లో వాటి గురించి ఆధారాలు

లభ్యమయ్యాయి. క్రీస్తుపూర్వం 4000 నాటికి కర్ర చివర గొడ్డలిని అమర్చే విధానాన్ని కనుగొన్నారు. మరో వేయి సంవత్సరాలకల్లా ఇత్తడిని తయారు చేశారు. మైనపు నమూనాను కరిగించి తొలిగించే పద్ధతి (లాస్ట్ వాక్స్)లో అపురూపమైన కళాఖండాన్ని తయారుచేయడం ప్రారంభమైంది. కనుగొన్న ప్రతి దానిని విధ్వంసానికే మొదటిసారి వాడే మానవుడు అప్పుడూ, ఇప్పుడూ తన విజ్ఞానాన్ని ఆయుధాల తయారీకే ముందు వినియోగించాడు. సంపద పెరిగింది. సంరక్షణ కోసం వెంపర్లాట మొదలై మంత్ర తంత్రాలు, దేవుళ్లు, దైవాంశ సంభూతులైన నాయకులు, రాజుల పరిణామక్రమం కాలరేఖలోకి వచ్చేసింది.

## వాహనాల వినియోగం

సూడాన్ ప్రాంతంలో క్రీ.పూ. 3500 నాటికే గాడిద సవారీకి, బరువులు మోయడానికి వినియోగించబడింది. తరువాత రెండువేల ఏళ్లకు ఎడారుల్లో భారం ఒంటెలపై పడింది. గుర్రం క్రీ.పూ. 3000 సంవత్సరాలప్పుడే మచ్చిక చేయబడ్డా 'హిక్సాస్' అనే ఆసియా ప్రాంతపు యోధులు గుర్రపు సైన్యంతో క్రీ.పూ. 1700లో ఈజిప్టు నాక్రమించుకున్నారు.

కుమ్మరి చక్రం క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నాటికే మధ్యధరా ప్రాంతంలో వాడుకలో ఉన్నది. డెన్మార్క్ ప్రాంత వాసులు పెద్ద చెట్టు దుంగను చక్రంగా మలుచుకునేవారు. చైనాలో వీల్ బారో క్రీ.పూ. 2600 నాటికే ఉపయోగంలో ఉన్నది. ఆకులున్న చక్రాలు, చక్రాలమర్చిన తేలికపాటి రథాలు ఈజిప్టులో తొలిసారి వాడుకలోకి వచ్చాయి. ఆల్ బెరూని అనే ముస్లిం చరిత్రకారుడు 'అఫ్రోడిసియాస్' అనే హిందూ రాజు ఈజిప్టులో రథాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టాడని రాశాడు.

## దేవుని భావనకు కష్టాలు మూలం

వ్యవసాయంతో పాటు ప్రజలకు కష్టాలు కూడా మొదలయ్యాయి. కాలువలు, చెరువులు తవ్వడానికి విపరీతమైన కష్టనష్టాల్ని సామాన్య ప్రజలు అనుభవించాల్సి వచ్చేది. వాళ్ల కష్టాలు కావ్య వస్తువులైనాయి. సుమేరియన్ ప్రజలు తమని దేవుడు, చిన్నా చిల్లర దేవుళ్ల శ్రమల్ని తొలగించడానికి మానవునిగా పుట్టించాడని (టు క్యారీ ద లేబర్ బ్యాస్కెట్ ఆఫ్ గాడ్స్) నమ్మేవారు. ఈజిప్టు ప్రజలకు ఒసిరిస్, గ్రీకులకు సిరిస్ (సిరిల్స్ – ధాన్యాలు), రోమన్ల క్రోనాస్ విత్తనాలకు అధిపతులు. అజ్టెక్‌లు, మాయన్ ప్రజలు మొక్కజొన్న పంటను అమ్మతల్లి దేవతగా ఆరాధిస్తారు. ఏ పూజలైనా, ఏ పాట్లైనా అన్నానికే గదా!

**“అన్నాద్వై ప్రజః ప్రజాయంతే**
**యారికాశ్చ పృథివీగ్ం శ్రితాః**
**అథో అనన్నే నైవ జీవంతి**
**అథైనదపి యంత్యంతః**
**అన్నగం హి భూతానాం జ్యేష్టమ్”**

- తైత్తిరీయ ఉపనిషత్ 2-2

అన్నం వల్లే సమస్త ప్రజలు జన్మించడం, జీవించడం, నశించడం జరుగుతున్నది. జన్మస్థితిలయాలకు హేతువైన అన్నమునే పరబ్రహ్మ స్వరూపంగా ఉపాసించాలని తైత్తిరీయ ఉపనిషత్తు పేర్కొంటున్నది.

✧✧✧✧✧

# 12. మృత్యురహస్యం... ఆత్మజ్ఞానం

(జాతస్య మరణం ధ్రువం. ఎప్పుడో ఒకసారి దేహం నిర్జీవం కాక తప్పదని తెలిసినా అశాంతికి లోనవుతాం. ఎంతటి వేదాంతికైనా మృత్యువంటే అంతులేని భయం. అసలు మృత్యువు అంటే ఏమిటి? మృత్యుభయాన్ని ఆత్మజ్ఞానంతో జయించగలమా? ఆ ఆత్మజ్ఞానం అలవరచుకోవడం ఎలా అనే సందేహాలకు సమాధానం...)

**"ఇమం జీవేభ్యః పరిధిం దధమి మైషాం నుగాదపరో అర్థమేతం**
**శతం జీవన్తు శరదః పురూచీరన్తన్ మృత్యుం దధతాం పర్వతేనః"**

(ఋగ్వేదం 10-18-4)

'మృత్యువు వెళ్ళే దారిలో పర్వతాల వంటి రాళ్లతో నిలబడి నిన్ను చేరనీయకుండా నేను అడ్డుకుంటాను' అనే భావన మనలో అనాది నుంచి ఉన్నదే. మృత్యునామం ఉచ్చరించడానికే వణికిపోయేవారు కొందరుంటే మృత్యువును మిత్రునిగా, శాశ్వత నిద్రగా అభివర్ణించేవారు ఇంకొందరు. తమవారిని మృత్యువు నుంచి రక్షించబోయి తామే మృత్యు ఒడిని చేరినవారు మరికొందరు. మానవునికి సంబంధించినంత వరకు జనన, మరణాలు రెండే శాశ్వత సత్యాలు. జ్ఞానం అలవడక ముందే జననం సంభవించింది కనుక దానితో ఇప్పుడు అవసరం లేదు. ఇక మిగిలింది మరణం ఒకటే సత్యం. మిగిలిన సత్యభావాలన్నీ సాపేక్షమైనవే. చేతినే తన అస్త్రంగా, ఆలోచనలే ఇంధనంగా రూపు సంతరించుకున్నాడు మానవుడు. తన సుదీర్ఘ ప్రయాణంలో తరతరాలుగా మృత్యు రహస్య శోధన సాగిస్తున్నాడు. అయితే అరిషడ్వర్గాల మాయ, ధనార్జనా వ్యామోహంలో సత్యమనే అతి సుందర మార్గానికి దూరంగా పరిభ్రమిస్తున్నాడు.

## మృత్యువంటే...?

మరణం అంటే ఏమిటి? ఎందుకు అత్యంత ఆత్మీయులను విడదీసి ఇంత దుఃఖాన్ని కలిగిస్తుంది? మరణించిన తర్వాత మనం ఏమవుతాం? అనే ఆలోచనలే తాత్విక చింతనకు మూల బీజాలవుతాయి. ఆ సందేహాన్నే తీర్చవలసిందిగా కఠోపనిషత్‌లో నచికేతుడు యముడిని తన మూడవ వరంగా కోరుకుంటాడు. మరణించాక ఆత్మ ఏమవుతుంది? అసలు అది ఉందా? లేదా? అని ప్రశ్నిస్తాడు. పూర్వీకులు మృత్యువును అంతిమ రహస్యంగా అభివర్ణించారు.

## మరణంలో దశలు...

మృత్యుముఖంలో ఉన్న రెండువందల మందిని ఇంటర్వ్యూ చేసిన డాక్టర్ కుబ్లర్ రాస్ మృత్యు ప్రయాణాన్ని అయిదు దశలుగా వర్గీకరించింది.

**1) తిరస్కారం :** నాకు మృత్యువా...? అసాధ్యం అని తిరగబడటం. ఇది తాత్కాలికమైన దశ.

**2) కోపం :** నాకే ఎందుకు రావాలి ఈ చావు? ఎవరికో నామీద కోపం. ఈ రకంగా పగ తీర్చుకుంటున్నారు. ఈ దశలో ఆ వ్యక్తిని అనునయించడం ఎంతో అవసరం.

**3) బేరం :** నాకింకా బతకాలని ఉంది. ఇంకొన్నాళ్ళు నాకు ఆయుర్దాయం ఇస్తే నా ఆస్తి అంతా నీకిచ్చేస్తాను. డాక్టర్... నన్ను బతికించు అనే దశ మరొకటి.

**4) అధైర్యం :** డీలా పడిపోవడం. అన్నీ కోల్పోయాను ఇంకేం మిగిలిందను కుంటూ కృశించిపోతారు.

**5) స్వీకారం :** మౌనమే సంభాషణ అవుతుంది. మాటలకన్నా సైగలు, కళ్ళల్లో నీళ్ళు, స్పర్శానుభూతులు, ఎక్కడికో దూరంగా చూపులు... మిణుకు మిణుకుమంటున్న కనుల ప్రశాంతి... ఆరిపోబోతూ వెలిగే దీపపు కాంతి.

ఆకలి చావులు, ఆత్మహత్యలు, వరకట్నపు హత్యలు, నిర్లక్ష్యపు హత్యలు, ఎన్‌కౌంటర్లు, రోగాలు, వర్గ, వర్ణ ద్వేషాలు ముదిరి, ఆధిపత్య ధోరణులు ప్రబలి, అసూయా ద్వేషాల రథచక్రాల కింద ప్రతిరోజూ మరణానికి అనేకమంది చేరువవుతుంటే మనసున్న ప్రతివారి మనసూ ఆర్ద్రమవుతుంది.

## మరణం తరువాత...

మృత్యువు సంభవించాక మిగిలిన పార్థివ శరీరాన్ని పంచభూతాల్లో కలిపే ప్రక్రియ అనేక రకాలుగా ఉంటుంది.

**ఖననం :** అతి ప్రాచీనమైన ప్రక్రియ. సామాన్యుణ్ణి ఒంటరిగానూ, మాన్యుణ్ణి సపరివార, ధన, ధాన్య, వస్తు సహితంగానూ పూడ్చిపెట్టేవారు ఒకప్పుడు.

**దహనం :** హిందువులలో ఈ పద్ధతి ఎక్కువ. ఖననాలకు చోటు చాలనప్పుడు ఇతరులు కూడా దీన్ని అవలంభించారు.

**మమ్మీఫికేషన్ :** ఈజిప్టు, దక్షిణ అమెరికాలోని 'ఇంకా' జాతివారు ఈ విధానంతో పిరమిడ్లలో తమవారి దేహాలను భద్రపరిచారు.

**ఎంబాల్మింగ్ :** లెనిన్, స్టాలిన్‌ల భౌతిక కాయాలను ఈ పద్ధతిలోనే భద్రపరిచారు.

**మంచెపై వదిలి వేయడం :** ఉత్తర అమెరికాలోని మందాన్ జాతీయులు, పార్శీ మతావలంబకులు మరణించినవారి దేహాలను మంచెలపైన, ఎత్తైన గుట్టలు,

భవనాలపైన జంతువులకు, పక్షులకు ఆహారంగా వదిలివేస్తారు. వీటిని మౌనశిఖరాలు (టవర్స్ ఆఫ్ సైలెన్స్) అంటారు.

**జలతర్పణం :** నావికులు మరణించినవారి శవాలను సముద్రంలో వదిలిపెట్టేవారు.

**భక్షణం :** పసిఫిక్ దీవుల్లోని న్యూగినీ వాసుల్లో మృతుని బంధువర్గం వారు ఈ పని చేసేవారట. అందుకే 'వాళ్ళ పొట్టలే వాళ్ళ శ్మశానాలు' అంటారు.

## జీవం ఏది...?

అంతవరకూ చేతనంగా ఉన్న అమూల్యమైన దేహం క్షణంలో నిర్జీవమై శవంగా, పనికిరానిదిగా మారిపోతుంది. మరణించిన తరువాత కూడా నిలిచి వుండేదే ఆత్మ. ఈ విషయాన్ని అవగాహన చేసుకుంటే మరణమంటే భయం వుండదు. కొంతమంది శాస్త్రజ్ఞులు ఆఖరి ఘడియల్లో ఉన్న రోగుల బరువును ప్రాణం పోయిన వెంటనే ఉన్న బరువుతో పోల్చి చూసి, జీవం బరువు 100 గ్రాముల లోపుగా తేల్చారు.

**"అంగుష్టమాత్రః పురుషోంతరాత్మా,**
**సదా జనానాం హృదయే సన్నివిష్టః,**
**త్వం సచ్ఛరీరాత్ ప్రవృహేన్ముంజాది వేషికాం ధైర్యేణ**
**తం విద్యాచ్ఛు క్రమమృతం,**
**తం విద్యాచ్ఛుక్రమ మృతమితి."**

బొటనవేలంత ఉండే చైతన్యమనే అంతరాత్మ ప్రాణుల హృదయాలలో నివసిస్తుందని క్రీస్తుపూర్వం 800 సంవత్సరాల కాలం నాడే కఠోపనిషత్తులో (6-17) పేర్కొన్నారు. నిరంతర విచారణ, ధాన్యం ద్వారా దేహం, ఆత్మ వేరని తెలుసుకుని శాశ్వతమైన ఆత్మస్వరూప జ్ఞానాన్ని అలవరుచుకోవడమే మృత్యు రహస్యంగా యముడు నచికేతునికి వివరిస్తాడు.

**"మృతియును జీవనంబు నివి మేదిని లోపల జీవకోటికిన్**
**సతతము సంభవించు సహజంబిదె చోరహుతాశ సర్పసం**
**హతులను దప్పి యాకటను బంచతనొందెదు నట్టి జీవుడున్**
**వెతలను బూర్మ కర్మభవ వేదన లొందుచు కుందునెప్పుడున్"**

(శ్రీ మహాభాగవతము ద్వాదశ-27)

జననం, మరణం జీవకోటికి సర్వసాధారణం అనే తాత్విక చింతనే భారతీయులను మిగతా జనకోటికి ఆదర్శప్రాయంగా అనేక శతాబ్దాల పాటు నిలిపి ఉంచింది.

✧✧✧✧✧

# 13. మరణంపై విజయం కోసం అమృతాన్వేషణ

చిరకాలం చిరంజీవులుగా బతకాలనే కోరికతో అమృతాన్ని అన్వేషిస్తూ సాగే సాహసోపేత గాథలు జానపదాల్లో ఉంటాయి. మృత్యువుని జయించిన మార్కండేయుడు వంటి భక్తులు, అనేక వరాలు పొంది కూడా అపమృత్యువు పాలైన రాక్షసులు పురాణాల్లో కనిపిస్తారు. మానవుని ఆయుఃప్రమాణం పెంచాలని శాస్త్రజ్ఞులు ప్రయత్నిస్తున్నారు. యుగయుగాలుగా అమృతాన్వేషణలో మానవుని అనుభవాల సారాంశం...

**హరి మాయా విరచితమై**
**తరుణీ రూపంబు దాల్చి బర్విన బం**
**ధుర తృణ పరివృత కూపము**
**కరణి నదియు మృత్యు రూపకంబగు మరియున్**

అని మహాభాగవతం చెబుతోంది. పురుష రూపంలో ఉన్న జీవుడు నిరంతర స్త్రీ సంగమం వల్ల స్త్రీత్వం పొందుతాడు. ఈ క్రమంలో స్త్రీ రూపంలోని జీవుడు విష్ణుమాయ వల్ల పురుషరూపం పొంది ఆత్మబంధ కారణమైన మృత్యువుకి చేరువవుతాడు. దీనినిబట్టి స్త్రీపురుషులు ఒకరికొకరు మృత్యుకారకులవుతారని తెలుస్తోంది.

'న మృతా భవంత్యనే నేత్యమృతం...' దీనిని సేవించడం వల్ల మృత్యువు దరిచేరదు. అది జలమో, పానీయమో, ఔషధమో, అపురూపమైన మూలికాసారమో, అద్భుతమైన పక్షి రూపమో కావచ్చు. అయినా మృత్యువును జయించి శాశ్వతంగా జీవించాలన్న కోరికతో చిరకాలం నుంచి ఇప్పటి వరకూ ప్రయత్నాలు సాగుతూనే వున్నాయి. కొందరు సాహసికులు ఆ జీవజలం, అమృతపాత్ర, మృతసంజీవని కోసం చేసిన సాహసయాత్రలు నాగరిక చరిత్రలో అద్భుత ఘట్టాలయ్యాయి. 'మృత్యోర్మా అమృతంగమయ' – మృత్యువు నుంచి నన్ను అమరత్వంలోకి నడిపించు అనేది ఉపనిషద్వాక్యం. మృత్యువును తప్పించుకోవడం అసాధ్యమనే విషయాన్ని మన పురాణాల్లో అనేక వరాలు పొంది కూడా చివరకి మరణించిన హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, భస్మాసురుడు, రావణుడు వంటి రాక్షస వీరుల చరిత్రలు తెలుపుతున్నాయి. క్షీరసాగర మథనంలో అమృతాన్ని అందిపుచుకున్న దేవతలు అమరులయ్యారు. శుక్రాచార్యుని వద్ద మృతసంజీవిని విద్యను నేర్చుకున్న కచుడు తాను బతికి గురువును బతికించుకున్నాడు. సంజీవినీ పర్వతాన్ని పెకలించుకొని వచ్చిన హనుమంతుడు రామలక్ష్మణులనే కాక వానర వీరుల్ని జీవింపచేస్తాడు. మార్కండేయుడు శివుని అనుగ్రహంతో, సావిత్రి పతి సత్యవంతుడు యమధర్మరాజు

వరంతో, హరిశ్చంద్రుని కుమారుడు లోహితాస్యుడు భగవదనుగ్రహంతో పునర్జీవులయ్యారు.

## మృత్యువు ఎలా వచ్చింది?

మృత్యువు మానవ లోకంలోకి ఎలా వచ్చిందీ అనే అంశంపై వివిధ నాగరికతల్లో వివిధ కథలున్నాయి. ఉత్తర అమెరికాలోని 'షోషోని' తెగ ప్రజల నమ్మకం ప్రకారం తోడేలు దేవుడు, కోయెటె (Coyote) మధ్య సంవాదం జరుగుతుంది. అందరినీ బతికించాలని దేవుడంటే అందరూ బతికితే భూమి నిండిపోతుంది కాబట్టి వద్దు అని కోయెటె వాదిస్తుంది. నిజమే అని దేవుడు శాసించి ముందు నీ కొడుకే 'చనిపోయే వారి'లో ఉన్నాడు అని అసలు రహస్యం చెపుతాడు. అప్పటినుంచే కొయెుటె జాతుల్లో మృత్యువు మొదలైందట.

మానవులకు ప్రొమెథియాస్ అగ్నిని అందించి సాయం చేస్తున్నాడని జ్యూస్ అధిదేవత 'పండోరా' అనే మొదటి స్త్రీని సృష్టించి తెరవ కూడదని ఒక కలశాన్నిచ్చి భూలోకంలోకి పంపితే కుతూహలాన్ని ఆపుకోలేక ఆమె కలశం మూత తీయడంతో దానిలో వున్న చెడు (ఈవిల్స్), వ్యాధులు, మృత్యువు బయటపడ్డాయని, ఆమె వెంటనే మూత మూయడంతో 'ఆశ' మిగిలిందని, మానవులు వ్యాధుల బారిన పడి మృత్యుకూపంలోకి చేరుకున్నా ఆ కలశంలో మిగిలి వున్న 'ఆశ'తో ఎదురుచూస్తూ వుంటారని గ్రీకు పురాణాలు చెపుతున్నాయి.

పాలినేసియన్ దీవులలోని 'మావొరి' తెగల విశ్వాసం ప్రకారం టేన్ దేవుడు అరణ్యాలకు, వృక్షాలకు అధిదేవత. 'హవాయికీ' అనే దీవి ఇసుక నుంచి మొదటి స్త్రీని తయారు చేశాక వారిద్దరికి సంధ్యాదేవత 'హైన్‌టిటామా' అనే పుత్రిక పుడుతుంది. తనని కూడా తన తండ్రే పెళ్లి చేసుకోవడం సహించలేని సంధ్య పాతాళానికి పారిపోతుంది. తండ్రితో వున్న బంధాన్ని తెంచుకున్నాక తండ్రి ఇతర సంతానమైన మానవుల్ని మృతుల్ని చేసి పాతాళానికి లాగేస్తుందనీ, ఆనాటి నుంచి దగ్గర రక్త సంబంధీకుల మధ్య సంబంధాలు నిషేధించినట్లు 'మావొరి' ప్రజలు నమ్ముతారు.

ఎస్కిమో ఇన్యూట్ జాతిలో మృత్యువు లేక వాళ్లు తామరతంపరగా పెరిగిపోయి వాళ్లు వున్న దీవి తలకిందులు కాబోతే ఆ తెగలోని వృద్ధురాలు మంత్రాలతో మృత్యువును, యుద్ధాన్ని ఆహ్వానించింది. అప్పట్నుంచే జనాల మధ్య యుద్ధాలు, చావులు మొదలయ్యాయట.

## మృత్యువుని చూసినవాళ్లు

'మృత్యువు వెళ్లే దారిలో బ్రహ్మాండమైన గండశిలలతో అడ్డుకుని నిన్ను రక్షించుకుంటాను' అని రుగ్వేదంలో మంత్రమున్నది. నచికేతుడు మృత్యుముఖంలోకి వెళ్లి యముని ప్రార్థించి మూడవ వరంగా మృత్యు రహస్యం తెలుసుకున్నాడని

కఠోపనిషత్ చెబుతోంది. ప్రజాపతి తాను సృష్టించిన పుత్రుడ్ని తానే భక్షించబోగా భయం చెందిన వాళ్లు 'భాణ, భాణ' అని అరిచారని కాబట్టి భయం నుంచే వాక్కు పుట్టిందని బృహదారణ్యోపనిషత్తులో ఉంది. మృత్యువే భయకారకం కదా! తన భర్తను బతికించుకోవడానికి సావిత్రి, తన భార్య యురిడెస్ కోసం ఆర్ఫియస్, తన కుమార్తె 'పెర్సిఫోన్' కోసం డిమాటర్ (భూమాత), తండ్రి చేసిన దానం నిమిత్తం నచికేతుడు యమలోకానికి వెళ్తారు. తన భర్త 'తమ్మస్' కోసం ఇస్తార్ దేవత (శృంగారానికి, యుద్ధానికి అధిదేవత) నరకలోకానికి వెళ్లినప్పుడు తనపైని వస్త్రాల్ని, ఆభరణాల్ని కోల్పోతుంది. నరకాధిపతి 'ఎరిగెల్' శాపానికి ప్రాణాలు కోల్పోయిన ఇస్తార్ భూలోకానికి రాలేక పోవడంతో ఇక్కడ వసంత ఋతువు రాక అల్లకల్లోలం కావడంతో దేవతలు ఆమెను మరల భూలోకానికి జీవజలంతో బ్రతికించి తీసుకువస్తారు.

తన మిత్రుడు ఎంకిడు చనిపోవడాన్ని చూసిన గిల్గామేష్ మృత్యువును జయించి చిరంజీవి కావాలనే కోరికతో మృత్యుజలాల్ని దాటి, జలప్రళయంలో బతికి దేవతల వరంతో చిరంజీవిగా ఉన్న 'ఉత్నాపిష్టిమ్' వద్దకు వెళ్తాడు. అతని సాయంతో సముద్రపు అడుగున వున్న సంజీవని లతను సంపాదించి వస్తూండగా ఓ చెట్టు కింద నిద్రపోయినప్పుడు ఒక సర్పం ఆ మొక్కను దొంగిలించుకొని పారిపోతుంది. అప్పట్నుంచీ పాములు కుబుసాలు విడుస్తూ కొత్త జీవితాన్ని ఎప్పటికప్పుడు పొందుతుంటాయి. గిల్గామేష్‌కు మాత్రం మృత్యువు తప్పలేదు. పై రెండూ సుమేరియన్ అస్సిరో, బాబిలోనియా కథలు.

## ఆత్మకు మరణం లేదు

1461 సంవత్సరాలు జీవించే 'ఫీనిక్స్' పక్షిని తింటే అమరత్వం వచ్చి శాశ్వతంగా బతకవచ్చనుకున్న 'హీలియో గబారిస్' అనే రోమన్ చక్రవర్తి ప్రపంచంలోనే అరుదైన పక్షుల్ని తెప్పించుకుని తిన్నా కాలం కలిసిరాక హత్యకు గురవుతాడు. రసవాదులు (ఆల్కెమిస్టులు) జీవజలం, పరసవేది (ఫిలాసఫర్స్ స్టోన్) కోసం పొన్సెజిలియాస్ లాంటి వాళ్లు 'బిమిని' యవ్వన జలధారల కొరకు ఎందరో మాండ్రేక్, జింకోబల్బా, జిన్‌సెంగ్, సోమలతల్లాంటి మూలికల కోసం వెతుకుతూ కొంతకాలమైనా మృత్యువును అధిగమించే ప్రయత్నం చేస్తూనే వున్నారు కాని జాతస్య హి ధ్రు వో మృత్యుర్ధ్రువం - పుట్టినవాడు గిట్టక తప్పదు కదా!

**నా జాయతే మ్రియతే వా కదా చిన్నాయం భూత్వా భవితా వాన భూయః**
**అజో నిత్య శాశ్వతోదయం పురాణోన హన్యతే హన్యమానే శరీరే**

అని ద్వితీయాధ్యాయం, భగవద్గీతలో ఉంది. శరీరం నశించినా ఆత్మ నశింపదనే జ్ఞానం కలిగినవాడు మృత్యుభయం పొందడు. అదే అసలైన అమృతాన్వేషణ.

✧✧✧✧✧

# 14. కాలాయనమః

ఈ నిఖిల సృష్టిలో కాలం ఓ మహాద్భుతం. కాల రహస్యం తెలుసుకోగలిగితే ఈ జన్మ సార్థకం అయినట్టే. కాలగమనంలో ఎన్నో యుగాలు గడిచిపోయాయి. కలియుగంలో వేల సంవత్సరాలు గడిచాయి. కాల ప్రవాహం ఇలా సాగుతూనే ఉంటుంది. యుగాంతం గురించి ఆలోచించే కంటే ప్రతిక్షణాన్నీ ఆనందంగా, సార్థకంగా జీవించడమే కాలానికి మనం ఇచ్చే నీరాజనం.

"కాలః కాళ్యా భువనఫలకే క్రీడతి ప్రాణి శారైః". లోకమనే పాచికల బల్లపై రాత్రి, పగలు అనే పాచికలను దొర్లిస్తూ కాలుడు, కాళి అనే ఇద్దరు ఆటగాళ్లు జూద మాడుతున్నారు. అని భర్తృహరి కాల మహిమను అద్భుతంగా వర్ణించాడు. కాలంలో రెండు ముఖ్యాంశాలున్నాయి. 1. వ్యవధి (ఇంటర్వెల్), 2. మైలురాయి (స్థానం లేదా ఎపోక్). ఈ మైలురాయికే జీవులు, నిర్జీవులు వాటి ఆయుఃప్రమాణం లేదా స్థిరత్వం అనే తాటితో బంధించబడి వలయాలు వలయాలుగా పరిభ్రమిస్తుంటాయి. కాలరథం ముందుకు సాగుతూంటే అవి కథలుగా, కల్పనలుగా చరిత్ర పుటల మరుగున మాయమైపోతూ ఉంటాయి.

ప్రౌస్ట్ అనే ఫ్రెంచి రచయిత ఏమంటాడంటే– "కాలం (టైమ్) అనే ప్రవాహంలో అన్ని జీవరాసులున్నాయి. కాని మానవుడొక్కడే కాలాన్ని తనకనుగుణంగా మార్చుకోగలుగుతున్నాడు. తాను నేర్చుకున్న దానిని భవిష్యత్ వర్తమాన కాలాల్లో వినియోగిస్తున్నాడు."

## క్యాలెండర్ పుట్టుక

ఏనాడయితే మానవుడు రాయడం కనిపెట్టాడో ఆనాటి నుంచే కాలానికి కళ్లెం వేయగలిగాడు. అంతేకాకుండా కాలాన్ని రోజులు, గంటలు, నిమిషాలు, సెకన్లుగా, సెకన్లలో బిలియన్, ట్రిలియన్ల భాగాలుగా విభజించి పరిశోధన చేస్తున్నాడు. కాలుడు, కాళి రూపాలను హిందువులు కాలదైవంగా పూజిస్తున్నట్టే, ఈజిప్షియన్ల క్యాలెండర్‌ను వారి కాలదేవుడయిన 'తోత్' (ఇబిస్ కొంగ శిరసుతో, మానవ రూపం కలిగిన) తయారుచేశాడు. మానవులు మరణించాక పాతాళ లోకంలో వాళ్ల హృదయాల్ని న్యాయదేవత 'మాత్' ఈకతో తూచి పాప పుణ్యాలను (చిత్రగుప్తుడిలా) బేరీజు వేస్తాడు. ఈజిప్షియన్ క్యాలెండర్ మొదటి నెలను 'తోత్'గా పిలుస్తున్నారు. గ్రీకులకు కాలానికి, వ్యవసాయానికి అధిదేవత క్రోనాస్, చేతిలో కొడవలితో గడుస్తున్న సంవత్సరాలను తొలగించే ఇతడు గ్రీకుల అధిదేవత జ్యూస్‌కు తండ్రి. క్రోనాలజీ

లాంటి కాల సంబంధమైన పదాలు క్రోనాస్ నుంచే వచ్చాయి. వారాల పుట్టుక విచిత్రంగా ఉంది. సోమవారం–మండే–మూన్‌డే–లాటన్; మంగళవారం–ట్యూజ్‌డే –ట్యూటోనిక్– న్యాయదేవత–ట్యు; బుధవారం–వెడ్‌నెస్‌డే– వోడిన్–ట్యుటోనిక్ ప్రధాన దేవత; గురువారం–థర్స్‌డే–థోర్–యుద్ధదేవత; శుక్రవారం–ఫ్రైడే–ఫ్రియా–ప్రేమదేవత; శనివారం–శాటర్‌డే–శాటరన్–రోమన్ల వ్యవసాయ దేవత; ఆదివారం–సండే–సూర్యుడు – లాటిన్. వీటిని వారాల పేర్లకు ఆధారాలుగా చెప్పవచ్చు.

## చంద్రుడే కొలమానం

కాలాన్ని అంచనా వేయడానికి చంద్రుడే మానవుడికి మొదట ఆధార మయ్యాడని శాస్త్రజ్ఞులంటున్నారు. 35వేల సంవత్సరాల క్రితమే రోజులను లెక్కించ డానికి చంద్రమానాన్ని వాడారని కొందరి నమ్మకం. ఆస్ట్రేలియాలోని ఆదిమవాసులు ఆర్క్‌టరస్, వేగా నక్షత్రాల్ని వేట ప్రారంభానికి, బ్రెజిల్‌లోని టుకానో ఇండియన్లు ప్లియడ్స్ రాశిని విత్తనాలు నాటే కాలానికి గుర్తులుగా భావించేవారు. బ్రిటన్‌లోని 'స్టోన్ హెంజ్' లాంటి రాతి నిర్మాణాలు సంవత్సరంలోని దీర్ఘ దినం (జూన్ 24), హ్రస్వదినం (డిసెంబరు 22), విషువత్ చలనాలను గమనించడానికి ఉపయోగపడేవి. సుమేరియన్లకు చంద్రమానం ప్రకారం సంవత్సరానికి 360 రోజులు, 12 నెలలు, నెలకు ముప్పై రోజులు. సీజన్లలో అవకతవకలను గమనించాక బాబిలోనియన్ల రాజు హమ్మురబి (క్రీస్తుపూర్వం 1700) తేడా వచ్చినప్పుడల్లా అధిక మాసం ప్రకటించేవాడు.

## అయోమయ సంవత్సరం

ఈజిప్టులో నైలునదికి జూలై మధ్యలో వరదలు ప్రారంభమయ్యేవి. అదే కాలంలో తూర్పున సూర్యోదయానికి ముందే సిరియస్ నక్షత్రం (సోథిస్ లేదా డాగ్‌స్టార్) ప్రత్యక్షమయ్యేది. అలా ఆ నక్షత్రానికి నైలునది వరదలకు సంబంధం ఏర్పడింది. అప్పటికే ఈజిప్షియన్లకు సంవత్సరానికి 365 రోజులని తెలుసు. కాని పన్నెండు నెలలకు ముప్పై రోజుల చొప్పున 360 రోజులే వస్తున్నాయి. అందుకని 'తోత్' సంవత్సరం చివరి నెలలో ఓ ఐదు రోజుల్ని ఐదుగురు దేవతల (ఒసిరస్, హోరస్, సెట్, ఐసిస్, నెఫ్థితస్) పేర్లతో (మన) సెప్టెంబర్ నెలలో వచ్చేట్టు ప్రకటించాడు. క్రీస్తుపూర్వం 238లో టాలమీ యుర్గెటిస్ నాలుగేళ్లకోసారి అధిక దినాన్ని కలపాల్సిందిగా ఆదేశించినా, అది జూలియస్ సీజర్ కాలంలోనే అమలులోనికి వచ్చింది. సోసిజినస్ అనే జ్యోతిషవేత్త సలహాతో జూలియస్ సీజర్ కాలమానాన్ని సరిదిద్దడానికి క్రీస్తుపూర్వం 46వ సంవత్సరానికి 445 రోజులుగా నిర్ణయించాడు. రోమను చరిత్రలో ఆ సంవత్సరానికి (ఇయర్ ఆఫ్ కన్ఫ్యూజన్) అయోమయ

సంవత్సరంగా పేరు వచ్చింది. జూలియస్ క్యాలెండర్ ఆ విధంగా 1600 సంవత్సరాల పాటు కొనసాగింది. అయినా 128 సంవత్సరాలకు ఒకరోజు చొప్పున పదమూడు రోజులు వెనకబడిందని క్రీస్తుశకం 1582లో పోప్ గ్రెగరి - 13 అక్టోబరు నెలలో పది రోజులు తగ్గించాడు. వాళ్లకు అక్టోబరు 4 తరువాత అక్టోబరు 15 వస్తుందన్న మాట. కాథలిక్ యూరోప్ దీనిని ఆమోదించినా, ఇంగ్లాండులో మాత్రం 1752లో అమలయినప్పుడు ప్రొటెస్టంట్లు 'మా పదకొండు రోజులు మాకివ్వండి' అని లండన్‌లో ప్రదర్శనలు చేస్తూ అల్లర్లు చేశారు.

## భ్రమణ-పరిభ్రమణాలు

కాలాన్ని కొలవడానికి నీడ, నీరు (క్లెప్సిడ్రా), ఇసుక, కొవ్వొత్తి, స్ప్రింగ్, యాంత్రిక, పెండ్యూలం (లోలక), క్వార్ట్జ్, అటామిక్ గడియారాలు పరిణామం చెందాయి. (భూమి తన చుట్టూ తాను తిరగడానికి 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్లు పడుతుంది. చంద్రుడు భూమిచుట్టూ తిరగడానికి 27 రోజుల 7 గంటల 43 నిమిషాల 11.47 సెకన్లు; భూమి సూర్యుడి చుట్టూ తిరగడానికి 356 రోజుల 5 గంటలు పడుతుంది. గ్రహణాలు ఒకే ప్రదేశంలో తిరిగి ఏర్పడడానికి 233 చంద్రమాసాలు (18 సంవత్సరాల 11.3 నెలలు పడుతుంది) దీనిని సారోనిక్ సైకిల్ అంటారు. సిరియస్ (సోథిక్ నక్షత్రం) మరల అదే ప్రదేశంలో ఉదయించడానికి 1461 సంవత్సరాలు పడుతుంది. దీనిని సోథిక్ సైకిల్ అంటారు. సూర్యుడు భూమధ్య రేఖను దాటే రెండు స్థలాలు (విషవత్ చలనాలు) ఒకే విధంగా రావడానికి 25,827 సంవత్సరాలు కావాలి. పాలపుంత కేంద్రకం చుట్టూరా ప్రదక్షిణం చేసి ఉన్నచోటుకు తిరిగి రావడానికి సూర్యుడికి 25 కోట్ల సంవత్సరాలు పడ్తుంది. దీనిని కాస్మిక్ సంవత్సరం అంటారు. 50 కోట్ల సంవత్సరాలకు ఒకసారి మన పాలపుంత (మిల్కీవే) ఆత్మప్రదక్షిణం పూర్తిచేస్తుంది.

## కలియుగం ఆరంభం

శ్రీ కృష్ణ పరమాత్మ క్రీస్తుపూర్వం 3102లో నిర్యాణం పొందిన రోజునే కలియుగం ప్రారంభమైంది. మధ్య అమెరికాలోని 'మాయా' ప్రజలకు దినచక్రం, చంద్రమానం, సూర్యమానం మూడు ముఖ్యమే. ప్రతి రోజూ, సంవత్సరం, దశాబ్దం, శతాబ్దం, సహస్రాబ్దం వేర్వేరు దేవతలకు చెందినది. క్రీస్తుపూర్వం 3372 వీరి కాల రేఖలో మొదటి రోజు. క్రీస్తుపూర్వం 4241 ఈజిప్షియన్ క్యాలెండర్‌లో మొదటిరోజు. యూదులకు క్రీస్తుపూర్వం 3760 కాగా, సెయింట్ ఆగస్టీన్ క్రీస్తుపూర్వం 5000 సంవత్సరాలప్పుడు సృష్టి జరిగిందని భావిస్తే, జేమ్స్ అషర్ అనే బిషప్ క్రీస్తుపూర్వం 26-10-4004 ఉదయం తొమ్మిది గంటలకు సృష్టి జరిగిందని లెక్కలు కట్టాడు.

## కాలం ముగింపు లేని పాట

కాలం ఎప్పుడూ ముందుకే పోతుందా? కాలానికి అంతం ఉందా అనేవి కొన్ని గమ్మత్తైన ప్రశ్నలు. మహాకవి టెన్నిసన్ అన్నట్టు "అందం శిఖరాగ్రాలకు చేరకపోయినా, అంతం త్వరగా రాకపోయినా ఫరవాలేదు. కాని ఆనందమే అంతిమ జ్ఞానమయినపుడు కాలం ముగింపులేని అద్భుతమైన పాట అవుతుంది"

## ముక్తికాలం

కలియుగ ప్రమాణం 4,32,000 సంవత్సరాలు.

ద్వాపరయుగం - 8,64,000 సంవత్సరాలు

త్రేతాయుగం - 12,96,000 సంవత్సరాలు

కృతయుగం - 17,28,000 సంవత్సరాలు

43,20,000 సంవత్సరాలు అయితే ఒక మహాయుగం.

71 మహాయుగాలు - ఒక మన్వంతరం;

14 మన్వంతరాలు - ఒక కల్పకం

1000 మహాయుగాలు (ఒక కల్పకం)-బ్రహ్మకు ఒక పగలు.

8.64 బిలియన్ సంవత్సరాలకు బ్రహ్మకు ఒక రాత్రి + పగలు

360×864 కోట్ల సంవత్సరాలు=ఒక బ్రహ్మ సంవత్సరం.

100 బ్రహ్మ సంవత్సరాలు (100×360×864 కోట్ల సంవత్సరాలు) బ్రహ్మకాలం. దీనిని ముక్తికాలం అంటారు. హిందువుల లెక్క ప్రకారం ఇప్పుడు మనం శ్వేతవరాహ కల్పంలో 6 మన్వంతరాలు గడిచి, 7వ మన్వంతరమైన వైవస్వత మన్వంతరంలో, 28వ మహాయుగంలో, కలియుగంలో 5115వ సంవత్సరంలో ఉన్నాం.

✧✧✧✧✧

# 15. ఉద్వేగాల వ్యక్తీకరణ మార్గం - వాక్కు

వాక్కు లేని ప్రపంచాన్ని ఊహించుకోలేం. ఉద్వేగాల వ్యక్తీకరణ మార్గంగా వాక్కుజీవం పోసుకొని, మహనీయుల చేతుల్లో పదునుదేలి, చిత్రవిచిత్ర రీతుల్లో హొయలుపోయి, కొత్త సొబగులు అద్దుకున్నది వాక్కు. ప్రపంచంలోని సమస్త జీవరాశులకు భాష ఉంటుంది... భావోద్వేగాలతోనే భాషా సంకేతాలు ఉద్భవించాయి... అనేక భాషలు ఆవిర్భవించాయి... వాటిని రుషులు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా రూపొందించిన తీరు మహాద్భుతం.

అమెరికన్ భాషా శాస్త్రజ్ఞుడు నోమ్ చోమ్‌స్కీ అభిప్రాయం ప్రకారం "అన్ని భాషల్లోనూ కొన్ని ప్రాథమిక ధర్మాలుంటాయి. అందుచేత అన్ని భాషల మూల నిర్మాణం ఒక్కటే. పక్షులకు ఎగరడం వచ్చినట్లే మానవుడికి మాట్లాడడం మెదడులో నిక్షిప్తమైన ప్రోగ్రాం" అంటాడతడు.

**"చత్వారి వాక్ పరిమితా పదాని**
**తాని విదుః బ్రాహ్మణా యే మనీషిణః**
**గుహాత్రీణి నిహితా నేంగితాని**
**తురీయం వాచో మనుష్యా వదంతి"**

- రుగ్వేదం 1-164-45

పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అని వాక్కు నాలుగు విధాలు. ఆత్మదర్శనులైన మహాయోగులకే మొదటి మూడూ దర్శనమిస్తాయి. నాలుగోదైన వైఖరీ వాక్కు పరిమిత శబ్దరూపమై మానవులకు ఉపకరిస్తున్నది.

### తొలిభాష ఫ్రిజియన్?

క్రీస్తుపూర్వం 663-609 వరకు ఈజిప్టును పాలించిన సామ్‌టిక్-1 మహారాజుకు మానవుల తొలిభాష ఏమిటి? అనే అనుమానం వచ్చింది. పిల్లల్ని పుట్టగానే ఏ విధమైన మానవ సంపర్కం లేకుండా వేరుచేసి చూద్దాం! వాళ్లు ఏదైతే మాట్లాడ్తారో ఆ భాషే తొలిభాష అని అనుకున్నాడు. రాజు తలచుకుంటే బిడ్డలకు కొదవా! అప్పుడే పుట్టిన ఇద్దరు పసిపాపల్ని ఒక గొర్రెల కాపరికి ఇచ్చి చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవిలోకి పంపించాడు. పైగా ఎవరూ అటు పోకూడదు, గొర్రెల కాపరితో సహా ఎవరూ మాట్లాడకూడదు అని ఆజ్ఞలు జారీ

చేసినాడు. అలాగే పిల్లలు మాట్లాడిన తొలి మాటలు తనకు వెంటనే చెప్పవలసిందిగా ఆజ్ఞాపించాడు. రెండేళ్ల తర్వాత గొర్రెల కాపరి ఒకరోజు రాజసభకు పరిగెత్తుకు వచ్చి పిల్లలు 'బేకాజ్, బేకా' అని అరుస్తున్నారని చెప్పాడు. బేకాజ్ అంటే ఫ్రిజియన్ల భాషలో 'బ్రెడ్' అని అర్థం (ఫ్రిజియా అనేది మధ్య టర్కీలో ఒక ప్రాంతం). పిల్లలు ఆకలేసి ఆ భాషలో మాట్లాడుతున్నారు. కావున ఫ్రిజియన్ల భాషే మానవుడి తొలిభాష అని ఆ మహారాజు నిర్ధారించాడు. ఆ పిల్లలు తమ చుట్టూ ఉన్న గొర్రెల అరుపుల్ని అనుకరిస్తున్నారన్న అనుమానం ఎందుకో ఆ రాజుకు రాలేదు.

## సంకేతాలతో భాష

గొర్రెలకే కాదు సమస్త జంతువులకూ వాటి వాటి భాషలున్నాయి. ఉదాహరణకు కోడిపిల్లలను కాపాడుకోవడానికి కోడిపెట్ట, పుంజు నక్కను చూస్తే 'గోగోగోగోక్' (శత్రువు నేలమీద ఉన్నాడు). డేగను చూస్తే రేరే (అపాయం గాల్లోంచి ఉంది) అని వివిధ రకాలుగా అపాయపు హెచ్చరికలు చేస్తాయట. ఏనుగుల భాష మరింత క్లిష్టమైనది. ఫిడ్లర్ పీత తన డెక్కల్తో, మిడతలు, క్రికెట్లు తమ కాళ్లతో, రకరకాల సంజ్ఞలు, శబ్దాలు చేసి తమ ప్రియురాళ్ల మన్ననలను పొందుతాయి. పక్షులు, జంతువులు రకరకాల శబ్దాలు పుట్టించడం ద్వారా, తమ శరీరపు రంగుల్ని మార్చుకోవడం ద్వారా ఎదుటి వాటికి తమ భావాల్ని వెల్లడిచేస్తాయి. తిమింగలాలు, డాల్ఫిన్‌లు రకరకాల సంగీతపు పాటల ద్వారా తమ ఉనికిని, ప్రత్యేకతను వెల్లడి చేస్తే, ఆఫ్రికన్ వెరెవెట్ కోతులు తమతమ శత్రువుల సమాచారాన్ని నాలుగు విభిన్న శబ్దాలతో తమ వాళ్లకు అందిస్తాయి.

## శబ్దాలే భాషలకు మూలం

మానవుడిలో వాక్కు నలభైవేల ఏళ్ల క్రితం వచ్చి ఉండవచ్చునని, అది రాయడానికి ఇరవై వేల ఏళ్ల క్రితం అభివృద్ధి చెంది, హోమోసెపియన్స్ అంటే మనకు వారసత్వంగా వచ్చిందని పురాతత్వ శాస్త్రజ్ఞుల అభిప్రాయం. పక్షుల భాషలాంటి భాషను మెక్సికోలోని 'మాజాటెకో' ఇండియన్లు మాట్లాడతారు. అది 'ఈల' (విజిల్) భాష. కానరీ ద్వీపంలో 'సిల్బో' అని పిలువబడే ఈల భాష నిశ్శబ్దంగా ఉన్న లోయలు, గుట్టలు దాటి ఐదు మైళ్లదాకా వినబడుతుందట. ఈజిప్టు రాజు సామ్‌టెక్-1 ప్రయోగంలానే క్రీస్తుశకం 1880లో హవాయి ద్వీపాల్లో చక్కెర తోటల్లో పని చేయడానికి చైనా, జపాన్, కొరియా, స్పెయిన్, పోర్చుగీసు ప్రాంతాల నుంచి శ్రామికులు వలస

వెళ్లారు. వాళ్ల యజమానుల ఇంగ్లీషు భాష వీళ్లకు రాదు. అతికష్టం మీద 'పిడ్జిన్ ఇంగ్లీష్' ముతక పదాలతో వాళ్లు కమ్యూనికేషన్ ఏర్పరచుకోగలిగారు. 1910 నాటికి వీళ్ల పిల్లలు ఆటలాడేటప్పుడు వాళ్ల భాషలోని ముఖ్యమైన పదాలతో సంభాషించుకోవడం మొదలెట్టారు. ఈ కొత్త భాష 'హవాయియన్ క్రియోలె'గా ఎంతగా ప్రాచుర్యంలోకి వచ్చిందంటే పిల్లల తల్లిదండ్రులు, భాషా శాస్త్రజ్ఞులు పిల్లల దగ్గర్నుంచి ఆ భాష నేర్చుకోవలసి వచ్చింది.

## ఉద్వేగాల నుంచి భాషలు

అడవిలో తప్పిపోయి తోడేళ్ల దగ్గర పెరిగిన పిల్లలు తరువాత జనంలోకి వచ్చాక మాట్లాడ్డంలో చాలా కష్టపడాల్సి వచ్చింది. కొంతమంది మాటల్ని, పాటల్ని రివర్స్‌గేర్‌లో మాట్లాడ్తారు. పిల్లలు కభాష, ఉంగా భాష, ఎగ్గీపెగ్గీ భాషలాంటి కొత్త కొత్త ఆటల్ని కనిపెట్టి ఆనందిస్తూ ఉంటారు. జంతువుల్ని, పశుపక్ష్యాదుల్ని అనుకరించడం ద్వారా (బౌ–ఔ సిద్ధాంతం); సామూహికంగా శ్రమిస్తున్నప్పుడు ఉచ్చరించే శబ్దాల ద్వారా (యో–హే–హో సిద్ధాంతం); శ్రావ్య సంగీతం, పాటల ద్వారా (లా–లా సిద్ధాంతం); కోపం, దుఃఖం లాంటి ఉద్వేగాలలో వచ్చే శబ్దాల నుంచి (పూహ్–పూహ్ సిద్ధాంతం) భాషలు ఏర్పడ్డాయని కొందరంటారు.

## పలు భాషల పుట్టుక

దిన్నాగ, ధర్మకర్తి – అనే హిందూ వేదాంతులు వాక్కు నుంచి విషయ వ్యక్తీకరణ, విషయ వ్యక్తీకరణ నుంచి వాక్కు వస్తాయంటారు. ఏం మాట్లాడాము అన్న దాని కన్న ఆ మాటల, శబ్దాల వల్ల ఫలితమేమిటి అన్నది ముఖ్యం అంటాడు చైనీస్ వేదాంతి కన్ఫ్యూషియస్. అందరికీ తెలిసినట్లుండే దారి సరైన దారి కాదంటాడు జువాంగ్‌జు. నామాటలు అత్యంత సులభమైనవి. కాని ప్రపంచానికి అర్థం కావు. జ్ఞాని తక్కువ రకం బట్టలు ధరిస్తాడు. కాని ప్రకాశవంతమైన మణిని హృదయంలో దాచుకుంటాడు. మాటలను, శబ్దాలను తప్పుగా అర్థం చేసుకునే వీలున్నది. మనం వాడని మాటలు, వాడిన వాటికన్నా వాడివైనవి కావచ్చును. ఒక్కోసారి మౌనమే అతిశక్తివంతమైన శబ్దం అంటాడు హీజెగ్గర్ అనే వేదాంతి.

సమస్త జనులు ఒకే భాష, ఒకే పలుకుతో మాట్లాడుతూ ఉండి, అతి ఎత్తైన గోపురాన్ని నిర్మిస్తూ భగవంతుణ్ణి చేర సిద్ధమయ్యారు. వాళ్లను వాళ్ల అహంకారాన్ని

గమనించిన దేవదేవుడు వాళ్ల భాషల్ని - మాటల్ని ఒకరికొకరికి అర్థం కాకుండా మార్చి, వాళ్లని చెల్లాచెదరు చేసెను. ఆ గోపురానికి ఆనాడు టవర్ ఆఫ్ బాబెల్- గందరగోళపు గోపురమనే పేరు వచ్చింది. అలా అనేక భాషలు, పలుకులు ఏర్పడ్డాయని బైబిల్‌లో చెప్పబడినది.

**"బృహస్పతే ప్రథమం వాచో అగ్ర్యం**
**యత్ప్రేరత నామధేయం దధానాః**
**య దేషాం శ్రేష్ఠం యదరి ప్రమాసీత్**
**ప్రేణా తదేషాం నిహితం గుహానిః"**

రుగ్వేదం 10-71-1

రుషులు తమ భావాలకు వాక్ రూపాన్ని ఇచ్చారు. ఆ వాక్కులను జల్లెడతో పిండిని జల్లించినట్లు శుభ్రపరచి ప్రేమతో దివ్యము, రహస్యము అయిన ఈశ్వర తత్త్వాన్ని సామాన్యులకు అర్థమయ్యేట్టు వెల్లడి చేయగా ప్రజలు సఖ్యంగా మనుగడ సాగిస్తున్నారు.

✧✧✧✧✧

# 16. లోకానికి శ్రీరామరక్ష - అక్షరం

జగత్ ఆవిర్భావానికి మూలం ఓంకారం... సకల జీవరాశుల శబ్దాల పుట్టుకకు ఆధారం ఓంకారం... భాష పుట్టుక నుంచి అక్షరమాల ఏర్పడే వరకు అంతా ఓంకారమయం. మాట ప్రారంభం ఓ అద్భుతమైతే... లిపి ఏర్పడడం మహాద్భుతం. ఒక్కోదేశం ఒక్కో లిపిని అనుసరించింది. భావాలను, సమాచారాన్ని పంచుకొనేందుకు అక్షరం వారధిగా నిలిచింది. మానవ నాగరికతను కొత్త మలుపులు తిప్పిన అక్షరం కథ ఇది.

**'అక్షరావగమ లబ్ధయే యథా, స్థూల వర్తుల దృషత్ పరిగ్రహః**
**శుద్ధ బుద్ధ పరిలబ్ధయే తథా, దారు మృణ్మయ శిలామయార్చనమ్'**

- జ్ఞాన వాసిష్ఠమ్

అక్షర జ్ఞానం కలిగించడానికి పిల్లలకు చిన్న, పెద్ద గుండ్రటి రాళ్లను చెక్కి చూపించినట్లు, పరిశుద్ధాత్మ జ్ఞానం కలిగించేందుకు కొయ్య, మట్టి, రాయి మొదలైన వాటితో విగ్రహాలు చేసి పూజిస్తున్నాము.

ముందు శబ్దం పుట్టింది. అదే మహా విస్ఫోటన సమయంలో వెలువడిన ప్రణవనాదం, అదే ఓంకార శబ్దం. ఆ శబ్ద తరంగాలు (1-500 మెగాహెర్ట్జ) ఇప్పటికీ విశ్వం నలువేపులా వినవస్తున్నాయని 1965లో బాక్‌గ్రౌండ్ రేడియేషన్ వల్ల కనుగొన్నారు.

## ఓంకారమ్

శిశువు తల్లి గర్భం నుంచి బయటకు రాగానే కెవ్వుమని ఏడుస్తూ తన గుండెల నిండా ఊపిరి తీసుకుంటూ ఈ భూప్రపంచంలో బ్రతకడానికి తొలి ప్రయత్నం చేస్తుంది. మహత్తరమైన ప్రణవ నాదమైనా, శిశు రోదనైనా అకార, ఉకార, మకార కలయిక అయిన ఓంకారమే. అదే ఓం. అమ్మా (అ+ఉ+మ). అందుకే ఆ శబ్దానికంత పవిత్రత.

## నాదమే పరబ్రహ్మం

సూక్ష్మనాదం మూలాధారంలో ఉన్న బ్రహ్మ గ్రంథమందు ప్రాణాగ్నుల ప్రేరేపణతో ఉత్పన్నమై... క్రమముగా నాభి, హృదయము, కంఠము, నాలుక, ముక్కు, శిరస్సుల యందు సప్త స్వరములుగా, 12 స్వర స్థానాలుగా, 22 శ్రుతులుగా, మూడు స్థాయిలలో బహిర్గతం అవుతూ శ్రావ్యమైన సంగీతం అవుతున్నదని సంగీత రత్నాకరంలో చెప్పారు. అదే ప్రణవ నాదం. సకల జగత్తుకు, వేదాలకు, సంగీతానికి

ఆధారభూతమైనది. అక్షరము, పదము, వాక్యము, కావ్యము, నాటకము, అలంకారములకదే ఆధారం. వేదాలకు, సమస్త ఇతిహాసాది గ్రంథాలకు రూపమిచ్చిన అక్షరాలు ఓంకార శబ్దము నుంచే పుట్టాయి.

## రాతకు ముందే గీత పుట్టింది

శబ్దము నుంచి పిలుపు, పిలుపు నుంచి స్పందన, స్పందనతో పలకరింపు పుట్టాయి. రాత కంటే ముందు గీత పుట్టింది. ఇరవై వేల సంవత్సరాల క్రితమే రాతి గుహల్లో మానవుడు గోడలపై మహా మత్తేభాన్ని (మామత్) గీసాడు. బండరాళ్లపై తన చేతి ముద్రల్ని అచ్చుపోసాడు. సంజ్ఞలు, కేకలు, సంభాషణలయ్యాయి. అన్నీ కలిసి వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు యాసలు, భాషలు కాగా, భాష ప్రారంభమయిన అనేక వేల ఏళ్ల తర్వాత రాత మొదలయింది. మొదటి ఆధారం ప్రాచీన సుమేరియన్ పట్టణం 'కిష్' శిథిలాల్లో 5500 ఏళ్ల క్రితం రాసిందిగా నిర్ధారించిన లైమ్‌స్టోన్ టాబ్లెట్ వల్ల లభ్యమయ్యింది.

## భావం తెలియని లిపి

చిత్రలిపి (పిక్టోగ్రఫి), భావలిపి (ఐడియోగ్రఫి)గా పరిణామం చెంది వేర్వేరు పదాలకు ఉచ్చారణను బట్టి ఒకే చిత్రాన్ని సూచించడం మొదలయింది. సుమేరియన్ భాషలో బాణాన్ని, ప్రాణాన్ని కూడా 'టి' అనేవారు. అంచేత రెండింటికి ఒకే గుర్తు రాతలిపిలో వచ్చింది. ఈజిప్టు చిత్రలిపి (హీరోగ్లైఫ్ - గ్రీకు) పవిత్ర రాతలో 700 రకాల క్యారెక్టర్లుండగా, సుమేరియన్ల భాషలో 600, చైనీయుల 'ఒరాకిల్ బోన్స్'లో 2000 ఉండగా, సింధూ ప్రాంతపు మొహంజోదారో ప్రాంతంలో దొరికిన చిత్రలిపి భావం ఇంకా విశ్లేషణకు అందలేదు.

## లిపి సూత్రధారులు

సుమేరియన్ వ్రాయసగాళ్లు తొందరగా రాయడానికి క్యూనిఫారం (క్యూనియస్-లాటిన్-వెడ్జ్-కోణాకృతి) రాతలిపిని అభివృద్ధి పరచగా ఈజిప్టులో 'హీరోగ్లైఫ్' దైవాంశసంభూతులైన రాజులకు, 'హీరాటిక్' శైలి పూజారులకు మత గ్రంథాలు రాయడానికి, మూడవది 'డెమోటిక్' లేక పాపులర్ లిపి (చిత్రలిపి లేనిది) వాడుకలోకి వచ్చాయి. ఈజిప్టు క్రిస్టియన్ భాష 'కాప్టిక్'గా పిలువబడింది. 90 సిలబల్స్ ఉన్న మినోవన్ల (క్రెటే ద్వీపం) లీనియార్- A భాష క్రీస్తుపూర్వం 1600 నాటిది. 89 సిలబల్స్ ఉన్న లీనియార్-B భాష ప్రాచీన గ్రీకు భాషకు తొలి దశ అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ప్రపంచంలో 3500 ఏళ్ల నుంచీ వాడుతున్న ఏకైక శ్రావ్య - దృశ్య

భాష చైనీయుల భాష 'మందారిన్'. ఒక్క పదం ఒకే ఒక్క సింబల్‌తో సూచించబడడం వల్ల భాషను అర్థం చేసుకోవడం సులభం. చైనీయులను అనుకరించిన జపనీయుల భాష 'కానా'. 47 సింబల్స్‌తో ప్రాచీన భాష, 50 శబ్దాలతో నవ్య భాష 'గోజు ఆన్'గా వృద్ధి చెందింది.

## తొలి అక్షరమాల

తొలి అక్షరమాలను ఫొనిషియన్లు, యూదులు, కాననైట్లు క్రీస్తుపూర్వం 1660 నాటికి కనుగొన్నారంటారు. ఇది రెండు రకాలుగా సిరియాకు పశ్చిమ ప్రాంతంలో కాననైట్ల లిపిగా, తూర్పున అరామిక్ లిపిగా మార్పు చెందింది. జీసస్ క్రీస్తు మాట్లాడిన భాష అరామిక్. అరామిక్ అక్షరమాల పర్షియా, ఈజిప్టు పాలస్తీనా, సిరియా, అరేబియా, మెసపటోమియా, ఇండియాలలో వ్యాపించింది. యూదుల అక్షరమాల స్క్వేర్ హిబ్రూ నుంచి పవిత్ర గ్రంథమయిన 'టాల్ముడ్' నిబంధనలను అనుసరించి వృద్ధి చెందగా, అరబిక్ భాష 28 అక్షరాలతో అరామిక్ నుంచి పరిణామం చెందింది. పవిత్ర గ్రంథం ఖురాన్‌లోని భాష అరబిక్. మతంతో పాటుగా భాష కూడా వివిధ దేశాలకు విస్తరించింది.

## ఏ భాషకు ఎన్ని అక్షరాలు?

తొలి భాషలలో అచ్చులు లేవు. గ్రీకులు కాననైట్ల లిపిని సంస్కరించేప్పుడు హల్లులతో పాటుగా అచ్చుల్ని, హల లిపిని (కుడి నుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి) తర్వాత ప్రస్తుతం మనం వాడుతున్న ఎడమ నుంచి కుడిశైలిని వ్యాప్తిలోకి తెచ్చారు. గ్రీకుల నుంచి ఎట్రుస్కన్ల ద్వారా రోమన్లకు సంక్రమించిన అక్షరమాల 21 అక్షరాల నుంచి 26 అక్షరాలకు (వై. జడ్, జె, యు, డబ్ల్యు అక్షరాలు చేర్చడంతో) పెరిగింది. 9వ శతాబ్దపు గ్రీకు సెయింట్ సిరిల్ ద్వారా అక్షరమాల స్లావోనిక్ దేశాలయిన రష్యా, బల్గేరియా, సెర్బ్‌లకు వ్యాపించి, మార్పుచెంది సిరిలిక్ అక్షరమాలగా మారింది. కంబోడియన్ల అక్షరమాలలో 74 అక్షరాలుండగా, సాలమన్ ద్వీపంలోని రోటోకాస్ అక్షరమాలలో అక్షరాలు పదకొండే. దితి గర్భాన్ని ఇంద్రుడు ఛేదించగా బయల్పడిన 50 మంది మరుత్తుల కథ సంస్కృత దేవనాగరి లిపి ద్రావిడ భాష నుంచి అక్షరాలను గ్రహించిన విషయాన్ని తెలియచేస్తున్నదని పండితులంటారు.

## రాత శైలి రకాలు

రోమన్లు రాత లిపి శైలిని అనేక రకాలుగా వృద్ధి చేశారు. ప్రసిద్ధ కట్టడాల ఆకారంలో ఉండే 'మాన్యుమెంటల్ శైలి', రారాజు ఛార్లెమాగ్న ప్రోత్సహించిన

కరోలింగియన్ శైలి, జర్మనీలో వృద్ధి చెందిన గోథిక్ శైలి, గుండ్రని, చూడముచ్చటయిన లిట్టరా ఏంటిక్వాశైలి ప్రసిద్ధమైనవి. కలిపి రాసే గొలుసుకట్టు శైలి 18, 19 శతాబ్దాలలో ప్రాచుర్యం పొందగా, తర్వాత ఆ లిపి తన పూర్వ అందాల్ని కోల్పోయింది.

**అక్షరాలకు ఆధారాలు**

ప్రపంచంలో ఇప్పుడు 9 వేల పైబడి భాషలు, యాసలు ఉండగా 12 భాషలు (చైనా, మందారిన్, ఇంగ్లీషు, హిందీ, రష్యా, స్పానిష్, జర్మన్, జపనీస్, అరబిక్, బెంగాలీ మొదలయినవి) ముఖ్యమైనవి. ఈజిప్టులో పాపిరస్, చైనాలో కాగితం, ఇండియాలో తాళపత్రాలు, ప్రాచీన రాజ్యాల్లో శిలాఫలకాలు, మట్టిబిళ్లలు, లోహపు రేకులు, వస్త్రాలు, చర్మాలు, కొయ్య ముక్కలు ఇవన్నీ అక్షరాలకు ఆధారాలయినాయి. అక్షరం శాశ్వతమై చరిత్రను భవిష్యత్తులోకి జ్ఞానంగా పదిలపరచసాగింది.

**"అక్షరంబు వలయు కుక్షి జీవనులకు**
**అక్షరంబు జిహ్వ కిక్షు రసము**
**అక్షరంబు తన్ను రక్షించు గావున**
**అక్షరంబు లోక రక్షితంబు"**

✧✧✧✧✧

# 17. రూపాలు ఎన్ని ఉన్నా దేవుడు ఒక్కడే

ఈ సృష్టిని నడిపించే అతీతశక్తి ఏమిటనే ఆలోచన భిన్న మతాల ఆవిర్భావానికి నాంది పలికింది. హిందూయిజం, జైనం, బౌద్ధం, క్రైస్తవం, ఇస్లాం... ఇంకా అనేకానేక మతాలు జీవం పోసుకున్నాయి. వీటన్నింటి పరమార్థం ఏమిటి? శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతగా పురోగమించినా తెలియని ఆ అతీత శక్తి ఆరాధన నిరంతరంగా సాగడానికి కారణం ఏమిటి? ఈ సత్యాల లోతులు కనుగొనేందుకు మనిషి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. సత్యం కోసం, దేవుని కోసం, ఆత్మ గురించి తెలుసుకొనేందుకు అన్వేషిస్తూనే ఉన్నాడు.

**"కోహం కథ మిదం జాతం, కోవై కర్తా చవిద్యతే**
**ఉపాదానం కి మస్తీహ, విచారః సోయమీ దృశః"**

– యోగ వాసిష్ఠం

నేను ఎవరిని? ఈ జగత్తుకు మూలం ఏమిటి? దీనికి కర్త ఎవరు? ఈ జగత్తుకు ఉపాదాన కారణమేది? అనే ఈ నాలుగు ప్రశ్నలకు సమాధానాలు వెదకడమే వేదాంత పరిభాషలో 'విచారము' అంటారు. ఈ సత్యశోధన వివిధ ప్రదేశాలలో, వివిధ మతాలుగా ప్రజల జీవన విధానాన్ని నిర్దేశిస్తున్నది. అభిప్రాయభేదాలు ఆవేశాన్ని రగల్చగా, రాజ్యాలూ దేశాలూ యుద్ధాల సెగల పొగలలో భస్మీపటలమయ్యాయి. అతిక్రూరమైన ఆంక్షలూ, చిత్రహింసలూ మతం పేరిట మానవుని చరిత్రపుటలపై రక్తాక్షరాల్ని, కన్నీటిధారల్ని లిఖించాయి. నమ్మకాలు, భయాలు, ఊహలూ, క్రియలు ఆచారాలై వివిధ రూపాల్ని దాల్చినా అందరూ నమ్మినది– ఏదో ఊహాతీతమైన దివ్యలోక శక్తి మానవుల్ని నియంత్రిస్తున్నదనేది. దేవుణ్ణి నమ్మినవాళ్లు, నమ్మనివాళ్లు కూడ ఆ శక్తిని గుర్తించసాగారు.

## సమున్నత శక్తి ఆరాధన

ప్రాచీన ఈజిప్షియన్లకు 'జీవితం ఒక నిరంతరపోరాటం' మరణం వేపు సాగే ఒడిదుడుకుల ప్రయాణం. బ్రతికున్నప్పుడేకాక మరణానంతర జీవనం కూడా సుఖంగా సాగేటందుకు సమాధుల్లో సకల సదుపాయాల్ని ఉంచేవారు. ఆదిమ మానవుల్లో కూడా (నియాండెర్తల్స్–క్రీ.పూ. 50,000సం.) ఈ పద్ధతి ఉన్నట్లు పురాతత్వ శాస్త్రజ్ఞులు గమనించారు. ప్రకృతిపై తొలి మానవుని అభిప్రాయాలు– తుఫానులు, వరదలు, అగ్నిప్రమాదాలు, నదీనదాలు, చెట్టూచేమలు, సూర్యచంద్రులు అందరూ దేవతలే. ఇలా సమస్త ప్రకృతిలో తమకన్న ఎక్కువ శక్తుల్ని గమనించినప్పుడల్లా వాటిల్లో ఏదో గొప్ప శక్తి ఉన్నదని భావించి వాటిని అర్చించడం మొదలెట్టి ఉంటారు.

## బహుదేవతారాధన

ఈ బహుదేవతారాధన (పాలిథియిజిమ్) అన్ని ప్రాచీన మతాల్లో ఉన్నది. కాని క్రీస్తుకు పూర్వం 1400 సంవత్సరాల క్రితమే ఈజిప్టు రాజైన 'ఎఖినాటన్' ప్రాచీన దేవతల్ని త్రోసిరాజని సూర్యదేవుడు 'ఏటన్'ను ఏకేశ్వరోపాసన చేశాడు. ఆ తరువాత వందేళ్లకు మోసెస్ భగవంతుడు యెహేవా ఒక్కడే అని యూదుల్ని ఈజిప్టు నుంచి పాలస్తీనా వైపు దశాజ్ఞలను ప్రవచించి నడిపించాడు. క్రీస్తుపూర్వం ఎనిమిదవ శతాబ్దంలో ఎమోస్, హోసియా ప్రవక్తలు "సుఖాలనేవి మానవుడి మంచి నడవడికకు దేవుడిచ్చిన కానుకగా, కష్టాలు చెడునడతకు శిక్షగా" వర్ణించారు. అయితే జాబ్ (క్రీ.పూ. 4 శతాబ్ది) "దేవుడు దేవుడే! సుఖాలు కల్పిస్తాడు కాబట్టే దేవుడు అనే అభిప్రాయం తప్పు" అని ప్రవచించాడు. అంతకు ముందే క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో బాబిలోనియన్ల చేతిలో యూదులు ఓడిపోయినప్పుడు "యెహోవా సమస్త ప్రజలకు దేవుడు ఏ ఒక్క దేశానికో పరిమితం కాడు" అని రెండవ ఈసయ్య ప్రవక్త బోధించాడు. మానవ చరిత్రలో మతం పేరిట ఎక్కువ శిక్షకు, కష్టాలకు దుఃఖాలకు లోనైన వారు యూదులు. భగవానుడు ప్రవక్త మోసెస్‌కు ప్రవచించిన ఆజ్ఞలు, 'టోరా' తరువాతి ప్రవక్తలు బోధించినవి 'టాల్మూడ్' పవిత్ర గ్రంథాలై యూదులను ఒక్కతాటిపై నడిపిస్తున్నాయి.

## వేదాల నుంచి... బౌద్ధం దాకా

క్రీస్తుపూర్వం 2000 సంవత్సరాల నాటికే ఇండియాలో ఆర్యులు, అలలు అలలుగా స్థిరపడి స్థానికులతో కలిసి కొత్త సంస్కృతిని ఏర్పరచుకున్నారు. సంస్కరించబడిన సంస్కృత భాషలో శ్రుతులుగా వచ్చిన పారంపర్య జ్ఞానాన్ని వేదాలుగా మలిచారు. పునర్జన్మ, పాపపుణ్యాలు, కర్మసిద్ధాంతం వారి జీవన విధానాలైనాయి. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో జైనమతం మహావీరుని బోధనలచే హిందూ మతపు శాఖగా ఆవిర్భవించింది. జీవజాలంలో మానవుడు ఒక చిన్న భాగం. అందుకే ఏ జీవినీ ఏ రకంగానూ హింసించరాదు అన్నది ఆ మతంలో ముఖ్యమైన అంశం. అదే సమయంలో జన్మించిన గౌతమబుద్ధుడు (క్రీ.పూ. 560) జీవితంలోని బాధలకు కారణం తీరని కోరికలుగా, వాటిని తొలగించడమే నిర్వాణమార్గంగా బోధించాడు. అతని మరణానంతరం ఆ మతం మహాయాన, హీనయాన శాఖలుగా చైనావంటి పలు దేశాలకు వ్యాపించింది.

## విద్యతో సరైన మార్గం

బౌద్ధమతం చైనా దేశానికి చేరే సమయానికే అక్కడ కన్ఫ్యూషియనిజం, టావోయిజం బహుళ ప్రచారంలో ఉన్నాయి. క్రీస్తుపూర్వం 551లో జన్మించిన

కన్ఫ్యూషియస్ "విద్య ద్వారా మానవుణ్ణి సరైన దారిలో పెట్టవచ్చు" అని నమ్మాడు. లావోట్సు ప్రతిపాదించిన టావోయిజమ్ "మానవుణ్ణి మార్చడానికి, నీతివంతమైన జీవితం గడపడానికి ప్రత్యేకమైన ప్రయత్నం అవసరం లేదు. ప్రపంచాన్ని మనం మార్చనక్కర్లేదు. దానిలో మనకు సరైన స్థానాన్ని పొందగలిగితే చాలు. ఆ దారే సరైన దారి" అని చెబుతుంది. మతాన్ని వ్యాప్తి చెందించడమే లక్ష్యంగా ముందుకు సాగిన మతాలు 1. క్రిష్టియానిటి, 2. ఇస్లాం. రెండు మతాలకు దేవదేవుడు యెహోవా అయినప్పటికీ వీటిలోనూ శాఖలు ఏర్పడ్డాయి. వర్తక వ్యాపారాలతో, రాజ్యాక్రమణలతో రెండు మతాలు ప్రపంచమంతా వ్యాపిస్తూ, తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకోవడం కోసం పరస్పరం యుద్ధాలకు దిగాయి.

## పురోగమించిన క్రైస్తవం

వేల సంవత్సరాల క్రితం పర్షియాలో జోరాస్టర్ లేదా జరాతుష్ట్ర అని పిలువబడ్డ ప్రవక్త అగ్నిని ఆరాధించే మతాన్ని ప్రతిపాదించాడు. మంచి చెడుల మధ్య జరిగే యుద్ధం గురించి అవెస్తన్ భాషలో (సంస్కృతానికి దగ్గరగా ఉంటుంది) రాసిన 'గాథాస్'లో పేర్కొన్నారు. క్రీస్తుశకం ఆరవ శతాబ్దంలో కన్ఫ్యూషియనిజం, బుద్ధిజం ప్రభావాల వల్ల జపాన్‌లో 'షింటో' మతం ఆవిర్భవించింది. క్రీ.శ. 1500లో గురునానక్ (1469–1539)లో సిక్కు మతాన్ని ప్రబోధించాడు. క్రీస్తుశకం 9–10 శతాబ్దాలలో అరబ్ నాగరికత, 1096–1270 వరకు జరిగిన పవిత్ర యుద్ధాలలో (క్రూసేడ్లు) పరస్పర ఘర్షణ, 14–15 శతాబ్దాల వరకు ఇస్లాం మతం బాగా వ్యాప్తి చెందగా, పదిహేనవ శతాబ్దం నుంచి యూరోపియన్ల ప్రభావం వలన క్రిస్టియానిటి బహుళ ప్రచారంలోకి వచ్చింది. చర్చిల స్థాపన, పోప్‌ల ఆధిక్యం, మతపరమైన ఆంక్షలు... శిక్షలు, దురుపయోగాలు పదహారవ శతాబ్దం నాటికి సంస్కరణల దిశలోకి సాగాయి. సెయింట్ థామస్ అక్వినాస్, మార్టిన్ లూథర్, జీన్ కాల్విన్, అల్‌రిచ్ జ్వింగ్లి, జాన్‌నాక్స్ లాంటి వాళ్లు చర్చి ఆధిపత్యాన్ని ప్రశ్నించారు.

## కొత్తదారుల అన్వేషణ

16–17 శతాబ్దాలు మతపరమైన యుద్ధాలతో నిండాయి. సైన్సు అభివృద్ధి, కోపర్నికస్, గెలీలియోల పరిశీలనలు, రెనెడెకార్టె (1596–1650) వంటి తత్త్వవేత్తల ఆలోచనలు అనేకమందిని ప్రభావితం చేశాయి. సమాజపు ఆలోచనాసరళి, సత్యాన్వేషణలో కొత్తదారుల్ని వెదకసాగింది. స్పినోజా, లీచ్‌నిజ్, లాక్, డేవిడ్ హ్యూమ్, ఇమ్మాన్యుయల్ కాంట్, జార్జ్ హెగెల్, కారల్ మార్క్స్, ఎంగెల్స్, జీన్ పాల్ సార్ట్రే, బెర్ట్రాండ్ రస్సెల్, జిడ్డు కృష్ణమూర్తి లాంటి తత్త్వవేత్తలు తమతమ ఆలోచనా ధోరణులతో సమాజాన్ని ప్రభావితం చేశారు. అన్ని మతాల్ని త్రోసిరాజని, మతాన్ని మత్తుమందుగా

అభివర్ణించి, తానే ఒక అభిప్రాయమై... మతం కన్నా బలవత్తరమై సాగింది కమ్యూనిజం.

## సత్యమేవ జయతే

విద్య, నాగరికత చాలా మందిలోని మూఢ విశ్వాసాలను, చాదస్తాలను తొలగించినా ఎంతోమందికి మతం, దేవుని తోడ్పాటు మరింత అవసరమైంది. మతపు అనుయాయులను చర్చిలలో, సినగాగ్‌లలో, మసీదులలో, ప్రార్థనా మందిరాలలో, దేవాలయాలలో గుమికూడేట్లు చేస్తూనే ఉంది. అనేకమంది మానవులే మంచి పనులు చేసి తరువాత తరాలకు దేవుళ్లుగా పూజలందుకున్న విషయాలు మనకు తెలుసు. దేవుడెవరు? దేవతలెంతమంది? అనే ప్రశ్నకు మాత్రం ఇంకా అన్వేషణ సాగుతూనే ఉంది. బృహదారణ్యకోపనిషత్తులో శాకల్యుడు యాజ్ఞవల్క్యుని దేవతలెందరు? అని ప్రశ్నించాడు.

"త్రయశ్చ త్రీచ శతాత్రయశ్చ త్రచ సహస్రేతి నివత్తు" అను మంత్రంలో చెప్పిన దేవతలు 3306 మంది. వీళ్లందరూ ఎనమండుగురు వసువులు, పదునొకండు రుద్రులు, పండ్రెండుగురు ఆదిత్యులు, ఇంద్రుడు, బ్రహ్మ యొక్క రూపాలే. ఈ 33 మంది త్యత్ అని పిలువబడిన పరబ్రహ్మము లేదా ప్రాణదేవత యొక్క రూపాలు. కావున దేవుడు ఒక్కడే అని యాజ్ఞవల్క్యుడు వివరించాడు.

సత్యం కోసం, దేవుని కోసం, తనకోసం మానవుడు జరుపుతున్న పరిశోధన అద్భుతమైనది.

**"సత్యమేవ జయతి నానృతం సత్యేన పంథా వితతో దేవయానః**
**యేనాక్రమస్త్య రుషయో హ్యాప్తకామా యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్॥**

– ముండకోపనిషత్తు–50

సత్యమే జయిస్తుంది. సత్యశీలురు, ఆశారహితులైన మహర్షులు పోవుచున్న ఆ దివ్య మార్గము సత్యమునకు ఉత్తమ స్థానమై ఉన్నది అని ఈ శ్లోకానికి అర్థం.

**"సత్యమేవ జయతే"**

✧✧✧✧✧

# 18. ఈజిప్టు దేవతలు - ఒసిరిస్ గాథ

నైలునది పొడుగునా గణాలుగా జీవిస్తున్న ప్రజలలో ఒక్కొక్క తెగకు ఒక్కొక్క దేవుడో, దేవతో కుదురుకు (టోటెమ్) అధిదేవతగా ఉండేది. ఆ దేవుడు జంతువు రూపంలోనో పక్షిరూపంలోనో (ఇబిస్ కొంగ, జాకాల్, వృశ్చికం, గ్రద్ద) ఉండి పూజలందుకునేవాడు.

తరువాతి కాలంలో దేవుళ్లకు తల-జంతువు లేదా పక్షిరూపంలో ఉండగా, శరీరంలో 'సా' అనే జీవరసం ప్రవహిస్తూండడం వల్ల వాళ్లకు సర్వశక్తులు ఉంటాయని, ఎంత దేవుడైనా వృద్ధుడు కాక తప్పదు కనుక ఆతడు తన జీవిత చరమాంకంలో ఆ 'సా' అనే శక్తిని తనవారసునికిచ్చి పశ్చిమాద్రికి పయనిస్తాడని నమ్మేవారు. ఇలా ప్రతి గ్రామానికి, పట్టణానికి ఒక్కో అధిదేవత, ప్రకృతి శక్తులు దేవతలుగా రూపొందగా షుమారు 740 దేవతలు వివిధ కార్యక్రమాలు నిర్వహించేవారని టుత్‌మోసిస్-3 రాజు సమాధిలో లభ్యమయిన లిస్టు (పట్టిక) వలన తెలుస్తోంది.

ప్రధాన దేవుడు, దేవతతో కలిసి కుటుంబంగా ఏర్పడగా ఈజిప్టురాజు (ఫారో) దేవుని కుమారుడిగా వ్యవహరించబడి, త్రిమూర్తులుగా రాజ్యపరిపాలన చేసేవారు. దేవాలయంలో ప్రతిరోజూ దేవుని దర్శించే హక్కు రాజు లేదా ఆతని ప్రతినిధి ప్రధాన పూజారికి ఉండేది. ఉత్సవ సమయాల్లో సర్వాంగసుందరంగా అలంకరించబడ్డ రూపాలతో దేవుళ్లను రాజమార్గంలో ఉరేగించగా ప్రజలు దర్శనం చేసుకునేవారు.

శృతులుగా అనేక వేల సంవత్సరాలు ప్రచారంగా ఉండి, చిత్రలిపిలో (హీరోగ్లైఫిక్స్) సమాధుల్లో చిత్రింపబడి, 'ప్లూటార్క్' అనే గ్రీకు చరిత్రకారుని మూలంగా గ్రంథస్థం కాబడిన 'ఒసిరిస్ గాథ' ఆనాటి ఈజిప్టు దేవతల వృత్తాంతాన్ని అద్భుతంగా వర్ణిస్తోంది.

సృష్టిక్రమం - మొదట్లో ఏమీలేదు. 'నన్' అని పిలువబడ్డ చీకటి గందరగోళం నుంచి అన్నీ పుట్టుకు వచ్చాయి. క్రమంగా వికసిస్తున్న పద్మంలా నేల, నీళ్లపైకి ఉబకసాగింది. తన సంకల్ప బలంతో సూర్యుడు 'రా' బయటకు వచ్చి ష్యు (వాయుదేవుడు), టెఫ్‌నట్ (తేమ దేవత)ల మిథునంగా రూపొందాడు. ఆ కలయిక నుంచి భూదేవుడు 'జెబ్', ఆకాశదేవత 'నట్' రూపొందారు.

సూర్యుని కన్నీటి నుంచి తొలి మానవులు సృష్టింపబడినారు. యుగాలు గడిచాయి. సూర్యుడు వృద్ధుడై క్షీణించడం గమనించి మానవులు ఆతనిపై కుట్ర చేయసాగినారు. 'రా' (సూర్యుడు) దానిని గమనించి దేవతల సమావేశాన్ని ఏర్పరచి నమ్మకద్రోహులైన మానవుల్ని శిక్షించడానికి 'హేథర్' దేవతను నియోగించగా ఆమె వేలాదిమందిని చంపి తన ఉగ్రరూపాన్ని చూపింది. 'రా' కరుణించి మిగిలిన కొద్దిమంది మానవుల్ని వదిలేయమని హేథర్‌ను కోరినాడు. తాను రాజ్యభారాన్ని 'ష్యు' వాయుదేవతకు అప్పగించి స్వర్గానికి వెళ్లిపోయినాడు.

తన ఆజ్ఞకు వ్యతిరేకంగా జెబ్ (భూదేవుడు), నట్ (ఆకాశదేవత) కూడి ఉండడాన్ని చూచి 'రా' (సూర్యుడు), ష్యు-వాయుదేవున్ని పిలిచి వారిద్దరిని విడదీయమని ఆజ్ఞాపించాడు. భూ ఆకాశాలను విడదీసినా అప్పటికే ఆకాశదేవత గర్భిణిగా ఉండడం గమనించి సూర్యుడు, సంవత్సరంలోని ఏ నెలలోనూ ఉన్న రోజునాడు ప్రసవించరాదని శపించాడు. దేవతలలో తెలివిగలవాడు, విజ్ఞాని అయిన 'తోత్' నట్ దేవతపై జాలితలిచి, చంద్రుడితో జూదమాడి అయిదు అధిక దినాలను గెలుచుకొని ఆ అయిదు రోజులను అప్పటి ఈజిప్టు క్యాలెండరులోని 360 రోజులకు కలపగా ఆకాశదేవత ఒసిరిస్, హోరస్, ఐసిస్, సెట్, నెఫ్థిస్‌లకు జన్మనిచ్చింది. ఒసిరిస్ మంచికి ప్రతీక కాగా ఐసిస్ క్రౌర్యానికి, వంధ్యతకు మారుపేరైనాడు.

సన్నగా, అందంగా, నల్లటిజుత్తుతో ఎంతో చలాకీగా ఉండే ఒసిరిస్ తన తండ్రి తదనంతరం ఈజిప్టుకు ఫారో (రాజు) అయినాడు. సంప్రదాయాన్ననుసరించి చెల్లెలైన 'ఐసిస్'ను వివాహం చేసుకున్నాడు. ప్రజలచే నరమాంస భక్షణ మాన్పించాడు. వ్యవసాయాన్ని, సంగీతాన్ని వృద్ధిపరచి న్యాయాన్ని అందరికి అందేలా చూసాడు. తన ప్రజలందరూ సుఖంగా ఉండగా ఇతర దేశాల్ని జయించడానికి వెళ్లినాడు.

ఒసిరిస్ లేని సమయాన్ని చూసి 'సెట్' కుట్రపన్నాడు. సోదరుని ప్రాభవం భరించలేకపోవడం ఒక కారణం కాగా, తన భార్య నెఫ్థిస్ కూడ ఒసిరిస్‌ను ప్రేమించి గర్భవతియై అనూబిస్ అనే జాకాల్ తల గల కుమారుడ్ని కనడం రెండవ కారణం.

దిగ్విజయానంతరం ఒసిరిస్ నగరానికి రాగానే 'సెట్' బ్రహ్మాండమైన విందు ఇచ్చాడు. ఆ విందులో సోదరుణ్ణి ఒక దుర్భేద్యమైన పెట్టెలో బంధించి, సీసంతో సీలువేసి నైలునదిలో పారవేయించాడు. తాను రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్నాడు.

'ఐసిస్' తన భర్తను వెదుకుతూ నైలునది పొడుగుతా గాలిస్తూ తల్లి 'నెఫ్థిస్'చే వదిలేయబడ్డ 'అనూబిస్'ను చేరదీసి పెంచింది. తన భర్త ఉన్న పెట్టె ఫోనీషియా చేరుకుని 'తమరిస్క్' చెట్టు తొర్రలో చిక్కుకుపోయిందని గ్రహించింది.

ఆమె ఫొనిషియా చేరుకునేసరికి ఆ చెట్టు రాజభవనంలో ఒక స్తంభంగా మలచబడింది. ఐసిస్ ఆ దేశపు రాణి ఇస్తార్ కొలువులో చెలికత్తెగా చేరి రాకుమారుని పెంపకం అంతఃపుర స్త్రీలకు అలంకరణ నేర్పడం చేసేది. తనకున్న మంత్రశక్తితో రాకుమారుణ్ణి మృత్యుంజయుడిగా చేయడానికి రాత్రివేళల్లో హోమం చేసి ఆ పిల్లవాడ్ని మంటల్లో ఉంచడాన్ని గమనించిన ఇస్తార్ రాణి నిలదీయగా, ఐసిస్ తన వృత్తాంతాన్ని శక్తియుక్తుల్ని మంత్ర విద్యల్ని ప్రదర్శించి రాణి మెప్పును పొంది కానుకగా తన భర్త ఉన్న స్తంభాన్ని తీసుకుని 'ఈజిప్టు' తిరిగి వచ్చింది. నెప్థిస్ సహాయంతో మంత్రశక్తులతో తన భర్తను తాత్కాలికంగా సజీవుణ్ణి గావించి ఆతని వలన గర్భవతి అయ్యింది. విషయం తెలిసిన 'సెట్' ఐసిస్‌ను బందీ కావించినా, అనూబిస్ సాయంతో జైలు బయటపడి నైలునది డెల్టాలో సాధారణ రైతుగా ఐసిస్ జీవిస్తూ, చిన్ని 'హోరస్' ద హాక్‌కు జన్మనిచ్చింది. అప్పుడప్పుడూ కన్పించే తండ్రి ఒసిరిస్ పర్యవేక్షణలో, తల్లి మంత్రశక్తుల ప్రభావంతో చిన్ని హోరస్ గొప్ప వీరుడిగా రూపొందినాడు.

ఈ సంగతి తెలిసిన 'సెట్' ఒక అర్ధరాత్రి ఒసిరిస్ ఉన్న పెట్టెను కనిపెట్టి దానిలోని ఒసిరిస్ శరీరాన్ని పధ్నాలుగు ముక్కలుగా చేసి నైలునదిలో విసిరేసి వెళ్లిపోయాడు. కుమారుని సాయంతో భర్త జననాంగం మినహా మిగతా భాగాలు దొరకగా వాటితో ఒసిరిస్ దేహాన్ని మరల సంధించింది ఐసిస్.

హోరస్ ఆగ్రహంతో సేనను కూర్చుకుని 'సెట్'పై దండెత్తాడు. 'సెట్' పాలనలో కరువుకాటకాలకు లోనైన ఈజిప్టు ప్రజలు తిరుగుబాటు చేయగా 'సెట్' ఓడిపోయి కటకటాల పాలైనాడు. హోరస్‌లేని సమయం చూసి 'సెట్', ఐసిస్ హృదయాన్ని కరిగించి మంచి మాటలతో ఆమెను నయవంచన చేసి జైలునుంచి విడుదలయ్యాడు. తిరిగి వచ్చిన హోరస్ ఆగ్రహంతో తన తల్లి శిరస్సును ఖండించగా, తోత్ దేవత హేథర్ శిరస్సును 'ఐసిస్'కు అమర్చి జీవింపచేసాడు. హోరస్, ఐసిస్‌లు ఈసారి 'సెట్'ను వెంటాడి ఎర్రసముద్రంలో శాశ్వతంగా ముంచేసారు.

హోరస్, ఐసిస్‌లు తిరిగి వచ్చి ఒసిరిస్ దేహాన్ని శుద్ధి కావించినారు. తన కంటిని హోరస్ తండ్రికివ్వగా ఒసిరిస్ దైవరూపంలో ప్రత్యక్షమై కుమారుడిచ్చిన నిచ్చెన ఎక్కి ఐసిస్, నెప్థిస్‌లు తన కిరువైపుల వెంటరాగా స్వర్గారోహణ చేసినాడు. దేవతలు ఆతనిని న్యాయాధిపతిగా నియమించినారు. ఒసిరిస్ ధర్మదేవతగా, తోత్ వ్రాయసకాడుగా (చిత్రగుప్తుడు) 42 న్యాయమూర్తుల సమక్షంలో జీవుల పాపపుణ్యాలను బేరీజు వేస్తూంటారు.

హోరస్ ఈజిప్టుకు చక్రవర్తిగా దేవతల మన్ననలను పొందినాడు. ఈజిప్టు సుభిక్షమైనది. ఆతని నలుగురి కుమారుల వంశాలే ఈజిప్టు రాజవంశాలైనవి.

ఈ కథలోని అనేక అంశాలు మనమెక్కడో విన్నవిగానే అనిపిస్తాయి. మన వాఙ్మయంలో కూడా వీటి ప్రతిధ్వనులు వినబడినా ఆశ్చర్యం లేదు. ఒసిరిస్ నైలునదికి, ఐసిస్ – సారవంతమైన నేలకు, పచ్చదనానికి ప్రతీక. 'సెట్' దారుణమైన ఎడారికి గుర్తు. నెప్థిస్ ఎడారికి, సారవంతమైన నేలకు మధ్యభూమికి చిహ్నం. ఈ ప్రకృతి భావనల వలననే నేల, ఆకాశం, గాలి, తేమ, సూర్యుడు లాంటి ప్రకృతి శక్తులు ప్రాచీన ఈజిప్షియన్లకు దేవుళ్లై విలసిల్లినారు.

నైలునది వరదల్లా ప్రతి ఏటా బతికి చనిపోయే ఒసిరిస్ కథ ఆత్మయొక్క అమృతత్వాన్ని, మరణానంతర జీవనాన్ని తెలుపుతూ ఆనాటి ఈజిప్టు ప్రజల దైవ భావాల్ని, పిరమిడ్లలాంటి బృహత్ కట్టడాల్లో శవాల్ని మమ్మీల రూపంలో ఎందుకు భద్రపరచేవారో తెలుపుతున్నది.

✧✧✧✧✧

# 19. అసురో-బాబిలోనియన్ దేవతలు గిల్గామేష్ కథ

రమారమి అయిదువేల సంవత్సరాల క్రితం టైగ్రిస్ యూఫరేటిస్ నదుల మధ్య ప్రాంతంలో ఒక అద్భుతమైన నాగరికత వెల్లివిరిసింది. ఉత్తరాన 'నిప్పూరు' నుంచి దక్షిణాన 'ఎరిడు' పట్టణాల మధ్య 'లగాష్, ఎరిక్, లార్సా, ఉర్ అనేవి ప్రధానమైన పట్టణాలు. మధ్య ఆసియా నుంచో సైబీరియానుంచో వలసవచ్చిన సుమేరియన్లు వీటిలో ఉండేవారు. ఉత్తరాన అక్కడియన్ల రాజ్యంలో ఉత్తర సిరియా నుంచి వచ్చి స్థిరనివాసాన్ని ఏర్పరుచుకున్న సెమైట్లు అగేడ్, బొర్సిప్పా, బాబిలోన్, కిష్, కతా, సిప్పార్ పట్టణాల్లో జనావాసాల నేర్పరుచుకున్నారు. ఒక్కో పట్టణానికి ఒక్కో అధిదేవత ఉండగా అధికారంలో ఉన్న రాజును బట్టి, విజయాన్ని వరించిన వీరుని బట్టి ప్రధాన దేవత పూజింపబడగా, ఆక్రమణకు లోనైన ప్రాంతాల దేవతలు ప్రధాన దేవతకు సహాయకులైన దేవతలుగా రూపొందినారు. కొన్ని తరాలనాటికి మధ్యధరా ప్రాంతంలో ప్రధాన దేవతలు వాళ్ల పనులు విభజింపబడి ప్రజలచే పూజలనందుకునే వారు. దేవతల చుట్టూ కథలూ, మహత్తుల ప్రచారాలూ పురాణ గాథల రూపాలను దాల్చగా సాహిత్యం ఊపునందుకున్నది. 'ఉర్' ప్రధాన నగరంగా నగర రాజ్యాలను పాలించిన సుమేరియన్లు తరువాత 'బాబిలోన్' రాజధానిగా సెమెటిక్ జాతికి చెందిన అక్కడియన్లు క్రీస్తుపూర్వం 2600 నుంచి 900 వరకు పరిపాలించగా 883 ప్రాంతంలో అస్సిరియన్ల పాలన ప్రారంభమై 'నినెవే' రాజధానిగా ప్రఖ్యాతిగాంచింది. అసురవన పాలుని కాలం (669-627 బి.సి.) లైబ్రరీలలోని మట్టిబిళ్లలపై కోణాకృతి లిపిలో (క్యూనిఫారం) లిఖించబడ్డ గాథలే అస్సురో బాబిలోనియన్ల దేవతల గురించి వారి మత విశ్వాసాల గురించి మనకు తెలియజేస్తున్నాయి. ఈ ప్రాంతపు ఊళ్ల, దేవుళ్ల పేర్లు, విశ్వాసాలు మన పూర్వీకుల నమ్మకాలకు దగ్గరగా ఉండడం, మనకు సుమేరియన్లకు ఉన్న సంబంధ బాంధవ్యాలను చూచాయగా తెలియజేస్తున్నాయి.

అస్సురో బాబిలోనియన్ ప్రాంతపు ప్రధాన దేవుళ్ళు: అను- దేవతల నాయకుడు; ఎన్‌లిల్- వాయుదేవుడు, తుఫాను, వరదలకు అధిపతి; ఈఆ- జల సంరక్షకుడు, జ్ఞాని. మార్డుక్- బాబిలోన్ ప్రధాన దేవుడు; సిన్- చంద్రుడు, షామాష్- సూర్యుడు; ఇస్తార్- శృంగార దేవత, సంతానలక్ష్మి, తమ్ముజ్- పంటల దేవుడు; ఎరిష్కగల్- మృత్యుదేవత.

సృష్టిగాధ - సమస్త సృష్టి జలముల నుండే ఆవిర్భవించినది. అప్సు (తియ్యటి నీరు), టియామత్ (ఉప్పునీరు) కలయికలో ముమ్ము (అలలపై నురగ) పుట్టింది.

అంతేకాక లక్ము, లాఖము అనే మహాసర్పాలు జనించి, వాటినుంచి అంషార్ (ఆకాశ లోకం); కిషార్ (భూలోకం) ఉద్భవించాయి. అంషార్, కిషార్‌ల నుండి అను, ఎన్‌లిల్, ఈఆ మరియు ఇతర దేవతలు పుట్టినారు.

ఈ చిల్లరదేవతలు చేస్తున్న అల్లరి, ఆగడాలు ఆప్సు, టియామత్‌లను చిరాకు పరిచాయి. ఆదిదేవతలిద్దరూ కూడబలుక్కుని తమ సంతానాన్ని తామే నాశనం చేయ సంకల్పించారు. సర్వజ్ఞాని అయిన 'ఈఆ' దేవుడు 'ఆప్సు' ఆలోచన పసికట్టి తన మంత్రశక్తితో అప్సును, ముమ్మును బంధించాడు. టియామత్‌కు కోపం వచ్చి సర్పరూపం దాల్చగా ఆమె నుంచి అనేక క్రూర సర్పాలు, తేళ్లు, విష జంతువులు జనించాయి.

భయపడిన 'ఈఆ' తన తండ్రి అంషార్ (ఆకాశం)ను ప్రార్థించాడు. 'అను' సాయం తీసుకొమ్మని తండ్రి చెప్పగా 'అను', 'ఈఆ' ఇద్దరూ టియామత్ సేనను చూసి భయపడ్డారు. 'ఈఆ' ఆలోచించి బాబిలోన్ రాజైన 'మార్డుక్' సహాయం అడిగాడు మార్డుక్ టియామత్‌తో యుద్ధానికి ప్రతిఫలంగా తనను దేవతల అధిపతిగా చేయమని కోరాడు. దేవతలట్లే చేసారు.

విల్లంబులు, మెరుపు, గాలి, వలలు, ఆయుధాలుగా మార్డూక్; తుఫానే రథంగా నాలుగు భయంకర గుర్రాలను పూన్చుకుని వస్తున్న టియామత్‌ను ఎదుర్కొని సాహసోపేతంగా ఆమెను తన వలలో బంధించి, దివ్యబాణాలతో సర్పరూపంలో ఉన్న ఆమెను నిర్జించాడు. అడ్డువచ్చిన ఆమె సేనను ఓడించి పాతాళబిలంలోకి నెట్టివేసాడు. టియామత్ శరీరాన్ని ముక్కలు చేసి ఆకాశాన్ని, భూమిని, దేవతల గృహాల్ని, గ్రహాల్ని, నక్షత్రాల్ని, కాలమానాన్ని నిర్మించాడు. టియామత్ సేనాని 'కింగు' రక్తం నుంచి మానవులను సృష్టించి భూమండలంపై నదులు, చెట్లు చేమలు జంతువుల్ని నింపి దేవతలకే దేవుడై వర్ధిల్లినాడు మార్డుక్

కొంతకాలానికి మానవులు చేస్తున్న వినాశప్పనులకు విసిగి దేవతలు ఒక నిర్ణయానికి వచ్చారు. కాని దయార్ద్రహృదయుడైన 'ఈఆ' దేవుడు ఉత్నాపిష్టిమ్ అనే మంచివాడికి ప్రత్యక్షమై ఒక నావను నిర్మించి తన కుటుంబంతో, జంతుజాలంతో దానిలో ప్రవేశించమని సలహా యిచ్చినాడు. ఆ తరువాత ఆరురోజులు రేయింబవళ్లు కురిసిన వర్షంలో భూమి మునిగి అందరూ నశింపగా మిగిలిన ఉత్నాపిష్టిమ్ జడివాన తగ్గి నావ నిశిర్ పర్వత శిఖరాగ్రాన నిలువగా, అక్కడ దేవతలకు బలులనిచ్చి సంతోషపరచి మృత్యుంజయుడాయెను. ఈ కథలోని ప్రతిధ్వనులే గ్రీకు, హిందూ, హీబ్రూ, క్రిస్టియన్ మతగ్రంథాలలో ప్రసిద్ధమై జలప్రళయ సంఘటనగా వినవచ్చుచున్నవి.

గిల్గామేష్ అనే దైవాంశ కలిగిన మానవ చక్రవర్తి ఉరుక్ నగరాన్ని పాలిస్తూ స్త్రీలోలుడై నగరంలో ప్రతి ఒక్కరినీ పీడింపసాగాడు. అమిత బలవంతుడైన ఆతనిని అదుపులో ఉంచడానికి ప్రజల ప్రార్థనపై అరురు దేవుడు 'ఎంకిడు' అనే రోమాలతో నిండి అనాగరికంగా ఉన్న మానవ మృగాన్ని సృష్టించి గిల్గామేష్‌పైకి ఉసికొల్పాడు. అందమైన నాట్యగత్తెలను పంపి 'ఎంకిడు'ను తన నగరానికి రప్పించి అతనిపై మల్లయుద్ధానికి దిగాడు గిల్గామేష్. బలంలో ఇద్దరూ సమానులని తేలాక మంచి మిత్రులై ప్రపంచంపైకి దండయాత్రకు బయల్దేరారు.

దేవదారు పర్వతంపైని 'ఖుంబాబా' అనే రాక్షసుడ్ని ఓడించి అక్కడి వృక్షాల్ని 'ఉరుక్' పట్టణంలో దేవాలయాల నిర్మాణాలకు తరలించారు. ఇస్తార్ దేవత గిల్గామేష్‌ను మోహించగా ఆతడు తిరస్కరిస్తాడు. అవమానాన్ని భరించలేక ఇస్తార్ దేవత తన తండ్రి 'అను'ను ప్రార్థించి దేవ వృషభాన్ని గిల్గామేష్, ఎంకిడులపైకి పంపుతుంది. వాళ్లు దాన్ని చంపాక, ఆ ఎద్దు చర్మాన్ని 'ఎంకిడు' ఇస్తార్ దేవతపైకి తిరస్కారంగా విసుర్తాడు. ఇస్తార్ ప్రతీకారంగా ఇచ్చిన శాపంతో రోగగ్రస్తుడై ఎంకిడు మరణిస్తాడు.

తన స్నేహితుని మరణాన్ని తట్టుకోలేక గిల్గామేష్ మృత్యురహస్యాన్ని తెలుసుకోడానికి మాషు పర్వతాల్ని దాటి, వృశ్చిక మానవుల్ని తప్పించుకుని, ఉత్నాపిష్టిమ్ పడవవాని (సరంగు) సాయంతో జలప్రళయంలో మృత్యుంజయుడైన ఉత్నాపిష్టిమ్ గృహాన్ని చేరి సొమ్మసిల్లిపోతాడు. ఉత్నాపిష్టిమ్ భార్య ఆతనిపై దయతలచి భర్తను గిల్గామేష్‌కు సాయం చేయమని ప్రార్థిస్తుంది. ఉత్నాపిష్టిమ్ సలహాతో సముద్రపు అడుగున ఉన్న మృత్యుంజయ లతను తీసుకుని తిరుగు ప్రయాణంలో ఒక సరస్సు ఒడ్డున నిద్రపోయినాడు గిల్గామేష్. ఒక సర్పం ఆ లతను సంగ్రహించిపోగా ఒట్టిచేతులతో మిగిలిన గిల్గామేష్ మానవునికి మృత్యువు తప్పదని గ్రహించి సమాధానపడ్డాడు.

బాబిలోనియన్ దేవతలలో మగదేవతల ఆధిక్యత హెచ్చుగా కనిపిస్తుంది. మానవత్వం పాలు ఎక్కువ. మానవులలోని అరాచకం, స్త్రీలోలత్వం, వ్యసనాలు, అహంకారం, బలప్రదర్శనా కుతూహలం ఈ దేవుళ్లలో మెండుగా కనిపిస్తాయి. గిల్గామేష్ కథ మానవుడికి మృత్యురహస్యం తెలుసుకోవాలన్న కోరికనే కాక ఆనాటి 'ఉరుక్' ప్రజలు దేవదారు కలపకోసం పర్వతాలవేపు ప్రయాణం చేసి అక్కడి వాళ్లను ఓడించి విజయాన్ని సాధించిన విషయాన్ని చెప్పకనే చెబుతున్నది.

✧✧✧✧✧

# 20. సుమేరియన్ నాగరికత - తొలి వృత్తుల సంఘర్షణ

మెసపొటేమియా అని గ్రీకులచే పిలువబడి పడమట యూఫరేటిస్, తూర్పున టైగ్రిస్ నదుల మధ్య ఉన్న సారవంతమైన భూమిలో తొలుదొల్త స్థిరనివాసము ఏర్పరచుకున్నవారు క్రీస్తుపూర్వం 3300 సంవత్సరాల క్రితం ఆసియా నుంచి వచ్చిన సుమేరియన్లు, వీరున్న ఒక్కో చిన్న పట్టణమూ ఒక్కో రాజ్యం కాగా ఆ పట్టణాన్ని సంరక్షించే అధిదేవుడో, అధిదేవతో ఆ ప్రజలకు కుదురు లేక చిహ్నాంగా ఉండినది. ప్రపంచమంతా మార్మికమైన శక్తులతో నిండి ఉందని ప్రజలు విశ్వసించేవారు. భూత ప్రేతాల్ని పారద్రోలడానికి మంత్ర తంత్రాలుండేవి. శకునాలు, జోస్యాలు, కలల విశ్లేషణలు భవిష్యత్ నిర్దేశనానికి దారిజూపేవి. వందలాది దేవుళ్లని తృప్తిపరచడానికి పెద్దపెద్ద గుళ్లూ, గోపురాలూ, జిగ్గురాట్లూ నిర్మించి బలులనిచ్చేవారు. రాజ్యాధికారం వంశ పారంపర్యం కాగా రాజు దేవుని ప్రతినిధిగా గౌరవింపబడేవాడు.

కోణాకృతి లిపిని కనుకున్నది సుమేరియన్లే. ఉర్, బాబిలోన్, నినెవే పట్టణాలలో జరిగిన తవ్వకాలలో లభించిన మట్టిబిళ్లలపై అద్భుతమైన కావ్యాలు గ్రంథస్థం చేయబడి ఉన్నాయి. గ్రామ సరిహద్దుల్లో ఉండే రాళ్లపై (కుదురులు) గ్రహదేవతలైన ఇనాన్నా (ఇస్తార్ దేవత), నన్నా (సిన్–చంద్రుడు), ఉటు (షామాష్–సూర్యుడు); పురాణదేవతలైన అను (అన్–దేవత) ఎన్‌లిల్ (అనిలుడు–వాయుదేవుడు); ఎన్‌కి (ఈఆ–నీటి దేవుడు); నాబు–లలితకళలకు, జీవనగమ్యానికి అధిపతి; వంటిదేవతల చిహ్నాలు, బొమ్మలుండేవి.

సుమేరియన్ దేవతలను గురించిన విషయాలు ఇప్పటికి నాలుగువేల సంవత్సరాల క్రితమే క్యూనిఫారం లిపిలో మట్టిబిళ్లలపై గ్రంథస్థం చేయబడి ఉర్, నిప్పూర్ లాంటి ప్రధాన మత కేంద్రాల గ్రంథాలయాలలో భద్రపరచినవి పురాతత్వ శాస్త్రజ్ఞులకు తవ్వకాలలో లభ్యమయినాయి.

ఈ చరాచర ప్రపంచాన్ని శాసించే ఏకైక శక్తి 'మి' (me). సర్వ దేవతలు, సమస్త జీవజాలము ఆదిమ సముద్రం నుంచి ఒక క్రమ పద్ధతిలో ఆ మహాశక్తి సంకల్పాన జనించాయి. దేవతల సేవకొరకు మానవుడు సృజించబడ్డాడు. (To carry the labour basket of gods). ఈ భావనలు సుమేరియన్ల హృదయాలలో గాఢంగా నాటుకుని, వారి ఆలోచనలన్నీ మానవులకెందుకు అమరత్వం లేదు? ప్రకృతి భీభత్సాలన్నిటినీ దేవుళ్లు మానవులపై కెందుకు పంపిస్తున్నారు? అన్న విషయాల

చుట్టూ తిరుగాడగా ప్రకృతిలోని ప్రతి వస్తువూ ఆరాధనీయమై దైవరూపాన్ని దాల్చింది. అమరత్వం, ప్రకృతి భీభత్సాల కథా వస్తువులుగా జలప్రళయం, గిల్గామేష్ ప్రయాణం లాంటి అద్భుతమైన సంఘటనలు కావ్యరూపాలైనవి.

సప్త ఋషులలో ఒకడైన 'అడపా' ఋషి 'ఎరిడు' పట్టణంలోని 'ఈఆ' (నీటిదేవుడు) ఆలయపు పూజారి. ఆతడు తన పడవలో చేపల వేటకు పోయినపుడు దక్షిణపుగాలి పడవను తిరగబడేసింది. నీటిలో పడ్డ 'అడపా' కోపంతో గాలిని బంధించాడు. ప్రజలకు గాలి కరువై అల్లలాడుతుంటే 'అను' దేవరాజుకు కోపం వచ్చి ఋషిని దేవతల సభకు రమ్మని ఆజ్ఞాపించాడు. కలవరపడ్డ ఋషి 'ఈఆ' దేవుణ్ణి ప్రార్థించగా అతడు ప్రత్యక్షమై దేవసభలో దేవరాజు ఇచ్చిన ఆహారాన్ని స్వీకరించ వద్దని ఎందుకంటే అది మృత్యువు నిస్తుందని వివరించాడు. ఋషి దేవసభకు వెళ్లేప్పటికి ప్రశాంతుడైన దేవరాజు జీవజలాన్ని ఆహారాన్ని ఇవ్వబోగా అడపా ఋషి వినయంగా తిరస్కరిస్తాడు. విషయాన్ని గ్రహించిన 'అను' దేవరాజు నవ్వుతూ 'నీకేది ప్రాప్తమో' అది దక్కింది. నీవు నీ పట్టణానికి పో! ఇక నుంచి మానవులకు మృత్యుభయం, ప్రేత భయం తప్పదు. నీవు మాత్రం నీ మంత్రశక్తులతో జీవింపగలవు అని ఆదేశించినాడు.

గుంపులు గుంపులుగా గ్రామాలలో జీవిస్తున్న మానవులు కొందరు పశుపోషణ, గొర్రెల పెంపకాలలో నిష్ణాతులయితే, కొందరు వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించారు. తొలి వృత్తులైన వీటి గురించి, ఆ వృత్తిదారుల మధ్య సంఘర్షణలు కథారూపాలై వివిధ మత గ్రంథాల్లో చోటుచేసుకున్నవి.

ఇనాన్నా దేవత వివాహం చేసుకోవాలనుకున్నది. ఆమె ఎక్కడుంటే అక్కడ ప్రాంతం కళకళలాడుతూ ఉంటుంది కదా! ఎంకిదు వ్యవసాయదారుడు. తుమ్ముజ్ గొర్రెల కాపరి.

మొదట్లో ఆమె వ్యవసాయదారుడైన ఎంకిడ్ని ప్రేమించింది కాని సోదరుడు ఉటు (సూర్యుడు) గొర్రెల కాపరి 'తుమ్ముజ్'ను వరించమని ప్రోత్సహించాడు. ఈ సంగతి తెలిసిన వాళ్లిద్దరూ నదీతీరాన కొట్టుకున్నారు. విజయుడైన తుమ్ముజ్, ఇనాన్నాను వివాహం చేసుకున్నాడు. తుమ్ముజ్ పచ్చదనానికి, వసంత కాలానికి ప్రతీక అయినాడు. సంతానదేవత అయిన ఇనాన్నా పశుగణాల్ని గొర్రెల మందలను ఇబ్బడి ముబ్బడిగా పెంచింది. వాళ్లిద్దరి పెళ్లిరోజును సుమేరియన్లు వసంతోత్సవంగా జరుపుకునేవారు.

గ్రామ రాజ్యాలు ఏకీకృతమై రాజరిక వ్యవస్థ ఏర్పడడానికి 'కిష్' పరిపాలకుడు 'ఇటనా' కారకుడు. ఈతడు 'స్వర్గాన్ని సందర్శించిన గొర్రెల కాపరి'గా ప్రసిద్ధికెక్కినాడు.

దేవతల ఆశీస్సులతో తొలిసారిగా రాజరికాన్ని మానవులకు కానుకగా తెచ్చినాడట. ఈతనికి వారసులు లేరు. సూర్యదేవుని ఆశీస్సులతో తాను ఇంతకుముందు రక్షించిన గరుడుని వీపుపై కూర్చుని స్వర్గానికి వెళ్లి ఇనాన్నా దేవత నుంచి సంతాన వృక్షపు వేరును అర్థించి, దేవతల ఆశీస్సులను, సంతానాన్ని పొందినాడు.

కాలం గడిచినకొద్దీ ఇనాన్నా దేవత 'ఇస్తార్'గా పిలువబడసాగింది. సంతానలక్ష్మిగానే కాక యుద్ధదేవతగా రూపొందినది. భర్త 'తుమ్మూజ్' మృతిచెందినాడు. ఆతనిని బ్రతికించి తెచ్చుకోడానికి పాతాళలోకానికి ప్రయాణమై, రాజ్యాన్ని 'నింషువర్' అనే మంత్రికి అప్పగించి, తాను సంవత్సరాంతానికి రాకపోయినట్లయితే దేవతల త్రయానికి విన్నవించమని చెప్పినది. పాతాళలోకానికి ఏడు ద్వారాలున్నాయి ద్వారపాలకుని అర్థింపు, పాతాళరాణి ఆజ్ఞ ప్రకారం ఒక్కొక్క గేటు వద్ద ఆమె తన దేహంపైని ఒక్కొక్క వస్తువును విడువవలసి వచ్చింది. చివరి ద్వారాన్ని దాటేసరికి ఆమె శరీరంపైన నూలుపోగులేదు. నగ్నంగా ఆమె పాతాళరాణి తన సోదరి అయిన 'ఎరిష్కిగల్' ముందు నిలబడి ఉద్రేకంతో పాతాళరాణిని సింహాసనం మీద నుంచి నెట్టివేయబోగా, మృత్యుదేవత అయిన ఆమె సోదరి, 'ఇనాన్నా'ను నిర్జీవురాలిని చేసి ఆమె దేహాన్ని పాతాళలోకపు గోడకున్న మేకుకు తగిలించింది.

ఎంతకూ 'ఇనాన్నా' రాకపోవడంతో మంత్రి ఆ సంగతిని దేవతలకు తెలియబరిచాడు. ఎంకి (ఈఆ–జలదేవుడు) ఒక మిథున దేవతల్ని (అషుషు–నామిర్) సృష్టించి వారికి మొక్కను, జలధారను ఇచ్చి పాతాళానికి పంపించారు. వాళ్లు 'ఇనాన్నా'ను చేరుకుని ఈమెను బ్రతికించినారు. పాతాళరాణి మంత్రపు కట్టును విడిపించుకుని ఆమె తిరుగుప్రయాణంలో ఒక్కొక్క ద్వారం దగ్గర తాను వదిలేసిన వస్తు వస్త్రాల్ని ధరించి భూలోకానికి తిరిగి వచ్చింది. వట్టిపోయిన లోకమంతా ఆమె రాకతో మరల కళకళలాడింది. దేవతలు తుమ్మూజ్ ఆరు నెలలు పాతాళంలో, ఆరు నెలలు భూలోకంలో ఉండేట్లు అనుగ్రహించినారు.

ఈ గాథ సిరియన్, గ్రీకు, హీబ్రూ మహిళల విషాద గీతాల్లో ప్రముఖమైన పాటగా రూపొందినది. ఇనాన్ (ఇస్తార్) సౌందర్యం, శృంగార ప్రియత్వం, కాముకత్వం తరువాతి తరాల్లో అప్సరసల, దేవవేశ్యల, ఆలయ నర్తకీమణుల ఆవిర్భావానికి పవిత్ర ఇచ్ఛా శృంగారానికి దారితీసింది.

✧✧✧✧✧

# 21. దేవతల రూపాలలో విశ్వసారూప్యం

వివిధ దేశాల దేవతల రూపాల్లో స్పష్టమైన సారూప్యాలున్నాయి. అగ్ని పుట్టుక నుంచి మహాకాళికా రూపం వరకు, స్వర్గ నరకాలు, పాపపుణ్యాలపై కూడా వివిధ దేశాల కథాంశాల అవలోకన...

మనం వెళుతున్నది ఖచ్చితంగా కొత్తదారిలోనే. అయినా ఇదివరకెప్పుడో ఇక్కడే నడిచిన భ్రమ. ఆ చెట్లూ, ఈ పూలూ, అదిగో ఆ పిట్టా, ఈ గట్టూ... ఇవన్నీ మనం చూసినట్లే అనిపిస్తాయి. ఇప్పుడు కొరికిన మామిడికాయ పులుపూ అంతే. ఆ బెల్లం చెరుకుగడ తీపీ, వేపాకు వగరూ, చింతచెట్టు చిగురూ, అడవి పూల పరిమళం. చెరువుగట్టు మీంచి నీళ్లలోకి విసిరిన కుండ పెంకుల్లా అలల్లా, గెంతులు వేసుకుంటూ పోతూ వస్తూ అదృశ్యమై పోతుంటాయి. కొన్ని పుస్తకాలు చదువుతున్నప్పుడూ అంతే. సంఘటనలూ, పాత్రలూ చెదురుతున్న మబ్బుల్లా ఎక్కడో పోలికలు కనిపిస్తాయి. 'మోకాలికి, బట్టతలకీ ముడేసినట్లు' మనసు తిడుతూనే ఉంటుంది. కాని ఓ గమ్మత్తైన ఊహల అలజడి. జడివాన. వాన తుంపరలు తుంపరలతో తడిసి మళ్లీ నీరెండ వచ్చినప్పుడు మట్టి ప్రసవించే కొత్త వాసన. ఆకాశాన గీసుకున్న ఇంద్రధనుస్సు. మన అద్దంలో ఇంకెవరిదో ప్రతిబింబం కనిపిస్తే ఉలిక్కిపడ్డట్టు, మనం వేరొకరి కలల వాకిళ్లలోకి చొరబడితే కలవరమే.

భూమిని చుట్టుముట్టిన సముద్రంలో ఎపెప్ మహాసర్పం తనతోకను తానే మింగుతూ ఉంటుంది. బయటకు వస్తున్న నేల నీటిపై తేలియాడుతున్న పరమాత్మ నాభిలా ఉంటుంది. బొడ్డు నుంచి పైకుబికిన పద్మంలో విశ్వరచన చేస్తున్న బ్రహ్మ వికాసమూ కన్పిస్తుంది. అంతా మనసు చేస్తున్న మాయాజాలమై మైమరపు కలుగుతుంది.

అస్సురోబాబిలోనియన్ల (క్రీ.పూ. 2300) గిల్గమేష్ కావ్యంలోని జలప్రళయం ఛాయలు అన్ని మత గ్రంథాల్లోనూ కనిపిస్తుంటాయి. ఉత్నాపిష్టం, అత్రాహాసిస్, జియాసుద్రుడు, డ్యుకాలియన్, సత్యవ్రతుడు, నోవా వీళ్లందరూ జలప్రళయంలో బతికి బయటపడ్డవాళ్లు. ఒకే కథ వేరే పేర్లు. అందరూ వలసలు పోకముందు ఒక్కచోట చెప్పుకున్న కథల్లా ఉంటాయి.

### అగ్ని ఎలా పుట్టింది?

బాబిలోనియన్లకు 'అప్సు' అంటే మంచినీటి సముద్రం. మనకూ అంతే. దేవుని ఆత్మ అల్లల్లాడుతూ ఉంది (జెనిసిస్). ప్రళయకాలంలో విష్ణురూపం జలపు

అలలపై ఆదిశేషుని మీద శయనించి ఉంటుంది. బ్రహ్మాండం బద్దలై విశ్వం ఏర్పడిందని మన పురాణాలు చెబుతున్నట్టే ఆఫ్రికాలోని డోగోన్ ప్రజలు, చైనీయులు ఒకప్పుడు నమ్మేవారు.

నిప్పు మానవుడికి ఎలా దొరికిందన్న విషయమై అనేక కథలున్నా సారాంశ మేమిటంటే కుక్క, చింపాంజి, కాకి, గిజిగాడు, అనకొండా పాము, గొల్లభామ మిడత, సాలీడు విశ్వకర్మ, ప్రొమెథియస్ వీళ్లు దేవతల నుంచి అగ్నిని దొంగిలించి తీసుకొచ్చి మానవజాతికి ఇచ్చారని, మన గురించి వాళ్లు నానా కష్టాలు పడ్డారనీనూ. ప్రాగ్రూపాల (Archtypes) (ఆర్కిటైపు) అర్థాలు అందరికీ ఒకటే కదా.

## పోలిక... కాళిక

'ప్రపంచంలో ఎవరు గొప్ప అందగత్తె' అని అద్దంలో వెదికే మంత్రగత్తెలున్నట్టే, మాయల ఫకీర్లూ ఉండేవాళ్లు. అంజనం వేసి తప్పిపోయిన వాళ్ళని వెదకడం, పూనకాల్లో భవిష్యత్తును వ్యాఖ్యానించడం రోమ్ నగరం దగ్గర డెల్ఫి నుంచి మన దగ్గర మహంకాళీ జాతర వరకు ప్రతిబింబాలు కన్పిస్తూనే ఉంటాయి.

వైకింగుల విశ్వ వృక్షం 'యగ్డ్రాసిల్' పాతాళం నుంచి అమరలోకం వరకు వ్యాపించి ఉంటుంది. బౌద్ధుల బోధివృక్షం, ఈడెన్‌లోని జ్ఞానవృక్షం, కబాలిస్టుల జీవవృక్షం, ఆల్కెమిస్టుల వేదాంత వృక్షం, హిందువుల అశ్వత్థ వృక్షం దేవ, మర్త్య, పాతాళ లోకాలకు ఇరుసుగా, స్తంభంగా, సాంపోగా వ్యవహరించబడేవి. హోమర్ రాసిన ఇలియాడ్ కావ్యంలోని హెలెన్‌లో సీత పోలికలు కొందరికి కన్పిస్తాయి. రామరావణ యుద్ధానికి ట్రోజన్ వార్‌కి పోలికలు దొరికి మాయాసీత ఘట్టం మాయా గుర్రం (ట్రోజన్ హార్స్) ప్రహసనమవుతుంది. భారతంలో సుయోధనుడి ఊరుభంగం, ఎఖిల్లిస్ హీల్ (చీలమండ)ను తలపిస్తుంది. ఇద్దర్నీ తల్లులు పవిత్ర స్నానం చేయించడం వల్లనే వాళ్లకా శక్తీ, బలహీనతలూనూ.

ఒడెస్సీ కావ్యంలోని ఒడెస్సిస్, పెనెలోప్‌ల కథ ఇంచుమించు భారతంలోని నలదమయంతీ చరిత్రలానే ఉంటుంది. పురాణాల్లోని ఇంద్రుడిలాగే గ్రీకుల జ్యూస్ దేవుడిక్కూడా (ద్యు=ఆకాశం) మ కారాలపై మమకారం ఎక్కువ. వీళ్లు మునులు, రాజులు, వారి భార్యలను ఎలాగోలా చెడగొట్టే ప్రయత్నాలు చేస్తూ కోడిరూపంలోనో, హంస రూపంలోనో వచ్చి కోరికల్ని తీర్చుకుంటారు.

## స్వర్గ నరకాలు

పాపుల్ని శిక్షించడానికి పాతాళలోకం, అనేక రకాల నరక కూపాలు భాగవతం, దేవీ భాగవతాల్లో వర్ణించబడినట్లే, వైకింగులకూ, గ్రీకులకూ,

ఈజిప్షియన్లకూ అనేక దేశాల ఆదిమజనులకూ కథాంశాలున్నాయి. సత్యవంతుణ్ణి బతికించుకోవడానికి సావిత్రి యముణ్ణి దర్శిస్తే, తన భార్య యురిడైస్ కోసం ఆర్ఫియస్ యమలోకం వెళ్తాడు.

యక్షప్రశ్నలూ, స్ఫింక్స్ రిడిల్సూ ఇతిహాసాల్లోనూ, పొడుపు కథలు, పడుపు కథలూ... అరేబియన్ నైట్స్, కాశీమజిలీ కథలు, సహస్ర శిరచ్ఛేద చింతామణి కథల్లో తళుక్కున మెరుపులై మెరుస్తాయి. పూలబాణాలు వేసి ప్రేమలో దింపే మన మన్మథుడిలానే ఎరాస్, క్యుపిడ్‌లు గ్రీకు, రోమన్ గాథల్లో అదేపని చేస్తుంటారు. అర్జునుడిని ఎదిరించిన ప్రమీలా రాణి లానే ఎఖిల్లిస్‌ను ఎదిరిస్తుంది అమెజాన్ల రాణి పెంథెసిలియా.

## జడ్జిమెంట్ డే

అన్ని మతగ్రంథాల్లోనూ యుగాంతంలో 'జడ్జిమెంట్ డే' ఉంటుంది. మన పాప పుణ్యాల బేరీజు వేయబడి నరకానికో, స్వర్గానికో పోయి పుణ్యం ఎక్కువుంటే రంభా, ఊర్వశులు, వాల్కీరీల్లాంటి అప్సరసలిచ్చే అమృత మధువును సేవిస్తూ, అది ఖర్చు కాగానే పునర్జన్మలెత్తుతాం.

ముందే చెప్పినట్టు దూరం నుంచి అద్దంలో చూసినప్పుడు అన్ని కొండలూ నున్నగానే, ఒక్కతీరుగానే కన్పిస్తాయి. దగ్గరకు వెళ్లిన తరువాత వేటి ప్రత్యేకతలు వాటివి.

✧✧✧✧✧

# 22. దేవుడూ, దయ్యాలూ – అంతా ఒక భ్రమ

సమాజాన్ని నైతిక సరిహద్దులో ఉంచడానికి దేవుని ఉనికి, ఆవశ్యకత ఏర్పడిందని ఇమ్మాన్యుయేల్ కాంట్ భావించగా దుష్టశిక్షణ, శిష్టరక్షణకై దేవుడు పలు అవతారాలనెత్తుతాడని హిందూధర్మం ప్రవచిస్తోంది. ఆ హిరణ్యగర్భుడు (సమ్మమ్ బోనమ్ - The highest good - God) సర్వోన్నతుడు. అంతకుమించి ఉన్నతతత్త్వాన్ని ఊహించనేలేము. (A liquid quo nihil maius cogitari possit) అంటాడు ఏన్‌సెల్మ్ అనే ఆర్చిబిషప్ ఆఫ్ క్యాంటర్‌బరీ. దేవుని సృజన ఎటువంటిదంటే ఆ పనిని దేవుడు మాత్రమే చేయగలడు అని వ్యాఖ్యానించాడు కీర్కెగార్డ్.

'చరిత్రను పరిశీలించు. దేవుడు తన ఉనికిని అవసరమైనప్పుడల్లా ప్రకటిస్తూనే ఉన్నాడు. దేవుడు ఈ సృష్టికి దూరంగా ఎక్కడో లేడు. అనేక రూపాల్లో తనను తాను వ్యక్తపరుస్తూ చరిత్ర గతిని కొనసాగిస్తున్నాడు. ఈ చరిత్ర అంతిమంలోనే దేవుని సత్యరూపం పూర్తిగా అవగతమవుతుంది అంటాడు హెగెల్. 'ఓ పోషకుడా! సత్యమనే నీ వదనాన్ని వీక్షించుటకు స్వర్ణతేజో ఆవరణం అడ్డువస్తున్నది. దానిని తొలగించి నీ దర్శనము అనుగ్రహించు తండ్రీ!' అని ఈశావాస్యోపనిషత్తులో ఋషి ప్రార్థిస్తున్నాడు.

మానవ సమాజంలో నైతిక ప్రవర్తన, ధర్మం అడుగంటిపోయినప్పుడు, చెడు నలుదిక్కులా వ్యాపించి బలహీనుల్ని భయభ్రాంతుల్ని చేస్తున్నపుడు ఎవరో ఒక మహా ఉన్నత శక్తి, సత్య పరమాత్మ అవతరించి దీనుల్ని తరింపచేస్తాడన్న విశ్వాసం జనుల్లో కలుగుతుంది – అంతే! అని పేర్కొన్నాడు లుడ్విగ్ ఫ్యూయర్‌బాచ్

కారల్ మార్క్స్ ఈ భావనలో క్రొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ సామాజిక అసమానత మతభావనను రేకెత్తించగా, బలవంతులచే పీడించబడుతున్న బలహీనులకు, ఆర్థికంగా క్రుంగిన ఆర్తులకు మతమనేది గంజాయిదమ్ముగా ఉపశమనాన్నిస్తున్నది. నిజమైన సంతోషం మతమనే ఓపియం (గంజాయి) మత్తు నుంచి బయటపడ్డప్పుడు మాత్రమే కలుగుతుంది. మతం – అణగదొక్కబడిన ప్రజల ఆశ, శ్వాస, నిట్టూర్పు. ఆర్థిక అసమానతలు రూపుమాసినపుడు, ఆ విముక్త ప్రపంచంలో మతానికి చోటుండదు – అని ప్రకటించాడు కారల్‌మార్క్స్

మతం తండ్రిలాంటి రక్షకుడైన దివ్యవ్యక్తిని ప్రతిపాదిస్తూ ఒక లోటును తీరుస్తుంది. ఆ శక్తి తమను ఎల్లప్పుడూ కాపాడ్తుందన్న నమ్మకంతో జనులు నిశ్చింతగా నిద్రపోతారు - అని విశ్లేషించాడు సిగ్మండ్ ఫ్రాయిడ్.

ఆదిమ మానవులకు ఈ భయాలుండేవేమో! వాళ్లు మృత్యువును, వ్యాధుల్ని చెడుగాలి (ఈవిల్ స్పెల్) సోకినందువల్ల కలిగిన ఫలితాలుగా భావించి ఉంటారు. చనిపోయినవారిని పాతిపెట్టినా వాళ్లు మరల తిరిగి బయటకు వస్తారేమోనన్న భయంతో శవాల్ని గర్భస్థశిశువు స్థితిలో కాళ్లను చేతుల్ని రొమ్ముకు, పొట్టకు గట్టిగా కట్టి ఖననం చేసి పైన పెద్దపెద్ద రాళ్లను ఉంచేవారు. వాళ్లు ఆ లోకంలోనే సుఖంగా ఉండడానికి వీలుగా వాళ్లు అంతకు ముందు ఉపయోగించిన వస్తువాహనాలు, ఆయుధాల్ని వాళ్ళకు తోడుగా పాతిపెట్టేవారు. ఈ ఆచారం మరింత బలపడి రాజరిక వ్యవస్థ ఏర్పడ్డాక మరణించిన రాజుతోపాటు సజీవులైన సేవకులు, రాణులు, మందీమార్భలాన్ని సామూహికంగా సమాధుల్లోకి తరలించడం మనకు కనిపిస్తుంది.

వేల్స్‌లోని పావిలాండ్‌లో దొరికిన 'రెడ్‌లేడ్' సమాధిలోని అవశేషాలు, ఫ్రాన్సులోని లాఫెర్రాషె, లా చాపెల్లె-ఆక్స్-సెయింట్స్ సమాధుల్లో లభ్యమయిన ఆధారాలు, మానవ కపాలాన్ని, చిన్ని ఎముకల్ని అలంకరణలలో హారాలలో ఆల్చిప్పలు, గవ్వలు, ఏనుగు దంతాలతో చేసిన నగలలో కూర్చి ఆనాటి ప్రజలు ధరించినట్లు ఋజువు చేస్తున్నాయి. తాము చంపిన మనుషులు, జంతువులు చీకటిలో రాత్రివేళలలో ప్రేతాలై, ఆత్మలై తమను ఆవహించకుండా రెడ్ ఓకర్, ఎర్రమట్టి, సింధూరం, ఐరన్ ఆక్సైడ్ (ఇనుప రజను)లు చల్లి కేకలు, పెడబొబ్బలూ వేస్తూ, సామూహిక నృత్యాలు చేస్తూ అలసిసొలసి సొమ్మసిల్లిపోయేవారు. వాళ్లలో తెగ నాయకుడో, బలవంతుడో ఆ తర్వాత మంత్రగాడిగా రూపెత్తి ఉంటాడు.

మెదడు పరిమాణంతో బాటు మానవునికి ఆలోచన, జ్ఞాపకశక్తి పెరిగాయి. స్వరపేటిక గొంతు క్రిందకు రావడం వలన సంజ్ఞలు, శబ్దాలు, కేకలు మాటలుగా రూపాంతరం చెంది ఉంటాయి. దృష్టి తీక్షత వృద్ధి చెందింది. కాళ్లు నడకకు పనికి రాగా చేతులు బొటనవేళ్ళు పనిముట్లను తయారు చేసాయి. నిప్పు వెలుతుర్ని, రక్షణనివ్వగా, చక్రం, పడవలు దూరతీరాల్ని దగ్గరకు తెచ్చాయి.

అడవుల్లో, కొండల్లో నివసించేవాళ్లు పళ్లూ ఫలాలు వేటలపై ఆధారపడగా, తీర ప్రాంతపు ప్రజలు చేపలవేటలో, నదీ పరివాహక ప్రాంతపు ప్రజలు పళ్లూ, ఫలాలే కాక తమ పెంపుడు జంతువులు తింటున్న గడ్డిగాదాల్లో తినడానికి పనికి

వచ్చే తృణధాన్యాల్ని గమనించారు. పదివేల సంవత్సరాల క్రితమే ఉత్తర గ్రీసు దేశం నుంచి ఇరాన్, జోర్డాన్ ప్రాంతాల్లో గోధుమ బార్లీల పెంపకం మొదలయ్యింది. వేటగాళ్లకు కుక్క, గుర్రం తోడ్పడగా వ్యవసాయదారులకు గొర్రెలు, మేకలు పందులు, ఆవులు పెంపుడు జంతువులయ్యాయి.

పదులు, వందల సంఖ్యలో ప్రజలు సామూహిక జీవనాన్ని గడపడానికి అలవాటు పడగా తండాలుగా, గుంపులుగా జీవిస్తున్న ప్రదేశాలలో తొలి గ్రామాలు ద్భవించాయి. చీకటి నుంచి, ప్రకృతి వైపరీత్యాల నుంచి తమను కాపాడమని వేడుకుంటూ తమకంటె ఎక్కువ శక్తులున్న క్రూరజంతువులు, పక్షుల రూపాలతో ప్రకృతిని ప్రజలు పూజింపసాగారు. గ్రామదేవతలు ఒక్కొక్క చోట ఒక్కొక్క రూపంలో పేరుతో ఆవిర్భవించగా ఆ ప్రజలకు 'టోటెమ్'గా, చిహ్నంగా కాలం గడచినకొద్దీ దైవంగా మార్పు చెందినట్లు అర్థమవుతోంది.

✧✧✧✧✧

# 23. మనిషే... దైవం!

దేవుడు అనే భావనకు మూలం ఏమిటి? మనలో దైవభీతి ఎలా జీవం పోసుకుందనే ప్రశ్నలు వేల సంవత్సరాలుగా అన్వేషకులను వేధిస్తూనే ఉన్నాయి. మానవుల్లో నమ్మకాలు, సంప్రదాయాలు పెరగడానికి ఎన్నో ఆధారాలు మనకు కనిపిస్తాయి. మనలో విషాదం, ఎడబాట్లు పెరిగిపోవడం ఆచారాలకు నాందిగా కొందరు భావిస్తారు. ఆయా కాలాల్లో మహాద్భుత శక్తి కలిగిన యోధులే ఆ తరువాత ప్రజల చేత పూజలందుకున్నారు.

"దేవుడున్నాడని నిరూపించలేను కాని, మానవుడు నైతిక కట్టుబాట్లతో ఉండడానికి దైవం, దైవభీతి అవసరం" అని భావించాడు ఇమ్మాన్యుయేల్ కాంట్. దేవుడున్నాడు కాబట్టే ఆ ఆలోచన నాకు వచ్చింది. నేనున్నాను. ఎందుకంటే అలా నేను భావిస్తున్నాను కాబట్టి అన్నాడు రెనె డెకార్టె. "దేవుడున్నాడో లేడో? చర్చ అనవసరం. కానీ, నేనొక లాభకరమైన విషయం చెబుతాను విను. దేవుడిని నువ్వు నమ్ముతున్నావనుకో... దేవుడుంటే... అంతా నీకే లాభం. లేడనుకో నీకు పోయేదేమీ లేదు. నీవు నమ్మవనుకో... దేవుడుంటే... ఎంత ప్రమాదం నీకు. సరాసరి నరకమే కదా గతి. అందుచేత దేవుడిని నమ్ము, లాభపడు" అని సలహా యిచ్చాడు బ్లెయిజ్ పాస్కల్. "ఈ దేవుళ్ల తరహా చాలా చిత్రంగా ఉంటుంది. మనకు కష్టసుఖాలను ఒకదాని వెంట మరొకటి పంపిస్తూ వినోదిస్తుంటారనుకుంటాను" అని ప్రపంచ సుందరి హెలెన్ వాపోయింది. ప్రాచీన కాలంలో గ్రీకులు అలాగే విశ్వసించేవారు. ఒలింపస్ అనే పర్వత శిఖరంపైన దేవతలు తీరికగా కూర్చొని మానవులను కష్టసుఖాలకు లోనుచేస్తూ వినోదిస్తారని అనుకునేవారు.

## దైవం, దైవభీతి...

ఈ దైవ భావన, దైవభీతి మానవుడికి ఎప్పుడు వచ్చింది? అని శాస్త్రజ్ఞులు, పురాతత్త్వ పరిశోధకులు అన్వేషణ ప్రారంభించారు. తొలి ఆధారాలు దక్షిణ ఫ్రాన్సులోని 'లా ఫెర్రాషే' అనే ప్రదేశంలో లభించాయి. ఐదు మిలియన్ సంవత్సరాల క్రితం ఆఫ్రికాలో సంచరిస్తున్న నరవానరం ఏప్‌మాన్ మెదడు పరిమాణం – 480 సి.సి. మిలియన్ సంవత్సరాల నాటి నిటారుగా నిలబడ్డ మనిషి – హోమోఎరక్టస్ (1000 సి.సి.). 70000–30000 సంవత్సరాల మధ్య నియాండెర్తల్ మనిషి మెదడు పరిమాణం కొద్దిగా ఎక్కువగా ఉన్నప్పటికీ, దాదాపు నేటి మానవుడి (హోమోసెపియన్స్ సెపియన్స్) మెదడు (1450సి.సి.)లా ఉంది.

## విషాదాలే... ఆచారాలకు మూలమా?

నియాండెర్తల్ మానవుడి అవశేషాలు ఒక సమాధిలో బయటపడ్డాయి. ఒక పద్ధతిలో పాతిపెట్టిన ఒక కుటుంబం మొత్తం తల్లి, తండ్రి, నలుగురు పిల్లల సమాధులు బయల్పడ్డాయి. మరణానంతర జీవనంలో ఉపయోగపడతాయని కాబోలు చిన్న పిల్లవాడి పక్కనే చిన్ని పనిముట్లు ఉన్నాయి. అభివృద్ధి చెందిన వానరాల్లో కుటుంబ సభ్యులు మరణించినపుడు విషాదాన్ని పొందడం శాస్త్రజ్ఞులు గమనించారు. మానవుల్లో ఈ విషాదం, ఎడబాటు కాలక్రమేణ ఎక్కువై, కొన్ని ఆచారాలకు దారితీసి ఉండ వచ్చునా? స్విట్జర్లాండులో ఒక గుహలోని రాతిపెట్టెలో అనేక ఎలుగుబంట్ల పుర్రెలు, ఎముకలు కన్పించాయి. చలి నుంచి రక్షణకై ఎలుగుబంట్లను వాటి గుహల్లోంచి తరిమేసి లేదా చంపి, వాటి ఆత్మలను ప్రసన్నం చేసుకోవడానికి ఆది మానవుడు చేసిన ప్రయత్నమా?

## నరమాంస భక్షణకు ఆధారాలు

"మొన్నో, నిన్నో చనిపోయిన కుటుంబ సభ్యుడు కలలో సజీవంగా కనిపిస్తాడు, మాట్లాడతాడు. గోయి తవ్వి, మట్టిలో పాతిపెట్టి, పైన బండరాయిని పెట్టినా అర్ధరాత్రి కటిక చీకటిలో నిద్రలో ఎలా కన్పించాడు? బతికి ఉన్నవాడికి, మరణించినవాడికి తేడా ఏమిటి? స్పర్శకందనిది, వెలుతురులో మాయమయ్యేది... ఏమిటది? జీవమా? ఆత్మా?" ఆ ఆలోచనా వాహినిలో అనేక ఆచారాలు ఉద్భవించాయి. నియాండెర్తల్ మనిషి నరమాంస భక్షణ చేశాడనడానికి ఆధారాలు ఉన్నాయి. ఇటలీలోని మోంటెసిర్సియోలో దొరికిన కొన్ని కపాలాలకు రంధ్రం చేసి ఉన్నాయి. ఎముకలపై కొరికిన, చితగ్గొట్టిన గుర్తులు ఉన్నాయి. వేట జీవనమైన వాళ్లకు హింస గురించి వేరే ఆలోచన ఏముంటుంది? చంపిన జంతువుల, మానవుల శక్తులు మాంస భక్షణ ద్వారా తమకు సంక్రమిస్తాయని నమ్మేవారేమో!

## తెలివైన జాతి

గత ముప్పై వేల ఏళ్లుగా రాజ్యమేలుతున్నది హోమోసెపియన్స్ సెపియన్స్ (తెలివి గలవాడు). వీరిలో క్రోమాగ్నాన్ అని పిలువబడే తెగ ఫ్రాన్సులోని డోర్డాన్ ప్రాంతంలో లెస్ ఈజిస్ వద్ద 'మహారంధ్రం'గా పిలిచే ప్రదేశంలో నివసించేవారు. ఆఖరి మంచు యుగపు అంతిమదశలో కొందరు అమెరికా లాంటి దూర ప్రాంతాలకు తరలిపోయారు. మానవులలో నాలుగు జాతులు కాకసాయిడ్లు (యూరోపియన్లు, ఇండియన్లు), మంగోలాయిడ్లు (ఆసియన్లు, అమెరికన్ ఇండియన్లు), నీగ్రాయిడ్లు (ఆఫ్రికన్లు), ఆస్ట్రలాయిడ్లు ఆవిర్భవించాయి. ఫ్రాన్సు, స్పెయిన్ దేశాలలో 15000–10000 సంవత్సరాల పూర్వం సంచరించిన తెగలను ఆ ప్రాంతం పేరుతో

మార్గదర్శకమైనదిగా భావించారు. ఆహార సంగ్రహణ కోసం తిరిగిన మానవులు అనేక విధాలుగా వ్యవహరిస్తున్నారు. చెకొస్లోవేకియాలోని ప్రెడ్ మాస్ట్ వద్ద బయల్పడిన సామూహిక సమాధుల్లో ఇరవైకి పైగా మానవ అవశేషాలు లభించాయి. సమాధుల చుట్టూ గుండ్రంగా అమర్చిన రాతిగుళ్లు, మంత్రించి చల్లినట్టున్న ఎర్రమట్టి ఎముకలపై కనిపిస్తూ ఆనాటి నమ్మకాలను, ఆచారాలను చెప్పకనే చెబుతున్నాయి. ఫ్రాన్సులోని లాసాహ్సు గుహలో గోడలపై ఉన్న చిత్రాలు, పెయింటింగ్స్, వీనస్ ఆఫ్ విల్లెన్ డార్ఫ్, వీనస్ ఆఫ్ లాసెక్, బ్రాంకెంపోయీ దంతపు బొమ్మ, కొన్ని గుహలలో కనిపించిన అడుగుజాడలు, చేతి ముద్రలు, జింకచర్మం ధరించి నృత్యం చేస్తున్న మంత్రగాళ్ల బొమ్మలు, వేటాడిన జంతువుల బొమ్మలు ఆనాటి మానవులలోని నమ్మకాలను, కళాభిరుచిని వ్యక్తం చేస్తున్నాయి.

## జనావాసానికి శ్రీకారం

మంచు కరిగి వాతావరణం మెరుగుపడగా, గుహలను వదిలి కొందరు అడవులకు, కొందరు తీరాల వైపు వెళ్లిపోయారు. క్రీస్తుపూర్వం 8000 సంవత్సరాల నాటికి మధ్యయూరప్‌లో మంచు తగ్గగా విల్లో మొక్కలు, ఓక్ వృక్షాలు, హరితవనం పెరిగాయి. మామత్ ఏనుగులు, రెయిన్‌డీర్‌లు ఇతర జంతువులు ఆహారం కొరకు ఉత్తర దిశగా పయనిస్తే, మానవుడు వాటిని అనుసరించాడు. పశువుల పెంపకం, వ్యవసాయం, చేపల వేట, పడవల నిర్మాణం, మానవుల మధ్య సంబంధ బాంధవ్యాలు పెరిగి గ్రామాలు ఆవిర్భవించాయి.

## దేవుడికి రూపాంతరం

యుగొస్లావియాలో డాన్యూబ్ నదీ తీరంలో క్రీస్తుపూర్వం 5000 సంవత్సరాల నాటి వెపెన్స్కీ వీర్ గ్రామంలో 59 ఇళ్ల ఆనవాళ్లు పురాతత్త్వ పరిశోధనలో బయల్పడ్డాయి. చక్కగా తీర్చిదిద్దిన ఇళ్లు, ఇంటి మధ్యలో చేప లేదా కప్పలా చెక్కిన రాతివిగ్రహాలు, తొలినాటి దేవుళ్ల ప్రతిరూపాలు పూజలందుకున్నట్లు మనకు కనిపిస్తాయి. చేపల వేటలో తమకు తోడ్పడమని జాలరులు ఆ విగ్రహాలను పూజించి, నృత్యాలు చేసి వేటకు వెళ్లి ఉంటారనిపిస్తుంది. ఇజ్రాయిల్‌లో 'నాటూఫియన్స్'గా పేర్కొన్న ప్రజలు ఈనాన్ గ్రామవాసులు. వాళ్ల నాయకుడు చనిపోయాక అతనిని గుండ్రటి రాతి ఫలకాల మధ్య కూర్చొని ఉన్న స్థితిలో సమాధిచేశారు. అతని కళ్లు హెర్మాన్ కొండ శిఖరాన్ని చూస్తూ నిశ్చలంగా ఉంటాయి. మానవుడిగా పూజలందుకున్న అతడు తరువాత తరాలకు మహాయోధుడిగా, దేవుడిగా రూపాంతరం చెంది ఉంటాడు.

✧✧✧✧✧

# 24. దైవాన్ని చూపించు!

అన్ని మానవ జాతుల్లోనూ దైవ భావన ఉంది. దేవుడు ఓ మహాద్భుత శక్తి కేంద్రం. దైవ భావన అనాదిగా ఉన్నప్పటికీ ఆయన ఉనికికి సంబంధించిన సందేహాలు కూడా అంతే కాలంగా ఉన్నాయి. దైవం ఉంటే ఈ కష్టాలు, కన్నీళ్లు, వేదనలు పుడమిపై ఎందుకున్నాయి? అందరూ దేవుని సంతానం అయితే కొందరికి మోదం... మరి కొందరికి ఖేదాన్ని ఆయన ఎందుకు ప్రసాదిస్తున్నాడనే ప్రశ్నలు వేల సంవత్సరాలుగా శేషప్రశ్నలే. దేవునికి సంబంధించిన విశ్వాసాల విపంచి ఇది...

"డింభక! సర్వస్థలములన్ అంభోరుహ నేత్రుడుండుననుచు మిగుల సంరంభంబున పలికెదవు. ఈ స్తంభంబున జూపగలవె చక్రిన్, గిక్రిన్" అని హిరణ్యకశిపుడు తన కుమారుడు వైరికి అనుకూలుడైన ప్రహ్లాదుని గద్దించి అడిగాడు. అడగటమే కాదు పక్కనే ఉన్న స్తంభాన్ని అరచేత గట్టిగా చరిచాడు. ఆ స్తంభం నుంచి దశదిశలను మిడుంగురుల చెదరం జిటలి పెటిలి, ఛటఛట స్ఫుటస్ఫుట ధ్వనుల మధ్య కేవలం పురుష రూపాన్ని, మృగరూపాన్ని కాకుండా నరసింహ రూపాన వచ్చి, రేయి పగలు గాని సంధ్యాసమయాన, అంతరంగం, బహిరంగం గాని సభా ద్వారాన, గగనము, భూమి గాని యూరు మధ్యన ప్రాణ సహితం, ప్రాణ రహితం గాని నఖములతో నరసింహ అవతారంలో హిరణ్యకశిపుని చీల్చి, వధించి తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించాడు. ఇది భాగవతోపాఖ్యానం. ఇది భగవానుని కథలో ఒక అద్భుత ఘట్టం.

## దేవుని మూడు పేర్లు

మోసెస్‌కు ఆ కొండ రాళ్ల మధ్య ఓ అద్భుత దృశ్యం కనిపించింది. జ్వాజ్వల్యమైన కాంతులతో ప్రకాశిస్తూ మండుతున్న పొదను చూసి సంభ్రమాశ్చర్యాలతో అలానే నిలిచాడు మోసెస్. "నేను నీ తండ్రి దేవుడిని" అని దివ్యవాణి అతనికి వినిపించింది. మోసెస్ భయపడుతూ "నేను... ఇజ్రాయిల్ అడిగితే... ఎవరని.... చెప్పాలి? అని మెల్లగా అడిగాడు. "ehyeh 'ser' ehyeh"- IAM WHO IAM అని దేవుడు తన ఉనికిని మోసెస్‌కు విస్తృతపరచాడు. "Iam the LORD (Yahweh). I apeared to Abraham, to Isac, and to Jacob as God Almighty (el sadday")

పాత నిబంధన (ఓల్డ్ టెస్ట్‌మెంట్) ప్రకారం దేవునికి మూడు పేర్లున్నాయి. 1. EL సెమెటిక్ భాషలో ఈ పదం దేవుడిని, అతని ప్రతిమలను, రూపాలను సూచిస్తుంది. 2. Lohim, 3. Yahweh (Jehovah). డ్యూటిరానమీ 5:9 లో ఇలా చెప్పబడింది. "I Lord (Yahweh) Your God (Lohim) an a Jealous God (EL). ఇది సెమెటిక్ ప్రజల దైవ స్వరూపం.

## దేవుడున్నాడా?

ఆధ్యాత్మిక, ఆధిభౌతిక ధోరణిలో 'దేవుడున్నాడు' అని నొక్కి చెప్పడం, ఇది సత్యాసత్యాలుగా కూడా నిరూపితం అవుతుందని ఎ.జె. అయ్యర్ అన్నారు. కేవలం ఒక ఉదాహరణ, ఒక సిద్ధాంతం ద్వారా మనం ఏ విషయాన్ని నమ్మలేము. అది అనేక రుజువులు, ఆలోచనల సమ్మిళితం అని విట్ జెన్‌స్టీన్ భావించాడు. సరేనయ్యా! దేవుడు సర్వ శక్తిమంతుడు, చెడుని ఎందుకు అంగీకరిస్తున్నాడు? (దేవుడనే వాడుంటే ఈ క్షుద్రమైన కార్యాలు ఎందుకు జరుగుతాయి? ఈ రక్తపాతాలు, హత్యలు, భయంకరమైన ఆకలి, పేదరికం, వినాశాలను దేవుడు ఎందుకు జరగనిస్తున్నాడు? అంటే ఒక వేళ దేవుడున్నా అతడు సర్వ శక్తిమంతుడు కాదా? అందర్నీ ఒకే రకంగా చూడడా?) ఇలాంటి వాటికి సమాధానాలు అంత తేలికగా లభించవు.

## దేవుని తత్వం

దేవుడు జీవులను సృష్టించి వాటికి స్వేచ్ఛ అనే గొప్ప వరాన్నిచ్చాడు. అయితే స్వార్థం పెరిగి, అహం ఎక్కువై తమ స్వేచ్ఛను దురుపయోగం చేస్తున్నాయని కొందరు భావిస్తే, మంచిని జీవకోటికి ప్రసాదించడానికి భగవంతుడే చెడును కొంత పరిమితిలో అంగీకరిస్తాడని కొందరు భావిస్తున్నారు. మరికొందరు దేవుని పోకడలు, కార్యాలూ ప్రశ్నించ వీలులేనివి, వేలెత్తి చూపలేనివి అని ప్రకటించారు. 'ఈ మతాలన్నీ ఒక స్వార్థపూరిత నడవడి నుంచి మనిషిని మరో దాని వైపు మళ్లిస్తున్నాయే కాని, సత్యమైన దైవత్వాన్ని వివరించడం లేదు. ఎందుకంటే దేవుని తత్త్వం మానవకోటి ఆలోచనకు అందనిది' అంటాడు జాన్‌హిక్. "దేవుడు ఈ చరాచర జగత్తును సృష్టించడం నిజమయితే అప్పుడప్పుడూ తన ఉనికిని ప్రకటిస్తాడు" అని సమాధాన పడ్డాడు రిచర్డ్ స్వైన్‌బరన్.

## ప్రతి పేరులోనూ పరమార్థమే

ఇండో యూరోపియన్ భాషలోని 'దైవోస్' శబ్దము ఈశ్వరుని (దేవుని) సూచిస్తుంది. ప్రాచీన లాటిన్‌లో 'డేయుస్'గా, సెటిక్‌లో 'దేవాస్'గా, ప్రాచీన స్కాండినేవియాలో 'తీవర్'గా, లిథువేనియన్‌లో 'దేవస్'గా, సంస్కృతమున 'దేవస్'గా ఉన్న ఈ పదానికి స్వయం ప్రకాశకుడు, అంతరంగ, బహిరంగ లోకాలకు వెలుగు నిచ్చువాడు, కోరికలను తీర్చువాడు అని అర్థం. శుద్ధ (సంస్కృత), స్పెంటా (అవెస్టన్), స్జైవెనోటస్ (లిథువేనియన్), య్, యావే, యహ్-వెహ్, జెహోవా పదాలు పశ్చిమ సెమెటిక్ జాతులలో ప్రసిద్ధమైన దేవుని వర్ణిస్తాయి. యవ్వా, యహు, యక్ష మొదలగు వేద శబ్దాలు పరతత్త్వాన్ని వివరిస్తాయి. చైనా ప్రజలకు ద్యౌః ఆకాశం. ఆదిమ ఆర్యుల పరదేవత ద్యాయుష్ పితర్; గ్రీకులకు జియుస్ పాటర్-స్వర్గలోకపు తండ్రి.

సర్వపిత, పరమగురువు, నీతి వ్యవస్థా పాలకుడు, కరుణామయుడు, జగత్కర్త అయిన 'దేవుడు' ఉన్నాడని భావము. ఇది అన్ని ప్రాచీన, నాగరిక జాతుల్లోనూ కనిపిస్తుంది. దేవుడిపై మనకున్న విశ్వాసాన్ని కొన్ని విషయాలు మరింత వృద్ధిచేస్తాయి. అవి నేరభావం, కృతజ్ఞత, ప్రమాదం, దైవ సన్నిధి, దేవుని పలుకులు, చుట్టూ ఉన్న ప్రకృతి. ఇవి మనకు దేవునిపై అచంచల విశ్వాసాన్ని కలిగిస్తాయి అని భావించాడు ఆల్విన్ ప్లాటింగా.

## అద్భుత శక్తి

'మనకు పనికి రాని రుజువులు ఎదురుగా ఉన్నా, కనిపిస్తున్నా సరే మనం నమ్మం' అని విలియం జేమ్స్ అన్నాడు. ప్రాచీన సెమైట్లు, వైదిక ఆర్యులు, మెలనీషియన్లు, ఇతర మతాల వారికి దేవుడు అంటే ఒక విలక్షణమైన, అద్భుతమైన శక్తి. అది పవిత్రము, అశరీరము, అప్రాకృతికము, అద్భుతము, విస్మయావహము, మహోగ్రం, ఓజస్వంతం, మహద్భయం, అచింత్యం, శుద్ధం, విద్యుత్ స్పర్శ వలె ఆశ్చర్య భయ జనకము, గూఢం, ఈశం, యక్షంగా భావిస్తారు. ఆ శక్తి ఒక్కోసారి మహత్తుగా ప్రతి వ్యక్తిలోనూ కనిపిస్తుంది. దీనిని మెలనీషీయన్లు 'మానా' అనగా, అమెరికన్ ఇండియన్లు 'మానిటు, ఒరిండా, వారెండా' మొదలగు పేర్లతోను, ప్రాచీన జర్మనులు 'హమింగాజా' అని పిలిచారు. అరబ్బులు 'బరక' అని, చైనీయులు 'టావా', హిందువులు ఋతము, బ్రహ్మముగా ఈ శక్తిని అర్థం చేసుకున్నారు. ఈ విలక్షణ విస్మయావహ శక్తిని చూచుట, దాని పట్ల శ్రద్ధ వహించుట సమ్మతమై, ఇష్టమై మతముగా రూపుదాల్చింది.

✧✧✧✧✧

# 25. భూమి నాదియన్న భూమి ఫక్కున నవ్వు!

జగతిలో ఏది శాశ్వతం కాదు. సిరిసంపదలు... భూమి... ఏదీ కూడా. రసాతలంలో కలిసిపోయిన భూమిని యజ్ఞవరాహమూర్తి బలమైన తన దంతాలతో పైకి లేపి కాపాడారు. ఆపైన పృథు చక్రవర్తి చదును చేశారు కాబట్టి పృథ్వి అయింది. ఈ ప్రపంచం అంతా నాదే అనుకున్న బలిచక్రవర్తి వామనుడి మూడో పాదం మోపేందుకు కావలసిన చోటు ఇవ్వలేక భంగపడ్డాడు. నాటి నుంచి కలియుగంలో భూకబ్జాల పర్వం దాకా సాగుతున్న సరికొత్త పురాణం చూసి పుడమి ఫక్కున నవ్వదా?

**"నరవర! తొంటి భూపతుల నామ గుణంబులు వృత్తి చిహ్నముల్**
**సిరియును రూప సంపదలు జెన్నగు రాజ్యము లాత్మచిత్తముల్**
**వరుస నడంగె గాని యట వారల కీర్తులు నిర్మలంబులై**
**యురవడి భూమి లో నిలిచి యున్నవి నేడును రాజశేఖరా!"**

– భాగవతం 12–14

కీర్తి శాశ్వతం. ధన ధాన్య సంపదలు కాదు. ధర్మం, సత్యం, కీర్తి, దయ, విష్ణుభక్తి, అహింస, మంచి పనులు ఇవే చివరికి మిగిలేవి. గొప్ప గొప్ప రాజులే కాలగతిలో కరిగిపోయారు. భూమిని విశృంఖలంగా ఆక్రమించి అంతా నాదే అని విర్రవీగే గర్వాంధులైన నరపతులను చూసి భూదేవి నవ్వుతుంది అని శుక యోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు వివరించారు.

## దేనిని మొక్కాలి?

దూర దేశం నుంచి వచ్చిన ఓ బాటసారి నాతో ఇలా అన్నాడు. ఆ అంతూ పొంతూ లేని నిర్జనమైన ఎడారి మధ్యలో ఓ పెద్ద రాయి మీద ఓ పురాతన విగ్రహం దనుకుంటా. తాటి చెట్టంత ఎత్తు, ఏనుగంత లావు కాళ్లు మాత్రం నిలబడి ఉన్నాయి. తల, మొండెం అజా పజా లేవు. ఆ శిలాఫలకం మీద ఇలా రాసి ఉంది. "నా పేరు ఒజిమాండియస్... రాజులకే రారాజును... నా శౌర్య ప్రతాపాలకు, గొప్పతనానికి సాగిలపడండి. మొక్కండి". ఎంత దూరం చూసినా అంతా ఇసుక మయం. దుమ్మూ ధూళి. ఆ కాళ్లూ, రాళ్లూ తప్ప మొక్కడానికి, భయపడడానికి అక్కడింకేమీ లేదు. – (పి.బి. షెల్లీ రాసిన అద్భుత పద్యమిది) అవును! ఏమైనవి ఆ సిరి సంపదలు? రాజ్యభోగాలూనూ? "కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే వారేరీ సిరిమూట గట్టికొని పోవం జాలిరే! భూమిపై బేరైనం గలదే..."

## బలిదానం

బలి చక్రవర్తి ధాటికి దేవతలు ముల్లోకాల్ని విడిచి పారిపోయారు. రాక్షసుల గర్వం మరింత ఎక్కువైంది. అది భరించలేని సురల తల్లి అదితి కశ్యపుడిని ఆరాధించి

వామనుని కన్నది. పుట్టెడు బుద్ధులున్న ఆ పొట్టివాడు తన అన్న ఇంద్రునికి మరల రాజ్యం ఇప్పించాలని, యజ్ఞదీక్షలో ఉన్న బలి చక్రవర్తిని చేరి ఆశీర్వదించాడు. "ఏమి కావాలన్నా ఇస్తాను కోరుకోవయ్యా" అని రాజు అడిగితే నాకు "మూడడుగులు నేల చాలు. నీవు అడగమన్నావని నిఖిలంబును నేనడగను" అన్నాడు. పుట్టి నేర్చుకొనెనో పుట్టక నేర్చెనో, చిట్టి బుద్ధులిట్టి పొట్టివడుగు. పొట్టనున్న వెల్ల భూములు అని నవ్వి–త్రిపాద ధరణిం దాస్యామి" అని దానం చేశాడు బలిరాజు. గురువు శుక్రాచార్యుని సలహాను కూడా పెడచెవిని పెట్టి. అంతే! ఆ కపట వామనుడు కాస్తా... త్రివిక్రముడైనాడు. రెండు పాదాలు భూమిని, దివిని ఆక్రమించి మూడో పాదానికి చోటడిగిన త్రివిక్రమునికి తన శిరస్సున తృతీయ పాదాన్ని ఉంచమని ప్రార్థించాడు బలి చక్రవర్తి. అతని సత్యవ్రతానికి సంతసించిన శ్రీహరి బలిని ప్రహ్లాద సమేతంగా సుతల లోకానికి పంపి ఆ లోకానికి తానే గదాపాణిగా రక్షకుడైనాడు. అలా తాను దానమడిగి సంపాదించిన త్రిభువన రాజ్యాన్ని ఇంద్రునికి అప్పగించి దేవతలకు పూర్వ వైభవాన్ని ఇచ్చాడు వామనుడు.

## భూమి నీటిపైకి ఎలా వచ్చింది?

సర్వేశ్వరుడు యోగనిద్రలో ఉన్నప్పుడు నీటిలో మునిగి, భూమి రసాతలంలో కలిసిపోయింది. విశ్వంభరోద్ధరణ చేయాలని వరాహరూపుడై హరి సంకల్పించగా, హిరణ్యాక్షుడు భూమిని తన అధీనంలోకి తీసుకోవడానికి ప్రయత్నించి యజ్ఞవరాహ మూర్తి చేతిలో మరణించాడు. భూమి అలా వరాహ రూపుని ధవళ దంతాగ్ర పటిమచే నీటిపైకి యథావిధిగా వచ్చింది. పృథు చక్రవర్తి కాలంలో గోరూపిణియై దేవ దానవ మానవాది జనులు తమ తమ ప్రతినిధులను వత్సములుగా పంపి ఎవరికి కావలసిన అమృతాది క్షీర ఔషధులను వారు పిండుకొన్నారు. పృథు చక్రవర్తిచే చదును చేయబడ్డ భూమి "పృథ్వి" యైనది.

## కలికాలంలో ధర్మం

కలికాలం వచ్చింది. ధర్మదేవత వృషభమై ఒంటికాలితో కుంటుతుండగా, భూదేవి బక్కచిక్కిన గోవుగా ఒకరి నొకరు పలుకరించుచుండగా, కలిపురుషుడు వాటిని నిర్దయుడై తన్నడాన్ని గమనించిన పరీక్షిన్మహరాజు కలిని రూపుమాప సమకట్టాడు. అందుకు భయపడిన కలి తాను ఎక్కడ ఉండాలని అడిగాడట. ప్రాణివధ, స్త్రీ, ద్యూత, పానాలనే నాలుగు స్థానాలలో... అసత్యం, మదం, కామం, హింస, వైరాలు ఉండే చోట ఉండమని ఆదేశించాడు రాజు. అందుకే ఈ కలికాలపు భూ ఆక్రమణ పర్వంలో ఈ కలి స్థానాల ప్రభావం ప్రతిరోజూ మనం అనుభవిస్తున్నాం.

**ఓం శాంతి! శాంతి! శాంతిః**

✧✧✧✧✧

# 26. ఆయుష్షు నూరేళ్లేనా?

**ఆయువు నూరు వత్సరములందు సగంబు నశించె నిద్రచే**
**నా యరలో సగంబు గతమయ్యెను బాల్య జరా ప్రసక్తి చే**
**బాయక తక్కినట్టి సగబాలు గతించు బ్రయాస వృత్తిచే**
**నాయువు చంచలంబగుడు బ్రాణుల కెట్లు సుఖంబు చేకూరున్**

నూరేళ్ల జీవితంలో సగం నిద్రకే సరిపోతుంది. మిగిలిన భాగంలో సగం బాల్య, యవ్వన చాపల్యాలకు సరిపోతుంది. మిగిలిన భాగం వృత్తికి సరిపోతుందంటూ భర్తృహరి జీవిత సత్యాన్ని ఎంత చక్కగా చెప్పారు! జీవితం నీటి బుడగని, ఆయువు అల్పమని, ధన సంపదలు చంచలమని తెలిసి కూడా మానవుడు అహంకార పూరితుడై అందరినీ అణగదొక్కాలని చూడడం చిత్రం

**'జాతస్య హిధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ**
**తస్మాత్ పరిహార్యే ర్థే న త్వం శోచితు మర్హసి'**

పుట్టినవాడు గిట్టక తప్పదు. మృతినొందిన వారికి కర్మానుసారం పునర్జన్మమూ నిశ్చితమే! ఎలాగైనా తప్పని ఈ విషయం గురించి చింతించడం ఎందుకు? అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుని అనునయిస్తాడు. జనన మరణాల మధ్య ఉండే కాస్త సమయాన్ని ఆయుర్దాయమని గ్రహించి, నిలబెట్టుకోడానికి మనిషి ఎంత తాపత్రయ పడుతున్నాడు?

## ఏ యుగంలో ఎంత ఆయుష్షు?

'ఆయుర్వర్ష శతం నృణాం పరిమితం' నరులకు నూరేళ్ల ఆయుష్షని చెప్పినా, పూర్వ గ్రంథాల్లో యుగాలను బట్టి ఆయుర్దాయం మారుతుందని చెప్పారు. కృత, త్రేతాయుగాల్లో 4000 ఏళ్లు, ద్వాపరలో 400, కలియుగంలో నూరు ఏళ్లుగా పేర్కొన్న 'చరకసంహిత' ధర్మదేవత పాదాలు తగ్గినకొద్దీ ఆయుఃప్రమాణం క్షీణిస్తుందని చెబుతున్నది.

**'యుగే యుగే ధర్మ పాదః క్రమేణాన హీయతే**
**గుణ పాదశ్చ భూతానాం ఏవం లోకః ప్రలీయతే**
**సంవత్సర శతే పూర్ణేయాతి సంవత్సరః క్షయమ్**
**దేహినామాయుషః కావే యత్ర యన్మాన మిష్యతే'**

కృతయుగ ప్రారంభంలో దేవతలతో సమానమైన వయస్సు ఉన్న మానవులు కృతయుగం మొదలయ్యాక నాలుగు వందల సంవత్సరాలకు (పురుషాస్సర్వ సిద్ధాశ్చ

చతుర్వర్ష శతాయుః కృతి–వ్యాస మహర్షి), కృతయుగాంతానికి 300, త్రేతాయుగాన 300–200, ద్వాపరాన 200–100, కలియుగంలో 100 సంవత్సరాలు... ఈ రకంగా ధర్మం నశించినకొద్దీ ఆయువు క్షీణిస్తుందని ఓ భావన.

## పూర్ణాయుర్దాయం ఎంత?

దేవతలకు ఒక దేవ సంవత్సరం 360 మానవ సంత్సరాలకు సమానం. నూరు దేవ సంవత్సరాలకు (36,000) ఏళ్లకు దేవతల అధిపతి ఇంద్రుడు కూడా పదవీ విరమణ చేస్తే కొత్త ఇంద్రుడి పరిపాలన మొదలవుతుంది. త్రేతాయుగం కడపట సీతా సాధ్వి నిష్క్రమణానంతరం శ్రీరామచంద్రుడు బ్రహ్మచర్యం పాటించి, 11 వేల ఏళ్లు ఎడతెగకుండా అగ్ని హోత్రంబులు చెల్లించి తాను ఎక్కడి నుంచి అయితే వచ్చాడో అక్కడికి వెళ్లాడని భాగవతం చెబుతున్నది. త్రేతాయుగపు రాజుల ఆయుర్దాయం వేలల్లోనే ఉన్నదని దీన్నిబట్టి మనకు అర్థమవుతున్నది. క్రీస్తుపూర్వం 1880 నాటి ఓ శిలాఫలకంపై సుమేరియన్ రాజుల వయస్సు 10,800 సంవత్సరాల నుంచి 72,000 ఏళ్ల వరకు జీవించినట్లు రాసి ఉన్నది. పాత నిబంధనలో (ఓల్డ్ టెస్టామెంట్) పాత బైబిల్ కథలలో వేలాది ఏళ్లు బతికిన వీరుల ప్రస్తావన ఉన్నది. మానవుని పూర్ణాయుర్దాయం వేయి సంవత్సరాలుగా యూదులు భావించేవారు. ఎందుకంటే అది దివ్య దినానికి 'పవిత్రమైన రోజుకు' చిహ్నం. మానవులు వృద్ధిచెందడంతో వారి కుమార్తెలను దేవుని కుమారులు వివాహం చేసుకొన్నారు. దాంతో మానవులలో గర్వం పెరగడాన్ని గమనించిన దేవుడువారి వయస్సును 120 ఏళ్లుగా నిర్ణయించినారని జెనెసిస్ – ఆది కాండంలో చెప్పారు.

ఆదిమానవుడు ఆదాం 930, సెత్ – 912, వినాష్ – 905, కానన్ 910, మహాలారెల్ 892, జారెడ్ 962, ఈనాక్ 365 (దేవునితో నడిచెను) అందరికంటె ఎక్కువ మెథుసెలాహ్ 969 సంవత్సరాలు జీవించారు.

## దేవదారు ముందు మనమెంత?

వివిధ జంతువుల ఆయుర్దాయాలు. తాబేలు–152, సొరచేప–90, ఏనుగు–70, సింహం–20, రాణిచీమ–18, ఎలుక–6, సీతాకోకచిలుక–1, మానవుడు 120 సంవత్సరాలుగా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. 5 వేల సంవత్సరాల వయస్సు ఉన్న దేవదారు వృక్షంతో పోల్చిచూసినప్పుడు మన ఆయుర్దాయం అతి తక్కువగా కనిపిస్తుంది కదా!

గ్రీకు, రోమన్ ఐతిహ్యాలలో 'పార్సే లేదా మొయిరాయి' లేదా త్రీ ఫేట్స్ ముగ్గురు ఆయుఃలక్ష్ములుగా ప్రసిద్ధికెక్కారు. క్లోతో, లాఖెసెస్, ఎట్రోపాస్. వీళ్లు జీవదారం

వడికే చరఖా దగ్గర కూర్చోని ఒకామె, నూలు వడుకుతూ జీవదారాన్ని సాగదీస్తుంటే, మరొకామె కండెకు చుడుతూ, మూడో ఆమె దారాన్ని కత్తిరిస్తూ ఉంటుంది. ఆమె ఎప్పుడు, ఎక్కడ కత్తిరిస్తే అక్కడి వరకే ఆయుర్దాయమన్నమాట. క్లోతో పుట్టుకకు, లాఖెసెస్–పెరుగుదలకు, ఎట్రోపాస్–మరణానికి అధిదేవతలు.

## దిన దిన గండం

ఎక్కడ చూసినా ఉత్పాతాలే! దుర్నిమిత్తాలే! ధర్మరాజు మనసు మనసులో లేదు. ద్వారక వెళ్లిన అర్జునుడు దూరం నుంచే విషణ్ణవదనంతో వస్తున్నాడు. గుండెలు బిగబట్టి ధర్మజుడు తమ్ముడిని కారణమడగ్గా ఉబికి వస్తున్న కన్నీటిని చేతితో తుడిచికొనుచు

**'మన సారధి మన సచివుడు**
**మన వియ్యము మన సఖుండు మన బాంధవుడున్**
**మన విభుడు గురుడు దేవర**
**మనలను విడనాడి చనియె మనుజాధీశా'**

అని గద్గద స్వరంతో అర్జునుడు చెప్పాడు. జ్యోతిషశాస్త్రం ప్రకారం క్రీస్తుపూర్వం 3228లో జన్మించిన శ్రీకృష్ణుడు 3102లో నిర్యాణం చెందగా ఆరోజే కలియుగం ప్రారంభమైనది. శ్రీకృష్ణ పరమాత్మ 125 సంవత్సరాల 7 నెలలు జీవించారని పండితుల అభిప్రాయం. కలియుగంలో ఆయుష్షు దిన దిన గండం నూరేళ్ళాయుష్షులాగా వర్ధిల్లుచున్నది. భయం నీడలో జీవనం కదా!

✧✧✧✧✧

# 27. అనాది విశ్వాసం - పరలోక యాత్ర

ప్రపంచంలోని ప్రతి తెగలోనూ మరణానంతరం ఆత్మ పరలోక ప్రయాణం చేస్తుందని నమ్మకం ఉన్నది. ఆ యాత్రకు కావల్సిన సంబారాలు సమకూర్చి, దేహాన్ని సమాధి చేసేవారు. రాతియుగ కాలం నాటి సమాధుల్లోనూ మరణించిన వారికి ఇష్టమైన ఆహారం, పనిముట్లు ఉంచిన ఆధారాలు లభ్యమవుతున్నాయి. తర్వాతి కాలాల్లో ఆయుధాలు, వాహనాలు, సేవకులు, రాణులతో సహా యావన్మందీ మరణించిన రాజుతో పాటు సజీవ సమాధి అయ్యేవారు.

**"కనియెం గోమల నీల మేఘ విలసత్ కాలాంజనా కారు హో**
**ర నిశాత ఉత్కట దంష్ట్రను జ్వల చల ద్రక్తా క్షు బ్రత్యగ్ర కాం**
**చన వర్ణాంబరు నంత్య కాల దహన జ్వాలా ప్రచండున్ జగ**
**జ్జన సంత్రాసకు నొక్క దివ్య బటు పాశ ప్రౌఢ హస్తోద్ధతున్"**

ఎవరికీ చూడ శక్యం కాని మృత్యువు సావిత్రికి కనిపించాడు. సత్యవంతుని జీవాత్మను తన పాశంతో బంధించి దక్షిణ మార్గంలో యమపురికి పోతున్నాడు. యముని మెప్పించి, తన భర్త ప్రాణాలు దక్కించుకొన్నది మహా ఇల్లాలు సావిత్రి. (శ్రీమదాంధ్ర మహాభారతం - అరణ్య సప్తమాశ్వాసం)

## సత్యాల గది

సూర్యాస్తమయం తరువాత అమున్-రె (రవి-సూర్యుడు) ప్రయాణించే దారి వెంటే, ఆత్మ కూడా 12 చీకటి గుహల ద్వారా ప్రయాణిస్తుందని ఈజిప్టు ప్రజల విశ్వాసం. ప్రతి గుహను భయంకరమైన భూతాలు కాపలా కాస్తుంటాయి. శవంతో పాటు భద్రపరచిన మృత్యు పుస్తకంలోని మంత్రాలను ఆత్మ పఠిస్తే భూతాలు తప్పుకొని దారి ఇస్తాయి. 12 గుహలు, 6 ద్వారాలను దాటుకొని ఆత్మ 'రెండు సత్యాల గది'లోకి వెళుతుంది. అక్కడ ఒసిరస్ మృత్యుదేవత ఐసిస్, నెఫ్థిస్‌లతో కొలువుదీరి ఉంటాడు. 42 మంది న్యాయాధికారులు 42 పాపాలను వరుసగా అడుగుతుంటే ఆత్మ వాటిని చేశాడో లేదో సమాధానం చెప్పాలి. నిర్దోషి అని నిరూపించుకొన్న జీవుని హృదయాన్ని న్యాయదేవత 'మాత్' పక్షి ఈకతో అనూబిస్ (మమ్మిఫికేషన్-దేవుడు), తోత్ (చిత్రగుప్తుడు) దేవుళ్ల సమక్షంలో ధర్మకాంటాలో తూస్తారు. ఆత్మ నిజం చెబితే మృతుని ఆత్మ దేవలోకంలోని 'యారు క్షేత్రాలలో' హాయిగా విహరిస్తుంది. అబద్ధం చెప్పినట్టు రుజువయితే 'అమ్మిత్' అనే రాక్షసికి ఆహారం అవుతుంది.

## మంత్ర దర్పణం

చైనీయులకు ఆత్మ పరలోకం వెళ్లేప్పుడు భూతాలతో తరమబడి, వాటి నుంచి తప్పించుకోవాలి. పాపులు భూతాలకు చిక్కి ఆహారమవుతారు. పుణ్యాత్ములు వారి వారి పుణ్యాల్ని బట్టి నిజాన్ని పసిగట్టే కుక్కలను దాటుకొని న్యాయ స్థానపు గది దగ్గర మంత్ర దర్పణంలో తమ పునర్జన్మ గురించి తెలుసుకోవచ్చును. ఆ తరువాత ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే పాత జన్మ అంతా కళ్లముందు కనిపిస్తుంది. ముందుకు సాగితే భయంకరమైన లోయపై ఉన్న ఇరుకైన వంతెన మీదుగా ప్రయాణించి ధర్మచక్రాన్ని చేరితే, ఆత్మ అక్కడ న్యాయ చరఖాపై కొత్త జీవ దారంగా పేనబడి పునర్జన్మ ఎత్తుతుంది. పునర్జన్మ ఎత్తేముందు ఆత్మ మరపు జలాల్ని తాగి పాత జన్మ వాసనలను మరిచిపోతుందిట.

## కదిలే పర్వతాలు

బొలీవియాలోని 'గ్వారాయు' తెగ వాళ్ల ఆత్మకు రెండు అవకాశాలుంటాయి. అద్భుతంగా, విశాలంగా కనిపించే దారి. ఇరుకైన ముళ్ల దారి. సరైన దారి ముళ్ల దారిగా కనిపించేదే. ఆశ గలవారు, పాపులు మొదటి దారిలో పోయి అక్కడ నానా రకాల శిక్షలు అనుభవిస్తారు. దారిలో రాకాసి చేపలున్న కాలువను ఈదుకుంటూ దాటాలి. చీకటి అరణ్యాల్ని, కదిలే పర్వతాల్నుంచి, మాట్లాడే వృక్షం మాయల నుంచి, భూతాల నుంచి బయట పడితే అప్పుడు పితృలోకాన్ని ఆత్మ చేరుకుంటుంది. అక్కడ యవ్వన సరస్సులో ఈదులాడితే మళ్లీ కొత్త జీవితం అనుభవించే అవకాశం దొరుకుతుంది. నార్స్ ప్రజలు (వైకింగులు) యుద్ధంలో మరణించిన వీరులు 'వాలహల్లా' స్వర్గానికి చేరుకొని 'ఒడిన్' దేవత సమక్షంలో 'వాల్కిరీ' అనే అప్సరసలు స్వాగతించగా విందు వినోదాల్లో తేలియాడతారని, పిరికివాళ్లు, సోమరులు మరణించేప్పుడు సుఖంగా మరణించినా, తరువాత వాళ్ల ఆత్మ మంచుకొండల్లో నానా పాట్లు పడుతుంది. కాబట్టి సమాధుల్లో చలికి తట్టుకొనేందుకు గట్టి పాదరక్షలను ఉంచేవారు. మంచుకొండల్ని చచ్చీ చెడి దాటిన తరువాత మృత్యులోకం సరిహద్దులోని 'గియాల్లార్' వంతెన దగ్గర (గ్జాల్ ఏటిపై కట్టబడింది) మాడ్గాడ్ అస్థిపంజరం కాపలా వాడికి జీవ రక్తాన్ని భత్యం కింద సమర్పించుకొని వంతెన దాటి లోహపు అరణ్యాల ద్వారా నరకలోక ద్వారం చేరుకొంటుంది. అక్కడ భయంకరమైన 'గార్మ్' కుక్క అరుస్తూ ఉంటే దాన్ని శాంతింపచేయడానికి కేకు ముక్క పడేసి నరక లోకంలోకి ప్రవేశిస్తుందట.

## ధర్మ దేవతలు

గ్రీకుల నరక లోకాధిపతి హేడ్స్. పాప పుణ్యాలను బేరీజు వేసే ధర్మదేవత. ఆత్మ ఐదు నదులు ఎఖెరాన్ – బాధల నది, స్టిక్స్ – అయిష్టం, లెథె – మతిమరపు,

కాసిటస్ – రోదనల నది, ప్యూరి ప్లెగెతాన్–మంటల నది. వీటిని దాటి 'కారాన్' (Charon) అనే పడవ సరంగుకు దారి భత్యం చెల్లించి మూడు తలల సెరెబెర్స్ కుక్క భయంకరమైన అరుపులను శాంతపరచి నరకలోకంలో న్యాయాధిపతి ముందు మోకరిల్లుతుంది.

జోరాష్ట్రియన్లకు మిత్రా, స్యారోష, రష్ణులు న్యాయ దేవతలు. గ్రీకులకు మరో ముగ్గురు మినాస్, రాడమాంథస్, ఏకస్‌లు తీర్పు ఇచ్చే దేవతలు. జపనీయులకు 'ఎమ్మావో' యమధర్మరాజు. గ్రీకులకు 'ఎలెషియన్ క్షేత్రాలు', ఈజిప్షియన్ యారు క్షేత్రాలు, హిందువులకు అమరలోకపు వనాలు పుణ్యాత్ములు విహరించేవి. పాపాత్ములకు టార్టారస్ లాంటి నరక లోకంలో శిక్షలు తప్పవు... లంచంబు గొని, సాక్షి వంచించి, యనృతంబు పలికెడి పాపాత్ములకు, కామ మోహితులకు, దొంగలకు, ద్రోహులకు... సమస్త పాపాలకు శిక్షలుగా రకరకాల నరకాలు ఉన్నాయని భాగవతం పంచమ స్కంధం వివరంగా చెబుతున్నది.

✧✧✧✧✧

# 28. జగత్పాలకా నమో... నమః

దేవుడు ఉన్నాడా లేడా అనే మీమాంస వేల సంవత్సరాలుగా మనసుల్ని తొలిచేస్తూనే ఉంది. సకల చరాచర జగత్తును సృష్టించి, సక్రమ మార్గంలో నడిపించే ఓ అతీత శక్తి ఉందనేది అధికుల భావన. వేదాల నుంచి ఆధునిక తత్త్వవేత్తల వరకు ఆ పరమాత్మకు తమకు తోచిన రూపాన్ని ఇస్తూనే ఉన్నారు. ఆ అంతర్యామి గురించి వివిధ దేశాల తత్త్వవేత్తలు ఎటువంటి ఆలోచనలు చేశారు? ఎలాంటి సత్యాన్ని తెలుసుకోగలిగారనే విశేషాల సారం.

**కలడందురు దీనులయెడ**
**కలడందురు పరమ యోగి గణముల పాలన్**
**కలడందురు అన్ని దిశలను**
**కలడు కలండనెడివాడు గలడో లేడో?**

అఖిల రూపములు తన రూపమైనవాడు. ఆది మధ్యాంతములు లేనివాడు, స్త్రీనపుంసక పురుషమూర్తే కాదు... తిర్యక్ అమర నరాది మూర్తి ఆయన. అంతేకాదు కర్మ, గుణ, భేద, సదా సత్ప్రకాశి ఆ పరమాత్మ. గతమంతా ఆయనే. నిఖిల జీవుల హృదయారవిందమే నివాసంగా చేసుకున్న ఆ నారాయణుడు అసలున్నాడో? లేడో? మొసలి పట్టుకు ప్రాణాలు కడపట్టిన గజేంద్రునికి కలిగిన సందేహమే జీవన సంద్రంలో కష్టాల మొసలి పట్టుకున్నప్పుడు ప్రతివారికీ కలగడం సహజమే. కష్టసుఖాల కావడి కుండలున్న ఈ జీవితం నిజమా? ఈ కష్టాల జీవనమేమిటి? శాశ్వత సుఖాన్నిచ్చే మృత్యువును తలిస్తేనే భయం కలుగుతుందెందుకు?

**"యావాన్ సంవత్సరస్త మే తావతః కాలస్య పరాస్త దసృజతః**
**తంజాత మభివ్యాద దాత్ సభాణ కరోత్సైవ వాగభవత్"**

– బృహదారణ్యకోపనిషత్ 3-2

హిరణ్యగర్భుడు వేదవాక్కును మిథునంగా భావించినప్పుడు, జ్ఞాన రూపంలో ఉన్న రేతస్సు కలిగెను. ఆ రేతస్సు నీటిలో అండరూపం ధరించి, సంవత్సరాత్మక ప్రజాపతి అయ్యాడు. సంవత్సరం తరువాత తేజోరూపంలో అండాన్ని ఛేదించగా పుట్టిన పుత్రుడిని భక్షించేందుకు తానే నోరు తెరిచాడు. ఆ పుత్రుడు భయముతో 'భాణ' అని శబ్దం చేశాడు. అదే 'వాక్కు'గా పరిణమించింది. పరమాత్మ సమస్త జీవజాలాన్నీ సృజించి, దానినంతా తినాలనే తలంపు కలిగింది. ఫలితంగా పరమాత్మకు అదితిత్వము కలిగింది.

వాక్కు, దేహావయవములకు సారభూతమై, అంగిరసముగా పిలిచే ప్రాణంతో కలిసి ఉద్గీథం అవుతున్నది. ఈ జ్ఞానం మృత్యువును దూరంగా ఉంచగలదు. ఈ ఆలోచన 'పవమాన' మంత్రములుగా రూపుదాల్చాయి.

## దేవుడు ఎవరు?

"అసత్తు నుంచి సత్తుకు, చీకటి నుంచి వెలుగులోనికి, మృత్యువు నుంచి అమరత్వానికి నన్ను చేర్చుమన్నది ఆ మంత్రాల అర్థం. ఆవలిగట్టుకు చేర్చేవాడెవడు? దేవుడా? ఆ దివ్యశక్తి కలిగిన పరమాత్మ ఏడీ? కనిపించడే? ఎవరు ఆ భగవానుడు? ఈ ప్రపంచాన్ని సృష్టించినవాడు. సర్వవ్యాపకుడు. ఆది మధ్యాంతరహితుడు, అంతిమ న్యాయమూర్తి, సర్వజీవ రక్షకుడు, తాను సృష్టికర్తయైనా సృష్టిమాలిన్యం అంటనివాడు దేవుడని ప్రాచీన యూదుల క్రైస్తవ, ఇతర మతగ్రంథాలు వర్ణిస్తున్నాయి.

## అంతిమ ఆశ్రయం దైవం

మానవుడి ఆఖరి శరణాగతి, అంతిమ ఆశ్రయం 'అల్టిమేట్ కన్‌సరన్'... దేవుడు అంటాడు పాల్ టర్లిచ్ అనే వేదాంతి. దేవుణ్ణి దైవ భావంతోనే తిరస్కరించగలం' అంటాడతడు. హోమర్ (క్రీ.పూ. 800) కాలం నాటికి ఉన్న దేవతల సమూహాన్ని సోక్రటీస్, థేల్స్ లాంటి వేదాంతులు తిరస్కరించారు. క్జినోఫేన్స్ అభిప్రాయం ఏమిటంటే "చిల్లర దేవుళ్లందరూ కవుల కల్పనలు. అసలు దేవుడు రూపంలోనూ, ఆలోచనలలోనూ మానవులకు, చిన్న దేవుళ్లకు విభిన్నంగా ఉంటాడు. అతడు ఎక్కడికో కదలడు. ఉన్నచోటే ఉంటాడు. అంతేగాని ఇక్కడ అదృశ్యమై అక్కడ ప్రత్యక్షం కాడు". ప్రాచీన గ్రీకుల దేవుళ్ల పోకడలు అనూహ్యమైనవి వాళ్లు మానవులకు సుఖదుఃఖాల్ని, కష్టసుఖాల్ని పంపుతారు అని నమ్మేవారు. ప్లాటో – "దేవుళ్లు మానవుల క్షేమాన్ని వాంఛిస్తారు... ఎందుకంటే వాళ్లు మంచివాళ్లు కనుక" అని నమ్మినవాడు.

## ఆలోచించే ఆలోచన

అరిస్టాటిల్ – "దైవమనేది చలించనిది. ఆలోచించే ఆలోచన" అని అభిప్రాయ పడినాడు. 'స్టాయిక్స్' అని పిలువబడ్డ వేదాంతులు దేవుణ్ణి ఒక పదార్థంగా భావించారు. అమృతతత్వమున్నది, మంచి స్వభావమున్నది అదే దైవం అన్నారు వారు. ఈ సృష్టిలో ఒక నిర్మాణశైలి, సమతుల్యత ఉన్నాయి. దానికి కారణం దైవం అనేది వీరి భావన. 'దేనికన్నా మరే ఉన్నతమైన దానిని ఊహించజాలమో అదే దైవం' అనేది ఏన్‌సెల్మ్ అనే వేదాంతి అభిప్రాయం. దేవుడున్నాడు అన్న ఆలోచన నాలో వచ్చిందంటే దేవుడున్నట్లే కదా అంటాడు డెకార్టె. 'దేవుడున్నాడా? లేడా? ఎలా చెప్పగలం. ఇక్కడ తర్కం పనిచేయదు' అంటాడు పాస్కల్.

## అత్యున్నత మంచితనం

అత్యున్నతమైన మంచితనమే దైవం. అందుచేత సమాజం మంచిదారిలో నడవాలంటే దేవుడున్నాడనడమే సరైనది అంటాడు కాంట్. 'మతసారాంశం – ఆలోచనా, నడతలు కాదు అది ఒక ఊహ, స్పర్శ అంటాడు ష్లీర్ మాకర్. మతం అనేది అణగదొక్కబడ్డ ప్రజల ఆవేదనా రూపం. హృదయరహిత ప్రపంచంలో హృదయం. ఆత్మశూన్య జీవితంలో ఆత్మ. అది ఒక మత్తుమందు అన్నాడు కారల్‌మార్స్. మానవుడే మతాన్ని, దేవుణ్ణి సృష్టించాడు. ఈ సామాజిక దుర్భర పరిస్థితులకు ఉపశమనంగా మతం పుట్టింది. అని పేర్కొన్నాడు.

"దేవుడు మరణించాడు (గాడ్ ఈజ్ డెడ్) అన్నాడు నిషే. "మానవులకు ఇన్ని కష్టాలు తెచ్చిన పాతదేవుడు మరణించాడు మనం ఆశతో, కృతజ్ఞతతో, ఉద్విగ్నంగా కొత్త తీరం వైపు ప్రయత్నం చేద్దాం" అన్నాడతడు. "దేవుడు ఒక భ్రమ" అన్నాడు ఫ్రాయిడ్.

## సర్వం నీవే...

ఫ్రాయిడ్, మార్క్స్, నిషేలు ముగ్గురూ మానవత్వమే గొప్పదని భావించినారు. అయినా మానవుని తొలి దర్శనమైన మతభావన ఇంకా పోలేదు. మరిన్ని సందిగ్ధాలతో, కొత్త రుజువులతో దేవుడున్నాడా? లేదా? అన్న సత్యాన్వేషణలో ముందుకు సాగుతూనే ఉన్నది.

**"త్వగ్ం స్త్రీత్వం. పుమానసిత్వం కుమార ఉతవా కుమారీ!**
**త్వం జీర్ణో దండేన వంచసి, త్వం జాతో భవసి సర్వతోముఖః"**

–శ్వేతాశ్వతర ఉపనిషత్తు (4–3–4).

ఓ పరమేశ్వరా! నీవు స్త్రీవి, పురుషుడవు, బాలుడవు, పుత్రికవు. నీవే ముసలి వాడివయి చేతికర్ర సాయంతో నడుస్తున్నావు. అనేక రూపాలతో కనిపిస్తున్నావు. సర్వవ్యాపకుడవై ఆద్యంత శూన్యుడవై యున్నావు. కాల స్వరూపుడవు లోక రక్షకుడవు. జగత్పరిపాలకుడవు. సమస్త ప్రాణులందు నిగూఢంగా ఉన్నవాడివి నీవే!" అని పరమేశ్వరతత్త్వ వర్ణన ఉంది. దైవభావన ఇచ్చే ఓదార్పు, ఉపశమనం కోసం మానవ సమూహం ఎప్పుడూ పరితపించి పోతూనే ఉన్నది.

✧✧✧✧✧

# 29. సంభవామి

ధర్మం దారి తప్పుతున్నప్పుడు భగవంతుడు అవతరిస్తాడని మన విశ్వాసం. అంతర్యామి దశావతరాలు ఎత్తారని కొందరు ప్రవచిస్తే భాగవతంలో 21 అవతారాల ప్రస్తావన ఉంది. అవతారాలు ఎన్నయినా, ఎన్ని రూపాల్లో, ఎన్ని వర్ణాల్లో అవతరించినా ధర్మసంస్థాపనే పరమార్థం. ఆర్తత్రాణ పరాయణత్వమే లక్ష్యం. అవతారాల అద్భుత విశేషాలు:

భారతీయ భావస్రోతస్వినిలో వేదజ్ఞాన విచారం, ఉపనిషత్ భావావలోకనం, పురాణ పఠన జ్ఞానం కలసి అంతర్లీనంగా ప్రవహిస్తూ భారతీయులను ఈ నాటికీ నడిపిస్తున్నాయి. ఏ ప్రాచీన అర్వాచీన భావ సంపదల్లోనూ లేనటువంటి ప్రత్యేక భావవీచిక 'అవతార ప్రసక్తి' మన సంప్రదాయం.

## దేవుడు అవతరిస్తాడు

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకై భగవానుడు అనేక అవతారాలను ఎత్తుతాడని ప్రతీతి.

**రాజా రాక్షస రూపేణ, వ్యాఘ్ర రూపేణ మంత్రిణః**
**సేవకా శ్వాన రూపేణ, యథారాజా తథాప్రజా**

ప్రజారక్షకులు ప్రజాభక్షకులై, అరాచకం అల్లకల్లోల పరిస్థితులు పెరిగి, స్త్రీలకు, బలహీనులకు గౌరవ మర్యాదలు, రక్షణ కరువై, అధర్మం విజృంభించి, దేవుడనే వాడున్నాడా?, ఆ కలడు కలండనే వాడు కలడో లేడో... అన్న సంశయం దైవ భక్తులకు కూడా కలిగేంతటి సంక్షోభ పరిస్థితి ఏర్పడినప్పుడు...

**-'ప్రకృతి క్షోభ మహదా ద్యుత్పాదనమ్**
**దుష్ట విమర్దనేన దేవాదీనాం సుఖ వివర్ధనమ్**
**సముత్కంఠితానాం, సాధకానాం**
**ప్రేమానంద విస్తారణం'-**

భగవంతుడు అవతరిస్తాడని మన నమ్మకం.

**'యదా యదాహి దర్మస్య గ్లా నిర్భవతి భారత**
**అభ్యుత్థాన మ ధర్మస్య తదాత్మానాం సృజామ్యహమ్'-**

అని భగవానుడు గీతలో పేర్కొన్నాడు.

## అవతారం... విభిన్నం

దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా, ఆ కాలపు మానవ సంస్కృతీ, ఆలోచనలను అనుసరించి ఆ అవతారం, ప్రయోజనం, కార్యకలాపాలు, సందేశం, ఉపదేశం, విభిన్నంగా ఉంటాయి. భగవంతుని అవతారాలు అనంతంగా పెద్దలు అభివర్ణిస్తారు. దశావతారాలు జగత్ ప్రసిద్ధమైనవి. జయదేవుడు గీత గోవిందంలో దశావతారాల్ని అద్భుతంగా వర్ణించాడు.

పరమాత్మయే జీవంగా, ఓంకారం అంకురంగా, 12 స్కందాలతో (12 పెద్ద కొమ్మలతో), 335 అధ్యాయాలనే శాఖలతో, 18 వేల శ్లోకాలనే రెమ్మలతో, 5 లక్షల 76 వేల అక్షరాలనే ఆకులతో కల్పవృక్షంలా విరాజిల్లే భాగవతంలో 'ఏకోనవింశతి' అవతారాలుగా పేర్కొన్నారు. అవి చతుస్సన (సనక, సనందన, సనాతన, సనత్కుమారులు), వరాహ, నారద, నరనారాయణ, కపిల, దత్తాత్రేయ, యజ్ఞ, ఋషభ, పృథు, మత్స్య, కూర్మ, ధన్వంతరి, నృసింహ, వామన, పరశురామ, వ్యాస, రామ, కృష్ణ, బుద్ధ, కల్కి.

## పంచప్రాకార స్వరూపం

అవతారాలు మహాసరస్సులో అలల్లాగ అసంఖ్యాకం అంటుంది శ్రీమద్భాగవతం. పరాత్పరుడైన పరమేశ్వరుడు కరుణామయుడై పరత్వవ్యూహ, విభవ, అంతర్యామిత్వ, అర్చావతార భేదాలతో పంచ ప్రాకార స్వరూపాలు ధరిస్తాడు. ఈయన కార్య సౌకర్యార్థం– సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, రూపాల్ని ధరించడాన్ని ('వ్యూహం' అంటారు.

జీవత్వాన్ని అధిష్ఠించి సంకర్షణుడు జ్ఞానం, బలం అనే గుణాల్ని కలిగి వుండి, శాస్త్ర ప్రవర్తనం దేహసంహారం చేస్తాడు. మనస్తత్త్వాన్ని అధిష్ఠించిన ప్రద్యుమ్నుడు ఐశ్వర్యం, వీర్యం అనే గుణాలతో ధర్మోపదేశం, వర్గ సృష్టి చేస్తాడు. శక్తి, తేజస్సులతో అనిరుద్ధుడు జగద్రక్షణ, కాలసృష్టి, తత్త్వజ్ఞాన ప్రదానం చేస్తూ నానా విధములైన అవతారాలకు కారణం అవుతున్నాడు. అవతారాలను కొందరు పండితులు మూడు భాగాలుగా విభజించారు. అవి పురుషావతారాలు, గుణావతారాలు, లీలావతారాలు.

## పురుషావతారం

పురుషావతారంలో భగవానుడు సృష్టికార్య నిర్వహణ కోసం మహత్తును సంకర్షణ రూపంలో బ్రహ్మాండ సంస్థితుడై ప్రద్యుమ్నుడిగా, సర్వ భూతాల నుంచి అనిరుద్ధుడిగా ప్రకాశిస్తాడు.

## గుణావతారం

గుణావతారాలు మూడు బ్రహ్మ (సత్వ), విష్ణు (రజా), శివుడు (తమో) గుణరూపులై సృష్టి, స్థితి, లయ కారకులౌతారు.

## లీలావతారాలు

ఏకోనవింశతి అవతారాలు వివిధ కల్పాలలో అవతరిస్తాయి కనుక కల్పావతారాలని ప్రశస్తి.

నాలుగు యుగాలకు, నాలుగు యుగావతారాలు. ఒక్కో యుగంలో అవతరించే అవతార పురుషుని రంగు ఒక్కో రకంగా ఉంటుంది.

## ఒక్కో అవతారంలో ఒక్కో వర్ణం

శ్రీమత్ భాగవతంలో గర్గుడు నందునికి బలరామ కృష్ణుల్ని గురించి వర్ణిస్తూ సత్యయుగంలో శుక్లవర్ణం, త్రేతాయుగంలో రక్తవర్ణం, ద్వాపరయుగంలో పీతవర్ణం, కలియుగంలో కృష్ణవర్ణం భగవానుని యుగావతార వర్ణములుగా పేర్కొన్నాడు. ప్రతి అవతారానికి ఆవేశ, ప్రభవ, వైభవ, పరత్వ అనే అవస్థలున్నాయి. ఆవేశ అవస్థలో భగవానుడు ఏ జీవిలోనైనా ప్రవేశించి వాటిని ఉన్నత జీవులుగా మారుస్తాడు. నారదుడు, పృథువు, సనకసనందాదులు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ప్రభవావస్థలో అవతార ప్రయోజనం తీరగానే అదృశ్యమయ్యే మోహిని, శుక్ల, హంస అవతారాలు. ధన్వంతరి, ఋషభ, వ్యాస, కపిలురు బహుళ ప్రశస్తి పొందిన మహాపురుషులు.

**విభవావతారాలు :** కూర్మ, మత్స్య, నరనారాయణ, వరాహ, హయగ్రీవ, యజ్ఞ బలరాములు.

**పరత్వావతారాలు...** సంపూర్ణావతారాలు. దీపాల నుంచి దీపాలు వెలిగించి నట్లు, భగవత్తేజం నుంచి అవి శక్తిని గ్రహిస్తాయి. నృసింహ, రామ, కృష్ణావతారాలు... పరత్వావతారాలు. కృష్ణావతారాన్ని పూర్ణావతారంగా పండితులు విశ్వసిస్తారు.

## షోడశ కళాధరుడు

జగత్ సృష్టి కోసం భగవానుడు 16 కళల్ని ధరిస్తాడు. ఇవి ఆయన షోడశ శక్తులు.

**శ్రీ, భూ, కీర్తి, ఇలా, లీలా, కాంతి, విద్యా, విమలా, ఉత్కర్షిణి, జ్ఞానా, క్రియా, యోగా, ప్రహ్వీ, సత్యా, ఈశానా, అనుగ్రహా** అనేవి 16 కళలు.

భగవంతుని లీలలకు ఆయన శక్తులే ఆధారాలు. అవి అంతరంగ శక్తి, బహిరంగ శక్తి, తటస్థ శక్తి... ఈ మూడు శక్తులు కలిసి పరాశక్తి అవుతున్నది. ఏ రూపంలో నున్నా ఎలా పూజించినా పలికే, ఆదరించే శక్తి భగవానుడు. మనలో అన్ని శక్తులూ నశించి మకరికి చిక్కిన కరిలా వాపోతూ...

**అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ**
**తస్మాత్ కారుణ్య భవేన, రక్ష రక్ష భగవాన్**

అని గొంతెత్తి వేడుకున్నపుడు...

**పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతామ్**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే**

ఆ భగవానుడు మరల మరల అవతరిస్తాడు. మనల్ని తరింపజేస్తాడు.

✧✧✧✧✧

# 30. ధరిత్రి... వేదాల సంరక్షణ పర్వం "మత్స్యావతారం"

దుష్టశిక్షణ ధర్మసంరక్షణ కోసం సంభవామి యుగే... యుగే... అని గీతాచార్యుడు స్వయంగా చెప్పాడు. అందుకోసం ఆ దేవదేవుడు పది అవతారాలు ఎత్తాడు. ఈ దశావతారాల గాథలు కమనీయం... కడురమ్యం. ఒక్కొక్క అవతారం... ఒక్కో జీవిత పరమార్థాన్ని సూచిస్తుంది. పుడమిని, విజ్ఞాన భాండాగారాలైన వేద సంపదను కాపాడి విశ్వకళ్యాణానికి దోహదం చేసిన మత్స్యపురాణ గాథ.

**ప్రళయ పయోధి జలే ధృత వానసి వేదమ్**
**విహిత వహిత్ర చరిత్ర మఖేదమ్**
**కేశవ ధృత మీన శరీర జయ జగదీశ హరే**

కల్పాంతమున నైమిత్తిక ప్రళయం సంభవించి సమస్త లోకాలు నీటిలో మునిగిపోతున్నప్పుడు ఆ దేవదేవుడు మీనావతారం దాల్చి, జ్ఞానభాండాగారాలైన వేదాలను, ద్రవిడ దేశపు రాజు సత్యవ్రతుని జల ప్రళయము నుంచి ఆ భగవంతుడు కాపాడాడంటూ జయదేవ మహాకవి మీనావతార వైభవాన్ని అద్భుతంగా వివరించాడు.

## నైమిత్తిక ప్రళయం

కృతమాలిక అనే ఏటి ఒడ్డున సత్యవ్రత మహారాజు జల తర్పణము చేస్తున్నపుడు అతని దోసిలిలోని నీటిలో చేపపిల్ల కనిపించింది. మహారాజు దయతో ఆ చేపపిల్లను నీటిలో విడిచాడు. ఆ చిరు చేప పలికిన పలుకులను విని రాజు దానిని తన కమండలంలో ఉంచుకొని ఇంటికి తీసుకుపోయాడు. ఆ చిన్న చేప కమండలము పరిమాణానికి పెరిగిన తర్వాత దానిని మరింత పెద్ద పాత్రలో ఉంచాడు. దాని నుంచి నీటి మడుగుకు అక్కడ నుంచి మహాసరస్సుకు, మహార్ణవమునకు మార్చుతూ పోయాడు. అలా ఒకరోజులో ఆ చేప శతయోజన ప్రమాణానికి విస్తరించింది. ఆ మహాత్మ్యము చూసి రాజు ఆశ్చర్యచకితుడై ఆ చేపను నారాయణ అవతారముగా గ్రహించి మొక్కాడు. భక్త సులభుడైన హరి రాజుతో ఇలా అన్నారు... "ఇక మీదట ఈ రాత్రికి 7వ దినము నాడు బ్రహ్మకు పగటి కాలం పూర్తవుతున్నది. ఆ నైమిత్తిక ప్రళయంలో భూర్భువాది లోకాలన్నీ మునిగిపోతాయి. నేను నీ కొరకు ఓ పెద్ద నావను పంపెదను. అందులో సమస్త ఔషధులు, బీజ రాశులు ఉంచి సప్తర్షులతో కలిసి ఆ నావలో ప్రవేశించు" అని ఆదేశించాడు.

**ఉల్లసిత మేఘ పంక్తులు**
**జల్లించి మహోగ్రవృష్టి జడిగొని కురియన్**
**వెల్లి విరిసి జలరాశులు**
**సెల్లెలి కట్టలను దాటి సీమల ముంచెన్**

– పోతన భాగవతం 8–709

జగన్నిర్మాణం చేసి, అలసి సొలసిన బ్రహ్మదేవునికి నిదుర రాగా... నెరినెల్లప్పుడు నిల్చి, ప్రాణులను నిర్మించి, నిర్మించి, వీపు విరుసుకుంటూ, నీల్గుతూ ఆవులిస్తూ, బ్రహ్మ సృష్టి చేయడం మాని శరీరాన్ని ఓ పక్కకు ఒరిగించి, కనురెప్ప మూసి, తల కింద దిండుగా చేయి పెట్టుకుని, కలలు కనుచూ, గురక పెడుతూ నిదురిస్తున్నాడట. (పోతన భాగవతం 8–713)

## మీన రూపంలో నారాయణుడు

అలసి సొలసి నిదురిస్తున్న ఆ పరమేష్ఠి నాలుగు ముఖములందున్న మొదలి శ్రుతులను హయగ్రీవుడనే రాక్షసుడు అపహరించి ఆ మున్నీటిలో మునిగాడు. జ్ఞానము నీటిపాలైంది. అంతా పెంజీకటి. దానిని గమనించిన విశ్వంభరుడు మహామత్స్య రూపం ధరించి, ఆ విస్తార జలధిని అన్వేషించసాగాడు. సత్యవ్రతుడు సప్తరుషులతో కలిసి నావలో ఉన్నాడు. శతయోజన విస్తార మీనరూపుడై ఆ నారాయణుడు తన కొమ్మునకు మహాసర్పరూప తాటితో నావను కట్టి, విహరిస్తూ "కన్నులు గల్గువాడు మరి కానని వానికి దారిచూపినట్లు" సాంఖ్యయోగ క్రియాసహిత మగు పురాణ సంహితను రాజునకు ఉపదేశించారు. ఆ పుణ్యఫలమున సత్యవ్రతుడు వివస్వతుడైన సూర్యునికి శ్రద్ధాదేవునిగా (వైవస్వతుడు) జన్మించి, ఏడవ మనువుగా ప్రసిద్ధికెక్కాడు. ఆ విధంగా ఆ పెనురేయి ముగిసేవరకు, జలచరాకారుడగు నారాయణుడు ఆ జల సంద్రమున సంచరించి, హయగ్రీవుని వెదకి పట్టి, సంహరించి, తెల్లవారి నిదురలేచిన సృష్టి సంధాత బ్రహ్మకు వేద కోటి నిచ్చాడు.

## విశ్వ వ్యాప్త గాథ

ఈ జల ప్రళయ వృత్తాంతము కొద్ది మార్పులు చేర్పులతో ప్రపంచములోని అన్ని పాత కథలలో ప్రాచుర్యంగా వుంది. అస్సురోబాబిలోనియన్ల కథలో ఉత్నాపిష్టమ్, హీబ్రాయిక్ గాథల్లో నోవా, గ్రీకు పురాణాల్లో ప్రొమెథియస్ మన మనువు సత్యవ్రతుడిలా భగవానుడి కృప వలన బతికి బయటపడినవాళ్ళే. ఈ కథలు బహుళ ప్రచారంలో ఉన్న ప్రాంతం బాబిలోనియా టైగ్రిస్, యూఫరేటస్ నదుల మధ్య అనూహ్య వరదల తాకిడికి గురయ్యే ప్రదేశం కావడం గమనార్హం. జపనీయుల బౌద్ధమత గాథల్లోని కన్నాన్ (చైనీయుల గ్వన్నీన్, బౌద్ధుల అవలోకితేశ్వర) బోధిసత్వుడు (బోసాట్సు).

ఇతడు చిన్న పిల్లల, స్త్రీల సంరక్షక దేవత. సహస్ర బాహువు. మహా మత్స్యంపై నిలబడి, పద్మధరుడై ప్రయాణిస్తూ ఉంటాడు.

## న్యూజిలాండ్‌లో మత్స్యదీవి

న్యూజిలాండ్ దగ్గరలోని అతి చిన్న దీవుల సముదాయాన్ని ఓసియానియా అంటారు. మెలనేసియా, మైక్రోనేసియా, పాలినేసియాగా పిలవబడే ఈ చిన్నచిన్న దీవులలోని హవాయి, మనోరి దీవుల్లో అతి ప్రసిద్ధుడైన చిలిపి దేవుడు మాయుయి. ఇతడు సూర్యుడి వేగాన్ని తగ్గించి, తన జాతి ప్రజలకు పగటి కాలాన్ని పెంచినవాడు. సముద్ర గర్భంలోకి జారుకున్న భూమిని గాలం వేసి లాగగా చేపరూపంలో వచ్చిన దీవి పేరు తే-యికా-మాయుయి. హవాయి దీవి. - మాయుయి మత్స్యదీవి.

## ఆ స్వామి సేవతో ఇహం పరం

ఇలా ప్రపంచ ప్రాచీన గాథల్లో మత్స్యానికి ప్రాముఖ్యత ఉన్నది. కాని సాక్షాత్తు భగవంతుడే మీనావతారాన్ని ధరించి, జ్ఞాన రక్షణ చేయడం మన సనాతన సంప్రదాయానికే చెల్లింది. ప్రళయ అంభోనిధిలో మేను మరచి నిద్రించుచున్న బ్రహ్మ వదనం నుంచి వేదములను తస్కరించిన రాక్షసుని సంహరించి, సత్యవ్రతుని మనువుగా వృద్ధి చెందించి, సర్వాధారుడై తిమియందు మునుగుచు, తేలుచు, విహరించుచున్న తిమింగిలమై, పెనుచీకటిని పారద్రోలిన ఆ మహామత్స్య రూపుడైన శ్రీహరిని సేవించిన వారికి ఇహ పర సుఖములు కలుగును కదా...

**హరి జలచరావతారము**
**పరువడి ప్రతిదినము జదువ పరమపదంబున్**
**నరుడొందు వాని కోర్కెలు**
**ధరణీశ్వర సిద్ధి బొందు దథ్యము సుమ్మీ**

(పోతన భాగవతము 8-739)

చైత్ర శుక్ల తృతీయ తిథి, మధ్యాహ్న సమయము గడిచిన తర్వాత కృతమాలికా నదీ తీరమందు - శ్రీ మత్స్య జయంతిగా వరాహపురాణమందు పేర్కొనబడినది.

✧✧✧✧✧

# 31. శ్రీహరి మహిమా సమ్మోహనం "కూర్మావతారం"

**క్షితి రతి విపుల తరే తవ తిష్ఠతి పృష్ఠే**
**ధరణి ధరణ కిణ చక్ర గరిష్ఠే**
**కేశవ ధృవ కచ్ఛపరూప జయ జగదీశహరే**
– జయదేవ మహాకవి

అసురులు సురులను దండింపగా వారి ధాటికి పలాయనం చిత్తగించిన సురపతి వరుణాదులతో కలిసి బ్రహ్మను దర్శించి, తమ బాధలను విన్నవించుకున్నాడు. అప్పుడు దేవగణ సమేతుడై బ్రహ్మ అనేక విధముల హరిని ప్రార్థించగా ఆయన కోటి సూర్యప్రభాకాంతితో... హార, కిరీట, కేయూర, కుండల, పాద కటక కాంచీలతా కంకణాది కౌస్తుభో పేతంబు, కౌమోదకీ, శంఖ, చక్ర, శరాసనములతో మరకత శ్యామంబు, సరసిజనేత్రములు, కర్ణాభరణముల కాంతితో మెరిసే చెక్కిళ్ళతో, పసిడి కాంతుల వెలుగు పట్టు వస్త్రాలు ధరించి, శ్రీ వనమాలికలు దండగా అలర... దివ్య సౌభాగ్యమైన రూపంతో దిగివచ్చాడు విశ్వగర్భుడు.

## శ్రీహరి తరుణోపాయం

పురుషోత్తమా! నీ రూపము పరమ శ్రేయము. మాకు ఆద్యంతములు నీలోనే కనిపిస్తున్నాయి. నడుము కూడా నీలోనే కనిపిస్తున్నది. నీవే మొదలు, నడుము, తుది ఈ సృష్టికి. ఘటమునకు (కుండకు) మన్నువలె నీవే అంతయూ. ఈ దేవతలు, రాక్షసుల వలన పడరాని బాధలు పడుతున్నారు. వారిని కావమని బ్రహ్మదేవుడు శ్రీహరిని ప్రార్థించాడు. దీనులైయున్న వేల్పులను చూచి శ్రీహరి కరుణాంతరంగుడై పాల సముద్రము లోపల సర్వ తృణములు, లతలు, ఔషధములను వేసి, మందర పర్వతమును మంధానముగా, వాసుకి మహాసర్పమును తరితాడుగా చేసి, పాలవెల్లిని తరచిన మీకు శుభము కలుగుతుందని చెప్పి అంతర్ధానము నొందెను. దేవతలు ఆ పైన రాక్షస చక్రవర్తి బలిని చేరి, అనేక విధముల సేవ చేయుచూ శరణు గోరి స్నేహ బాంధవ్యములు ప్రకటించి, శ్రీహరి తెలిపిన అమృత జలధి మథన విషయమును వివరించారు. అలా చేస్తే ఉభయ కులంబులు వర్ధిల్లునని తెలియజెప్పారు.

## బంతిలా మారిన మందరం

దేవ దానవులందరూ కలసి మందర పర్వతమును పెకలించి తీసుకొని వచ్చే ప్రయత్నమున కొందరు కిందపడి మట్టికరిచారు. నుగ్గయ్యారు. భయభ్రాంతులై

వగచుచున్న వారిని ఓదార్చి, కరుణామయుడైన శ్రీహరి గరుడారోహకుడై, గదాదిధరుడై, కోటి ప్రభల వెలుగొందుచూ ఆ ప్రచండ శిలను ఒక బంతివలె చేత పట్టుకుని ఆడుతూ పాల సముద్రమున దించి, దేవ దానవులకు ఆనందదాయకుడైనాడు. ఆపై దేవ దానవులు వాసుకిని ప్రార్థించి ఆయన అంగీకారం తీసుకొని, తరితాడుగా మందర పర్వతమునకు చుట్టి సురలు తలవైపు, అసురులు తోకవైపు నిలబడి పాలవెల్లిని చిలకబోయారు. ఈలోగా అసురులు అసూయ చెందారు.

**...స్వచ్ఛమైన ఫణంబు మీరలు చక్కబట్టి మథింపగా**

**...బుచ్ఛమేటికి మాకు బట్టగ?...** అని వారు తలవేపు పట్టుకుని దేవతలను తోకవేపు పట్టుకొనేలా చేశారు. ఇరువురి బలాబలముల మధ్య అటు నిటు తిరుగుతున్న మందరపర్వతము క్రమేపీ పాల సముద్రమున మునగసాగెను. మునిగిన మందర శైలమును చూచి దేవ దానవులు సిగ్గుతో, దుఃఖముతో చింతాబ్దిలో మునిగిపోయారు.

## కమలాక్షా శరణు...శరణు

అంత లక్ష యోజనముల వెడల్పు, కడు కఠోరమైన కర్మరము (గట్టి డిప్ప), బ్రహ్మాండమునే మ్రింగగలిగినంత నోరు, సకల చరాచర జంతు జాలమును హరాయించుకునెడి మేటి కడుపు, విశ్వములన్నీ ఒక్కసారే మీదపడినా నిభాయించుకో గలిగిన గట్టి కాళ్ళు, బయటకు లోనికి, లోనికి బయటకు కదులుచున్న మెడ, తల, పద్మముల వంటి కళ్లు, అత్యంత సుందరమైన రూపముతో విష్ణుమూర్తి మహా కూర్మ రూపమును ధరించి సురలకు కూరిమి చేసేందుకు అవతరించాడు.

అలా తాబేలు రూపంలో ఆ జలరాశిలోకి ప్రవేశించి, చిన్న ముత్యమును అరచేతిలో పెట్టుకుని పైకెత్తినట్లు, పాలవెల్లిలో మునిగిన మందర పర్వతమును పైకెత్తి అత్యంత కఠోరమైన తన కర్మరముపై ఉంచుకున్నారు. ఆశ్చర్యముతో చూచుచున్న అమరేంద్రాదులు బాపురే! కమలాక్షా! శరణు! శరణు! అని పలుమార్లు ఘోషించారు. పాల సముద్రము కడవగా, మందర పర్వతము కవ్వముగా, వాసుకి సర్పము తరితాడుగా, తాను కమఠంబై కుదురు కాగా... శ్రీ వల్లభునికి గాక అంతటి మహాద్భుత శక్తి మరెవరికి ఉంటుంది!

## రాక్షసుల గడుసుదనం – శ్రీహరి మోహనం

క్షీరసాగర మథనంలో హాలాహలం పుట్టింది. దేవ దానవుల మొరనాలించి హరుడు ఆ విషం సేవించి, గరళ కంఠుడైనాడు. తరువాత సురభి అనే కామధేనువు, ఉచ్చైశ్రవము అనే అశ్వము, ఐరావతం అనే ఏనుగు, అప్సరసలు, చంద్రుడు, సిరి బయటకు వచ్చారు. సిరి శ్రీహరిని చేపట్టింది. పాలవెల్లిని తరువగా తరువగా తదుపరి

వచ్చిన 'వారుణి'ని రాక్షసులు గైకొన్నారు. చివరగా ఆ పాల సముద్రము నుంచి భూరియాగ భాగభోక్త, నిఖిల వైద్య శాస్త్ర నిపుణుడు, దేవతల వైద్యుడు, ధన్వంతరి అమృత కలశహస్తుడై వచ్చాడు. బలగర్వోపేతులైన రాక్షసులు ఆ కలశమును లాగుకొని 'చావు లేని మందు చక్కగ మనకబ్బె'నని దేవతలకు అందకుండా పారిపోయారు. సుధా పూర్ణ ఘటము పోయెనని వాపోతున్న దేవతలను శ్రీహరి కాచుకున్నాడు. మోహినీ అవతారం దాల్చి రాక్షసులను మైమరిపించి, అమృత కలశమును తానే రాక్షసుల నుంచి స్వీకరించి, దేవతలచే ఒక్క గుక్క మిగులకుండా త్రాగించి రాక్షసుల గర్వమణచాడు. ఆ తదుపరి జరిగిన దేవాసుర యుద్ధంలో దేవతలు జయించినారు. శ్రీహరి భద్రాశ్వమున హయగ్రీవుడై, కేతు మూలమున వరాహమూర్తియై జంబూద్వీపమున కూర్మ మూర్తియై మేరు వర్షమున మత్స్యావతారుడై ఇలా వేర్వేరు దేశములలో వేరువేరు రూపములు ధరించి విశ్వరూపుడై ప్రకాశిస్తూ ఉంటారని బ్రహ్మ పురాణములో చెప్పబడింది.

## విశ్వస్వరూపం కూర్మరూపం

మార్కండేయ పురాణముననుసరించి జంబూద్వీపమును పరిపాలించిన అగ్నీంద్రుని కుమారుడు ఋషభుడు. అతని కుమారుడు భరతుడు. అతడు పరిపాలించిన దేశమే భారతదేశము. జంబూద్వీపములో భారత, ఇలావృత, కురు, భద్రాశ్వక, రమణక, హిరణ్యక, కేతుమాల, హరి అను 9 దేశములలో భారతదేశము నందు శ్రీమన్నారాయణుడు కూర్మరూపుడై నివసించుచుండును. ఈ ఆది కూర్మమునకు వెన్నులో మేష వృషభరాశులు, తలయందు మిథున, కర్కాటకములు, ఆగ్నేయమున సింహరాశి, దక్షిణ కడుపు వేపు కన్యా తులలు, నైరుతిలో వృశ్చికము, తోకపై ధనుస్సు, వాయవ్యమందు మకరము, ఎడమవైపు కుంభము, ఈశాన్య మందు మీనరాశి ఆక్రమించుకుని యుండి కాలమునకు ప్రతీకగా చెప్పబడినది. భారత వర్షములోని వివిధ దేశములకు కూర్మ రూపము ఆధారమై సకల దేశ కాల స్వరూపముగా విలసిల్లుతున్నది.

చైనీయులకు కూడా ఆది కూర్మము అత్యంత పూజనీయమైనది. క్రీస్తు పూర్వము 2205వ సంవత్సరములో 'లో' నది నుంచి బయటకు వచ్చిన తాబేటి డిప్పపై భాగమున ఉన్న మహిమాన్విత చతురస్రముపైని సంఖ్యలు (1 నుంచి 9 వరకు మూడు వరుసలలో ఎటు కూడినా 15 వస్తుంది) లిఖించబడి ఉన్నాయని అందుకే దానిని 'లో' (నదిపేరు) 'షు' (సంఖ్యలు)– 'లోషు' మాజిక్ స్క్వేర్‌గా వర్ణిస్తారు.

పాశ్చాత్య దేశాలలో కూడా భూమికి ఆధారంగా తాబేళ్ళు ఒకదానిపై ఒకటి ఉన్నాయని నమ్ముతారు. మనదేశంలో కొందరి అభిప్రాయం ప్రకారం అష్టదిగ్గజాలను

భరిస్తూ ఆది కూర్మం భూమికి స్థిరత్వాన్ని కల్పిస్తుంది. వైశాఖ శుక్ల పూర్ణిమ సాయంకాలము సమయంలో సముద్రమందు శ్రీ కూర్మజయంతిగా దైవజ్ఞులు పేర్కొన్నారు.

**అమృతోత్పాతన యత్నువై విభుదదైత్యానీకముల్ మందరా**
**గము గవ్వంబుగా జేసి యబ్దిదరువంగా గవ్వపు గొండవా**
**ర్థిమునుంగన్ హరి సూర్య రూపమున దత్పర్వత**
**భ్రమణ వ్యాజత వీపుదీట శమియింపుజేయగా దద్రిం దాల్చిన**
**మంథనాచల ధారణ హేతో**
**దేవాసుర పరిపాలన విభో**
**కూర్మాకార శరీర నమో**
**భక్తంతే పరిపాలయామ్...**

అని భక్త సులభుడైన శ్రీ హరిని భజించిన వారికి ఇహపర సౌఖ్యములు లభించుగాక.

✧✧✧✧✧

# 32. విశ్వంభరోద్ధరణ యజ్ఞం "వరాహావతారం"

నీటిలో మునిగిపోయిన భూమండలాన్ని కాపాడేందుకు మహావిష్ణువు శ్రీ యజ్ఞవరాహావతారం ఎత్తాడు. భూమండలాన్ని ఉద్ధరించడంతో పాటు లోకకంటకుడైన హిరణ్యాక్షుడిని వధించి బ్రహ్మాది దేవతల కైమోడ్పులందుకున్నాడు శ్రీహరి. వరాహావతార ఘట్టం కమనీయం. ఇది చదివిన వారికి, విన్నవారికి పుండరీకాక్షుని కరుణ తథ్యం.

**వసతి దశన శిఖరే ధరణీ తవ లగ్నా**
**శశిని కలంక కలేవ నిమగ్నా**
**కేశవ ధృత సూకర రూప జయజగదీశ హరే !!**

– జయదేవ మహాకవి

మహాప్రళయం సంభవించింది. భూమి జలంలో మునిగిపోయింది. బ్రహ్మ చింతాక్రాంతుడై "నిఖిల జగత్తును కల్పనచేశాను. స్వాయంభువ మనువు నివసించేందుకు ఆధారభూతమైన భూమి ఇప్పుడు లేకుండా పోయిందే అని భావిస్తూ... సర్వభూతాంతరాత్ముడైన పుండరీకాక్షుని స్మరించసాగాడు. ధ్యాన నిమగ్నుడైన బ్రహ్మ నాసిక (ముక్కు) నుంచి, బొటనవేలు పరిమాణమున్న వరాహంగా శ్రీహరి విశ్వంభరోద్ధారణకై జన్మించాడు. మరీచాది మునులు, మనువు కుమారులు చూస్తుండగానే, క్షణంలోపల ఏనుగంత ప్రమాణం పెరిగి చూసేవారికి అద్భుతాశ్చర్యములు కలిగించాడు.

## విశ్వంభరోద్ధరణ పర్వం

ప్రళయ కాలమందు ఆవరించిన దట్టమైన మేఘ గర్జనల వంటి ఘుర్ఘురారావంబులతో బ్రహ్మాండముపై పెంకు పగులునట్లు, దిక్కులదరునట్లు, ఆకాశపు పొరలను చీల్చునట్లు, రొప్పుచూ పర్వతములు పెకలించుచు, ముట్టె బిగియించుచు, ముసముస మూరికొనుచున్న యజ్ఞవరాహమూర్తిని బ్రహ్మ స్తుతించెను.

"దేవా... సనక సనందనాదుల శాప వశమున జయ విజయులు దితి గర్భాన హిరణ్యాక్ష, హిరణ్యకశిపులై జన్మించి ఉన్నారు. హిరాణ్యాక్షుడు నేడు అఖిలలోక కంటకుడై, చండ వేదండ శుండాదండ మండిత భుజాదండబున గదాదండంబు ధరియించి, తనను యుద్ధములో ఓడించగల వాడిని భూలోకమున గానక, దేవలోకముల దేవతలనోడించాడు. వరుణుని దండింప బూన అతడు నీకు సరి

హరియే. అతని గెలిచి రమ్మన్నాడు. హిరణ్యాక్షుడు నీకై వెదకుచూ రసాతలమునకు పోయాడు...” అని బ్రహ్మ వివరించాడు.

## మహా పర్వతమంత పెరిగి...

ఆ పలుకులు విని యజ్ఞవరాహమూర్తియను సర్వేశ్వరుడు, ప్రాతార్మధ్యందిన తృతీయ సవనరూపుండు, మహా ప్రళయంబునందు యోగనిద్రావశుండై యుండు కాలమందు జలముల మునిగి, భూమి రసాతలగతంబైనందున, దానిని పైకి తీసుకువచ్చే ఉపాయంలో భాగంగా తాను మహా పర్వతమంతగా పెరిగిపోయాడు. ఆపైన తన నిశిత కరాళక్షుర తీక్షంబులైన ఖురాగ్రంబుల సముద్ర జలమును చీల్చి రసాతలమును ప్రవేశించి భూమిని సమీపించెను. ఆ జల మధ్యంలో సూకరాకారుడైన హరికి హిరణ్యాక్షుడు ఎదురయ్యాడు.

అప్పుడు శ్రీహరి తన తనూకాంతితో దనుజాధీశుడైన హిరణ్యాక్షుని శరీరపు వెలుగును హరింపజేసెను. అంతేకాక తుది మొదళ్లకు చిక్కక, కొండలను పిండిచేయుచు, బ్రహ్మాండ భాండంబు పగులునట్లు కొమ్ములతో గుచ్చుచూ, సప్త సముద్రములింకునట్లు బంకమట్టిని ఎగజిమ్ముచు, తన కురుచ తోకను తిప్పుచు, గుప్పించి లంఘించుచు, భూమిని తవ్వి తన నిశిత దంతాగ్రముల నిలిపి రాక్షస రాజు గుండెలు తల్లడిల్లునట్లు రణోత్సాహమున రంకెలు వేస్తూ ఆ వరాహమూర్తి రణానికి సిద్ధమయ్యారు.

## యజ్ఞవరాహ-హిరణ్యాక్షుల సమరం

నిశిత సిత దంతముల వెలుగులు నింగిని వ్యాపింప, రసాతలమును వీడి భయంకర వరాహావతారమున వసుంధరను గొనిపోవుచున్న శ్రీహరిని అటునిటు అడ్డగించుచు, నిందించుచు హిరాణ్యాక్షుడు విడువిడుమని ఆక్షేపించాడు. అప్పుడు యజ్ఞవరాహమూర్తి భూమిని జలములపై నిలువబెట్టి ఆధారముగా తన బలమును ఉంచి, హిరాణ్యాక్షునిపై సమరమునకు సన్నద్ధుడాయెను. హిరణ్యాక్షుడు అతి భయంకరాకారుడై గద సారించి మాధవునెదుర్కొన్నాడు.

ఇరువురు అన్యోన్య జయ కాంక్షలతో, పరస్పర శుండాదండ ఘట్టిత మధాంధ గంధ సింధుర యుగంబులవలె, రోష భీషణాచోపంబులం తలపడ బెబ్బులవలె, అతి దర్పాతిరేకంబున నెదర్చి రంకెలు వేయు మద వృషభంబుల వలె పోరాడిరి.

## హిరణ్యాక్షుడు... నిస్తేజుడు

హిరణ్యాక్షుని గద, శూలము శ్రీహరి ధీరత్వం ఎదుట వృథా అయ్యాయి. దాంతో హిరాణ్యాక్షుడు రోషోద్ధరుడై మాయా యుద్ధము ప్రారంభించాడు. భీకర

పాషాణ పురీష మూత్ర ఘన దుర్గాంధ అస్థి రక్తములు కురియునట్లు మాయా చక్రమును భూచక్రముపై ప్రయోగించాడు. శ్రీహరి తన చక్రముతో మాయా చక్రాన్ని అడ్డగించారు. తన మాయలన్నియు కృతఘ్నునికి చేసిన ఉపకారమువలె పనిచేయకపోవుట గమనించిన హిరణ్యాక్షుడు వరాహమూర్తిపై లంఘించి తన బాహువులను చాచి, హరివక్షంపై బలం కొద్దీ పొడువగా, హరి తప్పించుకుని ఎదురు ముష్టి ఘాతం ఇచ్చాడు. ఆ దెబ్బకు దిర్దిరం దిరిగి, దిట చెడి, లోబడిన హిరణ్యాక్షుని కర్ణమూలమందు తన కోరలతో వరాహమూర్తి మొత్తెను.

**బుడ బుడ నెత్తురు గ్రక్కుచు**
**వెదరూపము దాల్చి గ్రుడ్డు వెలికురక, నిలం**
**బడి పండ్లు గీటుకొనుచును**
**విడిచెం బ్రాణములు దైత్య వీరుండంతన్**

హిరణ్యాక్షుని సంహరించి అతని రక్తధారలతో తడిచిన మోముపై భూమిని, బాలచంద్రుని కిరణములవలె మెరయుచున్న తన కోరలపై నిలిపిన యజ్ఞపోత్రిమూర్తిని జూచి బ్రహ్మాదులు ప్రణామము లాచరించి… "ఈ విశ్వపు సృష్టి, స్థితి, లయ లందు వికారము నీవే, విశ్వము నీవే! నీ లీలలు అపారము. చర్మమున అఖిల వేదములు, రోమముల యందు బర్హిస్సులు, కన్నులలో అజ్యము, పాదముల యందు యజ్ఞ కర్మములు, తుండమున స్రువము, ముక్కులో ఇడాపాత్ర, ఉదరమున, చెవులలో జమస్రప్రాశిత్రములు, గొంతులో మూడు ఇష్టులు, నాలుకపై అగ్ని కలిగిన ఓ దేవా! వితత కరుణాసుధా తరంగితములైన నీ కటాక్షవీక్షణములతో మమ్ము కావవయ్యా…" అని ప్రార్థించారు. అంతట లీలవోలె శ్రీయజ్ఞ వరాహమూర్తి భూమిని తన కోరలపై నుంచి సముద్రముపైన దించి, నిలిపి, విశ్రాంతి వహింపజేసి తిరోహితుడయ్యాడు.

మంగళమైన ఈ కథను సమంచిత భక్తితో చదివినా, విన్నా వారిని శ్రీహరి ప్రసన్నుడై ఆదరించుగాక!

(భాద్రపద శుక్ల పంచమి, మధ్యాహ్న సమయము గడచిన తరువాత హరిద్వారమున శ్రీ వరాహజయంతి)

శుభం భూయాత్!!

✧✧✧✧✧

# 33. దుష్ట శిక్షణ - శిష్టరక్షణ ఘట్టం
# "నృసింహావతారం"

మంచిని కాపాడి, చెడును నిర్మూలించి లోకకళ్యాణం చేకూర్చేందుకు ఆ పరంధాముడు ఒక్కో సమయంలో ఒక్కో అవతారం దాల్చారు. దేవతల పాలిట కంటకునిగా పరిణమించిన హిరణ్యకశిపుని సంహరించేందుకు దేవదేవుడు మహోగ్రమూర్తిగా, నారసింహునిగా అవతారం ఎత్తారు. హిరణ్యకశిపుని సంహరించి శిష్టులకు ఆనందం చేకూర్చిన వైకుంఠనాథుని శ్రీ నృసింహావతార ఘట్టం.

**తవ కరకమల వరే నఖ మద్భుత శృంగమ్**
**దలిత హిరణ్య కశిపు తను భృంగమ్**
**కేశవ ధృత నరహరి రూప జయజగదీశహరే...!!**

- జయదేవ మహాకవి

ఒకనాడు బ్రహ్మ మానస పుత్రులైన సనకసనందాదులు దైవ యోగంబున ముల్లోకాలు తిరుగుతూ, ఐదారేళ్ల బాలకుల వలె, దిగంబరముగా హరి మందిరము ప్రవేశించబోయారు. ద్వారపాలకులైన జయవిజయులు వారిని అడ్డగించారు. సనక సనందాదులు కోపముతో ద్వార పాలకులను రాక్షసులుగా జన్మించమని శపించారు. జయవిజయులు మొరపెట్టుకొని, వేడుకోవడంతో మూడు జన్మల తరువాత మరల దైవసన్నిధానం లభిస్తుందని శాపవిమోచనం చెబుతారు సనకసనందాదులు. మొదటి జన్మలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా; రెండవ జన్మలో రావణ కుంభకర్ణులుగా; మూడవ జన్మలో శిశుపాల దంతవక్త్రులుగా జన్మించి శ్రీహరి చేతిలో హతులై తిరిగి వైకుంఠపురం చేరుకున్నారు. తన సేవకుల తప్పును సరిదిద్దేందుకు శ్రీహరి కూడా అవతారములెత్తి పలు కష్టాలు అనుభవించవలసి వచ్చింది.

## హిరణ్యకశిపుని యుద్ధభేరి

హిరణ్యాక్షుడు యజ్ఞవరాహమూర్తి రూపంలో ఉన్న హరిని ఎదిరించి మరణించాడు. ఆ సంగతి తెలిసి హిరణ్యకశిపుడు నాకు తమ్ముడు మీకు స్నేహితుడు, మహా బలశాలియైన హిరణ్యాక్షుని మన శత్రువు శ్రీహరి సూకర రూపంతో వధించి పోయెనట...! ఓ దానవ వీరులారా!భూమియందున్న గ్రామ, పుర, క్షేత్ర, నగర, ఆశ్రమాలను, వనములను వెదకి శ్రీహరి భక్తులను దండించి రండి. వారిని

రక్షించేందుకు శ్రీహరి ఏ రూపంలో వచ్చినా అతనిని నేను నిర్జిస్తాను!! అని పలికి, తమ్మునికి అంత్యక్రియలు పూర్తిచేసి, మందర పర్వతం చేరుకున్నాడు హిరణ్యకశిపుడు. కాలి పెనువేలుపై నిలబడి, చేతులు పైకెత్తి నమస్కరించి, ఆకాశముపై దృష్టినిలిపి, పరమ ఉగ్రమైన తపస్సు మొదలుపెట్టాడు. అతని శరీరంపై క్రిములు చేరి రక్తమాంసాలను భక్షిస్తున్నా జడలు పెరిగి తన చుట్టూ పుట్టలు, చెట్లు, చేమలు పెరిగినా అతడు నిశ్చలంగా తపస్సు చేయసాగాడు. నీరంధ్ర, నిబిడ, నీరద, నికర, నివిష్ట, నీరజబంధుని వలె ఉన్న హిరణ్యకశిపుని ఎదుట బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. వరములు కోరుకోమన్నాడు. గాలి, నేల, నీరు, అగ్ని, ఆకాశము, దిక్కులలో ఏ అస్త్రశస్త్రముల వలన, జీవ జంతువులు, దేవతలు, నరుల వల్లగాని ప్రాణ భయము, మృత్యువు లేని జీవనమును, లోక పాలురను జయించే శౌర్యమును, ముల్లోకాలను జయించే శక్తిని ఇవ్వమని హిరణ్యకశిపుడు కోరుకున్నాడు. బ్రహ్మ 'తథాస్తు అన్నాడు.

## తల్లి గర్భంలోనే ప్రహ్లాదునికి హరిభక్తి

హిరణ్యకశిపుడు మందర పర్వతమందు తపస్సులో నున్నపుడు సురేంద్రుడు రాక్షస రాజధానిపై దండెత్తి రాక్షసుల నోడించి హిరణ్యకశిపుని భార్య, గర్భిణియైన లీలావతిని చెరగొని పోబోయాడు. అప్పుడు నారదుడు అతడిని వారించి, లీలావతిని తన ఆశ్రమమునకు తీసుకొని వెళ్ళి ఆతిథ్యమిచ్చి ధర్మ తత్త్వము, నిర్మలజ్ఞానమును ఉపదేశించారు. ఆ సమయంలో గర్భములో ఉన్న శిశువు ప్రహ్లాదుడు ఆ బోధలను గ్రహించి జన్మతః హరిభక్తుడయ్యాడు. బ్రహ్మ నుంచి మృత్యుంజయ వరములను పొంది వచ్చిన హిరణ్యకశిపుడు గర్వాంధుడై, సమస్త జనులను హింసించుచూ దేవతలను పారద్రోలి, సకల దిక్కులను నిర్జించి లోకైక నాయకుడై, శాస్త్ర మార్గాలను అతిక్రమించి పాలన చేయసాగాడు. అటువంటి రాక్షస రాజుకు – పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్, భాషించుచున్ హాసలీలనిద్రాదులు సేయుచూ తిరుగుచున్, లక్షించుచున్ ఎల్లప్పుడూ శ్రీహరినామ స్మరణ చేయు ప్రహ్లాదుడు కుమారునిగా జన్మించినాడు.

## ఉగ్రనరసింహుడు

కుమారుని వైఖరి హిరణ్యకశిపుడికి ఏమాత్రం నచ్చలేదు. అతనిని మార్చేందుకు శుక్రాచార్యుల కుమారుడైన చండామార్కుల వారిని గురువుగా నియమించాడు. వారు కూడా అతనిని మార్చలేకపోయారు. ఒకరోజు తనయుని పిలిచి హిరణ్యకశిపుడు నీ గురువులు నీకేమి బోధించారో తెలుపమనగా, ప్రహ్లాదుడు

– చదివించిరి నను గురువులు, చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు, చదివినవి గలవె పెక్కులు, చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ! అని హరిని ప్రశంసించాడు. హిరణ్యకశిపుడు కోపించి... అంగ వ్రాతములో చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి, శేషాంగ శ్రేణికి రక్షసేయు విధంగా ఈ కుల ద్రోహిని చంపిరండి అని ఆజ్ఞాపించాడు. భటులు అనేక విధాలా ప్రహ్లాదుని చంపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు విసిగిన దైత్యరాజు ప్రహ్లాదుని పిలిపించి, నీ శ్రీహరిని ఈ స్తంభమున చూపించమంటూ, స్తంభమును అరచేత చరచెను. ఆ స్తంభము పగిలి అందులో నుంచి కేవల పురుషరూపంబును, మృగరూపంబును గాని నరసింహరూపంబున, రేయిను, బవలుంగాని సంధ్యాసమయంబున, అంతరంగం బహిరంగముగాని సభాధ్వారంబున, గగనము, భూమియు గాని యూరు మధ్యమున బ్రాణ సహితము, రహితముగాని తన వాడి గోళ్ళతో హిరణ్యకశిపుని సంహరించారు శ్రీహరి. అంతటితో ఆగక మహోగ్రనరసింహుడై రాక్షసవీరులనేకుల తన కట్టెదుర నాయుధంబులెత్తుకుని చంపి, భయంకరంబుగ గర్జించుచూ సభాసింహాసనారూఢుడై ఉండగా సమస్త దేవతలు ఆతని దర్శించి, స్తుతించారు. అంతట శాంతించిన నరహరి ప్రహ్లాదుని దీవించి, పాపాత్ములకు వరములిచ్చుట పాములకు పాలుపోయుట వంటిదని బ్రహ్మకు హితవు చెప్పి శ్రీ నరసింహదేవుడు తిరోహితుడయ్యెను.

## నారసింహం విశ్వవ్యాప్తం

సగం మానవ శరీరం, సగం జంతురూపం గల దేవుళ్ళను ఈజిప్టు ఇతిహాసాల్లో చూడవచ్చును. సింహము తల మానవ శరీరముగల సెఖెమత్ దేవత సూర్యుని కుమార్తె. తప్పుదారి పడుతున్న ఈజిప్షియన్లను శిక్షించేందుకు ఆమె భూమి మీదకు వచ్చింది. బాస్సెట్ దేవత పిల్లి తలతో ఉంటుంది. ఆమె వేటకు అధిదేవత. ధేనువు ముఖము గల హేధార్ దేవత మాతృత్వానికి సూచిక. బబూన్ ముఖముతో ఉన్న తోత్ వ్రాయసగాళ్ళ దేవుడు. జాకాల్ ముఖమున్న అనూబిస్ మమ్మిఫికేషన్‌కు అధిపతి. ఇలా ఆంత్రోమార్ఫిక్ దేవతలను ఈజిప్టు గాథల్లో గమనించవచ్చును.

## భీషణం... ఆ రూపం

నారసింహ స్వరూపం స్వరూప వర్ణన ఇలా ఉంది...

**ప్రతప్త చామీకర చండలోచనం కరాళ దంష్ట్ర కరవాల చంచల**
**స్త భ్రోర్ధ్వ కర్ణం గిరి కందరాద్భుతం**

**దివి స్పృశత్కాయ మదీర్ఘ పీవర**
**స్ఫురత్సటా కేసర జృంభితాననమ్**
**క్షరాంత జిహ్వాం భృకుటీ ముఖోల్బణమ్**
**వ్యాత్తా స్యనాసంహను భేది భీషణమ్**
**గ్రీవోరు వక్షస్థల మల్ప మధ్యమామ్**

ఈ విధంగా ఆశ్చర్య భయాలను కలిగించే రూపంతో దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేసేందుకు, ఎంతటి వారికైనా మృత్యువు తప్పదని తెలియజెప్పేందుకు, భగవానుడే నరసింహ రూపమున అవతరించుట ఈ అవతార ప్రాముఖ్యత. వైశాఖ శుద్ధ చతుర్దశి సాయం సంధ్యా సమయము మూలస్థానము నృసింహ జయంతి. నరసింహావతారమును నిష్ఠతో పూజించేవారికి దండధరుని బాధ ఉండదు. మృత్యుంజయులౌతారు. శ్రీ రమణీయమైన నరసింహావతారము, ఇంద్ర శత్రువైన హిరణ్యకశిపుని సంహారం, పుణ్య భాగవతుడైన ప్రహ్లాదుని కథనం ఎవరు విన్నా, చదివినా శుభం కలుగుతుంది. ఏ భయమూ లేని దివ్యలోక ప్రాప్తి కలుగుతుంది.

✧✧✧✧✧

# 34. విశ్వరూప విన్యాసం
# “వామనావతారం”

దేవతలకు ప్రమోదం... అసురాధిపతి బలి చక్రవర్తి పాలిట మృత్యుగీతం శ్రీవామనావతారం. మాయావటుని రూపంలో బలిచక్రవర్తిని బురిడీ కొట్టించి, అడ్డు తగిలిన శుక్రాచార్యునికి తగిన శాస్తి చేసి, రాక్షసరాజు మదమణచి ముక్కోటి దేవతల జేజేలు అందుకున్నాడు శ్రీ మహావిష్ణువు.

**ఛలయసి విక్రమణే బలి మద్భుత వామన**
**పదనఖ నీరజ నతజన పావన**
**కేశవ ధృత వామన రూప జయ జగదీశహరే**

– జయదేవ మహాకవి

దేవాసుర యుద్ధంలో ఇంద్రునితో ఓడిపోయిన బలి, రాక్షస గురువైన శుక్రాచార్యుల దయ వలన బ్రతికి, గురూపదేశంతో విశ్వజిత్‌యాగం చేసి బంగారు రథము, మహాశక్తివంతమైన ధనుస్సు, అక్షయతూణీరములు, కవచము, శంఖములు పొందుతాడు. బలగర్వితుడై ఇంద్రుని మదమణిచేందుకు, రాక్షసులనందరినీ ఒకచోట చేర్చి, యుద్ధమునకు సంసిద్ధం చేసి అమరావతిపై దండెత్తుతాడు. ఆ దుర్భర దానవ శంఖా విర్భూత ధ్వనులు నిండి, విభుదేంద్ర వధూగర్భములు పగిలి, లోపలి శిశువులు ఆవురని ఆక్రోశించుచుండ, దేవతలు బృహస్పతి వచనములు విని అమరావతి వీడి పారిపోయారు.

## అదితి వ్రత ఫలం... వామన జననం

దేవతల దుస్థితిని చూసి, సురమాత అదితి, తన భర్తయైన కశ్యపబ్రహ్మను వేడుకున్నది. అంతట కశ్యపుడు అదితికి పయోభక్షణ వ్రతాన్ని ఉపదేశిస్తాడు. ఆమె ఫాల్గుణమాసం, శుక్లపక్షం పాడ్యమి నుంచి 12 రోజులు హరిసమర్పణంగా వ్రతం చేసి భర్తను చేరగా, భగవదంశతో, శ్రావణ ద్వాదశి నాడు శ్రోణ అభిజిత్ సంజ్ఞాత లగ్నంలో, రవి మధ్యాహ్నమున చరించునప్పుడు, గ్రహతారా చంద్ర భద్రస్థితిలో వామనుడు జన్మించాడు.

వామనుడు పుట్టినప్పుడు శంఖ, చక్ర, గదా కమల కలిత, చతుర్భుజునిగా, బిశింగ వర్ణ వస్త్రాలతో, మకరకుండల మండిత గండ భాగుడై, శ్రీ విరాజిత లోలంబ, కదంబ వనమాలిగా సమస్త అలంకారాలతో, నిఖిల జన మనోహరుడిగా అవతరించాడు. రూపాంతరంబున తన దివ్యరూపాన్ని ఉపసంహరించుకొని, కపట వటుని వలె, ఉపనయన వయస్కుండై వామన బాలకుడయ్యాడు.

## ఉపనయనం చేసిన దేవతలు

ఆ బాలునికి సవిత సావిత్రిని ఉపదేశించింది. బృహస్పతి యజ్ఞోపవీతాన్ని, కశ్యపుడు ముంజిని, అదితి కౌపీనాన్ని, ధరణి కృష్ణాజినమును, చంద్రుడు దండమును, ఆకాశ దేవత ఛత్రమును, బ్రహ్మ కమండలమును, సరస్వతి అక్షమాలికను, సప్తర్షులు కుశపవిత్రములను, ఈశ్వరుడు భిక్షాపాత్రను, భవాని పూర్ణ భిక్షను ఇచ్చింది. అలా ఉపనయనమైన మాయా రూపధారి వివిధ దేశముల నుంచి వచ్చిన విప్రులతో ముచ్చటించాడు. వారు బలిని మించిన వదాన్యుడు లేరని చెప్పగా విని, తల్లిదండ్రుల నుంచి సెలవు తీసుకొని, పయనమై, నర్మదానదిని దాటి ఆ నదికి ఉత్తరతీరమున ఉన్న బలి చక్రవర్తి అశ్వమేధ వాటికను సమీపించెను.

## శివుడా... హరుడా?

అతనిని చూచి జనులు గుజగుజలు పోవుచూ, గజిబిజి పడుచూ, కలకలములై ఎవరీ పొట్టి బాలుడు? శివుడా? హరియా? బ్రహ్మయా? సూర్యుడా? అగ్నియా? ఈ బ్రహ్మచారి ఎవరు? అని విస్మయం చెందారు. కొందరితో చర్చించుచూ కొందరితో జటలు చెప్పుచూ, గోష్ఠిలో పాల్గొనుచూ, తర్కించుచూ, ముచ్చటలాడుచు, నవ్వుచూ అనేక విధంబుల అందరికీ అన్ని రూపులై వినోదించుచూ, వెడవెడ నడకలు నడుచుచూ, బుడి బుడి నొడుపులు నొడుచుచు, జిడిముడి తడబడగ, వడుగు రాజును సమీపించి “స్వస్తి! జగత్త్రయీ భావన శాసన కర్తకు! హాసమాత్ర విధ్వస్త నిలింప భర్తకు, ఉదారపద వ్యవహర్తకు, మునీంద్ర స్తుత మంగళాధ్వ విధాన విహర్తకు, దానవ లోక భర్తకు స్వస్తి” అని దీవించెను.

## మూడు అడుగుల నేల చాలు

బలి అతనికి సముచితాదరమిచ్చి గౌరవించి... వడుగా! ఎవ్వరి వాడవు? నీకేమి కావలయును కోరుకొమ్మన్నాడు.

“ఒంటివాడను నేను. నాకు ఒకటి మరియు రెండడుగుల మేర యిమ్ము. అయినను అడుగమంటివి కనుక అడిగితిని. దాత పెంపు సొంపు తలపవలెను గదా! కావున నాకు మూడడుగుల నేలనిమ్ము, చాలు” అని మాయావడుగు పలికెను. ఆ వామనుడిని విష్ణువుగా గుర్తించిన శుక్రుడు బలి చక్రవర్తిని వారించెను. బలి గురువుకు వినయముగా నమస్కరించి ...ఇచ్చెదనని పలికితిని. ఆడిన మాట తప్పను అన్నాడు. అప్పుడు శుక్రాచార్యుడు నీవిచ్చినచో అఖిలంబు పోవును. అంతేకాక...

**వారి జాక్షులందు, వైవాహికములందు**
**ప్రాణ విత్త మాన భంగమందు**
**జకిత గోకులాగ్ర జన్మరక్షణయందు**

బొంకవచ్చు... తప్పులేదు. అది పాపము కాదు. అని శుక్రాచార్యుడు వివరించెను. దానికి బలి చక్రవర్తి ...కారే రాజులు రాజ్యముల్ కలుగవే, గర్వోన్నతిం బొందరే వారేరీ? సిరి మూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనంగలదే! శిబి లాంటి దాతల పేరు ఈనాటికీ స్థిరములైనవి కదా! భార్గవా! అని పలుకగా తన మాటను తోసి పుచ్చిన రాజును పదభ్రష్టునివిగమ్మని శుక్రాచార్యుడు శపించాడు.

## ఏకాక్షి అయిన శుక్రాచార్యుడు

అయినను బలిచక్రవర్తి హరిచరణములు కడిగి, 'త్రిపాద ధరణిం దాస్యామి' అనుచు నీటిధార విడిచాడు. ఆ కలశములో సూక్ష్మకీటక రూపమున చేరి శుక్రాచార్యుడు నీటిధారను ఆపబోయాడు. అప్పుడు హరి కుశాగ్రముతో కలశ రంధ్రమును బొడువగా కన్ను పోగొట్టుకొని శుక్రాచార్యుడు ఏక నేత్రుడయ్యెను. "పుట్టి నేర్చుకునెనో, పుట్టక నేర్చెనో... ఈ పొట్టి వడుగునకీ చిట్టి బుద్ధులెట్లబ్బెనో, ఈతని పొట్టనిండా అన్నీ భూములే..." అని నవ్వుతూ మూడడుగుల నేలను బలి వడుగుకు దానమిచ్చెను.

## ఇంతింతై... వటుడింతయై...

అలా ధారా పరిగ్రహంబు చేసి, ఇంతితై వటుడింతయై, మరియు దానింతై, నభో వీధిపైనంతై, తోయద మండలాగ్రమున కల్లంతై, ప్రభారాశి పైనంతై, చంద్రునికంతయై, ధ్రువునిపైనంతై, మహర్వాటి పైనంతై, బ్రహ్మాండాంత సంవర్థియై, సత్యపదోన్నతుడైన విష్ణువునకు అప్పుడే ఉదయించిన సూర్యబింబము మొదట గొడుగులా, తదుపరి శిరోరత్నమై, చెవి కుండలమై, మెడలోని ఆభరణమై, బంగారు కేయూరమై, కంకణమై వడ్డాణమై, ఘంటయై, నూపురప్రవరమై, చివరకు పాదపీఠమై ఒప్ప అతడు బ్రహ్మాండము నిండినాడు.

## మూడో అడుగుకు చోటేది ?

ఒక పాదంబులో భూమిని కప్పి, దేవలోకమును రెండవ పాదమున నిరోధించి, జగములెల్ల దాటి చనిన త్రివిక్రముడు మరల వామనుడై బలినవలోకించి నా మూడవ పాదమునకు స్థలము జూపమన్నాడు. అప్పుడు బలి వినయముతో నీ తృతీయ పాదమును నా శిరమున ఉంచమని వేడుకొనగా సమ్మతించిన హరి బలిని ఆశీర్వదించి, ప్రహ్లాదునితో సుతలలోకమునకు పంపి, తానే ఆ లోకమునకు ద్వారపాలకుడాయెను. బలి నడిగి సంపాదించిన లోకములను తన సోదరుడైన ఇంద్రునకిచ్చి సంతోష పరిచాడు శ్రీహరి. ఈ వామనావతార గాథను విన్నవారు, చదివినవారు సకల శుభాలను పొందుతారు. దైవారాధన సమయంలో ఎవరైతే త్రివిక్రమ పరాక్రమాన్ని స్మరించుకుంటారో వారికి నిత్య సౌఖ్యాలు కలుగుతాయి.

✧✧✧✧✧

# 35. క్షత్రియ సంహార యజ్ఞం "పరశురామం"

దశావతారాల్లో పరశురామ అవతారం విలక్షణమైంది. తండ్రిమాట కోసం తల్లిని సంహరిస్తాడు. ధర్మం తప్పిన రాజుల రక్తంతో మహాయాగం చేసి తండ్రి జమదగ్నికి సప్తర్షి మండలంలో చిరస్థానం కల్పిస్తాడు. విప్రుడు... వీరుడై ధర్మాన్ని రక్షిస్తాడు. దుష్టులను రూపుమాపుతాడు. శివధనుర్భంగం చేస్తున్న శ్రీరాముని అడ్డుకొని, ఆయన జగత్కల్యాణ స్వరూపం తెలుసుకొని, అవతారం చాలిస్తాడు.

**క్షత్రియ రుధిరమయే జగదపగత పాపమ్**
**స్నపయసి పయసి శమిత భవతాపమ్**
**కేశవ ధృత భృగుపతి రూపజయజగదీశహరే !!**

– జయదేవ మహాకవి

ఊర్వశీ పురూరవుల ఆరుగురు పుత్రులలో ఆఖరివాడైన విజయునకు భీముడు, భీమునకు కాంచనుడు, కాంచనునకు హోత్రకుడు, హోత్రకునకు గంగా ప్రవాహంబు పుక్కిట పట్టిన జహ్నుడు, జహ్నునికి పూరుడు, పూరునికి బాలకుడు, బాలకునికి అజనకుడు, అతనికి కుశుడు, కుశునికి కుశాంబుడు, కుశాంబునికి గాధి అనువాడు కలిగి రాజ్య పరిపాలన చేయసాగారు. గాధికి సత్యవతి అనే కుమార్తె జన్మించింది. సత్యవతిని ఋచికుడు అనే మహాముని పరిణయమాడ కోరినపుడు, తెల్లని శరీరము నల్లని చెవులున్న వేయిగుర్రాలను తెస్తే, కూతురుని ఇస్తానని గాధి బదులిచ్చాడు. ఆపైన ఋచికుడు వరుణుని అనుగ్రహంతో ఆ అశ్వములను సంపాదించి గాధికి ఇచ్చి సత్యవతిని వివాహం చేసుకుంటాడు. సత్యవతి, ఆమె తల్లి ఇరువురు కూడా పుత్రునికోసం ఏదైనా వ్రతం చెప్పమని ఋచికుని కోరారు. అప్పుడు ఆయన విప్ర, రాజ మంత్ర వితతుల చరువు చేసి నదీ స్నానానికి వెళ్లాడు. తల్లికోసం చేసిన రాజ చరువును సత్యవతి తీసుకున్నది. తన కోసం చేసిన విప్ర చరువును ఆమె పొరపాటున తల్లికి ఇచ్చింది. ఋచికుడు అది గమనించి నీకు క్రూరుడు జన్మిస్తాడు. నీ తల్లికి బ్రహ్మవేత్త జన్మిస్తాడన్నాడు. దాంతో సత్యవతి భయపడింది. ఋచకుడు ఆమెను ఓదార్చి నీ మనుమడు క్రూరుడగును. నీ కొడుకు సాధువు కాగలడని ఆశీర్వదించాడు. అంతట సత్యవతికి జమదగ్ని జన్మించాడు. జమదగ్ని రేణువు కూతురైన రేణుకను వివాహమాడెను. రేణుకా గర్భమున వసుమనాది కుమారులు ఆఖరున రాముడు జన్మించెను. సత్యవతి తల్లికి అగ్నితేజుడైన విశ్వామిత్రుడు జన్మించి, తపోబలంబున రాజధర్మమును మాని బ్రహ్మర్షి అయ్యాడు.

## రావణ కార్తవీర్యార్జునం

ఆ కాలమందు హైహయదేశపు రాజు కార్తవీర్యార్జునుడు, దత్తాత్రేయుని ఆరాధన చేసి, అతని వలన శత్రుజయమును, సహస్రబాహువులను, సమస్త ఐశ్వర్యములు పొంది గర్వాంధుడై చరించసాగాడు.

ఒకరోజు అతడు దేవా నదికేగి స్నానము చేసి తన వేయి చేతులతో నదీ ప్రవాహమునకు అడ్డుకట్ట వేశాడు. ఆ నీరు పొంగి దిగ్విజయార్థము వచ్చిన రావణునిపై చిమ్మింది. అతడు కార్తవీర్యార్జునిపై లంఘింప ఆ సహస్ర బాహుడు దశకంఠుని కూకటులగలించి పట్టుకుని, మోకాళ్ళం దాకించి కోతికైవడి నాకం బెట్టించి... పోరా! అని సిగ్గుపరచి వదలెను.

## పరశురాముని ప్రతాపం

అంతటి బలవంతుడైన ఆతడు వేటకై అడవికి వెళ్ళి జమదగ్ని ముని ఆశ్రమమున మునీంద్రుని ఆతిథ్యము స్వీకరించి హోమధేనువు మహత్యమును కనులారా గాంచి భటులచే దానిని పట్టి బంధించి తన మహిష్మతీ పురానికి తీసుకుపోయాడు. ఆ విషయము తెలిసి రాముడుగ్రుడై ప్రళయాగ్ని వలె, పృథ్వీతలము క్రుంగగా, పరశువును, విల్లంబులను, కవచమును, కృష్ణాజినమును ధరించి మాహిష్మతీపురమునకు పోయి కార్తవీర్యుని ఎదురించి నిలిచెను. వీడు వెర్రివాడు. మనవంటి భూపాలురతో కయ్యమునకు వచ్చినవాడు. మనకు పాపమంటదు. అని రాజు తన సేనలంపిన రాముడు తన కుఠారితో రైతు తొలకరి సమయమున చెట్లు నరికినట్లు, తాటిపళ్ళు రాల్చిన వృక్షారోహనుని వలె, అరటి చెట్లు నరకు ఆరామకారుని వలె, మృగముల నరికి వండు వంటవానివలె, ఆ సైనికులను బాణవర్షముతో, పరశువు వ్రేటులతో రూపుమాపెను.

కోపించి కార్తవీర్యుడు తన సహస్రబాహువుల ఆయుధముల దాల్చి రామునిపై లంఘించగా ఆతడు తన పరశువులతో కార్తవీరుని వేయి చేతులు, తల నరికి రాజు దొంగిలించిన గోవును దూడను తీసుకుని ఆశ్రమమునకు వెళ్ళెను. పట్టపు రాజును చంపుట పాపము, పోయి ఒక ఏడు తీర్థయాత్రలు చేసిరమ్ము. నీలో క్షమాగుణము చిగురించునని తండ్రి పలికిన రాముడు తీర్థయాత్రలకు వెళ్ళి వచ్చెను.

జమదగ్ని భార్య రేణుక ఒకనాడు నీటికై ఏటికి పోవ అక్కడ అప్సరసలతో స్నానమాడుచున్న చిత్రరథుడను గంధర్వుని చూస్తూ ఉండిపోయింది. కొంచెము కాలయాపన కాగా భయపడుతూ ఇంటికి వెళ్ళింది రేణుక. భార్యను చూసి విషయము గ్రహించిన జమదగ్ని తన పుత్రులను పిలిచి మీ తల్లిని చంపమని ఆదేశించాడు.

కానీ వారెవరూ ముందుకు రాలేదు. తండ్రి తపశ్శక్తి తెలిసిన పరశురాముడు జమదగ్ని ఆజ్ఞ శిరసావహించి తల్లిని, అన్నలను చంపాడు. అంతట శాంతించిన జమదగ్నిని తిరిగి వారిని బ్రతికించమని పరశురాముడు వేడుకొనగా అతడు వారికి తిరిగి ప్రాణం పోశాడు.

## రాజ సంహార యజ్ఞం

సరియైన సమయం కోసం ఎదురుచూస్తున్న కార్తవీర్యుని కుమారులు, రాముడు అతని సోదరులు లేని సమయమును చూచి జమదగ్ని తల నరికి చంపారు. వారు నీ తండ్రిని చంపారని ఇరవైయొక్కమార్లు తన గుండెలు మోదుకొనుచూ రేణుక రోదించింది. తల్లి దుఃఖమును చూచి, రాముడు ఉగ్రుడై రాజపురమునకేగి కార్తవీర్యుని కొడుకులను వెదికి వెదికి పట్టి వధించెను. అంతటితో ఆగక ఇరువది ఒక్కమార్లు రాజులను వెదికి చంపి భూమిపై రాజ శబ్దము లేకుండా చేసెను. ఆపైన పరశురాముడు శమంత పంచకంబున, రాజుల రక్తముతో తొమ్మిది మడుగులు నింపి, తండ్రి శిరమును తెచ్చి శరీరముతో సంధించి, యాగము చేశాడు. ఆ యజ్ఞ ప్రభావము వలన, ఆప్తుడగు పుత్రుని వలనే జమదగ్ని సప్తర్షులలో సప్తముడై సప్తర్షిమండలమున వెలుగుచున్నాడు.

## అవతార సమాప్తి

మధ్యధరా ప్రాంతపు గుడియా రాజును గాధిగా కొందరు గుర్తించారు. గోవా ప్రాంతపు చరిత్రలో శతపథ బ్రాహ్మణము నందలి కొందరు బ్రాహ్మణులు కొంకణి ప్రాంతం చేరగా, వారి నాయకుడైన రాముడు తన పరశువును సముద్రమున విసరగా సముద్రముపై విస్తరించిన నేల నేటి గోవా ప్రాంతముగా పరశువు అంచు ఆకారంలో ఉన్నదనే ఇతిహాసం ఉంది. ఇప్పటికీ గోవాలో భూమికి సంబంధించిన కొన్ని పదములు సుమేరియన్ పదములై వుండడం గమనార్హం.

ఇరువది ఒక్కమార్లు వెదకి, వెదకి రిపుల శిరములను ఖండించి కొండలుగా పోగులు పెట్టి, రక్త నదుల పారించి, తొమ్మిది మడుగులు నింపిన పరశురాముడు, శివధనుస్సు విరిచెనని విని, కళ్యాణ రాముని అడ్డగించాడు. శ్రీరాముడు పరశురాముని తేజస్సును వైష్ణవ ధనుస్సుతో పాటు విరిచి అవతార సమాప్తిని సూచించెను.

(వైశాఖ శుక్ల తృతీయ మధ్యాహ్న సమయం శ్రీ పరశురామ జయంతి)

✧✧✧✧✧

# 36. ఆదర్శచరితం "రామావతారం"

శ్రీరాముని చరితం జగత్ కల్యాణ దాయకం. ఆబాల గోపాలానికి ఆయన కథ తెలుసు. రామకథ తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం కలగదు. అంతటి కమనీయం శ్రీరామావతారం. పితృవాక్య పరిపాలకునిగా, రాక్షస సంహారం చేసి వీరునిగా, ధర్మవేత్తగా, రామరాజ్య స్థాపకునిగా విలసిల్లిన శ్రీరాముడు ఆదర్శమూర్తి.

**వితరసి దిక్షురణే దిక్పతి కమనీయమ్**
**దశముఖ మౌలి బలిం రమణీయమ్**
**కేశవ ధృత రఘుపతి వేష జయజగదీశహరే**

– జయదేవ మహాకవి

వీరుడైన పరశురాముడు రాజులను చంపుతున్నప్పుడు అశ్మకుని కుమారుడైన మూలకుడు నారీ జనములచే రక్షింపబడినాడు. అందుకే అతడు నారీకవచుడయ్యాడు. నిర్మలమైన రవి వంశానికి మూలకారకుడు కావడంతో ఆయనను మూలకుడన్నారు. మూలకునకు విశ్వసహుడు, విశ్వసహునికి ఖట్వాంగుడు, ఖట్వాంగునికి దీర్ఘబాహువు, దీర్ఘబావునకు రఘువు, రఘువునకు పృథుశ్రవుడు, పృథుశ్రవునకు అజుడు, అజునకు దశరథుడు జన్మించారు.

## కౌసల్యా తనయుడు... పితృవాక్య పాలకుడు

పుత్ర కామేష్ఠి యాగము చేసి దశరథుడు కౌసల్య ద్వారా శ్రీరాముని, సుమిత్ర ద్వారా లక్ష్మణ, శత్రుఘ్నులను, కైకేయి ద్వారా భరతుని పుత్రులుగా పొందాడు. నారాయణుని అంశతో జన్మించిన శ్రీరాముడు, తండ్రి ఆజ్ఞమేరకు లక్ష్మణుని సమేతంగా విశ్వామిత్రుని యాగమును రక్షించడానికై వెళ్ళి తాటకి అనే రాక్షసిని, సుబాహుని చంపి, మారీచుని పారద్రోలి యజ్ఞాన్ని నిర్విఘ్నముగా పూర్తిచేశాడు. మూడు వందలమంది ఆయాసపడుతూ తెచ్చిన శివధనుస్సును రాముడు పైకెత్తి సునాయసంగా సంధించగా అది చెరకుగడ వలె విరిగి పడింది. స్వయంవరానికొచ్చిన సకల రాజులందరి సమక్షములో రాముడు వైదేహిని పరిణయమాడాడు. శివ ధనుస్సును విరిచిన వాని వెన్ను విరచెదనని వచ్చి, అడ్డగించిన పరశురాముని వైష్ణవ ధనుస్సు విరిచి అతని గర్వాన్ని తొలగించి, తిరోహితుని చేశాడు. ఆపైన సీతాసమేతంగా అయోధ్యకు చేరాడు. తండ్రిమాటను జవదాటక, పినతల్లి కోరిక మేరకు జానకి,

లక్ష్మణులతో శ్రీరాముడు అయోధ్య విడిచి అడవికి చేరాడు. తనను తిరిగిరమ్మని అర్థించిన భరతుని అయోధ్యకు పంపి తాను చిత్రకూటం చేరాడు.

## అరణ్యవాసం... సీతాపహరణం

దండకారణ్యములో రావణుని చెల్లెలు శూర్పణఖ శ్రీరాముని చూసి మోహించింది. తన కోర్కెను తీర్చమని పట్టుపట్టింది. అంతట లక్ష్మణుడు ఆమెను వారించి ముక్కు చెవులు కోసి పంపగా అదివిని ఖరదూషణాదులు 14 వేల మంది దండెత్తి వచ్చారు. వారిని తన బాణాగ్నితో శ్రీరాముడు భస్మీపటలం చేశాడు. సంగతి తెలిసిన రావణుడు, సీత సౌందర్యాన్ని తన చెల్లెలు ద్వారా విని మోహపడి, మారీచుని మాయలేడిగా పంపాడు. దానిని వెంటాడుతూ రాముడు దూరంగా వెళ్లాడు. రాముడి బాణం దెబ్బతిన్న మారీచుడు హా! సీతా! హా! లక్ష్మణా అని కేకలు వేస్తూ చనిపోతాడు. ఆ కేకలు రామునివిగా భ్రమించిన సీత నిష్ఠూరవాక్యములు సైపలేక లక్ష్మణుడు శ్రీరాముని వెదికేందుకు వెళతాడు. ఆ సమయం కోసం వేచియున్న రావణుడు సీతను చెరబట్టి, లంకకు తీసుకుపోతున్నప్పుడు జటాయువు అడ్డగిస్తాడు. రావణుడు ఆ జటాయువు రెక్కలు నరికి, ఆకాశ మార్గమున పోతున్నప్పుడు సీత తన నగలను మూటగట్టి మార్గమధ్యమున నేలపై పడవేసెను.

## వానరులతో స్నేహం - లంకపై సమరం

రామచంద్రుడు లక్ష్మణ సహితుడై సీతను వెదకుచూ రెక్కలు తెగి మరణావస్థలో ఉన్న జటాయువును చూసి విషయం తెలుసుకుంటాడు. పరలోక గతుడైన జటాయువుకు అంత్యక్రియలు చేసి, వాలిని వధించి, సీతను వెదుక బలవంతుడు, శౌర్యవంతుడు, మతిమంతుడు, ప్రాభవవంతుడు అయిన హనుమంతుని పంపుతాడు.

వాయు వేగమున మారుతి సముద్రము లంఘించి, లంకను చేరి సీతను కనుగొని, రాముని ఉంగరము నిచ్చి, అక్షకుమారాదుల వధించి, రావణుని బెదిరించి లంకను భస్మము గావించి తిరిగి రాముని చేరుకొని, సీతా వృత్తాంతం తెలియజేస్తాడు. రాముడు అపార వానర సమేతంబుగా సముద్రతీరమును చేరి, లంకకు దారిమ్మని సముద్రుని వేడుకుంటాడు. మౌనము వహించిన సాగరుని చూసి రాముడు ఆగ్రహంతో ధనుస్సు, బాణాలు అందుకుంటాడు. అంతట గుల్లలు, నాచులు, చిప్పలు, పెల్లలునై జలధి పెద్ద బీడుగా మారింది. విపన్నుడైన సముద్రుని విన్నపము లాలించి యథాపూర్వమైన సముద్రముపై సేతువుకట్టి లంకకు వెళతాడు శ్రీరాముడు.

ప్రాకారంబుల ద్రవ్వి, పరిఖలు పూడ్చి, కోటను నేలగూల్చి, వాకిళ్ళు పెకలించి, తలుపులు విరిచి యంత్రముల నుగ్గు నుగ్గు చేసి గృహముల నాశనము చేసి వానరులు లంకలో ప్రవేశిస్తారు.

## రావణ సంహారం

ఆ పిదప జరిగిన ఘోర యుద్ధమున కుంభ, నికుంభ, దూమ్రాక్ష, విరూపాక్ష, సురాంతక, నరాంతక, దుర్ముఖ, ప్రహస్త మహాకాయులను రాక్షసులు, కుంభకర్ణుడు, మేఘనాథుడు మరణించిరి. తన వారందరూ మరణించిన తర్వాత రావణుడు పుష్పక విమానం ఎక్కి రామునితో అతి రౌద్రముగా యుద్ధానికి దిగుతాడు. దేవేంద్రుడు పంపగా మాతలి తెచ్చిన దివ్య రథమును ఎక్కి శ్రీరామచంద్రుడు ఒక మహాబాణమున రావణుని హృదయము చీల్చి నేలకూల్చెను.

విభీషణునిచే రావణుని అంత్యక్రియలు గావించి, అశోక వనమునకేగి శింశుపా వృక్ష సమీపమున తన రాకకై చూస్తూ, శుష్కించి వున్న సీతను చూస్తాడు శ్రీరాముడు. భార్యవలన దోషంబు లేకుండుటకు సీతను అగ్ని ప్రవేశం చేయించి, ఆమె అగ్నిపునీత కావడంతో స్వీకరిస్తాడు. విభీషణుని లంకకు రాజుని చేసి సీతా లక్ష్మణ సమేతుడై సుగ్రీవ హనుమాదులతో పుష్పకవిమానంబున నంది గ్రామమునకు వచ్చెను. తనకై వేచియున్న భరతుని తీసుకొని అయోధ్యకు చేరుకుంటాడు.

## రామరాజ్యం - జగతికి మోదం

శ్రీరాముడు పట్టాభిషక్తుడై జగత్పూజంబుగా రాజ్యం చేస్తున్నప్పుడు త్రేతాయుగము కృతయుగ ధర్మముతో వర్థిల్లింది. శ్రీరామచంద్రుడు అందరికీ తండ్రిలా ప్రజలను కాపాడాడు. రామరాజ్యం స్థాపించాడు. ఒకనాడు వసుధపై బుట్టెడి వార్తలు వినుటకు రాముడు మారువేషములో తిరుగుతున్నప్పుడు నగర జనులలో ఒకడు పరుల ఇంట కాపురమున్న చంచలురాలిని చేపట్టుటకు, నేను వెర్రి రాముని కానని పలికిన పలుకులు విని, గర్భిణి అయిన సీతను వాల్మీకి మహర్షి పర్ణశాల యందు అర్థరాత్రివేళ విడిచిరా అని లక్ష్మణునికి ఆజ్ఞనిచ్చెను.

## అవతార ఉపసంహారం

ఆ ఆశ్రమమందు సీత కుశలవులనే కుమారులకు జన్మనిచ్చింది. వారు వాల్మీకి వలన వేదాది విద్యలందు నేర్పరులై, పెక్కు సభల రామకథా శ్లోకాలు పాడుతూ, ఒకనాడు రాఘవేంద్రుని యజ్ఞశాలలకు వెళతారు. వారిని చూసి అచ్చెరువొందిన

రాముని వద్దకు వాల్మీకి మరునాడు సీతను తీసుకువస్తాడు. మౌనముగా నున్న శ్రీరాముని చూచి సీత కుశలవులను వాల్మీకికి అప్పగించి రామచంద్రుని ధ్యానించుచు తన తల్లియైన భూమాత ఒడిని చేరెను. శ్రీరాముడు తరువాత 11 వేల ఏళ్లు ఒంటరిగా జీవిస్తూ, రాజ్యాన్ని సుభిక్షంగా పాలిస్తాడు. ఆపైన అగ్నిహోత్రాలు చెల్లించి తానే స్వయంగా దేవదేవుడు కావడంతో వైకుంఠాన్ని చేరుకుంటాడు.

**నల్లనివాడు, పద్మనయనంబులవాడు, మహాశుగంబులున్**
**విల్లును దాల్చువాడు, కడు విప్పగు వక్షము వాడు, మేలుపై**
**జల్లెడు వాడు, నిక్కిన భుజంబుల వాడు, యశంబు దిక్కులం**
**జల్లెడు వాడునైన రఘు సత్తము డిచ్చు తమాకభీష్టముల్**

సద్గతులకు మంతనములు, ఘనములైన పుణ్యములకు పొంతనములు, పూర్వమహాఘనికృంతనములు రామ నామ కృత చింతనములు. (చైత్ర శుక్ల నవమి, మధ్యాహ్న సమయము, అయోధ్య యందు శ్రీరామజయంతి)

✧✧✧✧✧

# 37. నవరస భరితం "శ్రీకృష్ణావతారం"

కృష్ణావతారం నవరసభరితం. యశోదకు నోటిలో భువనభాండాలు చూపినా, గోవర్ధన గిరినెత్తి గోకులాన్ని కాపాడినా, కంసుని వధించి శౌర్యం చూపినా, గోపికా మనోహరుడైనా, మిత్రునిగా కుచేలునికి ఆప్యాయతామృతం పంచినా, కురుక్షేత్రంలో విజయునికి సారథిగా నిలిచినా ఆ నందగోపాలుని లీలలు మహాద్భుతాలు. తత్త్వ సారాలు. ఆద్యంతం మధురాలు. కృష్ణావతార విశేషాలు ఈ వారం ప్రత్యేకం.

**వహసి వపుషి విశదే వసనం జలధానమ్**
**హలహతి భీతి మిలిత యమునాభమ్**
**కేశవధృత హలధర రూప జయజగదీశ హరే**

– జయదేవ మహాకవి

భగవానుడు సర్వలోకాలను సృజించాలనే ఆలోచనతో మహత్తు, అహంకారము, పదహారు కళల (కర్మేంద్రియాలు, జానేంద్రియాలు కలిపి పది, మహాభూతములు అయిదు, మనస్సు మొత్తం పదహారు అంశలు)తో దేదీప్యమానంగా వెలుగొందే రూపంతో, మహాజల రాశి మధ్య యోగనిద్రలో ఉన్నాడు.

## కమలనాభుని యోగనిద్ర

ఆ ప్రళయ కాలమందు సమస్త ప్రపంచము నీటితో నింపిన మహాసముద్రము వలె ఉంది. అప్పుడు సమాధిరూప యోగనిద్రలో ఉన్న నారాయణుని నాభి కమలం నుంచి బ్రహ్మ ఉదయించాడు. బ్రహ్మ మానసపుత్రుడైన అత్రి మహామునికి సోముడు, సోమునికి బుధుడు, బుధునికి పురూరవుడు, పురూరవునికి ఆయువు, ఆయువునకు నహుషుడు, నహుషునికి యయాతి, యయాతికి దేవయాని వలన యదువు జన్మించారు. యయాతి దేవయాని వద్ద దాసిగా వున్న రాకుమారి శర్మిష్ఠను రహస్యముగా వివాహమాడిన విషయము తెలిసిన దేవయాని తండ్రి శుక్రాచార్యుడు కోపించి యయాతిని వృద్ధుడవు కమ్మని శపించెను. తన యవ్వనమును ఇచ్చి వృద్ధాప్యమును స్వీకరించిన కడగొట్టువాడు శర్మిష్ఠ కుమారుడైన పూరునికి భూలోకమునిచ్చి, నిరాకరించిన యదువుకు అతని వంశీయులకు రాజ్యార్హత లేకుండా పోవాలని యయాతి శపించాడు.

## దేవకి గర్భాన జననం

ఆ యదువంశజుడైన వసుదేవుని భార్య దేవకి. దేవకి అన్న కంసుడు, తన చెల్లెలు మరిదిని వివాహ సమయంలో రథముపై ఎక్కించుకుని ఊరేగిస్తుండగా "నీ

చెల్లెలి అష్టమ గర్భం నిన్ను సంహరించును" అని ఆకాశవాణి పలికింది. ఆ మాటలు విని చెల్లెలిని చంపేందుకు కంసుడు సిద్ధం కాగా, వాసుదేవుడు ఆమెను విడిచిపెడితే ఆమె కుమారులను నీకిస్తానని ప్రాధేయపడతాడు. కంసుడు కఠినాత్ముడై దేవకికి జన్మించిన ఆరుగురిని చంపుతాడు. ఏడవ కాన్పును యోగమాయ భగవానుని ఆనతి మీద దేవకి గర్భము నుంచి తీసి, నందగోకులమున రక్షణలో ఉన్న వసుదేవుని మొదటి భార్య గర్భములో జేర్చింది. రోహిణికి జన్మించిన ఆ పుత్రుడు బలరాము డయ్యాడు. దేవకి ఏడవ గర్భము పోయిన తరువాత ఆ దేవదేవుడు దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం దేవకి అష్టమ గర్భమున శ్రావణ బహుళ అష్టమి రాత్రి రోహిణి నక్షత్రంలో చెరసాలలో జన్మించాడు. అదే సమయములో యోగమాయ నందుని భార్య యశోదకు కుమార్తెయై జన్మించింది.

## కంసా... నిన్ను చంపేవాడు పుట్టాడు

వసుదేవుడు హరివల్ల కర్తవ్యం తెలుసుకొని, ఎవరికంటా పడకుండా, యమున దారి ఇవ్వగా దాటి, నందుని మందను చేరాడు. నిద్రపోతున్న యశోద చెంత ఆ నల్లనయ్య నుంచి, ఆమె కూతురుని ఎత్తుకొని చెరసాల చేరి, ఏమీ ఎరుగనట్టు ఆ పసికందును దేవకి పక్కన ఉంచగా ఆ పసిపాప ఆవురని ఏడ్వగా కావలి వారు ఆ విషయాన్ని కంసునికి చేరవేశారు. కోడలిని చంపకు అన్నా అని దేవకి వేడుకున్నా... కంసుడు ఆ చిట్టిపట్టిని తలక్రిందులుగా పట్టి నేలకు విసిరి కొట్టగా, ఆ బాలిక నేలపై పడక... ఆకాశానికెగిరి "ఔరా! కంసా! తెంపరివై దేవకీదేవి బిడ్డలు చిన్న కుర్రలను చంపితివి. నిన్ను చంపెడు వాడు నా సరసన జన్మించి ఉన్నాడు" అని పలికి అదృశ్యమైంది.

## పూతనను దునుమాడి...

నందుడు ఏమి నోము ఫలమో అనుకుంటూ పూజలు చేయించాడు. గోపికలు బాల కృష్ణునికి జోల పాడారు. అయితే కంసునికి కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఆ శిశువును మట్టుపెట్టేందుకు మార్గాలను అన్వేషించసాగాడు. పూతన– కామరూపిణిగా, శకటాసురుడు– బండి, తృణావర్తుడు– సుడిగాలి రూపాలలో వచ్చి కృష్ణుని చంపాలని ప్రయత్నించి, కృష్ణుని చేతిలో వారే అసువులు బాశారు. రోహిణీ, యశోదా నందనులకు గర్గుడు నామకరణము చేశాడు. రోహిణీ కుమారునికి బలరాముడని, దేవకి తనయునికి నల్లని (కృష్ణ) రంగున్నవాడు కనుక కృష్ణుడని నామకరణం చేశారు.

## ఆ లీలలు... అత్యంత మధురాలు

బాల్యంలో శ్రీకృష్ణుని లీలలు తత్త్వసారాలు. మన్ను తిన్నావా అని యశోద

అల్లరి కృష్ణుడిని అడిగింది. బాలకృష్ణుడి నోటిలో పదునాలుగు భువన భాండంబులు చూసి కలయో వైష్ణవ మాయయో అని ఆశ్చర్య చకితురాలైంది. కృష్ణుని అల్లరితో అలసిన యశోద బాలకృష్ణుని రోటికి బంధించింది. బాలుడైన బాలకృష్ణుడు ఆ రోటిని సునాయాసంగా ఈడ్చుకుంటూ సాలవృక్షాలను కూల్చి చెట్ల రూపములో ఉన్న శాపగ్రస్తులైన నలకూబర, మణిగ్రీవులకు శాప విమోచనం చేశాడు. బ్రహ్మదేవుడు తన మాయాశక్తితో గోపాలక గోవులను అదృశ్యం చేయగా తానే అన్ని రూపాలలో కనపడ్డాడు కృష్ణుడు. బ్రహ్మ ఆశ్చర్యంతో శ్రీకృష్ణుని విష్ణు అంశగా తెలుసుకొని స్తుతించాడు.

## గోవర్ధన గిరిధారీ

శ్రీకృష్ణుడు కాళింది మడుగును విషమయంగా మార్చిన కాళీయుడనే సర్పమర్దనం చేశాడు. గోపికా సంఘములను కార్చిచ్చు నుంచి రక్షించాడు. శ్రీకృష్ణుడు గోపికా వస్త్రాపహరణము గావించి వారికి ప్రసన్నుడై వరములిచ్చాడు. ఇంద్రయాగమును ఆపించి, గిరిపూజ చేయించగా, అందుకు కోపోద్రిక్తుడైన ఇంద్రుడు సంవర్తక మేఘములను పంపి ప్రచండ వర్షము కురిపించాడు. దీని నుంచి గోపాలకులను రక్షించడానికై గోవర్ధన పర్వతమును చిటికెన వేలుపై ఏడు రాత్రింబవళ్ళు నిలిపాడు. మధురలో ప్రవేశించి, కువలయాపీడమను ఏనుగును చంపి చాణూర, ముష్టికులను మల్లయోధులతో తలపడి చాణూరుని కృష్ణుడు, ముష్టికుని బలరాముడు వధించారు. శ్రీకృష్ణుడు కంసుని వధించాడు. మాతామహుడైన ఉగ్రసేనునికి పట్టం కట్టపెట్టాడు.

## సాందీపుని వద్ద విద్యాభ్యాసం

ఉపనయనానంతరం బలరామ, కృష్ణులు కాశీ నగరము చేరి సాందీపుడనే పండితుని వద్ద సకల విద్యలు అభ్యసించారు. గురుపుత్రుడు ప్రభాస తీర్థములో నీటిలో మునిగి మరణించగా, రామకృష్ణులు యమపురికి వెళ్ళి యముని దర్శించి గురునందనుని బ్రతికించి గురుదక్షిణగా ఇచ్చారు. కంసుని భార్యలైన అస్తియు, ప్రాప్తియు తమ భర్త మరణమునకు శోకిస్తూ తన తండ్రి జరాసంధునితో మొరపెట్టుకున్నారు. అతను ప్రళయాగ్ని వలె మండిపడి మధురపై దండెత్తి, యుద్ధములో ఓడి వెనక్కు మళ్లాడు.

## దుర్భేద్యంగా మధుర నిర్మాణం

కాలయవనుడు మూడుకోట్ల మ్లేచ్ఛ వీరులతో మధురను ముట్టడించే ప్రయత్నం చేయగా కృష్ణుడు సముద్రుడు, విశ్వకర్మ సహాయముతో సముద్రము

మధ్యలో 12 యోజనముల పొడవు, వెడల్పు గల ద్వారకను నిర్మించాడు. మధురానగర ప్రజలందరిని ద్వారకలో చేర్చాడు. ఆపై నిరాయుధుడిగా కాలయవనునికి ఎదుట నిలిచాడు. ఆతడు శ్రీకృష్ణుని వెంటపడ్డాడు. శ్రీకృష్ణుడు మాంధాత కుమారుడైన ముచికుందుని గుహలోకి వెళ్ళి అదృశ్యమయ్యాడు. వెంట తరుముకు వచ్చిన కాలయవనుడు నిద్రలో ఉన్న ముచికుందుడు అనే ఋషిని శ్రీ కృష్ణునిగా భావించి పాదంతో తన్నాడు. దాంతో నిద్రలేచిన ముచికుందుడు అగ్నిహోత్రుడై దృష్టి సమిద్ధ విగ్రహోత్పన్న మహాగ్నితో యవనుని భస్మం చేశాడు. కాలయవనుని కడతేర్చిన తర్వాత మరల మగధేశ్వరుడైన జరాసంధుడు మూడు అక్షౌహిణిల సేనతో దండెత్తి వచ్చాడు. దాంతో బలరామకృష్ణులు యుద్ధం చేయకుండా అడవులలోకి పారిపోయారు. జరాసంధుడు ఆ అడవికి నిప్పు పెట్టాడు. బలరామకృష్ణులు మరణించి ఉంటారని భావించి వెనక్కు మళ్లుతాడు.

## గోపికా మనోహరుడు

హరికి రుక్మిణి, సత్యభామ, జాంబవతి, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణ అనే 8 మంది భార్యలున్నారు. నరకాసురుని సంహరించి అతను చెరపట్టిన 16 వేల కన్యలను వారి కోరికపై కృష్ణుడు పరిగ్రహించాడు. బాణుని ఓడించి, పౌండ్రక వాసుదేవుని శ్రీ కృష్ణుడువధించాడు. ధర్మరాజు తలపెట్టిన రాజసూయ యాగమును దిగ్విజయముగా చేయించాడు శ్రీకృష్ణుడు. భీమునితో జరాసంధుని చంపించి రాజసూయ యాగంలో అగ్రపూజలందుకున్నాడు. అగ్రపూజను ఆక్షేపించిన శిశుపాలుని చక్రాయుధంతో వధించాడు. మధురపై దండెత్తిన సాల్వుని చంపిన శ్రీకృష్ణుడిని, దంతవక్రుడు అతి భీషణాహంకారముతో ఎదుర్కొని కృష్ణుని చేతిలో మరణించాడు.

## గీతార్థసారం

కురుక్షేత్ర మహాసంగ్రామంలో శ్రీకృష్ణుడు పాండవ పక్షపాతిగా నిలుస్తాడు. విజయునికి గీతను బోధించి యుద్ధోన్ముఖుడిని చేస్తాడు. వారికి విజయం చేకూరుస్తాడు. తన వద్దకు అర్థియై వచ్చిన కుచేలుని అనుగ్రహిస్తాడు శ్రీకృష్ణుడు. ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుని చూసేందుకు బ్రహ్మాది దేవతలు వస్తారు. ఓ దేవదేవా మీరు భూలోకంలోకి వచ్చి 125 సంవత్సరాలు అయింది. ఈ అవతారం చాలించి, ద్వాపర యుగాంతంలో వైకుంఠానికి విచ్చేయాల్సిందిగా కోరతారు. హరి సరే అని వారిని సాగనంపుతాడు. ఆపైన కాలం సమీపించిందని గ్రహించి, యాదవులను ద్వారక నుంచి ప్రభాస తీర్థానికి పంపుతాడు శ్రీకృష్ణుడు- 'నేటికి ఏడవ రోజున సముద్రుడు ద్వారకను

ముంచివేస్తాడు. యదుక్షయం జరుగుతుంది. కలియుగం మొదలౌతుంది'- అని శ్రీకృష్ణుడు ఉద్దవునితో అంటాడు. యాదవులు మదిరాపాన మత్తులై ఒకరినొకరు సముద్రపు ఒడ్డున పెరిగి ఉన్న తుంగతో కొట్టుకొని మరణిస్తారు. మునిశాపం తీరిందని బలరామకృష్ణులు విచారిస్తారు. ఇద్దరూ వేరువేరు తోవలలో మహాప్రస్థానాన్ని ప్రారంభిస్తారు.

## మహా ప్రస్థానం

శ్రీకృష్ణుడు మరో మార్గంలో బయలుదేరతాడు. కొంత దూరం వెళ్లి ఒక నికుంజ పొద చాటున విశ్రమిస్తాడు. ఒక వేటగాడు పొదమాటున ఉన్న ఆ దేవదేవుని చరణ కమలాలను లేడి చెవులుగా భ్రమించి బాణం వేస్తాడు. ఆపైన తను చేసిన తప్పు తెలుసుకున్న బోయవాడు నిలువెల్లా వణికిపోతూ శ్రీకృష్ణుని వద్దకు వస్తాడు. అతడిని సముదాయించి, పవిత్రాంతఃకరణుడై ప్రాయోపవేశం చేసి, ప్రాణములు వదిలి, వైకుంఠ పద ప్రాప్తుడయ్యాడు శ్రీకృష్ణుడు. శ్రీ కృష్ణ పరమాత్మ (125 సంవత్సరముల 7 మాసములు జీవించాడు. క్రీస్తుపూర్వము 3102 నిర్యాణ సంవత్సరము కాగా ఆరోజే కలియుగము ప్రారంభమైంది.

✧✧✧✧✧

# 38. నిర్వాణ బోధకుడు "బుద్ధ భగవానుడు"

దశావతారాల్లో బుద్ధావతారం గురించి కొన్ని భిన్నమైన వాదనలు ఉన్నప్పటికీ కలియుగంలో భక్తి, ధర్మాచరణ, జ్ఞానంపై శ్రద్ధ సన్నగిల్లుతున్నప్పుడు, ధర్మాన్ని కాపాడేందుకు అవతరించిన మహనీయుడు బుద్ధభగవానుడు. జీవితంలో కష్టాలకు స్వస్తి చెప్పి, ఆనందంగా జీవించేందుకు తోడ్పడే అష్టాంగమార్గాన్ని సూచించాడు బుద్ధుడు. అజ్ఞానాన్ని వీడి, ధర్మపథాన్ని అనుసరిస్తే కైవల్యం లభిస్తుందనే బుద్ధుని జీవిత విశేషాలు, తత్త్వసారం.

**నిందసి యజ్ఞ విధే రహహ శ్రుతి జాతమ్**
**సదయ హృదయ దర్శిత పశుఘాతమ్**
**కేశవ ధృత బుద్ధ శరీర జయజగదీశహరే**

– జయదేవ మహాకవి

**యసాంభ్యసి శయానస్య యోగనిద్రాం వితన్వతః**
**నాభి హృధాంబుజా దాసీద్బ్రహ్మ విశ్వసృజాంపతిః**

ప్రళయకాలంలో సమస్త ప్రపంచం ఒకే జలరాశిగా ఉన్నపుడు యోగనిద్రలో ఉన్న భగవంతుని నాభి కమలం నుంచి బ్రహ్మ, అతని అవయవ స్థానముల నుంచి లోకాలు జనించాయి. ఆ జగద్రక్షణకు భగవానుడు మొదటి అవతారములో ఎల్లప్పుడూ బాలకులై వుండే సనక, సనంద, సనాతన, సనత్కుమారులుగా జన్మించి బ్రహ్మచర్యము పాటించారు. రెండవసారి యజ్ఞవరాహమూర్తిగా, మూడవసారి నారదునిగా, నాల్గవసారి నరనారాయణునిగా, అయిదవ జన్మలో కపిలునిగా, ఆరవసారి దత్తాత్రేయునిగా, ఏడవసారి యజ్ఞుడిగా, ఎనిమిదవ జన్మలో యురుక్రమునిగా అవతరించారు. తొమ్మిదవ జన్మలో పృథుచక్రవర్తిగా, పదవసారి మీనావతారమును, పదకొండవ జన్మలో కూర్మావ తారమును దాల్చాడు. 12వది ధన్వంతరీ అవతారము. 13వది మోహినీ స్వరూపము, 14 నరసింహావతారము, 15 వామనుడు, 16 పరశురాముడు, 17 వ్యాసావతారం, 18 శ్రీరామావతారం, 19, 20 బలరామకృష్ణులుగా, 21 బుద్ధుని జన్మ.

**జినసుతుడు... బుద్ధుడు**

"బుద్ధోనామ్నా జినసుతః కీకటేషు భవిష్యతి". కలియుగం బాగా వ్యాపించి నపుడు దేవతల శత్రువులైన రాక్షసులను సమ్మోహన పరచేందుకు జినసుతుడై బుద్ధనామమున అవతరించాడు. దుష్టశిక్షణ చేసి, శిష్ట రక్షణ చేయని కారణంగా బుద్ధునిది అవతారంగా కొందరు అంగీకరించరు. శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలో దశావతార వర్ణనలో

**మీనాకృతే కమఠ కోల నృసింహవర్ణిన్**
**స్వామిన్ పరశ్వథ తపోధన రామచంద్ర**
**శేషాంశరామ యదునందన కల్కిరూప**
**శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్**

అని చెప్పారు. ప్రాచుర్యంలో మాత్రం శుద్ధోదన, మాయాదేవి పుత్రుడైన గౌతమసిద్ధార్థుడే బుద్ధుడైన తరువాత బుద్ధావతారంగా స్వీకరించారని ఎక్కువగా వ్యాప్తిలో ఉంది.

కలియుగంప్రబలింది. జీవహింస ఎక్కువైంది. ప్రజలలో భక్తి, ధర్మాచరణ, జ్ఞాన విషయాలపై శ్రద్ధ తగ్గుతున్నది. అప్పుడు దేవతల శత్రువులైన రాక్షసులను సమ్మోహన పరచడానికి శ్రీహరి జినసుతుడై బుద్ధుడనే పేరుతో తేజరిల్లుతాడు అని భాగవతములో చెప్పారు. (అయితే ఈ బుద్ధుడు గౌతమ బుద్ధుడు కాదని కొందరి వాదన)

## లోకకల్యాణ కారకుడు

కపిలవస్తునగరంలో శుద్ధోదన మాయాదేవి దంపతులకు భగవానుడు సిద్ధార్థుడై జన్మించాడు. తెల్లని ఏనుగును స్వప్నంలో చూచిన మాయాదేవికి సర్వశుభ లక్షణ శోభితుడై పుట్టిన సిద్ధార్థుని చూసిన జ్యోతిష పండితులు ఈతడు మహారాజు కాగలడు లేదా సన్యాసియై లోకకల్యాణ కారకుడు కాగలడని చెప్పారు.

కష్టాలు కనీసం కంటపడకుండునట్లు పెరిగిన సిద్ధార్థుడు యశోధరను వివాహమాడగా రాహులుడు అను పుత్రుడు కలిగెను. సిద్ధార్థుడు ఒకసారి నగరం చూడడానికి వెళ్ళినపుడు వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని, వృద్ధుని, చనిపోయినవారిని వేర్వేరు చోట్ల చూసి, విచలిత మనస్కుడై అమరత్వశోధనలో, రాజభవనమును, భార్యా బిడ్డలను వదలి అర్ధరాత్రి సమీపంలోని అరణ్యములోకి తపస్సు చేయడానికి వెళ్ళాడు.

## అష్టాంగమార్గం... ఆనంద ధామం

బోధివృక్షము క్రింద జ్ఞానోదయమై సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. మానవుడు సుఖదుఃఖ క్లేశములు వదలి నిర్వాణము చెందడానికి అష్టవిధ మార్గమును సూచించాడు. గౌతమబుద్ధుడు ప్రవచించిన నాలుగు నిత్య సత్యములు.

1. బాధవున్నది. 2. దానికి కారణము – కోరిక, 3. కోరికను జయించ వచ్చును, 4. దానికి మార్గము కలదు. అదే అష్టవిధ మార్గము. 1. మంచి భావనము,2. మంచి భాషణము, 3. మంచి యోచనము, 4. మంచి జీవనము, 5. మంచి ధ్యానము, 6. మంచి నిర్ణయము, 7. మంచి నడవడిక, 8. మంచి (సమ్యక్) ఆత్మ పరిశీలనము ఇదే అష్టాంగ మార్గము.

## కర్మ... అజ్ఞానం... కష్టాలకు మూలం

బౌద్ధమతము ఆశను కలిగించే మతము. మానవత్వముతో కూడినది. మనం చేసే పనులన్నీ కర్మ, అజ్ఞానముపై ఆధారపడి ఉన్నాయి. అజ్ఞానము నుంచి కర్మ, చేతనావస్థ, పేరు ప్రతిష్ఠ, ఇంద్రియ జ్ఞానము, సంపర్క సంబంధములు, కోరిక, అనుబంధము, జీవిత గమ్యం, పుట్టుక ఒక దాని నుంచి ఒకటి కలుగుతున్నాయి. పుట్టుక మీదనే దుఃఖము, ఏడ్పు, బాధ, చింతలు, నిరాశ, వృద్ధాప్యం, మృత్యువు ఏర్పడుతున్నాయి.

ఈ కార్యకారణ తత్త్వము అర్థమైతే ఈ బాధలకు పరిష్కారము, మార్గము అర్థమైనట్లే కదా! ఈ బాధలన్నింటికి మూలకారణము అజ్ఞానం. అష్టాంగ మార్గము అజ్ఞానమును అధిగమించి, చావు పుట్టుకలు లేని నిర్వాణ మార్గాన్ని చేరే జ్ఞానమార్గాన్ని సూచిస్తుంది. ధమ్మ పదాన్ని అనుసరించిన వ్యక్తులు మరో జన్మ లేని అనంతమైన నిర్వాణాన్ని పొందుతారు.

## నేను మెలకువను...

బుద్ధుని ఎవరో అడిగారు! 'నీవు దేవుడివా?' 'కాదు'. 'దేవదూతవా?' 'కాదు'.

మరెవరివి? నేను జాగ్రదవస్థను, మెలకువను అని సమాధానమిచ్చాడు బుద్ధుడు.

క్రీస్తుపూర్వం 560లో జన్మించి 80 ఏళ్ళు జీవించి అహింసను పరమధర్మంగా ప్రబోధించి, హిందూదేశపు ప్రజలకు ఆరాధ్యమై, అనేక ప్రాచ్య దేశములలో (టిబెట్, చైనా, జపాన్, థాయ్‌లాండ్) ప్రజలను ప్రభావితం చేశాడు బుద్ధుడు.

(పౌష్య శుక్ల సప్తమి సాయంకాలం గయా క్షేత్రములో శ్రీ బుద్ధుని ఉద్భవ తిథిగా వరాహ పురాణమందు పేర్కొన్నారు).

**బుద్ధం శరణం గచ్ఛామి**
**ధర్మం శరణం గచ్ఛామి**
**సంఘం శరణం గచ్ఛామి**

జరావ్యాధి మృత్యు దృశ్యములతో ప్రభావితుడై, 29వ యేటనే ప్రాపంచిక సుఖ త్యాగము చేసి, అరణ్యములకేగి, ఆరేళ్ళు తపస్సు చేసి, శుష్క శల్యావస్థలో ఉన్నపుడు, బోధివృక్షము క్రింద జ్ఞానోదయమై, బుద్ధుడై జ్ఞానకాంతులను సమస్త ప్రజలకు అందించిన ఆ భగవానుని మార్గము అనుసరించిన వారికి చావు పుట్టుకలు లేని నిర్వాణము లభిస్తుంది.

✧✧✧✧✧

# 39. కలియుగ రక్షణే పరమార్థం
# "కల్కి అవతారం"

సంభవామి యుగేయుగే అంటూ ఆ పరాత్పరుడు ప్రతి యుగంలో ఒక్కో అవతారం ఎత్తి అద్భుతాలు చేశాడు... ధర్మాన్ని కాపాడాడు. కలియుగంలో దుష్టశిక్షణ, శిష్ట రక్షణకు ఆ పరంధాముడు కల్కిగా అవతరించనున్నాడు. ఇది భవిష్యదవతారం. అధర్మం పెచ్చుమీరినప్పుడు కల్కి తన కరవాలంతో దుష్టులను దునుమాడనున్నాడు. దశావతారాల్లో చివరిదైన కల్కి అవతారం విశేషాలు...

**మ్లేచ్ఛ నివహ నిధనే కలయసి కరవాలమ్**
**ధూమకేతు మివకిమపి కరాలమ్**
**కేశవధృతి కల్కి శరీర జయజగదీశ హరే**

– జయదేవ మహాకవి

యుగసంధిలో రాజులు దొంగలై సంచరించసాగారు. వారిని అణచేందుకు శంబల గ్రామంలో విష్ణుయశునకు శ్రీ భగవానుడు కల్కి అను పేరున జన్మించనున్నాడు. కల్కి అవతారం భవిష్యదవతారం.

**అధాసౌ యుగసంధ్యాయాం**
**దస్యుప్రాయేషు రాజసు**
**జనితా విష్ణు యశసో నామ్నా కల్కిః**
**జగద్గురుః !!**

మహాసరస్సులోకి ప్రవేశించే నదులవలె, సముద్రములోని అలలవలె అవతారాలు అసంఖ్యాలు అని శ్రీ మద్భాగవతం పేర్కొంటున్నది. కృష్ణుడు ఉన్నంత కాలం భూమిపై కలి అడుగిడడు. హరి పరమపద ప్రాప్తుడైన తరువాత మాఘా నక్షత్రము సప్తర్షి మండలాంతర్గతంగా కనిపించిన రోజు నిశా సమయమున కలి ప్రవేశించిన పిదప కలియుగం ఆరంభమయింది.

## కలియుగ విశ్వరూపం

కలియుగంలో రాజులు ధర్మ సత్య దయా హీనులై, క్రోధ మత్సరాలతో స్త్రీలను, బాలలను చంపుతూ, పరధన, పరస్త్రీ లోలులై రజస్తమోగుణ రహితులై, తమలో తాము కలహించుచున్నపుడు ప్రజలు కూడా వారిని అనుసరించసాగారు. ఫలితంగా రోజురోజుకూ ధర్మం నశించసాగింది. ధనవంతుడే రాజవుతాడు.

బలవంతుడే గుణవంతుడుగా మెప్పునందుకుంటాడు. ధనము, బలము కలిగినవాడే రాజగును. ప్రజలు అల్పాయుష్కులవుతారు. రాజులు చోరులై ప్రజలను దోపిడీ చేస్తారు. వర్షములు పడవు. సస్యములు పండవు. భూములను ఆక్రమించి, గర్వాంధులైన నరపతులను చూసి భూమి ఫక్కున నవ్వును. ఈ భూమికి తామే నాథులమని విర్రవీగే వారిని మోహమున పితృపుత్ర సోదరులకు భ్రాంతి కలుగజేసి, అన్యోన్య వైరానుబంధాల కలహములు కలిగించి ఒకరిచేతిలో మరొకరు మరణించేలా చేయును.

## కల్కి జననం

శంతనుని అనుజుడు దేవాపి, ఇక్ష్వాకుల వంశస్థుడగు మరుత్తముడు యోగయుక్తులై కలాప గ్రామనివాసులై ఉన్నారు. దుష్టులను దునుమాడి, శిష్టులను రక్షించేందుకు ముకుందుడు శంబల గ్రామమున విష్ణుయశుడను మునికి కల్క్యవతారుడై జన్మించును. దుష్టమ్లేచ్ఛ జనంబులను తన మండలాగ్రమున ఖండించు నపుడు భూమి మ్లేచ్ఛరహితమై తేజరిల్లును.

భగవంతుడైన విష్ణువు లోకములకేనాడైతే రాక్షస వ్యథ కలుగుతుందో, ఆవేళల్లో

**"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం**
**ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగేయుగే"** అన్నట్లు జన్మిస్తారు.

## ఆయన రాక... ఏరువాక

భగవానుడు మరలా జన్మించి సజ్జనులకు న్యాయం చేస్తాడని అన్ని మతముల వారి విశ్వాసం. జడ్జిమెంట్ డే – అంతిమ తీర్పు వచ్చే రోజు త్వరలో రానున్నదని అందరూ నమ్ముతారు. "ఆ ప్రభువు వచ్చే రోజు ఆసన్నమైనది. ఆత్మలను కదిలించే నాదంతో అద్భుత ఘోషణలతో, ఆకాశం నుంచి జ్వాజ్వల్యమైన కోటిసూర్య ప్రభాకాంతితో దేవదేవుడు రానున్నాడు. మృతులైన ఆయన భక్తులు ముందుగా ఆయనను దర్శించగలరు. సజీవులుగా వున్న ఆయన విశ్వాసులు మేఘమండలాన ఆయన సన్నిధిని చేరగలరు"

– థెస్సాలోనియనులు–పవిత్రగ్రంథం–బైబిలు

"ఆదియు నేనే అంతము నేనే! నేనే తొలి అక్షరమును. నేనే చివరి అక్షరము కూడా. దాహముకొన్న వారికి నన్ను అనుసరించిన వారికి జీవ జలమునిచ్చెదను. విజేత అతడే. ఎవరైతే నన్ను నమ్మకయుండి నానావిధములుగా చోరులై, జారులై, అసత్య మార్గమున చరించెదరో వారు గంధకాగ్నిలో భస్మము చేయబడి ద్వితీయ మరణం పొందుతారు"

– రివెలేషన్–22–బైబిల్ కొత్త నిబంధన

## అవతారాలు వేరు... సారం ఒకటే

ఈ భవిష్యదవతారములు వేర్వేరు మతముల వారికి వేర్వేరు రూపములుగా ఉన్నను... సారాంశము ఒక్కటే. ఈజిప్టు ప్రాచీన ప్రజల నమ్మకము ప్రకారం నన్ అనే చీకటి నీటి గుయ్యారము నుంచి అన్ని రకముల జీవులు ఉద్భవించాయి. పరమేశ్వరుడు ఆ నీటిపై ఆత్మవలె ఉండగా, దుష్టశక్తులు అపెప్ అను సర్పరూపమున వేచి చూచుచున్నవి. ఆ మున్నీటి మధ్యన చిన్ని గుట్ట పద్మము వలె బయల్పడి క్రమేపి విస్తరించింది. దానిలో వున్న చిన్న శిశువు హు– ఆజ్ఞాస్వరము, సియా–అవగాహన, హెకా–మాయశక్తి అనే శక్తులు కలిగి, అస్తవ్యస్తముగా ఉన్న ప్రపంచాన్ని ఒక క్రమ పద్ధతిలోకి తీసుకుని వచ్చాడు... ఆది దేవుడు ఆ పద్మాకారపు స్థలములో పక్షిరూపమున ఉండెను. తర్వాత ఒంటరిగా ఉండలేక దేవతలను సూర్యుని చెమట నుంచి, మానవుని కన్నీటి నుంచి సృజించెను. చనిపోయిన వారు పాతాళ లోకమునకు వెళ్లగా, అక్కడ 42 మంది న్యాయమూర్తుల ఎదుట చనిపోయిన వారి హృదయమును న్యాయదేవత (పక్షిరూపమున ఉన్నది) ఈకతో తూచగా, బరువెక్కువగా ఉన్న పాపకర్ముడిగా నిర్ధారించి పాతాళ రాక్షసిచే మింగి వేయబడుదురు. ఈజిప్షియనులకు సూర్యుడు ప్రధాన దేవత (రా–రవి) సూర్యుని కుమార్తె మాత్ న్యాయదేవత.

## సంభవామి యుగేయుగే

హిందువులకు సూర్యుని కుమారుడు యముడు ధర్మదేవత. మరో కుమారుడు శని. సూర్యుని భార్యలు ఛాయ, సంజ్ఞాదేవి. యముడు ఆయుర్దాయమును నిర్దేశిస్తాడు. సూర్యునికి సంజ్ఞ యందు దైవ స్వరూపుడు వైవస్వతుడు జన్మించాడు. ఇతను మీనావతార ఘట్టములో హరిచే జలప్రళయము నుంచి రక్షింపబడి, సాంఖ్య యోగమును గ్రహించి, ఆ పుణ్యవశమున ఈ మన్వంతరపు మనువైన సత్యవ్రతుడు. ఈ విధముగా భగవానుడు అనేక అవతారములు ధరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తాడు. (భాద్రపద శుక్ల తృతీయ సాయం సమయం శంబల గ్రామములో శ్రీ కల్కి జన్మిస్తాడు. – వరాహ పురాణము). అతి రహస్యమైన హరి జన్మ కథలు భక్తితో చదివితే సంసార దుఃఖాలు తొలగి సమస్త సుఖ శాంతులు కలుగుతాయి.

✧✧✧✧✧

# 40. కలడో... లేడో!

ఎందరో దార్శనికులు దేవుడు ఉన్నాడా... లేడా అని తర్కించారు. కొందరు మనిషి కన్నా ఉన్నతమైనవాడు, శక్తివంతుడు, ఎల్లప్పుడు సంతోషంగా హాయిగా బతికేవాడయిన సూపర్‌మాన్‌ను సృష్టించారు. కాలగతిలో వారూ నిలవలేదు. ఇంతకీ దేవుడు ఉన్నాడా, మరణించాడా? ఉంటే ఈ ప్రపంచం ఎందుకింత సంక్షుభిత స్థితిలో ఉంది? మానవుడు ఎందుకింత అశాంతితో బతుకుతున్నాడనే ప్రశ్నల మథనం...

ధ్యాన శిఖరం మీద నుంచి జరాతుష్ట్రుడు దిగివచ్చాడు. అక్కడున్న ప్రజలకు అతని గురించి ఏమీ పట్టినట్టులేదు. వారంతా రెండు స్తంభాల మధ్య గాలిలో కట్టిన తాటిపై ఒంటికాలితో నడుస్తూ సర్కస్ ఫీట్లు చేస్తున్న కుర్రవాణ్ణి చూడడంలో నిమగ్నమై ఉన్నారు. అతను ఎలుగెత్తి అరిచాడు. 'నేను ధ్యానంలో కనుక్కున్నది అదే. మానవుడు గొప్పవాడే కానీ అతడే ఆఖరి మజిలీ కాదు. అతడు ఒక తాటి వంతెన మాత్రమే, ఆఖరి గమ్యం కాదు' అని అరిచాడు జరాతుష్ట్ర. ఇంతలో అంతెత్తున తాటిపై నడుస్తున్న పిల్లవాడు కాలుజారి నేలపై పడి మరణించాడు. జనం కకావికలైపోయారు. జరాతుష్ట్రుడు ఆ పిల్లవాడిని తన భుజాలపై వేసుకొని శ్మశానం వేపు నడుస్తూ దిక్కులు పిక్కటిల్లేలా ఇలా ప్రకటించాడు. "ఇతడు కోరి మరీ ప్రమాదం అంచులపై నడిచాడు. అందుకే మరణించాడు. నేను ఇతడిని ఖననం చేస్తాను. మీరు కూడ ప్రమాదం అంచుల్లో జీవించండి. అగ్ని పర్వతాల పక్కనే నగరాలు నిర్మించుకోండి. దిక్సూచి లేని పడవల్లో గమ్యం తెలీని తీరాలకు సాగిపోండి. నిరంతర యుద్ధాలతో మిమ్మల్ని మీరు నిర్బంధించుకోండి'. ప్రజలు ఆ మాటలు విని భయభ్రాంతులై మరింత వేగంగా అక్కడినుంచి తప్పించుకోబోయారు. జరాతుష్ట్రుడు నింపాదిగా ఆ బాలుడి శవాన్ని భూస్థాపితం చేసి, గుసగుసలాడుకుంటున్న జనం మధ్యలోకి వచ్చాడు. "అంతా దైవ ఘటన" అంటున్నారు వాళ్లు.

### సూపర్ మాన్‌ను సృష్టిద్దాం...

'కాదు. ఇది దైవ ఘటన కాదు. దేవుడుంటే ఇలా జరిగేదేనా? దేవుడు మరణించాడు. మీరు ప్రార్థించే సవాలక్షా దేవతలు ఎప్పుడో మూకుమ్మడిగా చచ్చిపోయారు. వాళ్లు సంధ్యా సమయంలో వెలుతురులా, మంచులా కరిగిపోలేదు. మీ అమాయకత్వాన్ని, మూఢ విశ్వాసాలనీ చూసి పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ... నవ్వుతూ ఆ నవ్వుల మధ్యే నిష్క్రమించారు. సోదరులారా! నేనూ ఒక దేవుడిని

సృష్టించాను. మనిషిలోని మంచితనాన్ని, చెడ్డతనాన్ని కలబోసి నేను సృజించిన దేవుడు ఎక్కడి నుంచో దిగిరాలేదు. ఈ అగ్ని నుంచి, బూడిద నుంచి ఆవిర్భవించినవాడే ఆ దేవుడు. అందుకే చెబుతున్నాను మనకు కావల్సింది దేవుడూ కాదు. ఇప్పుడున్న మనిషి కన్నా ఉన్నతమైనవాడు, శక్తిమంతుడు, ఎల్లప్పుడు సంతోషంగా హాయిగా బతికేవాడు. రండి! ఆ 'సూపర్ మాన్'ను సృష్టిద్దాం" అన్నాడు జరాతుష్ట్రుడు.

## సంకల్పశక్తి

Thus spake Zarathustra - అనే అద్భుత గ్రంథాన్ని రచించినది ఫ్రెడరిక్ నిషే (1844–1900). జర్మన్ దార్శనికుడు, వేదాంతి, కవి, ప్రవక్త. మానవ ప్రవృత్తిలోనే కాక విశ్వక్రమంలో కూడా 'విల్‌పవర్ – సంకల్పశక్తి' ఉన్నదని విశ్వసించాడు. ప్రపంచంలోని మానవులలో రెండే వర్గాలున్నాయి. ఉత్తములు, అధములు. ఉత్తములు బలవంతులు కావున తమ సంకల్పబలంతో అభివృద్ధి మార్గంలో ఇచ్ఛాదిశలో సాగిపోతుంటారు. అధములు బలహీనులు కావున వారిలో త్యాగం, వైరాగ్యం, వినయం, స్వార్థరాహిత్యం, సర్దుకొని పోవడం వంటి నీతి గుణాలు ఉంటాయి. ప్రస్తుత సమాజంలో ఈ బానిస నీతి ఎక్కువై మానవ పురోగమనానికి అడ్డుతగులుతున్నదని భావించాడు. అందుకే నిత్య సంతోషులు ప్రకృతికి అనుకూలురు, ధీరోదాత్తులు అయిన 'సూపర్ మాన్' ఆవిర్భవించడానికి ఈ మానవ జాతి పాటు పడాలంటాడు నిషే.

## దేవుని మరణంలోని మర్మం

నిషే రాసిన The Gay Science అన్న వ్యాసంలో 'ఉన్మాది'ఒకడు 'మానవత్వం చేతిలో దేవుడు మరణించాడు' అని ప్రకటన ఇస్తాడు. అత్యంత ప్రాచుర్యంలోకి వచ్చిన 'దేవుని మరణం' అన్న వ్యాఖ్యను కొందరు భగవంతుడు తిరోహితుడై మరల అవతారాలు ఎత్తడానికి ఆధారంగా వ్యాఖ్యానించి, మత వ్యాప్తికి తోడ్పడితే, హిట్లర్ లాంటి నియంతలు నిషే – 'సూపర్ మాన్' సిద్ధాంతాన్ని తమ రాజ్యకాంక్షకు సిద్ధాంత సూత్రంగా వాడుకున్నారు. మతాచార్యుల వంశంలో జన్మించి, చిన్నప్పుడు 'దేవాలయంలో చిన్ని క్రీస్తు'గా పిలవబడి, తన పద్దెనిమిదవ ఏట దేవుడిని తిరస్కరించి, తన స్నేహితులైన సంగీతకారుడు 'వాగనర్', దార్శనికుడు షోపెన్‌హోవర్‌ల ప్రభావంతో దార్శనికుడై కొత్త దేవుడికై అన్వేషిస్తూ, ఆ అన్వేషణలోనే 'సూపర్‌మాన్'ను సృజించి ఆత్మతృప్తిని పొందాడు నిషే. 1870 ప్రాంతంలో ఫ్రాంక్‌ఫర్ట్ నగర వీధుల్లో విజయ గర్వంతో ఊరేగింపుగా పోతున్న అశ్విక దళాన్ని చూసి, ఉత్తేజితుడై... మానవుడికి

కావలసింది 'ఉనికి కోసం నిరంతర ఆరాటం కాదు. కావలసింది యుద్ధ సంకల్పం, అధికార కాంక్ష, కీర్తి శిఖరారోహణం' అని ప్రకటించాడు నిషే.

## అల్లకల్లోలమైన నిషే

'ఎవరైతే తన కన్నా ఉన్నతమైన దాన్ని సృజించి, తరువాత అస్తమిస్తారో అతన్ని నేను ప్రేమిస్తాను' అన్నాడు జరాతుష్ట్రుడు. నిషే సృజించిన సూపర్‌మాన్ దేవుడిని మరణింపజేసి తాను ముందుకు రాబోయాడు. ఈ సంఘర్షణ 'నిషే'ను అల్లకల్లోలం చేసింది. కాలం కంటే వేగంగా సాగుతున్న అతని ప్రయాణం లోపలా... బయటా అతన్ని కుదిపివేసింది. కంటిచూపు మందగించడం, అనారోగ్యం, 1889లో వచ్చిన మెదడులో రక్తస్రావం అతడిని మానసికంగా దెబ్బతీశాయి. ఉన్మాద స్థితిలో ఉన్న అతనిని కన్నతల్లి ఒడి ఓదార్చింది. జీవించి ఉన్నప్పుడు నిరంతరం తనలో తాను సంఘర్షించుకున్న అతనికి మానసిక వైకల్యం ప్రశాంతతను ఇచ్చింది. ఉన్మాది పాత్రతో 'దేవుడు మరణించాడు' అనిపించిన 'నిషే' ఉన్మాదిగా మరణించాడు.

## దేవుడు ఉన్నట్లా? లేనట్లా?

ఇంతకీ దేవుడు ఉన్నాడా; మరణించాడా? ఉంటే ఈ ప్రపంచం ఎందుకింత సంక్షుభిత స్థితిలో ఉంది? మానవుడు ఎందుకింత అశాంతితో బతుకుతున్నాడు? సంతోషం, ప్రేమ బదులుగా భయం ఎందుకు రాజ్యమేలుతోంది? అన్ని మత నిలయాలు, ఆలయాలు, చర్చిలు, మసీదులు, ప్రార్థనా స్థలాలు బిక్కుబిక్కుమంటున్న భక్తులతో కిటకిటలాడుతున్నాయెందుకు? ఈ దైవ భావన వీరికి ఏమి ఇస్తున్నది? నాగరికతతో ముందుకు సాగాల్సిన నవీన మానవుని అడుగులు వెనక్కి పడ్తున్నాయా? ఈ ఆలోచన మానవునికెలా సంక్రమించింది? ఇది దైవ సంకల్పమా? పరిణామ క్రమమా? అంటే దేవుడు ఉన్నట్లా? లేనట్లా?

**"కలడందురు దీనులయెడ**
**కలడందురు పరమ యోగి గణముల పాలన్**
**కలడందురు అన్ని దిశలను**
**కలడు కలండనెడి వాడు కలడో, లేడో?"**

✧✧✧✧✧

# 41. 'తత్త్వశాస్త్రం' సత్యాన్వేషణలో తొలిమెట్టు

నేనెవరిని? ఈ సృష్టికి మూలం ఏమిటి? దేవుడే ఈ సృష్టికి మూలమా? అలా అయితే ఈ కష్టాలూ... కన్నీళ్లూ... ఏమిటి? ఇవన్నీ వేల సంవత్సరాలుగా మానవుడి మదిని తొలచివేస్తున్న ప్రశ్నలు. మనిషి అసలు ఈ దిశగా ఎలా ఆలోచించాడు? తత్త్వశాస్త్రం మనిషికి ఎలా మార్గదర్శనం చేస్తుందనే విశేషాల మాలిక ఇది.

**హిరణ్మయేన పాత్రేణ సత్య స్యాపిహితమ్ ముఖమ్**
**తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే**
– ఈశావాస్యోపనిషత్

"సత్యరూపమైన నీ వదనాన్ని వీక్షించేందుకు, మిరుమిట్లు కొలిపే కాంతితో ఆ బంగారు పాత్ర అడ్డు వస్తున్నది. కరుణించి ఆ ఆవరణను తొలగించి, సత్యదర్శనము అనుగ్రహించు దేవా" అని పై శ్లోకానికి అర్థం.

ఏది సత్యం? ఏది అసత్యం? నేనెవర్ని? నన్నూ ఈ సమస్త జీవనిర్జీవ జాలాన్ని సృజించిందెవరు? ఈ సృష్టి స్వయంభూతమా? ఏ మహాశిల్పి నిర్మాణ చాతుర్యమో? ఈ విభిన్నరూప పదార్థాలు, వైవిధ్యమున్న శక్తుల స్వరూప రహస్యాలేమిటి? ఈ వస్తువుల తత్త్వాలు, సంబంధాలు వీటి మధ్య జరిగే సంఘటనల తాత్పర్యం ఏమిటి? ఎవరు వీటిని నియంత్రిస్తున్నారు? ఈ గొలుసుకట్టు చర్యల అంతిమలక్ష్యం ఏమిటి? మెలుకువలో కనిపిస్తూ నిద్రలో అదృశ్యమయ్యే ఈ దృశ్య ప్రపంచం వాస్తవమా? నిర్ణీత ఆయుఃప్రమాణం కలిగిన ఈ జీవన భ్రమణం భ్రమా? అసలైన సత్యాన్ని నేనెలా దర్శించగలను? ఎలా?

## దివ్యలోక సంగీతం

ఈ దర్శన శాస్త్రాన్ని పైథాగరస్ తత్త్వశాస్త్రం (ఫిలాసఫీ) అన్నారు. ఆయన దృష్టిలో అది దివ్యలోక సంగీతం. అజరామరం. జ్ఞానాన్ని ప్రేమించడమే తత్త్వం అని కొందరి అభిప్రాయం. సర్వోత్కృష్టమైన శాస్త్రమని కొందరు, సాధారణ సందేహాలను తీర్చే విద్యగా, విలువలను నిర్దేశించేదిగా, అంతరార్థాలను వివరించే తత్త్వచింతనగా మరికొందరు దర్శన శాస్త్రాన్ని నిర్వచించారు. సత్యాన్వేషణలో దాటవలసిన మొదటి అగడ్త తత్త్వం. జయించిన రాజ్యం సైన్యు. వీటి వెనుక సుస్థిర శాంతి సౌభాగ్యాల నడుమ లలితకళలు, విజ్ఞానం వెల్లివిరుస్తుంటాయంటారు కొందరు. సత్యాన్ని సత్యం కొరకే అన్వేషించిన వారు తాత్త్వికులు.

## అంతిమ గమ్యం సూచించే తత్త్వం

ఆరంభదశలో తత్త్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం కలిసే ఉన్నాయి. తత్త్వశాస్త్రం సత్యశోధన కాగా సైన్సు సత్యవిశ్లేషణ. సైన్సు ఒక విషయాన్ని అనేక భాగాలుగా విభజించి మూలాల్ని వెదికి అంతవరకూ తెలియనిదానిని తెలియపరుస్తుంది. తత్త్వశాస్త్రం విలువల్ని, లక్ష్యాన్ని విశదీకరిస్తూ అంతిమ గమ్యాన్ని సూచిస్తుంది. సైన్సు నిజాల్ని వెలికి తీస్తుంది. తత్త్వశాస్త్రం జీవితార్థాన్ని విడమరిచి చెబుతుంది. ఈ జీవితమేమిటి? ఈ ప్రపంచమేమిటి? మొదలు చివరా పేజీలు పోయిన పుస్తకమా జీవితం?

**అవ్యక్తా దీని భూతాని, వ్యక్త మధ్యాని భారత!**
**అవ్యక్త నిధనా న్యేవ కాతత్ర పరివేదనా!**

ఓ అర్జునా! ఈ ప్రాణికోటి విషయంలో పుట్టుకకు ముందేమిటో తెలియదు. చనిపోయిన తరువాత ఏమవుతుందో అదీ తెలియదు. మధ్యన ఏదో కొంత తెలుస్తుంది. ఈ మాత్రం దానికి నీవెందుకు ఇంతగా శోకిస్తావు? అంటాడు శ్రీ కృష్ణపరమాత్మ అర్జునునితో.

## సత్యాన్వేషణ ఎందుకు?

ఏదీ ఎలాగూ తెలియనప్పుడు మరి ఈ సత్యాన్వేషణ ఎందుకు? సిసిరో అంటాడు "....చదరంగపు ఆటలాగనే ఈ తర్కం వేదాంతం, దర్శనం అంతా శుద్ధ దండగ. పాచి నీళ్లలాగా, ఎండమావిలా దేనికీ పనికిరాదు. వేస్ట్...!" విజ్ఞానశాస్త్రం అనేక విధాలుగా, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుంటే తత్త్వశాస్త్రం అక్కడే ఆగిపోయిందని కొందరి వాదం. కాని ప్రతి సైన్సు శాఖా తత్త్వశాస్త్రంగా మొదలై కళగా ఉన్నతిని పొందుతుంది. సిద్ధాంతంగా ఉద్భవించి సత్యం వైపు ప్రవహిస్తుంది. ఫిలాసఫీలో తర్కం (లాజిక్), సౌందర్యశాస్త్రం (ఈస్థటిక్), రాజకీయం (పాలిటిక్స్), నీతిశాస్త్రం (ఎథిక్స్), అధి భౌతికశాస్త్రం (మెటా ఫిజిక్స్) ముఖ్య భాగాలు.

## తత్త్వశాస్త్రం... రూపాలు

**తర్కం:** ఇది ఆలోచన–అన్వేషణ, సూత్ర ప్రతిపాదన–సమర్థన, పరిశీలన–అంతర్దర్శన, విశ్లేషణ–క్రోడీకరణ అనే విషయాలపై ఆధారపడి జీవితంలోని వాస్తవికతకు సంబంధించిన ఉన్నత వ్యత్యాసాలను అర్థం చేసుకోవడంలో ఉపయోగపడ్తుంది.

**సౌందర్యశాస్త్రం :** కళాభిరుచిని, కళల విలువలను నిర్దేశిస్తూ ఏది కళ? ఏది సుందరం? అనే విషయాలు వివరిస్తుంది.

**రాజకీయం:** పొలిటిక్స్ ఆదర్శ సమాజాన్ని వివిధ రూపాల్లోని ప్రయోజనాల్ని విస్తృతంగా చర్చిస్తుంది.

**నీతి శాస్త్రం :** సత్ప్రవర్తనను, మంచీ చెడులను విచక్షణా జ్ఞానాన్ని, ప్రజల ఆమోదాన్ని (ఎథాస్) పరిశీలిస్తుంది.

**ఆది భౌతికశాస్త్రం:** (మెటాఫిజిక్స్) ఈ జగత్తుకు మూలమేమిటి? దేవుడున్నాడా? ద్రవ్య వస్తు సంబంధాలేమిటి లాంటి అంశాలను వివరిస్తుంది. జ్ఞానశాస్త్రం: (ఎపిస్టిమాలజి) మతతత్త్వశాస్త్రం (రెలిజియాలజి) చరిత్రతత్త్వం (హిస్టరీ), విలువల శాస్త్రం (ఏక్సియాలజి), సత్తాశాస్త్రం (ఓంటాలజి), భవిష్యత్ శాస్త్రం (ఫ్యూచరాలజి) ఇవి ఫిలాసఫీ – దర్శనశాస్త్రంలో మిగిలిన భాగాలు. సైన్సు (విజ్ఞాన శాస్త్రం)లో మాదిరిగా తత్త్వశాస్త్రాన్ని కూడా ఇలా ముక్కలుగా చేసినపుడు దర్శన సౌందర్యం కొంత తగ్గినా సత్యాన్వేషణలో అవి దారిని సుగమం చేస్తాయి.

## శేషప్రశ్నలు

ఈ సత్యాన్వేషణ అనే భావం మానవుడిలో ఎప్పుడు ఏర్పడింది? దేవుడున్నాడా లేడా అన్న చింతన ఎలా కలిగింది. దేవుడు ఉంటే ఈ కష్టాలను ఎందుకు కలిగిస్తున్నాడు? దేవుడు లేడా? అయితే ఈ ప్రపంచం ఎలా ఏర్పడింది? జీవితంలోని ఈ ఒడిదుడుకులకు కారణం ఏమిటి? ఇవి నిరంతరం ప్రతివ్యక్తినీ వేధిస్తున్న ప్రశ్నలే! కోటి 20 లక్షల సంవత్సరాల క్రితం వానరజాతి నుంచి విడివడి 25 లక్షల సంవత్సరాలప్పుడు హోమోహాబిలిస్‌గా లక్ష సంవత్సరాల క్రితం హోమోసెపియన్స్ (ఆలోచనాపరుడు)గా నరుడు పరిణామం చెందాడని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఆఖరి మంచుయుగం 40 వేల ఏళ్ల క్రితం ఆరంభం అయ్యింది. 30 వేల ఏళ్ల క్రితం నియాండెర్తల్ మ్యాన్ అంతర్ధానం చెందాడు. 28 వేల ఏళ్లక్రితమే ఆసియా నుంచి బేరింగ్ కనుమలగుండా క్రొమాగ్నాన్ మనిషి అమెరికా చేరాడు. 20 వేల ఏళ్లక్రితమే లాస్ కాక్స్, ఆల్టామీరా గుహల్లో జంతువుల బొమ్మల్ని చిత్రించాడు. 8 వేల ఏళ్ల క్రితం నదుల ఒడ్డున స్థిర నివాసం ప్రారంభం అయింది. వీళ్లు అంతవరకు తాము చేస్తున్న వేట, ఆహారసేకరణ స్థానే వ్యవసాయం ప్రారంభించారు. క్రూర జంతువుల్ని మచ్చిక చేసుకొని వేటలో, వ్యవసాయంలో సాయం తీసుకున్నారు. అగ్ని జంతువుల నుంచి రక్షణను కలిగించి భయాన్ని తొలగించింది.

**కాస్త తీరిక చిక్కింది.**

**మనిషిలో ఆలోచన మొదలైంది.**

**నేనెవరిని?**

**ఒక ప్రశ్న... అనేక జవాబులు**

✧✧✧✧✧

# 42. మానవాళికి మార్గనిర్దేశం చేసిన నవీన దార్శనికులు

(మానవజన్మ పరమార్థం, జీవిత లక్ష్యం ఏమిటి? మనిషి సంతోషంగా జీవించేందుకు మార్గం ఏమిటి? జ్ఞాన సాధన చేయడం ఎలా? ఇలాంటి మౌలిక ప్రశ్నలకు సమాధానాలు కనుగొనేందుకు మహనీయులైన తత్త్వవేత్తలు అహో రాత్రులు శ్రమించారు. అద్భుతమైన తత్త్వ సిద్ధాంతాలను ప్రతిపాదించి మానవాళికి మార్గదర్శనం చేశారు. సోక్రటీస్, అరిస్టాటిల్ నుంచి ఆధునిక కాలం నాటి మానవతావాదం దాకా పలువురు తత్త్వవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాల సారం–)

"శోధించబడని జీవితం జీవించడానికి అర్హం కాదు" అన్నాడు సోక్రటీస్ (క్రీ.పూ. 470–399). పాశ్చాత్య దార్శనిక పితామహుడైన ఆయన తన భావాన్ని ఏనాడూ కాగితంపైన పెట్టినవాడు కాదు. అరిస్టోఫేనిస్, గ్జినోఫాన్, ప్లాటోల రచనలే సోక్రటీస్ బోధనలను తెలియజేస్తున్నాయి. ఏథెన్స్ నగరవాసులను, యువకులను పెడతోవ పట్టిస్తున్నాడని ఆయనపై నిందపడింది. కటకటాలపాలైనా తన దృక్పథాన్ని మార్చుకో లేదు. శిక్ష తప్పించుకొనేందుకు ఉన్న అవకాశాలను కాలదన్నాడు. మరణశిక్షగా అందించిన హెమ్‌లాక్ విషాన్ని ఏ సంకోచం లేకుండా తాగిన మహావ్యక్తి సోక్రటీస్.

## వ్యక్తికి సుగుణమే ప్రధానం

'సహజసిద్ధమైన రాజకీయ జంతువు మానవుడు' అన్నాడు అరిస్టాటిల్ (క్రీ.పూ. 384–322). జగజ్జేత అలెగ్జాండర్‌కు గురువు. లైసియమ్ పేరుతో ఏథెన్స్‌లో ఒక విద్యాలయాన్ని నడిపాడు. తర్కం, నీతిశాస్త్రం, భౌతికశాస్త్రం, వాదన, అధి భౌతిక శాస్త్రం, ఆర్థికశాస్త్రం, మానసికశాస్త్రం, జంతుశాస్త్రాలలో అనేక పరిశోధనలు చేసాడు శిష్యుడు అలెగ్జాండర్ గురుదక్షిణగా ఇచ్చిన 800 టాలెంట్ల (ఒక టాలెంటు ముప్పై కిలోల బంగారానికి సమానం) ధనాన్ని తన పరిశోధనకై వెచ్చించాడు. "వ్యక్తికి శీలసంపద ముఖ్యం. ప్రకృతి నిచ్చెనలో నిర్జీవజాలము అడుగు మెట్టుపై ఉండగా మానవుడు పైమెట్టుపై ఉన్నాడు" అని వివరించినవాడు అరిస్టాటిల్. ఆయన సిద్ధాంతం 'అరిస్టాటిలియనిజమ్'గా పేరుపొందింది. క్రీస్తుపూర్వం 323 సంవత్సరంలో అలెగ్జాండర్ మరణించాడు. ఏథెన్స్ స్వతంత్రం ప్రకటించుకున్నది. అరిస్టాటిల్‌పై

నిందపడింది. అరిస్టాటిల్ ఏథెన్స్‌ను విడిచి వెళ్లాడు. రెండోసారి ఫిలాసఫీని చంపే అవకాశం ఏథెన్స్‌కు ఇవ్వలేదాయన. కానీ డయాజనస్ లారెషస్ మాత్రం అరిస్టాటిల్ క్రీ.పూ. 322 సంవత్సరంలోనే హెమ్‌లాక్ విషం తాగి అస్వస్థుడై మరణించాడని చెబుతాడు.

## జ్ఞానాన్ని కమ్మేసిన చీకటి

గ్రీకుల దురదృష్టం ఏమోగానీ ఏడాది కాలంలో జగజ్జేత అలెగ్జాండర్, ప్రముఖ వేదాంతి ఆరిస్టాటిల్, మహావక్త, అలెగ్జాండర్ విరోధి అయిన డెమొస్తనీస్ ఈ ముగ్గురు అస్తమించడంతో గ్రీకుల ఉజ్జ్వల శకం ముగిసింది. తర్వాత వచ్చిన రోమన్లది బల ప్రదర్శన, శక్తియుక్తుల నిష్పూరవ్వలే కాని ఆలోచనల కాంతిపుంజాలు కావు. రోమన్ ప్రాభవం ముగిశాక వెయ్యి సంవత్సరాల పాటు యూరప్ జ్ఞానవదనాన్ని చీకటి మబ్బులు కమ్మేసాయి.

## సంతోషానికి మూలం...?

**సినిసిజమ్:** దీనిని ప్రతిపాదించినది డయోజినస్ అనే గ్రీకు వేదాంతి. (క్రీ.పూ. 400–325). సంతోషానికి మూలం సామాన్యమైన, తృప్తితో కూడిన జీవితం అంటాడతడు. అయితే మానవ సమాజంపై అతనికున్న తృణీకారభావం అతని సిద్ధాంతానికి 'సినిసిజమ్' అన్న ఈనాటి అర్థాన్ని తెచ్చింది.

**ఎపిక్యూరస్:** (క్రీ.పూ. 341–270) మంచిపని ఆనందాన్ని, చెడుపని బాధను కలిగిస్తుందంటాడు. శీలం నడవడిక అన్నిటికన్నా ఉత్తమమైనవని, ప్రతి విషయంలోనూ సంయమనంగా ఉండాలని ప్రబోధించాడు. ఈ ఆలోచనలే 'ఎపిక్యూరియనిజమ్' అంటారు.

**స్టొయిసిజమ్:** మంచి నడవడిక, శీలసంపద మానవునికి నిజమైన ఆనందాన్ని కలిగిస్తాయి. ధనం, పేరుప్రతిష్ఠలు, కుటుంబం వీటివల్ల ఒరిగేదేమీ లేదు. సుగుణం సంతోషానికి మూలం అనే ఈ భావాన్ని జీనో (క్రీ.పూ. 334–262) సెనెకా (క్రీ.పూ. 4 – క్రీ.శ. 65) ప్రచారం చేశారు.

## జ్ఞానమార్గం ఏది?

**ప్రిడెస్టినేషన్:** (పూర్వనిర్ణయవాదం) మానవుని జీవనంలోని సంఘటనలు అన్నింటినీ దేవుడు అంతకు ముందే నిర్ణయించి ఉంటాడని చెప్పే సిద్ధాంతం ఇది. అన్నీ మనమే చేస్తున్నామనేది భ్రమ అనే దీన్ని ప్రతిపాదించినది సెయింట్ ఆగస్టీన్

(క్రీ.శ. 354–430).

**స్కెప్టిసిజమ్:** (సందేహవాదం) గ్రీకు సిద్ధాంతమైన ఈ భావన ప్రతి విషయాన్ని సందేహించవలసినదే అని చెబుతుంది. దీనిని ఫ్రెంచి వేదాంతి రెనె డెకార్టె (క్రీ.శ. 1596–1650) అనుసరించాడు. మన మనసు చెప్పిన దానిని తప్ప మిగతాది వేటినైనా సరే తొలిదశలో సందేహించవలసినదే! నిజాన్ని నిగ్గుతేల్చవలసిందే అంటాడాయన.

**రేషనలిజం:** (బుద్ధివాదం) స్పినోజా (1632–77), లీబ్‌నిజ్ (1646 – 1676)ల వాదం ప్రకారం బుద్ధి లేదా తర్కం (రీజన్) మాత్రమే జ్ఞానాన్ని ఇస్తుంది. ఇది ఎంపిరిసిజానికి వ్యతిరేకం.

**ఎంపిరిసిజమ్:** బేకన్ (1561–1626), లాక్ (1632–1704) డేవిడ్ హ్యూమ్ (1711–1776) జ్ఞానం ఇంద్రియానుభవం పరిశీలన, పరిశోధన వలన కలుగుతుందంటారు.

**యుటిలిటేరియనిజమ్:** ఎక్కువ మందికి ఎక్కువ సంతోషాన్ని ఇచ్చేదే మంచి విషయం అని చెప్పేదే ఈ ఉపయోగితావాదం. దీనిని బెంథామ్, వాల్, సువార్ట్, సిడ్జువిక్‌లు (1748–1900) ప్రాంతాలలో ప్రాచుర్యంలోకి తెచ్చారు.

## మనోనేత్ర దర్శనమే సత్యం

**హెగెల్, మార్క్స్ :** సత్యాన్వేషణలో సిద్ధాంత ప్రతిపాదన దాని వ్యతిరేక విమర్శ, రెండింటి కలయికలో ఉత్పన్నమయ్యే కొత్త సిద్ధాంతం (థీసిస్+ఏంటిథీసిస్ = న్యూ థీసిస్) ముఖ్యమన్నారు. దీనినే డయాలెక్టిక్ వాదమంటారు. దీని ప్రాతిపాదికగా మార్క్స్ 19వ శతాబ్దంలో మార్క్సిజాన్ని ప్రతిపాదించాడు. దీనినే డయాలెక్టిక్ మెటీరియలిజమ్ అని కూడా వ్యవహరిస్తారు. చరిత్ర అనేది రెండు ఆర్థిక శక్తుల మధ్య ఘర్షణ అంటాడతడు. ఆ ఘర్షణ పర్యవసానంగానే చివరకు అంతరము లేని సమాజం ఉదయిస్తుందనేది ఆయన వాదన. అదే కమ్యూనిజం. దీనిని ఫ్రెడరిక్ ఎంగిల్స్ బలపరిచాడు.

**ఐడిలిజమ్:** ఈ దృశ్య ప్రపంచం, పదార్థాలన్నీ ఒట్టి భ్రమలే. మనోనేత్ర దర్శనమే సిసలైన నిజమంటుంది. జర్మన్ వేదాంతి హెగెల్ (1770–1831); ఐరిష్ వేదాంతి బర్క్‌లీ దీనిని సమర్థించారు.

**ఎగ్జిస్టెన్షిలిజమ్:** మానవులకు తనకు కావలసిన దానిని ఎన్నుకోవడంలో

స్వేచ్ఛ ఉండాలని, స్వేచ్ఛవలన ఉత్పన్నమయ్యే పరిస్థితులకు బాధ్యత అతడే వహించాలని, మానవుని త్రోసిరాజనే విలువలేవీ ఈ ప్రపంచంలో ఉండవనీ చెబుతుంది. దీనిని హీడేగ్గెర్, జీన్‌పాల్ సార్ట్రె, ఆల్బర్ట్ క్యామస్‌లు ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు.

## అనుభవం అంచులు దాటాలి

ట్రాన్సెండెంటలిజమ్: వేదాంతం లేదా దర్శనశాస్త్ర పరిధి అనుభవపు అంచుల్ని (ఎక్స్‌పీరియన్స్) దాటి వెళ్ళాలని తెలుపుతుంది. అమెరికన్ రచయితలు థొరియూ, ఎమర్సన్‌లు ఈ సిద్ధాంత ప్రతిపాదకులు.

**ప్రాగ్మాటిజమ్:** ఏదేని సిద్ధాంతం లేదా ఊహయొక్క విలువ దాని వాస్తవిక ఉపయోగంపై ఆధారపడి ఉందంటుంది ఈ సిద్ధాంతం. దానికి సరైన నడవడిక అవసరం. పియర్స్, జేమ్స్, డ్యూయే దీనిని ప్రాచుర్యంలోకి తెచ్చారు.

వియన్నాసర్కిల్‌గా పిలువబడే లాజికల్ పాజిటివిజమ్ ప్రకారం ఇంద్రియానుభవమే జ్ఞానం, ఈ అనుభవం శాస్త్రీయ నిబంధనలకు లోబడి ఉండాలని స్కిలిక్, గోడెల్‌లు ఈ వాదాన్ని ప్రతిపాదించారు.

**హ్యూమనిజం:** (మానవతావాదం) ఇది పునరుజ్జీవన (రినైజన్స్) సిద్ధాంతం, 20వ శతాబ్దంలో బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇది అన్ని అతీంద్రియ అనుభవాలను తిరస్కరిస్తుంది.

✧✧✧✧✧

# 43. అద్భుతాలకు మూలం... ప్రశ్న

ప్రశ్నించడం నేర్చుకుంటే అన్నీ నేర్చుకున్నట్లే. విలువైన ప్రశ్న వేయగలగడం విజ్ఞతకు నిదర్శనం. తత్త్వవివేచనకు మూలం ప్రశ్న. అదే తొలిమెట్టుగా నేలపై మానవుడి అభివృద్ధికీ మూలం ప్రశ్నే. తొలికాలం నుంచి ప్రశ్న చేసిన అద్భుతాలు...

**కేనేషితం పతతి ప్రేషితం మనః**
**కేన ప్రాణః ప్రథమః ప్రైతియుక్తః**
**కేనేషితాం వాచమిమాం వదన్తి**
**చక్షుః శ్రోత్రం క ఉ దేవో న యుక్తి**

ఎవరు దీనికి కారణం? ఎవరి ఆజ్ఞ వల్ల మనసు, ప్రాణం నడుస్తున్నాయి? ఎవరి ప్రేరణతో మాట్లాడగలుగుతున్నాము? ఈ కన్నులు, చెవులు మొదలైన ఇంద్రియాలను ఎవరు నిర్మించి, నియంత్రిస్తున్నారు? కేన... ఎవరిచేత?

## ప్రశ్నించడమే విద్య

**ఎవ్వనిచే జనించు ఈ జగమెవ్వని లోపలనుండి లీనమై**
**ఎవ్వని యందుండిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం**
**బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము తానయైన వా**
**డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్**

– భాగవతం

ప్రశ్న... ఆలోచనాపరులైన మేధావులను కలచి తొలచిన ప్రశ్న. బహు దేవతారాధన నుంచి ఏకేశ్వర పూజవైపు, వేదాంతం వైపు నడిపించిన ప్రశ్న... ప్రశ్న ఒక్కటే. కాని సమాధానాలు బహుముఖాలై అనేక దారులేర్పడినా చివరికి చేరుకునేది ఒక్కచోటుకే అని నేర్పిన ప్రశ్న. ప్రశ్నోను యోగః పృచ్ఛా చ – ప్రచ్ఛన్నం ప్రశ్నః – పృచ్ఛ జ్ఞీప్సాయాం – 'తెలుసుకోగోరి అడగడం ప్రశ్న. అడిగిన దానికి సమాధానం చెప్పడం ప్రతివాక్యం లేదా సమాధానం' అంటుంది అమరకోశం.

ప్రశ్నించడం నేర్పింది భారతదేశమే. ఉపనిషత్తులన్నీ ప్రశ్నలే. భగవద్గీత అంతా ప్రశ్న, సమాధానాల సమాహారమే కదా... ఉపనిషత్తు అంటే ఉపాధ్యాయుని ఎదురుగా సమభావంతో కూర్చుని అభ్యసించడం... ప్రశ్నించడం. 'ఓం సహనావవతు సహనై భునక్తు సహవీర్యం కరవా వహై, తేజస్వినావధీత మస్తు మావద్విషావహై' – గురుశిష్యులైన మమ్మల్ని ఆ పరమాత్మ రక్షించు గాక... మమ్మల్ని పోషించు గాక. మేము కలిసి విద్యను పఠిస్తాము. దానిని మరింత ప్రకాశింపచేస్తాము. మా

అభిప్రాయాలు వేరైనా పరస్పరం ద్వేషించక ఉందుము కాక' అనే అభిలాషను కృష్ణ యజుర్వేదంలోని శాంతిమంత్రం వ్యక్తం చేస్తుంది.

## రాజీపడ్డ ప్రశ్న

ఆ కాలంలో అరణ్యాల్లో తిరుగుతూ, చిన్నిచిన్ని ఆశ్రమాల్లో చెట్లనీడన ఆలోచిస్తున్న రుషుల్లాగే, గ్రీకు ద్వీపాల్లో ఆసియామైనర్‌లలో తాత్త్విక చింతన ఉంది. క్రీస్తుపూర్వం అయిదారు శతాబ్దాల ప్రాంతంలో నివసించిన థేల్స్ అనే వేదాంతికి ఓ సందేహం వచ్చింది. ఏదో ఒకటే శాశ్వత సత్యం – వన్ రియాలిటీ – ఉండాలి. అది 'జలం' అన్నాడతడు తన పక్కనే ఉన్న శిష్యుడు అనాక్జిమాండర్‌తో. ఆ శిష్యుడు వెంటనే ప్రశ్నించాడు... 'ఎలా చెప్పగలుగుతున్నారు?' – ఈ ప్రశ్నే వారి వేదాంతానికి తొలిమెట్టు అయ్యింది. అనాక్జిమాండర్ ఆలోచించాడు అది నీరొక్కటే అయి ఉండదు. ఇంకా అనేక మూలకాలు కలిసిన ఆదిమ పదార్థం (ఎపీరాన్) అన్నాడు. అతని శిష్యుడు అనాక్జిమెనెస్ అతనితో వేభేదించి 'వాయువు' ఆ పదార్థం, మూల పదార్థాల క్వాలిటీలో వచ్చే మార్పు క్వాలిటీలో కూడా మార్పు తెస్తుంది అని వివరించాడు. అదే నవీన శాస్త్రంలోని ముఖ్యసిద్ధాంతం కూడా. కాలం సాగిపోతూనే ఉంది. అనేక మంది ఇలా ప్రశ్నిస్తూనే సమాధాన పడ్డారు.

## గమ్యాన్ని చేరే దారి?

'నాకు ఆరుగురు నిజాయితీ గల అనుచరులున్నారు. వాళ్లే నాకు అన్నీ నేర్పారు. వారి పేర్లు– ఏమిటి? ఎందుకు? ఎప్పుడు? ఎలా? ఎక్కడ? ఎవరు?' అంటాడు కిప్లింగ్. ప్రశ్నలకు సమాధానం వెదకడానికి ఇదొక మార్గం. అటువంటి మార్గమే లావొట్సు సూచించాడు. 'ఆ దారి చెప్పగలిగింది కాదు. నీ అంతట నీవే దాన్ని వెతుక్కోవాలి. ఆలోచించుకోగలగాలి' అంటాడు. 'తెలుసుకున్నా ఆలోచించని వాడు దారి తప్పుతాడు. ఆలోచించి కూడా తెలుసుకోలేని వాడు ప్రమాదంలో పడతాడు' అంటాడు కన్ఫ్యూషియస్. ఈ దుఃఖ ప్రపంచంలో ఎన్నో దార్లున్నాయి. కాని మధ్యేమార్గం సురక్షితమైనదన్నాడు బుద్ధుడు. మానవుని ఆలోచనా శక్తి నుంచి వెలువడిన శాశ్వత సత్య తత్త్వమే భగవంతుడు, అగ్నిరూపుడు అని జోరాస్టర్ అభిప్రాయపడ్డాడు. ఇవి ప్రశ్నకు దొరికిన తొలి సమాధానాలు. అవి ఇప్పుడు అనంతమైనా చివరకు ఒకే దేవుణ్ణి ప్రతిపాదిస్తున్నాయి. సిద్ధాంతాల్లో దోషంలేదు. ఉన్నదల్లా ఆచరించేవారిలోనే!

✧✧✧✧✧

# 44. జ్ఞాన శిఖరారోహణం

క్రీస్తుపూర్వం 800 నుంచి 200 మధ్య కాలం మానవ చరిత్రలో మహోద్భుత ఘట్టం. ఆ కాలంలోనే మహనీయులైన తత్త్వవేత్తలు అజ్ఞానపు చీకటిని తొలగించి, జ్ఞానకాంతుల్ని వెదజల్లి, లోకకల్యాణానికి నాంది పలికారు. ఈ సమస్త ప్రపంచాన్ని నడిపిస్తున్నదెవరు? మన విధి విధానాల్ని నియంత్రిస్తున్నదెవరు? అన్ని జీవులలో ఉండీ కనిపించని ఆ పరమాత్మ ఎవరు? ప్రపంచం నలుమూలల ఉన్న జ్ఞానులందరి ఆలోచనలు ఈ ప్రశ్నల చుట్టూ తిరిగాయి. వారి ఆలోచనల లోతుల నుంచి వెలువడిన సత్యాలే నేటికీ జ్ఞానజ్యోతులై ప్రకాశిస్తున్నాయి.

**"జ్ఞానం ప్రధానం న తు కర్మహీనం**
**కర్మ ప్రధానం న తు బుద్ధి హీనమ్**
**తస్మాదు భాభ్యాం తు భవేత్ ప్రసిద్ధిః**
**నహ్యేక పక్షో విహగః ప్రయాతి"**

– పులస్త్యస్మృతి

ఆచరణకు పనికిరాని జ్ఞానం నిరుపయోగం. జ్ఞానం ఇవ్వని ఆచరణ నిష్ప్రయోజనం. జ్ఞానం, కర్మల వల్లనే మానవుడు తరిస్తున్నాడు. ఒక్క రెక్కతో పక్షి ఎగరలేదు కదా!

**"మతయో యత్ర గచ్ఛంతి, తత్ర గచ్ఛంతి వానరః**
**శాస్త్రాణి యత్ర గచ్ఛంతి, తత్ర గచ్ఛంతి తే నరాః"**

బుద్ధి ఎప్పుడు ఏం చెబితే అలా, ఎక్కడకు పోవాలనిపిస్తే అలా చేసేవి వానరులు. బుద్ధి వలన తరతరాలుగా సంక్రమించిన అనుభవజ్ఞానాల్ని శాస్త్రాలుగా మలుచుకుని ప్రవర్తించేవారు నరులు. ఇప్పటికి రెండు వేల అయిదు వందల సంవత్సరాలకు ముందు క్రీస్తుపూర్వం 800–200 సంవత్సరాల మధ్య కాలాన్ని నాగరికతా అక్షంగా (ముఖ్యంగా క్రీ.పూ. 500 ప్రాంతం) కారల్ జాస్పర్స్ అభివర్ణించాడు. మానవుని జ్ఞానం, ఆచరణ అత్యున్నత స్థితికి చేరిన కాలమిది.

## నిన్ను నీవు తెలుసుకో

'సప్త జ్ఞానులు' (ద సెవెన్ వైజ్ మెన్ ఆఫ్ గ్రీస్)గా పేరుబడ్డ థేల్స్, పిట్టాకస్, బయాస్, సోలాన్, క్లియోబులస్, పెరియాండర్, చిటోలు గ్రీకు దేశస్థులను తమ ఆలోచనా వాహినులతో ప్రభావితం చేస్తున్నారు. బాబిలోనియన్ల ఆక్రమణకు గురై నిర్బంధంలో ఉన్న యూదులు అప్పటి వరకు శ్రుతులుగా వున్న 'పాత నిబంధన' –

ఓల్డ్ టెస్టామెంట్‌ను హీబ్రూ భాషలోకి గ్రంథస్థం చేశారు. ప్రఖ్యాతిగాంచిన 'సొలాన్స్' న్యాయ సూత్రాలు అమలులోకి రాగా, ఏథెన్స్‌లో నవ ప్రభువుల కూటమి అధికారంలోకి వచ్చింది. డెల్ఫి పట్టణంలోని భవిష్యవాణి చుట్టు పక్కల రాజులను ప్రభావితం చేసింది. నిన్ను నీవు తెలుసుకో (Know Thy self - నో దై సెల్ఫ్) అన్నది ప్రసిద్ధ వాక్యం.

## మహాద్భుత కాలరేఖ

అనాక్సిమెనెస్, పైథాగరస్, పర్మనైడిస్ వేదాంతులు, ఎజెకిల్, జెరెమియా ప్రవక్తలు, మహావీరుడు, సిద్ధార్థగౌతముడు, కన్ఫ్యూషియస్, లావొట్సు, జోరాస్టర్ వంటి మహామహులు ప్రభవించి తమ జ్ఞానకాంతులతో ప్రపంచంలో వెలుగులు నింపిన అద్భుతమైన కాలమిది. ఫ్రిజియన్ బానిస 'ఈసోపు' నీతి కథలు, గ్రీకు దేశంలో హాస్య విషాదాంత నాటకాలు, పాలస్తీనాలో పాతహీబ్రూ భాష స్థానే అరామిక్ భాష వాడుకలో రావడం, నెబుచ్చాద్‌నెజర్ ప్రభువుచే వేలాడే తోటలు – హాంగింగ్ గార్డెన్స్ – నిర్మాణం, బాబిలోన్‌లో బ్యాంకుల అవతరణ, ఖగోళశాస్త్రం అభివృద్ధి. హిందూ దేశంలో వీణా వాయిద్యం నిర్మాణం, గ్రీసు దేశంలో సితార, వైర్‌ల వాదకం, పైథాగరస్‌చే గ్రీకుల సంగీత సిద్ధాంతం, శుశ్రుతునిచే కంటి శుక్లాలకు శస్త్రచికిత్స, హిప్పోక్రేటిస్ (ఫాదర్ ఆఫ్ మెడిసిన్) సోఫోక్లిస్ (నాటక రచయిత), హెరోడాటస్ (ఫాదర్ ఆఫ్ హిస్టరి) సోక్రటీస్ లాంటి అద్భుత వ్యక్తులు నడయాడిన కాలరేఖ అదే. రామాయణం కూడా క్రీస్తుపూర్వం అయిదు వందల సంవత్సరాల నాటికే పూర్తయిందని పాశ్చాత్య చరిత్రకారుల అభిప్రాయం.

## ఎవరా పరమాత్మ?

మానవుడికి తన పరిమితులు, అసమర్థత అర్థమయ్యాయి. 'ప్రశ్న' ఉద్భవించింది. ప్రకృతి యొక్క విశ్వరూపం ముందు తానెంత అల్పుడో అర్థం చేసుకున్న మానవుడు, తన ఉనికికి కారణం తెలుసుకోవాలనుకున్నాడు. జరిగిపోయిన కాలమంతా సత్యయుగంలా భాసిల్లింది. కన్ఫ్యూషియస్, లావొట్సు, మొ–టి, చువాంగ్ ట్సు, లేట్సు లాంటి ఆలోచనాపరులు చైనాలో, మహావీరుడు, బుద్ధుడు వంటి మునులు హిందూ దేశంలో మంచికి చెడుకు మధ్య యుద్ధాన్ని వీక్షించిన జోరాస్టర్ పర్షియా (ఇరాన్) దేశంలో, ఎలిజా, ఈసయ్య, జెరిమియా వంటి ప్రవక్తలు పాలస్తీనాలో హోమర్, పర్మనైడెస్, హెరాక్లిటెస్, ప్లాటో, నసైడైడిస్, ఆర్కిమెడిస్ వంటి జ్ఞానులు గ్రీసు దేశంలో ప్రభవించారు. అప్పటికాలంలోని చెడును, చీకటిని తొలగించి, జ్ఞానకాంతుల్ని వెదజల్లి, లోకకల్యాణానికి నాంది పలికారు. అందరి ఆలోచన అదే. ఈ సమస్త ప్రపంచాన్ని నడిపిస్తున్నదెవరు? మన విధి విధానాల్ని నియంత్రిస్తున్న దెవరు? అన్ని జీవులలో ఉండీ కనిపించని ఆ పరమాత్మ ఎవరు?

## అంతటా... ఆత్మ

**"తదే జాతి తన్నైజాతి తద్దూరే తద్వంతికే**
**తదంతర్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యతః"**

"ఆత్మ చలించును. చలించదు. అది దగ్గరగానూ ఉన్నది. దూరములోనూ ఉన్నది. సర్వవ్యాప్తమై ఈ ప్రపంచమునకు వెలుపల లోపల కూడా ఉన్నది" అని కఠోపనిషత్‌లోని పై శ్లోకానికి అర్థం. ఈ భావన హిందువులది కాగా, గ్రీకు వేదాంతి థేల్స్ "ఆల్ థింగ్స్ ఆర్ ఫిల్ల్‌డ్ విత్ గాడ్స్ – అన్నింటిలోనూ దేవతలు నివసిస్తారు" అన్నాడు. పర్షియన్ ప్రవక్త జోరాస్టర్ బహుదేవతారాధనను త్రోసిపుచ్చాడు. ఈ ప్రపంచంలో మంచీచెడు శక్తుల మధ్య ఎల్లప్పుడూ పోరాటం జరుగుతూ ఉంటుంది. 'అహురామజ్దా పరమాత్మ' తొలిసృష్టిలో రెండు ఆత్మలు జనించాయి. స్పెంటా మైన్యూష్ మంచికి ప్రతీక. అంగ్రామైన్యూష్ చెడుకు నిదర్శనం. మానవుడికి ఏ ఆత్మను అనుసరించాలో అనే విషయంలో పూర్తి స్వేచ్ఛ ఉంది. అగ్ని స్వచ్ఛతకు (రైటియస్‌నెస్ – ఆశ) ప్రతీక. అగ్నిని ఆరాధిస్తూ తద్వారా పరమాత్మను చేరగలుగుతాం అని ఉద్భోధించాడు జోరాస్టర్. (జరాతుష్ట్ర – వృద్ధ ఒంటె)

## వ్యక్తిత్వ సోపానాలు

చైనా వేదాంతి కన్ఫ్యూషియస్ భావనలు నీతిని వివరిస్తూ మానవుని నడవడిక ఎలా ఉండాలో చెబుతాయి. "అనుభవమున్నా ఆలోచన లేకపోతే వ్యర్థం. ఆలోచన ఉండీ అనుభవంలోకి రాకపోతే ప్రమాదం" "నీకు ఏదైతే జరగకూడదని అనుకుంటాడో అదే నీ వల్ల ఇతరులకు జరుగకుండా చూసుకో". "ఇతరులను ప్రేమించు. వినయం, సహనం, విశ్వాసం, దయ, జాగరూకత ఇవి మంచి వ్యక్తిత్వానికి సోపానాలు" అంటాడాయన. లావొట్సు ప్రతిపాదించిన 'వే ఆఫ్ లైఫ్ – జీవనమార్గం – టావో టె ఛింగ్' పద్యాలలో ఉండి అనేక మంది వేదాంతులచే సంకలనం చేయబడినవని విజ్ఞుల విశ్వాసం. "ఉనికి భాషకు అతీతమైనది. మాటలతో చెప్పవచ్చు కాని పూర్తిగా వివరించలేం" "మనుష్యులు జీవన మార్గాన్ని (టావో) చూడడం మర్చిపోయినప్పుడే ప్రేమ సహజీవనాల సూత్రాలు, నిబంధనలు పుట్టుకువచ్చాయి. విద్య వచ్చింది. దానం వచ్చింది. ఆత్మవంచన అధికారాన్ని హస్తగతం చేసుకున్నది"

## నిష్కర్మే టావోయిజం

టావోయిజంలో అతిముఖ్యమైన ప్రతిపాదన "వ్యువ్యె – నో ఏక్షన్ – నిష్కర్మ) అంటే ఏమి చేయకపోవడం కాదు. నిష్కర్మ అంటే టావోయిజాన్ని, జీవన మార్గాన్ని

అదే దిశలో అనుసరించడం. అందువల్ల శక్తి వృథాకాదు. "టావో ఏమీ చేయదు. కాని అది చేయలేనిదేమీలేదు. పరిపాలకులు దీనిని గుర్తుంచుకుంటే ప్రపంచమే మారిపోతుంది. గొప్ప పరిపాలకుడెవరంటే ప్రజలకు అతని గురించే తెలీనివాడు. అతని అవసరం రానివాడు." "రాజ్యాన్ని పరిపాలించడానికి సాధారణ న్యాయాలు సరిపోతాయి. యుద్ధానికి అసాధారణ చర్యలు కావాలి. కాని ప్రపంచాన్ని నియంత్రించ డానికి ఏ చర్యలూ అవసరం లేదు" అన్నది టావో భావనలు.

**మట్టి గడ్డ... బంగారం ఒకటే**

గౌతమ బుద్ధుడు వివరించాడు. "వేదాంతం ఏ ఒక్కరినీ పరిశుద్ధుల్ని చేయలేదు. ఒక్క శాంతి మాత్రమే ఆ పని చేయగలదు. నేను నా శిష్యునికి బోధించేది రెండే విషయాలు. ఒకటి దుఃఖం ఉన్నది. రెండు దానిని తొలగించే మార్గం ఉన్నది అని. అవే నాలుగు సత్యాలు. 1. దుఃఖం, 2. దానికి కారణం ఉన్నది. 3. దానిని తొలగించవచ్చును. 4. అదే అష్టాంగ మార్గం.

**"ఇది విజ్ఞాన తృప్తాత్మా, కూటస్థా జితేంద్రియః**
**యుక్త ఇత్యుచ్ఛతే యోగీ, సమలోష్టాశ్మకాంచనః"**

ఆత్మ జ్ఞానము, లోక జ్ఞానము కలిగి, ఇంద్రియములను జయించి, మట్టిగడ్డను బంగారమును సమముగా చూసే యోగియే మోక్షమునకు తగిన వాడని భగవానుడు గీతలో సెలవిచ్చాడు.

✧✧✧✧✧

# 45. తత్త్వశాస్త్రసారం - జ్ఞానమే సర్వస్వం

ఈ సృష్టికి మూలం ఏమిటి? ఎవరు ఈ చిత్రజగతిని సృష్టించారు? నీరు... వాయువు... అగ్ని లేదా వీటన్నింటి సమ్మేళనమే సృష్టికి మూలం అని కొందరు వేదాంతులు చెప్పారు. పైథాగరస్ నుంచి సోక్రటీస్ వరకు ఎందరో జ్ఞానస్వరూపులు సృష్టి రహస్యాన్ని ఛేదించేందుకు కృషి చేశారు. వారి ఆలోచనలే తాత్త్విక సీమలకు సోపానాలయ్యాయి.

**"జ్ఞానం తే హం సవిజ్ఞానమ్, ఇదం వక్ష్యామ్య శేషతః**
**యత్ జ్ఞాత్వా నేహ భూయోన్యత్, జ్ఞాతవ్య మవ శిష్యత్"**

– భగవద్గీత 7-2

జ్ఞాన విజ్ఞాన స్వరూపాల గురించి తెలుసుకొన్నవారికి ఈ లోకంలో తెలియవలసినది ఏదీ ఉండదని జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్మ తెలిపాడు.. పైథాగరస్‌ను ఎవరో అడిగారు 'మీరు జ్ఞానులా?' అని. 'నేను జ్ఞానిని కాదు. జ్ఞానాన్ని ప్రేమించే వాణ్ణి' అని బదులిచ్చాడు పైథాగరస్. అలా 'ఫిలాసఫి' అనే పదం పైథాగరస్ వ్యాఖ్యలతో వచ్చింది. గ్రీకు భాషలో ఫిలీన్, సోఫియా అనే మాటలకు అర్థం జ్ఞానాన్ని ప్రేమించడం అని అర్థం.

## సృష్టికి మూలం నీరు

పాశ్చాత్యులకు గ్రీకు తత్త్వవేత్తలే మొదటి వేదాంతులు. వాళ్ల అభిప్రాయం ప్రకారం టర్కీ సముద్ర తీరంలో క్రీస్తుపూర్వం 580 ప్రాంతంలో నివసించిన 'థేల్స్' మొదటి వేదాంతి. 'ఈ కనిపించేది, కనిపించినదీ యావత్తూ నీటి నుంచే పుట్టింది. ఈ భూమి కూడా నీటిపైననే తేలుతున్నది. కాబట్టి నీరు అన్నింటికి మూలం' అన్నాడు. ప్రకృతిని పరిశీలించి దేవుడు, దేవతలు, దెయ్యాలు అనే విషయాలపై ఆధారపడకుండా తార్కికంగా ఆలోచించిన మొదటివాడు కావడంతో థేల్స్ పాశ్చాత్య దర్శనాలకు ఆద్యుడైనాడు.

## సృష్టికి మూలమైన తొలి పదార్థం

థేల్స్ శిష్యుడు అనాక్సిమాండర్ అందరిలాంటివాడు కాదు. గురువునైనా సరే ప్రశ్నించే తత్వం ఉన్నవాడు. ప్రశ్నలే కదా వేదాంతానికి పునాది. ఈ కొండలు, గుట్టలు నీటి నుంచి ఎలా వచ్చాయంటారు? అని అడిగాడు. 'వాటిని తవ్వుకుంటుపో! నీళ్లు కనపడకపోతే అప్పుడడుగు' అని థేల్స్ చెప్పాడు. లోకజ్ఞానం నుంచే కదా విజ్ఞానం వచ్చేది. థేల్స్ సమాధానం లోకజ్ఞాని అనాక్సిమాండర్‌కు తృప్తి కలగలేదు.

నీరు, గాలి, భూమి, అగ్ని వీటిలో ఏ ఒక్కదాని వల్లనో ఈ ప్రపంచం ఏర్పడలేదు. ఇవన్నీ కలిసిన 'ఎపీరాన్' లేదా ఆదిమ పదార్థం ఏదో ఉండి ఉండాలి అని వాదించాడు.

## సృష్టికి మూలం వాయువు

అనాక్సిమాండర్ శిష్యుడు అనాక్సిమెనెస్. ఇతనికి గురువు గారి 'ఎపీరాన్' మీద గురికుదర్లేదు. 'మనలో ఉన్నది మన చుట్టూ ఉన్నది వాయువు. అదే ప్రాణం, ఆత్మ అన్నిటిని ఆవరించి ఉన్నదీ అదే. గాలి నీరుగా, మంచుగా కూడా మారుతున్నది. కావున మారడం లేదా రూపాంతరం చెందడం అనే తత్వం ఉన్న వాయువు అన్నిటికి మూలం' అన్నాడతడు. ఈ మార్పు అనే లక్షణం పరిణామం వచ్చే మార్పు నాణ్యతలో మార్పులు తెస్తుందన్న ఊహ నవీన శాస్త్ర జ్ఞానానికి తొలిమెట్టు అయ్యింది.

## పదార్థ వాదులు

అదే కాలంలో ఉన్న 'హెరాక్లిటస్' దృష్టిలో 'అగ్ని' అన్నింటికీ మూలం. ఎప్పుడూ మారుతూ మనకు కనిపించే ఈ పదార్థాలకు ఎన్నటికీ మారని ఓ రూపం ఉంది. అదే 'లోగోస్'... ఇంద్రియాతీతమైనది. దానిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు అన్నాడతడు. వీళ్లందరూ పదార్థవాదులు (మెటీరియలిస్టిక్స్). డెమెక్రిటిస్ అభిప్రాయం ప్రకారం ఈ విశ్వ నిర్మాణానికి ఏ ఒక్క పదార్థమో కారణం కాదు. అనేక మూల పదార్థాలు, ఆటమ్స్ (కణాలు) కారణం కావచ్చునన్నాడు. ఆత్మలో కూడా చిన్న చిన్న ఆటమ్స్ ఉండడం చేత శరీరమంతటా వ్యాపించి ఉంది అని భావించాడతడు. అయితే వీళ్లందరూ ఒక్క భావాన్ని అంగీకరించారు. రాళ్లూ, రప్పలూ, జంతువులూ, మొక్కలు వీటన్నిటిలోనూ ప్రాణముంది. ఈ ప్రపంచమే ఒక సజీవ పదార్థం అని, దీన్నే 'ఏనిమిజం' అన్నారు.

## మార్పు అంతా భ్రమ

పైథాగరస్ దృష్టిలో ఈ సృష్టి అంతా సంఖ్యానిర్మితం. సంఖ్యలు విశ్వ భవనానికి ఆధారాలు. గ్రహాల నుంచి వచ్చే ధ్వనుల్ని గ్రహ సంగీతం అన్నాడతడు. పునర్జన్మను, ఆత్మ యొక్క శాశ్వతత్వాన్ని నమ్మినవాడు పైథాగరస్. 'పర్మనైడెస్'కు ఆ నమ్మకం లేదు. ఏదైతే వాస్తవంగా ఉందో దాన్నుంచే ఏవైనా జనిస్తాయి. అంతేకాని ఊహల్నుంచి కాదు. ఊహాజనిత రూపాయల్ని మనం జేబులో దాచలేం, వినియోగించలేం కదా! అతని శిష్యుడు 'జెనో' దృష్టిలో ఈ కనిపించే మార్పు, కదలిక అంతా భ్రమ.

## ప్రపంచం ఎలా ఉత్పన్నమైంది?

'గార్గియస్' అనే సోఫిస్టు వాదనలో వాస్తవ ప్రపంచమేదీ లేదు. ఉన్నా అది మనకు తెలిసేది కాదు. ప్రొటగోరాస్ అనే మరో సోఫిస్టు 'అన్నిటికీ కొలబద్ద మానవుడే!

మనం ఏదైతే వాస్తవం అనుకొంటామో అదే వాస్తవం. మిగతాది భ్రమ అన్నాడు. సోఫిస్టులలో ఎక్కువ మంది వితండవాదన చేసేవారు. వాళ్ల వాదనలు ఇతరుల్ని తెలివి తక్కువ దద్దమ్మలుగా రుజువు చేయడానికి ఉపయోగించడంతో సోఫిస్టులకు చెడ్డపేరు వచ్చింది. ఆ కాలంలో సోక్రటీస్ రంగప్రవేశం పాశ్చాత్య ఆలోచనా ధోరణిలో మార్పు తెచ్చింది. ఉన్నవి ఎన్ని పదార్థాలు? అవి ఒకటా? అనేకమా? ఏవి అవి? విభిన్న వస్తువుల ధర్మాలేమిటి? ఒక దానితో వేరొకటి ఎలా కలిసి ఉంటాయి? ఈ ప్రపంచం ఎలా ఉత్పన్నమైంది? కాలము, ప్రదేశము ఇవి పదార్థాలా? ఈ ప్రశ్నలే మెటాఫిజిక్స్ ఆదిభౌతికశాస్త్రంగా రూపొందాయి.

## చైతన్యమే సత్యం

ఇదే భావన రుగ్వేదంలోని నాసదీయ సూక్తంలో పొందుపరచబడింది.

**"నాసదా సీన్నో సదాసీత్తం దానీం, నాసీ ద్రజో నోవ్యో మతా పరోయత్**
**కిమా వరీవః కుహకస్యశర్మన్, అంభః కిమాసీద్గహపం గభీనమ్"**

సృష్టికి పూర్వం సత్తూలేదు. అంతరిక్షమూ లేదు. దాన్ని ఆవరించిన ఆకాశమూ లేదు. అప్పుడు దానిని ఎవరు ఆవరించారు? ఎక్కడ? ఎవరి సుఖము కోసం? గంభీరమైన జలం మాత్రమే అక్కడ ఉంది? అప్పుడు మృత్యువు లేదు. అమృతమూ లేదు. రాత్రింబవళ్లూ లేవు. కాలమసలే లేదు. ఏదో ఒక చైతన్య స్ఫూర్తి మాత్రమే ఉంది. అంతా అంధకారమే. సర్వమూ జలమయమే. మాయతో కప్పబడి ఉంది. ఆరంభమందు కామముండెను. అదే మనస్సుకు బీజమై సృష్టికి కారణమైంది.

ఈ దృశ్య సృష్టి వ్యాప్తి ఎక్కడ నుంచి వచ్చింది?

తర్వాత పుట్టిన దేవతలకు కూడా తెలియని ఈ రహస్యం ఎవరికి తెలుసు?

తెలియదో?

ఎవరు చెప్పగలరు?

✧✧✧✧✧

# 46. ఉపనిషదమృతం - సత్యదర్శనం

ప్రపంచంలోని ఏ సాహిత్యంలోనూ లేనంతగా భయరాహిత్యాన్ని వివరించినవి ఉపనిషత్తులే. లౌకిక బంధనాల నుంచి స్వేచ్ఛను ప్రతిపాదించినవి కూడా ఇవే. బ్రహ్మజ్ఞానాన్ని అనేక సుందరమైన వర్ణనలతో వివరిస్తూ జీవుడు చేరుకోవాల్సిన అంతిమ లక్ష్యాన్ని ఉపనిషత్తులు వివరిస్తాయి.

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్**
**తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే**

సత్యమనే వదనాన్ని బంగారు పాత్ర దాచివేస్తున్నది. ఓ దేవా! దానిని తొలగించి సత్యధర్మాలను నాకు కనిపించేటట్లు చేయి తండ్రీ! శుక్ల యజుర్వేదంలో ఈశావాస్య ఉపనిషత్తులోని ఈ ప్రసిద్ధ మంత్ర భావన ఉపనిషత్తుల సారాంశాన్ని, అవసరాన్ని అద్భుతంగా వివరిస్తోంది. క్షణక్షణం యాంత్రికంగా మారుతూ, మానవ విలువలను, నైతిక బాధ్యతలను కోల్పోతూ, ప్రకృతిలోని సమస్త జీవులకు సంపదలకు హాని కలిగిస్తూ, కాలుష్య భారమెక్కువై నిరంతరం దైహిక మానసిక సంఘర్షణలకు లోనవుతూ, అనాలోచిత నిర్ణయాలతో ఆధిపత్య భావనలతో హింసోన్మాదాలు, ద్వేషాగ్రహాలు పెచ్చుమీరుతూ నిర్నిద్రా భయంతో కాలం గడుపుతున్న నవీన సమాజానికి ఉపనిషద్ విజ్ఞానం అవసరమని అనిపిస్తున్నది.

## ఉపనిషద్ క్రమం

రుగ్వేదంలో 21, యజుర్వేదంలో 109, సామవేదంలో 1,000, అథర్వణ వేదంలో 50. మొత్తం కలిపి 1,180 ఉపనిషత్తులు ఉన్నాయట. వాటిని సంగ్రహ రూపంలో 108 ఉపనిషత్తులుగా భగవాన్ శ్రీరామచంద్రుడు తన భక్తుడైన హనుమంతునికి వివరించాడట. అందులో రుగ్వేదంలోనివి 10, శుక్ల యజుర్వేదం నుంచి 19, కృష్ణ యజుర్వేదం నుంచి 32, సామవేదంలోనివి 16, అథర్వణ వేదంలోనివి 31, వీటిలో ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులు దశోపనిషత్తులుగా ఖ్యాతినొందాయి. వీటికి త్రిమతాచార్యులు భాష్యాలు రాశారు. ప్రతి ఉపనిషత్తులో ప్రసిద్ధాలైన మహా వాక్యాలులున్నాయి. వాటిని 1008గా పండితులు వ్యాఖ్యానించారు. 108 ఉపనిషత్తుల లోని 108 మహావాక్యాలను మాలగా కూర్చి శ్రీరామచంద్రుడు హనుమంతునికి ఉపదేశించాడని ప్రతీతి. వాటిలో అతిముఖ్యమైనవి నాలుగు. 1. ప్రజ్ఞానం బ్రహ్మ (రుగ్వేదం, ఐతరేయ ఉపనిషత్తు, లక్షణ వాక్యం), 2. అహం బ్రహ్మాస్మి

(యజుర్వేదం, బృహదారణ్యక, స్వానుభవ వచనం), 3. తత్త్వమసి (సామవేదం, ఛాందోగ్య, ఉపదేశ వాక్యం), 4. అయమాత్మా (అధర్వణ, మాండూక్య, సాక్షాత్కార వాక్యం) – ఇవి నాలుగూ ఉపనిషత్తుల సారాంశాన్ని వివరిస్తాయి. ఉపనిషత్తులలో వేదాంత విజ్ఞానాన్ని 24 ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. యోగ విద్యలను 20, సన్యాసాన్ని 17, శైవ సిద్ధాంతాన్ని 15, వైష్ణవ సిద్ధాంతాన్ని 14, శక్తి సిద్ధాంతాన్ని 8 ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. ఇవి ప్రముఖ దశ ఉపనిషత్తులతో కలిపి 108. ఈ క్రమాన్ని ముక్తకోపనిషత్తులో చూడవచ్చు.

## గురుశిష్య బంధం

ఉపాధ్యాయుని సన్నిధిలో జ్ఞానామృతాన్ని ఆస్వాదించడమే ఉపనిషత్తుల లక్ష్యం. ప్రతి ఉపనిషత్తు పఠించినప్పుడు ముందు, తరువాత చదవాల్సిన శాంతి మంత్రాలు 1. ఓం వాంగ్మే మనసి ప్రతిష్ఠితా (రుగ్వేదం – ఐతరేయ ఉపనిషత్తు), 2. ఓం పూర్ణమదః (శుక్ల యజుర్వేదం – ఈశావాస్య), 3. ఓం సహనావవతు (కృష్ణ యజుర్వేదం – కఠ, తైత్తిరీయాది ఉపనిషత్తులు), 4. ఓం అప్యాయమస్తు మమాంగాని (సామవేదం – ఛాందోగ్యాది ఉపనిషత్తులు), 5. ఓం భద్రం కర్ణేభిః (అధర్వణ వేదం – మాండూక్యాది ఉపనిషత్తులు) ఈ మంత్రాలన్నీ గురుశిష్యుల మధ్య సంబంధాన్ని, జ్ఞానసముపార్జనలో ఉండాల్సిన భక్తి శ్రద్ధలను, మానసిక స్థితిని, సంసిద్ధతను ఉద్బోధిస్తున్నాయి.

మానవునికి ధైర్యాన్ని, ఆత్మజ్ఞానాన్ని ప్రబోధించినవి ఉపనిషత్తులు.

– స్వామి వివేకానంద

సత్యాన్వేషణయే ఉపనిషత్తుల లక్ష్యం – రాబర్ట్ ఎర్నెస్ హ్యూమ్

నదులు వేర్వేరు పేర్లతో ప్రవహిస్తూ సముద్రంలో కలిశాక తమ ఉనికిని కోల్పోయినట్లే జీవాత్మలు, పరమాత్మలో కలుస్తాయి. ఈ భావన వేరే ఏ దేశ తత్త్వ భావనలోనూ లేదు... ఒక్క వేదాంతంలో తప్ప!

– మాక్స్ ముల్లర్

హైందవ సంస్కృతిలోని ప్రతీ భావన ఉపనిషత్తుల మూలం నుంచి వచ్చిందే.

– బ్లూమ్ ఫీల్డ్

✧✧✧✧✧

# 47. జీవితాన్ని సార్థకం చేసే ఉపనిషత్ విజ్ఞానం

ఆదిశంకరులు భాష్యం రాసింది పది ఉపనిషత్తులకే కనుక సనాతనులు వాటినే ప్రామాణికంగా స్వీకరిస్తారు. నిజానికి ఉపనిషత్తుల ప్రామాణికతను వాటి ప్రాచీనతతో ముడిపెట్టడానికి వీల్లేదు. భక్తి ఉద్యమ కాలం నుంచి గత శతాబ్దం వరకు ఉపనిషత్తుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. ఏ కాలానికి చెందినవైనా మనకంటే పూర్వులు చేసిన వేదాంత, తాత్త్విక చర్చల సారంగా మనకు లభ్యమయ్యే ఉపనిషత్తులను గురించి తెలుసుకోవలసిందే. ఉపనిషత్తుల చరిత్ర, అవి బోధించే సార్వజనీన సత్యాలను గురించి...

కాలం ఇంకా ప్రారంభం కాని కాలం ఉంది. ఈ సృష్టి ప్రారంభం కోసం అప్పుడప్పుడే సన్నాహాలు జరుగుతున్నాయి. ఇంకా ఉనికి కనుచూపు మేరలో లేదు. అది కనిపించనిది. వినిపించనిది. స్పర్శకు అందనిది. కనుకనే అది పూర్ణమైనది. దానినుంచే ఈ సంపూర్ణమయిన దృశ్యప్రపంచం ఆవిర్భవించింది. ఆ కనిపించని, వినిపించని, స్పర్శకు అందని దానిని జీవకోటికి అందచేయడానికి ఇంద్రియాలు ఏర్పడ్డాయి. ఇంద్రియాలను మంచిదారిలో నడిపించేవి దేవతలు. చెడుదారి వైపు నడిపించేవి అసురులు. ఈ రెండింటి మధ్య జీవకోటి పరిణామపు దారిలో పయనిస్తున్నది. తదనంతర కాలాల్లో పేర్లు పెట్టిన దార్లు ఎన్నో ఉండవచ్చు. కానీ అసలైన రహదారికి పేరు లేదు. ఎల్లలు లేవు. సిద్ధాంతాలను నమ్మేవాళ్లు వేర్వేరు పేర్లు ప్రతిపాదిస్తారు. ఆ దారులన్నీ కొంతదూరం పోగానే మూసుకుపోతాయి.

## పరమాత్మ జ్ఞానం

ఏ దారీ కనిపించని ఆ స్థితిలో ప్రపంచం అయోమయంగా కనిపిస్తుంది. ఓ పట్టాన అంతుపట్టదు. సులువుగా తెలిసేదానిని తెలుసుకున్నందువల్ల జ్ఞానం రాదు. అది అవిద్య మాత్రమే. అసలైన విద్య ఈ ఇంద్రియాలకు అతీతమైన పరమాత్మ జ్ఞానమే. ఈ పరమాత్మ తనంతట తానే జన్మించినవాడు. (స్వయంభువు) అన్నిచోట్లా ఉండేవాడు (సర్వవాప్తి. ప్రకాశవంతమైనవాడు. శరీరాంగాలు లేనివాడు. పరిపూర్ణుడు. అన్నీ తెలిసినవాడు.)

**యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవాను పశ్యతి**
**సర్వ భూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే**

అన్ని ప్రాణులూ తన ఆత్మకంటే వేరు కావని, అన్ని జీవులలో ఉన్న ఆత్మయే తనలోనూ ఉన్నది అని గ్రహించినవారు ఎవ్వరినీ ద్వేషించడు. ద్వేషం లేనప్పుడు

దుఃఖమెక్కడిది? ఈ ప్రపంచమంతా నామం, రూపం, క్రియా రహితమైన ఈశ్వరుడే అని గ్రహించడమే విద్య. అటువంటి విద్యార్జనకు ఉపకరించేది భారతీయ ఉపనిషత్ విజ్ఞానం.

## ఉపనిషత్తుల చరిత్ర

దేశకాల వస్తు పరిచ్ఛేదం లేకుండా బ్రహ్మజ్ఞానాన్ని బోధించేవిగా, గురుసన్నిధిలో గ్రహించే జ్ఞానంగా, దుఃఖాలను శిథిలం చేసి ముముక్షువుల అవిద్యను నాశనం చేసేవిగా ఉపనిషత్తులు ప్రసిద్ధికెక్కాయి. శంకర, రామానుజాచార్యుల కాలానికి 30 వరకు ఉన్న ఉపనిషత్తులు క్రీ.శ. 14వ శతాబ్దానికి 60గా, ధార్మిక సంప్రదాయాలకు సమాంతర వ్యాఖ్యానాలుగా వీటి సంఖ్య పెరిగింది. ముక్తకోపనిషత్తులో 108 ఉపనిషత్తులు ఉన్నాయని చెప్పగా, మద్రాసు అడయార్ లైబ్రరీవారు 179, బొంబాయిలోని గుజరాతీ ప్రింటింగ్ ప్రెస్‌వారు 223 ఉపనిషత్తులను ప్రచురించారు.

**ఈశకేన కఠప్రశ్న ముండ మాండూక్య తైత్తిరిః**
**ఐతరేయంచ ఛాందోగ్యం బృహదారణ్యకం దశ**

ఇలా ముక్తకోపనిషత్తులో ఈ పది ఉపనిషత్తులను ప్రథమ క్రమంలో వివరించారు. వీటినే ప్రాచీనమైనవిగా, ప్రామాణికమైనవిగా భావించి శంకరాచార్యుల వారు భాష్యం రచించారు. ప్రముఖమైన ఉపనిషత్తులు క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం నాటికే రచించడం పూర్తి అయినా, క్రీస్తుశకం 16,17 శతాబ్దాల వరకు ఉపనిషత్తుల రచన కొనసాగుతూనే ఉంది.

కౌషీతకీ, శ్వేతాశ్వతర, మైత్రాయణీ ఉపనిషత్తులు కూడా ప్రాచీనమైనవేనని విజ్ఞుల అభిప్రాయం. వజ్రసూచికోపనిషత్తు 2వ శతాబ్దం నాటిదని, అల్లా ఉపనిషత్తు 17వ శతాబ్దం నాటిదని భావిస్తున్నారు. 1640లో షాజహాన్ చక్రవర్తి కుమారుడు దారాషుకోవ్ కాశ్మీర్ వెళ్లినప్పుడు ఉపనిషత్తుల గురించి విని 1657 నాటికి 50 ఉపనిషత్తులను సిర్ర–ఎ–అక్బర్ (మహారహస్యం)గా పారశీక భాషలోకి అనువదించాడు. దాని ఆధారంగా చేసిన లాటిన్ అనువాదం ఎంకెటిల్ డుపరే అనే పండితుడు ఔపనేఖత్ అనే పేరుతో 1802లో ప్రచురించాడు. తర్వాతి కాలంలో రాజారామమోహనరాయ్, పాల్ డయస్సన్, ప్రొఫెసర్ వెబర్, మాక్స్‌ముల్లర్ వంటి మహనీయులు ఉపనిషత్తులను ప్రపంచ దేశాల్లో వెలుగులోకి తీసుకువచ్చారు.

✧✧✧✧✧

# 48. ఉపనిషత్ మూలం - ఆత్మజ్ఞాన మార్గం

సర్వమానవ కళ్యాణమే పరమార్థంగా ఉపనిషత్తులు జీవం పోసుకున్నాయి. నిత్యజీవితంలో ఎదురయ్యే వేలవేల సందేహాలకు మహనీయులు ఉపనిషత్తుల్లో నివృత్తి మార్గం చూపారు. ఇహంతోపాటు పరం గురించి బోధించే ఆ జ్ఞాన భాండాగారాలు నేటికీ నిత్యనూతనాలే. విజ్ఞాన వీచికలైన ఉపనిషత్తుల విశేషాలు...

**'ఓం సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై**
**తేజస్వి నావధీతమస్తు. మా విద్విషావహై ఓం శాంతి, శాంతి, శాంతిః'**

గురు శిష్యుల మధ్య సంబంధాన్ని తెలిపే కృష్ణ యజుర్వేదంలోని ఈ శాంతి మంత్రం మనకు ప్రతి చోటా వినిపిస్తుంటుంది. 'ఆ పరమాత్మ మనలనిద్దరినీ రక్షించుగాక. ఇద్దరినీ పోషించుగాక. ఇద్దరమూ కష్టపడి అధ్యయనం చేద్దాం. ఈ కృషి ఏకాగ్రతతో ఫలవంతం అగుగాక. అభిప్రాయాలు వేరైనా మనం ఒకరినొకరు ద్వేషించుకొనకుందుముగాక' అని దీని అర్థం.

**'ఓం సమస్సర్వ వేదాంత వేద్యాయ పరమాత్మనే**
**వేదేభ్యో వేద దర్శిభ్యో మహర్షిభ్యో నమో నమః'**

ఇది ధర్మం... ఇది అధర్మం అని తెలిపేది వేదం. విద్ అనగా జ్ఞానం, సత్యం, లాభం, ఆలోచన అని అర్థాలుగా చెప్పారు. తొలుత వేదాలు ఏక రాశిగా ఉండేవి. వాటి నుంచి మహర్షులు వృత్తబద్ధాలైన మంత్రాలను 'ఋక్కులు'గా, గీతి రూపాలైన మంత్రాలను 'సామములు'గా గుర్తించారు. ఐహిక ఫలాన్ని సమకూర్చే అధర్వణ వేదంలోకి యజ్ఞాలకు ఉపయోగపడే ఒక కాండను చేర్చిన తర్వాత ఆ వేదానికి కూడా ప్రామాణ్యం ఏర్పడి 'చత్వారో వేదాః' (నాలుగు వేదాలుగా) ప్రాచుర్యం పొందాయి.

ప్రతి వేదంలోనూ రెండు భాగాలు ఉంటాయి.

1) సంహిత, 2) బ్రాహ్మణం. సంహితలో మంత్రాలూ, బ్రాహ్మణంలో ఆ మంత్రాలకు వ్యాఖ్యానాలుంటాయి. అరణ్యకాలు బ్రాహ్మణాలకు అనుబంధాలు.

## అరణ్యకాల్లో భాగాలు ఉపనిషత్తులు

'అరణ్య ఏవ పాఠత్వాత్ అరణ్యక ఇతీర్యతేః' అరణ్యాల్లో ప్రశాంతంగా మననం చేసుకునేవి కనుక ఇవి అరణ్యకాలైనాయి. ఉపనిషత్తులు అరణ్యకాల్లోని భాగాలే. వేదంలో చివర ఉండే భాగం గనుక ఉపనిషత్తులకు వేదాంతం అనే వ్యవహారం ఏర్పడింది. ఉపనిషత్ అంటే ఉపాధ్యాయుని దగ్గర కూర్చోవడం. ధర్మే రహస్యుపనిషత్–

ఉపనిషత్ ధర్మాన్ని, రహస్యాన్ని సూచిస్తుంది. సర్వే అర్థా ఉపనిషదంత్య స్వామిఇ' ఉపనిషత్తులందు అన్ని అర్థాలున్నాయని అమరకోశంలో పేర్కొన్నారు. శబ్ద రత్నాకరంలో ఉపనిషత్తుకు వేదాంతం, ధర్మం, ఏకాంతం అనే అర్థాలు చెప్పారు.

## ప్రాచీనమైనవి పదేనా?

ముక్తకోపనిషత్తు ప్రకారం ఉపనిషత్తుల సంఖ్య 108. అయితే ప్రాచీనమైన ఉపనిషత్తులు పది మాత్రమే.

**'ఈశ కేన కఠప్రశ్న ముండ మాండూక్యతైత్తిరిః**
**ఐత రేయంచ ఛాందోగ్యం బృహదారణ్యకం దశా'**

అని ముక్తకోపనిషత్తులో చెప్పారు. రెండు వందలకు పైగా ఉపనిషత్తుల సంఖ్య పెరిగినా శంకర, రామానుజుల కాలం నాటికి ఉన్నవి ముప్పై మాత్రమే. శంకర, రామానుజ, నింబార్క, వల్లభ, మధ్వాది ఆచార్యులు పైన చెప్పిన పది ఉపనిషత్తులకే కాకుండా శ్వేతాశ్వతర, కౌషీతకి ఉపనిషత్తులకు మొత్తం 12 ఉపనిషత్తులకు భాష్యాలు రాశారు.

## పరమార్థ సారం

'బ్రహ్మ దిద్యమే ఉపనిషత్తు'. బ్రహ్మమే సత్యం. జగత్తు మిథ్య. జీవుడే బ్రహ్మం. ఇది ఉపనిషత్తుల ఉపదేశ సారం. అత్యంతిక దుఃఖ నివృత్తి పరమానంద ప్రాప్తి అయిన ముక్తిని సాధించు ఆత్మ జ్ఞాన మార్గమే ఉపనిషత్ మార్గం. క్రీస్తుపూర్వం 800-500 మధ్యకాలంలో ముఖ్యమైన ఉపనిషత్తులు వెలువరించారని అంచనా. మనం ఎక్కడ నుంచి వచ్చాం? ఎక్కడ జీవిస్తున్నాం? చివరికి ఎక్కడకు వెళతాం? అనే ప్రశ్నలకు సమాధానాలు గురు శిష్య సంవాద రూపంలో వివరించారు.

**శుక్ల యజుర్వేదాంతర్గతమైన ఉపనిషత్తులకు శాంతి మంత్రమైన**
**'ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ, పూర్ణమే వావశిష్యతే! ఓం శాంతి! శాంతి! శాంతిః**

'ఆ కనిపించునది అనంతం. ఈ కనిపించే విశ్వం కూడా అనంతమే. ఆ అనంత విశ్వం నుంచే ఈ విశ్వం బహిర్గతమైనది. ఈ అనంత విశ్వం దాని నుంచి వెలువడినా ఆ అనంతం అనంతంగానే ఉన్నది' ఈ మంత్రం సృష్టి అనంత పరివ్యాప్తతను తెలుపుతుంది.

ఆది శంకరులవారు (క్రీ.శ. 788-820) భాష్యం చెప్పిన ముఖ్య ఉపనిషత్తుల్లోని ఏకేశ్వర వాదాన్ని, జన్మ రాహిత్యాన్ని, అమర్త్యత్వాన్ని గురించిన మార్మిక వ్యక్తి రహిత భావనలే అతి ప్రాచీనకాలం నుంచి నేటి వరకు భారతీయ తాత్విక

చింతనను ప్రభావితం చేశాయి. ఉపనిషత్తులు మననానికి, ధ్యానానికి ఉద్దేశించిన గుప్తమైన ఆధ్యాత్మి జ్ఞానానికి మూర్త రూపాలు. ఎంత లోతుగా తరచి చూస్తే అంత గూఢార్థాలు సాధకుడికి దొరుకుతాయి.

**ఉపనిషత్తులు ఏం చెబుతున్నాయి?**

✧ **ఈశావ్యాసోపనిషత్తు :** సర్వ ఉపనిషత్ సారమైన ఏకేశ్వరవాదాన్ని, విశ్వంలో సకలం ఈశ్వరుడే అని ప్రబోధిస్తుంది.

✧ **కేనోపనిషత్తు :** పరబ్రహ్మ స్వరూప జ్ఞానాన్ని బోధిస్తుంది.

✧ **కఠోపనిషత్తు :** యమ-నచికేత సంవాదాంశమైన మృత్యు రహస్యాన్ని వివరిస్తుంది.

✧ **ప్రశ్నోపనిషత్తు :** పిప్పలాదముని తన ఆరుగురు శిష్యులకు వివరించిన పాంచభౌతిక శరీరతత్వాన్ని, ప్రాణ రహస్యం, పరమాత్మ స్వరూపాన్ని తెలియచెబుతుంది.

✧ **ముండకోపనిషత్తు :** పర, అపర విద్యా జ్ఞానాన్ని (జుట్టును తీసివేయు క్షురకుని కత్తి వంటిది) తెలుపుతుంది.

✧ **మాండూక్యోపనిషత్తు :** జాగృత, స్వప్న, సుషుప్తి అవస్థల నుంచి తురీయావస్థను (పరమానందం) చేరుకునే మార్గాన్ని చెబుతుంది.

✧ **తైత్తిరీయోపనిషత్తు :** లోకాదుల పరస్పర సంబంధాల్ని, కారకర్త విశిష్టతను, పంచకోశాల వివరణను, బ్రహ్మ పదార్థాన్ని తెలుపుతుంది.

✧ **ఐతరేయోపనిషత్తు :** స్థావర జంగమాత్మకమగు ఈ ప్రపంచమంతా పరమాత్మ సంకల్పం వల్ల జనించిందని చెబుతుంది.

✧ **ఛాందోగ్యోపనిషత్తు :** ఓంకార మహత్మ్యాన్ని, స్వస్వరూప జ్ఞానాన్ని, భౌతికవాద సరిహద్దులను అన్వేషించిన సత్యకామ, శ్వేత కేతు, నారద మహర్షుల సత్యశోధనను వివరిస్తుంది.

✧ **బృహదారణ్యకోపనిషత్తు :** జనక, యజ్ఞవల్క్య, మైత్రాయి, గార్గిల వాద సంవాదనాంశాలను, జీవాత్మ, పరమాత్మ స్వరూపాలను, గాయత్రి మంత్ర విశిష్టతను, వాజపేయ యాగ మహిమను వెల్లడిస్తుంది.

అందువల్లనే సకల దేవతలనూ, ధర్మాన్ని, పరబ్రహ్మతత్వాన్ని ప్రతిపాదించే వేదాలకు గమ్యం, సారం అయిన ఉపనిషత్తులు హైందవ విజ్ఞానానికి పరాకాష్ఠగా పరిగణిస్తున్నారు.

✧✧✧✧✧

# 49. తత్వశాస్త్రం... జ్ఞాననేత్రం

అనుకోకుండా జరిగినవి, మన ప్రమేయం లేకుండానే మనల్ని కేంద్ర బిందువుల్ని చేసిన సంఘటనలు మనలనూ, మన మనసునూ అల్లకల్లోలం చేసినప్పుడు ఏ శక్తి వాటిని నడుపుతున్నదోనన్న జిజ్ఞాస కలుగుతుంది. ఆ ప్రశ్నకు సమాధానం పొందే ప్రయత్నమే తత్వశాస్త్రం. జ్ఞాననేత్రాన్ని తెరిపించే తత్వశాస్త్రం కథేంటి...? పలు ఇజాల నిజానిజాలేమిటో చూద్దాం...

జీవన మార్గంలో అలజడివానకు శాంతిఛత్రమే తాత్త్విక చింతన. పూర్తిగా యాంత్రికమై, ఏదీ మనది కాని జీవితం మనల్ని వెక్కిరిస్తున్నప్పుడు ఏం చేయాలో, ఏం తినాలో, చివరకు ఎలా చావాలో కూడా మనలో నియంతైనవాడెవడో నియంత్రిస్తూ ఉనప్పుడు మసకబారిన మనసు, శాంతికోసం మూలాల్ని వెతుక్కుంటుంది. అనుకోకుండా జరిగినవి, మన ప్రమేయం లేకుండానే మనల్ని కేంద్రబిందువుల్ని చేసిన సంఘటనలు మనలనూ, మనసునూ అల్లకల్లోలం చేసినపుడు ఏ శక్తి వాటిని నడుపుతున్నదోనన్న జిజ్ఞాస కలుగుతుంది. ఆ జిజ్ఞాస భూత, భవిష్యత్, వర్తమాన కాల వాకిళ్లలోకి చొరబడి 'సత్యశోధన'గా కొత్త ఊహల్ని సంతరిస్తుంది. 'ఎవరు దీనికి కారణం' అనే ఒకే ప్రశ్న అనేక జవాబులై, ఆ జవాబులే అనేక ప్రశ్నలు కాగా తాత్త్విక మహావృక్షం కొమ్మలు రెమ్మలుగా విస్తరించిపోతుంది.

ఫిలియా (ప్రేమ), సోఫియా (జ్ఞానం) అనే రెండు గ్రీకుమాటల కలయిక ఫిలాసఫీ (జ్ఞానపిపాస, జ్ఞానదాహం, తత్త్వశాస్త్రం) ప్రకృతి పరిణామాన్ని, సామాజిక పరిణామాన్ని తెలియజేసే ఈ శాస్త్రంలో భావవాదం, భౌతికవాదం అనేవి రెండు ముఖ్యమైన ధోరణులు. ఈ రెంటి మధ్య జరుగుతూ వచ్చిన వాదోపవాద పోరాటచరిత్రే తాత్త్విక చరిత్ర. 'తత్త్వశాస్త్రం అంటే సత్యపరిశీలనా శాస్త్రం' అన్నాడు అరిస్టాటిల్. 'కళలకు రాణి, స్వర్గానికి సంతానం' అన్నది బర్క్ అభిప్రాయం. 'నిర్భయమైన స్వతంత్ర బుద్ధి మాత్రమే తాత్త్విక పరిశీలన చేయగలదు' అని కారల్‌మార్క్స్ వివరించగా, 'అన్ని విషయాలకూ మానవుడే కొలబద్ద' అని పైథాగరస్ పేర్కొన్నాడు.

**భావ – భౌతిక వాదాలు**

ఆత్మ (స్పిరిట్), చైతన్యం (కాన్షస్‌నెస్) మొట్టమొదట ఉన్నాయని, ఈశ్వర సంకల్పం వలన చైతన్యం నుంచి పదార్థం ఏర్పడిందని భావించేవారు భావవాదులు. పదార్థం ప్రధానమైనది. చైతన్యం పదార్థం నుంచి పరిణామ క్రమంలో ఉద్భవించిందని విశ్వసించేవారు భౌతికవాదులు.

క్రీస్తుపూర్వం 800–200 మధ్యకాలంలో హిందూ, చైనా, గ్రీకు దేశాల విద్యావంతులలో ఒకేసారి, వేర్వేరుగా, ఓ తరంగంలా తాత్త్విక చింతన ప్రారంభమైంది. ముఖ్యంగా క్రీస్తుపూర్వం 500 కాలాన్ని కారల్ జాస్పర్ అనే ఇరవయ్యో శతాబ్దపు వేదాంతి మానవ నాగరికతా కాలరథపు అక్షము – ఇరుసుగా అభివర్ణించాడు.

ఉపనిషత్తులు, బుద్ధుని, మహావీరుని బోధనలు – హిందూదేశంలో; కన్ఫ్యూసియస్, లావొట్సు, మోటి, చువాంగ్ట్సు, లేట్సు – చైనాలో; జోరాస్టర్, ఇరాన్‌లో; ఎలియా, ఇస్సయ్య, జెరిమియా – పాలస్తీనాలో; థేల్స్, ఎనాక్సిమాండర్, ఎనాక్సిమినెస్, హోమర్, పర్మనిడెస్, హెరాక్లిటస్, ప్లాటో, పైథాగరస్, సోక్రటీస్, అరిస్టాటిల్ గ్రీకుదేశాలలో, ఇంకా ఎందరో మహానుభావులు తత్త్వచింతనను ప్రభావితం చేశారు. ఆలోచన, ఇంద్రియజ్ఞానం, భావసంపుటి, ఇచ్ఛాశక్తి కలిసి చైతన్యమవుతున్నాయి. అస్థిత్వమే చైతన్యాన్ని నిర్ణయిస్తుందనేది కారల్‌మార్క్స్ అభిప్రాయం.

## గతితర్కం

'డైలిగో' అన్న గ్రీకుపదం నుంచి 'డైలెక్టిక్స్' (గతితర్కం) అన్నమాట ఉద్భవించింది. దీని అర్థం సంభాషణ లేదా తర్కం. హెగెల్ (1770–1831) గతితార్కిక వాదాన్ని 'హెరాక్లిటస్' సిద్ధాంతాల ఆధారంగా అభివృద్ధి చేశాడు. కనిపించే ప్రతి వస్తువూ మార్పు చెందుతుందనీ, ఒకదానితో ఒకటి సంబంధం లేని వస్తువులు గానీ, జీవులు గానీ, సంఘటనలు గానీ లేవని నిరూపించాడు.

## మార్క్స్, ఎంగెల్స్

వీరు హెగెల్ సిద్ధాంతంలోని భావవాదాన్ని వదిలి తమ సిద్ధాంతాన్ని ప్రబోధించారు. వారి అభిప్రాయం ప్రకారం 'గతితర్కం అంటే బయటి ప్రపంచం మానవుని ఆలోచన, వీటి చలనానికి సంబంధించిన సాధారణ సూత్రాల విజ్ఞానమే. భౌతిక పునాదిపై గతితార్కిక పద్ధతిని భావించడం గతితార్కిక భౌతికవాదం. దీనిలో మూడు ముఖ్య సూత్రాలున్నాయి. 1. పరస్పర విరుద్ధ శక్తుల ఐక్యత, సంఘర్షణ... ప్రతి వస్తువులోనూ, జీవిలోనూ లేదా ప్రతి వ్యవస్థలోనూ ఉండడం వల్ల అభివృద్ధి చెందడం. 2. విరోధ వైరుధ్య సూత్రం (నెగేషన్ ఆఫ్ ది నెగేషన్) పాతవి విధ్వంసం కావడం ద్వారా కొత్తవి ఉన్నతస్థాయిలో ఉద్భవించడం. 3. గుణాత్మక మార్పు – వ్యవస్థ, వస్తువులు లేదా జీవులు పరిణామం హెచ్చిన కొద్దీ కొత్త గుణాలను సంతరించుకోవడం. చారిత్రక భౌతికవాదం పై వాదాన్ని సామాజిక జీవిత అధ్యయనానికి విస్తరింపజేస్తుంది. సమాజంలో అదృశ్యశక్తులు గానీ, లోకాతీత శక్తులు గానీ పనిచేయడం లేదనీ ప్రజలే తమ చరిత్రను తాము నిర్మించుకుంటారనీ ఈ వాదం తెలియజేస్తుంది.

### జ్ఞానసిద్ధాంతం

ఎపిస్టమాలజీ (జ్ఞానసిద్ధాంతం) జ్ఞానము యొక్క ఉత్పత్తి స్వభావమును, పరిమితులను గురించి పరిశీలిస్తుంది. 'ఆచరణలేని సిద్ధాంతం మృతప్రాయమని, సిద్ధాంతం లేని ఆచరణ గుడ్డిది' అని మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం ప్రబోధిస్తుంది.

మెటాఫిజిక్సు (అధిభౌతికవాదం, జడాత్మక వాదం) ఊహాత్మక ఆలోచనల ద్వారా వస్తువుల శాశ్వతత్వాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది. యాంత్రిక భౌతికవాదం (మెకానికల్ మెటీరియలిజం) ప్రపంచంలో జరిగే మార్పులు యంత్ర గమనాన్ని పోలివుంటాయని భావిస్తుంది. అస్తిత్వవాదం (ఎక్స్టర్నలిజం) 'నేనున్నాను' అనే అస్తిత్వాన్ని గుర్తిస్తుంది. వ్యక్తి ఒంటరివాడు. సమాజం వ్యక్తి వైశిష్ట్యాన్ని అపహరిస్తోంది. దేవుడు లేడు, ఉన్నా అతని ఉనికి వల్ల మానవునికి ఒరిగిందేమీ లేదు. మనిషి మంచి, చెడు చర్యలకు మనిషే బాధ్యుడు అని ఫ్రెంచ్ మేధావి జీన్ పాల్ సార్త్రే అస్థిత్వవాదాన్ని నిర్వచించాడు.

యుటిలిటేరియజమ్ (ఉపయోగితావాదం) – ఒక చర్యయొక్క లాభమే దాని గొప్పతనానికి గీటురాయి. సమాజ ప్రయోజనాల కన్నా అత్యధిక సంఖ్యాకులకు అత్యధిక ఆనందాన్ని కల్గించడమే ముఖ్యం అనే ఈ సిద్ధాంతం బ్రిటన్‌లో బాగా ప్రాచుర్యం పొందింది.

ప్రత్యక్ష ప్రమాణవాదం (ఎంపిరిసిజమ్) కళ్లతో చూసిందే నిజం. ఇందియానుభూతులే వాస్తవం. భావనలు, ఊహలకు సరిసమానమైనవి వాస్తవ జగత్తులో ఉండవు అనేది ఈ వాదం సారాంశం. అజ్ఞేయవాదం (ఎగ్నోటిజమ్) ప్రపంచం గురించి మనం ఎంత ప్రయత్నించినా పూర్తిగా తెలుసుకోలేమని చెబుతుంది. వ్యవహారిక సత్తావాదం (ప్రాగ్మాటిజమ్) నిత్యవ్యవహారంలో ఉపయోగపడేది, అత్యంత లాభాన్ని చేకూర్చిపెట్టేదే సత్యం. వాస్తవ జీవితంలో ఉపయోగపడేంతవరకే దేవుడ్ని నమ్మవచ్చు. ఇది అమెరికా వాసులకు నచ్చినవాదం.

యానిమిజం జీవులన్నీ పదార్థం కంటె భిన్నమైన ఆత్మచే సృజించబడ్డాయని, సంశయవాదం (స్కెప్టిసిజం) ఇంద్రియ స్పర్శజ్ఞానాన్ని మించి అదనంగా ఏదైనా ఉన్నదీ లేనిదీ మానవుడు తెలుసుకోలేడనీ, మార్మికవాదం (మిస్టిసిజం) తపోనిష్ట, యోగసాధన, ధ్యానం ద్వారా ఆత్మ లేదా దైవసాక్షాత్కారం దివ్యమధురానుభూతులు కలుగుతాయని వివరిస్తాయి. ఇప్పుడున్న అన్ని సిద్ధాంతాలను, నమ్మకాలను, మత విధానాల్ని తిరస్కరించి అస్థిత్వమే లేదని వాదించే మతం నిహిలిజం. ఇది 19వ శతాబ్దంలో రష్యాలో వ్యాప్తి చెందింది.

## చార్వాకం

ప్రాచీన భారతదేశ భౌతికవాదాన్ని లోకాయతం లేదా చార్వాకం అంటారు. క్రీ.పూ. 600 ప్రాంతంలో బృహస్పతి, చార్వాకుడు 'జ్ఞానానికి ఇంద్రియానుభూతులే మూలం. దేవుడు, ఆత్మ, కర్మ, పునర్జన్మ లేవు. సుఖమయ జీవితం గడపడమే మానవలక్ష్యం' అని బోధించారు. కణాదుని వైశేషిక దర్శనంలోనూ, కపిలుని సాంఖ్య వాదంలోని మూలసూత్రాలు భౌతికవాద దృష్టినే ప్రతిబింబిస్తాయి.

'నిజాన్ని ఎవరూ దాచలేరు. ఎవరు ఎంతగా అణచివేయడానికి ప్రయత్నించినా సత్యం మళ్ళీ బయటకు వచ్చి మరింత కాంతితో ప్రకాశిస్తుంది' అంటాడు విలియం బ్రియాంట్.

కాలక్రమంలో ఎన్ని వాదాలు, ఇజాలు వచ్చినా క్రీస్తుపూర్వం 800 సంవత్సరాల కాలంలో బృహదారణ్యకోపనిషత్తులోని (1-3-28)

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

అసత్తు (మృత్యువు) నుంచి సత్తు (అమరత్వం)లోకి, చీకటి నుంచి వెలుగులోకి, మృత్యువు నుంచి శాశ్వతమైన అమరత్వంలోకి నడిపించమనే వాక్కు ఎన్నటికీ సత్యంగా భాసిస్తున్నది.

✧✧✧✧✧

# 50. అనంత మథనం "సత్యాన్వేషణ"

**"మొదట అక్కడ ఏమీ లేదు. ఆకలితో ఉన్న మృత్యువు ఆవరించి ఉంది. ఆకలే మృత్యువు. అతడు మనసును కోరుకున్నాడు. మనసు పుట్టింది."**

– బృహదారణ్యకోపనిషత్తు.

**"అప్పుడు అక్కడ ఏమియు లేకుండెను. చీకటి అన్నివైపులా వ్యాపించి యున్నది. ఆ జలములపై పవిత్రాత్మ అల్లల్లాడుచుండెను.**

– పాత నిబంధన

లిపి ప్రారంభమై, ధ్వనులు అక్షర రూపాంతరం చెంది, శ్రుతులు వ్రాత ప్రతులుగా భద్రపడుతున్న ఈ రోజుల్లో కూడా, ఇంకా ఇక్కడ నిలబడి ఇప్పటికీ మనిషి ఇదే ప్రశ్న వేస్తున్నాడు... "అన్నింటికంటే ముందు ఏముంది?" ప్రపంచ మానవుని చిరంతన అధ్యయనంలో, నిరంతర సత్యాన్వేషణలో అతని మేధస్సుకు అందని బృహత్ రహస్యాలెన్నింటినో అవగతం చేసుకోలేక అవస్థ పడుతూనే ఉన్నాడు. సత్యాన్వేషణలో బృహదారణ్యకోపనిషత్తు వర్ణించిన సృష్టిక్రమం ఇది...

అన్నింటికంటే ముందు ఏమి ఉందో అదే మనసును కోరుకుంది. మనసు పుట్టిన తర్వాత అర్చిస్తున్నప్పుడు పుట్టిన జలాలనే 'అర్కః' అని పిలిచాడతను. ఆ నీటి నురగ గట్టిపడి పృథ్వి నాభినుంచి వెలువడుతున్న పద్మంలా వికసించింది. ఆ శ్రమలో అలిసిన అతని తపస్సు నుంచి తేజస్సు (అగ్ని) పుట్టింది. ఆ హిరణ్యగర్భ పరమాత్మ మూడు భాగాలైంది. ఆ భాగాలే అగ్ని, సూర్యుడు, వాయువు.

## పరమాత్మ స్వరూపం

తూర్పు దిక్కు పరమాత్మకు శిరస్సు. ఈశాన్య ఆగ్నేయాలు రెండు చేతులు. పశ్చిమ దిక్కు కిందిభాగం. వాయువ్య నైరుతిలు రెండు జఘనములు. దక్షిణ ఉత్తరాలు రెండు పార్శ్వాలు. వీపు కాంతిలోకం. ఆకాశం కడుపు. భూమి హృదయం. ఈ విశ్వరూపుడైన అగ్ని మొదట నీటిలో ఉన్నాడు. అగ్ని జీవాండమైంది. సంవత్సర కాలంలో అది పిండమై శిశువైంది. ఆకలితో ఉన్న పరబ్రహ్మము ఆ శిశువును తినేయడానికి నోరు తెరిచినప్పుడు శిశువు భాణ, భాణ అని శబ్దం చేశాడు. అదే వాక్కు. ఈ వాక్కు పరబ్రహ్మము యొక్క మనస్సుతో జతకలిసి సమస్తాన్ని సృష్టించింది. వేదాలు, ఛందస్సులు, యజ్ఞాలు, సకల చరాచర జీవరాశులు ఇలా పుట్టినవే. ఆ పరమాత్మ దేనినైతే సృష్టించాడో దానిని తినేయాలనుకున్నాడు. ఆ తలపు వచ్చినందుకే పరమాత్మకు అదితిత్వం కలిగింది. సర్వజగత్తుకు పరమాత్మ భక్షకుడయ్యాడు.

## ప్రాణదేవత

అతడు మరో యజ్ఞం చేయ సంకల్పించాడు. అతని దేహం విస్తరించసాగింది.

అతని దేహమే యజ్ఞమై ఉబ్బింది. కనుక అది అశ్వత్ అయింది. అదే అశ్వము. ఆకాశాన జ్వలిస్తున్న సూర్యుడు అశ్వమేథం. సంవత్సరం అతని దేహం. అర్కం అగ్ని. వాళ్లిద్దరూ ఒక్కటే. అతడే మృత్యువు. ప్రజాపతి అయిన మనసుకు దేవతలు, అసురులు సంతతి. మంచివారైన దేవతలు సంఖ్యలో తగ్గగా, అసురుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దేవతలు వాక్కుతో ఉద్గీథను గానం చేశారు. అసురులు పాపంతో దానిని దెబ్బతీశారు. మంచిమాట, మంచి వాసన, మంచి చూపు, మంచి వినికిడి, మంచి సంకల్పాలను చెడు భావాలతో అసురులు నిర్వీర్యం చేశారు. ఈసారి దేవతలు నోటిలోని ప్రాణంతో ఉద్గానం చేశారు. అసురులు దాన్ని ఎదుర్కోలేక మట్టిముద్ద రాతిని ఢీకొని పొడిపొడి అయినట్లు ధ్వంసమయ్యారు. దేవతలు నోటిలోని ప్రాణాన్ని అంగిరసః – అంటే అంగములరసంగా అర్థం చేసుకున్నారు. ఆ దేవత మృత్యువుకి దూరంగా ఉండేది కాబట్టి దూర్ణం అని పిలిచారు. ఆ దేవత మొదట వాక్కును మృత్యువు నుంచి దూరంగా తీసుకువెళ్లగా వాక్కు అగ్ని అయింది. ఆ తరువాత ముక్కు వాయువై, నేత్రాలు సూర్యునిగా, చెవులు దిక్కులై, మనసు చంద్రుడై ఇంద్రియాలకు అధిదేవతలు అయ్యారు. ఆ దేవతే ప్రాణం.

## ప్రాణ విజ్ఞాన సూత్రం

వాక్కు బృహతి. ప్రాణం దానికి అధిపతి కనుక వాక్కు బృహస్పతి అయినాడు. ప్రాణమే సామం. సా అంటే వాక్కు. అమ అంటే అతడు. సామత్వం ఉన్నది కనుక సామవేదం అయ్యింది. ప్రాణమే ఉద్గీథ. బిగ్గరగా పాడటాన్నే ఉద్గీథ అని పిలుస్తారు. వాక్కు, ప్రాణాలతో గానం చేయడాన్ని ఉద్గానం అంటారు. వక్షస్థలం, కంఠం, శిరస్సు, నాలుక, దంతాలు, ముక్కు, పెదాలు, దవడలు అనే ఎనిమిది స్వరూపాలు కలిగి వాక్కు ప్రాణానికి స్థానం. సామగానం ద్వారాన సామ్స్ (Psalms) పాడడం ద్వారా ప్రతిరోజూ భగవంతుని ఎలుగెత్తి ప్రార్థించడం ద్వారా, అన్ని మతాల భక్తులు అనేక రకాలుగా తమతమ ప్రాణం, మనస్సులను వాక్కు ద్వారా ఉద్గానం చేసి ఆ పరమాత్మకు నివేదిస్తున్నారు. అదే సత్యాన్వేషణ. అదే అజ్ఞానమనే చీకటి నుంచి వెలుగులోకి ప్రయాణం. మృత్యువును దాటి అమృతత్త్వాన్ని సాధించడం. ఇదే ప్రాణవిజ్ఞాన సూత్రం. ఈ విజ్ఞానం కలిగిన వారు పఠించవలసిన ఈ కింది ప్రసిద్ధమంత్రాలే పవమాన మంత్రాలుగా విఖ్యాతి పొందాయి.

**ఓ పరమాత్మా!**
**అసతోమా సద్గమయ– అసత్తు నుంచి సత్తుకు**
**తమసోమా జ్యోతిర్గమయ– చీకటి నుంచి వెలుగుకు**
**మృత్యోర్మా అమృతంగమయ– మృత్యువు నుంచి అమృతత్వానికి నన్ను నడిపించు.**

✧✧✧✧✧

# 51. బ్రహ్మాండ రహస్యం

అద్భుతమైన నారాయణుని శరీరమే బ్రహ్మాండం అని శ్రుతులు చెబుతున్నాయి. విశ్వం బ్రహ్మాండ రూపంలో ఉందని, ఆదిమ జలాలపై తేలుతున్న బ్రహ్మాండం నుంచి సమస్త లోకాలూ ఆవిర్భవించాయని మనతో పాటు అనేకానేక దేశాల వారి విశ్వాసం.

**"రవి బింబంబుప మింప బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై**
**శ్రవణాలంకృతియై గళా భరణమై సౌవర్ణ కేయూరమై**
**ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపు**
**ప్రవరంబై పద పీఠమై వటుడు దా బ్రహ్మాండమున్నిండుచోన్"**

స్థూల ప్రపంచమంతా ఒక పెద్ద గుడ్డు లేదా బ్రహ్మాండ రూపంలో ఉన్నదని మన పూర్వీకుల అభిప్రాయం ద్రష్ట, ధృక్కు, దృశ్యాలు తెలిసిన పరమాత్మ జగత్తు సృష్టిని తలపోశాడు. బ్రహ్మాండాన్ని నిర్భేదించాడు. తనకు సుఖస్థానం ఏదీ అని ఆలోచించాడు. మొదట నిర్మలమైన జలాలను సృష్టించాడు. అలా నారములు లేదా నీళ్లలో శయనించడం చేత భగవానుడిని నారాయణుడు అని పిలిచారని శ్రుతులు చెబుతున్నాయి.

## విరాట్ పురుషుడు

విశ్వం బ్రహ్మాండ రూపంలో ఉన్నదని మనమే కాదు ఫోనీషియన్లు, ఈజిప్టు వాసులు, జపనీయులు నమ్ముతారు. ఆదిమ జలాలపై తేలుతున్న బ్రహ్మాండం నుంచి సమస్త లోకాలూ ఆవిర్భవించాయని మొట్టమొదటగా 'ఆర్ఫియస్' అనే జ్ఞాని ప్రవచించాడంటారు. అందుకే ఈ భావాన్ని 'ఆర్ఫియస్ ఎగ్' లేదా 'ముండేన్ ఎగ్'గా విజ్ఞులు పిలుస్తారు. చైనీయుల విశ్వాసం ప్రకారం సృష్టికర్త 'పాన్‌గు' బ్రహ్మాండంలో 18,000 సంవత్సరాలుగా దినదినాభివృద్ధిచెంది, బ్రహ్మాండాన్ని పగల కొట్టుకొని బయటకు రాగా, గుడ్డు పెంకు పైభాగం ఆకాశంగా, కింది భాగం నేలగా రూపొందిందని విశ్వసిస్తారు. ఈ రెండు భాగాల్ని విడదీసి అలసిపోగా 'పాన్‌గు' శరీర భాగాల నుంచి సమస్త దృశ్య ప్రపంచం ఏర్పడిందని భావిస్తారు. ఈ భావన హిందువుల విరాట్పురుష రూపాన్ని పోలి ఉండడం గమనార్హం.

## సృష్టికర్తది పక్షి రూపం

ప్రాచీన గ్రీకులు మహాశక్తి లేదా దేవతాస్త్రీ శూన్యం నుంచి ఆవిర్భవించి, జలాల్ని సృష్టించి ఆ నీటి అలల నుంచి గాలిని దాని నుంచి ఓ మహా సర్పాన్ని

తయారు చేసి, వారిద్దరి అనుబంధాన ఏర్పడిన గుడ్డు పొదిగిందని వీరి విశ్వాసం. పాలినేషియన్లు ఈస్టర్ ద్వీపవాసులు కూడా సృష్టికర్త పక్షి రూపంలో ఉండి, పెట్టిన గుడ్డు నుంచి ఈ లోకం ఏర్పడిందని భావించేవారు.

నవీన శాస్త్రవేత్తల సృష్టి కూడా బ్రహ్మాండం – ఎల్మ్ నుంచి మొదలయిందని, అది జడత్వంతో కూడిన వందలాది మీటర్ల పరిమాణం గల 'స్ట్రాంగ్‌లెట్'గా మారి విస్ఫోటనం చెందగా, సమస్త గ్రహాలు, నక్షత్ర వీధులూ ఏర్పడ్డాయని నమ్ముతున్నారు. అవి ఇంకా ఏర్పడుతూనే ఉన్నాయని విశ్వసిస్తున్నారు. 12 బిలియన్ సంవత్సరాల క్రితం 'బిగ్‌బ్యాంగ్' విస్ఫోటనం వల్ల ప్రారంభమయిన సృష్టి నిరంతరాయంగా సాగుతూ మరో 29 బిలియన్ సంవత్సరాల తరువాత ఇంప్లోజన్ వల్ల లయం చెంది మరల మరొక 'బిగ్‌బ్యాంగ్' విస్ఫోటనం జరుగుతుంది. ఇలా ఒక మహా విస్ఫోటనానికి మరో దానికి మధ్య కాలం 41 బిలియన్ సంవత్సరాలని డాక్టర్ అలెన్ సాండేజ్ అభిప్రాయం. ఆ మహా విస్ఫోటన సమయంలో శబ్దం పుట్టిందని ఆ శబ్ద తరంగాలు (1–500 మెగాహెర్ట్జ) ఇప్పటికీ విశ్వం నలుమూలలా వినిపిస్తూనే ఉన్నాయని (బి–ఫ్లాట్) 1965లో బ్యాక్‌గ్రౌండ్ రేడియేషన్ వల్ల కనుగొన్నారు. మనవాళ్లు ఆ శబ్దాన్నే 'ఓం'కారమన్నారు.

## విశ్వం విస్తరిస్తూనే...

బ్రహ్మకు 432 కోట్ల సంవత్సరాల పగలు (సృష్టికాలం) మరో 432 కోట్ల సంవత్సరాలు రాత్రి (ప్రళయం)గానూ వేదాలు చెబుతున్నాయి. ఓంకారోత్పత్తి (629,29,49,110 ఏళ్లు) జీవసృష్టి వేదోత్పత్తి కాలం (197,29,49,110 ఏళ్లు)గా హిందువులు భావిస్తున్నారు. బిగ్‌బ్యాంగ్ 6.32 బిలియన్ సంవత్సరాలనాడు, సూక్ష్మజీవుల ఆవిర్భావం 2.5 బిలియన్ సంవత్సరాలని శాస్త్రజ్ఞులు వివరిస్తున్నారు. ఈ విషయాలు లెక్కల్లోనూ సరిపోవడం మరో విశేషం. విశ్వం ఇంకా విస్తరిస్తూనే ఉన్నదని 'రెడ్‌షిఫ్ట్' అనే శాస్త్రీయ పద్ధతిలో కనుగొంటున్న శాస్త్రజ్ఞులు ఆశ్చర్యపోతూనే ఉన్నారు.

## హరి కాయమే బ్రహ్మాండం

ఇలా విష్ణువు గుణ త్రయాత్మకమైన విశ్వ రూపం ధరించి, భువి, ఆకాశం, దిశలు, సముద్రాలు, జలాలు, అఖిల భూతాలు... అన్నీ తానే అయ్యాడు. భూ, భువర్, సువర్లోక, మహర్, జన, సత్యలోకాలు దాటి... అమేయ తేజో విరాజితుడై బ్రహ్మాండంబు తన మేని కప్పు తెరంగున విజృంభించాడు.

**"ఒక పాదంబున భూమిగప్పి దివి వేరొంటన్ నిరోధించి యొం
డొకటన్ మీది జగంబులెల్ల దొడి నొండొంటిన్ విలంఘించి ప
ట్టక బ్రహ్మాండ కటాహముం బగిలి వేంద్రంబై పరుల్ గానరా
కొకడై వాగ్భగలభ్యుడై హరి విభుడొప్పారె విశ్వాకృతిన్"**

ఈ బ్రహ్మాండ కోశాన 14 కోశాలు ఉన్నాయని, అలాంటి బ్రహ్మాండాన్ని శ్రీమన్నారాయణుని స్థూల శరీరంగా ఎవరయితే వర్ణిస్తారో, లేదా ఆ వర్ణనను వింటారో వారికి సకల భోగాలు లభిస్తాయని భాగవతం చెబుతున్నది. అద్భుతమైన శ్రీహరి స్థూల శరీరమే బ్రహ్మాండమని తెలియుట ఆ పరమేశ్వరుని లీలా వినోదాలు తెలుసుకోవడమే కదా!

**"అధాతో బ్రహ్మ జిజ్ఞాసా"**

✧✧✧✧✧

# 52. బృహదారణ్యకోపనిషత్
# అసతోమా సద్గమయ

సృష్టి ఎలా మొదలయింది... తొలి శబ్దం ఎలా పుట్టింది... పరబ్రహ్మ స్వరూపం తెలుసుకోవడం ఎలా... ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది వంటి అనేక సందేహాలకు బృహదారణ్యకోపనిషత్తు సమాధానాలిస్తుంది. ఉపనిషత్తుల్లో అతి పెద్దదైన బృహదారణ్య కోపనిషత్తులో హిందూ ధర్మసూత్రాల మూలాలు ఉన్నాయి. అన్నదానం ప్రాశస్త్యాన్ని వివరించే బృహదారణ్యకోపనిషత్తు గురించి...

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

'అసత్యం నుంచి సత్యంలోకి, చీకటి నుంచి వెలుగులోకి, మృత్యువు నుంచి అమరత్వంలోకి నన్ను నడిపించు' – ఈ ప్రసిద్ధ మంత్రాలు బృహదారణ్యకోపనిషత్తు లోనివి. బృహత్ అంటే పెద్ద. ఉపనిషత్తులలో అతిపెద్దది బృహదారణ్యకోపనిషత్తు. ఇందులో ప్రధానంగా చర్చించే అంశాలు ఇవి: అశ్వమేధయాగ ప్రశస్తి. 'అంగిరస' ప్రాధాన్యత. ప్రజాపతి చేసిన సృష్టి. చాతుర్వర్ణ విభాగం. పాంక్త (అయిదు) స్వరూప యజ్ఞం. కాశీరాజైన అజాత శత్రువు గార్గ్యమహర్షితో చర్చించిన పరబ్రహ్మోపాసన. విజ్ఞానమయ పురుషతత్త్వం. యాజ్ఞవల్క్య మహర్షి తన భార్య మైత్రేయితో ప్రస్తావించిన పరమాత్మ స్వభావం దధ్యజ్ ఋషి అశ్వనీ దేవతలకు ఉపదేశించిన మధువిద్య. యాజ్ఞవల్క్య – శాకల్య సంవాదంలో దేవతలు ఎందరు అనే జిజ్ఞాసకు సమాధానం, యాజ్ఞవల్క్య – జనకరాజులు చర్చించిన ఇహ, పర, స్వప్నలోకాలలో ఆత్మ ప్రవృత్తి. దేవ, మానవ, రాక్షసులు బ్రహ్మనుంచి తెలుసుకున్న దమము, దానము, దయాగుణ విశిష్టత, సత్యభావన. పూర్ణ గాయత్రీ మంత్ర మహిమ. ప్రవాహణరాజు శ్వేత కేతుమునికి తెలిపిన పంచాగ్ని రహస్యం. మంధ విద్య. వాజపేయ యాగ ప్రాముఖ్యత. వీటన్నింటితో బృహదారణ్యకోపనిషత్తు అక్షర పరబ్రహ్మ స్వరూపాన్ని అత్యంత సుందరంగా అర్థవంతంగా చర్చిస్తుంది.

### ఉపనిషద్వాక్యం

'తం జాత మభివ్యాదదాత్ స భాణ కరోత్సైవ వాగ భవత్' ప్రజాపతి తన పుత్రుని నీటిలో సృష్టించి అతనిని తానే తినేందుకు నోరు తెరవగా అతడు భయపడి

'భాణ' అని శబ్దం చేశాడు. ఆ తొలి శబ్దము నుంచి వాక్కు పరిణామం చెందింది. భయం నుంచి తొలిశబ్దం పదం వెలువడిందని దీని వల్ల తెలుస్తోంది. 'సయద్య దేవ సృజత తత్త దత్తు మధ్రియత. సర్వం వా అత్తీతి తదదితే రదితి త్వగ్ం' పరమాత్మ దేనినైతే సృష్టించాడో దానిని తినే కోరిక వల్ల అదితి తత్త్వం కలిగింది. అందుకే పరమాత్మకు సమస్త జగత్తు అన్నం అయింది. 'తే హోచుః క్వను సో భూద్యోన ఇత్థమస క్తేత్యయ, మాస్యేన్తరితి సోయాస్య అంగి రసోంగానాగ్ం హిరసః' ముఖ మధ్యంలో ఉండే 'అయస్య' అనే ప్రాణ దేవత అన్ని అవయవాలకు సారభూతం అయినందువల్ల ఆంగీరసమైనది. మృత్యువు అతనికి దూరంగా ఉంటుంది కనుక ఈ ప్రాణ దేవతకు 'దూర్' అని పేరు. వాక్కు, వాసన, చూపు, వినికిడి, మనస్సు వీటికి అధిదైవిక రూపాలు వరుసగా అగ్ని, వాయువు, సూర్యుడు, దిక్కులు, చంద్రుడు. వాక్కు ప్రాణములు కలిసినది ఉద్గీథం. అదే సామవేదం. మధుర స్వరమే దానికి భూషణం.

## సృష్టి రచన

'బ్రహ్మ వా ఇదమగ్ర అసీత్త దాత్మానమే వావేత్ అహం బ్రహ్మేస్మీతి' సృష్టిలో మూలపదార్థమైన బ్రహ్మ తనను తాను సర్వస్వ రూపంగా చూసుకున్నప్పుడు 'అహం'భావం కలిగింది. ఈ ప్రజాపతి మొదటివాడై అన్ని పాపాలను దహించి పురుషుడయ్యాడు. ఒంటరివాడైన స్వయంభూ ప్రజాపతి తనను తాను రెండు భాగములుగా చేసుకుని సతి, పతిగా (చీల్చిన వెదురు బొంగులా ఉన్నాడని యాజ్ఞవల్క్యుని భావన) ఉన్నప్పుడు సతి (శతరూప)తో అనేక రూపాలు ధరించి మనుషులతో బాటు జీవకోటిని సృష్టించాడు. ఆ అవ్యక్త సృష్టి నామరూపాల వల్ల వ్యక్తమైంది. జీవుల ఇంద్రియాధి దేవతలు కర్మల చేత సంతృప్తి చెందుతారు. పరబ్రహ్మ తత్వాన్ని గ్రహించనివారు కర్మలు చేయరుగనుక వారు దేవతలకు ఇష్టులు కారు. వివిధ కర్మలు చేసే మనుషులను నాలుగు వర్ణాలుగా విభజించి ప్రజాపతి సృష్టిరచన సాగించాడు. ఈ అన్ని జాతులు బ్రహ్మనుంచి వెలువడిన పరబ్రహ్మ స్వరూపములే. యజ్ఞములో అగ్ని రూపంలోనే పరబ్రహ్మ దర్శనం మానవజాతికి కలుగుతుంది. యజ్ఞకర్మలలో ఇచ్చే పిండోదకాలవల్ల ఋషుల నుంచి ఇతర ప్రాణులకు గూడ అన్నం దొరుకుతోంది.

## పరబ్రహ్మ స్వరూపం

సాలె పురుగు దేహం నుంచి తంతువులు (దారాలు) బయటికి వచ్చినట్లు, అగ్ని నుంచి నిప్పురవ్వలు వెలువడినట్లు పరమాత్మ నుంచి ఈ చరాచర జగత్తు సృష్టి

జరిగింది. ప్రాణుల అస్తిత్వం పరబ్రహ్మమే! మరణధర్మం కల సూర్యమండలం, భూమి, జలము, తేజస్సుల సారం. ఇది మూర్త స్వరూపం. మరణం లేనిది వ్యాపకమైనది ప్రత్యక్షం కానిది అయిన ఆధ్యాత్మ స్వరూపం వాయువు ఆకాశ సారం. ఇది అమూర్త స్వరూపం. అన్ని రూపాలతో సమస్తాన్ని అనుభవిస్తున్న ఆత్మనే పరబ్రహ్మ స్వరూపం అని దధ్యజ్ అనే పేరుగల అధర్వణపుత్రుడు అశ్విని దేవతలకు మధుస్వరూపమైన పరబ్రహ్మాన్ని గురించి వివరించాడు. అన్ని వస్తువులు, లోకములు, బ్రహ్మలోకంలో ఉన్నప్పుడు బ్రహ్మలోకం దేనిలో ఉందని వచక్ను ని పుత్రిక గార్గి ప్రశ్నించగా సర్వమూ పరబ్రహ్మ స్వరూపమే కనుక ఆ ప్రశ్న కూడదని యాజ్ఞవల్కుడు చెప్పాడు. నశించని ఆత్మ అక్షర పరబ్రహ్మంగా అతడు వ్యాఖ్యానించాడు.

## ఆత్మజ్ఞానం

ఆత్మ సంచరించే ప్రదేశాలు రెండు – ఇహలోకం, పరలోకం. ఈ రెండింటి మధ్య ఉన్న అద్భుత ప్రదేశమే స్వప్నలోకం. స్వప్నద్రష్ట అయిన పురుషుడు తైజసుడు... అని యాజ్ఞవల్క్యుడు జనకునికి ఉపదేశించాడు. ఆయన భార్య మైత్రేయి అడిగిన ప్రశ్నకు 'ఆత్మ పరమాత్మ ద్వైతంగా భావించినప్పుడు ఇంద్రియాల ద్వారా కనుక్కునే ప్రయత్నం చేయవచ్చు. ఇది అజ్ఞానావస్థ. జ్ఞానావస్థలో ఆత్మ పరమాత్మ అన్నీ తానే అవుతాడు. సర్వ విజ్ఞాత అవడమే ముక్తి' అని సమాధానమిచ్చాడు. బ్రహ్మ పుత్రులైన దేవమానుష్య రాక్షసులకు బ్రహ్మ ఉపదేశించిన 'ద' అనే అక్షరం నుంచి తమలో లోపించిన గుణాలను గ్రహించి దేవతలు దమమును (ఇంద్రియ నిగ్రహము), మానవులు దానమును, రాక్షసులు దయాగుణమును తిరిగి తమలో ప్రతిష్ఠించుకోవాలి.

## సప్తాన్నములు

'యత్సప్తాన్నాని మేధయా తపసాజనయత్పితా... అందరూ భుజించే అన్నం, దేవతల కోసం హుత, ప్రహుతులు, ఆత్మ కోసం మనస్సు, వాక్కు, ప్రాణాలు, పశువుల కోసం పాలు. ఇవే ఏడు అన్నాలు. ఒకరోజు వాక్కు, కన్నులు, చెవులు, మనస్సు, రేతస్సు నేను గొప్ప అంటే నేను గొప్ప అని కలహించుకుని, మా లోపల వశిష్టుడు (నివసించువాడు, నివసింపజేయువాడు) ఎవరు అని బ్రహ్మను అడిగాయట. అందుకు ఆయన 'మీలో ఎవరు లేకుంటే శరీరం పనికిరానిది అవుతుందో అతడే గొప్ప' అని జవాబివ్వగా ముందుగా వాక్కు ఒక సంవత్సరము శరీరం విడిచి వెళ్లినా శరీరంలో మార్పు లేకపోవడంతో మళ్లీ ప్రవేశించిందట. ఇలా కన్నులు, చెవులు, మనస్సు, రేతస్సు ఒక్కొక్క సంవత్సరం నిష్క్రమించినా శరీరం మామూలు స్థితిలోనే ఉన్నది. కానీ ముఖ్యమైన ప్రాణము లేచిపోవుటకు సిద్ధమైనప్పుడు మిగిలినవన్నీ పనికిరానివై

ప్రాణం ఆధిక్యతను అంగీకరించాయట. ఈ ప్రాణానికి సమస్త ప్రాణుల అన్నమే అన్నం. ఉదకమే వస్త్రం. అందువల్లనే వేదాధ్యయనము చేసినవారు భోజనానికి ముందు, తరువాత చేసే ఆచమనాన్ని ప్రాణానికి వస్త్రంగా భావిస్తారు.

'కనుపించనిది అనంతం. ఈ కనిపించే విశ్వం కూడా అనంతమే. ఆ అనంతవిశ్వం నుంచే ఈ విశ్వం బహిర్గతమైంది. ఈ అనంత విశ్వం దాని నుంచి వెలువడినా ఆ అనంతం అనంతంగానే ఉంది' అనిచెప్పే శుక్ల యజుర్వేద శాంతి మంత్రం ఇది.

**'ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణా ముదచ్యతే ।**
**పూర్ణస్య పూర్ణమాదాయ, పూర్ణమే వావశిష్యతే**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

✧✧✧✧✧

# 53. ఛాందోగ్యోపనిషత్‌లో చిత్రకథ
# ఏది విద్య... ఏది అవిద్య?

వాళ్లని సన్మార్గంలో పెట్టడానికి జైళ్లు, ఉరికొయ్యల్ని తయారుచేయడం కన్నా చిన్నవాళ్లుగా ఉన్నప్పుడే తరగతి గదుల్ని, మంచి విద్యాలయాల్ని నిర్మించి ఉంటే బాగుండేది అనిపిస్తుంది కదూ మనకప్పుడప్పుడు!

సంపాదించడానికి చదివే చదువులు అర్ధాంతరంగా నడిసముద్రంలో వదిలేసినప్పుడు చిటికెడంత ప్రేమ తియ్యదనాన్ని ఉప్పు సముద్రాలలో వెతుక్కుంటూ... ఉసూరుమంటూ... దేనికింత బాధ? వేద ఉపనిషత్ విద్యలకు పుట్టినిల్లు అయిన నైమిశారణ్యం ఆక్రమణలకు గురైనా, సరస్వతీ నది ఇంకిపోయినా మనకు పట్టింపు లేదు. నేను చదువుకుంటాను అన్న అర్థింపు, అర్హతలతో నిమిత్తం లేకుండా సత్యకాముణ్ణి విద్యార్థిగా, బ్రహ్మజ్ఞానిగా మార్చింది. నేను చదువు'కొంటాను' అన్న అహంకరింపు నేడు అనేకమందిని కటిక వ్యాపారస్తులుగా మారుస్తోంది. ఏది విద్య... ఏది అవిద్య? ఈ ప్రశ్నకు సమాధానం ఛాందోగ్యోపనిషత్తు ఇలా చెబుతోంది.

అరుణి కుమారుడైన ఉద్దాలకుడు డబ్బు, గౌరవం, చదువు వున్నవాడు. తన కుమారుడు శ్వేతకేతు తనకంటే గొప్పవాడు కావాలని అతని ఆరాటం... సహజమే కదా! పన్నెండేళ్లు వచ్చినా శ్వేతకేతులో విద్య అభ్యసించాలనే ఉత్సాహం, కోరిక కనిపించడం లేదు. ఒకరోజు ఉద్దాలకుడు తన కుమారుణ్ణి దగ్గరకు పిలిచి, 'నాయనా! మన వంశంలో జ్ఞానహీనులెవ్వరూ లేరు. అందరూ గొప్పగా చదువుకున్నవారే' అని కాస్త తీవ్రస్వరంతో మందలిస్తున్నట్టు అన్నాడు.

శ్వేతకేతుకు అభిమానం పాలెక్కువ. తక్షణం బయలుదేరి వెళ్లి ఉపమన్యు కుమారుడైన ప్రాచీన శీలుని వద్ద బ్రహ్మచర్య వ్రతాన్ని స్వీకరించి పన్నెండేళ్లపాటు సమస్త విద్యలను అభ్యసించి గురువు అనుమతితో ఇంటికి తిరిగి వచ్చాడు. విద్యా పారంగతుడు, యవ్వనవంతుడు అయిన కుమారుణ్ణి చూసి ఉద్దాలకుడు సంతోషించాడు. కానీ శ్వేతకేతులోని అహంకారాన్ని, గర్వాన్ని అతిశయాన్ని గమనించి చింతాక్రాంతుడు అయ్యాడు. కుమారుణ్ణి పిలిచి ఇలా అడిగాడు.

'కుమారా! అది వినపడదు. కానీ వినబడుతోంది. అది తెలుసుకోలేనిది. అయినా తెలుసుకోవడానికి ప్రయత్నించవలసింది. ఎందుకంటే దాన్ని గురించి తెలుసుకున్నవాడు అన్నీ తెలుసుకున్నవాడే. దాన్ని గురించి నీకు తెలుసా?' ఒక్కసారిగా

శ్వేతకేతు ముఖం వివర్ణమైంది. ఇది తాను కంఠస్థం చేసిన విద్యలలో లేదు. 'తండ్రీ! మీరు చెప్పండి' అన్నాడు వినయంగా.

## సత్యస్వరూపం

'మట్టితో తయారుచేసిన వస్తువులకు వేరువేరు పేర్లున్నా, 'మృత్తికేత్యేవ సత్యం' – మట్టినుంచే కదా వచ్చినవి. అలాగే లోహంతో తయారుచేసిన వస్తువులకు పేర్లు ఏవైనా సత్యమైనది లోహమే. మట్టి వస్తువులను నీటిలో, లోహ వస్తువులను అగ్నితో కరిగించినప్పుడు వాటి రూపాలు మాయమై అసలు స్వభావం బయటపడుతోంది కదా! అలాగే ఈ కనిపించే పేరు, రూపం ఉన్న పదార్థాలన్నీ అసత్యాలు. వీటికి మూలమైనది సత్యం. ఈ మూలపదార్థమైన పరబ్రహ్మమే మొదట సత్యంగా ఉండి ముందు తేజస్సును, తరువాత నీటిని, ఆ తదుపరి అన్నం రూపంలో నేలను సృష్టించింది. అటు తర్వాత ఈ త్రివృత్కరణములైన అగ్ని, నీరు, అన్నం నుంచి అండజ, జరాయుజ, ఉద్భిజములైన అనేక భూతాలు పుట్టాయి. వాక్కు అగ్నిమయం, ప్రాణం జలమయం, మనసు అన్నమయం' అని చెప్పి ఉద్దాలకుడు శ్వేతకేతును పదిహేను రోజులు ఏమీ భుజించకుండా నీటినే తాగుతూ పదహారవ రోజు – రమ్మని ఆదేశించాడు.

## ఆత్మస్వరూపం

శ్వేతకేతు పదహారో రోజు వచ్చినప్పుడు ఋగ్వేద, సామవేదాలను గురించి చెప్పమంటే అతనికేమీ గుర్తురాలేదు. అప్పుడు ఉద్దాలకుడు ఇలా వివరించాడు.

'చంద్రుని లాగే మానవునికి కూడా పదహారు కళలున్నాయి. ప్రాణం జలమయం కాబట్టి నీటి ఆధారంగా అది ఒక్కటే నిలిచి ఉంది. అన్నం లేదు కనుక మనసు, అగ్నిమయమైన వాక్కు నీరసించాయి. నానా నామరూపాలున్న ఈ వస్తువులు నశించినా, నశించనిది ఆ సత్‌స్వరూప ఆత్మ ఒకట్టే. అది సూక్ష్మాతి సూక్ష్మమైనది. కంటికి కనిపించదు. 'తత్త్వమసి' – నీవు కూడా ఆ ఆత్మవే.

## తత్త్వమసి

'అంత సూక్ష్మమైన సత్యంలోంచి ఈ జగత్తు అనే అసత్యం ఎలా వచ్చింది?' అని శ్వేతకేతు అడిగినప్పుడు ఉద్దాలకుడు ఇలా వివరణ ఇచ్చాడు. 'మర్రిపండు తీసుకుని దానిలోని విత్తనాన్ని తీసి మరిన్ని భాగాలు చేయి. ఏమైనా కనిపిస్తోందా? ఈ చిన్ని విత్తనంలోనే వటవృక్షం నిక్షిప్తమై ఉన్నట్లు, ఈ జగత్తు అంతా సత్‌స్వరూపమే–

నీవు కూడా ఆ స్వరూపానివే. ఇప్పుడు ఈ పాత్రలోని తియ్యటి నీటిలో కొంచెం ఉప్పు కలిపి చూడు. ఉప్పు కనిపిస్తోందా... లేదు కదా... తాగి చూడు! ఉప్పగా ఉంది. అలాగే విత్తనంలో కనిపించని వృక్షంలా, నీటిలో కరిగి వున్న ఉప్పులా అవ్యక్తమై సూక్ష్మమై ఉండే ఈ ఆత్మ సర్వజగత్తుకు మూలకారణమై వ్యాపించి ఉంది.

ఓ శ్వేతకేతూ! ఆ సత్‌స్వరూపమైన ఆత్మవు నీవే... ఎవరైనా మరణశయ్యపై ఉన్నప్పుడు బంధుమిత్రులు అతడిని పలుకరిస్తూ నన్ను గుర్తుపట్టావా అని ప్రశ్నిస్తూ ఉంటారు. వాక్కు మనస్సులో, మనస్సు ప్రాణంలో, ప్రాణం అగ్నిలో, అగ్ని పరమాత్మలో లీనం అయినవాడు ఇంకెవ్వరినీ గుర్తించలేడు. ఆఖరి క్షణాల్లో ఆ అగ్ని ఒక్కసారి ప్రకాశవంతమై చల్లారిపోతుంది. ఆ అత్యంత సూక్ష్మమైన వెలుగే ఆత్మ. ఆ ఆత్మ అందరిలో ఉంది. కుమారా! ఆ ఆత్మవు నీవే... తత్త్వమసి!

✧✧✧✧✧

# 54. ప్రతి జీవితం ఓ మహావృక్షం

పరమాత్మయే బీజంగా, ఓంకారం, అంకురంగా, 12 పెద్ద కొమ్మలతో, 335 శాఖలతో 18000 శ్లోకాలనే రెమ్మలతో, 5,76,000 అక్షరాలనే ఆకులతో పరిఢవిల్లే 'వేదకల్పవృక్షం'గా, భగవంతుని ప్రయాణాన్ని వివరించే మహాగ్రంథ వృక్షరాజంగా భాగవతాన్ని విజ్ఞులు భావిస్తారు.

**"ఊర్ధ్వ మూల మధః శాఖమ్ అశ్వత్థమ్ ప్రాహురవ్యయమ్**
**ఛందాసి యస్య పర్ణాని యస్తం స వేదవిత్"**

సంసార వృక్షానికి మూలం పైన ఉన్నది. దీని శాఖలైన హిరణ్యగర్భాదులు కిందుగా, కర్మ కాండల రూపాలైన వేదాలు ఆకులుగా అమరి ఉన్నాయి. అనాది, క్షణికం అయిన సంసారం మాయామయ వృక్షమని తెలిసినవారే వేదవిజ్ఞులు.

## జీవ వృక్షం

ప్రపంచంలోని అన్ని ప్రాచీన కథలలోనూ జీవ వృక్షం లేదా ప్రపంచ వృక్షం ప్రస్తావన ఉంది. హిందువులకు అది తలకిందులుగా ఉన్న అశ్వత్థ వృక్షం. నార్స్ ప్రజలకు మూడు లోకాలను సంధించే 'యగ్ డ్రాసిల్' అనే మహావృక్షం. పాతాళ లోకంలో ప్రసరించిన ఈ వృక్షపు వేళ్ల మధ్య వెలువడిన 'జీవధార' నుంచి సమస్త నదీ నదాలు, జీవరాసులు జనించాయని, మధ్యనున్న మహాకాయుల లోకంలో జ్ఞానపు బావి, పైన ఉన్న దేవలోకంలో, కాల ప్రవాహపు బావి వద్దనే దేవతలు తమ సభను నిర్వహిస్తారని వారి నమ్మకం. మంగోలియా, స్లొవేకియా, అమెరికన్ ఇండియన్ల మంత్రగాళ్లు ఆత్మలు స్వర్గలోకం చేరాలంటే విశ్వవృక్షాన్ని అధిరోహించాలని, ఆ విశ్వ వృక్షమే మూడు లోకాల్ని యథాతథ స్థితిలో ఉంచుతుందని నమ్ముతారు. భగవానుడు 'ఈడెన్' తోటలో జ్ఞాన వృక్షాన్ని, జీవ వృక్షాన్ని నాటాడు. తన రూపంలోనే సృజించిన 'ఆదాం'ను పిలిచి ఇలా చెబుతాడు. "ఇక్కడ నీవు స్వేచ్ఛగా విహరించుము. కాని మంచి చెడులను విశదం చేసే జ్ఞానవృక్షపు ఫలాన్ని మాత్రం తినవద్దు. తిన్నచో నీకు మరణం తప్పదు" (ఆది-2-17). సాతాను సర్పపు బోధలకు లోనైన 'ఈవ్' ఆ ఫలాన్ని రుచిచూడడమేకాక 'ఆదాం' తినేలా చేసింది. ఇలా దేవుని తిరస్కరణకు గురై ఈడెన్ తోట నుంచి తొలి మానవుల భూపతనం సంభవించింది.

## రాకాసి చెట్టు ఆతిథ్యం

మహా ప్రవక్త ఇలా ఆదేశిస్తున్నారు. "మీ నిజమైన ఆరాధ్యదైవం ఒక్కడే. ఆయన భూమికి, ఆకాశానికీ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తానికీ ప్రభువు.

దిక్కులన్నింటికీ ప్రభువు. నిశ్చయంగా చెబుతున్నాను ఇదే మహత్తరమైన విజయం. ఇలాంటి విజయం కోసమే కర్మశీలురు కర్మలు చేయాలి. చెప్పండి! ఈ ఆతిథ్యం మంచిదా లేదా రాకాసిజెముడు చెట్టు ఆతిథ్యం మంచిదా? మేము ఆ చెట్టును దుష్టుల పాలిట పరీక్షగా చేశాం. అది నరకం అడుగు భాగం నుంచి మొలిచే ఒక చెట్టు. దాని మొగ్గలు సైతాను తలల మాదిరిగా ఉంటాయి. నరకవాసులు వాటిని తింటారు. వాటితోనే కడుపు నింపుకొంటారు. అంతేగాక వారికి తాగడానికి సలసల కాగే నీరు లభిస్తుంది. ఆ తరువాత వారు మళ్లీ నరకాగ్ని వైపుకే తిరిగి వెళ్తారు. తమ తాతముత్తాతలు మార్గ భ్రష్టులవటాన్ని చూసినప్పటికీ వారి అడుగుజాడలలో పరుగెత్తినవారు వీరే!" (దివ్య ఖురాన్–అస్ సాఫ్ఫాత్... 1–5, 60–74)

## వేదాంతుల వృక్షం

బ్రిటన్‌లో విస్తారంగా పెరిగే 'టాక్సస్ బక్కాటా' శాస్త్రీయ నామం గల యూ (yew) చెట్టు సతత హరితమైనది. దీనిని అమరత్వానికి చిహ్నంగా అక్కడి ప్రజలు భావిస్తారు. 'ఓక్' చెట్టు వరుణుడికి ప్రియమైనది. మెరుపు తాకిడికి ఎక్కువగా గురయ్యే ఈ వృక్షాన్ని ప్రాచీన వైద్యులు సంజీవనిగా పూజించేవారు. యుద్ధ నావల తయారీకి వాడిన ఈ వృక్షాన్ని 'అరణ్యపు మహా వృక్షరాజం'గా అభివర్ణించేవారు. ఫిలాసఫర్స్ ట్రీ లేదా వేదాంతుల వృక్షంగా పాదరసం, వెండి మిశ్రమాన్ని ఆల్కెమిస్టులు పిలిచేవారు. డయానా (వెండి) ట్రీ అని దానికి మరోపేరు. యూదు మతంలోని 'కబాలా' సంప్రదాయంలో 'జీవవృక్షం' అనేక శాఖలుగా పరమాత్మను సూచిస్తుంది. 1335 ఒరలు లేదా అంతర్వర్తులాలున్న సెక్వోషియా వృక్షాలు వాటి జీవితకాలాన్ని సూచిస్తాయి. మూడు వేల ఏళ్ల వయసున్న ఓక్ వృక్షాల ముందు మన ఆయుర్దాయం ఏపాటిది? ఈ మొక్కలకే మాటలు వచ్చి ఉంటే చరిత్రలోని సత్యాసత్యాలు నిరూపణ అయ్యేవి కదా!

## వృక్షం... విజ్ఞాన మూలం

పతాకాలువస్త్రాలను కప్పి ప్రజలతో పూజలందుకొనే స్వేచ్ఛా వృక్షాలు (ట్రీస్ ఆఫ్ లిబర్టి), స్వాతంత్ర్యానికి చిహ్నాలుగా అమెరికా అంతటా పోప్లర్ చెట్లూ అంతే స్ఫూర్తితో పారిస్‌లో, ఇటలీలో నలుమూలలా నాటబడ్డాయి. క్రీసు మోసిన శిలువను వృక్షంగా కీర్తనలు స్తుతిస్తాయి. 'ఉరికొయ్య'ను కొందరు 'మృత్యువృక్షం'గా ట్రీ ఆఫ్ టైబర్న్ (థేమ్స్ నదీ శాఖ పక్కన ఉన్న ఊరిపేరు టైబర్న్. ఇక్కడే ఖైదీలను ఉరితీసే వారు)గా వివరిస్తారు. బోధివృక్షం కింద జ్ఞానకాంతుల్ని పొంది బుద్ధుడైన గౌతముడు, 'సాల్' వృక్షపు నీడన మహాత్ముడైన జైన మహావీరుడు ప్రపంచానికి జ్ఞానజ్యోతుల్ని ప్రసాదించినవారే. రావి, వేప వృక్షాలకు పెళ్లిచేసి పూజలు జరిపే ఆచారాలు, సంతానం

కోసం అశ్వత్థ వృక్షం చుట్టూ చేసే ప్రదక్షిణలూ, కల్పవృక్షంగా భాసించే కొబ్బరి, తాటి, అరటిచెట్లు మనకు నిత్యసత్యాలే. వరి, మొక్కజొన్న ఇత్యాది ధాన్యాల్ని, అపరాల్ని ధాన్యలక్ష్ములుగా కొలుస్తాం. 'ధర్మో రక్షతి రక్షితః'లా వృక్షాన్ని రక్షించే అద్భుత సంప్రదాయం మనది.

**బంధాన్ని జయించాలంటే**

తొలి ఇతిహాసంగా పేరుబడ్డ సుమేరియన్ 'గిల్గామేష్' కథలో దేవదారు కలప కోసం గిల్గామేష్, ఎంకిడుతో కలిసి హిందూ దేశపు అరణ్యాలలో 'హమ్‌బాబా' అనే వన రక్షకుడిని, మాంత్రికుడిని వధించినట్లు కొందరు అభిప్రాయపడ్డారు. ఎంకిడు మృతికి చలించిన గిల్గామేష్ మృత్యు రహస్యాన్ని కనుగొనడానికి మృత్యు జలాల్ని దాటి జలప్రళయంలో అమరుడై ఉన్న 'ఉత్నా పిష్టిమ్' సలహాతో సముద్రపు అడుగున ఉన్న సంజీవనీ వృక్షపు కొమ్మను తీసుకొని వస్తుండగా దారిలో ఓ పాము ఆ మొక్కను సంగ్రహించి మాయమవుతుంది. మానవులకు మరణం తప్పదని గ్రహించిన గిల్గామేష్ సమాధానపడ్డాడు. (నాలుగు వేల ఏళ్లనాటి కథ ఇది).

**అథం ఊర్ధ్వంచ ప్రసృతాః తస్య శాఖా**

"గుణ ప్రవృద్ధా విషయ ప్రవాలౌ" – మాయమయ సంసార వృక్షం శాఖలు త్రిగుణాలచే వృద్ధిపొంది కిందకు, మీదకు వ్యాపించి ఉన్నాయి. కానీ మానవలోకంలోనే ధర్మాధర్మ జనక మూలాలున్నాయని గ్రహించాలి. ఇంత జటిలమైన ఈ అశ్వత్థ సంసార వృక్షాన్ని కేవలం తీవ్ర వైరాగ్యం అనే దృఢశస్త్రంతో మాత్రమే ఛేదించగలమని భగవానుడు పురుషోత్తమ యోగంలో సెలవిచ్చాడు.

**ఓం తత్ సత్**

✧✧✧✧✧

# 55. దైవం నుంచి సైతాను దాకా 'సర్పబంధం'

వేదాలు, ఇతిహాసాల కాలం నుంచి నేటి వరకు మానవ జీవితాలతో సర్పాలకు విడదీయరాని బంధం ఉంది. కొన్ని సందర్భాల్లో నాగదేవతగా పూజలందు కుంటే, మరికొన్ని వేళల్లో ప్రాణాలు తీసే విషనాగుగా ప్రజల ఆగ్రహానికి కారణం అవుతుంది. నాగజాతి విశేషాల సమాహారం ఇది.

**"ఆనల తేజులు దీర్ఘ దేహులు నైన యట్టి తనూజులన్**
**వినుత సత్త్వుల గోరె గద్రువ వేవురం వేడ్కతో.."**

కశ్యపునికి ఇద్దరు భార్యలు. కద్రువ, వినత. ఇది కృతయుగంలోని విషయం. పుత్రకామేష్ఠి యాగానంతరం వారి వారి కోరికల ప్రకారం కద్రువకు ఐదు వందలు, వినతకు రెండు అండాలు జనించాయి. వాటిని ఐదు వందల ఏళ్లపాటు నేతి కుండలలో భద్రపరచగా కద్రువ గుడ్ల నుంచి శేషుడు, వాసుకి, ఐరావతం, తక్షక, కర్కోటక, ధనంజయ, కాళియ ఇత్యాది నాగులు వెలువడ్డారు. తల్లి తొందరపాటు వల్ల వినత అండాల నుంచి సగం దేహంతో అనూరుడు, ఆ తరువాత మరో ఐదు వందల ఏళ్లకు గరుడుడు జన్మించారని భారతంలోని ఆదిపర్వం ద్వితీయాశ్వాసంలో పేర్కొన్నారు.

## హారంగా, పడకగా...

ఆదిశేషుడు భూభారాన్ని వహించగా, వాసుకి పాలసముద్ర మథనంలో తరిత్రాడుగా ఉపయోగపడ్డాడు. తక్షకుని విషం, చోరత్వం, పరీక్షిత్తు మరణానికి, జనమేజయుడు నిర్వహించిన సర్పయాగానికి హేతువులైనాయి. కాళీయమర్దనం కృష్ణావతారంలో ముఖ్యఘట్టం. శివుని కంఠంలో హారంగా, విష్ణువు పడకగా సర్పాలు వారికి అత్యంత సన్నిహితులైనాయి. తండ్రి ఒక్కరే అయినా తల్లుల మధ్య గల వైషమ్యం, పిల్లల మధ్య విరోధానికి ఎలా దారి తీస్తుందో నాగులు, గరుత్మంతుడి వృత్తాంతం ద్వారా మనకు అవగతమవుతుంది. తన ఆజ్ఞను మీరినందుకు ఆదాం, ఈవ్‌లను దేవుడు ఈడెను తోట నుంచి బహిష్కరించి వారిని అందుకు పురికొల్పిన సాతాను సర్పాన్ని... నీవు నీ పొట్టపై పాకుతూ, మట్టి తింటూ నీ జీవితం గడుపు. ఈ స్త్రీ, ఆమె కుమారులు నీకు శత్రువులగుదురు గాక! నీవు వారి కాలిపై కాటు వేస్తావు. వారు నీ తలపై గాయపరుస్తారు అని ఆజ్ఞాపించారు.

## సర్పం - సప్త ప్రతీకలు

ప్రాచీన కాలం నుంచి సర్పం (సర్పెంట్) సప్త విషయాలకు ప్రతీకగా ఉంది.

1. దేవునిగా - తన తోకను తానే మింగుతుంది కాబట్టి. అంతేగాక అనేక తెగలలో సర్పం సృష్టిలో ప్రముఖ పాత్ర వహించిందని నమ్మేవారు.

2. తన తోకను తానే మింగుతూ వృత్తాకారంలో ఉన్న సర్పాన్ని అనంతానికి చిహ్నంగా ప్రాచీనులు భావించారు. నవీన శాస్త్రజ్ఞుడు 'కెకూలే' ఈ చిహ్నాన్ని కలగని 'బెంజిన్' అణు నిర్మాణాన్ని ఊహించాడని, అదే రసాయనశాస్త్రంలో మరో ముందడుగు అయిందని చెబుతారు.

3. పునరుజ్జీవనానికి, పునర్ యవ్వనానికి, కుబుసాన్ని విడిచి తిరిగి శక్తిని పొందడం ద్వారా ఎస్కులేపియస్ దేవునికి ప్రీతిపాత్రమై, సర్పం వైద్యరంగానికి చిహ్నమైంది.

4. గ్రీకులకు, రోమన్లకు సంరక్షక దేవత. హోమగుండాల వద్ద చిహ్నంగా ఉంది. కౌరవుల యుద్ధ పతాకం సర్పం.

5. జ్ఞానానికి, 6. గురికి, 7. సైతానుకు కూడా సర్పాలే గుర్తు.

## తొలి మానవుల పతనం

ఈజిప్షియన్లకు, హిబ్రూలకు, కాననైట్లకు, మధ్యధరా ప్రాంతం వారికి, ఉగ్రాయిట్లు, సుమేరియన్లకు సర్పాలు సరప్ (మంట పుట్టించేవి), నాహాస్, పెటెన్, బెటెన్, నాగులుగా సుపరిచితమే. గిల్గామేష్ కథలో నానా కష్టాలు పడి గిల్గామేష్ సాధించుకుని వచ్చిన మృత సంజీవనీ లతను సర్పం అపహరించుకొనిపోయి మానవులకు మృత్యువు తప్పనిసరి చేస్తుంది. ఉదంకుని దగ్గరి కుండలాలపహరించు కొని పోయి తక్షకుడు సర్పయాగంలో తన వంశ వినాశనానికి కారణభూతుడవుతాడు. జ్ఞానఫలాన్ని ఈవ్, ఆదాం తొలి మానవ దంపతులు తినేలా చేసి సాతాన్ సర్పం తొలి మానవుల పతనానికి కారణమయ్యాడు. ఈజిప్షియన్లకు నాగదేవతలున్నారు. యురియస్ సర్పం రక్షణకు, ఎపెప్ కీడుకు, ఎనెప్ సంతానానికి దేవతలు. గ్రీకులకు డ్రాగన్ అంటే మహాసర్పం. ప్రాచీన గాథల్లో డ్రాగన్‌లు ఎక్కువ. నాగుల చవితి మనకు అత్యంత ప్రియమైన పండగ. ఓహియో దేశంలో ప్రసిద్ధికెక్కిన మహాసర్పపు దిబ్బ అమెరికన్ ఇండియన్లకు పవిత్రమైనది. దీని పొడవు అరకిలోమీటరు.

## మహారాజయోగం

జూపిటర్ దేవత సర్ప రూపంలో ఒలింపియాకు ప్రత్యక్షమైనాడని అందుకే అతని ఆశీస్సులతో అలెగ్జాండర్ జనించాడని ఓ ఐతిహ్యం. మార్క్ ఏంటోని

క్లియోపాత్రను ముద్దుగా 'ద సర్పెంట్ ఆఫ్ ఓల్డ్ నైల్' నైలు నదీ సర్పంగా పిలిచేవారట. క్లియోపాత్ర మరణించేప్పుడు 'ఏస్ప్' సర్పాలను పెదాలపై, హృదయంపై కాటు వేయించుకొని నిశ్శబ్దంగా నిష్క్రమించడం మనకు తెలుసు. మొదలయిన పదం తిరిగి వాక్యం చివర వచ్చే కవిత్వ పంక్తులను 'సర్పెంటైన్ వర్సెస్' అంటారు. సర్ప బంధ కవిత్వం మనకు తెలుసు.

## సర్ప జాతులు

ఆస్ట్రేలియన్ల ఆదిమ తెగలు ఇంద్రధనుస్సు సర్పం భూమిని పర్వతాలతో, నదులతో నిర్మించిందని నమ్ముతారు. సర్పం కలలోకి రావడం శృంగారానికి, కామేచ్ఛకి చిహ్నంగా ఫ్రాయిడ్ లాంటి మానసిక శాస్త్రజ్ఞులు చెప్పారు. సంవత్సరానికి లక్షమందిని మృతుల్ని చేసే విషజాతి సర్పాలు 600 ఉంటే, మొత్తం 3,000 రకాల పాములు ఉన్నాయని ఒక అంచనా. అర్జునుడు నాగకన్య ఉలూచిని పెళ్లాడాడు. కంబోడియాలోని అంగ్‌కోర్ రాజవంశీకులు తాము బ్రాహ్మణ రాజకుమారుడు నాగుల యువరాణిల సంతానమని విశ్వసిస్తారు.

హితుడిగాను, శత్రువుగాను సర్పం ప్రసిద్ధమే. అందుకే భగవానుడిలా వాక్రుచ్చినాడు.

**"సర్పాణా మస్మి వాసుకిః అనంత శ్చాస్మి నాగానాం..."**

✧✧✧✧✧

# 56. అనుబంధాల చిహ్నం అంగుళీయకం

చూపుడు వేలికి తొడుక్కున్న ఉంగరం ధైర్యాన్ని, తెంపరితనాన్ని తెలియజేస్తే, మధ్యవేలుకున్న ఉంగరం హుందాతనాన్ని, గౌరవాన్ని, అనామికకు ఉన్నట్లయితే ప్రేమను, చిటికెన వేలుకు ఉంటే అది వశీకరణను కలిగిస్తాయని ప్రాచీనులు నమ్మేవారు.

మానవ జీవితంలో ఉంగరానికి ఉన్న ప్రాధాన్యత అపారం. బారసాల, అన్నప్రాసన, పెళ్లి... ఇలా అన్ని ఘట్టాల్లో ఉంగరం పాత్ర కీలకం. రాముడు - సీత, దుష్యంతుడు-శకుంతల ఇలా ఎందరినో కలిపి, మానవ ఇతిహాసాన్ని మేలిమలుపులు తిప్పిన అంగుళీయకం విశేషాల విపంచి ఇది.

**"వానరోహం మహాభాగే! దూతో రామస్య ధీమతః**
**రామ నామాంకితం చేదంపశ్య దేవ్యంగుళీయకమ్ ॥**

'అమ్మా! నేను వానరుడను: రామదూతను. ఇదిగో రామనామాంకితమైన అంగుళీయకం. నీకు నమ్మకం కుదరడం కోసం శ్రీరాముడు పంపించారు. దీనిని అందుకో! నీకు దుఃఖోపశాంతి కలుగుతుంది' -హనుమంతుడు ఇచ్చిన ఉంగరాన్ని అందుకోగానే సీతాదేవికి తన భర్తను సాక్షాత్తు ఆ ఉంగరంలోనే చూస్తున్నట్లయి ఆమె వదనం చంద్రబింబంలా ప్రకాశించింది. రామాయణంలోని అత్యద్భుత ఘట్టమిది.

## శకుంతల కష్టం... సుఖం

దుష్యంతుడు తన ఉంగరాన్ని తమ ప్రణయానికి గుర్తుగా శకుంతలకు ఇచ్చి తన రాజ్యానికి వెళ్లిన తరువాత ఆమె సంగతి మరచిపోయాడు. దారిలో ఉంగరాన్ని పోగొట్టుకొని నాథుని నిరాదరణకు గురై, పెంచిన తండ్రి కణ్వుని ఆశ్రమానికి పోలేక, ఒంటరైనా ధైర్యం వీడక క్రూరమృగాల మధ్య కారడవిలో భరతుణ్ణి కన్నది ఆ మహాతల్లి. చేప కడుపులో దొరికిన ఉంగరాన్ని చూసి, గతాన్ని గుర్తుకు తెచ్చుకున్న దుష్యంతుడు తన సతీసుతుల్ని ఆదరించడం కాళిదాసు- అభిజ్ఞాన శాకుంతలంలో కమనీయ కావ్య వస్తువైనది. భాసుని అవిమారకం, విశాఖ దత్తుని ముద్రారాక్షసం నాటకాలలో ఉంగరానిది ప్రత్యేక పాత్ర. ఉంగరం ప్రతీకగా అనేక అద్భుత సంఘటనలు మానవునికి చిరస్మరణీయాలు.

## ఓక్కో ఉంగరానిదీ ఓ కథ

పవిత్రాత్మకు చిహ్నంగా చూపుడువేలికి బంగారు ఉంగరాన్ని తొడిగి పూజారులు పూజలు నిర్వహించేవారు. కుడిచేయి అనామికకు బంగారు ఉంగరానికి నీలాల్ని, పచ్చల్ని, పగడాల్ని పొదిగి కార్డినల్స్, బిషప్స్, పోప్‌లు తమ విధుల్ని నిర్వర్తించేవారు. కుడిచేతి అనామిక వేలు నుంచి హృదయానికి సరాసరి రక్తనాళమున్నదని అప్పటివాళ్ల నమ్మకం. ప్రాచీన రోమ్ సామ్రాజ్యంలో రోమన్ పౌరుడు ఇనుముతో చేసిన ఉంగరాన్ని, సెనెటర్లు, న్యాయాధిపతులకు బంగారు ఉంగరాల్ని ధరించే అర్హత ఉండేది. బానిసలకు ఆ అవకాశం లేదు. ఉంగరాలంటే మహత్తులు అనేక కథలుగా ఉండేవి. వేలికి పెట్టుకుంటే చాలు అదృశ్యమయ్యే శక్తినిచ్చేవి. తృటి కాలంలో ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లగలిగేవి. జీనీ (భూతాలు)లను ప్రత్యక్షం చేస్తాయి. అలాడీన్ ఉంగరాలూ, అస్మోడియస్ ఉంగరం, లార్డ్ ఆఫ్ ద రింగ్స్ లాంటివి ఎన్నెన్నో!

## పెళ్లి ఉంగరం పరమార్థం

పదహారో శతాబ్దం నుంచి ఉంగరం లోపలి భాగానికి సందేశాలు లిఖించడం ఆచారంగా మారింది. "ఎల్లప్పుడూ నీకోసం, నీవే నేను, ప్రేమతో, మనిద్దరం ఒకటిగా, జీవితాంతం ఒకరికొకరుగా, నా హృదయం, నేనూ నీకోసం, ఈ ఉంగరం నన్ను నీకు గుర్తుకు తేనీ, ప్రేమే స్వర్గం, మన పెళ్లి దేవతలే నిర్ణయించారు" ఇలాంటి భావనలతో బంగారు ఉంగరాలు మరింత కాంతివంతమయ్యాయి. వివాహమనేది మూడు రింగులుగా – టెట్రోతల్ రింగు, మారేజి రింగు... ఆనక... 'సఫరింగు'గా బాధితులు వాపోతారు కాని ఎక్కువమందికి అది వరమే.

## అంతా రామమయం

శ్రీరామునికి సంబంధించిన మరో ఉంగరపు కథ ఎంతో అద్భుతంగా ఉంటుంది. రామావతారం సమాప్తికానున్నది. కాని హనుమంతుడుండగా మృత్యువు ఆ దరిదాపులకు కూడా రాలేదు. అంచేత ఒక రోజున రాముడు తన సింహాసనం మీద కూర్చుని ఉండగా ఉంగరం నేలమీదకు జారిపడింది. పడీపడగానే అక్కడ ఉన్న చిన్న రంధ్రంలోకి పడి అదృశ్యమయ్యింది. రాముడు హనుమంతుని వైపు చూశాడు. స్వామి భావాన్ని అర్థం చేసుకున్న హనుమంతుడు సూక్ష్మరూపంలో ఆ బొరియలోకి దూరి పాతాళ లోకాన్ని చేరుకున్నాడు. అక్కడివాళ్లు అతడిని బంధించి మృత్యుదేవత ముందు పళ్లెంలో ఆహారంగా ఫలాలతో పాటు నివేదించారు. ఆ

తమాషాని చూస్తూ కూడా హనుమంతుడు రామ! రామ! అంటూ రామనామస్మరణ చేస్తూనే ఉన్నాడు. మృత్యుదేవత 'హనుమాన్! ఎందుకు వచ్చావు' అని అడిగాడు. రాముని ఉంగరం జారిపడింది. అది వెదుక్కుంటూ వచ్చానన్నాడు. యమధర్మరాజు తన తర్జనితో ఒక బంగారు పళ్లెం వైపు చూపించాడు. దాని నిండా నవరత్నఖచిత స్వర్ణాంగుళీయకాలే! "నీ రాముడిది ఏ ఉంగరమో తీసుకెళ్లు!" అన్నాడు. హనుమంతుడు ఆశ్చర్యంగా చూశాడు అన్నీ ఒకేలా ఉన్నాయనగా, యమధర్మరాజు ఇలా విశదీకరించాడు. "ఆ పళ్లెంలో ఎన్ని ఉంగరాలున్నాయో అందరు రాములు ఇంతకుముందు అవతరించారు. అవతార సమాప్తి నాటికి శ్రీరాముని ఉంగరం ఇలా పాతాళలోకానికి జారిపోతుంది. నీవు వెళ్లే నాటికి నీరాముడు అక్కడ కనిపించడు. ఈ ఉంగరాల్ని ఇలానే నేను భద్రపరుస్తాను" ఎన్ని ఉంగరాలు? ఎందరు రాముళ్లు? ఎన్ని రామాయణాలు? – కుమార వ్యాసుడు (కన్నడ కవి) అన్నట్లు రాముని చరితం రాసిన కవుల భారంతో ఆదిశేషుడే ఆక్రందిస్తున్నాడట.

**"తినికి దాను ఫనిరాయ రామాయణాద కవిగళ భారదళి"**

✧✧✧✧✧

# 57. మనసుదోచే... మన్మథబాణం

**"సహకార కుసుమ కేసర నికర భరామోద మూర్ఛితదికంతే**
**మధుర మధు విధుర మధుపే మధౌ భవత్కస్యనోత్కంఠా"**

(భర్తృహరి సుభాషితము–శృంగారశతకము)

వసంత ఋతువులో తియ్యని మామిడిపూల వాసనలు దిక్కులెల్ల వ్యాపించగా, తుమ్మెదలు ఆ పూల మకరందాన్ని తాగి మత్తెక్కి ఝుంకారం చేసే మనోహర దృశ్యాలను చూసే వారెవరికైనా శృంగార భావం కలుగకుండా ఉంటుందా? అని ఈ సుభాషితం అర్థం.

## వసంతం... శుభాలకు నాంది

మన్మథుడు వసించే కాలం కనుక ఈ కాలాన్ని వసంతం అని పిలుస్తారు. పైగా ఇది చక్కగా పూలుపూచే సమయం కాబట్టి ప్రజలు శుభకార్యాలు చేయ నారంభిస్తారు. అందుకే దీనిని సురభి అని కూడా పిలుస్తారు. చైత్ర వైశాఖ మాసములతో కూడిన ఈ ఋతువు వసంత ఋతువైంది.

## మన్మథబాణాలు

మన్మథునికి, మదనుడు, మారుడు, ప్రద్యుమ్నుడు, మీనకేతుడు, కందర్పుడు, దర్పుడు, అనంగుడు, కాముడు, పంచశరుడు, స్మరుడు, శంబరారి, మనసిజుడు, కుసుమేషుడు, అనన్యజుడు, పుష్పధన్వుడు, రతిపతి, మకరధ్వజుడు, ఆత్మభవుడు, బ్రహ్మసూహుడు, రుష్యకేసుడు అను ఇరవై ఒక్క పేర్లున్నాయి. రుద్రునికి కామవికారము కలుగజేసినప్పుడు అతని మూడవకంటి జ్వాలల్లో భస్మమైె మన్మథుడు అనంగుడయ్యాడు. అతని పేరనే వెలసింది అంగదేశం. ఇది గంగా సరయూ నదీసంగమ ప్రాంతం.

మన్మథుని పంచ బాణాలుగా ప్రసిద్ధికెక్కిన పుష్పాలు

1. అరవిందము (పద్మము, తామర), 2. అశోకము, 3. చూతము (మామిడి), 4. నవమల్లిక (విరజాజి), 5. నీలోత్పలము (నల్లకలువ)

ఇవి 1. సమ్మోహనము, 2. ఉన్మాదము, 3. శోషణము, 4. తాపము, 5. స్తంభనము అనే భావాలను కలిగించే బాణాలుగా ప్రసిద్ధి పొందాయి.

## మన్మథోత్సవమే హోలీ

ముక్కంటి అగ్నిజ్వాలలకు దగ్ధమై అనంగుడైన తన మన్మథుని బతికించమని

రతీదేవి శివుని వేడుకుంటుంది. శివుని అనుగ్రహానికి నోచుకున్న మన్మథుడు శ్రీకృష్ణుని పుత్రుడు ప్రద్యుమ్నుడిగా జన్మిస్తాడు. శంబరాసురుని అధీనంలో కాలం గడుపుతున్న రతీదేవిని రహస్యంగా కలుసుకుని ఆనక జరిగిన యుద్ధంలో శంబరుణ్ణి వధించి రతీదేవి సమేతంగా ద్వారక చేరుకుంటాడు. మన్మథోత్సవమే 'హోలీ'గా ప్రసిద్ధి చెందింది.

## గ్రీకు దేవత ఎరాస్

బంగారపు ధనుస్సు ధరించి నొప్పి తెలియకుండా గాయాలు చేసే బాణాలు సంధించి ప్రేమికుల్ని కల్లోల పరిచే బంగారు రంగు జుట్టు రెక్కలున్న 'ఎరాస్' కామాన్నీ, కోరికను, శృంగారాన్ని ఉద్దీపించే గ్రీకుదేవత. ఇతడు ప్రేమదేవత 'ఎఫ్రొడైట్' కుమారుడు. సైకే అనే మానవ కన్య తనంత అందంగా ఉంటుందని విన్న ఎఫ్రొడైట్ భూమిపై ఉన్న అత్యంత అందవికారుణ్ణి సైకే ప్రేమించే విధంగా చేయమని తన కుమారుడు ఎరాస్‌ను పంపుతుంది. ఎరాస్ సైకేను చూసి సమ్మోహితుడై తను వచ్చిన పనిని మరిచి ప్రేమాయణంలో పడతాడు. తల్లికి తెలిస్తే గొడవ అవుతుందని సైకేకు ఓ నియమం పెడతాడు. తానెప్పుడూ అదృశ్యరూపంలో ఉంటానని, చీకటిలో కూడా తనను చూసే ప్రయత్నం చేయవద్దనేది ఆ నియమం. కుతూహలం రోజురోజుకూ పెరిగి సైకే ఓ అర్ధరాత్రి దీపాన్ని వెలిగించి ఎరాస్‌ను చూస్తుంది. దీపపు వేడి నూనె తగిలి నిద్రలేచిన ఎరాస్ నియమ భంగమైనందుకు అలిగి సైకేను విడిచి వెళ్లిపోతాడు. ఎఫ్రొడైట్‌కు ఈ సంగతి తెలిసి తన ప్రియుని కోసం ప్రపంచమంతా గాలిస్తున్న సైకేపై జాలి తలచి కొన్ని పరీక్షలు పెడుతుంది. అన్నీ నెగ్గినా చివరి పరీక్షలో పాతాళదేవత పెర్సిఫోన్ నుంచి ఒక కలశాన్ని తీసుకువస్తూ తన సహజ కుతూహలాన్ని ఆపుకోలేక మూత తెరుస్తుంది. దాన్లో అప్పటి వరకు నిద్రపోతున్న మృత్యువు బయటపడి సైకేను ఆవహిస్తుంది. అయితే అధిదేవత జ్యూస్ కరుణతో బతికి తన ప్రియుడు ఎరాస్‌తో హాయిగా జీవించడం కోరిక (ఎరాస్) మనస్సు (సైకే)ల సంయోగానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. ఇదే కథ రోమన్ల పురాణాలలో ఎఫ్రొడైట్ వీనస్‌గా, ఎరాస్–క్యుపిడ్‌గా వర్ణించారు.

## ప్రేమదేవుడు (Cupid)

షేక్స్పియర్– 'లవ్స్ లేబర్స్‌లాస్ట్'లో క్యూపిడ్‌ను దారితప్పిన బాలుడిగా అందర్నీ కల్లోల పరిచే వాడిగా అభివర్ణించాడు. "ఒక తలుపు నుంచి గెంటేస్తే మరో తలుపులోంచి దూసుకువస్తాడు క్యూపిడ్" అంటాడు జెఆర్. ప్లాంచే. ఇప్పటి వాలెంటైన్స్‌డే చిహ్నంగా కూడా సీతాకోకచిలుకలా రెక్కలతో ఎగురుతూ ప్రేమబాణాలు సంధిస్తున్న క్యూపిడ్ మనల్ని మైమరపింపజేస్తాడు.

మన్మథునికి ఇంత శక్తి ఎలా వచ్చిందో 'సౌందర్యలహరి'లోని ఈ శ్లోకం అద్భుతంగా చెబుతుంది.

**"ధనుః పౌష్పం మౌర్వీ మధుకరమయీ పంచవిశిఖా**
**వసంతః సామంతో మలయమారుదాయో ధనరథః**
**తథాప్యేకః సర్వం హిమగిరిపుతే కామపి కృపా**
**మపాంగాతే లబ్ధ్వా జగదిదమనంగో విజయతే".**

సుకుమారమయిన పూల విల్లు, తుమ్మెదలతో పేనిన చంచలమైన అల్లెతాడు, అయిదు బాణాలు, వసంతుడు స్నేహితుడుగా, మెల్లగా పోవు మలయమారుతమే రథంగా కలిగి ఉండి, కనీసం శరీరం కూడా లేకుండా ఒంటరివాడైన మన్మథుడు నీ కృపాకటాక్షం చేత మాత్రమే సర్వలోకాలలోని జీవులను తనవశం చేసుకోగలుగుతున్నాడు. అని ఈ శ్లోకం అర్థం.

ఈ శ్లోకమే భోజరాజు చరితంలో కొన్ని మార్పులతో ఉన్నది. భార్య, కొడుకు, కోడలితో ఒక పండితుడు భోజరాజు ఆస్థానానికి వచ్చినప్పుడు భోజరాజు 'క్రియాసిద్ధిః సత్త్వైభవతి మహతాంనోపకరణే' అను సమస్యను పూరించమంటాడు. అప్పుడు ఆ పండితుడు కుంభసంభవుడైన అగస్త్యునిపరంగా పూరిస్తే ఆయన భార్య సూర్యుని పరంగా, కుమారుడు శ్రీరాముని పరంగా పూరించారు. కోడలు మాత్రం మన్మథుని పరంగా పూర్తిచేసి తన కష్టాన్ని రాజుకు విన్నవించుకున్నది.

**"ధనుఃపౌష్పం మౌర్వీ మధుకరమయీ పంచవిశిఖా**
**వసంతోః సామంతో సుహృదపి జడాత్మా హిమకరః**
**స్వయం చైకోనంగః సకల భువనం వ్యాకులయతి**
**క్రియాసిద్ధిః సత్త్వేభవతి మహతాం నోపకరణే"**

ఇలా అంటే అలా విరిగిపోయే పూలవిల్లు, అటు ఇటు పారిపోయే తుమ్మెదల అల్లెతాడు, తాకగానే వంగిపోయే పూలబాణాలు, రెండు నెలలు ముచ్చటచెప్పే వసంత ఋతువు స్నేహితుడు, జడాత్ముడు చంద్రుడు, తనకా శరీరమే లేదు అయినా సకల భువనమును వ్యాకుల పరుస్తున్నాడు. కార్యసాధకులకు, మహాత్ములకు సాధనములతో పని ఉండదు.

అందుకే మన్మథుడు, క్యుపిడ్‌గా, ఎరాస్‌గా; ఎఫ్రొడైట్ శృంగార దేవత వీనస్‌గా మీనరాశియందు తల్లీ బిడ్డ రెండు చేపలుగా నభోవీధియందు ప్రకాశిస్తూ వసంత రుతువులో చంద్రుని వెన్నెల వాగులో ప్రేమికులను పరవశింపజేస్తున్నాడు.

✧✧✧✧✧

# 58. సాలీడు జీవనదారం - కాలచక్రం

'సాలెపురుగు ఎలాగైతే గూడు కట్టడానికి కావాల్సిన దారాన్ని తనలో నుంచే రప్పించుకుని, తిరిగి వెనక్కి తీసేసుకుంటుందో, భూమిలోని మూలికలన్నీ ఎలా పుడతాయో, మానవుని తలపై వెంట్రుకలెలా ప్రయత్నం లేకుండానే పెరుగుతాయో అలాగే అక్షర తత్త్వం నుంచే విశ్వమనే బ్రహ్మపదార్థం పుడుతుంది' అని ముండకోపనిషత్ చెబుతోంది. సాలెపురుగు జీవనాన్ని ఆధారం చేసుకుని అన్ని మతగ్రంథాల్లోనూ కాలచక్రం గురించి విశేష గాథలున్నాయి. ఆ విశేషాలు...

శ్రీకాళహస్తీశ్వరుడి పూజకోసం ప్రాణత్యాగం చేసిన శ్రీ (సాలీడు) కథ మనందరికీ తెలుసు. దివ్య ఖుర్ఆన్ గ్రంథంలో అల్ ఆన్ కబూత్ అధ్యాయంలో అల్లాహ్‌ను కాదని ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నవారు సాలెపురుగును పోలి వుండి బలహీనమైన ఇల్లు కట్టుకున్నవారిగా ప్రవక్త అభివర్ణించారు. (29-41-44) మహమ్మదు ప్రవక్త మక్కా నుంచి మదీనాకు శత్రువులకు దొరక్కుండా వెళ్తూ ఓ గుహలో వున్నప్పుడు ఓ సాలీడు గుహద్వారాన్ని పూర్తిగా ఆక్రమిస్తూ గూడు అల్లిందనీ, శత్రువులు దాన్ని చూసి లోపల ఎవరూ లేరని భావించి గుహలోపల వెదక్కుండానే వెళ్లిపోయారని ఓ కథనం. ఎన్నోసార్లు యుద్ధంలో ఓడిపోయి నిరాశ చెందిన రాబర్ట్ బ్రూస్... మళ్లీ మళ్లీ కిందపడినా పట్టువదలకుండా గూడు నిర్మించుకున్న సాలీడును చూసి తానూ విజయం సాధించాడని చరిత్ర చెబుతోంది. ఉత్తర అమెరికాలోని ఛెరోకీ ప్రజల నమ్మకం ఏమిటంటే సైకామోర్ వృక్షంలో దాగున్న అగ్నిని తీసుకురావడానికి పక్షులూ, పాములూ భంగపడినప్పుడు, నీటిసాలీడు తన పట్టుదారాల గిన్నెలో అగ్నికణికను దాచుకుని తీసుకువచ్చి మానవజాతికి అందించి మహోపకారం చేసిందంటారు.

### ఉదంక చరితం

గురుపత్ని కోరిన కుండలాలను పౌష్యమహాదేవి నుంచి ఉదంకుడు స్వీకరించి తిరిగి వస్తున్నప్పుడు, తక్షకుడనే నాగుడు వాటినపహరించి పాతాళలోకానికి పారిపోతాడు. తక్షకుడిని వెంటాడుతూ ఉదంకుడు నాగలోకానికి వెళ్లినప్పుడు అక్కడ తెలుపు నలుపు దారాలను పేనుతున్న ఇద్దరు అందమైన స్త్రీలు కనిపిస్తారు. పన్నెండు ఆకులున్న చరఖా చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు పిల్లలను చూస్తాడు. వేడిపొగలు కక్కుతున్న అద్భుతమైన గుర్రంపై వున్న ఓ మహాపురుషుడు ఆతనికి దర్శనం ఇస్తాడు. అతనిని భక్తిశ్రద్ధలతో సేవించి, ఆ మహానుభావుడి అశ్వాన్నధిరోహించి క్షణకాలంలో

గురుగృహాన్ని చేరుకుని, కుండలాలను గడువు ముగియకముందే గురుపత్నికి సమర్పిస్తాడు ఉదంకుడు. నాగలోకంలో కనిపించిన ఆ వింత దృశ్యానికి అర్థం చెప్పమని ఉదంకుడు ప్రార్థించగా గురువైన ధౌమ్యుడు ఆనందాశ్చర్యభరితుడై ఇలా వివరించాడు. "నాగలోకంలో నీకు కన్పించిన స్త్రీలు ధాత, విధాతలు. వారు పేనుతున్న నలుపు, తెలుపు దారాలు పగలు రాత్రులు. పన్నెండు ఆకులున్న చక్రము పన్నెండు నెలల సంవత్సరం, ఆరుగురు కుమారులు ఆరు ఋతువులు. ఆ అశ్వరాజమే అగ్ని. ఆ దివ్యపురుషుడు పర్జన్యుడు (వర్షాధిదేవత)" అని వివరిస్తాడు. ఇది మహాభారతం ఆదిపర్వంలో అద్భుతంగా వర్ణించిన కాలచక్ర విశేషం.

## గ్రీకు ఇతిహాసాల్లో సాలీడు

మొయిరాయి అని పిలుచుకునే ముగ్గురు అక్కాచెల్లెళ్లు గ్రీకు దేవతలు. వీళ్లలో ఒకరు మానవుల జీవనదారాన్ని పేనుతుంటే, ఒకరు కండెకు చుట్టుతుంటే, మూడో సోదరి కత్తిరిస్తుంది. దారం కత్తిరించగానే మానవుడికి మరణం సంభవిస్తుందన్నమాట. గ్రీకుదేశంలోనే ఒకప్పుడు అరాఖ్నే అనే అందాలరాశికి చరఖాపై సుందరమైన బట్టలు నేయడంలో అత్యంత ప్రావీణ్యం ఉండేదిట. ఆ గర్వంతో ఆమె కళలకు రాణి అయిన ఏథెనానే తనతో అల్లిక పోటీకి రమ్మని సవాల్ చేసింది. ఒలింపస్ స్వర్గం నుంచి దిగివచ్చిన ఏథెనా దేవత అరాఖ్నేను ఓడించి శిక్షగా ఆమెను సాలీడుగా మార్చిందని ఇతిహాసం. అందుకే సైన్సుపరంగా సాలీడు జాతి పురుగుల్ని అరాఖ్నిడ్సు అంటారు (Arachnids).

ఏథెన్స్ నుంచి ప్రతి సంవత్సరం కప్పంగా ఏడుగురు బాలురు ఏడుగురు బాలికల్ని వృషభాసురుడికి (మినోటార్) ఆహారనిమిత్తం పంపవలసిందిగా క్రెటె దేశపు రాజు మినాస్ ఆజ్ఞ. ఈసారి వాళ్లతో పాటు థెసియస్ వెళ్లాడు. అతన్ని రాకుమారి ఎరియాడ్నే మోహించింది. మినోటార్ ఉన్న నేలమాళిగ గజిబిజి (మేజ్) దారి నుంచి బయటకు రావడానికి థెసియస్‌కు ఒక దారపు ఉండ ఇచ్చింది. దాని సాయంతో లోపలికి వెళ్లి వృషభాసురుణ్ణి సంహరించి దిగ్విజయంతో వెనక్కు వచ్చాడు థెసియస్.

## సాలీడు దేవత

ఉత్తర అమెరికాలోని హోపి ఇండియన్లు సృష్టికర్తయైన సాలీడుదేవత (స్పైడర్ వుమన్) మొదటితరం మానవుల్ని భూమిపై తయారుచేసిందని నమ్ముతారు. మైక్రోనేసియాలోని నౌరూ ప్రజలకు ఏరోప్ – ఈనాప్ సాలీడు దైవం. ఆల్చిప్పలా అతుక్కుపోయిన భూమ్యాకాశాలను విడదీసే పనిని గొంగళిపురుగుకు అప్పచెప్పిందని,

ఆ ప్రయత్నం చేసి చనిపోయిన గొంగళిపురుగు సూర్యుడిగా, గొంగళిపురుగు చెమట సముద్రపు నీరుగా, ఆల్చిప్పలోని ముత్యం పురుగు చంద్రుడిగా మారాయని విశ్వాసం. ఎరియానే (ఎరియాడ్నే) థెసియస్‌కు ఇచ్చిన దారంలానే జీవకణంలోని డి.ఎన్.ఎ. జీవనదారంలాగా సర్పిలాకారంలో (హెలిక్స్) ఉంటుంది. జీవపరిణామ క్రమం అనే నేలమాళిగ రహస్యాన్ని ఛేదించడానికి తోడ్పడుతుంది.

ప్రాతఃకాలపు ఉషోదయ సమయంలో ప్రకృతి పచ్చికబయళ్లలో తెల్లని వెండిదారాల్లో మంచుముత్యాలను సేకరించుకుని మిలమిల మెరిసే సాలెగూళ్లు. జీవనిర్జీవ పదార్థాల మధ్యవుండే దైవసూత్రాలను (సూపర్‌స్ట్రింగ్స్) గుర్తుచేస్తూ ప్రకృతి లేదా దైవానికి మానవకోటికి మధ్య ఉండే సంబంధాన్ని లీలామాత్రంగా, సూత్రప్రాయంగా తెలియజేస్తుంటాయి.

✧✧✧✧✧

# 59. జీవ పరిణామ రాట్నం - బ్రహ్మచక్రం

సృష్టి, జీవి మూలాలను గురించి ఆలోచన ప్రారంభించిన బ్రహ్మవాదులు ధ్యానమార్గంతో పరమాత్మ దివ్యస్వరూపాన్ని దర్శించారు. ఈ దివ్యశక్తినే కొందరు భగవంతుడని, మరికొందరు శక్తి అని గుర్తిస్తున్నారు. మహనీయులకు ఈ జగత్తు చక్రరూపంలో కనిపించింది... ఆ చక్రరూపంలో దాగివున్న అనంతమైన విశేషాలను శ్వేతాశ్వతర ఉపనిషత్‌లో చర్చించారు.

శ్వేతాశ్వతర పదం ఇంద్రియ నిగ్రహాన్ని, 'స్వచ్ఛమై'న కోడెదూడ అనే గౌరవ సంబోధనను సూచిస్తుంది. ఆ కాలంలో జ్ఞానులకు, గొప్పవారికి, వృషభ, పుంగవ, లాంటి శ్రేష్ఠవాచకాలను చేర్చి గౌరవించేవారు. జోరాస్ట్రియన్ మత నిర్మాతను వృద్ధ ఒంటె - 'ఓల్డ్ కేమెల్' అనేవారని మనకు తెలుసు. అశ్వతరమును కంచరగాడిద అని, ఒకరకమైన పాముగా కూడా వ్యవహరిస్తారు.

## ప్రపంచానికి మూలం?

కృష్ణయజుర్వేదంలోని ఈ ఉపనిషత్తులో 113 మంత్రాలు ఆరు అధ్యాయాలలో ఉన్నాయి. మొదటి అధ్యాయంలో బ్రహ్మవాదుల చర్చ ఉన్నది. ఈ ప్రపంచమునకు మూలకారణము ఏది? బ్రహ్మమా? మనం ఎక్కడి నుంచి జన్మించాం? దేనిచేత జీవిస్తున్నాం? ఈ సుఖదుఃఖాలను ఎవరు నిర్దేశిస్తున్నారు? మనం చివరకు ఎక్కడకు చేరుకుంటాం?

1. కాలము... స్వభావము, 2. కర్మ లేదా నియమము, 3. యాదృచ్ఛమయ లేదా కాకతాళీయ న్యాయము- అనుకోకుండా జరగడం, 4. పంచభూతములచే నిర్మించబడ్డ పదార్థము, 5. శక్తి లేదా ప్రకృతి, 6. జీవుడు లేదా బుద్ధి ఈ ఆరింటిలో ఏదో ఒకటి కారణమా? లేక 7. వాటి సంయోగము వలన జగత్తు ఏర్పడినదా? అని ఆలోచిస్తున్న బ్రహ్మవాదులు ధ్యానాన్ని అవలంభించి కాలరూపుడు, అద్వితీయుడు, సర్వకారణుడు అయిన ఆ పరమాత్మ యొక్క దివ్యశక్తిని వారు దర్శించారు.

ఆ దివ్యశక్తినే కొందరు భగవంతుడనీ, తాత్త్వికులు పరమాత్మగానూ, శాస్త్రజ్ఞులు శక్తిగానూ గుర్తిస్తున్నారు. కాలం నుండి అహంత వరకూ అన్నిటినీ ఆ శక్తి పర్యవేక్షిస్తుంది. (అధితిష్ఠతి). మామూలుగా అర్థం కానిదీ, స్వయం ప్రకాశమై అన్నింటా ఉన్నదీ ఆ శక్తియే.

## బ్రహ్మచక్రం

**"తమేక నేమిం త్రివృతం షోడశాంతం**
**శతార్ధారం వింశతి పత్యరాభిః**
**అష్టకైః షడ్భిర్విశ్వ రూపైక పాశం**
**త్రిమార్గ భేదం ద్వినిమిత్తైక మోహమ్"**

పరమాత్మ, బ్రహ్మవాదులకు చక్రరూపమైన జగత్తుగా కన్పించింది. ఈ విశ్వచక్రానికి ఒక కొయ్య చట్రమూ, మూడు పట్టాలు, పదహారు కొనలు, యాభై ఆకులు, ఇరవై ఎదురు ఆకులు, ఆరు ఎనిమిదేసి తత్త్వాలు, ఒకటే- అయినా అనేక రూపాలు కల పాశం కలిగి ఉండి, మూడు విభిన్న మార్గాలలో ప్రయాణిస్తూ రెండు వ్యతిరేక విషయాలను భ్రమిస్తున్నది.

కొయ్యచట్రం పరిధిలో ప్రకృతి ఉన్నది. ప్రకృతినే మాయగా, శక్తిగా, అజ్ఞానముగా, అవ్యక్తాకాశముగా విజ్ఞులు భావిస్తారు. సృష్టి అంతా ప్రకృతియే కదా! ఈ చక్రానికి మూడు రింగులు, చట్రానికి దృఢత్వానిచ్చే పొరలుగా సత్త్వ, రజస్తమోగుణాలుగా, దేశ కాల నిమిత్తాలుగా ఆవరించబడి ఉన్నాయి. పదహారు కొనలు పంచభూతాలైదూ, జ్ఞానేంద్రియాలైదూ, కర్మేంద్రియాలైదూ, అంతరింద్రియంతో కలిసి పదహారవుతున్నాయి.

### యాభై ఆకులు

**1) ఎనిమిది సిద్ధులు-** అవేమిటంటే ఊహము, శబ్దము, అధ్యయనము, ఆధ్యాత్మిక దుఃఖ విఘాతము, ఆధిభౌతిక దుఃఖ విఘాతము, ఆధిదైవిక దుఃఖ విఘాతము, సుహృత్ప్రాప్తి, దానము.

**2) అయిదు విపర్యయములు-** తమస్సు (అవిద్య), మోహము (అస్మిత), మహామోహము (రాగము), తామిస్త్రము (ద్వేషము), అంధతామిస్త్రము (అభినివేశము).

**3) తొమ్మిది తుష్టులు-** అంభస్సు, సలిలము, ఓఘము, వృష్టి, సూపారము, పారము, అపారము, అనుత్తమాంభస్సు, ఉత్తమాంభస్సు.

**4) ఇరవై ఎనిమిది అశక్తులు-** చక్షుర్వధ, రసనవధ, ఘ్రాణ వధ, త్వగ్వధ, శ్రోత్రవధ (జ్ఞానేంద్రియశక్తులు), వాన్వధ, పాణివధ, పాదవధ, పాయువధ, ఉపస్థవధ, మనోవధ (కర్మేంద్రియశక్తులు), ప్రకృతి వధ, ఉపాదాన వధ, కాలవధ, భాగ్యవధ, అర్జనోపరమ వధ, రక్షణో పరమ వధ, క్షయో పరమవధ, అతృప్తపరమ వధ, హింసోపరమ వధ, ఊహ వధ, శబ్ద వధ, అధ్యయన వధ, ఆత్మిక దుఃఖ విఘాత వధ, భౌతిక దుఃఖ విఘాత వధ, దైవిక దుఃఖ విఘాత వధ, సుహృత్ప్రాస్తి వధ, దాన వధ (బుద్ధికి సంబంధించిన శక్తులు)

**ఇరవై ఎదురు ఆకులు–** పది ఇంద్రియాలూ, పది ఇంద్రియ విషయాలూ.

**ఎనిమిదేసిగా ఆరు–** ప్రకృతి అష్టకం, ధాతు అష్టకం, ఐశ్వర్య అష్టకం, భావ అష్టకం, దేవ అష్టకం, గుణ అష్టకాలు.

**అనేక రూపాలుగల పాశం –** కోరిక లేదా కామం.

**మూడు మార్గాలు –** ధర్మము, అధర్మము, జ్ఞానము.

**ప్రతిభ్రమణము–మోహము –** ఈ చక్రభ్రమణం భ్రమను సూచిస్తూ ఒక్కొక్క భ్రమ రెండు విరుద్ధ విషయాలైన పుణ్యపాపాలనూ లేదా సుఖ దుఃఖాలను సూచిస్తాయి.

అదే బ్రహ్మ చక్రం. జీవ పరిభ్రమణ చక్రం. ఉపనిషత్తులలోని ఆలోచనా వేడిని, వాడిని వివరించే అద్భుత ఘట్టం. ఇది శ్వేతాశ్వతర ఉపనిషత్తులోనిది.

✧✧✧✧✧

# 60. ధనవ్యామోహం నిష్ఫలం

**ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్**
**తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్య స్విద్ధనం**

ఈ చరాచర ప్రపంచమంతా ఈశ్వరుని స్వరూపమే అని నిరూపిస్తుంది. ఈశావాస్యోపనిషత్తు. ఇతరుల ధనాన్ని ఆశించకు... నీకు దక్కింది అనుభవించు అనే అర్థం పైకి కనిపిస్తున్నా... ఈ శ్లోకంలోని అంతరార్థం అద్భుతమైనది. శ్లోకార్థాన్ని, అన్వయాన్ని సాధించడానికి... చతుర్విధ పురుషార్థాలలో ఒకటైన అర్థసాధనను గురించి ప్రామాణిక గ్రంథ పాఠాల ప్రసక్తి...

**వేదమూల మిదం బ్రహ్మం భార్యా మూల మిదం గృహం**
**కృషి మూల మిదం ధ్యానం ధన మూల మిదం జగత్**

పంచ తంత్రంలోని ఈ శ్లోకానికి అర్థం ఇది... వేదాలు జ్ఞాన సంపాదనకు, ఇల్లాలు ఇంటికి, శ్రమ ధాన్యము పండించడానికి పనికివస్తాయి. కానీ ఈ జగత్తును నడిపే ఇంధనం ధనమే...

అయితే ధర్మం, అగ్ని, రాజు, దొంగ ఈ నలుగురూ ధనానికి దాయాదులట. ధర్మం లోపించినవాని ధనం అగ్ని, రాజు, దొంగ – వీరిలో ఎవరికో ఒకరి పాలవుతుందని అంటారు.

**టకా ధర్మః టకా కర్మ టకా హి పరమం పదం**
**టకాయస్య గృహేనాస్తి హాటకా టక్ టకాయతే**

ధనం లేనివాడి ఇంట్లో కుండలూ, పాత్రలూ టకటకలాడతాయి. ఆ శబ్దాలకు అర్థం... ధనమే ధర్మం. ధనమే కర్మ. ధనమే మోక్షం అని అంటుంది వార్తాలాపం.

**ఆగమనం... నిష్క్రమణం**

డబ్బుజబ్బు బహు గమ్మత్తైనది. అది అంటినవాడికి చెవులు వినబడవు. నోరు పెగలదు. కళ్లు నెత్తికెక్కుతాయి. మనసు అష్టవంకరలై పెనుమార్పులు పొందుతుంది. అయితే ఈ ధనానికి దానం, భోగం, నాశం అనే మూడు స్థితులున్నాయి. ఒకరికి పెట్టక తాను తినక దాచుకునే వాడి ధనం నాశనం కాకతప్పదు. ఒకడు నేలమీద చిందరవందరగా ఉండే ధాన్యాన్ని చీపురుకట్ట పోగుచేసినట్లు చేస్తాడు. దానిని వేరే ఎవడో అనుభవిస్తాడు. ధన నష్టం, మనస్తాపం, గృహచ్ఛిద్రం, అవమానం, మోసపోవడం – వీటిని బయటకు వెల్లడించకూడదంటారు పెద్దలు. పోగొట్టుకున్నది పైకి చెప్పుకుంటే సంఘంలో తలవంపులు. మరికొందరు పొందింది కూడా చెప్పుకోలేరు... అది వేరే సంగతి.

సంతానంలేని వారికి ఇల్లు శూన్యమైపోతుంది. స్నేహితులు లేని వారికి ఊరు శూన్యమైపోతుంది. మూర్ఖునికి నాలుగు దిక్కులా శూన్యమే కనిపిస్తుంది. దరిద్రుడికి సర్వమూ శూన్యంగా కనబడుతుంది.

**ఆజగామ యదాలక్ష్మీః నారికేళ ఫలాంబువత్**
**నిర్జగామ యదాలక్ష్మీః గజభుక్త కపిత్థవత్**

సంస్కృత పంచతంత్రంలోని ఈ సుప్రసిద్ధ శ్లోకం తాత్పర్యం ఇది... 'ధనం వచ్చినప్పుడు కొబ్బరికాయలోకి నీరు వచ్చినట్లే ధనం కూడా తెలియకుండానే వస్తుంది. పోయేటప్పుడు ఏనుగు మింగిన వెలగపండులోని గుజ్జులా కళ్లముందే మాయమై పోతుంది'. (సిరిదావచ్చినవచ్చును....)

## పాశ్చాత్యవాదం

'ధనమోహమే అన్ని పాపాలకు మూలం' అని కొత్త నిబంధన టిమోతీ హెచ్చరిస్తోంది. 'దేవుడు ధనం గురించి ఏమనుకుంటున్నాడో తెలుసుకోవాలను కుంటున్నావా... అయితే డబ్బున్నవాళ్లను ఒకసారి చూడు' అని ఏనన్ చెబుతాడు. 'ధనం ప్రసక్తి వచ్చేప్పటికి అందరిదీ ఒకటే మతం' – అంటాడు వోల్టెయిర్. 'పెద్దలు ఎన్ని నీతులైనా చెప్పనీయ్! ధనమున్నవాడే అందగాడు... కాదనగలవా? అని ప్రశ్నిస్తాడు విలియం సోమర్ విల్. డబ్బున్న వాడి జోకులా ధనం తేనెలా తియ్యగా ఉంటుంది బ్రౌన్ దొరకి.

## నిన్ను నువ్వే దోచుకుంటావా?

**అర్థానా మార్జనే దుఃఖం ఆర్జితానాం చ రక్షణే**
**ఆయే దుఃఖం వ్యయే దుఃఖం ధిగర్థం దుఃఖభాజనమ్**

ధనం సంపాదించడంలో దుఃఖం, ఖర్చు పెట్టడంలో దుఃఖం, ఎక్కువొస్తే దాచుకోలేక దుఃఖం, ఖర్చైతే మరింత దుఃఖం... ఎందుకీ దుఃఖమూల ధనం... మనకెందుకు? అందుకే న్యాయంగా సంపాదించిన ధనంతోనే తనను పోషించు కోవాలి. అన్యాయ మార్గాల్లో సంపాదించినవాడు కర్మలు ఆచరించడానికి అర్హుడు కాదు అని మనుస్మృతి, పరాశరస్మృతులు నొక్కి చెబుతున్నాయి. ఈ విషయాలనే ఈశావాస్యోపనిషత్తు "మాగృధః కస్య స్విద్ ధనం" –ఆశించకు, ఎవడి ధనాన్ని – అని చెబుతోంది. నీకెంత కావాలో అంతే నిస్వార్థంగా సంపాదించుకో. ఈ చరాచర ప్రకృతిలో నీవు అనుభవించగలిగినంత అనుభవించు. ఇతరులకు హాని కలిగించకు. ధనం అవసరమే కాని కూడబెట్టడం కానీ లోభత్వం కానీ కూడదు. అయినా ఈ ప్రపంచమంతా ఈశ్వరమయమే అయినప్పుడు ఇతరుల్ని దోచుకోవడం నిన్ను నీవు దోచుకోవడమే కదా!

✧✧✧✧✧

# 61. సత్యమే... శివం

**హిరణ్యయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్**
**తత్త్వం పూషన్న పావృణు సత్యధర్మాయ దృష్టయే**

–ఈశావాస్య, 15

సత్యమనే నీ వదనాన్ని స్వర్ణపాత్ర కప్పియున్నది. ఓ దేవా! దానిని తొలగించవయ్యా... సత్యధర్మాలను దర్శించుకుంటాను.

✧✧✧✧✧

సత్యమేవ జయతే నానృతం సత్యేన పంథా దేవయానః – 'సత్యమే జయిస్తుంది. అదే దేవమార్గం. ఈశ్వరుడు సత్యస్వరూపుడు' అని ముండకోపనిషత్తు చెబుతుంది. సత్యంవద ధర్మంచర – సత్యాన్నే పలకాలి. ధర్మాన్ని పాటించాలి. మాతృదేవోభవ. పితృదేవోభవ. ఆచార్యదేవోభవ. అతిథిదేవోభవ. పెద్దలు చేసిన విధానాలను అనుసరించు. విద్య నేర్చుకో. న్యాయమార్గాన ధనం సంపాదించు. సత్సంతతిని పొందు అని తైత్తిరియోపనిషత్తు ప్రబోధిస్తుంది. అలా విద్య నేర్చుకుని జ్ఞాని అయినవాడు చేపట్టదగిన వృత్తులను గురించి మనుస్మృతి ఇలా చర్చిస్తుంది...

**ఋతామృతాభ్యాం జీవేత మృతేన ప్రమృతేన వా**
**సత్యా అనృతాభ్యామపి వా నశ్వవృత్త్యా కదాచన**

రుతము అనే వృత్తిలో రెండు రకాలున్నాయి. మొదటిది ఊంఛ వృత్తి... దీనిలో చేనిలో మిగిలిన కంకులను ఏరుకోవడం, శిలావృత్తిలో కళ్లంలో మిగిలిన గింజలను సేకరించుకోవడం ఉంటుంది. అమృతమంటే కోరకుండానే లభించింది. మృతమంటే యాచించి సంపాదించింది. ప్రమృతమంటే వ్యవసాయం. సత్యానృతం అంటే ధర్మమైన వర్తకంలో న్యాయమైన లాభాన్ని అడిగి తీసుకోవడం. శ్వవృత్తి అంటే కుక్కలా యజమానిని సేవించడం. జ్ఞాని అయినవాడు ప్రమృతం లేదా సత్యానృతాలతో మాత్రమే జీవించాలి. తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే రుతం, అమృతం అనే రెండు వృత్తులలో జీవనం గడపాలి. అది సాధ్యం కాకపోతే మృత వృత్తిని అనుసరించ వచ్చు. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ సేవకవృత్తిని అనుసరించకూడదు.

**రుతం సత్యం పరబ్రహ్మ పురుషం కృష్ణ పింగళం**
**ఊర్ధ్వరేతం విరూపాక్షం విశ్వరూపాయవై నమో నమః**

రుతం అంటే సత్యమే. రుతం అంటే ఏవిధమైన కోరికలు లేకుండా చేసే పరమాత్మ ఆరాధనా ఫలం. రుతవృత్తిలో ఒకరిని యాచించడం లేదా బాధించడం ఉండదు. అలాగే సత్యం కూడా అబాధితంగానే ఉంటుందని తైత్తిరీయారణ్యకోపనిషత్తు పాఠం.

## మృత్యువు జయించలేనిది

ఆంగ్లభాషలో ట్రూత్ అనేపదం రుతానికి దగ్గరగా ఉంటుంది. దాని అర్థం సత్యమే. 'దురాలోచనతో చెప్పిన సత్యం అన్ని అబద్ధాల కన్నా అధమైనద'ని బేక్ అంటాడు. సత్యం కల్పన కంటే చిత్రంగా ఉంటుందంటాడు బైరన్. ఎప్పుడూ సత్యం వధ్యశిలపైనే కనిపిస్తుంది. అధర్మం సింహాసనాన్ని అధిరోహిస్తుందెందుకో అని ఆశ్చర్యపడతాడు లోవెల్. 'జ్వలిస్తున్న ఆత్మతో ఉన్న మానవునికి ఒక్క ఘడియ ఆయుష్షు చాలు. సత్యమనే నావలో అతడు మృత్యుసముద్రాన్ని దాటగలడు. ఎందుకంటే మృత్యువు అందాన్ని, ధైర్యాన్ని, యవ్వనాన్ని దేన్నైనా నశింపచేయగలదు... ఒక్క సత్యాన్ని తప్ప' అంటాడు జాన్ మేస్‌ఫీల్డ్. 'సత్యాన్ని బంగారు పాత్రలో దాచి భూగర్భంలో దాచావనుకో. అది పెరిగి పెరిగి ఒక్కసారే విస్ఫోటనం చెందినప్పుడు కనుచూపు మేరలో ఇంకేదీ కనిపించదు' అంటుంది ఎమిలీజోలా.

## పరమాత్మ సత్యస్వరూపం

ఈశావాస్యోపనిషత్తులోని పైశ్లోకంలో, 'సర్వజీవ పోషకుడివైన ఓ సూర్యదేవా సత్యమనే నీ ముఖం స్వర్ణమనే మాయతో కప్పివేసి ఉంది. దానిని తొలగించి మమ్మల్ని అనుగ్రహించు తండ్రీ' అనే వేడుకోలు ఉంది. నిజమే కదా... మనం మన అంతరాత్మలను ధనంతో కప్పి దాని నోరునొక్కాలని ప్రయత్నిస్తున్నాం. ఆత్మ హెచ్చరిస్తున్నా వినకుండా ప్రాపంచిక ధన సంపదల పెట్టెలో పెట్టి ఎంతో లోతున పాతేస్తున్నాం. కాని సత్యం ఆగదు. పెరిగి పెరిగి భళ్లున బద్దలై లోకమంతా తానై వ్యాపిస్తుంది. అప్పుడే సత్యధర్మాయ దృష్టాయ – సత్యరూపమైన పరమాత్మ స్వరూపం మనకు అవగతమవుతుంది.

✧✧✧✧✧

# 62. గర్వం... వినాశ ద్వారం

వినాశనానికి అహంకారమే ఆది. అనాది నుంచి మానవాళిని మైకంలో ముంచెత్తుతున్న అహంకారం ఎన్నెన్నో అనర్థాలను పంచింది. నాటి దేవతల కష్టాల నుంచి నేటి ప్రపంచ యుద్ధాల దాకా జరిగిన ప్రతి భీకర సందర్భం అహంకార ఫలితమే. కేనోపనిషత్ చెప్పిన గర్వ, అహంకారాల ప్రతిఫలం...

**బ్రహ్మహ దేవోభ్యో విజిగ్యే తస్యహ**
**బ్రహ్మణో విజయే దేవా అమహీయంత**
**తవీక్షం తాస్మాక మే వాయం విజయో**
**స్మాక మేవాయం మహిమేతి**

– కేన–3–1

దేవతలు యుద్ధంలో గెలిచారు. ఎవరివలన... బ్రహ్మ సహాయంతో. కానీ ఆ విజయానికి తామే కారణం అని అహంకరించారు. బ్రహ్మాన్ని మరచి ఇదంతా తమ మహిమ వల్లనే అని భావించారు. గర్వించారు. ఇది గమనించిన బ్రహ్మ వారి ముందు యక్షునిగా ప్రత్యక్షమైనాడు. పూజనీయునిగా కనిపించిన ఆ వ్యక్తి తేజస్సుకు దిగ్భ్రమ చెంది ఎవరీతడని ఆశ్చర్యపోయారు.

## పార్వతి చెప్పింది...

ముందుగా అగ్ని ఆ యక్షుని సమీపించాడు. 'ఎవరు నీవు?' అని యక్షుడు అగ్నిని ప్రశ్నించాడు. అగ్ని గర్వంతో, 'నేను అగ్నిని. జాతవేదిని. ఈ భూమిపై దేన్నైనా దహించి భస్మీపటలం చేస్తాను' అన్నాడు. 'అలాగా... అయితే ఈ గడ్డిపోచను కాల్చివేయి' అన్నాడు యక్షుడు. ఎంత ప్రయత్నించినా దాన్ని దహించలేక తిరుగు ముఖం పట్టాడు అగ్ని. తర్వాత సర్వవ్యాపకుడైన వాయువు ఆ గడ్డిపోచను తన బలంతో కదిలించబోయాడు. అతని ప్రయత్నమూ విఫలమైంది. దేవతలు ఈసారి ఇంద్రుడ్ని పంపించారు. ఇంద్రుడు యక్షుడున్న చోటుకు వెళ్లగా యక్షుడు కనిపించలేదు. ఆ ప్రదేశంలో ఓ స్త్రీ అత్యంత శోభాయమానంగా వెలుగుతూ కనిపించింది. ఆమె ఉమ. హిమవంతుని కుమార్తె. దేవతలకు గర్వం, అహంకారం నశించాయి. ఆమెను బ్రహ్మవిద్యగా వారు గ్రహించారు. అగ్ని దహించలేనిది, వాయువు కదిలించలేనిది, ఇంద్రియాధిదేవత ఇంద్రుడు చూడలేనిది అయిన ఆ పూజించదగిన యక్షస్వరూపమే బ్రహ్మ అని ఉమ వివరించింది.

## క్షణభంగురం...

అహంకారం, గర్వం ఆవరించి ఉన్నవారు బ్రహ్మాన్ని తెలుసుకోలేరు. అవి రాక్షస లక్షణాలు. సైతాను భావనలు. 'అన్ని ఉన్మాదాల్లోకెల్లా సైతానుకు అత్యంత

ప్రియమైంది గర్వం. అది నత్తలు పురుగుల్ని ఈసడించుకునేలా చేస్తుంది' అంటాడు రాబర్ట్ బ్రో. 'అంతేకాదు... గర్వం వినయాన్ని అనుకరించి అపహాస్యం చేస్తుంది. సైతానుకు సంతోషాన్ని కలిగిస్తుందంటాడు కాల్‌రిట్జ్.

**ఎందుకు ఈ మానవుడికింత గర్వం... అహంకారం?**
**దూసుకుపోయే తోకచుక్క, వేగంగా సాగే మబ్బుముక్క**
**లిప్తకాలం మెరిసే మెరుపు, సగం తెగిన అలల విరుపు**
**ఊయల నుంచి సమాధిలోకి సాగే క్షణకాల ప్రయాణం**

ఇదే జీవితం. ఇంత మాత్రం దానికి ఎందుకింత హడావుడి అంటాడు విలియం నాక్స్. అబ్రహం లింకన్ ఈ కవితను తన అభిమాన కవిత అని అనేకసార్లు పేర్కొన్నారు. 'సర్వనాశనం జరగబోయే ముందు సందడి చేస్తూ తిరిగేది గర్వమే' అని పాత నిబంధన (ప్రొవెర్బ్స్)-16-18లో ఉంది. 'వ్యక్తుల్ని అంధుల్ని చేసి, నిర్ణయాలను తప్పుదారి పట్టించి, తప్పుల్ని అధికంగా చేయించి, పక్షపాత దృష్టిని కలిగించేది గర్వం' అంటాడు అలెగ్జాండర్ పోప్.

## బ్రహ్మవిద్యా సాక్షాత్కారం

'గర్వం నోద్వహతే ననిందతి పరం' గర్వం లేకపోవడం, పరులను నిందించక పోవడం ఇవి మంచివాళ్ల లక్షణాలు.

'అక్కడ సూర్యుని ప్రకాశం కనిపించదు. చంద్రనక్షత్రాలు చిన్నబోయి ఉంటాయి. అగ్ని నీరసమై ఉంటుంది. ఆ స్వయంప్రకాశ జ్యోతి నుంచే ఇవన్నీ తమతమ కాంతుల్ని తెచ్చుకున్నాయి. ఆ జ్యోతి స్వరూపమే పెంజీకటి కవ్వలి వెలుగు. (కఠోపనిషత్తు 2-215)

అగ్ని, వాయువు, ఇంద్రుడు తొలిసారిగా బ్రహ్మం గురించి తెలుసుకున్నారు గనుక ఇతరులకన్నా ఉత్తములైనారు. ఇంద్రుడు మరింత దగ్గరగా అర్థం చేసుకోవడం వల్ల ఇంద్రియాధిపతిగా మరింత శ్రేష్ఠుడైనాడు.

**తస్యైష ఆదేశో యదేతద్ విద్యుతో వ్యద్యుతదా**
**ఇతీతి న్యమీ మిషదా ఇత్యధిదైవతమ్**

-కేనోపనిషత్తు 4-4

క్షణకాలం మెరిసి అదృశ్యమయ్యే మెరుపులా అత్యంత ప్రకాశవంతమైన నది... బ్రహ్మదర్శనం. అదే తద్వనం. అందరూ ఉపాసించవలసింది. తపం, దమం, కర్మం, వేదాలు, సర్వాంగాలు, సత్యపీఠం అయిన బ్రహ్మాన్ని గురించి తెలుసుకున్న వారికి గర్వం, అహంకారం మొదలైన పాపాలు నశిస్తాయి. ఉమాదేవిగా సాక్షాత్కరించిన బ్రహ్మవిద్య ఇదే. ప్రశ్నను సంధించి కేనోపనిషత్తు ఉపనిషత్తుల సారభూతము, జనన మరణ విముక్తము అయిన బ్రహ్మానంద మార్గం అనే అస్త్రాన్ని ప్రయోగించింది.

✧✧✧✧✧

# 63. జ్ఞానామృతం - సద్గురు సాంగత్యం

జ్ఞానమార్గ దర్శకుడైన గురువు స్థానం పవిత్రమైనది. జ్ఞానాన్ని ఆర్జించడం కన్నా సద్గురువు ఆశ్రయం పొందడం దుర్లభం. గురు శుశ్రూషకు, విద్యార్జనలో శ్రమదమాలకు వెరచినవాడిని విజ్ఞానం వరించదు. గురుపదవిపై భారతీయ సాహిత్యంలో చర్చోపచర్చలు.

**ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత**
**క్షురస్య ధారా నిశితా దురత్యయా**
**దుర్గం పథః సత్కవయో వదన్తి**

-కఠ 1-3-14

లెండి! మేల్కొనండి! సద్గురువును చేరి జ్ఞానాన్ని సంపాదించుకోండి. ఆ మార్గం పదునైన కత్తి అంచు వంటిది. అది నిశితమైనది. కష్టమైనది అని కవులు ప్రవచిస్తున్నారు.

**గురుర్బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**

ప్రసిద్ధమైన ఈ శ్లోకం శుకోపనిషత్ లోనిది.

'ఏ ఇంట తల్లిదండ్రులను, గురువులను, దేవతలను పూజిస్తూ ఒకరినొకరు గౌరవిస్తూ ఉంటారో ఆ ఇంటిలో దారిద్ర్యం ఉండదు.

పరస్త్రీ, పరధనములను ఆశించరాదు. పరుల మీద అపవాదులు వేయడం, గురువుల వద్ద పరిహాసాలు ఆడడం కూడదు. గురువుల పీఠంపై కూర్చోకూడదు. వారి పడకపై పడుకోకూడదు. గురువు వచ్చినప్పుడు లేచి నమస్కరించి, గౌరవించడం శిష్యధర్మం. గురువులను మించి వస్త్రధారణ, వారికంటే మేలైన భోజనం చేయరాదు. గురువు కంటే ముందు నిద్రలేవాలి. వారు నిద్రించిన తరువాతే నిద్రించాలి'

ఇవన్నీ మనుస్మృతి బోధనలు.

**విద్యాతురాణాం...**

పెద్దల గురించి, గురువుల గురించి చెడుగా మాట్లాడుతున్న చోటి నుంచి తొలగిపోవడం మంచిది.

**గురవో బహవస్సంతి శిష్యవిత్తాప హారిణః**
**దుర్లభోయం గురుర్దేవి శిష్య సంతాప హారకః**

శిష్యుల సొమ్ము తినేసే గురువులున్న కాలం ఇది. కాని శిష్యుల సంతాపాన్ని తొలగించే గురువులు ఇప్పుడెక్కడున్నారు? అందుకే ఈ కాలంలో గురువు అన్న పదం అపభ్రంశమై గురూగా మారింది. అందరూ గురూలే.

**యథా ఖనన్ ఖనిత్రేణ నరో వార్యధి గచ్ఛతి**
**తథాగురుగతాం విద్యాం శుశ్రూషు రథి గచ్ఛతి**

పలుగు, పారలతో బావిని తవ్వి నీటిని పొందినట్లుగానే శిష్యులు శుశ్రూష చేసి గురువు నుంచి విద్యను పొందుతున్నారు. అయితే...

**అర్థాతురాణాం న గురుర్న బంధుః**
**కామాతురాణాం న భయం న లజ్జా**
**విద్యాతురాణాం న సుఖం న నిద్రా**
**క్షుధాతురాణం న రుచి న పక్వమ్**

డబ్బుపై ఆశ ఉన్నవాడికి గురువని, బంధువని విచక్షణ ఉండదు. కామంతో కళ్లుమూసుకుపోయిన వాడికి సిగ్గు, భయం ఉండవు. చదువుకుందాం అనుకున్నవాడికి నిద్ర, సుఖంపై ఆసక్తి ఉండదు. ఆకలిగొన్నవాడికి రుచి, పక్వాలపై శ్రద్ధ ఉండదు అంటుంది విక్రమార్క చరితం.

**గురోరప్యవ విప్తస్య కార్యాకార్య మజానతః**
**ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనమ్**

తన బాధ్యతలను మరిచి చెడు మార్గాన సంచరించే గర్విష్టి అయిన వాడిని గురువు శాసించాలి అని రామాయణం అయోధ్యకాండలోని ఈ శ్లోకం భావం. ఒక్కొక్క నీటిబొట్టు పడుతుంటే క్రమంగా కుండ నిండినట్లు సకల విద్యలు, ధర్మం, జ్ఞానం సంపాదించుకోవాలి. గురువులను గౌరవించుకోవాలి. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ – తల్లి, తండ్రి, గురువు ఈ ముగ్గురూ దైవసమానులే... అని తైత్తిరీయారణ్యకం చెబుతుంది.

**మహాత్మ గురుదేవానం అశ్రుపాతఃక్షితౌయతి**
**దేశభంగో మహద్దుఃఖం మరణం చ భవే ధృవమ్**

మహాత్ములు, గురువులు, దేవతాత్ములకు దుఃఖం కలిగి వారు కన్నీరు భూమిపై పడినట్లైతే దేశానికి అరిష్టాలు, సామూహిక మరణాలు కలుగుతాయి. అందుకే లెండి... మేల్కొనండి సద్గురు సాన్నిధ్యంలో ఆత్మజ్ఞానాన్ని సంపాదించండి అని కఠోపనిషత్ మేలుకొలుపుతోంది.

అథాతో బ్రహ్మ జిజ్ఞాసా

✧✧✧✧✧

# 64. మృత్యోర్మా అమృతం...

అనాది నుంచి మనిషిని బయపెడుతున్నది... వాడికి లొంగనిది మృత్యువే! మృత్యువును జయించిన వాళ్ల కథలెన్నో ఉన్నాయి. మృత్యువుపై సమరంలో మనిషి అంతరంగంలో రేగిన సంచలనాల సారాంశం...

**సహోవాచ పితరం తతః**
**కస్మై మాం దాస్యసీతి**
**ద్వితీయం, తృతీయం తగ్ హోవాచ**
**మృత్యవే త్వా దదామీతి**

అన్నదానం చేసి కీర్తి గడించిన వాజశ్రవుడి కుమారుడు వాజశ్రవసుడు. మహాయజ్ఞం చేస్తూ తనకున్నదంతా పంచిపెడుతున్నాడు వాజశ్రవసుడు. మంచివాటితో పాటు బక్కచిక్కి వట్టిపోయిన గోవుల్నీ దానమిస్తున్నాడు. అది చూసి వాజశ్రవసుడి కుమారుడైన నచికేతుడు తన తండ్రి ఇటువంటి దానం చేయడం వల్ల ఆనంద నామ నరకానికి పోతాడని తర్కించి తండ్రిని సమీపించి, 'నాయనా! నన్నెవరికి దానమిస్తావు?' అని ఒకటి, రెండు, మూడు సార్లు రెట్టించి అడిగాడు. చిరాకుతో, కోపంతో, 'నిన్ను మృత్యువుకి ఇచ్చాను పో' అని తండ్రి అన్నాడు. ఎవరు ఈ మృత్యువు? తెలుసుకోవాలన్న కోరిక నచికేతుడికి కలిగింది. అన్నపానీయాలు మానేసి తండ్రి అన్నమాటను స్మరిస్తూ మృత్యురహస్యం తెలుసుకోవాలని మూడురోజులు మృత్యువు ఇంటి ముంగిటనే ఉన్నాడు. మూడు రోజుల పిమ్మట వచ్చిన యముడు నచికేతునికి మూడువరాలు – తండ్రి అతనిని ప్రేమతో దగ్గరికి తీసేటట్లు, బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించే నచికేతాగ్నిని, మృత్యురహస్యాన్ని ఇచ్చి వివరించగా నచికేతుడు ఆత్మజ్ఞానియై ఆదర్శవంతుడయ్యాడు.

## మృత్యుంజయులు

ఏమిటీ మృత్యు రహస్యం? ఎవరు ఈ మృత్యువు? ఈ శాశ్వత సత్యాన్వేషణలో సావిత్రి మృత్యువును దర్శించి తన భర్తను బతికించుకుంటుంది. శివానుగ్రహంతో మార్కండేయుడు మృత్యుపాశం నుంచి బయటపడ్డాడు. ఇస్తారిదేవత తన భర్త తమ్ముజ్ కోసం, తన భార్య యురిడెస్ కోసం ఆర్ఫియస్, తన కుమార్తె పెర్సిఫోన్ కోసం డిమాటర్ (భూమాత) యమలోకానికి వెడతారు. తన మిత్రుడు ఎంకిడు చనిపోవడాన్ని నమ్మలేని గిల్గామేష్ మృత్యుజలాల్ని దాటి చిరంజీవి అయిన ఉత్నాపిష్టమ్‌ను కలిసి మృత సంజీవనీ మొక్కను సంపాదించుకుని వస్తున్నప్పుడు ఒక పాము దానిని దొంగిలించుకుపోతుంది. బతికున్నప్పుడు సాధించలేని విద్యను రాక్షసుల పన్నాగంతో

కాలిబూడిదై మధువులో కలిసి శుక్రాచార్యుని కడుపు చీల్చుకుని బయటపడే వేళ సాధించాడు కచుడు. సంజీవనీ పర్వతాన్ని పెకిలించుకుని వచ్చి చనిపోయిన వానరుల్ని, స్పృహతప్పిన రామలక్ష్మణుల్ని జీవింపచేస్తాడు హనుమ.

## సాహితీ స్పర్శ

'మృతియును జీవనంబు నిది మేదిని లోపల జీవకోటికిన్ సతతము సంభవించు'నని పోతన భాగవతం ద్వాదశ స్కంధంలో అద్భుతంగా వర్ణిస్తాడు. మృత్యుం దధితా పర్వతేనః – మృత్యువు వెళ్లేదారిలో పర్వతాలను అడ్డం పెట్టైనాసరే నిన్ను రక్షించుకుంటాను అని ఋగ్వేదం దశమ మండలంలో ఉంది.

మృత్యువులాంటి మృత్యువులు పది ఉన్నాయంటాడు ఫ్లోరియో తన సెకండ్ ఫ్రూట్స్ అనే గ్రంథంలో. అవేమిటంటే– ఎంతసేపు నిరీక్షించినా అవతలి వ్యక్తి రాకపోవడం, మంచం మీద పడుకున్నా నిద్ర పట్టకపోవడం, ఎన్నాళ్లు ఎంత సేవచేసినా ఉన్నత పదవి పొందక పోవడం, అవసరమైన సమయంలో మొరాయించే వాహనం, జైలులో ఉండి తప్పించు కోలేకపోవడం, వ్యాధి వచ్చి నయం కాకపోవడం, అత్యవసరమైన పనిమీద వెళ్తూ దారితప్పడం, గేటు దగ్గరికి చేరుకున్నా ఇంటివాళ్లు తలుపు తీయకపోవడం, నిన్ను మోసం చేస్తున్నవాడు నీ స్నేహితుడవడం, అన్నీ అందుబాటులో ఉన్నా ఆనందించే శక్తి లేకపోవడం. ఈ బాధలు మృత్యువుకన్నా భయంకరమైనవి అంటాడతడు.

మృత్యువు తన కొడవలితో పంటను కోస్తున్నప్పుడు పండిన కంకులతో పాటు కొన్ని లేత పుష్పాలు కూడా రాలిపడ్తాయంటాడు లాంగ్‌ఫెలో. జీవితం ఒక నరకమైనప్పుడు, జీవించడమే ఒక వ్యథ అయినప్పుడు, ఆశ మూగబోయినప్పుడు ఉన్న ఊరు పొమ్మంటుంది. వల్లకాడు రమ్మంటుంది' అంటాడు ఆర్థర్ గట్టర్‌మాన్. మృత్యువా నువ్వేం చేయలేవు నన్ను. నీవే మరణించు అంటాడు జాన్‌డొనే.

## అమరత్వ సాధన

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

అసత్తు నుంచి సత్తుకు, చీకటి నుంచి వెలుగుకు, మృత్యువునుంచి శాశ్వతమైన అమరత్వానికి నన్ను చేర్చమని ప్రార్థించే బృహదారణ్యకోపనిషత్‌లోని ఈ మంత్రాలు పవమాన మంత్రాలుగా ప్రసిద్ధికెక్కాయి. సాక్షాత్ మృత్యువు నుంచే మృత్యురహస్యాన్ని తెలుసుకున్న నచికేతుడు అతిపిన్న వయసులోనే ఆత్మజ్ఞానిగా ప్రసిద్ధికెక్కాడని కఠోపనిషత్ వల్ల మనకు తెలుస్తోంది.

✧✧✧✧✧

# 65. సృష్టి రహస్యాల 'దర్శనం'

ఆధ్యాత్మిక, భక్తి భావాలను సైతం శాస్త్రపరిభాషలో వివరించగల విలక్షణ జ్ఞాన సంపద మన సొంతం. సృష్టి రహస్యాలను ఖగోళ విజ్ఞానానికి అనుగుణంగా వివరించేవే మన ఋషులు రచించిన దర్శనాలు. వీటిలో వైశేషిక దర్శనానికి ప్రత్యేకత ఉంది. ఖగోళ శాస్త్ర అంశాలకు, దీనిలో తెలిపిన సృష్టి విషయాలకు గల సంబంధాన్ని చెప్పేదే ఈ వ్యాసం.

**'దృశ్యతే అనే నేతి దర్శనమ్'**

ప్రజలకు సృష్టి రహస్యాలను గురించి చెప్పడానికి మహర్షులు దర్శనాలను రచించారు. గౌతమ మహర్షి, కణాదుడు, కపిల ముని, పతంజలి, జైమినీ మహర్షి, వ్యాసుడు వంటి మహామునులు న్యాయ, వైశేషికం, సాంఖ్యం, యోగం, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస – అనే ఆరు దర్శనాలను రచించారు. వీటిని 'ఆస్తిక దర్శనాలం'టారు. చార్వాకం, సౌతాంత్రికం, వైభాషికం, యోగాచారం, మాధ్యమికం, అర్హతం అనేవి నాస్తిక దర్శనాలు.

## వైశేషిక దర్శనం

సంఖ్యాగుణాలను, భూమిపైన ఉన్న పరమాణువుల స్వభావాలను, పరస్పర విరుద్ధ తత్వాతలను కణాద మహర్షి వైశేషిక దర్శనం వివరిస్తుంది. మిలింద ప్రశ్నము లలిత విస్తరము, లంకావతార సూత్రాల్లో ఉదహరించడం వల్ల దీని రచనా కాలాన్ని బుద్ధునికి పూర్వమని (క్రీ.పూ. 563 ముందు) చెబుతారు.

**'పృథి వ్యాపస్తేజో వాయురాకాశం**
**కాలో దిగాత్మా మన ఇది ద్రవ్యాణి'**

భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, కాలం, దిక్కు, ఆత్మ, మనస్సులను తొమ్మిది ద్రవ్య పదార్థాలుగా వైశేషిక దర్శనంలో పేర్కొన్నారు. ఆత్మ తప్ప మిగతావన్నీ అణువుల కలయిక వల్ల ఏర్పడ్డాయి. పరమాణువులు కలిసి అణువులుగా, అణువులు కలిసి సూక్ష్మ పదార్థాలుగా ఏర్పడ్డాయి. భిన్నమైన పరమాణువుల్లో పరమాణు శక్తి కూడా భిన్నంగా ఉంటుంది. అణువులు ద్రవ్యాలై స్థూల పదార్థాలుగా మారి ఒక్కో అవయవం ఒక్కో పనిని నిర్వర్తించడమే కార్యకారణ సంబంధం. దీన్ని తెలియజేయడమే జ్ఞానం. ఈ జ్ఞానానికి ఆశ్రయమిచ్చే పదార్థమే ఈశ్వరుడు అని కణాద మహర్షి అభిప్రాయం. వైశేషిక సిద్ధాంతం ప్రకారం దేనికంటే ఇంకా చిన్నది ఉండదో అది పరమాణువు, దేనికంటే ఇంకా పెద్దది ఉండదో అది పరమాత్మ (ఈశ్వర) స్వరూపం.

## జీవాత్మ జననం

> **'అస్య లోకస్య కాగతి రస్తి**
> **ఆకాశ ఇతిహోవాచ**
> **సర్వాణి హవా యిమాని భూతాని**
> **ఆకాశదేవ సముత్పద్యన్తే'** (ఛాందోగ్యోపనిషత్తు)

భూమి, వాయువు, నీరు, అగ్ని, ఆకాశాలనే పంచభూతాలు నభో మండలం నుంచే పుడుతున్నాయి. శబ్దం చేత ఆకాశం; శబ్దం, స్పర్శ చేత వాయువు; శబ్దం, స్పర్శ, రూపాలచేత అగ్ని; శబ్దం, స్పర్శ, రూపం, రసం (రుచి) వల్ల నీరు; శబ్దం, స్పర్శ, రూపం, రసం, వాసనల చేత భూమి ఏర్పడ్డాయి. భూమిపై పుట్టిన పంటలు, ఔషధులన్నీ రేతస్సు కాగా జీవాత్మ దాని నుంచి జనించింది.

## ఇదే పంచాగ్నుల రహస్యం...

> **యథోర్ణ నాభిః సృజతే గృహ్ణతేచ**
> **యథా పృథి వ్యామోష ధయః సంభవంతి**
> **యథా సతః పురుషాత్ కశలోమాని**
> **తథాక్షరాత్ సంభవతీహ విశ్వమ్** – (ముండకోపనిషత్తు 1–7)

సాలె పురుగు తన గూడును నిర్మించే దారాలను తనలోపలి నుంచే బయటికి తీసి తిరిగి తనలోకే ఏవిధంగా తీసుకుంటుందో, భూమి నుంచి మూలికలన్నీ ఎలా పుడతాయో, మానవుని తలపై ప్రయత్నం లేకుండానే వెంట్రుకలన్నీ ఎలా పెరుగుతాయో అదేవిధంగా నశించని ఆ తత్వం నుంచి విశ్వమనే బ్రహ్మ పదార్థం పుడుతుంది. ఆ బ్రహ్మతత్వం నుంచి జనించిన మొదటి అగ్ని సూర్యుడు. సూర్యుడి వల్ల రెండవ అగ్ని అయిన వర్ష మేఘాలు, వర్షం వల్ల భూమిపై ఔషధాలు మూడవ అగ్నిగా పుట్టాయి. ఈ ఔషధులను సేవిస్తూ నాలుగవ అగ్ని అయిన పురుషుడు అయిదవ అగ్ని అయిన స్త్రీలోకి రేతస్సును పంపిస్తాడు. ఈ విధంగా సర్వవ్యాప్తమైన, ఎప్పటికీ నశించని బ్రహ్మ పదార్థం నుంచే అన్ని జీవులూ పుడతాయి.

## ద్రవ్యం అంటే...

కొన్ని మిలియన్ సంవత్సరాల క్రితం ఆదిమానవుడు పదునైన రాళ్లను ఆహార సంపాదనకు, శత్రు సంహారానికి ఉపయోగించవచ్చని గ్రహించాడు. నాగరికత పెరిగిన తర్వాత జూన్ 1962న న్యూయార్క్‌లోని బ్రూక్ హావెన్ శాస్త్రజ్ఞులు న్యూట్రినో అనే అణు శకలాన్ని కనుగొన్నారు. ఇది అణు విచ్ఛేద సింక్రోట్రాన్‌లో 33 బిలియన్

వోల్టుల విద్యుత్‌నుపయోగించి వంద ట్రిలియన్ మైళ్ల పొడవున్న సీసపు దిమ్మలో కూడా మబ్బులోకి బుల్లెట్ దూసుకుపోయినట్లు దూసుకుపోగలదు. పైన తెలిపిన విషయం మానవుడు పదార్థాన్ని (ద్రవ్యం, మాటర్) వినియోగించుకోవడాన్ని, రెండవది పదార్థాన్ని అర్థం చేసుకోవడాన్ని తెలుపుతాయి. ద్రవ్యం (మాటర్) అంటే స్థలాన్ని ఆక్రమించుకునేది అని నిఘంటువు అర్థం. లాటిన్ భాషలో మాటర్ అంటే తల్లి. ద్రవ్యం పరమాణు నిర్మితం. పరమాణువు అంగుళంలో నాలుగు బిలియన్ల వంతు ($10^{-8}$ సెం.మీ.) ఉంటుంది. పరమాణువులో కేంద్రకం లక్షవ వంతు స్థలాన్ని మాత్రమే ఆక్రమించినా ($10^{-13}$ సెం.మీ), కేంద్రక ద్రవ్యరాశి పరమాణువుల్లో 99.9 శాతం ఉంటుంది.

## పరమాణువు నుంచే జీవి...

ద్రవ్యానికి మూడు స్థితులున్నాయి. ఘన, ద్రవ, వాయు స్థితులు. నాలుగవ స్థితి ప్లాస్మా ఉనికి కోసం శాస్త్రజ్ఞులు శోధిస్తున్నారు. హైడ్రోజన్ అణువులను ప్లాస్మా స్థితిలో కనుక సంయోగం చెందించగలిగితే వెలువడే శక్తిని ప్రపంచ ప్రజలకు ఇరవై బిలియన్ల సంవత్సరాలపాటు నిరంతరాయంగా అందించవచ్చునట. అయితే అలా చేయడానికి వంద మిలియన్ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత కావాలి. దీనితో పోలిస్తే సూర్యుడి అత్యధిక ఉష్ణోగ్రత 13.9 మిలియన్ సెంటీగ్రేడ్ మాత్రమే. నవీన శాస్త్రజ్ఞులు 45 మిలియన్ల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకు ప్రయోగశాలల్లో సాధించగలిగారు.

అణువిచ్ఛేదక పార్టికిల్ ఏక్సిలేటర్లలో జరిపిన పరిశోధనల్లో కేంద్రకంలో క్వార్కులు, పైయాన్, మీసాన్, హైపరాన్, గ్లువాన్, సై లాంటి రెండు వందలకు పైగా కేంద్రక శకలాలను కనుగొన్నారు. పరమాణువులు అణువులై, మూలకాలై, పదార్థాలై, గ్రహాలు సౌర కుటుంబాలు, నక్షత్రాలు, పాలపుంతలూ నీహారికలు, నెబ్యులాలు, క్వాజార్లు, కృష్ణ బిలాలు, శ్వేత బిలాలు నిండిన విశ్వమై అనేక చిన్న విశ్వాలు మహా విశ్వరూపమై విభ్రాంతిని కలిగిస్తాయి. సూక్ష్మ, స్థూల విశ్వాల (మైక్రో కాస్మ్, మాక్రో కాస్మ్) ప్రతి రూపాలు జీవుల్లోనూ కనిపించి జీవ నిర్జీవ పోలికను తెలుపుతాయి.

## పునర్జన్మ

మహా విస్ఫోటనానంతరం వెలువడిన శబ్దం నుంచి బుద్ధి, దానివల్ల 'నేను' అనే అహంకారం, దాని నుంచి పంచ మహా భూతాలు, సూక్ష్మ, స్థూల సృష్టి జరిగి మళ్ళీ ప్రళయ కాల సమయంలో నాశనం చెందడం – సృష్టి, స్థితి, లయ చక్రమని చరకసంహిత చెబుతోంది. బ్రహ్మాండం చేతనాచేతన అవస్థలో ఉన్నప్పుడు పరమాత్మ,

దానిలో ప్రవేశిస్తాడు. లోక సృష్టి, శుక్రార్తవాల సంయోగమైన అండంలో జీవాత్మ ప్రవేశించడం వల్ల జీవ సృష్టి జరుగుతుంది. నీటిలోని నిర్జీవ పదార్థాలు ప్రకాశవంతుడైన ఈశ్వరుని కాంతికిరణాలచే జీవాన్ని పొందుతాయి. తమ ఆయుష్షు పూర్తవగానే ప్రకృతిలో లీనమై ప్రాథమిక దశకు చేరుకుంటాయి. మళ్లీ సృష్టి సామాగ్రిలో భాగమై కొత్త రూపాన్ని పొందుతాయి. ఇదే పునర్జన్మ.

## పరమాత్మే ద్రవ్యం

**'కారణాను విధాయిత్వాత్ కార్యాణాం తత్స్వభావతా**
**నానా యోన్యాకృతిః సత్వోధత్తేతో ద్రాత లోహ్వాత్'**

జీవాత్మ ఒకటే అయినా వేర్వేరు జీవ గర్భాలలో చేరడం వల్ల వేర్వేరుగా ప్రవర్తిసుందని అష్టాంగ హృదయంలో వాగ్భటుడు వివరించాడు.

'క్రియా గుణవద్ సమవాయి కారణమితి ద్రవ్య లక్షణమ్' అని వివరిస్తూ పరమాత్మను ద్రవ్యంగా (మాత – మాటర్) ప్రశంసించిన వైశేషిక దర్శనం మిగిలిన దర్శనాలకంటే యుక్తాయుక్తమై, వైశేషికమై భారతీయ జ్ఞాన సంపద ఔన్నత్యాన్ని చాటుతున్నది.

✧✧✧✧✧

# 66. జ్ఞాన, మోక్షదాయని... ఓంకారం

**"ప్రాణాన్ సర్వాన్ పరమాత్మని ప్రణయాతీతి ప్రణవః"**

ప్రకృతి మాయలో చిక్కుకున్న అన్ని ప్రాణులు పరమాత్ముని దగ్గరికి చేరడానికి ఉపయోగపడేదే ప్రణవం.

**"సకృదుచ్చరిత మాత్ర ఊర్ధ్వ మున్నా మయతీత్యోంకారః"**

ఒకే ఒక్కసారి పలికితే చాలు, మనల్ని ఉన్నత స్థితిలోకి తీసుకెళుతుంది. అందువల్లనే దీనిని ప్రణవనాదం.... 'ఓం'కారం అన్నారు.

**"ఓంకారేణ ప్లవేనైవ సంసారాబ్ధిం తరిష్యతి"**

సంసార దుఃఖసాగరాన్ని దాటి ఒడ్డుకు చేరడానికి ఈ 'ఓంకారం' ఒక నావలా తోడ్పడుతుంది. అంతటి మహిమాన్వితమైన, శక్తిమంతమైన ఓంకారానికి మూలం ఏమిటో చూద్దాం.

## మోక్షదాయిని...

ఈ ప్రణవ ధ్వని బిందుగతమై, నెమ్మదిగా పలికితే హ్రస్వమని, ద్వాదశాంతర్గతంగా సాగితే ప్లుతమని అంటారు. బ్రహ్మరంధ్రం నుంచి వెలువడు తున్నట్లుగా పలికితే దీర్ఘమని చెబుతారు. హ్రస్వమును పాపహారిణిగా, ప్లుతమును ఇష్టఫలసిద్ధికి, దీర్ఘమును మోక్షప్రదాయినిగా భావిస్తారు. ఈ ప్రణవ మంత్రం సర్వ విఘ్నాలను హరించి, మంగళములు కలుగచేసేదిగా వరాహోపనిషత్తులో పేర్కొన్నారు. తారసారోపనిషత్తు ప్రకారం ఓంకారమే శ్రీమన్నారాయణ మంత్రం. జనన మరణ దుఃఖములకు కారణమైన సంసారసాగారాన్ని తరింపచేస్తుంది కనుక దీనినే 'తారకం' అని పిలుస్తారు. శివ పంచాక్షరికి సూక్ష్మరూపం కూడా ఓంకారమే. శ్రీరామ మంత్రార్థం, అంతెందుకు... సర్వమంత్రాధిదేవత గాయత్రీ మంత్రం కూడా ఓంకార స్వరూపమే.

## విస్ఫోటనంలోనే ప్రణవం

విశ్వంలో అన్నింటికన్నా ముందుగా శబ్దం పుట్టింది. ఆ శబ్దమే మహావిస్ఫోటన సమయంలో వెలువడిన ఆదిప్రణవనాదం. అదే నాదం ఇప్పటికీ విశ్వం నలువైపులా బి-ఫ్లాట్‌లో వినిపిస్తున్నాయని 1965లో బ్యాక్‌గ్రౌండ్ రేడియేషన్ విధానం వల్ల కనుక్కున్నారు. మహత్తరమైన ప్రణవనాదమైనా, శిశువు రోదన అయినా 'అ'కార, 'ఉ'కార, 'మ'కార కలయికతో ఏర్పడిన ఓంకారమే. (అ+ఉ+మ్=అమ్మ=ఓం). అందుకే ఈ శబ్దం అంత పవిత్రతను పొందింది.

## కఠోపనిషత్‌లో ఓం కారం

కఠోపనిషత్‌లో పలుచోట్ల ఓంకారం గొప్పతనాన్ని వివరించారు.

**"సర్వే వేదా యత్పదామనంతి**
**తపాంసి సర్వాణి చ యద్వదంతి**
**యధిచ్ఛంతో బ్రహ్మచర్య చరంతి**
**తత్తేపదం సంగ్రహేణ బ్రవియ్యో మిత్యేతత్"**

అనే కఠోపనిషత్ తత్వానికి అర్థం అన్ని వేదాలూ ఘోషించేది, అన్ని రకాల తపస్సులు ఉద్ఘాటించే గమ్యం 'ఓం'. దేనిని కోరి సాధువులు బ్రహ్మచర్యం చేస్తారో అదే 'ఓం'. అదే శబ్దబ్రహ్మం.

**"ఏతద్దేవాక్షరం బ్రహ్మం ఏతద్దేవాక్షరం పరమ్**
**ఏతద్దేవాక్షరం జ్ఞాత్వాయో యదిచ్ఛతి తస్యతత్"**

బ్రహ్మంతో సమానమైంది 'ఓం' అనే అక్షరం. ఇది సర్వోత్తమమైంది. దీన్ని తెలుసుకున్నవారికి కోరింది సిద్ధిస్తుంది అని కఠోపనిషత్ చెబుతున్నది.

## సంగీతానికి ఆధారం

ఓంకారం సర్వోత్తమమైనది. మోక్షదాయిని మాత్రమే కాదు అద్భుత సంగీత మార్గంగా సంగీత రత్నాకరంలో పేర్కొన్నారు.

సూక్ష్మనాదం బ్రహ్మగ్రంథి వద్ద ప్రాణాగ్నులచేత ఉత్పన్నం అవుతుంది. క్రమంగా నాభి, హృదయం, కంఠం, నాలుక, నాసిక, శిరస్సులలో సప్తస్వరాలుగా, 12 స్వర స్థానాలుగా, 22 శ్రుతులుగా, మూడు స్థాయిలలో శ్రావ్యమైన సంగీతంగా బహిర్గతమవుతుంది. సూక్ష్మనాదంగా ఆరంభమైన ఓంకారం సకల ప్రపంచానికి, వేదాలకు, సంగీతానికి ఆయువుపట్టు. అక్షరం, పదం, వాక్యం, కావ్యం, నాటకం, నృత్యం, అలంకారాలకు ఈ ఓంకారమే ఆధారం. అందుకే నాదమే పరబ్రహ్మ స్వరూపంగా ఉపాసిస్తారు. వేదాలకు, సమస్త ఇతిహాసాదులకు రూపమిచ్చిన అక్షరాలు కూడా ఓంకారం నుంచే ఉద్భవించాయి. ప్రకాశవంతమైన కాంతి కలిగిన అక్షరం సమస్త లోకాలను తనలో ఇముడ్చుకున్నది. అణువు కన్నా సూక్ష్మమైన అక్షర బ్రహ్మమే ఓంకారం. ఇదే ప్రాణం, వాక్కు, మనస్సు, సత్యం, అమృతం, నాశరహితం.

## కోపం మటుమాయం

**"ప్రణవో ధనుః శరోహ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే**
**అప్రమత్తేన వేద్ధవ్యం శరవ త్తన్మయో భవేత్"**

అనే ముండకోపనిషత్ శ్లోకం అర్థం ఏమిటంటే ప్రణవమే ధనుస్సు. మనసు బాణం. బ్రహ్మ లక్ష్యం. అంటే ఓంకార ధనువుపై మనసు అనే బాణాన్ని ఎక్కుపెట్టి బ్రహ్మకు, మనసుకు మధ్య అవరోధంగా ఉన్న తమస్సును తొలగించుకోగలం. సమస్త నాడులకు కేంద్రమైన హృదయంలోపల పరమాత్మ అనేక రకాలుగా సంచరిస్తాడు. ఆ పరబ్రహ్మాన్నే 'ఓమ్' అని ధ్యానిస్తే అజ్ఞానమనే తమస్సును జయించగలం. ఈ తమస్సును జయిస్తేనే పరమాత్మని చేరుకోగలుగుతాం. 'ఓం' అను అక్షరం త్రికాలాతీతమైంది. దీనిలోని 'అ' జాగ్రదవస్థలో వైశ్వానరుడిని, 'ఉ' స్వప్నావస్థలో తైజసుడిని, 'మ' సుషుప్తిలో ప్రాజ్ఞుడిని సూచిస్తాయి అని కూడా ముండకోపనిషత్ చెబుతుంది.

## ఓంకారమే ఆత్మస్వరూపం

ఓంకారమే ఆత్మస్వరూపమని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో చెప్పాడు.

**"ఓ మిత్యే కాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్**
**యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్"**

'ఓమ్' అనే ఏకాక్షరాన్ని స్మరిస్తూ ఎవరైతే దేహాన్ని విడుస్తారో వారు సర్వోత్తమ స్థానమైన మోక్షాన్ని పొందుతారని అక్షర పరబ్రహ్మయోగం చెబుతున్నది. ఓంకార స్వరూపాన్ని గ్రహించి, ధ్యాన నిమగ్నుడైనవాడు పరమాత్మ, స్వస్వరూప జ్ఞానుడై ముక్తిని పొందుతాడని అధర్వశిఖోపనిషత్తు వ్యాఖ్యానిస్తోంది.

**'అథాతో బ్రహ్మ జిజ్ఞాసా'**
**ఓం తత్ సత్ ఓం**

✧✧✧✧✧

# 67. మానవాళికి మంచిదారి చూపే ప్రవక్తలు

ప్రవక్తలు తమ వ్యక్తిగత ప్రయోజనం కోసం ఇతరులను అగౌరవపర్చరు. అయితే అన్యాయానికి వ్యతిరేకంగా సత్యాన్ని సమర్థించాల్సి వచ్చినప్పుడు యుద్ధవీరుడు రణరంగంలో బాణాలనూ, ఖడ్గాలనూ ఉపయోగించిన విధంగా వారు తమ వాక్ శక్తిని వినియోగిస్తారు.

**"అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః**
**మామాత్మ వర దేహేషు ప్రద్విషంతో భ్య సూయకాః"**

అన్ని అనర్థాలకు, దోషాలకు మూలమైన అహంకారాన్ని, పరపీడన బలాన్ని, ధర్మోల్లంఘన కారణమైన దర్పాన్ని, కామాన్ని, కోపాన్ని ఆశ్రయించి ఆత్మను, పరమాత్మను ద్వేషించేవారు మంచి వారిని నిందిస్తారని కృష్ణపరమాత్మ భగవద్గీతలో వివరించారు. వారు స్వార్థపరులైన వక్తలు.

కానీ, ప్రవక్తలు దైవ విశ్వాసులై ఉంటారు. ఆచరణలో సత్ప్రవర్తన కలిగి, అల్లాహ్‌ని (దేవుని) నిరంతరం స్మరిస్తూ ఉంటారు. అలాంటి వారిని ప్రవక్తగా పిలుస్తారని దివ్య ఖుర్ ఆన్‌లో 'అష్షు అరా' అధ్యాయం చెబుతున్నది.

## చిల్లర దేవుళ్లు

ప్రొఫెట్ పదానికి సమానంగా ప్రవక్త హిబ్రూ భాషలో – నాబి, రోయె, హోజె పదాలు వాడారు. 'నాబి' అంటే ప్రవక్త లేదా దేవుని మనిషి, లేదా ప్రభుసేవకుడు అని అర్థం. 'రోయె' పదానికి జ్ఞాని లేదా ద్రష్ట, హోజే అంటే ప్రభు సేవకుడు లేదా దైవజ్ఞాని అనే భావాన్ని తెలుపుతుంది. ప్రవక్త దేవుని వాక్యాన్ని ప్రజలకు చేరుస్తారు. ఆయన దైవం తరపున ప్రసంగిస్తారు. భవిష్యత్తును చెబుతారు. ఆ విషయాలు ఆయనకు దైవ దర్శనం వల్ల గాని, సంభాషణ వల్లగాని, క్రియల వల్లగాని తెలుస్తాయి. వాటిని సాధారణ ప్రజలకు అందజేస్తారు. ప్రవక్తలను అనుసరించే మోసగాళ్లు వక్తలుగా భాషిస్తూ తమ వాక్చాతుర్యంతో ప్రజలపై అధికారాన్ని పొందే ప్రయత్నం చేస్తుంటారు. తమ ప్రవచనాలతో ఉద్యోగులై... ధన సంపాదలకువుతారు. అవసరమైతే ఈశ్వరుని స్థానంలో ఇతర చిల్లరదేవుళ్లను ప్రతిష్ఠించి తమ పబ్బం గడుపుకొంటారు.

## మహాప్రవక్త

దివ్య ఖుర్ఆన్ ప్రకారం 2 లక్షల మంది ప్రవక్తలు జన్మించి తమ సందేశాన్ని వినిపించినా వారిలో ఆరుగురే ముఖ్యులు. ఆదాం, నోవా, అబ్రహాం, ముసా, జీసస్, మహమ్మద్. మహాప్రవక్తగా మహమ్మద్‌ను పిలుస్తారు. ఈసయ్య, జెరెమయ్య, ఎజెకిల్, డానియల్‌లు ముఖ్య ప్రవక్తలుగా, హోసియా, జోయెల్, అమోస్; ఒబాదయ్య, మికా, జోనరా, నాహుమ్, హబాకుక్, జెఫానియా, హగ్గాయి, జకరయ్య, మాలాచి వీరు సాధారణ ప్రవక్తలుగా గుర్తింపు పొందారు.

## తులసి సౌరభం

గంజాయి మొక్కల మధ్య అక్కడక్కడా తులసి మొక్కలు తమ సౌరభాల్ని వెదజల్లుతుంటాయి. ప్రజలకు అహింస, అబద్ధం ఆడకుండుట, దొంగతనం చేయకుండుట, ఆస్తిపై మమకారం లేకపోవడం అనే నాలుగు ప్రతిజ్ఞలను బోధించిన పార్శ్వనాథుని సందేశాలకు మహావీరుడు పరస్త్రీ వ్యామోహం వలదన్న ఐదో ప్రతిజ్ఞను జోడించాడు. జైన సంప్రదాయం ప్రకారం తీర్థంకరులు ప్రవక్తలు. వారు 24 మంది. 84 లక్షల సంవత్సరాలు జీవించిన రుషభనాథుడు తొలిప్రవక్త. మొత్తం 24 తీర్థంకరులు. నేమి నాథుడు వేయి సంవత్సరాలు జీవించాడని ఐతిహ్యం. ముని, సాధ్వి, శ్రావకుడు, శ్రావికలు జైన మతానికి నాలుగు స్తంభాలుగా మహావీరుడు పేర్కొన్నారు.

## సత్యాన్వేషులు

అనిచ్ఛ, దుఃఖ, అసత్త అనే మూడు ధర్మాల్ని బోధించి దుఃఖ నివారణకై అష్టాంగమార్గాన్ని ప్రవచించిన గౌతమబుద్ధుని నిర్వాణానంతరం బౌద్ధమతం హీన యాన, మహాయాన శాఖలుగా చీలిపోయింది. మహాయానపు దారిలో బుద్ధుడు భగవానుడైనాడు. టిబెటన్లకు దలైలామా (ఆధ్యాత్మికతకు) పంచమ్‌లామా (లౌకిక భావానికి)లు పరంపరాగత ప్రవక్తలైనారు.

కేశ్ (శిరోజం)కంగా (దువ్వెన), కిర్పాణ్ (ఖడ్గం), కర (కంకణం), కచ్ (కచ్ఛడం) వంటి ఐదు పవిత్ర చిహ్నాలుగా ఖ్యాతిపొందిన సిక్కులకు గురునానక్ ఆదిగురువు. గురు అర్జున్, గురు గోబింద్, గురు తేజ్‌బహదూర్, గురు గోబిందసింగ్ వంటి 9 మంది ప్రముఖ గురువులు గురునానక్ తరువాత సిక్కు మతాన్ని పటిష్టపరిచారు.

నిరంకుశ పరిపాలకుడు పులికంటే క్రూరమైనవాడని బోధించిన కన్ఫ్యూషియస్, సరైన 'దారి'ని చూపిన లావొట్జు, మనస్ని, గవస్ని, కునుస్ని మంచి ఆలోచన, మంచి మాట, మంచి పనులు మూడు సత్యాలుగా బోధించి అగ్నిని చిహ్నంగా ఆరాధించిన జరాతుష్ట్రుడు ఇలా సత్యాన్వేషణలో ఎందరో ప్రవక్తలు జనించి మానవాళికి వెలుగు పంచారు.

**"అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్**
**విముచ్చ నిర్మలః శాంతో బ్రహ్మ భూయాయ కల్పతే"**

అహంకారాన్ని, మొండిపట్టును, గర్వాన్ని, కామ, క్రోధాన్ని వదిలి స్వార్థ మమకారాలు లేని నిర్మలత్వాన్ని పొందినవారే ప్రభువులకు ప్రభువైన భగవానుని సాయుజ్యాన్ని అందుకుంటారని శ్రీ కృష్ణ భగవానుడు గీతలో మోక్షసన్యాస యోగంలో బోధించారు.

✧✧✧✧✧

# 68. ఆత్మ పరమాత్మల పరమార్థం "ప్రశ్నోపనిషత్"

సుకేశుడు, సత్యకాముడు, సౌర్యాయణి, కౌసల్యుడు, భార్గవుడు, కబంధి అనే ఆరుగురు మునులు బ్రహ్మవేత్త అయిన పిప్పలాద మహర్షి వద్ద ఒక సంవత్సరం పాటు గురుశుశ్రూష చేశారు. అనంతరం వారు ఆరుగురూ బ్రహ్మజ్ఞానం గురించి ఆ మహర్షిని ఆరు ప్రశ్నలు వేశారు. అదే ప్రశ్నోపనిషత్తు. ఆ ఆరుగురు శిష్యుల ప్రశ్నలు, వాటికి పిప్పలాద మహర్షి ఇచ్చిన సమాధానాలు...

**కబంధి ప్రశ్న : ప్రజలు ఎక్కడ నుంచి పుడుతున్నారు?**

**పిప్పలాది మహర్షి సమాధానం :** ప్రజాపతి తపస్సు చేసి ప్రాణాన్ని, అన్నాన్ని జంటగా సృష్టించాడు. ప్రాణం సూర్య స్వరూపం. అన్నం చంద్ర రూపం. ఋగ్వేదం చెప్పినట్లు వైశ్వానరుడు సకల ప్రపంచాత్ముడై ప్రాణం, అగ్ని స్వరూపంలో సూర్యునిగా ప్రతిరోజూ ఉదయిస్తూ, సర్వ ప్రాణాలను తన కిరణాలతో చేర్చుకుని సర్వాత్మ భావం కలవానిగా ప్రసిద్ధికెక్కాడు. సూర్యచంద్రులే ప్రాణాన్నాలు. సూర్యుని వల్ల రాత్రిపగలు, చంద్రుని వల్ల తిథి మొదలైనవి పుట్టి సంవత్సరం అనే కాలం పూర్తి అవుతోంది. సూర్యుని నుంచి అగ్ని, శక్తి, ప్రాణము పుడుతున్నాయి. చంద్రుని నుంచి అన్నం, అన్నం నుంచి శుక్ల శోణితాలు కలగడం వల్ల ప్రజలు జన్మిస్తున్నారు.

**భార్గవుని ప్రశ్న : శరీరంలో దేవతల స్థానాలేవి? వీటిలో శ్రేష్టమైనది ఏది?**

ఆకాశం, గాలి, అగ్ని, నీరు, నేల ఈ పంచభూతాలు మానవ శరీరం పుట్టుకకు కారణాలు. మాట, చేతులు, కాళ్లు, హృదయం, చర్మం, కళ్లు, చెవులు, నాలుక, ముక్కు, మనస్సు, వీటి అధిష్ఠాన దేవతలు దేహాన్ని తమతమ పనులతో నిలబెడుతున్నాయి. వీటన్నిటినీ ప్రాణం సమన్వయ పరుస్తుంది. అదే పంచభూత స్వరూపం. సర్వశ్రేష్టం. రథచక్రం యొక్క కుండలో ఆకులు ఇమిడి వున్నట్లు ప్రాణంలో సర్వం ప్రతిష్ఠితమై ఉంటుంది.

**కౌసల్యుని ప్రశ్న : ఈ ప్రాణం ఎక్కడి నుంచి, ఎలా పుడుతోంది? దేహంలో ఎలా ప్రవేశించి, ఎలా వెళ్ళిపోతోంది? పంచప్రాణములేవి?**

పంచప్రాణాలు ఇవి– ప్రాణము, అపానము, సమానము, వ్యానము, ఉదానము. పరబ్రహ్మం నుంచే ఈ ముఖ్య ప్రాణం పుడుతున్నది. తాను స్వయంగా ముఖం నుంచి కళ్లలో, చెవులలో సంచరిస్తోంది. పాయువు, ఉపస్థలలో అపానము, ప్రాణాపానముల మధ్య సమాన వాయువు ఉంటుంది. ఇది జఠరాగ్నిలో అన్నాన్ని

అన్ని అవయవాలకు సమానంగా పంచిపెడుతుంది. హృదయం నాడులలో వ్యానం అనే ప్రాణం సంచరిస్తోంది. ఊర్ధ్వముఖంగా ఉండే సుషుమ్న నాడిలో దానం అనే ప్రాణవాయువు ఉంది. ఇదే తేజస్సు. మరణ సమయంలో జీవుడు ఎలాంటి కోరిక కోరుకుంటున్నాడో ఆ కోరిక ప్రకారమే ముఖ్య ప్రాణాన్ని, తేజస్సును అందుకు అనుకూలమైన శరీరాన్ని పొందుతాడు.

సౌర్యాయణి ప్రశ్న : నిద్ర, మెలకువ, స్వప్నములను వివరించండి?

ఈ శరీరంలో పంచప్రాణాలు అనే అగ్నులు మేల్కొని తమతమ పనులను నిర్వర్తించేది మెలకువ. ఇదే జాగ్రదవస్థ. కలలో జీవుడు తన మహత్యాన్ని అనుభవం చేసుకుంటాడు. ఈ జన్మలో అనుభవించిన విషయాలు, గత జన్మ అనుభవాలు, సత్యమైన జలాదికాలు, అసత్యమైన ఎండమావుల వంటి విశేషాలను, సకలేంద్రియ వాసనాది రూపమైన జీవకోటిని స్వప్నంలో చూస్తాడు. అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు తేజోమండలంలో ఏకమై ఎలాగైతే మళ్లీ ఉదయం నలుమూలలా వ్యాపిస్తున్నాయో అలాగే కళ్లు మొదలైన ఇంద్రియాలు మనస్సులో లీనమై, స్వప్నం అంతమై జీవుడు తేజస్సు చేత మెలకువ పొందుతాడు. అప్పుడు ఈ శరీరంలో జీవాత్మకు పరమాత్మతో సంబంధం ఏర్పడటం వల్ల సుఖం కలుగుతుంది. ఇదే నిద్ర. సుషుప్తి అవస్థ. పక్షులు నివాస యోగ్యమైన వృక్షం కోసం ఎట్లా వెతుకుతూ వెళతాయో అట్లాగే జీవాత్మ నిద్రలో, పెనునిద్రలో అన్ని అవస్థల్లో పరమాత్మవైపు ప్రయాణం చేస్తాడు.

**సత్యకాముని ప్రశ్న : ఓంకార మహత్యం తెలియచేయండి?**

ఒకే మాత్రగల ఓంకారాన్ని ధ్యానించినవాడు సంపన్నుడవుతాడు. మానవ లోకంలో మహిమాన్వితుడు అవుతాడు. రెండు మాత్రలైన అకార, ఉకార ఓంకారాన్ని ధ్యానిస్తే చంద్రలోకంలో ఐశ్వర్యం అనుభవించి తిరిగి భూలోకానికి చేరుకుంటాడు. మూడు మాత్రలు కల ఓంకారంతో పరబ్రహ్మను ఉపాసించినవాడు సత్యలోకాన్ని చేరగలుగుతాడు. ఋక్కులచేత మానవ లోకం, యజుస్సుల చేత చంద్రలోకం, సామవేదంతో సత్యలోకం, ఓంకార మంత్రంతో పరబ్రహ్మ రూపాన్ని గ్రహించ గలుగుతాం.

**సుకేశుని ప్రశ్న : పదహారు కళలేవి ? (షోడశ కళలు)**

పదహారు కళలు మానవ శరీరంలోనే ఉన్నాయి. ప్రాణం, శ్రద్ధ, ఆకాశం, గాలి, తేజస్సు, నీరు, భూమి, పది ఇంద్రియాలు, మనస్సు, అన్నం, వీర్యం, తపస్సు, మంత్రాలు, కర్మ, లోకం, నామం. ఇవి పదహారు కళలు. నదులు సముద్రంలో చేరి తమ స్వభావాన్ని కోల్పోయినట్లు జీవుడు పరమేశ్వరుని తెలుసుకున్నప్పుడు ఈ షోడశ కళలు కలిగిన దేహం నుంచి విముక్తుడై అమరుడు అవుతాడు.

# 69. ధర్మసాధనలు - యక్షప్రశ్నలు

మహాభారతం అరణ్యపర్వంలోని యక్షప్రశ్నల ఘట్టం ఆసక్తిదాయకంగా ఉంటుంది. దాదాపుగా అన్ని భాషా సాహిత్యాల్లోనూ యక్షప్రశ్నలను పోలిన సన్నివేశాలు ఉన్నాయి. భారతీయులు ధర్మబోధన చేయడానికి ఈ ఘట్టాలను వాడుకున్నారు. పాశ్చాత్యులు ఎక్కువగా కథానాయకుడిని తెలివిగలవాడిగా నిరూపించడానికి ఉపయోగించుకున్నారు. తన పుత్రుడైన ధర్మరాజులోని సత్యనిష్ఠనూ, ధర్మాచరణనూ పరీక్షించడానికి యమధర్మరాజు యక్షుని రూపంలో వచ్చి అడిగే 72 యక్షప్రశ్నలు...

ద్వైతవనంలో పాండవులు అరణ్యవాసం చేస్తున్నప్పుడు ఒక బ్రాహ్మణుడు ధర్మరాజు దగ్గరకు వచ్చి, తన అరణిని ఒక లేడి తన కొమ్ములలో చిక్కించుకుని అడవిలోకి పారిపోయింది. దానిని తీసుకురావలసిందని అర్థించినప్పుడు, అన్నదమ్ములు అయిదుగురూ ఆ లేడి వెనుక పరుగెత్తినా అది అందక కారడివిలో కనుమరుగైపోతుంది. అలసిపోయి దాహంకోసం నకులుడు ఓ చెట్టుపైకెక్కి దగ్గరలో మంచినీటి చెరువు వుందని తెలుసుకుని, సోదరులందరికీ నీరు తేవడం కోసం ధర్మజుని అనుమతి తీసుకుని జలాశయం వద్దకు వెళ్లాడు. నకులుడు ఎంతకూ రాకపోవడంతో సహదేవుడు, ఆతని వెనుక అర్జునుడు, తరువాత వెళ్లిన భీమసేనుడు ఎంతకూ రాకపోయేసరికి ధర్మరాజు ఆందోళన చెంది, సరస్సు వద్దకు చేరుకున్నాడు. అప్పటికే నలుగురూ మరణించి వున్నారు. అక్కడే కొంగరూపంలో ఉన్న యక్షుడు-

కం॥ **"నా యనుమతి లేకుండగ,**
**నీ యుదకము ద్రావిరేని యెవ్వారైనన్**
**ధీయుత చత్తురు నీవటు**
**సేయవు సమ్యక్ విచార శీలుడవగుటన్"** అన్నాడు.

ధర్మరాజు తమ్ముళ్లకోసం దుఃఖిస్తుంటే నా ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లయితే నీ తమ్ముళ్లలో ఒక్కరిని నేను బ్రతికిస్తాను. లేకుంటే నిన్నుకూడా చంపేస్తాను అంటూ పలికి 72 ప్రశ్నలు వర్షంలా కురిపించాడు. ఈ డెబ్బైరెండు చిక్కుప్రశ్నలు, వాటికి ధర్మరాజు ఇచ్చిన జవాబులు నేటికీ నిత్యనూతనములుగానే వుంటాయి.

**యక్షప్రశ్నలు**

- సూర్యుడ్ని ఉదయింపజేసేది ఎవరు? - బ్రహ్మ
- సూర్యుని ప్రదర్శించువారు ఎవరు? - దేవతలు

✤ సూర్యుని అస్తమింపజేసేది ఏది? – ధర్మం.

✤ సూర్యునికి ఆధారం ఏది? – సత్యం

✤ మానవుడు శ్రోత్రియుడయ్యేది దేనివల్ల? – వేదశృతివల్ల

✤ మహత్తును పొందేది దేనివల్ల? – తపస్సు వల్ల

✤ మానవునికి సహాయపడేది ఏది? – ధైర్యం

✤ మానవుడు బుద్ధిమంతుడు ఎలా అవుతాడు? – పెద్దలను సేవించటంవల్ల

✤ మానవత్వము ఎలా పొందుతాడు? – అధ్యయనము వల్ల

✤ మానవుడు సాధువు ఎట్లా అవుతాడు? – తపస్సు వల్ల, శిష్టాచారమువల్ల

✤ మానవుడు మనుష్యుడెట్లా అవుతాడు? – మృత్యుభయము వల్ల

✤ జీవన్మృతుడెవ్వడు? – అతిథి అభ్యాగతులెవ్వరికీ పెట్టకుండా తినేవాడు.

✤ భూమికంటే భారమైనది ఏది? – అమ్మ

✤ ఆకాశంకంటే ఉన్నతమైనది ఎవరు? – తండ్రి

✤ గాలికంటే వేగమైనది ఏది? – మనసు

✤ మనిషి సజ్జనుడెలా అవుతాడు? – ఇతరులు తనపట్ల ఎలా ప్రవర్తిస్తే తనకు బాధ కలుగుతుందో అలా తాను ప్రవర్తించనివాడు.

✤ తృణం కంటే దట్టమైనది ఏది? – చింత

✤ నిద్రలో కూడా కన్నుమూయనిది ఏది? – చేప

✤ రాజ్యమేలేవాడు దైవత్వమెలా పొందుతాడు? – అస్త్రవిద్యచే

✤ రాజ్యాధినేతకు సజ్జనత్వం ఎలా కలుగుతుంది? – యజ్ఞం చేయడంవల్ల

✤ జన్మించియు ప్రాణం లేనిది ఏది? – గుడ్డు

✤ రూపం వున్నా హృదయం లేనిది ఏది? – రాయి

✤ మానవుడికి దుర్జనత్వం ఎలా వస్తుంది? – శరణుజొచ్చినవారిని రక్షించక పోవడం వల్ల

✤ ఎల్లప్పుడూ వేగం గలది ఏది? – నది

✤ రైతుకు ముఖ్యమైనది ఏది? – వాన

✤ బాటసారికి, రోగికి, గృహస్థునకు, చనిపోయినవానికి బంధువులెవ్వరు? – వర్తకజనసమూహము, వైద్యుడు, అనుకూలవతి అయిన భార్య, మంచి కర్మకాండ.

✤ ధర్మానికి ఆధారం ఏమిటి? – దయ, దాక్షిణ్యం

✤ కీర్తికి ఆశ్రయం ఏమిటి? – దానం

✤ దేవలోకానికి దారి ఏది? – సత్యం

✤ సుఖానికి ఆధారం ఏమిటి? - శీలం

✤ మనిషికి దైవిక బంధువులెవ్వరు? - భార్య లేక భర్త

✤ మనిషికి ఆత్మ ఎవరు? - కుమారుడు

✤ మానవునికి జీవనాధారం ఏమిటి? - మేఘం

✤ మనిషి దేనివల్ల సంతోషిస్తాడు? - దానం వల్ల

✤ లాభాల్లో గొప్పది? - ఆరోగ్యలాభం

✤ సుఖాల్లో గొప్పది? - సంతోషం

✤ ధర్మాల్లో గొప్పది? - అహింస

✤ దేనిని నిగ్రహిస్తే సంతోషం కలుగుతుంది? - మనస్సు

✤ ఎవరితో సంధి చెడదు? - సజ్జనులతో

✤ ఎల్లప్పుడూ తృప్తిగా వుండేది? - యాగకర్మ

✤ లోకానికి దిక్కు ఎవరు? - సత్పురుషులు

✤ ఆహారం, నీరు ఎక్కడ పుడతాయి? - భూమి, ఆకాశం

✤ లోకాన్ని కప్పివున్నది ఏది? - అజ్ఞానం

✤ శ్రాద్ధవిధికి సమయమేది? - బ్రాహ్మణుని ఆగమనం

✤ మనిషి దేనిని వదిలితే సర్వులకు ఇష్టుడు, శోకరహితుడు, ధనవంతుడు, సుఖవంతుడు అవుతాడు? - గర్వం, క్రోధం, లోభం, తృష్ణలను విడిచిపెట్టినప్పుడు

✤ క్షమ అంటే ఏమిటి? - ద్వంద్వాలను సహించడం

✤ సిగ్గు అంటే? - చేయరాని పనులు చేయడం

✤ సర్వధుని అనగా ఎవరు? - ప్రియాప్రియాలను, సుఖదుఃఖాలను సమంగా చూసేవాడు (అరణ్య పర్వంలో ఇంతవరకే ప్రశ్నలున్నాయి)

✤ జ్ఞానం - మంచిచెడ్డల్ని గుర్తించగలగడం

✤ దయ - ప్రాణులన్నింటి సుఖం కోరడం

✤ ఆర్జవం - ఎల్లప్పుడూ సమభావం కలిగి వుండటం

✤ సోమరితనం అంటే - ధర్మకార్యాలు చేయకుండా వుండటం

✤ దుఃఖం - అజ్ఞానం కలిగి ఉండడం

✤ ధైర్యం - ఇంద్రియనిగ్రహం

✤ స్నానం - మనస్సులో చెడులేకుండా ఉండడం

✤ దానం - సమస్త ప్రాణుల్నీ రక్షించడం

✤ పండితుడు - ధర్మం తెలిసినవాడు

❖ మూర్ఖుడు – అడ్డంగా వాధించేవాడు

❖ కామం – సంసార కారణభూతం

❖ అహంకారం – అజ్ఞానం

❖ దంభం అంటే? – తన గొప్ప తానే చెప్పుకోవడం

❖ ధర్మం, అర్థం, కామం ఎక్కడ కలుస్తాయి? – తన భర్తలో, తన భార్యలో

❖ నరకం అనుభవించే వారెవరు? – ఆశపెట్టి దానం చేయనివాడు, ద్వేషబుద్ధి గలవాడు

❖ బ్రాహ్మణత్వాన్ని ఇచ్చేది ఏది? – ప్రవర్తన మాత్రమే

❖ మంచిగా మాట్లాడేవాడికి ఏమి దొరుకుతుంది? – మైత్రి

❖ ఆలోచించి పనిచేసేవాడు ఏమవుతాడు? – ప్రశంసార్హుడు

❖ ఎక్కువమంది మిత్రులు వున్నవాడు ఏమవుతాడు? – సుఖపడతాడు

❖ ఎవడు సంతోషంగా వుంటాడు? – అప్పు లేనివాడు

❖ ఏది ఆశ్చర్యం? – ప్రతిరోజూ జననమరణాలు చూస్తున్న మనిషి తానే శాశ్వతంగా ఈ భూమిమీద ఉండిపోతాననుకోవడం

❖ లోకంలో అందరికన్నా ధనవంతుడెవ్వరు? – సుఖదుఃఖాల్లాంటి ద్వంద్వాల్ని సమంగా చూసేవాడు

❖ స్థితప్రజ్ఞుడెవ్వరు? – స్థిరబుద్ధి కలవాడు

ఈ విధంగా యక్షప్రశ్నలకు సమాధానమివ్వగా సంతోషపడిన యక్షుడు 'నీ తమ్ములలో ఒకరిని బతికిస్తాను, ఎవరిని బ్రతికించాలో చెప్ప'మన్నాడు. అందుకు ధర్మజుడు, 'మాద్రి, కుంతి ఇద్దరు తల్లులు మాకు. కుంతి కొడుకుల్లో పెద్దవాణ్ణి నేనున్నాను. మాద్రిమాతకు జ్యేష్ఠ కుమారుడైన నకులుడిని బ్రతికించడం న్యాయం' అన్నాడు. యక్షుని రూపంలో వున్న యమధర్మరాజు సంతుష్టుడై అందరినీ బ్రతికించి వారిని ఆశీర్వదించాడు.

## గ్రీకు ఇతిహాసాలు

"దేనికి ఉదయాన నాలుగు కాళ్లు, మధ్యాహ్నం రెండు, సాయంత్రం మూడు కాళ్లుంటాయో చెప్పి కదులు" అంటూ సరైన సమాధానం చెప్పనివాళ్లను చంపేసేది స్ఫింక్స్ అనే భయంకర రాకాసి. అందమైన స్త్రీ వదనం, సింహశరీరం, పక్షిరెక్కలతో థెబెస్ నగరానికి వచ్చేపోయేవాళ్లని రహదారిపై నిలువరిస్తూ ఇటువంటి సమస్యల్ని పరిష్కరించమనేది. దాంతో థెబెస్ నగరానికి వెళ్లడానికే ప్రజలు జంకేవారు. ఈ

మహమ్మారి ప్రశ్నకు ఇడిపస్ సరైన సమాధానమిచ్చాడు. ఉదయాన అంటే శిశువుగా నాలుగుకాళ్లతో, యవ్వనాన రెండు కాళ్లపై నిలబడి, వృద్ధాప్యాన మూడుకాళ్లతో జీవనం సాగించేది మానవుడు. ఈ సరైన సమాధానం వినగానే స్ఫింక్స్ సముద్రంలోకి దూకి తన జీవితాన్ని ముగించుకుంది. అలా 'ఇడిపస్' థెబెస్ రాజు అవుతాడు కాని విధిలీల విచిత్రమై ప్రపంచ చరిత్రలోనే, తల్లితో సంసారం చేసిన అపఖ్యాతిని మూటకట్టుకుని తన కళ్లు తానే పొడుచుకుని గుడ్డివాడై జీవిత చరమాంకాన్ని గడుపుతాడు.

## భృగుమహర్షి శాపం

భృగుమహర్షి భార్య పులోమ గర్భిణిగా వున్నప్పుడు పులోముడనే రాక్షసుడు వరాహరూపంలో ఆమెను అపహరించుకుని పోతుంటే, తల్లి గర్భమునుండి బయటపడ్డ చ్యవన కుమారుడు ఆ రాక్షసుని భస్మం చేశాడు. రాక్షసునికి ఆమెయే పులోమ అన్న విషయాన్ని అగ్నిదేవుడే చెప్పాడని గ్రహించిన భృగువు అగ్నిని అతిక్రూరుడుగా, సర్వభక్షకుడవు కమ్మని శపించాడు. వాడడిగినప్పుడు తెలిసి సత్యం చెప్పకపోతే తప్పుకదా అని చెప్పాను దీనికిదా శిక్ష అని అగ్ని అలిగి త్రేతాగ్నులను ఉపసంహరించు కోవడంతో లోకంలో కల్లోలం పుట్టింది. కనుక ప్రశ్నలకు సమాధానాలివ్వడం వల్ల లాభాలూ, నష్టాలూ వుంటాయి కాబట్టి జాగ్రత్త సుమా!

✧✧✧✧✧

# 70. పరమశాంతి

**"త్వమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత**
**తత్ ప్రసాదాత్ పరాంశాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్"**

అర్జునా! అహంకారమును పరిత్యజించి సర్వాత్మభావనతో పరమేశ్వరుని శరణు వేడిన ఆయన కృపవలన నీవు పరమశాంతియైన మోక్షమును పొందగలవు.... అది మోక్షసన్న్యాస యోగమున జగద్గురువు వచించియున్నాడు.

మిట్టమధ్యాహ్నానికే నగరమంతటా చీకటి అలుముకున్నది. మూడు గంటల పాటు అలా కమ్ముకున్న కటిక చీకట్లలో మధ్యాహ్నం మూడుగంటలప్పుడు మహా మహిమాన్వితుడైన దైవ కుమారుని కంఠం నుండి వెలువడిన మాటలు వెలుగుల అలలై వెలువడ్డాయి. "ఎలోయి! ఎలోయి! లెమా సబాక్తాని – దేవా! దేవా! ఎందుకిలా నన్ను వదిలేసావు? – మార్క్ – 15:33–34.

**నా శక్తి నేలపై పడిన నీటివలె ఇంకిపోయినది.**
**నా హృదయం కరిగిన కొవ్వొత్తై,**
**నా గొంతు నిస్త్రాణతో ఎండిపోయినది.**
**నా శరీరము చిక్కి శల్యమైనది...**

కీర్తనలు 22:1, 14–15

**దేవా! నన్ను ఎందుకిలా పరిత్యజించావు?**

**లావొక్కింతయు లేదు సర్వము విలోలంబయ్యె ప్రాణంబులున్**
**ఠావుల్ తప్పెను మూర్ఛ వచ్చె తనువుండస్సె భ్రమం బయ్యెడన్**
**నీవే తప్ప నితః పరంబెరుగ మన్నింపదగున్ దీనున్**
**రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా" –**

అని మకరికి చిక్కిన కరి ప్రార్థించిన విధంగా జీవుడు తనకు ఈ కష్టాల బాధల నుంచి విముక్తి కలిగించమని ఆ పరమాత్మను వేడుకుంటాడు. ఏదో ఒక రోజున మనందరం ఒంటరివారమయ్యామేమో, మనల్ని ఆదుకునే వారెవ్వరూ లేరేమేమో అని దిగులుపడ్తాం. ఆ క్షణం అందరినీ ఏదో ఒకనాడు కలవరపెడ్తుంది.

ఏప్రిల్ 1865లో ప్రెసిడెంట్ లింకన్ భౌతికకాయాన్ని అనేకమంది సందర్శించి తమ నివాళులర్పిస్తున్నారు. వారిలో ఒక పేదరాలు తన కుమారుడితో ఇలా అంటున్నది "నాయనా! ఆ మహాత్ముణ్ణి తనివితీరా దర్శించు! మనలాంటి వాళ్ళ కోసమే ఆయన తన ప్రాణత్యాగం చేసాడు"

శుక్రవారం సాయంకాలం అయిదుగంటలు షుమారుగా! జనవరి 30, 1948, బిర్లా హవుస్, న్యూఢిల్లీలో ఇంకా స్వతంత్ర భారతి పసిపాప కనులు పూర్తిగా తెరవనే లేదు. మూడు తుపాకి గుళ్ళు ఆ నిశ్శబ్దమౌని గుండెల్లోకి దూసుకుపోయాయి. హే! రామ్! అని ఆ యోధుని పెదవుల నుండి కదిలిన శబ్దాలు ఎవరికైనా వినిపించాయో! లేదో!

అతడిని మహోన్నతంగా వర్ణించే పదాలకన్నా ఉన్నతుడాతడు. భూ సంస్కరణలు, న్యాయం, తిండి, స్వేచ్ఛ నాలుగు ఊపిరులుగా నడిచిన శక్తివంతమైన ఆయుధం అతడు. ఆతని చితాభస్మం నుంచి అనేక విప్లవ ఫీనిక్స్ పక్షులు జనించిన వీరుడు. అతడే అక్టోబరు 8, 1967 నాడు బొలివియా, శాంతాక్రజ్ సమీపంలోని గెరిల్లా పోరాటంలో శత్రువులకు చిక్కి మృత్యువు కళ్లల్లోకి తీక్షణంగా చూస్తూ అస్తమించిన 'చె'గువేరా.

"నేనొక కలగన్నాను. ఈ రోజింకా ఎంతో దూరంలో లేదు. నా నలుగురు పిల్లలు ఈ దేశంలో వాళ్ళ శరీరపు రంగును బట్టి కాక వారి వ్యక్తిత్వం వల్ల నిర్ణయింప బడతారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో ఈ దేశం ముందుకు సాగుతుంది." అని ప్రవచించిన ధీరోదాత్తుడు, ద్రష్ట మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్. మెంఫిస్ పట్టణంలోని లొరెన్స్ మోటెల్ వద్ద ఏప్రిల్ 4, 1968 సాయంకాలం 6 గంటల ప్రాంతంలో కాల్చివేయబడ్డాడు. 39 ఏళ్లకే ఈ ప్రపంచ రంగస్థలం నుంచి నిష్క్రమించిన ఆ మహానాయకుని రక్త బిందువుల నుంచే జనించిన సమానత్వపు తారకలు అమెరికన్ పతాకను అలంకరించినాయి.

జరాతుష్ట్రుడు అగ్నిదేవాలయంలోని హోమగుండం వద్ద తదేక నిష్ఠలో ధ్యానమగ్నుడైయున్నాడు. శత్రువులు పవిత్ర నగరాన్ని ఆక్రమించి దేవాలయంలోకి చొరబడ్డారు. ప్రార్థనలో నిమీలిత నేత్రుడైయున్న జరాతుష్ట్రుని మెడపై ఓ ముష్కరుని కరవాలం మెరుపులా మెరిసింది. విడివడ్డ ఆ శిరస్సు తెరిచిన కన్నుల నుంచి కురిసిన అగ్నిలో ఆ కిరాతకుడు భస్మీపటలమయ్యాడు.

....యాదవ వంశ వినాశకర హేతువు ముసలపు ఆఖరి ములికి వేటగాని బాణపు కొసకు చేరింది. ఆతడు మృగయార్థంబుగా వచ్చి దిక్కులు నిక్కి నిరీక్షించుచుండ వృక్షంబు చాటున నప్పరమ పురుషుని చరణకమలంబు హరి కర్ణంబుగా భావించి బాణము వేసిన అతండాహారవంబున కదలుచుండ.... పూర్ణావతారుండైన శ్రీకృష్ణునికే అవస్థ తప్పలేదు. ఇది నా పూర్వజన్మకృతము. నీవు నిమిత్త మాత్రుండవని భగవానుడు ఆ వేటగాడిని ఊరడించినాడు.

ఆస్తికులైనా, నాస్తికులైనా గమనించిన ఒక సత్యమున్నది. సమాజం సంక్షోభ స్థితిలో ఉన్నపుడు పేదల రక్షించుటకు, సమాజాన్ని ఉద్ధరించడానికి ప్రవక్తలు, యోధులు జనిస్తారని.

**"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చతుష్కృతాం**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే!"**

స్వర్గలోకపు దారులు తెరుచుకున్నవి. తెల్లని గుర్రంపైన సత్యం, ధర్మం, రుతంల ప్రతినిధి ఆసీనుడై యున్నాడు. ఆతని కళ్లు అగ్నిగోళాల్లా మెరుస్తూ ఉన్నవి. దైవశబ్దమనే రక్తవర్ణపు వస్త్రాన్ని ధరించిన ఆతని వెనుక ధవళ వస్త్రధారులై, శ్వేతాశ్వముల నదిరోహించిన అశేష సేవావాహిని అనుసరించి వస్తున్నది. దుష్టుల శిక్షించుటకు శిష్టుల రక్షించుటకు ఆ రాజాధిరాజు, ప్రభువులకు ప్రభువు వచ్చుచున్నాడు.

– జనంబులు లోభులై జారత్వ చోరత్వాదుల చేత ద్రవ్యహీనులై, వన్యశాకములు ఫలంబులు భుజించుచు వనగిరి దుర్గంబులం కృశీభూతులై దుర్భిక్ష శీతవాతాపక్షుధాతాపంబుల చేత భయపడి ధనహీనులై అల్పాయుష్కులై, అల్పతర శరీరులైయుండ రాజులు చోరులై ప్రవర్తించ.... ఆ భగవానుడు దుష్టనిగ్రహ శిష్ట పరిపాలనంబుల కొరకు శంబల గ్రామంబున విష్ణుయశునకు కల్క్యావతారుడై జనించి దేవదత్తమను అశ్వము నధిరోహించి దుష్టమ్లేచ్ఛ జనంబులం దన మండలాగ్రమున ఖండీభూతులం జేయును.

అందరి ఆశలూ, కలలూ ఆతని ఆగమనం కోసమే! ఆతని రాక ఏరువాక! ఆతని కరుణాకాంతి పరమశాంతి!

✧✧✧✧✧

# అక్షరార్చన - 2

## కవిత్వ నేపథ్యం



మాణిక్యవీణా ముపలాలయంతీం మదాలసాం మంజుల వాగ్విలాసామ్
మహేంద్ర నీలద్యుతిం కోమలాంగీం మాతంగ కన్యాం మనసాస్మరామి
చతుర్భుజే చంద్రకళావతంసే కుచోన్నతే కుంకుమరాగ శోణే
పుండ్రేక్షు బాణాంకుశ పుష్ప చాపహస్తే నమస్తే జగదేక మాతః !

యా కుందేందు తుషార హార ధవళాయా శుభ్రవస్త్రాన్వితా
యా వీణా వరదండ మండిత కరా యా శ్వేత పద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతి భిర్దేవై స్సదా పూజితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా !



శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా
హార తుషార ఫేన రజతాచల కాశ ఫణీశ కుందమం
దార సుధాపయోధి సితతామర సామర వాహినీ శుభా
కార త నొప్పు నిన్ను మది గానగ నెన్నడు గల్గు భారతీ!

అంబ నవాంబు జోజ్జ్వల కరాంబుజ । శారదా చంద్ర చంద్రికా
డంబరచారుమూర్తి । ప్రకటస్ఫుట భూషణ రత్న దీపికా
చుంబిత దిగ్విభాగ । శ్రుతిసూక్త వవిక్త నిజప్రభావ భా
వాంబర వీధి విశ్రుత విహారిణి । నన్ గృపజూడు, భారతీ!

# 1. కవిత్వ నేపథ్యం

## The God of Poetry - ODIN

వైకింగుల దేవతలలో ఈశిరులు, వానిరులు అనే రెండు వర్గాల మధ్య ఎప్పుడూ యుద్ధాలు జరుగుతూ ఉండేయట. విసిగిపోయిన రెండు వర్గాలు శాంతిని కోరుకుని పర్యవేక్షణ కోసం 'క్వాశిరుడు' అనే మహాజ్ఞానిని సృష్టించుకున్నారు. ఇద్దరు మరుగుజ్జు యోధులు క్వాశిరుణ్ణి చంపి అతడి రక్తంతో పులిసిన తేనెను కలిపి ఒక మధువు (మీడ్)ను తయారుచేసి మూడు పాత్రలలో దాచారు. ఆ మధువు తాగితే ఎంతవాడికైనా కవిత్వం పుట్టుకొస్తుంది. మరుగుజ్జులు తన తల్లిదండ్రుల్ని చంపారని 'సట్టుంగ్' అనే మహాకాయుడు, ఆ మధువును దొంగిలించి, భూలోకంలో ఓ కొండగుహలో దాచి కాపలాగా తొమ్మిది మంది అనుచరులకి తోడుగా తన కూతురు 'గన్లాడ్'ను నియమిస్తాడు. కాపలావాళ్ళకు తగాదా పెట్టి, గన్లాడ్‌ను ప్రేమలో పడవేసి 'ఓడిన్' మూడే మూడు చుక్కలు మధువు తాగుతానని నమ్మించి మూడుగుక్కల్లో మొత్తం మూడు పాత్రల్లోని మధువు తాగి గద్దరూపంలో స్వర్గానికి చేరుకుంటాడు. (మన పురాణాల్లో గరుత్మంతుడు అమృతాన్ని స్వర్గానికి చేర్చినట్లుగానే) కొన్ని చుక్కలు భూమి మీద పడ్డాయి అవి లభించిన వాళ్లకే కవిత్వం ప్రవాహంలా జనిస్తుందని నమ్మకం. మొత్తం మధువును పుక్కిటబట్టాడు గనుక 'ఓడిన్' మాట్లాడే ప్రతిమాటా కవితామయమే. అందుకే పులిసిన జీవన మకరందానికి, గాయపడ్డ శాంతి రక్తాన్ని కలపగా తయారైన సామాజికతా రసాన్ని చూసి ప్రేరణ పొంది కవిత్వం వ్రాస్తున్న ప్రతికవీ 'ఓడిన్' లాంటి కవితాత్మజుడే.

**అరిస్టోఫేనిస్ (క్రీ.పూ. 450-385) - కవిత్వాంశాలు**

కవిత్వానికి ప్రేరణ నిచ్చే కీలకమైన అంశాలు నాలుగే

| | | | |
|---|---|---|---|
| 1. | ఆర్ఫియస్ చెప్పినట్లు | - | హింసకు వ్యతిరేకంగా జనించేవి. గాయాల్ని మాన్పేవి |
| 2. | మ్యూసాయస్ | - | మార్మికతతో కూడుకున్నవి దైవశక్తిని తెలిపేవి |
| 3. | హెసియాడ్ | - | విత్తనాలను నాటడం, పంటలు పండించడం (రైతులకు సంబంధించినవి) |
| 4. | హోమర్ | - | ఆయుధ సంపత్తికి, యుద్ధోన్మాదానికి ప్రతీకాంశాలు |

# 2. కవిత్వ నేపథ్యం

ప్రాచీనకాలపు గాల్ (gaul) జాతికి చెందిన బ్రిటన్స్, కార్నిష్, గాల్స్, ఐరిష్, మాంక్స్, వెల్ష్ ఉపజాతులకు సంబంధించిన వ్యక్తులను సెల్టిక్ లేదా కెల్టిక్ వ్యక్తులుగా, వారి భాషను ఇండో యూరోపియన్ కుటుంబానికి చెందినదిగా భాషాశాస్త్రజ్ఞులు విశ్లేషిస్తున్నారు.

వెల్ష్ ప్రాచీన గాథల్లో ఒకటైన లిన్ ఎ ఫాన్ కథ ఇది. ఒకరోజున ఓ సరస్సు సమీపంలో దేవకన్య (ఫెయిరీ)ను చూసిన లిన్ ఎ ఫాన్ ఆమెకు తనవద్ద పూర్తిగా తయారై ఉన్న రొట్టెను (baked bread) ఇవ్వబోతాడు. ఆమె తిరస్కరించినపుడు తన దగ్గరవున్న పిండిని ఇచ్చినా ఆమె స్వీకరించదు. ఈసారి అతడు కాలీ కాలని రొట్టెను ఇస్తే ఆ కానుకను తీసుకుంటుంది. ఎందుకంటే దాంట్లో మానవునికి కావాల్సిన వాస్తవం (రియాలిటి), దేవతలకుండే భావనాశక్తి, కల్పన రెండూ ఉన్నాయి కనుక.

సెల్ట్ (Celt) అనే పదం ఛిజెల్ (ఉలి) లాంటి ఆదిమరాతి లేదా లోహపు పనిముట్టు నుంచి వచ్చింది. అలాగే ప్రాచీన భాషల్లోని క్యూ (qu) అనే అక్షరాలస్థానే పి (p); కె (k) వచ్చేసరికి 'సెల్ట్' పదం 'కెల్ట్'గా కూడ ఉచ్చరించబడిందంటారు. సెల్టిక్ కవిత్వం ఆధ్యాత్మిక అన్యాపదేశం (Spiritual Innuendo) మరియు మనస్సును విస్తృతపరిచే పూర్వవృత్తాంతాన్ని సూచించే విషయాలతో (Allusions) నిండి వుంటుంది. నెడె, ఫెర్‌కెర్టెనె అనే ఇద్దరు కవుల వాగ్వాదాలలో ఈ వాక్కుల సమ్మోహనశక్తిని గమనించగలం.

'నువ్వెక్కడ్నుంచి వచ్చావు?' అన్న ప్రశ్నకు సమాధానంగా నెడె (Nede)...

అనుభవజ్ఞాన సంగమం (A confluence of wisdom)
మంచితనపు పరిపూర్ణత (Perfection of goodness)
సూర్యోదయపు ప్రకాశం (The brightness of sunrise)
కవిత్వవృక్షపు నవఫలాల (The nine hazels of poetic art) నుంచి వచ్చానంటాడు.

ఫెర్‌కెర్టెనె ఆ ప్రశ్నకు స్పందిస్తూ–...

లీన్‌స్టెర్ నదీప్రవాహాల మీదుగా,
నెచ్‌టాన్ సతీమణి ఖననం చేయబడ్డ మట్టిదిబ్బలు దాటి,
నవాదా భార్య ముంజేతి క్రిందుగా,
సూర్యలోకం నుంచీ,
చంద్ర ప్రదేశం నుంచీ,

తాను వచ్చానని చెప్పుకుంటాడు. ఇద్దరిదీ చెరో ఒకదారి.

'నీ పేరేమిటి, ఏ మార్గంలో నీవు నడిచివచ్చావు?' అని 'నెడె'ను అడిగితె–...

నాపేరు అతిచిన్నది, మహాగొప్పది, అత్యంత ప్రకాశవంతమైనది. కొరుకుడు పడనిది. నిటలాగ్నిలో ఉండే కోపం, వాక్కులో ఉండే అగ్నితత్వం, సంభాషణలో ఉండే

జ్వలన తత్త్వం, జ్ఞానంలో ఉండే శబ్దతత్త్వం, అనుభవజ్ఞానంలో ఉండే స్రోతోమూలం, పాటలో ఉండే కత్తి పదునత్వం నా పేరు" అంటాడతడు.

జ్ఞానమైదానాల మీదుగా, రాజుల గడ్డాల మీదగా, కాలారణ్యాలను దాటి, నాగలిని మోస్తున్న వృషభాల వీపుల మీదుగా, శరత్కాలపు చంద్రకాంతిలో, తెరచాప కొయ్యలపై, మంచి ఆహారంతో, దేవతా స్తన్యజనిత క్షీరధారలలో, ప్రకృతి ప్రసాదించిన ఆహారపు దినుసులలో, ధాన్యరాసులలో, సన్నని ఇరుకైన పాటి రేవులలో ప్రవాహాల్ని దాటుకుంటూ నా బలిష్టమైన పాదాలతో ఈ మార్గంలో నడిచివచ్చానంటాడు.

ఈ ప్రశ్నలు సమాధానాలు ప్రతిమనిషి తనకు తాను వేసుకున్నవే. తనను తాను తెలుసుకున్నవే. అవే నీతివాక్యాలుగా, ప్రహేళికలుగా, ఉపనిషత్కథలుగా, వాఙ్మయంగా, సాహిత్యంగా, కవితా విన్యాసాలుగా నిలిచిపోయాయి. రూపులు మార్చుకున్నాయి. రూపాంతరం చెందుతున్నాయి. ఒక్కోసారి సరైన సమాధానం దొరకనప్పుడు కలవరాన్నీ రేకెత్తిస్తాయి. ఆ సత్యాన్వేషణలోనే అతి సులభమైన రహదారులు ఒక్కోసారి అత్యంత క్లిష్టమైన దుర్గమారణ్య కాలిబాటల్లా గోచరిస్తాయి.

కవి ఇక్కడ క్రాంతిదర్శనుడై నలుగురికి మార్గం చూపే వాడవుతాడు. తన తన భావాలకు, అనుభవాలకు అనుగుణంగా సాహిత్య ప్రక్రియలో ఒక మార్గాన్నెన్నుకుని తద్వారా ఒక మార్గనిర్దేశనం చేసే ప్రయత్నం చేస్తుంటాడు. ధ్వనులు శృతులై, అక్షరాలై, వాక్యాలై, గేయాలై, పద్యాలై, కావ్యాలై, వచన కవితలై, మరల చిన్ని చిన్ని ముక్కలై చివరకు మిగిలే ధ్వనులౌతున్నట్లు, ఓ చక్రభ్రమణం పూర్తవుతున్న భ్రాంతి కలుగుతోంది. ఇది కలా కావచ్చు. నిజమూ కావచ్చును.

ప్రాచీన 'వెల్ష్' కవితలలో దాదాపు హైకూల్లానే ఉండే ప్రక్రియ పేరు నోమ్ (gnome). దీనలో ఒక దృశ్య చిత్రణ, దాని వెన్నంటి ఓ భావ ప్రకటన ఉండి రెండింటికి పోలిక లేనట్లున్నా మళ్లీ మళ్లీ చదివితే అసలు తత్త్వం అర్థమవుతుంది.

'హైకూ' అనేది 5,7,5 అక్షరాల పరిమితితో హాస్యరసప్రధానమై జపాన్ దేశంలోని ఋతువుల్ని వర్ణిస్తూ పదిహేడవ శతాబ్దంలో ప్రాచుర్యంలోకి వచ్చిన మినీ కవిత. కొన్ని హైకూలు సూత్రప్రాయంగా కలిసి ఒక పెద్ద పద్యమో, వచన కవిత్వమో అయినప్పుడు దానిని 'హైకేయి నో రెంగా' – లింక్‌డ్ కామిక్ వెర్సెస్ – హాస్యపద్యవల్లరి అంటారు. ఈ 'హైకేయి'లోని మొదటి పాదంలో సగాన్ని 'హోకూ' అని పిలుస్తారు. నిరాడంబరత, సులభంగా వ్రాయగలగడం 'హైకూ' ప్రత్యేకత.

జెన్ బుద్ధిష్ట్ సాంప్రదాయంలో వచ్చిన 'కోయన్' (Koan) మినీ కవితలు మార్మికతతో గూఢంగా ఉండి గురువులు తమ శిష్యుల్ని అడిగే అర్థం పర్థం లేనట్లుగా కనిపించే ప్రశ్నలు. వాటి సమాధానాల్ని అన్వేషించుకుంటూ శిష్యులు ధ్యానమార్గంలో పడతారు.

వీటికి భిన్నంగా 'నోమ్' (Gnome) కవితలుంటాయి. ఉదాహరణకు

1. "కోడిపుంజు జుట్టు ఎఱ్ఱ ఎఱ్ఱని ఎరుపు,
దాని మేలుకొలుపు పెద్ద పెద్ద అరుపు;
భగవంతుడు మనల్ని పొగుడుతాడు,
మనం భగవంతుణ్ణి పొగిడితేనే...!

2. "పొలంలో బాతులు పొట్లాడుకుంటున్నాయి,
వాటి రెక్కలు భయం గొలిపేట్లున్నాయి;
ఉదారబుద్ధి కలవాడు.
పిసినారి కన్నా ధనవంతుడిగా అగుపిస్తాడు"

3. "పావురాయి రెక్కలు తెలుపు :
దాని శరీరం చూడు బాగా బలుపు.
ఆశపోతు ఆకలేసి తిన్నప్పుడల్లా అన్నం
వాడి మొహాన కక్కుర్తి మరింత స్పష్టం"

4. "చెట్ల చిటారుకొమ్మలు చాలా అందంగా ఉంటాయి,
వాటి పూలు రేపు తియ్యటి పళ్లవుతాయి.
ఎవరైతే ఇక చాలు అని తృప్తిపడతారో,
వాళ్లు బద్ధకస్తులై నిద్రలో పడిపోతారు"

వెల్ష్ సాహిత్యంలానే గ్రీకు సాహిత్యం కూడా మనకు అనేక ప్రతీకలను తీసుకువచ్చింది. గ్రీకు దేవుడైన జ్యూస్ (Zeus) నెమోసిని (Mnemosyne - memory) ను వివాహం చేసుకున్నాడు. దైవశక్తి అయిన కల్పనాశక్తికి, జీవశక్తి అయిన జ్ఞాపకానికి తొమ్మిది మంది సంతానం. వారే నవసరస్వతులు. (Nine muses)

కాలియోపె – ఇతిహాసాలకు,
క్లియో – చరిత్రకు,
ఎరాటో – భావ కవిత్వానికి,
యుటెర్పె – సంగీతానికి, గేయకవిత్వానికి, పాటలకు,
మెల్పొమెనె – విషాదాంత నాటకాలకు,
పాలిహైమ్నియా – పవిత్ర గీతాలకు,
టెర్ప్సి కోర్ – నృత్యానికి,
థాలియా – సుఖాంత నాటకాలకు,
యురేనియా – ఖగోళశాస్త్రాలకు – అధిదేవతలు.

వీరు కవికి భావావేశం, భావోద్వేగం కలిగించే వాగ్దేవతలుగా ప్రశంసించబడ్డారు.

(Fire in the Head - Tom Cowen, Chambers 20th Century dictionary ఆధారంగా)

✧✧✧✧✧

# 3. కవిత్వ నేపథ్యం

ఛందోబద్ధమైన పద్యసాహిత్యం వచనం కన్నా ముందు ప్రారంభమైనదని పండితులు విశ్వసిస్తారు. పాతతరం మానవ సమాజంలో మంత్రతంత్రాలు ఉచ్ఛస్థితిలో ఉన్నపుడు మంత్రోచ్చారణలు, తిట్లూ దీవెనలు, అన్నీ క్లుప్తమైన పద్యాలు, చరణాలుగా ఉండేవి. మరల మరల మననం చేసుకోడానికి, పలుకడానికి వీలుగా అవి క్లుప్తంగా, ఛందోబద్ధంగా, లయతో కూడినవై, శ్రుతులుగా తరతరాలకు పరివ్యాప్తమయ్యేవి.

మతం, మంత్రం, కవిత్వం ఈ మూడింటిలో ఓ అద్భుతమైన దివ్యావేశం మానసిక ప్రకాశత్వపు వెలుగు, అంతవరకు దొరకని ఓ వస్తువును అనూహ్య స్థితిలో పొందగలగడం, ఒక నిరంతర అన్వేషణకు సమాధానం దొరకడం సమాన విషయాలుగా మనకు కానవస్తాయి. కవులు, రచయితలు, పూజారులు, తాంత్రికులు, మంత్రవేత్తలు, వేదాంతులు, జోస్యం చెప్పేవాళ్లు, భగవత్ ప్రవక్తలు... వీరందరూ ఏదో దివ్యావేశానికి, అనుభూతికి లోనై మామూలు ప్రజలకు అందని నిగూఢ సత్యాన్ని వెలికిదీసి అందరికి అందిస్తారు.

ఆఫ్రికాలోని న్యూయర్ ప్రజలు ఇలా భావిస్తారు “కవి తన ఊహలు, ఆలోచనలతో కవిత్వాన్ని సృష్టించినట్లుగానే దేవుడు శూన్యం నుంచి ఈ చరాచర ప్రపంచం మొత్తాన్ని సృష్టించాడు”

టైగ్రిస్, యూఫరేటిస్ నదుల మధ్య ప్రాంతాన్ని గ్రీకులు ‘మెసపొటేమియా’ అని పిలిచేవారు. వర్షం ఒక్క చుక్క పడేది కాదు కాని రెండు నదుల్లో వచ్చే వరదలు సారవంతమైన ఒండ్రుమట్టితో ఆ ప్రాంతాన్ని నింపేవి. వరదలు తిరుగుముఖం పట్టాక ఆ సంవత్సరము విపరీతమైన పంటలు పండేవి. ఈ భూభాగాన్ని సారవంతమైన చంద్రవంక (Fertile Crescent)గా ప్రజలు అభివర్ణించేవారు.

కాని ఆ కొద్దిపాటి వరదనీటిని సక్రమంగా వినియోగించడానికి ఎంతో మానవశ్రమ, యాంత్రిక సహాయం అవసరమై కొత్త కొత్త పనిముట్లు, వ్యవసాయ వధానాల ఆవిష్కరణకు దారితీసింది. మతం, రాజరిక కాఠిన్యం ప్రజల్ని మూకుమ్మడిగా విధేయతతో పనిచేసేట్లు చేయగలిగాయి.

సుమేరియన్లు క్రీస్తుపూర్వం 3000 నాటికే నాగరికులయ్యారు. ఎరిడు, ఉర్, ఉరుక్, ఉమ్మా, లగాష్ అనేవి వీరి ప్రధాన పట్టణాలు. తొలిశకంలో (3000–2300 బి.సి.) రాజరిక వ్యవస్థ స్థాపన, పట్టణాల మధ్య అంతర్యుద్ధం, సామ్రాజ్యస్థాపనకు నాంది అనే మూడు అంశాలుద్భవించి రాజు క్రమేపి పూజారులను త్రోసిరాజని దైవాంశ సంభూతుడయ్యాడు.

క్రీస్తుపూర్వం 2340 నాటికి ఉత్తర దిశ నుండి వచ్చిన అక్కడియన్ల నాయకుడు 'సర్గాన్' సుమేరియన్లనోడించి మధ్యధరా ప్రాంతానికి రాజయ్యాడు. క్రీ.శ. 1960–1970 మధ్య ఎల్బా ప్రాంతపు తవ్వకాలలో లభ్యమైన 20,000 మట్టిబిళ్లలు వాటిపై కోణాకృతి లిపిలో ఉన్న ముద్రలు ఈ విషయాన్ని తెలుపుతున్నాయి.

క్రీస్తుపూర్వం 2100 నాటికి సుమేరియన్లు అక్కడియన్లను పారద్రోలి తమ స్వతంత్రతను సాధించారు. కొత్త దేవాలయాలు, కాలువలు, న్యాయసూత్రాలు, చట్టాలు ప్రారంభమయ్యాయి. క్రీస్తుపూర్వం 1792–1750 మధ్య పరిపాలించిన 'హమ్మురబి' అమొరైట్స్ లేదా ప్రాచీన బాబిలోనియన్ల తరంలో ఆరవ రాజు. ఈతని పరిపాలనలో సుమేరియన్ సామ్రాజ్యం బాబిలోన్ రాజధానిగా నలుదిశలా విస్తరించింది.

మెసపోటోమియా ప్రజలకు ఆధ్యాత్మిక భావన మెండు. మానవ జీవితంలోని ప్రతిఘట్టాన్ని దేవతలు పరిశీలిస్తూ పర్యవేక్షిస్తారని నమ్మకం. వాళ్ల పట్టణాలు దేవతల నగరాలకు నకళ్లని నమ్మకం. ప్రతి పట్టణాన్ని ఒక్కోదేవతకు సంబంధించేవారు. నిప్పూర్ పట్టణానికి ఎన్‌లిల్–అనిలుడు (వాయుదేవత), బాబిలోన్–మార్డూక్ (మరొక వాయుదేవత రూపం), ఉర్–నాన్నార్ (చంద్రుడు); ఆన్–ఆకాశం, ఎంకి–భూమి; నినుర్‌సాగ–ప్రకృతిమాత; ఉటు–సూర్యుడు; ఇనాన్నా–వర్షానికి, ఉదయానికి, యుద్ధానికి దేవత, ఇలా ప్రతి విషయానికి ఓ దేవుడు లేదా దేవత, వాళ్ల సంతానం అధిపతులు.

క్రీస్తుపూర్వం 3000 నాటికే కోణాకృతి లిపి ఆనాటి ప్రజల వ్యాపారపు లావాదేవీలను చూపే మట్టిబిళ్లలపై ప్రాచుర్యం పొందింది. చిత్రలిపి నుంచి ధ్వని, భావ సంబంధమైనది పరిణామం చెంది 2500 బి.సి. నాటికి సుమేరియన్లు, అక్కడియన్లకు వ్రాతలిపిగా మారింది. దాన్నే ఉత్తరాన అస్సిరియన్లు, దక్షిణాన బాబిలోనియన్లు వారి వారి మాండలికాల్లో ఉపయోగించుకున్నారు. పాఠశాలలు ప్రారంభమై వ్రాయసగాళ్లకు ప్రాముఖ్యత ఏర్పడింది. ప్రపంచపు తొలి ఇతిహాసంగా పేరుబడ్డ 'గిల్గామేష్' కావ్యం (క్రీ.పూ. రెండవ సహస్రాబ్ది) అనేక చిత్ర విచిత్ర సంఘటనలతో నిండి ఉన్నది.

ఉరుక్ పట్టణానికి రాజు గిల్గామేష్ బలవంతుడు, జ్ఞాని, చెక్కిన శిల్పంలా ఉంటాడు. సగం మానవుడు సగం దైవాంశసంభూతుడు. అహంకారి. ప్రజల్ని ఎలా హింసించేవాడంటే ఏ తండ్రీ తన కొడుకును తన దగ్గర ఉంచుకోలేకపోయాడు. ఏ కన్యా అతని పాలపడకుండా తప్పించుకోలేకపోయింది. – ప్రజలు రాజు దృష్టి మరల్చమని దేవతలను వేడుకున్నారు. ప్రజల మొర విన్న దేవతలు ఒళ్లంతా రోమాలతో నిండి చూడ్డానికే అసహ్యంగా ఉన్న 'ఎంకిడు' అనే అనాగరిక మానవమృగాన్ని గిల్గామేష్ రాజు పైకి పంపారు. రాజు అతణ్ణి లొంగదీసుకోడానికి వేశ్యను పంపి మాయోపాయంగా తనవద్దకు రప్పించుకుంటాడు. ఇద్దరి

మధ్యా భయంకర యుద్ధం జరుగుతుంది. ఎవ్వరూ ఓడరు. ఎవ్వరూ గెలవరు. ఇద్దరూ సరిసమానులని తెలినాక మిత్రులౌతారు.

ఇద్దరు కలిసి ప్రపంచాన్ని జయిద్దామని బయల్దేరుతారు గిల్గామేష్ సౌందర్యానికి, వీరత్వానికి ముగ్ధురాలై ఇనాన్నా (ఇస్తార్–ప్రేమదేవత) అతని పొందును కోరుతుంది. గిల్గామేష్ తిరస్కారానికి మండిపడి ఆమె తన తండ్రి ఆన్ (ఆకాశమును)ను ప్రార్థించి స్వర్గలోకపు వృషభాన్ని గిల్గామేష్ ఎంకిడులను చంపడానికి పంపుతుంది. వాళ్లిద్దరూ కలిసి ఆ ఎద్దును చంపేస్తారు కాని దేవతలు ఆగ్రహించి ప్రతిగా మీలో ఎవరో ఒకరు మరణించండి అని ఆజ్ఞాపిస్తారు.

ఎన్‌లిల్ (వాయుదేవుడు) ఎంకిడును ఆవహించి రోగగ్రస్థుణ్ణి చేయగా 'ఎంకిడు' మరణిస్తాడు. స్నేహితుడి మరణాన్ని భరించలేని గిల్గామేష్ మృత్యురహస్యాన్ని కనుగొనడానికి తన సాహసయాత్రను ప్రారంభిస్తాడు. అతనికి జలప్రళయంలో మృత్యుంజయుడైన 'ఉత్నాపిష్టిమ్' గురించి తెలుస్తుంది. ఎన్నో శ్రమలకోర్చి 'ఉత్నాపిష్టిమ్'ను చేరుకున్న గిల్గామేష్ అతని నుండి సముద్రగర్భంలో ఉన్న 'సోమలత' – నిత్య యవ్వనాన్ని, అమరత్వాన్ని ప్రసాదించే చెట్టుతీగె – గురించి తెలుసుకుని దానికై అన్వేషించి, ఎట్టకేలకు సంపాదిస్తాడు. తిరుగు ప్రయాణంలో అలిసిపోయి నిద్రిస్తున్న అతని నుంచి ఓ సర్పం మృత్యుంజయలతను సంగ్రహించి పారిపోతుంది. పాము ఆనాటి నుంచి నెల నెలా కుబుసాన్ని విడిచి యవ్వనాన్ని పొందగలుగు తున్నది. కాని గిల్గామేష్ దానిని పోగొట్టుకుని మానవునికి మరణం తప్పదు అని గ్రహించి సమాధానపడ్డాడు.

ఈ కథలోని ప్రతిధ్వనులు ఆ తరువాతి నాగరికతలలో, కథలలో అనేక రూపాలుగా వినిపించడం మనకు తెలుసును.

మెసపొటేమియా ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, అనూహ్యంగా సంభవించే వరదలు, వేడిగాలులు, తుఫానులు, భరించలేని ఉక్కబోత, నీటని సంరక్షించుకోడానికి ప్రజలు పడే కష్టాలు, శాసనాలు, శిక్షలు ఇవన్నీ కావ్య వస్తువులైనాయి.

నాలుగు వేల సంవత్సరాల క్రితం వ్రాయబడ్డ ఈ సుమేరియన్ కవిత 'అత్రాహాసిస్' (Atrahasis)లో మానవసృష్టి ఎందుకు ఎలా జరిగిందో హృద్యంగా వర్ణించబడింది.

"పెద్దదేవుళ్లంతా హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారు.
పాపం ! చిల్లర దేవుళ్లకే వచ్చింది కష్టం.
క్షణం తీరికలేదు ! కంటి మీద కునుకు లేదు.
ఎన్నాళ్లు మోయాలీ కష్టాల తట్టని, ఈ శ్రమ సంచిని?
The labor basket of the great gods-

మరో నలభై ఏళ్లు గడిచాయి –
రేయింబవళ్లూ మట్టి మోసి, కట్ట కట్టి
అలిసి సొలిసి అలిసి సొలిసి...
తట్టలు మరింత బరువవుతున్నాయి.
కాలువలు ఇంకెన్ని తవ్వాలి –
సణుగుడు మొదలై గొణుగుడయ్యింది.
దేవతల ప్రతినిధి ఎన్‌లిల్ (వాయుదేవుడి) పై
అందరూ తిరుగుబాటు స్వరంతో వేడుకున్నారు, హెచ్చరించారు.
ఎన్‌లిల్ – 'నింటు' – (పిల్లలకు జన్మనిచ్చే దేవత)ను పిలిచాడు.
నువ్వు ఒక మనిషిని తయారుచేయి !
వాడు ఈ దేవతల శ్రమసంచి, కష్టాల తట్టను మోయాలి!
మంత్రసాని 'మామి' దేవత వచ్చి ఇలా చెప్పింది.
"నింటు" దేవత మనిషిరూపుని సృష్టించింది. సరే !
తర్కశీలుడైన 'వె–ఇలా' దేవుడ్ని బలియివ్వండిప్పుడు
అతని రక్తం, మాంసాన్ని ఈ మట్టి పిండంలో కలుపుతాను"
నెలవంకరోజున మొదలైన ఆ పని పౌర్ణమినాడు ముగిసింది.
మనిషి గుండె చప్పుడు దేవతలందరూ విన్నారారోజు !
మహాదేవుళ్లు 'అనున్నాకి, ఇగిగి' నేలపైకి దిగి వచ్చారు
తమ పుక్కిటినీటితో మనిషిని అభిషేకించారు.
'మామి' మంత్రసాని ఇలా అన్నది.
"ఓ దేవతలారా! మీరు అప్పగించిన పని నేను పూర్తిచేసాను
మీ భుజాలపై బండికాడిని దించివేసాను.
మీకు స్వేచ్ఛను, సంతోషాన్ని ఇవ్వగలిగాను.
మీ కష్టాల తట్టను, శ్రమసంచిని ఇకనుంచి
ఈ మనిషి, వీడి వారసులు మోస్తారు

–అలా దేవతల కష్టాలు మన మనుషుల పాలబడ్డాయన్న మాట. అది ఆనాటి ప్రజల అభిప్రాయం.

'శిశుర్వేత్తి, పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః' అనేది సూక్తి. కవిత్వం, పాట, సంగీతం పశుపక్ష్యాదులపై ప్రకృతిపై తమ ప్రభావాన్ని చూపుతాయని అందరి నమ్మకం. ఆర్ఫియస్ లాంటి గంధర్వ గాయకులు తమగానంతో పశుపక్ష్యాదులను మైమరపింపజేసే వారు 'ద పైడ్ పైపర్ ఆఫ్ హామెలిన్' తన వేణుగానంతో ఎలుకల్ని సముద్రంలోకి పంపించి ఆ పట్టణానికి ఎలుకల బాధ లేకుండా చేసాడని, తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వనపుడు ఆ

నగరంలోని పిల్లల్ని తన పాటతో ముగ్ధుల్ని చేసి ఎవరికి కనపడకుండా తీసుకుపోయి ప్రతీకారం తీర్చుకున్నాడని ఓ కథ.

మంత్రతంత్రాల ప్రాధాన్యత నుంచి కవిత్వం రాజుల్ని, తమ పోషకుల్ని దైవాంశ సంభూతులుగా, సమస్త సుగుణవంతులుగా కవులు కీర్తించే కాలంలోకి వచ్చింది. కాని ఒక్కోసారి కవిత్వం వ్రాయించుకుని కృతఘ్నుత చూపే వారిని కవులు శపించడం, తిట్టడం కూడ ఉన్నది. ఐరిష్ కవుల (ఒల్లేన్, ఫైల్, బార్డ్ – ఇవి కవులు, కవిగాయకులకు మరో పేర్లు) శాపకవిత్వాన్ని 'ఓర్ధాయ్' అంటారు. కొందరు కవులు చీడపీడల్ని, ఎలుకల్లాంటి జంతువుల్ని పారద్రోలగలిగే కవిత్వం పంక్తులు వ్రాసేవారట. ఓ గుడ్డిఎలుక ఆ కవిత్వం కాగితం ముక్కని నోటకరుచుకుని ముందు వెళ్తుంటే మిగతావి వాటిని అనుసరించి కవి చెప్పిన చోటుకి వెళ్లిపోయేవని అనుకునేవారు. ఆ శాపక కవిత్వాన్ని "Salm na Mallacht" అనేవారు. రాజుల శరీరాల్ని పీడించే పరాన్నజీవుల్ని, పురుగుల్ని కవులు ఇలాగే పారద్రోలేవారని వాడుకలో ఉన్నది. ఈ విషయాన్ని శబ్దాక్షర శక్తుల్నీ కవులే కాక ఆనాటి ప్రజలూ విశ్వసించేవారు. కవుల్ని గౌరవ మర్యాదలతో పాటు భక్తిప్రపత్తులతో సేవించేవారు. దేవుడు లేదా ప్రకృతికి సాధారణ మానవుడికి మధ్య స్నేహవారధిగా కవుల్ని ప్రజలు నమ్మేవారు.

✧✧✧✧✧

# 4. కవిత్వ నేపథ్యం

అక్షరాలింకా పుట్టని కాలమది. దేవతల చరిత్రలు, వీరుల గాథలు శృతులుగా ఒకరి మంచి ఒకరికి మౌఖికంగా వ్యాప్తి చెందేవి. ఆ గాథల్ని గానం చేస్తూ అభినయిస్తూ సంఘటనల్ని కళ్లకు కట్టినట్లు చూపించగలిగిన సత్తా ఉన్నవారికి బహుళ ఆదరణ ఉండేది. ప్రాచీన గ్రీసు దేశాలలో ఈ కళాకారులను రాప్సోడ్స్ (Rhapsodes) అని పిలిచేవారు. వీరు ఒక రాజ్యం నుంచి మరొక రాజ్యానికి ప్రయాణం చేస్తూ అక్కడి రాజుల, ధనవంతుల ప్రాపకంలో వారాల కొద్దీ మజిలీలు చేస్తూ కథాగానం చేసేవారు. నవరసాలు కురిపిస్తూ లయబద్ధంగా వారు పురాణ పఠనం, కావ్యగానం చేస్తుంటే సభికులు తన్మయులయ్యేవారు. దేవతలు, వాళ్ల మహిమలు, వీరుల గాథలు, యుద్ధ సంఘటనలు, వాళ్ల కథా వస్తువులు కాగా, సభా ప్రాంగణాల్లో, కూడళ్ళలో, చలిమంటలు కాగుతూ, తాగుతూ, విందు లారగిస్తూన్న సభికులను ఆనందపరచడానికి వారు ప్రయోగించే పదాలు, భాషా చమత్కృతులు, గానరీతులు ఎప్పటికప్పుడు నవనవోన్మేషంగా ఉండేవి.

క్రీస్తుపూర్వం ఎనిమిదివ శతాబ్దంలో హోమర్ ఈ గాథల్ని అక్షరబద్ధం చేసాడు. ఇలియాడ్, ఒడిస్సీలుగా ప్రఖ్యాతి గాంచిన ఈ గ్రీకు వీరుల చరిత్రలు ప్రపంచ సాహిత్యపు తలమానికాలైనాయి.

చిన్న చిన్న విందుల్లో, కుటుంబ సంబరాల్లో స్నేహితుల వినోదాల్లో కాలక్షేపాల్లోని సాహిత్య గుబాళింపులు మరోరకంగా ఉండేవి. చిన్న చిన్న కవితల్ని లైర్ (Lyre) వాయిద్యం మీటుతూ గానం చేసే ప్రక్రియ 'లిరిక్' (Lyric)గా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రేమ, కుటుంబ వ్యవహారాలూ, మానసిక ఉద్వేగాలు, రాజకీయ వ్యంగ్య భావాలు ప్రధానాంశాలుగా ఉండేవి. కవయిత్రి 'సాఫో' (Sappho of Lesbos) (620-550 B.C.) ఈ రకపు లిరిక్ కవితలకు ఆ కాలంలో ప్రసిద్ధికెక్కింది.

ఈ నిస్సారపు భూమి కావలనున్న సుందర దృశ్యమేది?
కొందరికి ధనరాశులు కొందరికి మధుపాత్రలు
నాకు మాత్రం నా చెలి చిరునవ్వుల వెన్నెలలు

వివాహాది శుభకార్యాలలో సాగే నృత్యగానాల్ని 'Choral Odes' అనేవారు. నూతన దంపతుల్ని, విజేతల్ని కీర్తిస్తూ సాగే ఈ గానాల్లో ప్రధాన గాయకుడు, కోరస్ ఉండేవి. క్రీస్తుపూర్వం అయిదవ శతాబ్దం నాటికి ఏథేన్స్ గ్రీకు సంస్కృతికి ముఖ్య కేంద్రమైంది. కవులూ, కళాకారులు సంపన్నుల ప్రాపకం కోసం ఏథెన్స్‌లో ఎదురుచూపులు చూసేవారు. ఆనాటి కవితా రూపకాల్లో అత్యంత పేరుగాంచిన రూపకం ట్రాజెడి (Tragedy) ఈ మాటకు అసలు అర్థం 'గొర్రె పాట' అని ట్రాగాస్

(Tragos) అంటే గ్రీకు భాషలో గొర్రె. ఓడ్ (Ode) అనగా పాట. హారేస్ అభిప్రాయం ప్రకారం పోటీల్లోని విజేతకు గొర్రెపిల్లను బహుమతిగా ఇచ్చేవారు గనక 'ట్రాజెడీ' అని పేరు వచ్చింది. అరిస్టాటిల్ తన 'పొయెటిక్స్' గ్రంథంలో – ట్రాజెడీ అంటే కళ్లుండి వీక్షించే వారికే గాక అంధులకైనా సరే విన్నప్పుడు శరీరం భయంతో జలదరించాలి. దుఃఖంతో, జాలితో హృదయం చెమర్చాలి అని వ్రాసాడు. ఓరెస్టియన్ ట్రిలోజీ వ్రాసిన ఎస్కిలస్ (Aeschylus - 156 B.C.)ను ట్రాజెడీ పిత (Ther father of Tragedy)గా వ్యవహరిస్తారు.

కామెడీ (Comedy) అనే పదం గ్రీకు (kome-ode=విలేజిసాంగ్) పల్లెపాట అనవచ్చు. పల్లె ప్రజలు సామూహిక నృత్యగానాల్లో సంబరం జరుపుకునేప్పుడు, డయొనెషియస్ దేవుడి ఉత్సవాల్లో పాడుకునే పాటలవి. ప్రధాన గాయకుడికి కోరస్‌గా పక్షులు, జంతువుల రూపాలు, ముసుగులు ధరించిన సహగాయకులు తోడ్పడేవారు. ఏథెన్స్ కళాకారుడు రచయిత అరిస్టోఫేనిస్‌ను (450–385 బి.సి.) కామెడీ పిత (The father of Comedy)గా గుర్తించారు.

స్కాండినేవియన్ దేవుడు 'ఓడిన్' (Odin, Woden) పొయెట్రి (కవిత్వం), జ్ఞానం, యుద్ధం, వ్యవసాయాలకు అధిపతి మృత్యుదేవతగా ఈతడు వీరస్వర్గమైన 'వాలహాల్లా' (Valhalla)లోకి తన అంగరక్షకురాళ్లైన 'వాల్కిరీ'ల ద్వారా యుద్ధంలో మృతి చెందిన వీరులను ఆహ్వానించి వారితో విందు వినోదాలలో పాల్గొంటాడు. మిమిర్ జీవధారలోని జలాన్ని సేవించి, జ్ఞానవృక్షానికి ఒక కంటిని అర్పించి సమస్త విద్యలకు అధిపతి అయ్యాడు ఓడిన్. మిగిలిన ఒక కన్ను సూర్యుడిగా అతని ఉచ్ఛైశ్రవం స్లీప్‌నిర్‌గా అతనికి తోడుంటుంది. అన్ని మంత్ర విద్యలకు అధిపతి. 'రూన్స్' అంకెలను పాచికలను అక్షరాలను కనుకున్నది 'ఓడిన్'గా నార్స్ ప్రజలు భావిస్తారు. ఓడిన్ నుంచే Wednesday (బుధవారం) వచ్చింది.

విషాదాంత కావ్యాలైన ట్రాజెడీలు నాంది (Prologos)తో ప్రారంభమై, కోరస్ బృందగానం ప్రస్తావన (Parodos)ను ఆలపించగా తొలి సన్నివేశం (Epeisodion) మొదలవుతుంది. సన్నివేశానికి సన్నివేశానికి మధ్య బృందగానాలు (స్టాసిమాన్–కోరల్ సాంగ్స్) ఆరోహణ అవరోహణలతో (Strophe and antistrophe) నృత్యరూపకాన్ని కోరస్ బృందం ప్రదర్శిస్తూ కథాగమనానికి తోడ్పడతారు. మూడవ భాగాన్ని ఎపోడ్ (Epode) అని, ఆఖరి భాగాన్ని నిష్క్రమణ (Exodos, Epilogue)గా పిలిచేవారు. మాస్కులు ధరించిన మగవారే అన్ని పాత్రలూ పోషించేవారు.

Comedy is a revel-song అన్నది నానుడి. వసంతోత్సవాల్లో, సంతానోత్పత్తికి సంబంధించిన కార్యక్రమాల్లో, విజయ విహారాల్లో, పునరుజ్జీవన

సంబరాల్లో మిన్నంటిన ఉత్సాహాల్లో ఉరకలు వేసే పాట కామెడీ. అడ్డంకుల్ని దాటి గమ్యాన్ని చేరుకున్న ఆనందపు ప్రతిబింబమే కామెడీ.

గ్రీకుల కాలం నాటి ఆ ట్రాజెడీ, కామెడీలు క్రమంగా హెల్లెనిస్టిక్, రోమన్ కాలాల్లోకి ప్రవహించాయి. పాత్రల్లో క్రమేపి మానవత్వం, మానవ అనుభవాలు, అనుబంధాలు రావడంతో కవిత్వం మరింత సహజమై, చిక్కనై పాట, పలుకుబడి, మరింత పదునెక్కి కవిత్వాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లడమే కాక కవులకు సమాజంలో ఉన్నత స్థానాన్ని సంపాదించి పెట్టింది.

సాహిత్యానికి సంబంధించిన ప్రతి వ్యక్తినీ పూర్వం కవి (Poet)గా పిలిచేవారు. అది పద్యం కావచ్చు, పాట కావచ్చును, వచనం కావచ్చును. కవి యొక్క కళారూపం పొయెట్రీ లేదా కవిత్వం. కవిత్వ సంగ్రహరూపం, లేదా సంకలాన్ని పొయెసీ (Poesy) అనేవారు. (ఫ్రెంచ్ – Poesie లాటిన్ – Poesis గ్రీకు – Poiesis) అంటే తయారు చేయడం అన్నమాట. భావానికి అద్భుత చిరస్మరణీయ రూపాన్ని అక్షరబద్ధంగా, పదబంధంగా చేయడమే కవిత్వమన్నమాట.

(Poeta nascitur, non fit - Poets are born, not made) 'కవులు పుడతారు, తయారు చేయబడరు' అన్నది ఆర్యోక్తి. కవులు కవిత్వాన్ని తయారు చేస్తారన్నదే Poiesim అన్న పదానికి అర్థం. పూర్వం రాజాస్థానాలలో కవులకు ప్రముఖ స్థానం ఉండేది. రాచరికపు ఉత్సవాల్ని నిర్వహించేప్పుడు వాటికి సంబంధించిన వ్యవహారాల్ని చూస్తూ తదనుకూల కవిత్వాన్ని రాసేందుకు జేమ్స్–1 రాజు కాలంలో పొయెట్ లారేట్ (Poet Laureate) ఆస్థాన కవి పదవి ప్రారంభించబడింది. కొన్ని విశ్వవిద్యాలయాలు కవులకు ఆ రకమైన కిరీటాల్నిచ్చి సత్కరించేవి కూడాను. బెన్ జాన్సన్, డావెనాంట్, జాన్ డ్రిడన్, థామస్ షాడ్‌వెల్, నాహమ్ టేట్, విలియం వర్డ్స్‌వర్త్, ఆల్‌ఫ్రెడ్ టెన్నిసన్‌లకు ఇంకా అనేకమందికి పొయెట్ లారెట్ బిరుదం దక్కింది.

లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ ఎబ్బే దక్షిణ చివరి భాగాన్ని ఆలివర్ గోల్డ్‌స్మిత్ 'పొయెట్స్ కార్నర్' (Poet's Corner)గా పిలిచాడు. ఎందుకంటే అక్కడే ఛాసర్ సమాధి ఉన్నది. అంతకుముందే దాన్ని ఎడిసన్ 'పొయెటికల్ క్వార్టర్' అని తన వ్యాసంలో పేర్కొన్నాడు. స్పెన్సర్, డ్రైడన్, జాన్‌సన్, షెరిడాన్, డికెన్స్, బ్రౌనింగ్, టెన్నిసన్, కిప్లింగ్ లాంటి వారి సమాధులున్న ప్రాంతమిది. పత్రికల్లో, న్యూస్ పేపర్లలో కవిత్వము ఉండే భాగాన్ని ఇప్పుడు మనం 'పొయెట్స్ కార్నర్'గా గుర్తిస్తున్నాము.

పరిశుద్ధ గ్రంథం బైబిల్‌లో కవిత్వం పాలు హెచ్చు. హీబ్రూ కవిత్వపు గాఢత, పద గాంభీర్యం, క్లుప్తత, దృశ్య భావన, బైబిల్‌లో అడుగడుగునా కానవస్తాయి.

లిరిక్, ఎపిక్, ప్రొఫెటిక్, డ్రమెటిక్ పొయెమ్స్ రీతుల్ని బైబిల్‌లో మనం ఆస్వాదిస్తాం. ఆనందిస్తాం. అది అనుభవైక వేద్యమే!

దివ్య ఖుర్–ఆన్‌లో కవుల గురించి ప్రస్తావన ఉన్నది. అష్–షు–అరా (26వ అధ్యాయం 224–227)లో ఇలా చెప్పబడినది. – ఇక కవులు వారి వెనుక మార్గభ్రష్టులే నడుస్తూ ఉంటారు. వారు ప్రతిలోయలో దారి తప్పటాన్నీ, తాము ఆచరించని దానిని చెప్పటాన్నీ నీవు చూడటం లేదా?

'మహాప్రవక్త ఒక కవి' అని మక్కావాసులు మోపిన అభియోగానికి ఇది ప్రత్యుత్తరం. నాలుగు ప్రత్యేక లక్షణాలు కలిగిన కవులను పైన నిరసించబడిన కవుల పరిధి నుండి మినహాయించడం జరిగింది. 1) కవులు విశ్వాసులై ఉండాలి, 2) ఆచరణలో సత్ప్రవర్తన కలిగి ఉండాలి. 3) అల్లాహ్‌ను నిరంతరం స్మరిస్తూ ఉండాలి. 4) తన వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించి ఎవరినీ ఎన్నడూ అగౌరవం పాలు చేయకూడదు. అయితే అన్యాయానికి వ్యతిరేకంగా సత్యాన్ని సమర్థించే అవసరం కలిగినప్పుడు యుద్ధవీరుడు రణరంగంలో బాణాలనూ, ఖడ్గాలను ఉపయోగించిన విధంగా అతడు తన వాక్ శక్తిని వినియోగించాలి.

కవి తన శక్తిని సమాజ ప్రయోజనం కోసం వినియోగించాలి అని ప్రవక్త స్పష్టంగా ఆదేశించినాడు. మతం ఏదైనా కవి పథం సమాజ నిర్మాణం. సర్వేజనా సుఖినోభవంతు అయినప్పుడు జన్మసాఫల్యమై నూతన సమాజ ఆవిష్కరణం జరుగుతుంది.

'శుభం భూయాత్'

✧✧✧✧✧

# 5. కవిత్వ నేపథ్యం

హోమోసెపియన్స్‌గా పిలువబడ్డ నరుని జీవితంలోని ధ్వని రూపాంతరం చెందుతూ మాటగా పాటగా కవిత్వంగా కావ్యాలుగా ఎలా పరిణమించిందో తెలుసుకోవడం కొరకు ఆ కాలరేఖను పరిశీలిద్దాం.

నవీన శాస్త్ర పరిశోధనలననుసరించి – పదివేల సంవత్సరాల క్రితం గణనం (N"³meracy) middle eastern Tokens; పూర్వవ్రాత స్థితి వింకాసంజ్ఞలు (5300 B.C.) ఈజిప్షియన్ లిపి (3200 B.C.) మెసపొటోమియన్ క్యూని ఫారం లిపి (3100 B.C.) ఇండస్ లోయ లిపి (2500 B.C.) సెమెటికి లిపి (2000 B.C.) మనోవన్ లీనియార్ ఎ (1800 B.C.) లీనియార్ బి (1500 B.C.) ఫోనీషియన్ లిపి (1200 B.C.)గ్రీకు అక్షరమాల (775 B.C.) మాయన్; మధ్యఅమెరికా (500 B.C.) అలెగ్జాండ్రియన్ లైబ్రరీ (250 B.C.) చైనీయుల ముద్రణా విధానం (750 క్రీ.శ.) గూటెన్‌బర్గ్ ప్రెస్ (1450 క్రీ.శ.) ఛెరోకీ స్క్రిప్టు (1821 క్రీ.శ.) టైపురైటర్ – స్కోప్స్ (1867 క్రీ.శ.) ప్రస్తుత ఇంటర్‌నెట్ (1997 క్రీ.శ.) అక్షరాల పరిణామ దశలలో మైలురాళ్లుగా పరిగణించవచ్చును.

మౌఖిక భాష ఏ జీవి కాజీవికి ప్రత్యేకమై పరిణామవృక్షంలో ఆ జీవి ఆవిర్భవించిన కాలం నుంచి ఉంటుంది. మానవుడికి లక్షాయాభైవేల సంవత్సరాల క్రితం హోమినిడ్స్ అనబడ్డ పూర్వికుల ఆవిర్భావంతో, మానవులకు వారి స్వరపేటిక నిర్మాణాన్ని బట్టి ప్రత్యేకమైన అరుపులు, కేకలు, ధ్వనులు వచ్చి ఉంటాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. వ్రాత లిపి రావడానికి ముందే సింబాలిక్‌గా దృశ్యాల్ని వ్యక్తపరిచే చిత్రలిపి ద్వారా మానవుడు గుహల గోడలపై తన అనుభవాల్ని, సంఘటనలను చిత్రీకరించారు. స్థిరనివాసం, పశుపెంపకం, వ్యవసాయం తద్వారా వచ్చిన అధిక ఉత్పత్తిని గణించేందుకు మట్టిటోకెన్లు, ఎన్‌వలెప్‌లు క్రీస్తుపూర్వం 10000–4000 సంవత్సరాల మధ్య వరకు చలామణిలో ఉన్నాయి.

ఇవే క్రమేపీ అక్షరమాల నిర్మాణంలో, ధనవస్తుగణనంలో ఉపకరించారు. మనీ (Money) అనే పదం రోమన్ దేవతల రాణి 'జునో'కు ఉన్న మరోపేరు Moneta (మోనెటా) నుంచి వచ్చింది. గ్రీకుల దేవత – ముగ్గురమ్మలు (Three Muses)కు తల్లి నెమోసెన్ (Mnemosyne) లేదా (Memory - జ్ఞాపకం) నుంచి మోనెటాకు అన్వయింపబడింది. మనీ అనేది గుర్తుంచుకోవడానికి మరోపేరు అన్నది మనం గమనించవచ్చును. టోకెన్ల నుంచి పిక్టోగ్రాములు (చిత్రలిపి) ఐడియోగ్రాము (భావలిపి) సిలబరీ, అక్షరమాలగా వ్రాతలిపి వాడుకలోకి పరిణితి చెందింది. మొదటి అక్షరమాల ఫొనేషియన్లది (ఇప్పటి లెబనాన్ ప్రాంతం) కాగా దానిలో హల్లును Alef, bet, gimel

అక్షరాలను స్వీకరించిన గ్రీకులు మొదటి అక్షరం ఎలెఫ్‌ను ఆల్ఫాగా మార్చగా అక్షరమాల 'ఆల్ఫాబెట్'గా వ్యవహరించబడింది.

ఫొనీషియన్లు కుడి నుంచి ఎడమకు వ్రాసేవారు. అదే పద్ధతి హీబ్రూ, అరబిక్, అనేక ఆసియన్ భాషలలో వాడుకలో ఉన్నది. గ్రీకులు తొలిగా అదే పద్ధతిలో వ్రాసినా తరువాత హలలిపి (boustrophedon) ఎడమనుంచి కుడికి, కుడి నుంచి ఎడమకు మరల ఎడమన నుంచి కుడికి నాగేటి చాలులా వ్రాసేవారు. అయిదువందల ఏళ్ల తరువాత ఎడమ నుంచి కుడికి వ్రాయడం రీడ్‌కలం వినియోగంతో ప్రాచుర్యంలోకి వచ్చింది, దానిని ఎట్రుస్కన్లు తరువాత రోమన్లు ఇప్పుడు మనం అందరం వ్రాస్తున్న పద్ధతి అదేకదా!

వ్రాతకు పూర్వమే ప్రాచీన గాథలు, కల్పిత గాథలు, నిజసంఘటనలు గానం చేసే గాయకులు నిత్యం వల్లెవేయడం ద్వారా వాటిని గుర్తుంచుకుని సమయ సందర్భాల్లో పాడి ప్రజలను రంజింపచేసేవారు. ఈ మౌఖిక కవులు టిబెట్‌లో పేపర్‌సింగర్, అమెరికన్ స్లామ్‌పొయెట్, సౌత్‌ఆఫ్రికన్ ప్రెయిజ్ పొయిట్, ప్రాచీన గ్రీకు అయిడోయి (Aoidoi)లుగా గుర్తింపబడ్డారు.

గుహలలో చిత్రించబడ్డ దృశ్యాలనుంచి, చిన్నచిన్న మట్టిబిళ్లలపై టోకెన్లగా, రాజుల విజయగాథల్ని, న్యాయపద్ధతుల్ని వ్యక్తపరిచే శిలాశాసనాలుగా, రాళ్లపై, లోహపు రేకులపై, రీడ్‌మొక్కల పాపిరస్‌లపై, పార్చిమెంట్లపై, తాటిఆకులపై వ్రాసినవి ఈనాటికీ తవ్వకాలలో లభ్యమవుతూ ఆనాటి ప్రజల విధివిధానాన్ని వివరిస్తున్నాయి. 'పార్చిమెంటు' అనేది గొర్రెల చర్మపు లోని పొరనుంచి శుద్ధిచేయబడిన పలుచని పొర. 'వెల్లం' – లేగదూడల చర్మం నుంచి తయారుచేసేవారు. వాటిపై మసితో లేదా ఇనుప రజనుతో తయారుచేయబడ్డ ఇంకులతో అక్షరాలను బొమ్మలను వ్రాసేవారు. వాటకి అవసరమైన చోట రంగులను, తైలవర్ణాన్ని అద్దేవారు.

ప్రాశ్చాత్య సాహిత్యాన్ని 1) క్రీ.పూ. 500 – క్రీ.శ. 400 వరకు వెలువడిన ప్రాచీన సాహిత్యంలో హీబ్రూల మతపరమైన ఓల్డ్‌టెస్టామెంటు, గ్రీకుల హోమర్ విరచిత ఇలియాడ్, ఒడెస్సీలు రోమన్ల ఒడెస్సీ లాటిన్ అనువాదం చెప్పుకోదగ్గవి.

2) క్రీ.శ. 500–1500 ప్రాంతం – మిడిల్ ఏజెస్‌గా పిలువబడ్డ ఈ మధ్యయుగ కాలంలో గ్రీకు, రోమన్, క్రిష్టియన్ వీరుల గాథలు లిఖించబడ్డాయి. మతపరమైన రచనలలో డాంటే – డివైన్ కామెడీ... మానవ విలువలతో కూడిన అద్భుతకావ్యం కాగా, రొమాంటిక్ రచనలలో ఎడ్వంచర్స్ ఆఫ్ కింగ్ ఆర్థర్ అండ్ నైట్స్ ఆఫ్ ద రౌండ్ టేబుల్, సామాన్య ప్రజల భాషలో (వెర్నాక్యులర్) ఛాసర్ వ్రాసిన 'ద కాంటర్‌బరీ టేల్స్' ముఖ్యమైనవి.

3) క్రీ.శ. 1350–1650 రినైజన్స్ – పునరుజ్జీవన కాలంలో ఇటలీ కేంద్రస్థానంగా, మానవుల అందచందాలు, వీరత్వం ప్రధాన వస్తువులుగా సాహిత్యం, కళల నిర్మాణం జరిగింది. ప్రింటింగ్ అందుబాటులోకి రావడంతో వ్యాపారావకాశాలు కళారంగంలోకి ప్రవేశించాయి. జాతీయతావాదాలు, ఆర్థిక నినాదాలు మానవుడిని దేవుని సేవకుడిగా కాక ఒక ప్రత్యేకమైన సంపూర్ణ వ్యక్తిత్వంగల వాడిగా కవులు, కళాకారులు, ప్రజలు గుర్తించసాగారు. మానవుడి మనస్సు మతపు పంజరంలో నుంచి బయటపడి విహరించసాగింది. విలియం షేక్స్పియర్ (క్రీ.శ. 1564–1616) కాలమిదే.

4) క్రీ.శ. 1680–1750 క్లాసిజం – పునరుజ్జీవన కాలపు స్వేచ్ఛాతత్వాన్ని ఎదురించడానికి, అదుపులో ఉంచడానికి జరిగిన ప్రయత్నమిది. ఊహల్లో విహరించడం కాదు, నిజజీవితానికి దగ్గరగా ఉండాలి – అనే భావనతో 'రేషనలిజం'గా పేరు పొందింది. గ్రీకు, లాటిన్ గ్రంథాల్లో ఉన్న న్యాయధర్మాలను అతిక్రమించవద్దని క్లాసిక్స్‌ను అనుసరించాలని మొలీరె (ఫ్రెంచ్), పోప్ (ఇంగ్లీషు) లాంటి కవులు నిర్దేశించారు.

5) క్రీ.శ. 1780–1830 వరకు క్లాసిజానికి వ్యతిరేకంగా ఆవిర్భవించినది రొమాంటిసిజమ్. ఫ్రెంచ్ విప్లవం, పారిశ్రామిక విప్లవాల కాలంలో వచ్చిన మార్పులు ప్రపంచాన్ని కుదిపేశాయి. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వంలతోపాటు, ఆ విప్లవాలు తెచ్చిన ఆర్థక అసమానతలు కవుల్ని రచయితల్ని ఊహాలోకాల్లోకి, నిరాశ, నిస్పృహల పరిధుల్లోకి దించేశాయి. ప్రకృతిని ప్రేమిస్తూ, సాధారణ జీవితాన్ని గడుపుతూ, మనిషి నీతివంతుడై ఉండాలని చెప్పే భావనలు బ్లేక్, వర్డ్స్‌వర్త్, స్కాట్, షెల్లీ, కీట్స్ రచనలలో మనం గమనించగలం.

6) క్రీ.శ. 1850–1920 కాలంలో రియలిజం – అంతకు ముందున్న రొమాంటిసిజాన్ని వ్యతిరేకిస్తూ ప్రభంజనమై సాగింది. పెట్టుబడీదారులకు వ్యతిరేకంగా శ్రామికుల ప్రజల పోరాటం వారి వైఫల్యాలని గమనించిన కవులు అనుబంధాలను, సెంటిమెంట్లనీ వ్యతిరేకిస్తూ అందరికీ అర్థమయ్యే సరళభాషలో కవిత్వాన్ని రచనల్నీ చేయసాగారు. వ్యంగ్యం ముక్కుసూటితనం, ధైర్యం ఈ రచనల్ని ప్రజలకు దగ్గర చేసాయి.

7) ఎమిలీజోలాతో ప్రతిపాదించబడ్డ నేచురలిజం రియలిజానికి మరో పార్శ్వం. ప్రకృతి మానవుణ్ణి తీర్చిదిద్దుతుంది. వంశపారంపర్యం, పెరిగిన వాతావరణం మీద అతనికి కంట్రోలు లేదు అని నాచురలిస్టులు భావిస్తారు. మానవుడిలో ఉండే మృగతత్వాన్ని వీళ్లు పాత్రలుగా మలిచారు.

8) క్రీ.శ. 1890–1950 యుద్ధాలు, ఆర్థిక జటిలతలు 'నిషే' ప్రతిపాదనలు, ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ, బెర్గ్‌సన్ ఇంట్యూషన్, డార్విన్ పరిణామ సిద్ధాంతాలు – మోడర్నిజంతో ప్రముఖపాత్ర వహించాయి. రచయితలు వీటిని ప్రధానాంశాలుగా స్వీకరించి తమ కలాల్ని పరుగులెత్తించారు.

9) 1950 తరువాతి కాలాన్ని పోస్ట్ మోడర్నిజంగా వ్యవహరిస్తారు. సమాజంలో ఉన్న ప్రస్తుత విలువల్ని, కట్టుబాట్లని వ్యతిరేకిస్తూ ముందుకు సాగమని పోస్ట్ మాడర్నిస్టులు పేర్కొంటారు. ద సెర్చ్ ఫర్ ఐడెంటిటీ – వ్యక్తిత్వ శోధన, గుర్తింపు ముఖ్యభావన. ప్రపంచం ఒక తర్కరహిత మహాయంత్రం. ఒక భయంకర పంజరం. ఈ గందరగోళంలో మనిషిని మనిషిని గుర్తించడం ఎలా సాధ్యం?

తర్కానికి, శాస్త్రానికి దూరంగా అంతర్గత శోధనతో విషాదభరితంగా, విధ్వంస వినాశపూరితంగా, నిగూఢంగా మిస్టీరియస్‌గా ఉండే భావనలతో మోడర్నిస్టుల రచనలు సాగుతాయి. కళ కళ కోసమే! కళల్ని జీవితం నుంచి రాజకీయాల్నుంచి విడదీయాలన్నది వీళ్ల అభిప్రాయం.

పోస్ట్ మోడర్నిజం, సింబాలిజం, ఫ్యూచరిజం, సర్రియలిజం, ఎక్స్‌ప్రెషనిజం, ఎగ్జిస్టెన్షియలిజం ఇవన్నీ మోడర్నిజంలో శాఖలు.

రొమాంటిసిజమ్ నుంచి నాచురలిజమ్ నుంచి ఎగ్జిస్టెన్షియలిజం సొరెన్ కిర్కెగార్డ్, మార్టిన్ హీడెగ్గర్, కారల్ సొస్పర్స్, కృషి వల్ల రూపుదిద్దుకుని జీన్‌పాల్ సార్త్రె, సైమన్ డి బివొయెర్, ఆల్బర్ట్ కేమస్ వంటి ఉద్దండుల చేతుల్లో ఉద్యమ కరవాలమైనది.

జీవనం జీవనగమ్యానికి ముందుంటుంది. (ఎగ్జిస్టెన్స్ ప్రిసీడ్స్ ఎస్సెన్స్) అనేది ఈ భావనకు మూలసూత్రం. ఇది ప్లాటోనిక్ భావనను తిరస్కరిస్తూ – మనం ఒక ఎబ్సర్డ్ అర్థం లేని ప్రపంచంలో నివసిస్తున్నాం కనక మనం మన విలువల్ని జీవన అర్థాన్ని మనమే వెదుక్కోవాలి – అని చెబుతుంది. మనిషికి అనేక అవకాశాలు ఉన్నాయి. మనకిష్టమైనది ఫ్రీ విల్ – స్వతంత్ర ఆలోచనతో మనం ఎన్నుకోవచ్చు. లేదా ఎన్నుకునే అవకాశమున్నా ఎన్నుకోకుండా ఉండవచ్చును కూడా!

ఎగ్జిష్టియన్సిజంలో దైవభక్తులు, హేతువాదులు, ప్రపంచాన్ని అర్థరహితం అనేవారు; విషాదపూరితం (asburd) అనేవారు వేర్వేరు దృక్పథాలు కలిగి ఉన్నారు. సార్త్రె Man is nothing else but what he makes of himself - అన్నాడు. అబ్రహాం మాస్లో – మనం జీవితంలో ఒక స్తరాన్ని దాని విలువలను అధిగమించాకే మరో స్తరంలోకి (లెవెల్) చేరగలుగుతాం.

హ్యూమనిజం (మానవతావాదం) ప్రజలకు స్వేచ్ఛ ఉన్నది. వారు సంపూర్ణత్వాన్ని, నీతివంతమైన జీవితాన్ని గడపగలరు అని ప్రభోధిస్తే ఎగ్జిష్టినియలిజం – ప్రజలకు స్వేచ్ఛ ఉన్నది, వాళ్ల పనులకు వాళ్లే బాధ్యులని చెబుతుంది.

దేవుడికి, ప్రకృతికి దూరంగా పోతున్న ఈనాటి ప్రజలు ఆశ, ప్రేమలు లేని ఎడారిలో బతుకుతున్నారు. భయం ఆందోళన వీళ్ల జీవన విధానమై శూన్యంతో పోరాటం చేస్తూ అర్ధరహిత ఎబ్సర్డ్ ప్రపంచంలో ప్రజలు జీవిస్తున్నారు అని ఎగ్జెష్టియన్షిలిజమ్ వివరిస్తుంది.

జపనీస్ హైకూలు, ప్రాచీన గ్రీకు "సాఫో" లిరిక్కులు, సరళమైన భాషలో సూటిగా భావాన్ని చెప్పే చిన్న కవితలు. వీళ్లకు ప్రపంచం ఒక భయంకరమైన లోయగా కనిపిస్తుంది.

1. ఆకాశపు అంచుల్ని వెదుకుతూ
   వలయాలుగా వలయాలుగా ప్రదక్షిణం చేస్తున్న
   అతనిని నేను వారించాను – నీవల్ల కాదు దాన్ని అందుకోలేవు
   అతను పరిగెత్తుతూనే అన్నాడు
   'నువ్వో అబద్ధాల కోరువి'

2. ఒకతను ప్రపంచంతో ఇలా అన్నాడు
   'ఆర్యా! నేనున్నాను
   ప్రపంచం ప్రతిధ్వనించింది
   అది యదార్థమే కాని
   నీకూ నాకేం సంబంధం లేదు' అని – స్టిఫెన్ క్రేన్

3. మంచు కురుస్తోంది
   సీతాకోకచిలుకలు ఊసులాడుకుంటున్నాయి
   నర్తిస్తున్న తునకల మధ్య – ఓహారు

4. పూలరెక్కలు విడిపోయి
   పడిపోతాయి నిశ్శబ్దంగా నేలపై
   ఆ సమయం వచ్చినప్పుడు – ఎట్సుజిన్

5. ఈ టోపీ ఆ దిష్టిబొమ్మనుంచి
   దొంగిలించాను, పాతదే !
   చల్లటి మంచువాన చెంపల్ని
   వాయగొడ్తోంది లేకుంటే ! – క్యోషి

6. హెయాసింథ్ దేవపుష్పంలా
ఒక మిరుమిట్లుకొలిపే కాంతి !
నా కళ్లు మూసుకున్నాను
నేనారోజున చూసాను
ఓ అందమైన జవరాలిని !
గడ్డిపూలను సేకరిస్తూ ఆమె
మళ్లీ నాకు కనిపిస్తుందో లేదో
మధువూ !
మధుమక్షికా ! – సాఫో (గ్రీకు కవయిత్రి)

7. మెట్రో స్టేషను గుంపు మధ్యలో
ఆ మొహాల్ని దర్శించాను
నల్లటి, తడికొమ్మల మధ్య పూలరేకుల్లా – ఎజ్రాపౌండ్

8. స్పర్శకందుతూ, మూగగా, రాలిన పండులా
తడిమినా నిశ్శబ్దంగా, పాతపతకాల్లా
నాచుతివాచి పరచుకున్న, పలకరాళ్ళలా
కవిత్వం మెదలాలి ! పదాలు కనబడకుండా!
ఎగిరే పక్షుల విన్యాసంలా
కాలంలో చలనరహితమై
చెట్ల కొమ్మలో చిక్కుబడ్డ చంద్రుడిలా
ఒక్కొక్క శాఖనూ అధిగమిస్తూ
వెండిపత్రాలపై వెన్నెలగా మెరుస్తూ
మానస సముద్రంలో అలలుగా
కవిత్వం స్పర్శకందాలి. మౌనంగా,
కాలంలో చలన రహితంగా
కవిత్వం నిజానికి నీడగా ఉండాలి
నిజంగా కాదు !
విషాదానికి వివృత ద్వారంగా
ప్రేమకు మేపుల్ పత్రంగా
ఒరిగిన లేతగడ్డి కాడలుగా
సముద్రంపై మెరుస్తున్న రెండు కాంతులుగా
కవిత్వం అలా అర్థం కారాదు
అవే అనిపించాలి. – ఆర్చిబాల్డ్ మాక్‌లీష్

✧✧✧✧✧

# 6. కవిత్వ నేపథ్యం

కలం తన ముందుకు రాగానే సృష్టికర్త యిలా అన్నాడు. "మనిషిగా ఉండటం ఎలాగో కాస్త వివరించు". ఖంగారుపడ్డ నా చేయి ఖాళీ పేజీపై చాలాసేపు కదలాడింది. కాలం శరవేగంతో కదిలిపోతున్న స్పృహ దారితప్పిన బాటసారి పాదముద్రల్లా కాగితపు ఎడారిపై ఖర్జూరపు వృక్షాక్షరాల మనిషి ఒంటరితనాన్ని నేను వర్ణించసాగాను. చటుక్కున నా చేయి దాన్ని చెరిపేయబోయింది. జీవితపు కిటికీ దగ్గరున్న చీకటిస్వరాలు అరిచాయి. మూకుమ్మడిగా ఎడారి గాలి అదిరిపడేలా 'ఒంటరితనం ముమ్మాటికీ ఓ చేదునిజం'...

- R.S. Thomas - The World (1975)

వేగం ప్రధానమైన ఈనాటి యాంత్రిక జీవన నిరంతర పరుగు పోరాటంలో మనిషితోపాటు కవిత్వమూ ఒంటరిగా బిక్కుబిక్కుమంటున్నది. కాంక్రీటు జనారణ్యాల్లో ఆకాశహర్మ్యాల మధ్య బిత్తరపోయిన చెట్లలా నేడు కవిత్వం మ్యూజియంలో భద్రపరచబడ్డ అపురూప వస్తువుగా రూపు మార్చుకుంటున్నది. ఎటు చూసినా అశాంతి, హింస, రణన్నినాదాల రణగొణ ధ్వనులూ, నిరాశా నిస్పృహలూ, నిర్లిప్తతా నిర్వేదాలూ!

శబ్దాలు అర్థవంతమవుతున్న దశలోనే సంగీతమూ, చిత్రలేఖనం, మౌఖిక కవిత్వమూ ఉద్భవించిన మనిషికి తోడై భయాన్నీ ఒంటరితనాన్నీ చెరిపేసే అస్త్రాలైనాయి. చీకటి గుయ్యారాల్లో గుహల గోడలపై చిత్ర విచిత్ర చిత్రాలు జాలువారి ఆనాటి జీవన విధానాన్ని ప్రకృతి తరువాతి తరాలకు వివరించే అసంకల్పిత గుప్త భాండాగారాలైనాయి.

పండ్లూ ఫలాలూ ఏరుకుని తినే దశనుంచీ వేటగాడిగా, వేట నుంచి వ్యవసాయదారుడిగా సంచార దశ నుండి స్థిరపడ్డ గ్రామీణుడిగా మానవుడు పరిణమించే క్రమంలో ఎదురుపడ్డ, ఎదుర్కొన్న అద్భుత సంఘటనలు, సాహస యాత్రలు, మౌఖిక కవిత్వాలై సంగీతపు చిరుగాలులు తోడురాగా కాలప్రవాహంలో ముందుకు సాగాయి.

గ్రీకు భాషలోని 'పొయెసిస్' (Poiesis = making) 'పోయెట్రీ' (కవిత్వం)గా రూపుదాల్చింది. ఉత్తేజాన్నిస్తూ, సుందర అక్షరం కన్నా ముందే శబ్దాలు కవిత్వీకరించబడ్డాయి. అద్భుతమైన కవిత్వమున్న వేద వాఙ్మయం (క్రీ.పూ. 1700–1200) జోరాస్టర్ గాథలు (క్రీ.పూ. 1200–900) ఒడిస్సీ (క్రీ.పూ. 800–675) ఒకతరం నుంచి మరొక తరానికి అందించబడడానికి వీలైన రీతిలో మలచబడ్డాయి. (మౌఖిక కవిత్వం Oral Poetry)

గిల్గామేష్ ఇతిహాసం (క్రీ.పూ. 3వ సహస్రాబ్ది) సుమేరియా ఈనాటి ఇరాక్ ప్రాంతం గ్రీకుల ఇలియాడ్, ఒడెస్సీ, ఇరానియన్ల అవెస్తా మరియు యస్నా; రోమన్ల ఎయినీడ్; భారతీయుల రామాయణ మహాభారతాలు మహాకావ్యాలై శాశ్వతంగా నిలిచిపోయాయి.

వడ్లగింజల్నుంచి తాలు ఏరేసినట్లు కవిత్వాన్ని తూర్పారబట్టడానికి పరిణామం చెందిన అన్ని భాషల్లోనూ కవిత్వానికి నియమ నిబంధనలు నిర్దేశింపబడ్డాయి. అరిస్టాటిల్ తన 'పొయెటిక్స్' గ్రంథంలో కవిత్వాన్ని చారిత్రక (ఇతిహాస), కామెడి (సుఖాంతం), ట్రాజెడి (దుఃఖాంతం) కావ్యాలుగా వర్గీకరించాడు. తరువాతి తరాల్లో కవిత్వాన్ని ఎపిక్ (ఇతిహాసాలు), లిరిక్ (సంగీత కావ్యాలు), డ్రమెటిక్ (నాటకాలు)గా కామెడి, ట్రాజెడీలు డ్రమెటిక్ విభాగంలో అంతర్భాగాలుగా విభజించినారు.

అరిస్టాటిల్ ప్రభావం ఇస్లామిక్ స్వర్ణయుగంలోనూ తరువాత యూరప్ పునరుజ్జీవన (రినైజాన్స్) యుగంలోనూ కవిత్వంపై గాఢంగా ఉండింది. వచనానికి (Prose) వ్యతిరిక్తంగా 'పొయెట్రీ'ని ప్రత్యేకంగా ఉంచడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి.

రొమాంటిక్ యుగంలో కవిత్వం అనే రూపురేఖల్ని సుందరతను సంతరీక రించుకున్నది. యూరప్ వలస ప్రభావం అనేక దేశాలపై పడగా ఆక్రమణకు గురైన దేశాల ప్రాంతాల ప్రాంతీయ కవిత్వ సంగీతాలు రాజభాష భేషజాన్ని అలవరచుకొని కొత్త మిశ్రమ రీతులైనాయి. అనువాద ప్రక్రియ అతివేగవంతమై, ముద్రణాయంత్రాల (Printing) ఆగమనంతో కవిత్వం అందరికీ అందుబాటులోకి రాసాగింది. యుద్ధాలు, పారిశ్రామీకరణ, కమ్యూనిజం, మతం, స్త్రీవాదం కవిత్వ పుస్తకంలో కొత్త పుటల్ని నింపాయి.

ఈనాటి పోస్ట్ మోడర్నిజం దశలో వచనానికి, కవిత్వానికి మధ్య సరిహద్దులు చెరిగిపోయాయి. పుస్తకాలయాల్లో పాఠకులకు కవి తన కవిత్వాన్ని వినిపించడం ఇప్పటి ఫ్యాషన్ కాగా (మౌఖిక కవిత్వంతో) యిలా కవిత్వ చక్రభ్రమణం మళ్లీ మొదలైనట్లున్నది. ఆర్చిబాల్డ్ మాక్‌లీష్ తన 'ఆర్స్ పొయెటికా'లో 'A Poem should not mean / but be' అన్నది నేటి విధానమైనది.

ముద్రణాయంత్రాలకన్నా ముందే వచ్చిన విజువల్ పొయెట్రీ ఈనాటి నవకవుల రచనల్లోనూ చూడవచ్చును. పర్‌ఫార్మెన్స్ పొయెట్రీ – కవిత్వాన్ని ప్రదర్శించడం ఈనాటి కవితాగోష్ఠుల్లోని కొత్తరీతి. కవిత్వాన్ని, రచనల్ని వ్రాసేందుకు ప్రోత్సహించడం ద్వారా మానసిక రుగ్మతల్ని అంచనావేయడం, నివారించడం, నయం చేయడం నవీన వైద్యవిధానంలో కొత్తదారులను ఏర్పరుస్తున్నది.

జేమ్స్ డబ్ల్యు. పెన్నెబేకర్ అనే సైకాలజీ ప్రొఫెసర్ పరిశోధనలలో వ్యక్తులు తమ గత జీవితంలో జరిగిన దురదృష్టకరమైన, గాయపరిచిన సంఘటనలను గుర్తు తెచ్చుకుని కళారూపంలో వ్యక్తీకరించనప్పుడల్లా వాళ్ల శరీరంలో రోగనిరోధక శక్తి అధికం కావడం, మానసికంగా శక్తివంతులుగా మారడం గమనించాడు. ఫ్రాయిడ్, జోసెఫ్ బ్రూయర్ రచనల్లో (Studies on Hysteria) కూడా ఈ విషయాన్ని మనం చూడవచ్చును.

రాబర్ట్ ఆర్న్‌స్టీన్ తన The Right mind 1997 గ్రంథంలో మాట్లాడడానికి, వ్రాయడానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పేర్కొన్నాడు. భాష మాట్లాడడం Right Brainకు సంబంధించినయితే, వ్రాయడంలో Left Brain ప్రధానపాత్ర వహిస్తుంది. (Right for music - left for logic) కుడి మెదడు కళలకు, ఎడమ వైపు లెక్కలు, తార్కిక జ్ఞానాన్ని రూపొందించడానికి ముఖ్యమైనవి.

ఇంటర్నెట్ ద్వారా, చాట్‌రూముల్లో మాట్లాడుకోవడం ద్వారా, ఈ మెయిల్స్ ద్వారా కొన్ని మానసిక వ్యాధుల్ని నయం చేయవచ్చునని సైకోథెరపిస్టు – నాథాన్ ఫీల్డ్ తన The Therapeutic action of writing in self disclosure and Self expression అనే పరిశోధనా వ్యాసంలో పేర్కొన్నాడు. ఉదయం తొలిఝాముల్లో మళ్ళీ మళ్ళీ వచ్చే అనేక భయంకరమైన ఆలోచనల్ని డైరీ రూపంలో వ్రాయడం వల్ల అబ్సెసివ్ Obsessive వ్యాధుల్ని నివారించవచ్చునని సైకాలజిస్టులు అభిప్రాయపడుతున్నారు.

ఒంటరితనానికి విరుగుడు అనుకున్న కవిత్వం, కష్టజీవికి ఇరువైపులా ఉండాల్సిన కవులు తమకు తాము పరిధుల్ని ఏర్పరచుకోవడంతో వీళ్లే ఒంటరివాళ్లయి పోయారు.

మనం అనుకున్న ఒప్పందం ప్రకారం
మన మధ్య ఉన్న ఈ రహదారిని మూసేద్దాం.
గోడలపై మరిన్ని ఇటుకల్ని, గాజు పెంకుల్ని గుచ్చుదాం!
తుమ్మచెట్లనీ, దురదగుంట మొక్కల్నీ అమితంగా పెంచి
కత్తుల వంతెనల్నీ, క్లేమోర్ మైన్లనీ పాతుదాం!
నిశ్శబ్దాన్నీ, నిషేధపుటుత్తర్వుల్నీ, ఉన్మత్తతనూ ఉసికొల్పి
ఒంటరితనాన్ని మరింత ఉధృతం చేద్దాం. – ఫిలిప్ లార్కిన్

ఈ విషవృక్షాలపై ఏ చిలుకా వాలదు! ఏ కోయిలా పాడదు! ఏ నెమలీ ఆడదు! ఆకాశపు దీపాలే అగుపించని పట్టణాలలో, లోహవిహంగాల విస్ఫోటన ధ్వనుల మధ్య ఏ సుందర పుష్పం వికసిస్తుంది? గ్రహణ కిరణాలు సోకిన గర్భవతి ఎంత ప్రసవ వేదన పడినా జనించే శిశువు అంగవిహీనుడు కాకుండా ఏ కృష్ణచక్రం అడ్డుపడ్తుంది?

'అక్షరాల కోట బురుజుపై అష్టదిగ్బంధనం గావించుకుని అంతరిక్షపు అంచులమీద అందమైన లతల్ని చిత్రీకరిస్తాను. మొయిలపూల మొక్కల్లా స్త్రీలూ, నక్షత్రపు పుష్పాల్లా పిల్లలూ! అచ్చులూ, హల్లుల మిశ్రమాలు అనంత వాక్యవృక్షా లవుతాయి. అనేకసార్లు అద్భుత శబ్దాలై అతిలోక సంగీతపు యామినులైనా ఒక్కోసారి నీటిమీద వ్రాతలై నిశ్శబ్దంలోకి నిష్క్రమిస్తాయి'.

- Dylan Thomas - Especially when the october wind.

ధ్వనుల నేపథ్యం నుంచీ కవిత్వం పరిణామం చెందుతూ ఈనాడు స్వేచ్ఛగా విహరించగలుగుతోంది. కానీ ఈ ప్రయాణంలో తన స్వాప్నికతనూ సున్నితత్వాన్నీ పోగొట్టుకొని విషవాయువుల మధ్య వివృతమై తన దిశనూ దశనూ కోల్పోతున్నది. ఎంత చెడ్డా కవిత్వం పీడకల కారాదు. పిల్లల్నీ, యువతనీ పట్టణాలకు ధారపోసి ఒంటరిగా వణుకుతున్న ముదుసలి పల్లెల్లా కవిత్వం రూపు మారరాదు.

పదకొండేళ్ల బాలుడు వ్రాసిన కవిత్వ పంక్తులివి–

– "పిల్లలు వెళ్లిపోయారు
అమ్మను కదా జ్ఞాపకాల ఒత్తిడి ఎక్కువై
వాళ్లాడుకున్న గదిలోకి వెళ్లాను
అలలు అలల్లా నాకు సుపరిచితమైన వాళ్ల గొంతులు
కాని వాళ్లక్కడలేరు.
ఇల్లంతా బోసిగా వుంది. నిశ్శబ్దంగా!
వాళ్లను పిలిచీ పిలిచీ శోష వచ్చినట్లు
నేనూ నాయిల్లూ...
కాని వాళ్లు గమనించినట్లే లేరు..." –

**నాకు కవిత్వాన్నీ, ధర్మాన్నీ మరిచిన కవులు గుర్తుకొస్తున్నారు...**

✧✧✧✧✧

# 7. కవిత్వ నేపథ్యం

When Isrrael was in Egypt's land
Let my people go !
Oppressed so hard they couldnot stand,
Let my people go !
Chorus : Go down, Moses,
Way down in Egypt's land;
Tell old Pharaoh
Let my people go !

ఫ్రెడరిక్ డగ్లాస్ (Frederic Douglas) వ్రాసిన ఈ పద్యపంక్తులు మనం మాట్లాడ్తున్నట్లే ఉంటాయి. అందుకే విలియం వర్డ్స్‌వర్త్ (William Wordsworth) అంటాడు– “కవిత్వమనేది ఆశువుగా ప్రవహించే శక్తివంతమైన భావసముదాయం. కవి వాటిని ఉన్నదున్నట్లుగా కాక ఇంద్రియాలకు ప్రీతి కలిగించేలా చిత్రించాలి”

‘కవిత్వం హృదయానికి స్వాంతన కలిగించాలి. అది ఒక అలౌకిక అపురూప పుష్పం కావాలి’ –అన్నాడు వాల్టర్ సావేజ్ లాండర్–

There is a flower I wish to wear
But not until first worn by you
Heart's ease - of all earth's flowers most rare;
Bring it; and bring enough for two.

–చెప్పిన ఆ పుష్పం వెదకుదాం, అన్వేషిద్దాం పదండి. ఇద్దరికే కాదు అందరికీ అందిద్దాం.

అలాంటి అన్వేషణలోనే ఉన్న అలెగ్జాండర్ పోప్–

Let me for once presume to instruct the times,
To know the Poet from the man of rhymes:
"It is he, who gives my breast a thousand pains
Can make me feel each passion that he feigns"

‘కవి’ ఎలా ఉండాలో చెప్పకనే చెబుతున్నాడు. కవి వర్తమానాన్ని అనుభవించాలి, భూతకాలాన్ని అధ్యయనం చేయాలి. భవిష్యత్ శుభానికి ప్రణాళికా నౌకను సిద్ధం చేసి ప్రజలకు అందించాలి.

Michael row the boat ashore, Hallelujah !
Michael's boat is a freedom boat, Hallelujah !
Sister, help to trim the sail, Hellelujah !
Jordan stream is wide and deep, Hallelujah !
Freedom stands on the otherside, Hallelujah !

స్వేచ్ఛకోసం, విముక్తి కోసం పరితపించే ప్రజలకు కవి తన గళాన్ని శంఖారావంలా వినిపించాలి. 'రాబర్ట్ ఫ్రాస్ట్ (Robert Frost) మాటల్లో...

"A poem is heard as sung or spoken by a person
in a scene - in character, in a setting. By whom,
where and when is the question. By a dreamer of the
better world out in a storm in Autumn; by a lover
under a window at night"

కవిత్వమనేది ఇండియన్ సమ్మర్‌లా ఎలా పరిణమిస్తుందో చెబుతున్నది డొరొతి పార్కర్ (Dorothy Parker)–

In Youth, it was a way I had
To do my best to please,
And change, with everypassing lad
To suit his theories.

But now I know the things I know
And do the things I do;
And if you donot like me so,
To hell, my love, with you !

అలా కుండ బద్దలుకొట్టినట్లు చెప్పగలగాలి.

కాలం గడిచిన కొద్దీ కవిత్వం రూపురేఖల్లో మార్పురావడం సహజమే. కవిలో వచ్చిన మార్పు కవిత్వంలో రావచ్చును, రాకపోవచ్చును. చాలామంది కవుల తొలి కవిత్వమంత గాఢత తరువాత వాటిల్లో లేకపోవడం గమనార్హం. కారణం మనందరకు తెలిసినదే!

ఆధునిక కవిత్వం గురించి హెలెన్ స్టీవెన్స్ వ్రాస్తూ–

"The poem must be the finding of a satisfaction, and may be of a man skating, a woman dancing, a woman combing; The poem of the act of the mind:"

'Amongh twenty snowy mountains
The only moving thing
was the eye of the black bird'...

వాలెస్ స్టీవెన్స్ (Wallace Stevens) బ్లాక్‌బర్డ్ (Black bird)ను పదమూడు రకాలుగా గమనించాడు. అలా పరిశీలన (Observation). అధ్యయనం (Study). నిరంతర కృషి ఉన్నపుడు కవి, కవిత్వ వ్యవసాయంలో చెక్కుచెదరని కృషీవలుడౌతాడు. ప్రతిరోజూ కవిత్వం వ్రాయకుండా నిద్రపోలేని వాళ్లున్నారు. కాని రాబర్ట్ హెర్రిక్ (Robert Herrick) అభిప్రాయం వేరు.

"It is not everyday that I
Fitted am to prophesy.
No, but when the spirit fills
The fantastic pannicles
Full of fire, then I write
As the God head doth ineite"

'ఆదాం శాపం'లో (Adam's Curse) ఈట్స్ మహాకవి – కవిత్వం అనేది ఓ క్షణకాలపు ఉత్తేజ ఫలితమే అయినా ఉత్తమ కవిత్వం అనేక గంటలపాటు అనేకసార్లు రివిజన్ – పునరాలోకనం చేయగా చేయగా ప్రభవిస్తుందంటాడు... a line will take us hours may be; Yet it doesnot seem a moment's thought, our stitching and unstitching has been naught. కవులందరికీ ఈ విషయం అనుభవైకవేద్యమే!

మనందరికీ తెలిసిన ఆర్చిబాల్డ్ మాక్‌లీష్ (Marchibald Macleash) తన 'ఆర్స్ పొయెటికా' (Ars Poetica) లో–

"A poem should be palpable and mute
As a globed fruit,
Dumb
As old medallions to thumb...
A poem should be wordless
As the flight of birds...
A poem should be motionless in time
As the moon climbs....
A poem should be equal to;

Not true...

A poem should not mean

But be "                – అని ప్రవచించాడు.

మరి ఈనాడు కవిత్వాన్ని కలవరించి, పలవరించి, గిలకరించి, చిలకరించి పుంఖాను పుంఖాలుగా విరజిమ్ముతున్న బాలకవులు, యువకవులు, వృద్ధకవులు, కవి పుంగవులు, మహాకవులు కవిత్వాన్ని చదువుతున్నారా! లేక తాము వ్రాసిన కవిత్వాన్నే పదులసార్లు చదువుకుని మురిసిపోయి మరిచిపోతున్నారా? మరెందుకు మంచి కవిత్వం రావడం లేదు... అని ప్రపంచ ప్రజలందరూ ఘోష పెడ్తున్నారు?

Some critic tried to put me down-
"Your poems lack the Basic Truth of Tao"
And I recall the old timers
who were poor and didn't care.
I have to laugh at him,
He misses the point entirely,
Men like that
aught to stick to making money.

గారీ స్నైడర్ (Gary Snyder) అన్న మాటలు మనందరికీ వర్తిస్తున్నాయా? కవిత్వంలో విత్తం లేదని కవులు, ఇప్పుడొస్తున్న కవిత్వంలో కవిత్వమే లేదని పాఠకులు, మిగతా కవులు, సంపాదకులు, ప్రజాలోకమూ కోడై కూస్తున్నా కవులెందుకు వినిపించుకోవడం లేదు? అందుకేనేమో కవిత్వం ఇలా ఉంటే బావుంటుందని 'మరియానె మూర్' (Marianne Moore) భావిస్తోంది.

"I too dislike it; There are things that are important
beyond all this fiddle. Reading it, however, with a
perfect contempt for it, one discoveres in it after all,
a place for the genuine.
Hands that can grasp, eyes
That can dilate, hair that can rise
If it must, these things are important

not because a high sounding interpretation can be put upon them but because they are useful. When they become so derivative as to be come unintelligible, the same thing may be said for all of us, that we

donot admire what

We cannot understand; the bat

holding on upside down or in quest of something to eat, elephants pushing, a wild horse taking a roll, a tireless wolf under a tree, the immovable critic twiching his skin like a horse that feels a flea,

The base-ball fan, the statistician-
nor is it valid

to discriminate against" business documents and school books" - all these Phenomena ae important.

One must make a distinction however; when dragged into prominence by half poets, the result is not poetry,

not till the poet among us can be
"literalists of the imagination" - above
insolence and triviality and can present
for inspection -"Imaginary gardens with real toads in them"

Shall we have it. In the meantime, if you demand on the one had,

The raw material of poetry in
all its rawness and
that which is on the other hand
genuine, you are interested in poetry"

కవిత్వం ఎలా ఉండాలో చెప్పడానికి ఇంత ఉపోద్ఘాతం అవసరమైంది. ఎలా ఉండకూడదో చెప్పడానికి వేరే ఋజువులకోసం వెదకనక్కరలేదు. మనం వ్రాసిన కవిత్వాన్ని పదిమార్లు తరచి తరచి చదివితే చాలు వరికుప్పలో సూదికోసం వెదికినట్లు లేదూ! బొగ్గులగనిలో వజ్రాల వేటలా లేదూ! అయినా ఒక్క వజ్రం కోసం జీవితాంతం శ్రమించడం లాంటిదే కవిత్వం వ్రాయడం.

"It is not inspiration that exhausts one, but Art"

- W.B. Yeats

✧✧✧✧✧

# 8. కవిత్వ నేపథ్యం

"Writing a poem is discovering" - Robert Frost (1874-1963)
"Poetry is not a turning loose of emotion, but an escape from emotion;
It is not the expression of personality but an escape from personality.
But, of course, only those who have emotion and personality known
What its means to want to escape from these-"
- Emily Dickensen (1830-1886)

కవిత్వం స్త్రీల అంతరాత్మలో భాగంగా ఎప్పుడూ ఉన్నదే. జోలపాటలు, జాలిపాటలు, జ్వలించే పాటలతో వారి ఆత్మలెల్లప్పుడూ అగ్నిజ్వాలల్లో పరిశుద్ధమైన స్వర్ణంలా ప్రకాశిస్తూనే ఉన్నాయి. సామాజిక కట్టుబాట్లు, అరకొర న్యాయాలు, అసమానతలతో అణగదొక్కబడిన ఆ ఆకాశంలో సగం ప్రపంచం. తమ కన్నీళ్లను పదాలుగా, అక్షరాలుగా, పాటలుగా శిల్పీకరించుకుని తమ ఉద్వేగాలకు కవిత్వ భాషలో స్వేచ్ఛారెక్కలనిస్తున్నవి.

సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితమే (క్రీ.పూ. 2300–2350) అక్కడియన్ల రాజు సర్గాన్ (Sargon) తన కుమార్తె 'ఎంహెదువన్నా' (Enheduvanna)ను సుమేరు ప్రాంతంలోని ఉర్ (Ur) పట్టణంలోని నన్నాదేవత గుడికి పూజారిణిగా నియమించాడు. ఆమె వ్రాసిన దైవస్తోత్రావళిలో ఆనాటి ప్రజల జీవన రీతులు కూడ మిళితమై ఉన్నాయి. నిసాబా (Nisaba - the Goddess of writing and scholars) వ్రాతకు, జ్ఞానులకు అధిదేవత. ఆమెను రాకుమారి 'ఎంహెదువన్నా' స్తుతిస్తున్నది. –

> "అమ్మా! నీ విధేయులైన స్త్రీలు జ్ఞానాన్ని అక్షరాలుగా మరిచి పాటలుగా గానం చేస్తారు. పూర్వ శాస్త్రాల సారాన్ని పాఠాలుగా, ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని అందజేస్తారు. నిన్ను పొగడ నా తరమా! దయవుంచి నాకు స్వేచ్ఛను ప్రసాదించు తల్లీ!"

బుద్ధుని శిష్యురాలైన సుమంగళ మాత టోపీలు, గొడుగులు చేసే ఓ పేద శ్రామికుని భార్య. కర్కశ హృదయుడైన భర్త యింట్లో ఆమె పలు అగచాట్లు పడింది. కాని ఆమె కవి హృదయం ఓనాడు ఉప్పొంగింది.

> "ఎంత గొప్ప వరమీ స్వేచ్ఛ!
> వంటగది నుంచీ, మసిపాత్రల మధ్య మరకలాంటి బ్రతుకు నుంచీ విముక్తి!
> ఈరోజున రెక్కలు వచ్చిన పక్షిలా స్వేచ్ఛను పొందిన స్త్రీనయ్యాను.
> ఎంత విలువైనదీ స్వేచ్ఛ!

ప్రతిక్షణం నన్ను తక్కువ చేసి చూస్తూ
తాను నేసిన గొడుగు నీడలో నన్ను కట్టిపడేసిన భర్త నుంచీ స్వేచ్ఛ!
నిరంతర ఆగ్రహానికీ, ఆకలికీ కడుదూరంగా
నేను స్వయంగా పెంచుకునే నా చెట్టు నీడ క్రింద
హాయిగా, ప్రశాంతంగా;... ఈ స్వేచ్ఛ ఎంత బాగున్నది!

గ్రీకు రచయిత్రి శాఫో (Sappho 612-570 B.C.) కవిత్వం ప్రేమలోని మాధుర్యాన్ని, లోతుల్ని ఎంతో అందంగా చెబుతుంది. లెస్బాస్‌లో (Lesbos) జన్మించిన శాఫో కవిత్వం వలన లెస్బియనిజం, శాఫిజం పదాలు నిఘంటువులలో శాశ్వతంగా నిలిచిపోయాయి. గ్రీకులు ఆమెను తొమ్మిది మంది పద్యకవులలో ఒకరిగా గుర్తించారు.

"అమ్మా! ఇక నా వల్లకాదు!
ఈ సున్నితమైన వస్త్రాన్ని ఈరోజు నేయలేను.
దానికి కారణం ఎఫ్రొడైట్! ఆమెను నిందించు!
ఆమె ప్రేమ, శృంగారాలకు అధిదేవత కదా!
ఆ అందగాడిమీద నాకు ప్రేమను రగిలించి
కనుపించని బాణాలతో నా ప్రాణాలను తీస్తున్నది"

క్రీస్తుశకం ఎనిమిదవ శతాబ్దానికి చెందిన గోదాదేవి, ఆండాళ్‌గా ప్రసిద్ధికెక్కింది. పన్నెండుగురు ఆళ్వారులలో ఆమె ఒక్కతే స్త్రీ. ఆమె రచించిన తిరుప్పావై, నాచియార్ తిరుమొళి తమిళంలో ప్రసిద్ధ కావ్యాలు. పెరుమాళ్లు (విష్ణుమూర్తి)ని కీర్తిస్తూ తనను గోపికగా భావించుకుని ఆమె వ్రాసిన ముప్పది పాశురాలు అత్యంత ప్రసిద్ధికెక్కాయి.

"ఆండాళ్ మధురస్వరంతో ఆలపించే ఈ గీతమాలిక
ఆమె ధరించిన తదుపరి ఆతనికిచ్చే ప్రణయ కానుక.
మార్గశిరపు వెన్నెల కాంతిలో
జలకాలాడ వచ్చిన జవ్వనులారా!
శత్రుసంహారి హరి సుగంధ పూలమాల ధరించినాడు
నందగోపుని కుమారుడు, యశోద ముద్దుబిడ్డడు
నీలమేఘ శ్యాముడు, పున్నమి చంద్రవదనుడు
మనకు స్నానపాత్రలనిండా నీరు నింపి ఇస్తున్నాడు
రండి! స్నానమాడి శుచిగా పార్వతీమాతను ప్రార్థిద్దాము!
జగతి నిండేలా ఆతని ఘనతను గానం చేద్దాం!"

రాజస్థాన్‌లో రాచకుటుంబంలో జన్మించినా తన ప్రేమను భగవానుడు శ్రీకృష్ణునికంకితం చేసి పన్నెండు వందలకు పైగా భక్తిగీతాలను రచించిన మహా

భక్తురాలు మీరాబాయి (1498–1547 A.D.). స్త్రీలను చూడనని నియమం పెట్టుకున్న గోస్వామిని "పురుషుడు శ్రీకృష్ణుడొక్కడే!" అని బోధచేసిన ఆమె గీతాలు భారతీయుల హృదయాలలో అజరామరంగా నిలిచిపోయాయి.

"ఈ ఆచారాలు, పట్టింపులూ నేను లెక్కచేయను.
నా కుటుంబ గౌరవాన్ని నిలబెట్టే యత్నమూ నేను చేయబోను.
నా మనోహరుని సౌందర్యాన్ని
ఆస్వాదించకుండా నేనొక్కక్షణం బతికి ఉండలేను.
హరి నీలవర్ణ కాంతిలో తడిసి నేను ముగ్ధనయ్యాను"

ఆ నందనందుని వంటివాడే మరో చిన్నిబాలుడు. గాబ్రియేల్ మిస్ట్రాల్ ఆతని గుణగణాలను కీర్తిస్తోంది– "ఆ శిశువు నునులేత పాదాలు శీతల ధూళి తగిలి నీలివర్ణాన్ని నింపుకున్నాయి. ఓ ప్రభూ! మంచూ, మట్టిబెడ్డలూ, గులకరాళ్లు తగిలి గాయపడిన ఆ చిన్ని పాదాలు రక్తమోడుతున్నాయి.

మానవుడు అంధుడు కదా! పట్టించుకోడు నీ పదముద్రల్నీ, నీ నిష్క్రమణాన్నీ! రుధిరంతో తడిచిన నీ పాదాలు నిలిచిన చోట అద్భుతమైన కాంతిపుంజం, సువాసన వెదజల్లే సుమంగా ఉద్భవిస్తోంది.... ఆ శిశువు చిన్ని పాదాలు రెండు గాయపడిన వజ్రాలు. జనులెట్లా దాటిపోగలరు. అవి విరజిమ్మే వెలుగును గమనించకుండా!"

సరోజినీ నాయుడు చెబుతోంది తన అనుభవాన్ని– "ఆ మంత్రవనపు వెలుగుకాంతుల మధ్య నేను ఒంటరిగా నిలబడ్డట్లు నేను ఓ రాత్రి కలగన్నాను. ఆత్మ అద్భుత పుష్పంలా వికసించగా, పక్షుల పాటలలో సత్యం ప్రతిధ్వనించి నక్షత్రాల వెలుగులో ప్రేమ ప్రతిబింబించింది. సెలయేటి నీళ్లలో శాంతి స్వచ్ఛంగా ప్రవహించింది"

లూయిస్ బెగాన్ తన జువాన్ పాట'లో ప్రేమ గురించి చెబుతున్నది– "ప్రేమ పలుచని శంఖమై పగిలినా ఒక్క చిన్న ముక్కను కూడా నేను దాచుకోను. సౌందర్యం శిథిలమై నేలరాలినా అచ్చెరువందను. ప్రేమకు ముగింపు ఉందని తెలియని వాణ్ణి స్నేహితుడిగా నేనంగీకరించను. ప్రేమ ముగింపును గుర్తించిన యువతిని ప్రేమికురాలిగా నేను అంగీకరించను. ఎందుకంటే తెలివిగల వాళ్లు సందేహించే దానిని అమాయకులు నమ్ముతారు. అందుకనే సుమా! ప్రేమ మోసం చేసేది ఎవర్ని?' అని చిక్కుప్రశ్న వేసింది లూయిస్ బెగాన్.

ఎలైన్ మేరియా అప్టాన్ అంటోంది– "నీవొక వృక్షాన్ని చూసినా, ఒక మేఘాన్ని స్వప్నంగా దర్శించినా నీలోనే ఒక వృక్షం ఉద్భవిస్తుంది. ఒక మేఘం రూపు దాలుస్తుంది. ఎడారి ఎండను భరిస్తూ కాక్టస్ కలబంద వృక్షమై కలలు కంటుంది.

మేఘం కష్టాల రూపమై చీదుతూ, ఏడుస్తూ వర్షాన్ని ధారగా కురుస్తుంది" అంటుంది తన 'స్వప్న కవిత్వం'లో.

మార్గరెట్ ఆట్‌వుడ్ 'స్వాతిశయం'తో అంటున్నది– "కవిత్వపు దాహానికి దూరంగా నీకు ముందో వెనకో నడవడానికి నీ హస్తాన్నందించు. మిగతావాళ్లు పదాలను స్పృశించడానికి, ప్రేమ రాహిత్యాన్ని ప్రేమించడానికి వాళ్లకు కాసింత ఒంటరి తనాన్నివ్వు. నాకు మాత్రం నీ హస్తాన్నందించు" అన్నదామె.

జేన్ హర్ష్‌ఫీల్డ్ దృష్టిలో– "హస్తమంటే ఒక బొటనవేలూ, నాలుగు మిగతా వేళ్లూ ఉన్న గుచ్ఛం కాదు. ఇన్ని కీళ్లూ, ఇంత కొవ్వూ, కాసిని పొంగే నీలినరాలూ, నదుల్లా పారుతున్న రేఖలూ, స్పర్శా సాధనమే కాదు. మేపుల్ వృక్షపు ఆకుపచ్చని హస్తాలు ధారగా కురుస్తున్న వర్షానికి దోసిలి పట్టవు. తనను తాను ఖాళీ చేసేది ఖాళీగా ఉన్న స్థలంలోకి జారిపడ్తుంది. ఆకాశం వేపు తెరచి ఉంచిన హస్తం ఒకే ఒక పారదర్శకమైన ప్రశ్న అడుగుతుంది. సమాధానం దొరకక తుమ్మెదల ఝుంకారంలా ఉప్పొంగి, ముసిరి, వైదొలగుతుంది" అని అభిమానంగా పలికిందామె.

ఎమిలి డికిన్‌సన్ అడిగింది– "కొండలపై నీడలు నడుస్తున్నాయి. స్త్రీ పురుషుల రూపంలో. అక్కడక్కడా ఓ ఇంద్రధనుస్సు. నలిగిన దారుల్లోని అడుగుజాడలు పొరుగువాళ్లకు దారి చూపుతున్నాయి. క్రమేపీ కనుమరుగవుతున్న దృశ్యాల్లాంటి మనల్ని, మనం నివసించిన బొరియల్ని మనమెందుకు తొందరగా పట్టించుకోం?

ఛార్లొటి బ్రాంటె సమాధానమిచ్చింది– "మనం విడిపోతున్నామని విలపించ నక్కర్లేదు. ఎడబాటును మంచి జ్ఞాపకంగా మలుచుకో! ఈ బంధాల శృంఖలాలను విరగగొట్టి ముందుకు సాగుదాం!"

సాగడం సరే! మా హక్కులపై మీ పెత్తనం ఏమిటి! అని అడుగుతోంది ఏనె లూయిసావాకర్–

"మా హక్కుల్ని నీవు దోచుకోలేవు, ఆలోచనలనూ మార్చలేవు.
మా హృదయాలు నిర్దేశించుకున్న ఋజుమార్గం నుంచి ఏమార్చలేవు.
ఇన్నాళ్లూ నీవు గీసిన ఇల్లనే పరిధిలో బందీలై ఉన్నాము.
ఇప్పుడు స్వేచ్ఛతో మా ఆనందాన్ని అందరితో పంచుకొంటున్నాము.
ఎవరి గుర్తింపూ అర్థించని ఈ స్వేచ్ఛాజీవనమే మా కోరిక
మమ్మల్ని ప్రేమించని హృదయాలకు మా జాడలే తెలియరావిక!

–అని ఏనె లూయిసావాకర్ గట్టిగా చెబుతుంది.

"నా సమాధి దగ్గర నిలబడి విలపించకు. నేనక్కడలేను. వేగంగా వీచే సహస్రవాయు పుంజాల్ని నేను! మంచుపై మెరిసే వజ్రపుకాంతిని నేను! పండిన ధాన్యంపై ప్రకాశించే వెలుతురును నేను! శరత్కాలపు సున్నితమైన వర్షాన్ని నేను! అర్ధరాత్రి అందంగా ప్రసరించే నక్షత్రకాంతిని నేను! నా సమాధి దగ్గర నీవు దుః ఖించకు? నేనక్కడలేను? ఎందుకంటే నేను మరణించలేదు!" అంటున్నది మేరీ ఫ్రెయె.

స్వేచ్ఛ నుండే స్వచ్ఛమైన చిరునవ్వు పుడ్తుంది. ఆ చిరునవ్వుల మంత్రజాలంలో సమస్త బాధలూ సమసిపోతాయి. ఊయలనూపే చేతులే ప్రపంచాన్ని పరిపాలిస్తాయి. ఆమె చిరునవ్వులే రేపటి ప్రపంచానికి దారులు చూపుతాయి. అందుకే లిసెల్ మ్యుల్లర్ అంటున్నది– స్త్రీల చిరునవ్వులు అన్యాయపు దర్బారులను అగ్నికి ఆహుతి చేస్తాయి. బూటకపు బుజువులు దగ్ధమై వెండి వెలుతురు ధగధగ మెరుస్తుంది. చట్టసభల గవాక్షాలు తెరవబడి ఊకదంపుడు ఉపన్యాసాలు 'ఉఫ్'మని ఎగిరిపోతాయి.

స్త్రీల నవ్వులు వృద్ధుల అద్దాలపై మసకను తొలగించి వారిని వయసు కుర్రాళ్లుగా గంతులు వేయిస్తాయి. చీకటి జైళ్లలో మగ్గే ఖైదీలకు పగటి కాంతిని ప్రసాదిస్తాయి. విడిపోయిన నదిగట్లకు ప్రవాహపు నీటి సఖ్యతతో స్నేహాన్ని చిగురింప జేస్తాయి.

ఎంత గొప్ప భాష స్త్రీల చిరునవ్వుల ఘోష! అందకుండా ప్రవహించేదీ, అధికారానికి లొంగనిదీ, చట్టం, శాసనాలూ, పవిత్ర వాక్యాలూ, సమాజం ఏర్పడక మునుపే మనం వెల్లివిరిసే ఆ నవ్వుల్ని విన్నాం! స్వేచ్ఛను అర్థం చేసుకున్నాం!

"When poems stop talking about the moon and begin to mention poverty, Freedom, trade unions, color, gender and colonies, some body tells the police"

- Langton Hughes
(in My adventures as a social poet - 1947)

"When man, governed by reasonable laws, enjoys his natural freedom, let him despise woman, If she donot share it with him"

- Mary Wollstonecraft
(in A Vindication of the Rights of woman 1992)

✧✧✧✧✧

# 9. ఆర్యుల కలల్లో కనిపించి హాణికించి...

'శ్రీ భూ' అని సిరులూదకుండానే, అశుభప్రదమైన శ్లోకంతో ఈ వ్యాసాన్ని ప్రారంభిస్తాను. ఎందుకంటే, మంగళకరమైన విషయాలతో లెక్కకు మించిన వ్యాసాలిప్పటికే విచ్చేసి మన తెలుగు వెలుగుల్ని తెగ విరజిమ్మేశాయి గనుక. అన్ని గొడవలకూ మూలకారణం ఆర్థికపరమైన జంఝాటనలే అన్నట్లు ఇదీ అంతే కదా!

**"మూర్ధ్ని వంశలతా దీనాం సంభవో వయసాం తథా**
**నీలయో ముండతో కాక గృద్ధ్రా ద్వైః పరివారణమ్**
**తథా ప్రేత పిశాచస్త్రీ ద్రవిడాంధ్ర గవాశనైః"**

– అష్టాంగ హృదయం–వాగ్భటుడు (శరీరస్థానం–6–48)

శిరస్సు నందు వెదురుతీగలు మొలుచుట, పక్షులు గూళ్ళు కట్టుట, కాకులు గద్దలు చుట్టూరా పరివేష్టించుట, ప్రేత, పిశాచ, స్త్రీ, ద్రావిడ, ఆంధ్ర, గోమాంస భక్షకులు తనను చుట్టుముట్టినట్లు కల వచ్చిన అది అశుభమని ఎరుగవలెను.

ఆంధ్రులంటే ఆర్యులకెంత భయమో మనకు దీనివలన ఓ రకంగా అర్థమవుతోంది. వాళ్ళు ఆంధ్రుల్ని, ద్రావిడుల్ని, ప్రేత, పిశాచ, ఆర్యస్త్రీలతో సమానంగా గౌరవించేవారని కూడా సరిపెట్టుకోవచ్చును. ఆంధ్రులూ, ద్రావిడులూ ఆ రకంగా సమాన ప్రతిపత్తికలవారైతే మనకీ నిమ్నస్థాయి ఎలా వచ్చింది? వాళ్ళు బాగా అరవగల వారు కనుక వారికాపేరూ, మనకు అరవడమూ కరవడమూ చేతకాక అంధకారంలో ఉండిపోవడం చేత మనకీ పేరు వచ్చిందనేది నిన్నమొన్నటి వరకూ మనమున్న అంధకారాన్ని బట్టి నిజమేమో అనిపిస్తుంది.

అమరకోశంలో ఆంధ్ర ప్రసక్తిలేదు. హిమాలయాలకు దక్షిణాన, దక్షిణ సముద్రానికి ఉత్తరాన ఉండి, వర్షపాతము ఎక్కువగా ఉన్న ప్రాంతమే భారతవర్షం. ఈ దేశంలో ఈశాన్య దిక్కు నుండి నైరుతి మూలకు ప్రవహించుచూ పడమటి సముద్రమును కలియు నదిపేరు శరావతి. శరావతీ నదికి దక్షిణమున ఉన్నది దక్షిణ దేశము. ఉత్తరమున ఉన్నది ఉదీచ్యము. శిష్టాచారరహితమైన కామరూపాది దేశములు మ్లేచ్ఛదేశములు. హిమాలయములకు, వింధ్యపర్వతాలకు మధ్యనున్నది మధ్యదేశము. దీనిలో ఆర్యులు, పుణ్యులు, ధార్మికులు నివసిస్తారు.

'అంధకారో స్త్రియాం–ధ్వాన్తం తమిస్రం తిమిరం తమః' అంధకారమే చీకటి అనుకుంటే అంతకంటే అధ్వాన్నమైనది తమిస్ర, తిమిర, తమస్సులు. కాబట్టి వాళ్ళు కటిక చీకటిలో అప్పట్లో ఉన్నా, ఇప్పుడు కాస్త వెలుగు దొరకంగానే అందిపుచ్చుకున్నారు తమిళ్ తంబులు.

డాక్టర్ వరదరాజన్ రచించగా తిమ్మావఝుల కోదండరామయ్యగారు అనువదించిన తమిళ వాఙ్మయ చరిత్రములో (1982) క్రీస్తుపూర్వము 500 నాటికి సంగసాహిత్యము మొదలైందని వారు ఘంటాపథంగా చెప్పియున్నారు. ఇంచుమించు ఆ కాలంలోనే (క్రీ.పూ. 3 శతాబ్దం) తోల్కాప్పియనార్ వ్రాసిన తోల్కాప్పియం అనే లక్షణగ్రంథములో ఉత్తరమున వేంకటాచలము నుండి దక్షిణమున కన్యాకుమారి అగ్రము వరకూ తమిళము వ్యాపించి ఉన్నదని వ్రాసినారు.

ప్రాచీన ద్రావిడ భాష నుండి ఉత్తరభారతదేశమున ప్రాకృతము, పాళీభాష లేర్పడగా అక్కడక్కడ కోలమి, పార్జి, నాయకి, కువి, మాల్టా, ఒరోవన్, గదబ, బ్రాహుయి అనుభాషలు ద్రావిడభాషకు చెందినవిగా శాస్త్రజ్ఞులు విశ్లేషించారు. తిరుపతి కొండకు ఉత్తరముగా ఉన్నవారు తెలుగువారైరి. కాగా కరునాట్టు తమిళు కన్నడముగా, తుళునాట్టు తమిళు తుళుగా, మలైనాట్టు తమిళు మలయాళముగా వ్యవహరించబడినవని కొందరి అభిప్రాయం. తమిళ, కన్నడ, మలయాళ, తెలుగు భాషలలో సుమారు అయిదువేల శబ్దాలు ఇంకను ఉమ్మడిగానే ఉన్నాయి.

ఇ.యన్. ఫాలైజ్ తన 'మానవ వంశవృక్షం' 'మానవ తెగలు' అన్న వ్యాసాలలో కొన్ని అద్భుత విషయాలను వెల్లడించారు. కోతులు, వాలిడుల కన్నా మానవుడు అతివేగంగా అభివృద్ధి చెందడానికి కారణాలు 1. బైపెడలిజం – రెండు కాళ్ళపై నిలబడగలగడం, 2. స్టీరియో స్కోపిక్ విజన్– చూపులో తీక్షణత, నిశ్చలత్వం, 3. అపోజింగ్ థంబ్ – బొటనవేలు అభివృద్ధి.

ఆఫ్రికా అడవుల నుంచి నాలుగున్నర మిలియన్ సంవత్సరాల క్రితం ప్రారంభమైన మానవుల వలస ఆహారపు అన్వేషణలో లక్షసంవత్సరాల కొకసారి వచ్చి 25–30 వేల ఏళ్ళుండే మంచుయుగాల అంచులవెంబడి చస్తూ బతుకుతూ ఆఖరి మంచుయుగం 45 వేల సంవత్సరాల క్రితం ప్రారంభం కాగా ఏర్పడిన ల్యాండ్ బ్రిడ్జిలవలన ఆసియా నుంచి మానవజాతి అమెరికా, ఆస్ట్రేలియాలాంటి సుదూర ప్రాంతాలకు వెళ్ళి క్రీ.శ. 10000 సంవత్సరాల వరకూ స్థిరపడుతూనే ఉన్నారు.

ఈ పరిస్థితులలోనే వాతావరణాన్ని బట్టి శరీరవర్ణాల్లో మార్పులు రావడం, రాతిపనిముట్ల వాడకంలో నైపుణ్యం వృద్ధి చెందడం గోడలపై చిత్రాలు (35000 సం), వ్యవసాయం, పశుపోషణ మొదలై దేశదిమ్మరి మానవుడిలో కొందరు స్థిరనివాసులుగా కాగా గ్రామాలు ఏర్పడ్డాయి. పదకొండువేల సంవత్సరాలప్పుడే ఆఖరి మంచుయుగం అంతరించి ప్రపంచమంతటా జలప్రళయాలు సంభవించి వాటి జ్ఞాపకాలు అనేక ప్రాక్కథల్లో, శ్రుతుల్లో మననం చేయబడ్డాయి. ధ్వనులు,

సంజ్ఞలు, అర్థవంతమైన పదాలై, వాక్యాలై కీలలిపులు, చిత్రలిపులు, ఆ తరువాత భాషలు, సవాలక్ష యాసలతో మాటలు, అక్షరమాలతో అక్షరాలు, కావ్యాలు మొదలై చరిత్ర రికార్డు కావడం మొదలైంది. మనకు తెలిసిన మానవ చరిత్రే పదకొండువేల సంవత్సరాలది.

ఇ.యన్. ఫాలైజ్ 'మిరాకిల్' అనే గ్రంథంలో ఇలా వ్రాసాడు. ప్రపంచంలోని మానవ తొలి వలసలన్నీ ఎందుకో కారణం చెప్పలేం కాని, అవి పామీరు పీఠభూమిలోని దక్షిణప్రాంతం వేపే సాగాయి (ఇండియా). ఈ వలసలు అలలు అలలుగా వచ్చి ఎక్కువమంది అక్కడే స్థిరపడిపోగా, మొదటచేరినవారిని ఆ తరువాత వచ్చినవారు నిర్మూలించడమో, వారిలో కలిసిపోవడమో చేయడం వలన ఇండియాలో ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనన్ని జాతులు ఉన్నాయి.

1) నీగ్రిటోలు:– ఆఫ్రికా నుంచి వచ్చిన తొలివలస. నాగులు, ఏనాదులు, ఎరంబులు, ఇరులలు, కదిరులు, పాలయన్లు.

2) ప్రొటో ఆస్ట్రలాయిడ్లు:– సంతాలు, ముండా, అసుర, కొరవ, గదబలు– వీరే 'నిషాదులు'గా వ్యవహరించబడ్డారు. వ్యవసాయం ప్రారంభించింది వీరే.

3) ద్రవిడియన్లు:– మెడిటేరియన్ (మధ్యధరా) ప్రాంతం నుంచి వచ్చినవారు. సుమేరియన్ జాతికి చెందినవారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషా కుటుంబాలు ఈ జాతికి చెందినవి. వీరు మధ్యధరా ప్రాంతం నుంచి భారత దేశపు అంచులవరకూ వ్యాపించినారు.

4) ఇండో ఆర్యన్లు :– ఆర్యులుగా వ్యవహరించబడినవారు. నార్డిక్ జాతీయులు. శ్వేతవర్ణులు. క్రీ.పూ. 2500 నాటి నుంచి భారతదేశంలో అలలు అలలుగా ప్రవేశించినారు.

5) మంగోలాయిడ్లు :– సిక్కిం, భూటాన్ ప్రాంత ప్రజలు.

6) పశ్చిమ బ్రాకిసెపాలిక్‌లు :– వీరి సంఖ్య తక్కువ.

మానవుల అభివృద్ధిలో నిప్పు (80,000 సం) చక్రం (కీ.పూ. 3500) ముఖ్యపాత్ర వహించగా సుమారు అదే సమయంలో చిత్రలిపులు, కీలలిపులు– క్యూనిఫారం (సుమేరియన్లు) ఉన్నట్లు ఆధారాలు దొరికినాయి. ఫోనిసియన్ల అక్షరమాల, ఈజిప్టు ఇతర ప్రాంతాల్లో క్యాలెండర్ నిర్మాణాలు మానవునిలో అభివృద్ధి అలలు అలలుగా అనేక చోట్ల ఒకేరకమైన ఆలోచనలుగా రావడం గమనించవచ్చును.

క్రీస్తుపూర్వం 3300 నుంచి 1890 వరకూ సుమేరియన్లు మధ్యధరా ప్రాంతాన్ని పరిపాలించారు. వారిని సెమైట్లు (అస్సిరియన్, అరామిక్, హిబ్రూ,

ఫొనిషియా, అరబిక్, ఇథియోపిన్ భాష మాట్లాడే ప్రజలు) (షెమ్ వంశీయులు) ఓడించారు. ప్రపంచ తొలి ఇతిహాసంగా పేర్కొనబడ్డ 'గిల్గామేష్ చరిత్ర'లోని జలప్రళయ ఘట్టం ఇంచుమించు భాగవతంలో వర్ణించబడ్డ ద్రవిడాధీశుడైన సత్యవ్రతుని కథలానే ఉండడం వీటి ప్రతిధ్వనులు అస్సురో బాబిలోనియన్ల కథల్లో, బైబిల్‌లోని 'నోవాస్ ఆర్క్'లో మనం గమనించగలం.

తొమ్మిది వాకిళ్ళున్న వావిలోన్ (బాబిలోన్) పట్టణం, ఉర్, నిప్పూర్, మార్దుకు, నాబు, ఎంకి, ఎంకిడు లాంటి దేవతలు, ఇస్తారి, తమ్మజు లాంటి గ్రామదేవతలు. ఊరికో అధిష్ఠానదేవత, వంశపారంపర్య పాలనాధికారాలు, అక్కడా ఇక్కడా దొరికిన కీలలిపిలో ఉన్న మట్టిబిళ్ళలు, ద్రావిడలిపికి సంబంధించిన హరప్పా, మొహెంజోదారో లలో ఇంకా అర్థం చేసుకోని మట్టిబిళ్ళలు, పురనిర్మాణాలు ద్రావిడుల, సుమేరియన్ల బృహత్ శిలానిర్మాణ సంస్కృతి, ఆర్యులను ధిక్కరించి జైన, బౌద్ధమతాలను అవలంబించి పాషాండులైన తీరూ మనకు ద్రావిడుల ప్రత్యేకతను తెలియజేస్తాయి.

గోవా ప్రాంతంలో గిల్గామేష్ చిత్రాన్ని పోలిన శిల్పాలూ, సుమేరియన్ పదాల వాడుక (వ్యవసాయ భూములకు), కదంబుల రాజు గహల్లదేవుడు (క్రీ.శ. 960) తనను వ్యాఘ్రమారుడుగా (గిల్గామేష్ సింహాన్ని చంపుతున్న చిత్రం లాంటిది) అభివర్ణించుకోవడం, తెలుగువారి లావాదేవీలు సుమేరియన్ ప్రాంతంలో మట్టిబిళ్ళల రూపంలో లభ్యం కావడం ఆంధ్రుల ప్రాచీనతను తెలియజేస్తున్నాయి.

ఆర్యుల రాకతో గుర్రాలు, విల్లంబులు, సంచారజీవనపు తెగువ, మొండితనం అప్పటికే పురాల్లో స్థిరనివాసులైన శాంతిప్రియులైన ప్రజల్ని ఓడించింది. మొదటి తరం ఆర్యులు స్థానికులతో కలిసి పాలసముద్ర మథనం చేసి అమృతతుల్యమైన వస్తువుల్ని పొందలిగారు. పంపకాలలో తేడా దేవాసుర యుద్ధమైంది. ద్రావిడులు వామనావతారం నాటికి దక్షిణపథానికి నెట్టివేయబడ్డారు. అదే పాతాళలోకం. చీకటి, అంధకారలోకం. బలి బలిచేయబడ్డాడు. దితి గర్భం ముక్కలై మరుత్తుల జననం (అక్షరాల ప్రారంభం) జరిగింది.

రామావతారం కాలం నాటికి తొలితరం ఆర్యులు రాక్షసులై స్థానిక నరమాంస భక్షకులతో కలిసి జనపదాలేర్పరచుకున్నారు. ఇక్కడే మనకు మానవుల ప్రసక్తి, వీరికి సాయం చేస్తూ పరోక్షంగా కనపడే దేవతలు, రాముడు జన్మించి రాక్షస నిర్మూలనం చేసి అంధకారమయమైన దక్షిణాపథాన్ని కైవసం చేసుకోవాలన్న ఆర్య ఆలోచనలకు రాముని మార్గం రామయణ అవసరం ఏర్పడింది. భాషకూడా హనుమంతుని ఆలోచనల్లో (సుందరకాండ–త్రిజటాస్వప్నం తరువాతి ఘట్టం) రాక్షసుల సంస్కృతం, మానవ సంస్కృతంగా ఉన్నట్లు మనకవగతం అవుతుంది.

బృహస్పతి శాపంతో గుడ్డివాడుగా పుట్టిన మమతా ఉథచ్యుల కుమారుడు దీర్ఘతముడి వలన బలిక్షేత్రమునందు పుట్టిన అంగ, వంగ, కళింగ, ఆంధ్ర, సింహ, పుండ్రక అనే ఆరుగురు పుత్రులు తూర్పుదేశాలకు పోయి వారి పేర్లతో ఆరు రాజ్యాలను స్థాపించుకున్నారు. వాటిలో ఆంధ్రరాజ్యం మాత్రమే అంధకరాజ్యంగా ఎందుకు రావాలి? దీర్ఘతముడి బిడ్డల్లో వీడొక్కడే గుడ్డివాడా? మిగతావాళ్ళు కాదా?

శాతవాహన సామ్రాజ్యం, అశోకుని మరణానంతరం, చిముఖుడితో (శ్రీముఖుడు) ప్రారంభమై నాలుగు వందల యాభై ఏళ్లు (క్రీ.పూ. 235–క్రీ.శ. 218) సాగింది. ముండా శబ్ద పదాలైన శాతకర్ణి, శాతవాహన పదాలు వీరిని 'గుర్రం' కులదేవతగా ఉన్న కుదురును తెలుపుతాయి. కె.ఎ. నీలకంఠశాస్త్రిగారు – ఆంధ్ర అనే శబ్దం 'జాతి' నామంగా, శాతవాహన శబ్దం రాజవంశంగా, 'శాతకర్ణి' అనే శబ్దం ఇంటిపేరుగా వివరించారు. శాతవాహనుల ప్రధాన భూభాగంగా గోదావరి కృష్ణా నదుల మధ్య ప్రాంతాన్ని (తెలంగాణ); పైఠాన్, ధరణికోటల మధ్యనున్న ప్రదేశం కేంద్ర బిందువుగా వారు తమ సామ్రాజ్యాన్ని విస్తరించారు. మొదటి, రెండవ శాతకర్ణులు, హాలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, రెండవ పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి మొత్తం 26 మంది రాజులు తమ సామ్రాజ్యాన్ని నలు దిక్కులా దక్షిణాన చెన్నపట్టణం వరకు విస్తరించారు. గ్రీకు, రోమనులతో వ్యాపారాలు, జైన బౌద్ధ మతాల అభివృద్ధి, సంస్కృతానికి ప్రాధాన్యత, ప్రాకృత, పాళీ భాషలలో కూడా వ్రాయబడ్డ కావ్యాలు అనేక స్థానిక భాషలు, వాటిలోని 'దేశి' అనే స్థానిక భాష నేటి తెలుగు భాషకు సన్నిహితంగా ఉందని ఆచార్య సర్కార్ అభిప్రాయపడ్డారు. ఆనాటి లిపులలో ముఖ్యమైనవి బ్రాహ్మి, ఖరోష్టి, ద్రవిడ లిపులు.

తమిళ సంగం కాలానికి ముందే విడివడిన తెలుగుప్రజను ఆర్యావర్తం నుంచి శపించబడో, వెల్లగొట్టబడో వచ్చిన ఆర్యులు తమ శ్వేతవర్ణంతోనో, బుద్ధిబలంతోనో స్థానికులను విస్మయపరచి 'ఇంకా' జాతి వారిని, 'అజ్టెక్'లను వశపరచుకున్న స్పానిష్ సైనికుల్లా తమ తమ రాజ్యాలను స్థాపించుకున్నారనిపిస్తుంది. మణి ప్రవాళానికి అంగీకరించక తమిళభాష తన, స్వతంత్ర ప్రతిపత్తిని నిలబెట్టుకోగలిగింది. సర్దుబాటు తనంతో కన్నడ, తెలుగు భాషలు, కల్తీ చేయబడ్డాయి. అయినా ఇప్పటికీ అచ్చ తెలుగు పదాలు ఉర్దూ రాజభాషగా రాజ్యమేలినప్పటికీ తెలంగాణ పల్లెల్లో జీవించి అచ్చమైన తెనుగు తనానికి అద్దం పడ్తున్నాయి.

ఈజిప్టు పిరమిడ్లలో (క్రీ.పూ. 2500) సుమేరియన్ శిథిలాల్లో, మట్టి బిళ్లలలో దొరికన ఆధారాలు తెలుగు ప్రాచీనతకు సరిపోవా?

ద్రావిడ భాషలలో ఏదో ఒకదానికి ప్రాచీనతను అంటగట్టేప్పుడు అంతకంటే ప్రాచీనమైన ముండా లాంటి భాషలను పునరుద్ధరించాలి కదా?

నాలుగు ద్రావిడ భాషలకు ప్రాచీనతా గుర్తింపునిచ్చి ఆర్థిక సహకారం చేస్తే ఆ అసంతృప్తి అణగిపోతుంది కదా!

లేదా ఆ వందకోట్లను నలుగురికి పంచేయవచ్చును–కాలరేఖను అటూ ఇటూ జరపకుండా!

అంధకులు సర్దుకుపోతార్లే అన్న గుడ్డి ధైర్యమే ఈ తాత్సారానికి కారణమా? ఈ దుష్ట స్వప్నం ఎప్పుడు సమసిపోతుంది?

చరక సంహితలో ఇలా చెప్పబడింది.

**'గృధ్రో లూకశ్వ కాకా ద్వైః స్వప్నే యం పరివార్యతే**
**రక్షః ప్రేత పిశాచ స్త్రీ చండాల ద్రవిడ ఆంధ్రకైః**

కలలో ఆంధ్రులు కనిపిస్తే అరిష్టం. కాబట్టి వందకోట్లివ్వాల్సిన ఆర్యుల కలల్లో కనిపించి వాళ్లని వణికింపజేసే పోరాటం చేస్తేగాని మన ప్రాచీనతకు వాళ్ళు వ్రాసిన శ్లోకాలకు ప్రామాణ్యం రాదు. పదండి! పోరాడితో పోయేదేముంది గనుక! పదండి ముందుకు!

✧✧✧✧✧

# 10. కవిత్వం రాయాల్సిందేనా?

కవులకు యోజనాల దూరంగా ఉంటున్న జనాలకు కవిత్వం వలన ఏమన్నా ప్రయోజనం ఉందా? పోనీ ఆ రాసే కవులకైనా? – సందేహం ఈనాటిదేం కాదు. కవిత్వం ఒక అల్కెమీ అన్నాడు బాలగంగాధర్‌తిలక్. మరి ఈ విరస, అరస, సరసవాదం వలన వచ్చిన పుత్తడి ఏమయ్యింది. పుంఖాను పుంఖాలుగా వస్తున్న ఈనాటి కవిత్వపు వరదల్లో కొట్టుకుపోతోంది కవులేనాయె. సామాన్య జనాలకి సిన్మావర్షాలే కదా దిక్కు. ఇటువంటివి సవాలక్ష సందేహాలు.

ఒకప్పటి సాహిత్య పత్రికలు లక్ష్మీపుత్రికలు కాలేక మూలబడ్డాక కవుల కోసం ఇప్పటి పత్రికలు కొత్త పేజీలు, పేచీలు తీసుకువస్తుంటే కొన్ని నినాదాల్ని, వాదాల్ని కౌలుకు తీసుకున్న కొందరు కవి సైనికులు కలం ఖడ్గాలతో ఒకరినొకరు చీరేసుకుంటున్న సందర్భానికి మామూలు పాఠకులు సాహిత్య పేజీని చూడ్డానికి భయపడ్తున్నారని వీళ్లకు తెలుస్తుందో లేదో! కవుల్లో మహాకవులు పుట్టాక ఆదికవి ఎవరు? మా వీధికవి ఎవరు? అనే గొడవల్లో కవులు కమ్యూనిస్టు పార్టీ చీలిపోయినట్లు చీలిపోయి ఆవిష్కరణ సభలు బహిష్కరణ సమావేశాలై సాహిత్యశాలల్లో చిచ్చురేగడం గమనిస్తూనే ఉన్నాం కదా! గండపెండేరాలు, గజారోహణలు పోయి కవులొస్తున్నారు జాగ్రత్త అని ప్రజలు ఇళ్లు అద్దెక్కూడ ఇవ్వడానికి భయపడడం లేదా?

భారతి లాంటి సాహిత్య పత్రికలు ఆర్థికంగా భారమయ్యాయి. పుస్తకాన్ని కొని చదివే కవులున్నారో లేరో! విమర్శ పరామర్శగా మారింది. పరస్పర సహకార పద్ధతిలో, వాయిదాల్లో చంపడానికి కవితాసంపుటాలు వెలువడ్తున్నా తన పేజీ మాత్రం చదువుకొని మిగతా వాళ్ల కవిత్వాల్ని పట్టించుకోకపోవడం ఈనాటి కవి కాలధర్మమైంది. కష్టజీవికి అటూఇటూ ఉండాల్సిన కవి, కలర్ టీవీకి అటు ఇటూ తెరపైనా, లోనా ఉండడానికి తాపత్రయపడ్తున్నాడు.

'అన్ని సాహిత్య దృశ్యాల్లో ఈ ఘట్టం నాకు అత్యంత విచారాన్ని కలిగిస్తుంది – కవిత్వాన్ని విముక్తం చేసి తాము సమాధులైన ఈ చిన్ని పత్రికల్ని చూస్తుంటే' –అన్నాడు 'కీత్‌ప్రెస్టన్–లిబరేటర్స్‌లో). కదిలే అచ్చుయంత్రాన్ని కనిపెట్టిన గ్యూటెన్‌బర్గ్ అప్పుల పాలై అనాథగా మరణించాడు (1468లో). 200 కాపీలే ముద్రించబడిన ఆనాటి గ్యూటెన్ బర్గ్ బైబిల్ ప్రతులు 4 మాత్రమే ఉన్నాయట. ఇప్పుడు ఒక్కొక్క పుస్తకం విలువ 1 మిలియన్ పౌండ్లు.

అనేకమంది కవుల, రచయితల జీవనచిత్రాల్ని చూస్తుంటే ఆశ్చర్యం, భయం, విచారం కలుగక మానవు. యూరోపియన్ కవుల్లో మొదటివాడిగా చెప్పబడ్తున్న

హెసియాడ్ (క్రీ.పూ. 800) కష్టాల్లో ఉన్న రైతుబిడ్డ. తన వర్క్స్ అండ్ డేస్‌లో మానవుని దశలను వర్ణించినవాడు. ప్రఖ్యాత ఇలియాడ్, ఒడెస్సీ గ్రంథాల రచయితగా పేరుబడ్డ కవి, గాయకుడు హోమర్ గుడ్డివాడంటే ఆశ్చర్యం కలుగకమానదు. డాంటే తన జీవితంలో రెండేసార్లు చూసి ప్రేమించిన అమ్మాయికి 'బియాట్రిస్' అని పేరుపెట్టి తన డివైన్ కామెడీ, న్యూలైఫ్ గ్రంథాల్లో ఆమెని అద్భుతంగా వర్ణించాడు.

'ఛైల్డ్ హెరాల్డ్స్ పిల్‌గ్రిమేజ్'తో ఒక్కరాత్రిలో ప్రసిద్ధికెక్కిన లార్డ్‌బైరన్ కవి, అంతకు మించి వీరుడు. టర్కీ నుంచి గ్రీసుదేశపు విముక్తి పోరాటంలో పాల్గొన్న ధీరుడు. కానీ ప్రియురాలి దృష్టిలో అతడు బ్యాడ్, మ్యాడ్, డేంజరస్ ఫెల్లో. టెన్నిసన్ తండ్రి పచ్చి తాగుబోతు. అన్నదమ్ములు పన్నెండు మందిలో ఇద్దరు పిచ్చివాళ్లు. ఒకడు తాగుబోతు, ఇంకొకరు వ్యసనపరుడు. మరొకడు దౌర్జన్యపరుడు. అటువంటి కుటుంబలో పెరిగినా టెన్నిసన్ 'ద చార్జ్ ఆఫ్ ద లైట్ బ్రిగేడ్' లాంటి అద్భుత కావ్యాల్ని రాయగలిగాడు. 'రాబిన్‌సన్ క్రూసో' రచయిత డేనియల్ డెఫో చర్చిని నిందించినందుకు బొండకొయ్యలో (పిల్లరీ) నిర్బంధించబడ్డాడు. అభిమానులు అండగా నిలవగా ఆ శిక్షలో ఉండగానే 'హైమన్ టు పిల్లరీ' అనే వ్యంగ్య కవిత వ్రాసినందుకు మళ్లీ శిక్షించబడ్డాడు. 564 మిస్టరీ నవలలు వ్రాసిన జాన్ క్రీసీ (1908–73) మొదటి పుస్తకానికి 743 'రిజక్షన్ స్లిప్స్' వచ్చాయట. ఆయన ఓపికకు మన జోహార్లు. స్టీవెన్‌సన్ 'పీడకల' కని కేకలు పెడ్తుంటే భయపడ్డ ఆతని భార్య నిద్రలేపాక, మూడురోజులు రేయింబవళ్లూ కష్టపడి పూర్తిచేసిన నవల 'ద స్ట్రేంజ్ కేస్ ఆఫ్ డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్'. ఇంతా చేస్తే భార్యకు నచ్చక మాటా మాటా పెరిగి రాసిన రాత ప్రతిని తగలబెట్టాడు. ఆనక తీరిగ్గా బాధపడి మళ్లా మూడురోజులు కష్టపడి 30,000 పదాలున్న ఆ నవల రాస్తే ఈసారి అర్ధాంగీకారంతో 1886లో ప్రచురించాడు. (తెలుగులో వచ్చిన మానవుడు–దానవుడు, అపరిచితుడు లాంటి సిన్మాల అంతరార్థానికి ఈ పుస్తకమే కారణం).

'ఏవి తల్లీ! నిరుడు కురిసిన హిమ సమూహములు' అని శ్రీశ్రీ అనువదించిన అద్భుత కవితా వాక్యాలు రాసింది ఫ్రెంచి కవి ఫ్రాంకాయిస్ విలాన్. అతడు తిరుగుబోతు, దొంగ. 1455లో ఒక ప్రీస్ట్‌ను హత్య చేసినందుకు పారిస్ నుంచి బహిష్కరించబడ్డాడు. ఆ తరువాత బార్ గొడవల్లో చంపబడ్డాడంటారు. థామస్ ఛాటరాన్ అనే పదహారేళ్ల యువకవి (1752–1770) థామస్ రౌలీ అనే పదిహేనో శతాబ్దపు మిథ్యాకవి రాసినట్లుగా ప్రచురించిన పద్యాలు ఫోర్జరీలుగా విమర్శించ బడడంతో అవమానంగా భావించిన ఛాటరాన్ తన 18వ ఏట ఆర్సెనిక్ (ఎలుకల మందు) తిని ఆత్మహత్య చేసుకున్నాడు.

జాలియస్ సీజర్ మరణానంతరం గద్దెనెక్కిన మార్క్ ఆంటోనీను విమర్శించి నందుకు ఆనాటి ప్రఖ్యాత వక్త, ఆంటోనీ పాత స్నేహితుడు సిసిరో (106-43 క్రీ.పూ.) దేశ బహిష్కారానికి గురైనాడు. గ్రీసు దేశానికి పారిపోబోతున్న అతడిని అంటోనీ సైనికులు వేటాడి చంపి, పంపిన 'సిసిరో' తల, కుడిచేయిని రోమ్‌లోని ఫోరంలో ఉపన్యాసవేదిక (రోస్ట్రమ్)పై ప్రదర్శించారు. తల- ఆంటోనీకి వ్యతిరేకంగా మాట్లాడినందుకు. కుడిచేయి- వ్యతిరేకంగా వ్రాసినందుకు. అందుకే నాకు ఎప్పుడూ నవంబర్ 1, 1939 టైమ్స్ పత్రికలో ప్రచురించబడ్డ ఈ పద్యం గుర్తుకొస్తుంది.

Beware of paper, pens and ink;
Beware of talking when you drink;
Beware of saying what you think;
For many good fellows have swing in a noose;
For letting their pens or their tongues run loose.

కాబట్టి కవిత్వ ప్రయోజనాల్ని ఆశించే ముందు ఈ కవితను గుర్తుచేసుకుంటే కవులు కాస్త ఉద్రేకాన్ని ఉపశమించుకుంటారేమో! కవిత్వానికి ఆరోగ్య ప్రయోజనాలున్నాయన్న విషయాన్ని జాక్ జె లీడీ, డగ్లాస్ హిచింగ్స్ వంటి మానసిక వైద్యులు తమ పుస్తకం 'పొయెట్రి థెరఫీ'లో ధృవపరిచారు. మానసిక అంతస్సంఘర్షణను నిలువరించడానికి కవిత్వం ఉపయోగపడ్తుందని వీరి అభిప్రాయం. కవిత్వమనేది లయబద్ధమైన వాహిని అన్నాడు కదా కార్‌లైల్. సంగీతానికున్నట్లే కవిత్వానిక్కూడా, రాగాలు రోగాలు కుదిర్చినట్లు, శక్తి ఉందని వీరి అభిప్రాయం. కవిత్వంలో ఉండే లయ, రిథమ్ శరీరంలోని బయోరిథమ్స్‌ను ప్రభావితం చేస్తుందట. కవిత్వాలంకారాలు ముఖ్యంగా మెటాఫర్ (రూపకాలంకారం) వృద్ధాప్యంలో ఉన్నవాళ్లకు ఊరట కలిగిస్తుందని సిల్వియా బేరన్ అభిప్రాయం.

'తలనొప్పికి ఏస్ప్రిన్ బదులు ఇవిగో ఈ రెండు కవితలు చదువు' అని డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఇచ్చేరోజులు వచ్చేస్తున్నాయి. అయితే రాంగ్ డయాగ్నోసిస్, రాంగ్ ప్రిస్క్రిప్షన్లు వల్ల చదవరాని కవితలు చదవరాని సమయాల్లో చదివితే వ్యాధి ముదరవచ్చు. తిరగబడవచ్చు. అయినా మంచికాలం ముందుంది కనుక కవులు ప్రజల రోగాల్ని దృష్టిలో పెట్టుకుని మంచి కవిత్వం రాస్తే ప్రయోజనం కచ్చితంగా ఉంటుంది సందేహం లేదు.

✧✧✧✧✧



సింహాసనము చారు సిత పుండరీకంబు
చెలికత్తె చెలువారు పలుకు చిలుక
శృంగార కుసుమంబు చిన్ని చుక్కల రాజు
పసిడి కిన్నెర వీణె పలుకు దోడు
నలువ నెమ్మోము దమ్ములు కేళి గృహములు
తళుకుటద్దంబు సత్కవుల మనసు
వేదాది విద్యలు విహరణ స్థలములు
చక్కని రాయంచ యెక్కిరింత

ఎపుడు నేదేవి కాదేవి ఇందు కుంద
చంద్ర చందన మందార సార వర్ణ
శారదాదేవి మామక స్వాంత వీధి
నిండు వేడుక విహరించుచుండు గాక!

✧✧✧✧✧

## Dr. LANKA SIVA RAMA PRASAD



M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Member of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

1. **సత్యాన్వేషణలో (లజ్జ-2012) (నవల) :** ప్రేమ నుంచి పేదరికం వరకూ, చరిత్ర వక్రీకరణల నుంచి ఇప్పటి యుద్ధాలవరకూ అనేక అంశాలను రచయిత కథారూపాలతో పాఠకుల ముందు పెట్టిన తీరు విలక్షణంగా ఉంది. (ఇండియాటుడే).

2. **ఆల్కెమీ (కవిత్వం) :** 'కవిత్వం ఒక ఆల్కెమీ'.

3. **How to be Happy :** a highly popular book of Prasad's naration and Jayadev's Cartoons.

4. **వానమబ్బుల కాంతిఖడ్గం (కవిత్వం) :** స్త్రీ పుట్టిన నాటినుంచి గిట్టేవరకూ పడే కడగళ్లను కవిత్వీకరించిన కవితామాలిక.

5. **సంఖ్యాశాస్త్రం :** సంఖ్యలలోని అద్భుతాలను వివరించే మార్మికశాస్త్రం.

6. **డా. జయదేవ్ కార్టూన్లు :** ప్రసాదు ట్యూన్లు+డా. జయదేవ్ కార్టూన్లు – ఓ కొత్త ప్రయోగం (ఆంధ్రజ్యోతి)

7. **జీనోమ్ (సప్తమ అంతర్థానం) :** తెలుగులో తొలి బయోటెక్నాలజీ నవల. అనేక దేశాల తత్త్వ, మత, సమాజ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో మానవజాతి సాగించిన అద్భుత జిజ్ఞాసాయాత్రకు ఆధునికాక్షరభాష్యం (నడుస్తున్న చరిత్ర – ఇండియాటుడే).

8. **టీకప్పులో తుఫాను (కవిత్వం) :** పంచభూతాల ఉత్పత్తిపై ప్రాచీనుల ఊహలు, నవీన మానవుని కాలుష్యదురాక్రమణలను వివరించే దీర్ఘకావ్యం.

9. **Shades (Poetry - English) :** A rare piece of work; Shades is not a collection but a revelation. ( Dr. Jayadev)

10. **The Twilight Zone (Poetry - English)** is about the final scene of a life's drama.

11. **స్వప్నశాస్త్రం (తెలుగు) :** స్వప్నాలపై, స్వప్న విశ్లేషణలో తెలుగులో వచ్చిన ఏకైక సాధికారక గ్రంథం. (వార్త)

12. **In Search of Truth (English Novel) :** What is the ultimate Truth? a book about Death with subliminal Message.

13. **తంగేటి జున్ను (కవిత్వం) :** తీయగా, స్వచ్ఛంగా ప్రవహించిన కవితాజలధార.

14. **Soundarya Lahari (Poetry-English) :** Highly acclaimed book reached many places. (Sankaracharya's mystic poems explained and translated in Modern perspective)

15. **Bhagavatam (Poetry-English) :** An abridged Version of Potana's Bhagavatam into simple, lucid English. The second revised edition with commentery is under print.

16. **మూడు స్వప్నాలు ఒక మెలకువ (కవిత్వం) :** ముగ్గురు కవులు (పొట్లపల్లి శ్రీనివాసరావు, రామా చంద్రమౌళి, లంకా శివరామప్రసాద్‌ల కవిత్వఝరి).

17. **సుప్రసన్నాచార్య 'సాంపరాయం'** – ఇంగ్లీషు అనువాదం.

18. **రామా చంద్రమౌళి 'Fire & Ice'** – ఇంగ్లీషు అనువాదం

**బహుళ ప్రజాదరణ పొందిన సప్త అనువాద కావ్యాలు:**

19. **ఇలియాడ్ (తెలుగు) :** హోమర్ ప్రఖ్యాత రచన తొలిసారిగా తెలుగులో అందరి మన్ననలను పొందిన మహాకావ్యం. (ఆంధ్రజ్యోతి)

20. **ఒడెస్సీ (తెలుగు):** హోమర్ రచించిన ఒడెస్సీ – మహాభారత కావ్యంలా సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తే కథల్తో సాగే మహాకావ్యం. (ఇండియాటుడే)

21. **ఎపిక్ సైకిల్ (ఇతిహాసచక్రం–తెలుగు) :** గ్రీకువాఙ్మయంలో మూడవ భాగంగా వెలువడి ఎన్నో విశేషాలను తెలియజెప్పే కావ్యం. (ది హిందూ)

22. **ఈనీడ్ (Aeneid) :** వర్జిల్ మహాద్భుత రచన – తెలుగు అనువాదం

23. **తీర్థయాత్రికుని ప్రగతి (The Pilgrim's Progress) :** జాన్ బన్యన్ ప్రసిద్ధ రచనకు తెలుగు అనువాదం.

24. **డాంటే రచన డివైన్ కామెడీ - Dante's Divine Comedy** – తెలుగు అనువాదం.

25. **జాన్ మిల్టన్ ప్రసిద్ధ రచన – Paradise Lost - Paradise Regained (పారడైజ్ లాస్ట్ – పారడైజ్ రిగైన్డ్)** – తెలుగు అనువాదం.

**26.** **కత్తి అంచుపై...** – తెలుగు సాహిత్య చరిత్రలో వెలువడిన తొలి Noir (Black-చీకటి) నిశీధి కథల సంపుటి.

**27.** **దీప నిర్వాణగంధం** – మృత్యువు గురించి వివరించే అనేక అసాధారణ సంఘటనలు, కవిత్వాలు, నవీన శాస్త్ర విశ్లేషణలతో కూడిన పరిశోధనా గ్రంథం.

**28.** **అక్షరార్చన** – ఆంధ్రజ్యోతి నివేదనలో ధారావాహికంగా ప్రచురించబడిన వేదాంత విషయాల కదంబం.

**29.** **క్రీస్తు అద్భుతగీతాలు** – కరుణ, అద్భుత రసాలతో నిండిన కమనీయ కవిత్వ సంపుటి. ప్రపంచ ప్రసిద్ధ కవుల రచనలు క్రీస్తు జీవిత చరిత్ర.

**30.** **తమిళ సరస్వతి అందెల రవళి** – సంగం కాలం నాటి అద్భుత కవితా సంపద – వీర, శృంగార రసవాహిని.

**31.** **నామదేవొ ధసాల్ కవిత్వం** – ఈనాటి నుంచి ఎవరూ కవిత్వాన్ని అస్పష్టంగా రాయవద్దు' అని శాసించిన మరాఠి కవి ధసాల్ కవిత్వం.

**32.** **శాంతి యుద్ధం** – మొదటి ప్రపంచ యుద్ధపు ఘట్టాల్ని, ప్రజలపై దాని ప్రభావాన్ని కవుల మాటల్లో వివరించే కవితల సంకలనం.

**33.** **దబ్బు–మని–షి** – హాస్యరస ప్రధానంగా ప్రపంచ కవుల కవితలకు తెలుగు అనువాద సంపుటి.

**34.** **విలియం బ్లేక్ కవిత్వం** – తన మార్మిక కవిత్వం, చిత్ర రచనలతో ప్రపంచాన్ని అబ్బురపరచిన బ్లేక్ కవిత్వ నిధి.

**35.** **ఫాస్ట్–గేథే రచన** – జర్మన్ సాహిత్యంలో తలమానికమై అత్యధిక ప్రాచుర్యాన్ని పొందిన విషాదాంత నాటకం. 'ఆత్మను సైతానుకు అమ్మిన మానవుడిగా' తెలుగులో వెలువడ్తున్నది.

✧✧✧✧✧





# శ్రీ అక్షరార్చన

ప్రాక్ పశ్చిమ తత్త్వసారాన్ని, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని
సమపాళ్లలో మేళవించి, తులనాత్మక పరిశీలన చేసి,
భారతీయ చింతనామృతంగా వారం, వారం

ఆంధ్రజ్యోతి నివేదన లో

ధారావాహికంగా వెలువడిన అపురూప వ్యాసమంజరి.



డాక్టర్ లంకా శివరామప్రసాద్